కొమ్మ
గణ
మృత్యుంజయు

23 AUG 198

మృత్యుంజయుడు

మరణమేలేని మృత్యుదేవత మనిషితో అంటూందీ...

“నేను నిశీధిలాంటి అదృశ్యరూపినైనా నీకు మాత్రం అమ్మలాంటిదాన్ని.... సంజె వెలుగుల్ని ముద్దిడి ఆహారంగా స్వీకరిస్తాను. చీర చెరగుతో ప్రకృతిని నీరవంలో ముంచి విశ్రాంతి నందిస్తాను.

పురిటినొప్పులతో రేయంతా నలిగిన నేను తూరుపు రేఖలు తెలి మబ్బుల అంచులనుండి జారి నా ఫాలభాగాన పరచుకున్న స్వేద బిందువులపైబడి, విశ్లేషణ చెందిన వేళ మళ్ళీ వెలుగును ప్రసవిస్తాను.

నన్ను చూచి అనుక్షణమూ భయపడే నా వరాల కొండ!

నేను నీకు శత్రువుని కానమ్మా!

బ్రతుకుద్వారాన్ని తెరిచి నిన్ను లోకపు వాకిటిలోకి నెట్టిననేను నువ్వు అలసటగా సేదరాలే వేళ నా గుండెల్లోకి లాక్కొని గారెం పెడతాను”

దిశ్యకరుడు దృంభుపై పశ్చిమ ధాత్రినుంచి అదృశ్యమౌతు దుర్లోక్య దిక్కులంధరంగా నిట్టూర్చుతున్న ఒక అసుర సంధ్యవేళ....

'సిట్రాన్' కారు నిశ్శబ్దంగా ఊరిపొలిమేరలు వేపు సాగిపోతూంది.

రోడ్ల కిరుపక్కలా వున్న చెట్లనీడలు, అస్తమయ సూర్యుని కిరణాలకు కుంచించుకు పోతుంటే 'ఆమె' ఓ స్వాప్నికావస్థలో వున్నట్టు కారు నడుపుతూంది.

అందమైన ఆమె కళ్ళల్లో జీవితయానంలో చాలా అలసిపోయినట్టు అస్పష్టమైన బడలిక....

"మమ్మీ"

ఏడేళ్ళ నానీ పిలుపుతో ఆలోచనల నుంచి తేరుకున్న 'ఆమె' నెమ్మదిగా తల తిప్పింది.

"పుట్టినరోజైతే దేవుడు దగ్గరి కెళ్ళాలా" కళ్ళల్లో ఉత్సాహాన్ని నింపుకుంటూ అడిగాడు.

ఆ రోజు నానీ ఏడవ పుట్టిన రోజు....

'ఆ' అంటూ తలను ముందుకు మరల్చింది. కళ్ళల్లో సుడులు తిరుగుతున్న నీళ్ళు నానీకి కనిపించ కూడదన్నట్టుగా....

'దేవుడుకూడా హేపీ బర్త్‌డే చెబుతాడా' మరో ప్రశ్న.

మృదువుగా తల పంకించింది ఓ చేత్తో నానీని దగ్గరకు తీసుకుంటూనే....

"అలాంటప్పుడు మరి డాడీ కూడా హేపీబర్త్‌డే చెప్పాలిగా...."

కారు కీచుమంటూ ఆగిపోయింది. కాదు ఏస్మృతి శకలమో ఆమె గుండెల్ని మెలి పెట్టినట్టు ఉద్వేగంతో ఆమె బ్రేక్ నొక్కింది.

ఏమనుకున్నాడో నానీ తల్లి చెంపల్ని తనవేపు తిప్పుకుంటూ "అది కాదు మమ్మీ! డాడీ కూడా దేవుడి దగ్గరే వున్నాడన్నావుగా...." అన్నాడు తను చెప్పింది తల్లికి అర్థం కాలేదేమో అని.

కొన్ని లిప్తలపాటు స్టీరింగ్‌పై తలానించి అలాగే వుండిపోయింది.

తనేమైనా తప్పు మాటాడానా అనుకున్న నానీ 'మమ్మీ' అంటూ తల్లికి మరింత దగ్గరగా జరిగి ఆమె ఒంటిపై నుంచి నుంచి జారుతున్న 'షాల్'ను సర్దుతూ తప్పయితే సారీ మమ్మీ" అన్నాడు....

దుఃఖం తెరలు తెరలుగా చుట్టు ముడుతున్నా నానీ మాటలకి అంత బాధలోనూ నవ్వుకుంది.... "నాటీబోయ్" నానీ తలను గుండెలకు హత్తుకుంటూ కారును ముందుకు ముందుకు పోనిచ్చింది.

కొన్ని క్షణాలపాటు దారివేపే చూస్తూ కూచున్న నానీ "అదేంటి మమ్మీ.... దేవుడు గుడి ఇటుగా" అన్నాడు కారు మరోతోవకు మళ్ళేసరికి.

ఆమె జవాబు చెప్పలేదు....

ఒక నిర్వికల్ప సమాధిలోకి జారుతున్నట్టు మౌనంగా ఉండిపోయింది.

ప్రపంచాన్ని ఇప్పుడిప్పుడే ఉత్సుకతగా చూస్తున్న నానీకి జవాబు చెప్పగలిగే శక్తిలేదామెకు....

కొన్ని నిముషాలపాటు నిశ్శబ్దంగా కూచున్న 'నానీ' కారెక్కడ ఆగిందీ తెలుసుకోగానే భయంతో తల్లిని వాటేసుకున్నాడు కారుదిగుతూనే.

లాలనగా దగ్గరకు తీసుకుంది.

నెమ్మదిగా చాలా నెమ్మదిగా రెప్పలార్చకుండా చూసాడు చుట్టూ....

నీరవంతో నిండిన స్మశానవాటిక అది....

ఐహికమైన కక్షలకి కార్పణ్యాలకిగాని రాగద్వేషాలకుగాని ఆలవాలం కాని ఆముష్మికమైన ఒక ఆధ్యాత్మిక ఆలయం....

శివుడి పదఘట్టనతో గణాల స్తోత్ర పారాయణంతో ప్రతిక్షణమూ ప్రతిధ్వనించే నిశ్శబ్ద కైలాసవాసం....

'సృష్టి'తో నేలపై అడుగిడిన మనిషి 'స్థితి' కోసం జీవన్మరణ సమస్యలతో విసిగివేసారి పోతే పంచభౌతికమైన దేహాన్ని చివరగా తనలో 'లయం' చేసుకునే ఒక విశ్రాంతి మందిరం.

కీర్తికి అవశేషంగా మిగుల్చుకున్న వ్యక్తిత్వంతోపాటు అపకీర్తితో

నీతిబాహ్యులుగా నిందించబడినవారు సైతం తమకు తామే నైవేద్యంగా మారి దైవ సాయుజ్యం కోసం చివరకి మజిలీగా భాసిల్లే వెలలేని కోవెల....

నానీతోపాటు ఆమె ముందుకు నడుస్తూంది.

అక్కడ మంద్రంగా వీస్తున్నగాలి ప్రేతాత్మల నిట్టూర్పుల్లా లేదు.... జీవాత్మ పరమాత్మలో విలీనమయ్యే వేళ అద్వైత సిద్ధిపొందిన ప్రకృతి తన నోటితోనే వేదాలను పారాయణం చేస్తున్నట్టుగా వుంది.

నెమ్మదిగా తలలూపుతున్న చెట్లు క్షుద్రశక్తుల విలయనృత్యానికి సంకేతాల్లా అనిపించడం లేదు "చివరి ప్రార్థనకోసం గర్భగుడిలో అడుగు పెట్టిన భక్తుల్ని లాలించే పురోహితుల్లా అగుపిస్తున్నాయి.

సమీపంలా అఖండ సచ్చిదానందంతో దేవుడికి నేలపళ్ళెంలో హారతి పడుతున్నట్టు ఓ చితిమండుతూంది....

"మమ్మీ" భీతితో అమ్మను మరింత బలంగా చుట్టేసాడు నానీ....

ఆ చప్పుడికి చెట్టుపైనున్న ఒక తీతువ భయంకరంగా కూతపెడుతూ గాలిలోకి ఎగిరింది.

ఆమె మంత్ర ముగ్ధురాలిగా నడుస్తూంది నానీతో ముందుకు....
నేలపై అక్కడక్కడా కుంకుమ రాసుల్లా పేరుకున్న

చితాభస్మాన్నిగాని అస్తవ్యస్తంగా పడివున్న కంకాళాల గురించి గాని ఆమె పట్టించుకోవడం లేదు....

చాలాసూటిగా ముందుకు చూస్తూంది నడుస్తూనే....

ఎందరో గుండెల్లో దాచుకున్న సమాధుల మధ్యనుంచి నడుస్తూ గమ్యాన్ని చేరినట్టు ఓచోట ఆగింది....

ఎదురుగా....

నిన్నగాక మొన్న తను పేర్చుకున్న అందమైన స్మృతుల ఘనరూపంలా జన్మజన్మల తపస్సు ఫలించినట్టు ప్రత్యక్షమై వరమిచ్చి అంతలోనే అంతర్ధానమైన ఒక దేవుడి గుడిలా.... ఓ సమాధి....

దానిపై చెరగని శిలాక్షరాలు.

కె. భాస్వంత మహర్షి
జననం : 1950 మరణం : 1974

ఆమె కళ్ళనుంచి ఆగకుండా అశ్రువులు స్రవిస్తున్నాయి....
కోటికోట్ల కంఠాల ఘోషతో ఆమె గుండె ఆక్రోశిస్తూంది.

భారంగా రెప్పలు మూసుకోగానే భస్వంతే లేచివచ్చి తన కన్నీళ్ళను తుడుస్తున్న అనుభూతి.

"నేను మరలి రానని ఎవరన్నారు నేస్తం నేను అసలు మలిగిపోతేగా
నీ గుండెవాకిట ముందే నిలబడివున్నానే
నీ తలపుల తలుపుల్ని తడుతూ అనుక్షణం
నిన్ను అలజడి పెడుతుంటానే
సెలయేరునై పారుతున్న నన్ను
మిన్నేరులా
నీలో కలుపుకున్న నేస్తం
చిందించకమ్మా కన్నీరు....

అందులో ఒక బాష్పంగా బ్రతికే నేను ఇసుకలో పడి ఇంకి పోగలను"

నానీ అప్పటికే అక్షరాలను కూడపలుకుంటూ చదివి అర్థం చేసుకున్నాడు అది అమ్మ చెప్పే నాన్న పేరని....

"నానీ" అమ్మ గొంతు వణికింది....కొడుకుచేతికి ఓ గులాబీల హారాన్ని అందిస్తూ "నీ ముందున్న వారే నానీ....నాకు తెలిసిన దేవుడు.... నీకు జన్మనిచ్చిన భగవంతుడూ...." అంది దుఃఖాన్ని నిగ్రహించుకుంటూ....

నానీ ఆలోచనల్లోనూ అర్థంకాని సందిగ్ధత....
అమ్మచెప్పే దేవుడికథల్లో నాన్న వుండేవాడు.
నాన్నకోసం అడిగే ప్రశ్నలలో దేవుడి పేరూ దొర్లుతూఉండేది....
మరి నాన్నేమిటి ఇక్కడ....ఇలా....

దేవుడు హాయిగాగుడివుంటే మరినాన్నేమిటి ఇక్కడ ఈ మట్టిలో....

ఎన్నో సందేహాలు....కాని ఎలా అడగాలో తెలీదు....

ఏదో అడగాలని నోరు తెరవబోతూ తలపైకెత్తాడు అప్పటికే ఆమె ఒక తపస్సులోకి జారినట్టుగా రెప్పల్ని మూసుకుంది.

చెంపలపై నుండి నీళ్ళు ధారగా కారుతున్నాయి దేవుడ్ని ధ్యానిస్తున్నట్టు మసేకంగా ఏదో నివేదన అందిస్తున్నట్టు ఆమె పెదవులు కదులుతున్నాయి.

"నా నిశీధి ప్రయాణంలో ఒక కాంతి కిరణంలా ప్రవేశించి నన్ను పునీతురాలిని చేసిన నా మహర్షీ! ఇదుగో మీ బిడ్డ....ఇన్నాళ్ళూ మీరెక్కడున్నారూ అనివాడు అడిగితే దేవుడికి నేస్తంగా దేవుడిదగ్గరే కొలువుతీరి వున్నారని కథలు చెప్పి మభ్యపెట్టేదాన్ని.... అల్లరిగానిలదీస్తే మాటమార్చి మరోలా నోరుమూయించేదాన్ని.... ఇప్పుడు వాడికి ఏడేళ్ళు.... అంటే.... ఏడేడు జన్మలకు సరిపడ్డ అదృష్టాన్ని నాకు అందించినమీరు నాకు దూరమై ఏడు యుగాలుగడిచింది.... ఇప్పుడు మరీ మారాం చేస్తున్నాడు.... వస్తన్నా ప్రశ్నలతో వేధిస్తున్నాడు.... బదులు చెప్పలేక నేను కళ్ళనీళ్ళు పెట్టుకుంటే కబుర్లుచెప్పి జోకొడుతున్నాడు.

అంతా మీపోలికే....అదే నా భయ్యంకూడా ... ఇన్నాళ్లూ.... నానీని మీ సమక్షంలోకి తీసుకురాలేదు.... ఎందుకోతెలుసా.... వాడు పపంచాన్ని పూర్తిగా అర్థంచేసుకోనే స్థితిలో లేడని.... కాని ఇప్పుడు చాలా ఎదిగిపోయేడండీ... ఎంతఎదిగాడుఅంటేవాడూ మీఅంత మేధావిఅయ్యేట్టున్నాడు.. అదే.... అదే కాకూడదదండి.... ఒక్కసారి వాడు మామూలు మనిషిలా.... నా బిడ్డలా....నా వరలకొండలాగే మిగలాలని ఒక్కసారి దీవించండి.... ప్రపంచానికి అర్థంకాని ఓ మనిషిలా కాక ప్రపంచాన్ని అర్థం చేసుకుని బ్రతికే మామూలు ప్రాణిలా బ్రతకమని వాడినైనా ఆశీర్వదించండి....దాని కోసమే ఇష్టంలేకపోయినా మీకు కష్టంకలిగినా ఇక్కడకు తీసుకొచ్చాను.... ఏమండీ.... మీరొకనాడు అన్నారు గుర్తుందా మరణించిన ఒక మనిషిని

చూసో లేక కాలుతున్న ఒక కాష్టాన్ని గమనించో వైరాగ్యంతో కదిలే మనిషి ఆ కొద్దిపాటి క్షణాల్ని జీవితకాలానికి సంధాన పరిచిననాడు ఈ ప్రపంచం ఎంతో స్వర్గధామమవుతుందీ అని....అదే.... ఆ మాటే వాడికి చెప్పండి.... మీ రక్తంలోని ఒక కణమైన వీడు కోట్ల కణాలుగా మారి ఒక రూపాన్ని ఏర్పరుచుకుని ఎదిగిపోయిన వీడు మీలా కాక అందరిలా బ్రతికే అదృష్టానికి నోచుకొమ్మని ఒక్కసారి తండ్రిగా నచ్చచెప్పండి"

వెక్కిపడుతూ నానీ భుజాలపై చేతులుంచి సమాధికి మరింతదగ్గరగా నడిచింది. నానీ పూలదండని సమాధిపై వుంచేడు.

రెండు నీటిబొట్లు సమాధి అంచుపైబడి అరుణకిరణాలలో ముత్యాల్లా మెరిసాయి....

ఆమె చెప్పలేదు ఏం చెయ్యాల్సిందీ.

కాని నానీయే మోకాళ్లపై సమాధిముందు కూచున్నాడు....

అమ్మ ఆదేశం లేకుండానే చేతులుజోడించి తలను సమాధిముందు మట్టిపై వుంచాడు వినమ్రతగా.

చాలా నిశ్శబ్దంగా కొన్ని క్షణాలు గడిచాయి....

చీకట్లు ముసురుకుంటున్న ఆ మరుభూమి, ఓ మహర్షి ఆశ్రమంలా అపరాత్రి వేళలోని దేవుడి గర్భగుడిలా స్తబ్దంగా మారిపోయింది....

నెమ్మదిగా....చాలా నెమ్మదిగా.... నేల పలుకుతున్నట్టు భూదేవి గుండెల్లో నిక్షిప్తమైన అరల్లోనుంచి ఏ శబ్దమో ఒక ప్రణవనాదమై చుట్టుముడుతున్నట్టు నానీ సైతం ఓ రకమైన ట్రాన్స్‌లోకి జారిపోయాడు....

"నానీ.... నా ముద్దులతండ్రీ" ఒక ప్రతిధ్వనిలాధ్వని చీలిన తరంగాల్లా నానీ చెవుల్లోకి చొచ్చుకుపోతూంది. ఓ నిశ్శబ్ద వేదం.... నేనీ ప్రపంచంలో అడుగుపెట్టి సుమారు ముప్ఫై ఏళ్ల గడిచి ఈ ప్రపంచాన్ని వదిలి ఏడేండ్లు నిండాయి బాబూ.... నేను ఒకనాడు బాల్యమనే రంగుల హరివిల్లుపై ఆడుకుంటూ ఆకాశంలోని నక్షత్రాలతో స్నేహంచేస్తూ కమ్మగా కలగా బ్రతికినవాడ్నే....ప్రపంచంలోని మోసాలకూ, ద్వేషాలకూ అతీతంగా

లోకమంతా అమ్మ పొత్తిళ్లలాగే నిర్మలంగా వుంటుందని అక్కున నేర్చుకుని నా ఆకతాయితనాన్ని హర్షిస్తుందని అపురూపమైన ఆలోచనలతో బ్రతికినవాడ్నే....

కానీ హఠాత్తుగా నా కలలు చెదిరిపోయాయి. లోకంరాకాసిగా మారి మా బ్రతుకున్ని ఛిన్నాభిన్నం చేసింది. కాపాడుతాడనుకున్న దేవుడూ మౌనంతో నన్ను మరింత బాధపెట్టాడు. సరిగ్గా అక్కడే నాలో పెరుగుతున్న ఒక ఋషి చచ్చిపోయాడు. ఆ చావు బ్రతుకుల ఒక సంధికాలంలో నేను మరో మనిషిగా అవతారమెత్తాను. ఆ తర్వాత ఎన్ని సంఘటనలు.... ఎన్నెన్ని సంగ్రామాలు....చివరికి....ఏమని చెప్పను నాన్నా....అసలు నేను గెలిచానా....ఓడానా.... ఇదేరా ఈ సమాధిలోనైనా నన్నునిశ్చితంగా నిదురపోనివ్వకుండా వేధిస్తున్న ప్రశ్న.

దేవుడేమో ఓడావూ అంటాడు....

కాని నా మనసేమో గెలిచావూ అంటుంది.

ఒకే ప్రశ్నకు రెండూ జవాబులా....

నాన్నా నానీ! అస్తవ్యస్తంగా పీలికలైన ఒక చిన్నపుస్తకంగా బ్రతుకును ప్రారంభించి బ్రతుకన్న పదానికే ఓ నిఘంటువుగా పెరిగిన నాకథలోని అధ్యాయాలు కొన్ని కన్నీళ్ళతోనూ తడిసాయి. మరికొన్ని రక్తంతోనూ అక్షరరూపాన్ని సంతరించుకున్నాయి. నిన్ను నాలాగే బ్రతకమనడం లేదు. నా బ్రతుకేమిటో తెలుసుకోమంటున్నాను.... నా చరిత్రపుటల్లోని ఏ కొన్ని వాక్యాలైన నీ యాత్రను ఉపయోగపడితే రాలిన నీ తండ్రి బ్రతుక్కి ఓ పరమార్థం ఏర్పడినందుకు సంతృప్తి పడిపోతాను....

బాబూ! ఒక్కసారి ఈ చుట్టూ చూడు....

సమతకు సంకేతంగా నిలిచిన ఓ కొత్త ప్రపంచమిది....

ఓడినవాడూ గెలిచినవాడూ ఉన్నవాడూ లేనివాడూ అందరూ ఒద్దికయి యిమిడిపోయిన మా మరుభూమిలో ఎంతటి నిశ్చలత. ఎంతటి ప్రశాంతత....

కాస్త దూరంగా అంటే మీ సామ్రాజ్యందాటి ఆ ప్రపంచంలోకి నడిచిచూడు! అక్కడ ఓ ఆటవిక వ్యవస్థ కనిపిస్తుంది.... మనిషిని మనిషి దోచుకునే ఓ అనాగరిక ప్రపంచం దర్శనమిస్తుంది. అక్కడే నాన్నా నువ్వుజాగ్రత్తగా వుండాల్సింది....నాదైతే ముగిసిన కథ.... నీది మొదలవుతున్న కథ. ఈ సమాధిలో చిక్కుకుపోయిన నేను నిన్నుకాపాడలని వున్నా బయటికిరాలేను.

ఒకవేళ బయటికి వచ్చినా నిన్ను గుర్తించలేను.

నిజంబాబూ! నువ్వీలోకంలో అడుగుపెట్టకముందే మీ అమ్మకడుపులో యింకాపూర్తిగా రూపం దిద్దుకోని స్థితిలోనే ఆదమరిచి నిద్రపోతున్న నీ అదృశ్యరూపాన్ని మృదువుగా పెదవులతో ముద్దిదేచివరగా ఈ సమాధిలో అడుగు పెట్టాను.

నా వరాలకొండా.... బ్రతుకమ్మా నూరేళ్ళు నిశ్చింతగా బ్రతుకు.... నాన్న కథనే స్ఫూర్తిగా తీసుకోగాని నా వ్యథని నీ గుండెల్లోకి రానివ్వకు. ఎప్పుడైనా మీ నాన్న గుర్తుకొస్తే నీకు తెలీకుండా రెండు నీటిబొట్లు నీ కళ్ళనుంచి జారి పడాలని ప్రయత్నిస్తే వాటినిఆపకు.... అదిచాలు నా జన్మకు.

చివరిగా ఒక్కమాటనానా!

వెయేళ్ళు అమ్మతో అనందగా బ్రతుకుగాని అమ్మను నా కోసం ఆరడి పెట్టకు.... నీ నూరేళ్ళ జీవితకాలంలో ఎప్పుడైనా నా కథగురించి ఆలోచించగల ఏ కొద్దిపాటి వ్యవధైనా దక్కితే నేను నా పోరాటంలో 'గెలిచానా, ఓడానా' అన్న ప్రశ్నకుమాత్రం జవాబు వెదికే ప్రయత్నం చెయ్యి.... నేను గెలిచాను అని నీకనిపిస్తే అమ్మకుచెప్పు.... కాదు నేను పరాజితుడ్నయ్యాను అని నీ కనిపిస్తేమాత్రం ఆ నిజాన్ని నీ గుండెల్లోనే దాచుకో....అంతే.... గుడ్‌బై ....మైసన్....బై."

* * * *

ఒక చీకటిరాత్రి....

ఉరుముల పెళపెళార్భాటాలతో ప్రకృతిప్రళయప్రభంజనపు ఒరిపిడిలో ఊపిరందక విలవిలాడుతున్న వేళ.... ఓ ట్రైన్ బాగా వేగంగా దూసుకుపోతూంది. తూర్పు దిక్కుగా....

అప్పుడప్పుడు గగనతలంలోనుంచి ఉలికిపాటుగా వస్తున్న మెరుపులు నిద్రావస్థలో వెలుగుతున్న బోగీలోని దీపాలకాంతిని సవాల్ చేస్తున్నాయి....

నిజానికి అపరాత్రి గడవడంతో ఆ బోగీలో అందరూ నిద్రపోవాలి....

కాని చాలా మంది మెలకువగానే వున్నారు.

బయట ప్రకృతి భీభత్సానికి భయపడికాదు వారు తెలివిగా వున్నది.

అప్పటికే ఓ గంటక్రితం హఠాత్తుగా ఓ యువతి అప్పుడే ప్లాట్ ఫారంపైనుంచి కదులుతున్న బోగిలోకి ఎవరో తరుముతున్నట్టు ఆదరాబాదరగా ఎక్కింది.

అదికాదు వారి ఉత్సుకతకి కారణమైన విషయం....

ఆ యువతి మామూలుగా లేదు. వర్షంలో తడిసిన ప్రకృతిలా ఒంటికి అతుక్కుపోయిన తడిసిన చీరలో కదిలివచ్చిన ఖజూరవ శిల్పంలా వుంది....

పగిలిన ప్రతిమలాంటి ఆమె ప్రస్తుత స్థితి గురించిగాని ప్రాణ సంకటంగా భావించి పరుగెత్తుకొచ్చిన ఆమె సంక్లిష్ట పరిస్థితుల గురించి గాని వారికి ఆసక్తిలేదు.

మృత్యువులా మీద పడబోతున్న కొన్ని కీనీడలు ఆమె మస్తిష్కంలో మెదులుతూ భయపెడుతుంటే బిక్కుమంటూ ఆమెచూస్తూంది.... ఆ చూపులు మరింత అందముగా అశ్లీలంగా దర్శనమిస్తున్నాయి అక్కడివారికి.

ఆ ప్రయాణీకుల్లో సీతమ్మ వారికథవిని ఆ స్వాధీమణి కడగండ్లకు కన్నీళ్ళు రాల్చిన వృద్ధులూ వున్నారు. రావణాసురుడి క్రౌర్యాన్ని నిరసించి దుష్ట శిక్షణకు అవతారమెత్తిన శ్రీరాముడి ఉనికిని ఉన్మాదంగా ఆరాధించే యువకులూ వున్నారు....

అయినా ఆక్షణంలో అక్కడెవరికీ పురాణాలుగాని, పురాణాల్లోన్ని స్వాధీమణుల కథలుగాని గుర్తుకు రావటంలేదు. వయసులో వున్న ఒక ఒంటరి ఆడదాని నిస్సహాయతపై స్వేచ్ఛగా ఆలోచించే హక్కు తమకుందన్నంత ధీమాతో అతుక్కుపోయిన ఆమె చీరవెనుక అంగాంగాల్ని కాలిచే ఆరాటంలో రెప్పవాల్చకుండా చూస్తున్నారు.

తరతరాల ఇతిహాసాల ఉనికిని మర్చి కామప్రకోపిత దృక్కులతో చాలా పరిహాసంగా గమనిస్తున్నారా యువతిని.

“టిక్కెట్ ప్లీజ్” టిటియి ఆమెను సమీపించాడప్పుడే.

ఆమెకు అప్పుడుగాని గుర్తుకురాలేదు తను టిక్కెట్ లేకుండా ప్రయాణం చేస్తున్న విషయం....

క్షణంపాటు ఆమె మొహం పాలిపోయింది....

ప్రయాణీకుల్లో ఆసక్తి మరింతగా పెరిగిపోయింది.

“క్యాదేక్ రహేహో”

ట్రైను అప్పుడు ప్రయాణం చేస్తున్నది మహారాష్ట్ర బోర్డర్ లో.... అందుకే హిందీలో అడిగాడు టిటియి మరోమారు....

తడిసిన తలపాయల్నించి జారుతున్న నీళ్ళో లేక తను డబ్బులు చెల్లించలేని స్థితిలో వున్నానన్న ఆలోచనో అదీగాకపోతే ఆమెను బలవంతగా ట్రైను దింపితే తరుముకొస్తున్న ముష్కరుల చేతిలో మరోమారు చిక్కుకుపోయి తనువు దాలించాల్సి వస్తుందన్న భయంతో కళ్ళనుంచి ఉబికి వస్తున్న కన్నీరో మరి ఆమె దిగులుగా చూసింది....

“కహా జాతీహో” అసహనంగా అడిగాడు టిటియి....

“అనకాపల్లి” చెప్పిందామె....

క్షణంపాటు నివ్వెరపోతున్నట్టుగా చూసిన టిటియి “మీ పేరు’ అన్నాడు రిసీట్ రాస్తూ.

ఆమెలో ధైర్యం సడలిపోతూంది....

తన దగ్గర చిల్లిగవ్వలేదు. టిటియి రశీదురాస్తున్నాడు. ఇప్పుడేం చేయాలి.

"మిమ్మల్నే" రెట్టించాడు....

"నిశాంత"

టిటియి రాసుకుపోతున్నాడు....

ట్రైను ఏదో స్టేషను సమీపిస్తున్నట్టు క్రమంగా వేగంతగ్గుతూంది.... అంటే....

భయవిహ్వలురాలై ఆలోచిస్తూందామె....

మరికొన్ని క్షణాల్లో ట్రైను ఆగడం డబ్బులుచెల్లించలేని తనను స్టేషన్‌లో దింపి రైల్వే పోలీసులకు అప్పచెప్పడం ఆ తర్వాత....

తనను వెంటాడుతున్న గూండాలగురించిఇకఆలోచించలేకపోయింది....

ఆమెలో సన్నగా ప్రకంపన మొదలైంది....

ఒక నరకకూపంలోనుంచి తప్పించుకోవాలని ఎంతటి విఫప్రయత్నం చేసింది తను....

మళ్ళీచాలా నికృష్టంగా నరకంలోకి లాగబడే స్థితిని చేరుకుంటూంది....పారిస్‌లోని అందమైన అమ్మాయిలు, టోకియోలోని గైషాలు, న్యూయార్క్‌లోని స్కైస్క్రేపర్స్, బాంబేలోని వ్యభిచారిణులలా ఈ నాటి కథకాదు....స్వతంత్రం రాకపూర్వంనుంచే దినదిన ప్రవర్ధమానమైన ప్రఖ్యాతిని చెందుతున్న చరిత్ర అది.

భారతదేశంలో కెల్లా పెద్ద వ్యభిచారకేంద్రం బొంబాయి నగరం....చికాగో ఆఫ్ఇండియా....చికాగోలోని ఆల్కాపోన్ జాన్ డెల్లింగన్ అనే వ్యభిచారకేంద్రాల్లోని గూండాలు వాటికి ఆధిపత్యం వహించే మాఫియా వ్యవస్థలో ప్రభుత్వాన్ని సైతం శాసించేటంత సమర్థవంతంగా పనిచేస్తున్నట్టే బాంబే వ్యభిచార కేంద్రాలుకూడా ఇంచుమించు అదే స్థాయిలో నడుస్తుంటాయి....

చెప్పులుకుట్టేవాడు మొదలుకుని చీఫ్ మినిష్టర్ వరకూ తెలుసు బాంబేలోని షాక్‌లాండ్, కామాటిపూరా, ఫోరస్ రోడ్లలో ఈ వ్యాపారం ఎంత ముమ్మరంగాసాగేదీ....రెండున్నర చదరపు కిలోమీటర్ల వైశాల్యం గల ఈ 'గోల్‌సిటీ' ప్రాంతంలో సుమారు రెండున్నర లక్షలమంది వ్యభిచారిణులున్నారని అంచనా....

ఇక్కడ సీతలా, సావిత్రులా, అనసూయలా రప్పించబడతారు నమ్మకంగా. ప్రపంచంలో ప్రతీదీ అమ్మబడేదే అన్న సూక్తిప్రకారం రాక్షసంగా అమ్ముడుపోతారు....

ఇష్టంలేక ఎదురుతిరిగిన ఆ సాధ్వీమణుల ఆర్తనాదాలకు మన పురాణాలే ప్రణంపట్టినట్టు వెర్రిచూపులు చూస్తూవుంటాయి. మానభంగాలకు గురయ్యే ఎందరో ద్రౌపదుల పీలికలైన కళేబరాల మాటున మనువు ప్రవచించిన ధర్మస్మృతులు తలవాల్చి మన సంస్కృతి ఆకృతినే మార్చుతుంటాయి. నీతితప్పిన భగవద్గీత తన తలరాతకు ఇచ్చోటనే గుండెకోతతో తల్లడిల్లిపోతూ వుంటుంది

యుగాల వేదఘోషతో పునీతమైన ఈ నేల యధాయథాహి ధర్మస్యగ్లా నిర్భవతి భారత:" అన్న ఉపదేశాన్ని దావాననంలా కడుపులో దాచుకుని వేదనతో ఘోషించేదీ ఇక్కడే....

ట్రైన్‌వేగం ఇంకా తగ్గింది.

నిశాంత కళ్ళల్లో రక్తంలా ఉబికివస్తున్న అశ్రువులు....

సుమారు ఆరునెలలక్రితం అమాయకంగా మోసగించబడి బాంబే రెడ్‌లైట్ ఏరియాలో అడుగుపెట్టిన ఆ యువతి జరిగినది గ్రహించేలోగానే రాక్షసంగా వంచింపబడిన నిశాంత తనలాగే ఆ నరకకూపంలో మగ్గిపోతున్న ఓ స్నేహితురాలి అండతో ఇన్నాళ్ళకు తప్పించుకుని బయటపడింది.

ఇప్పుడు మరికొన్ని క్షణాల్లో.... తనవాళ్ళని చేరకముందే మారని తలరాతకు మరోమారు బలికాబోతూంది....

రిసీట్ అందించాడు టిటియి....

"నా దగ్గర...." దుఃఖం గొంతుకడ్డం పడుతుంటే డబ్బులు లేవని చెప్పబోయింది.

అప్పటికే టిటియి ఆమెచేతిలో రిసీట్‌తోపాటు ఓ యాభై రూపాయిల నోటు ఉంచాడు....

ముందు జరిగిందేమిటో ఆమెకు అర్థం కాలేదు.... తర్వాత విభ్రమంగా చూసింది ఇదినిజమేనా అన్నట్టు.... వెనువెంటనే ఆమె కళ్ళు నీటి కుండలయ్యాయి....

నమ్మకమనే పునాదిపై నిలబడి ప్రపంచాన్ని చాలా నిజాయితీగా దర్శిస్తున్న వేళ దారుణంగా వంచింపబడి దగాపడిన ఆమె నిజానికి ఇది నమ్మలేకపోతూంది.

కొన్ని క్షణాల క్రితం వరకూ ఒక మామూలు ఉద్యోగిగా తనను ఆపదల్లోనెట్టే మనిషిగా కనబడ్డ టిటియి హఠాత్తుగా ఒక దైవాంశ సంభూతుడిలా ఆమె ఆలోచనల్లో రూపుదిద్దుకుంటే అది ఆమె తప్పుకాదు....

అతడి పాదాల్ని తాకాలనుకుంది.... కాని అప్పటికే వెళ్ళిపోయాడతను....

నిజానికి ఈ రూట్‌లో ఇలాంటి సన్నివేశాలు అతడికి కొత్తకాదు.

అలాఅని అందరి బాధ్యతలా తననెత్తిపై వేసుకునే శక్తిలేదు....

అందుకే....

అడక్కుండానే ఆమె కథని గ్రహించిన టిటియి ఆ క్షణంలో సహకరించాలనే దృక్పథంతో కూడిన ఉద్వేగంతో ఆదుకున్నాడు....

అతడు నష్టపోయింది చాలా కొద్దిపాటే అయినా ఆమె దృష్టిలో సడలిపోతున్న మానవతా విలువలపై వెలకట్టలేని నమ్మకం ఏర్పడటానికి కారణమయ్యాడు....

ట్రైన్ ఆగింది ఓ చిన్న స్టేషన్‌లో....అప్పుడు రాత్రి ఒంటిగంటన్నర కావడంతో ప్లాట్ ఫారంపై చందడిలేదు....

ఆమె మూలగా ముడుచుకుని కూర్చుంది....

టిటియి సమస్య తేలిపోయింది. మరికొన్ని గంటలపాటు తనను తాను రక్షించుకోగలిగితే సునాయాసంగా గమ్యాన్ని చేరుకోగలుగుతుంది....

ఆమె ఆలోచన ఇంకా పూర్తికాలేదు....

చాలా హఠాత్తుగా ప్రత్యక్షమయ్యారు దృఢకాయులైన ముగ్గురు వ్యక్తులు....వారి గురించే అప్పటివరకూ ఆమె భయపడుతున్నది.

ఆమె గుండె గుభేలుమంది.

సహాయం కోసమన్నట్టు చుట్టూచూసింది.... ఇప్పుడెలా....

ఎవరూ ముందుకు రావడానికి సాహసం చేయనంత భయంకరంగా వున్నారా వ్యక్తులు....

"అరె...." ఆమె చేతిని పట్టుకున్నాడో వ్యక్తి....

"వదలండి" అంటూ ఆమె పెనుగులాడుతుంటే 'సారీ' అంటూ మరో గూండా ఆమెను బోగీ బయటికి బరబరా ఈడ్చుకువచ్చాడు....

ఈ హడావుడికి నిద్రరాక ఆమెను గమనిస్తున్న ప్రయాణీకులతోపాటు నిద్రపోతున్న కొందరు వ్యక్తులూ ఉలికిపాటుగా నిద్రలేచి జరుగుతున్నది చూస్తూ వుండిపోయారు.

టిటియి ముందుకొచ్చాడు....

కాని ఆపలేదు. ఆపితే జరిగేదేమిటో అతనికితెలుసు....మానవతా దృక్పథంతో కాస్త సాయపడ్డాడేమో కాని హక్కుల గురించి అనర్గళంగా ఉపన్యసించే ఇందరు భారతీయ పౌరులు ప్రేక్షకుల్లా చూస్తున్న చోట తను ఒంటరిగా అక్కడి అన్యాయాన్ని ఆపాలని ప్రయత్నిస్తే తన భార్యాబిడ్డలు అన్యాయమైపోతారు. పైగా తను తరచూ తిరిగే 'రూట్' అది.

నేలపై చతికిలపడిన నిశాంత "ప్లీజ్....నన్ను వదలండి" చేతులు జోడించి ప్రార్థిస్తూంది వెనక్కి జరుగుతూనే....

ఆ నిశ్శబ్దపు చీకటి రాత్రివేళ ఆమె గొంతు నించి నిస్సహాయంగా వెలువడుతున్న వేడికోలు ఏ ఒక్కర్నీ కదలించడం లేదు....

ప్లాట్‌ఫారంపై ఓ బెంచీమీద పడుకుని వున్న రైల్వే పోలీసొకడు క్షణంపాటు అల్లరికి తెలివి వచ్చినట్టు కప్పుకున్న దుప్పటిని పక్కకు తొలగించి చూసి అలాంటి సన్నివేశాలు మామూలే అన్నట్టుగా మళ్ళీ ముసుగు

తన్నేకాడు దోమల బారినుంచి తనను రక్షించుకోవడమే ముఖ్యదేయమన్నట్టుగా....

క్షణాలు గడుస్తున్నాయి....

ఆలస్యం చేయడం ఇష్టంలేని ముష్కరులు ఆమెను అమాంతం పైకెత్తుకుని లాక్కెళ్ళాలని ఒకేసారి ముందుకు జరిగారు....

అంతే....

అనూహ్యమైన రీతిలో మెడుల్లాఅబ్లాంగేటాపై పడిన దెబ్బకి ఓ దుండగుడు నేలపై పడ్డాడు....

అదిరిపడ్డ తక్కిన ఇద్దరూ వెనక్కి మరలేటంతలో గాలిలో మెరుపులా లేచిన ఓ పాదం చాలా బలంగా వారి చెంపల్ని తాకి కళ్ళుబైర్లు కమ్మేట్టు చేసింది.

వారికి అప్పుడు కనిపించాడు ఎదురుగా నిలబడ్డ ఆజానుబాహుడైన ఓ యువకుడు....

“బాస్టర్డ్స్.... గెటప్” హుంకరిస్తూ ఓ అడుగు ముందుకేశాడు....

“కౌన్‌హో తుమ్” రాక్షసుల్లా పైకి విజృంభించబోతూ అడిగారు కర్కశంగా.... వారిలో అంతటిఉద్రేకం కల్గటానికి కారణం ఆ యువకుడు ఓ మామూలు ప్రయాణీకుడన్న భావం....

“రండి ఇన్నాళ్లూ నేను ఎదురుచూస్తున్నది ఈ రాకెట్ వ్యవహారం అంతు చూడాలనే” స్థిరంగా అన్నాడు హిందీలో.

క్షణంపాటు విశ్చేష్టులై చూసారు....

“అయామ్ భస్వంత్.... సెంట్రల్ ఇంటలిజెన్స్ ఆఫీసర్” అని ఫోటోతోబాటువున్న ఓ ఐడెంటిటీ కార్డును వారికి చూపిస్తూ మరుక్షణం ‘వాకీటాకీ’ వంటి ఓ యంత్రాన్ని జేబులోంచి తీసి ట్యూన్ చేసాడు....

అంతసేపూ మాకెందుకులే అని ఆత్మవంచన చేసుకున్న సగటు భారతీయులందరూ హఠాత్తుగా పౌరవిధులు గుర్తుకొచ్చినట్టు ఆసక్తిగా బయటికి దిగివస్తున్నారు.

నీళ్ళు నిండిన నిశాంత కళ్ళకి ఎదురుగా ఎవరూ కనిపించడం లేదు....

ఒక దేవుడు తప్ప దేవుడులాంటి ఆ యువకుడిలో....

వాల్మీకి వూహకందని మరోరాముడో వ్యాసుడి మేధకి తోచని మరో కృష్ణుడో దర్శనమిస్తున్నాడు....

నిముషాలు లిప్తల్లా గడుస్తున్నాయి....

సరిగ్గా అదే సమయంలో....

రైలు కూత పెట్టింది.

ప్రమాదభూయిష్టమైన పరిస్థితుల్లో చిక్కుకున్నామన్న ఆలోచనతో నిశాంతకోసం కొన్ని గంటలుగా వెంటాడిన దుండగులు ఒక్కసారిగా చీకటిలోకి పరుగెత్తారు....

“పకడో.... పకడో....”

ప్రయాణీకుల కేకలతో ఆ నిశీధి హోరెత్తి పోయింది.

“రండి నిశాంతగారూ! ట్రైను కదిలేట్టుంది” పిలిచాడతను.

విభ్రమంగా చూసింది. అంతవరకూ అతన్ని తెలుగువాడిగా ఆమె గుర్తింపలేకపోవడానికి కారణం అతనిపేరూ అంతసేపూ దుండంగులతో అతను హిందీ మాటాడిన తీరూను....

“ఆశ్చర్యంగా చూడాల్సింది నన్నుకాదు నిశాంతగారూ....ఒక చిన్న సూత్రం పైనే ఈ వ్యవస్థ నడుస్తూందన్న సత్యాన్ని మీకీ క్షణంలో తెలియజెప్పిన నా సోదర భారతీయుల్ని”

ఆమెకు అర్ధంకాలేరు అతడంటున్నదేమిటో....

“ఇంతసేపూ తమ కళ్ళముందే ఒక ఆడపిల్లకి అన్యాయం జరుగుతున్నా పట్టించుకోని వ్యక్తులు ఎదురువిలిస్తే తమకెక్కడ అన్యాయం జరుగుతుందోనని భయపడిన మన జీవిత సహప్రయాణికులు ఇప్పుడేం చేశారో చూశారుగా. పరుగెత్తుతున్న వాళ్ళని చూసి పట్టుకోండి అని అరుస్తున్నారు”

ఆమె రెప్పలార్పకుండా చూస్తూంది అతడ్ని....

"వీళ్ళని ద్వేషించడంలో అర్థంలేదు.... కాని ఇలాంటి సన్నివేశాలే ఈ ప్రపంచంలో చోటు చేసుకోబోతున్నాయని సుమారు నూట పాతిక సంవత్సరాల క్రితమే వూహించి తన 'నేచురల్ సెలెక్షన్'లో ప్రతిపాదించిన డార్విన్ మేధస్సును మనం మనస్ఫూర్తిగా అభినందించి తీరాలి. ఏమంటారు" బండి కదులుతుంటే "రండి" అంటూ చేయూతనివ్వబోయాడు.

ఆమె అందుకోలేదు....

నిస్సహాయతతో నలిగిన మనసు శరీరంలో నిస్త్రాణను నింపినా తనను చిత్రంగా ఆదుకున్న ఆ మనిషిని చూస్తూ నీరసంగానే నడిచి బండెక్కింది.

ఇప్పుడు భాస్వంత్ ట్రయినులో అందరికీ ఓ ప్రత్యేకమైన వ్యక్తి.... అందుకే అందరూ దూరంగా జరిగి అతనికి బోలెడంత చోటిచ్చేశారు....

ఆమె కిటికీ వారగా కూచుంది....

వేగాన్ని పుంజుకున్న ట్రైనులోంచి దట్టంగా ప్రపంచాన్ని కప్పిన చీకటిలోకి చూస్తూంది—

చాలా ధైర్యంగా వుందిప్పుడు....

ధైర్యంగానే చాలా యేళ్ళు గడిపిన ఆమెలోని నిబ్భరాన్ని గడచిన ఆరు నెలల కాలం దారుణంగా దెబ్బతీసింది.... కొన్ని క్షణాల క్రితం వరకూ ఆమె ధైర్యమనే పదాన్నే మరచిపోయింది....

"అలసిపోయినట్టున్నారు.... నిద్రపోండి" నెమ్మదిగా అన్నాడు ఎదురుగా కూచున్న భాస్వంత్....

ఆ మాత్రం ఆప్యాయతకే తట్టుకోలేనట్టు ఆమె కళ్ళల్లో నుంచి నీళ్ళు ఉబికాయి.

ఒక నిశ్శబ్దపు చీకటిరాత్రిలో హఠాత్తుగా ఓ దేవుడులా ఈ వ్యక్తి తనను ఆదుకుని వుండకపోతే మిగిలిన బ్రతుకంతా నిశీధిలోనే చాలా నికృష్టంగా గడిచిపోయేది. అదీ ఆ క్షణంలో ఆమె ఆలోచిస్తున్న విషయం.

"దేవుడు చీకటినిచ్చింది బ్రతుకు చీకట్లను తలచుకుంటూ కుమిలిపోవడానికికాదు నిశాంతగారూ! అలసిన మనసు అనవసరంగా కన్నీళ్ళు ఖర్చుచేయకుండా ఆదమరచి నిద్రపోవాలని" మృదువుగా అన్నాడు....

వెక్కిపడుతూంది తప్ప ఆమెనుంచి జవాబులేదు....

"ప్లీజ్"

"మీరు...." నెమ్మదిగా గొంతు పెగిల్చి మాటాడింది. "మీరే సమయానికి ఆదుకోకపోతే...." తన కృతజ్ఞతను ఎలా తెలియపరచాలో ఆమెకు తెలియడంలేదు.

నవ్వేసాడు.... "చూశారా! మీరింకా ఎంత నిస్సహాయంగా మాటాడుతున్నారో....అదే....అదే నేను వద్దనేది" వాతావరణాన్ని కాస్త తేలిక పరచాలనుకున్నాడు.... ఆమె కథ వినాలని అతనికి ఆసక్తిగాలేదు.... ఒకరి కథని మరొకరు శ్రోత కాగలరు తప్ప పరిష్కరించే వ్యక్తి కాలేడు.... అందుకే ఆ క్షణాన ఆమెలో నైరాశ్యాన్ని పోగొట్టడమే తను చేయగలిగే చిన్న మంచిపని అనుకున్నాడు.

"మనం బ్రతుకుతున్నది చాలా నికృష్టమైన స్థితిలో నిజమే అయినా అలా బ్రతికేయాలి తప్ప ఎలా బ్రతుకుతున్నామో అని ఆలోచించడంలోనే నిజమైన దుఃఖముంది నిశాంతగారూ!

....ఇందాకటి వరకూ నా ఉనికినే పట్టించుకోని వ్యక్తులు ఇప్పుడు నేను ఒక ఇంటలిజన్స్ ఆఫీసర్ని అవగానే ఎంత విధేయత ప్రకటించారో చూశారుగా....వీళ్ళే మనజాతిలోని తొంభై శాతం జనం....మన దేశంలోని రాజకీయ వ్యవస్థ కుళ్ళిపోవడానికి, చేసేదేమీలేని నిస్సహాయస్థితిలో ఓ అందమైన కర్మసిద్ధాంతాన్ని కాళ్ళకు చుట్టేసుకుని ఆ గుంపులో సుగంధాన్ని ఆస్వాదించాలని తాపత్రయపడే వెర్రిబాగులు మూర్ఖులు. రోజూ ఆలపించే 'వందేమాతరం' భక్తిగీతానికి గాని జాతీయగీతమైన 'జనగణమన' లోని అర్థాలగురించిగాని ఆలోచించకపోయినా అందరితోపాటు జోరుగా పాడి ఆనందపడే వీళ్ళు ఆదిలో నేనీ బోగీలో ప్రయాణం చేస్తున్న విషయాన్ని

అంతదా గుర్తించలేదు సరికదా తమంతట తాముగా మిమ్మల్ని కాపాడడానికి ముందుకు రాలేకపోయినా నేనంటూ ఒకడ్ని వున్నానని నేను నిరూపించుకునేసరికి గొర్రెమందలా నా వెనుకవచ్చి నిలబడి నాకు అండకావడానికి సిద్ధపడ్డారు. కారణం ఓ పోలీస్ ఆఫీసరుగా నేను వారికి అండకాగలనన్న నమ్మకం. ఇదీ డార్విన్ నేచురల్ సెలక్షన్‌లోని మొదటి సూత్రం 'స్ట్రగుల్ ఫర్ ఎగ్జిస్టెన్స్'కు నిదర్శనం.

ఇక రెండవది నేచురల్ సెలక్షన్‌లోని మరో అరభాగం సర్వైవల్ ఆఫ్‌ది ఫిట్టెస్ట్.... మామూలు వ్యక్తులు జోక్యం చేసుకుంటే ఉతికి ఆరబెట్టే ఆ గూండాల్ని సైకలాజికల్‌గా ఎదుర్కోవాలని నా సెంట్రల్ నెర్వస్ సిస్టమ్‌లో తళుక్కుమన్న ఓ ఆలోచనకు ఐమీన్ 'ఇటలిజెన్స్'కు ప్రతిరూపంగా నేను సెంట్రల్ ఇటలిజెన్స్ ఆఫీసర్నని...."

అతడి వాక్యం ఇంకా పూర్తికాలేదు.

"అంటే మీరు...." విస్తుపోతూ చూసింది.

"నేనేం ఆఫీసర్నికాదు.... పాడూ కాదు....బాంబే యూనివర్సిటీలో చదువుతున్న ఓ విద్యార్థిని"

"మరి...."ఆమె అబురపడుతూ గొంతుస్థాయి పెంచేసరికి "నెమ్మది" అన్నాడు విష్పరింగ్‌గా....

"నేను పోలీసు ఆఫీసర్ని కాదని తెలిస్తే రిజర్వేషన్‌లో కేవలం సీటు మాత్రమే సంపాదించుకున్న నాకీ బెర్త్ భాగ్యం ఉండదు.... కాబట్టి మీరిలా నోరుతెరచి అందరూ 'ఇటే చూసే పరిస్థితి కల్గించకండి"

అదికాదు....మరి....ఆ ఐడెంటిటీకార్డు...."

"నేను ప్రతిరోజూ నా గదినుంచి యూనివర్సిటీకి వెళ్ళడానికి వుపయోగించే ఆర్టీసీ బస్‌పాస్.... అయినా నిజమైన ఆఫీసరెవరూ అలా సినిమాలోలా వికటాట్టహాసంచేసి నేరస్తులకు పనిగట్టుకు ఐడెంటిటీకార్డు చూపిస్తాడంటండీ. వాళ్ళెక్కడ వాయగొడతారో అని నేనేదో చిన్న ప్రయోగం చేశానుకాని.... మళ్ళీ క్వశ్చన్‌మార్క్ ఫేస్‌తో ఏదో అడగబోతున్నారంటే ఆ 'వాకీటాకీ' గురించి కదూ చూడండి...." జేబులోంచి పాకెట్ ట్రాన్సిస్టర్ తీసి ఆమెకందించాడు.

"పగటిపూట క్రికెట్ కామెంటరీరో పరుగుల గురించి వినాలనుకుని తెస్తే అదికాస్తా వాళ్ళచేత పరుగులు తీయించగలిగిన కాపాలికుడిలా పని చేసింది.

కొన్ని లిప్తలపాటు నిశ్శబ్దంగా చూసింది అతడ్ని....

"ఒకవేళ...." సాలోచనగా అడిగింది "వాళ్ళు మీమీద ఏదన్నా అఘాయిత్యం చేయబోతే"

"తిరగబడేవాడ్ని.... సాధించగలిగితే ఒక మంచిపని చేసానన్న తృప్తితో మీతోపాటు ఇలా కబుర్లు చెబుతూకూచునేవాడ్ని.... మిమ్మల్ని రక్షించలేక కేవలం తన్నులుమాత్రం తింటే అందమైన ఆడపిల్లకోసం ఒళ్ళు హూనం చేసుకున్న ఎందరో మహానుభావుల్లో నేను ఒకడినై విరిగిన కాలో చేయ్యో చూసుకుంటూ 'అందర్కీ నా వందనాలు' అని ఇలా ఓ మూల సెటిలయ్యేవాడ్ని...." మామూలుగా అన్నాడు మృధువుగా నవ్వుతూ....

కొన్ని నెలలపాటు మృత్యుగహ్వరం వంటి నరకకూపంలో మానసికంగా శారీరకంగా నలిగిన ఆమె అతడి సన్నిధిలో కృతజ్ఞత సైతం ఆశించని అతడి మాటల్లో ఎంతటి ఉపశమన్ని పొందగలిగిందీ అంటే....

భాస్వంత్ జరిగి కళ్ళు మూసుకున్నా శిథిలమైన శిల్పంగా మారిన ఆమె భక్తురాలిలా అతడినే చూస్తూ ఉండిపోయింది.

ట్రైను సాగిపోతూంది. చీకటిని చీల్చుకుంటూ వర్తమానాన్ని గతంలోకి నెడుతూ....

అలా ఎంతసేపు గడిపిందో ఆమెకూ గుర్తులేదు....

హఠాత్తుగా కళ్ళు తెరిచిన భాస్వంత్ తననే చూస్తున్న నిశాంత చూపులకు ముందు కాస్త తొట్రుపడి "ఏంటీ....నిద్రపోలేదా ఇంకా" అన్నాడు.

"లేదు" తలవంచుకునే "ఆలోచిస్తున్నాను" అంది అసంకల్పితంగా.

"ఏంటి"

చాలా స్వల్పకాలంలో పెరిగిన పరిచయం వారిది.

"ఒక మనిషిలో సంస్కారం కొట్టొచ్చినట్లు కనపడడానికిగాని నడవడిలో ఆ సంస్కారం ఉట్టిపడడానికిగాని వైజ్ఞానికమైన కారణం ఏమైనా వుంటుందా అని" అనాలనుకుందికాని అనుకున్న మాటలు పెదవులు దాటి బయటకు రాలేదు ఎందుకో....కాని జీవితం విషయంలో ఇంతటి నిబ్బరాన్ని ప్రదర్శిస్తున్న మీరు ఇలా ఆలోచించడానికి కారణం ఏమై ఉంటుందా అని" అంది.

"ఏమై ఉంటుందో చెప్పనా....వేళకి నిద్రపోవడం" ఏదో క్రొత్త విషయం చెప్పినట్లు అన్నాడు. మనసారా నవ్వగలిగింది మరోమారు.

"కాబట్టి మిమ్మల్ని నిద్రపోమంటున్నాను" అన్నాడు మళ్ళీ.

"నిన్నటివరకూ ఆమె ఎన్నో నిద్రలేని రాత్రుల్ని గడిపింది కాని ఇప్పుడు చిత్రమైన తృప్తితో నిద్రపోలేక పోతూంది.

చెంపకి చేతిని ఆన్చి కిటికీలోంచి బయటికి చూస్తున్న ఆమె ముంగురులు గాలికి అల్లరిగా నర్తిస్తుంటే కొన్ని క్షణాలపాటు దృష్టి మరల్చలేక పోయాడు భాస్వంత్.

ఆమెలో ఏదో అనూహ్యమైన సంఘర్షణ జరుగుతూందని సులభంగా అర్థం చేసుకొన్నాడు.

"నిశాంతగారూ"

చూసిందతడివేపు....

"మనిషి జీవితంలో ఆలోచించకూడనిరోజు 'నిన్న'.... అనాలోచితంగా గడపాల్సింది 'నేడు'.... సాలోచనగా చూడాల్సింది 'రేపు'.... నేనిలా మాటాడడం మీకు చిత్రంగా కనిపించొచ్చు.... ఇష్టమైనవి చేయడంలోకాదు చేస్తున్నది ఇష్టపడడంలోనే నిజమైనది ఆనందం వుందన్న జేమ్స్ ఎమ్‌బారీ మాటలు నేనెప్పుడూ మననం చేసుకుంటుంటాను.....

"ఆశ్చర్యంగా ఉంది" అందామె.

„ఎందుకు?"

"ఈ వయసులోనే ఇంత లోతుగా ఆలోచించగలుగుతున్నందుకు"

"నా వయసెంతనుకుంటున్నారు" నవ్వేడు.

"తాత్వికంగా ఆలోచించగలిగే వయసుమాత్రం కాదనుకుంటున్నాను"

"పోనీ తత్వం గురించి మాటాడే వయసునైనా ఒప్పుకుంటారా"

"ఊహూ" అందామె క్రీగంట చూస్తూ....

"అసలు నా వయసు.... పోన్లెండి ఆ ట్రాపికెందుకు"

"చెప్పండి...." నిజంగా ఆమెకు తెలుసుకోవాలనే ఉంది. ఇంత విజ్ఞానఖనిలా కనిపించే వ్యక్తి వయసేమిటో

"మగవాణ్ని కాబట్టి వయసు దాచుకోవాల్సిన అగత్యం లేదనుకోండి...." గుంభనంగా నవ్వేడు పెదవుల్ని బిగబట్టి....

"మొన్నటికి నా వయసు ఇరవై.... వచ్చే ఏడాదికి ఇరవై మూడు. ఆలోచించండి ఇప్పుడు నా వయసెంత వుంటుందో"

ఆమె నేత్రాలు విస్ఫారితాలయ్యాయి....

అదెలా సాధ్యం....ఆమె ఆలోచిస్తూంది....

మొన్నటికి ఇరవై అయితే వచ్చే ఏడాదికి ఇరవైమూడు....ఆమె అతడన్నమాటలను మననం చేసుకుంటూనే మెదడుకు పదునుపెట్టింది.

అతను నిశ్శబ్దంగా నిద్రలోకి జారిపోయాడు. బహుశా ఆమె ముడి విప్పలేక అలసి నిద్రపోతుందేమో అనుకున్నాడుగాని మొండిగా ఆ పజిల్‌ను విడదీయడంలో నిమగ్నమౌతుందని ఊహించలేకపోయాడు....

తెల్లవారింది....

ఉదయసూర్యుని లేతకిరణాలు నులివెచ్చగ తాకుతుంటే భాస్వంత్‌కు మెలకువ వచ్చింది....

ఎదురుగా నవ్వుతూ చూస్తున్న నిశాంత....

ఆమెకళ్ళు అలసటలోకూడా అందంగా మెరుస్తున్నాయి....

"చూస్తుంటే మీరసలు నిద్రపోయినట్లు లేదే" అన్నాడు.

"మీరు అసలు నిద్రపోనిస్తేగా...." అంది తనూ నవ్వుతూ....

"నేనేం చేశాను...."

"ఓ చిక్కుముడి అందించి చక్కగా మీరు మాత్రం నిద్ర పోయారుగా"

"దెన్....సారీ...." అతడిమాటలు పూర్తికాకముందే "తెలిసి పోయింది మీ వయసెంత" అంది

అతడి భృకుటి ముడిపడింది.

"ఇప్పుడు మీ వయసు ఇరవై ఒకటి"

నిశ్చేష్టుడై వింటున్నాడు.

"ముందుగా నిన్నటి మీ పుట్టినరోజుకీ ఈ రోజు ప్రారంభమై కొత్త సంవత్సర ప్రారంభానికి నా శుభాకాంక్షలందుకోండి...."

అప్పటికే అతడికి సగం జవాబు దొరికిపోయింది. ఈ రోజు జనవరి ఒకటి" ఆమె ఫజిల్‌ని విడదీస్తూ చెప్పుకుపోతూంది" మొన్నటికి మీ వయసు ఇరవై అన్నారు....అంటే డిశంబర్ ముప్పయికి....ముప్పై ఒకటి మీ పుట్టినరోజు ఇరవై ఒకటిలో అడుగు పెట్టారన్నమాట....ఇదే సంవత్సరం డిశంబర్ ముప్పైఒకటికి మీ వయసు ఇరవై రెండవతుంది. మళ్ళీ జనవరి వస్తుంది. మీకు వచ్చే ఏడాదికి ఇరవైమూడు అన్నారు కాబట్టి వచ్చే సంవత్సరం డిశంబర్ ముప్పైఒకటికి మీ వయసు ఇరవై మూడవుతుంది. అవునా...."

కొన్ని నిమిషాలవరకూ తేరుకోలేకపోయాడు.

ఏం తప్పుచెప్పానా"

"అహ! ఆలోచిస్తున్నాను"

"ఏమని....తప్పుచెప్పానని ఎలా ఒప్పించాలనా"

"కాదు.... నాతో చదువుతున్న నా క్లాస్‌మేట్స్‌కి మూడురోజులు పట్టిన ఈ జవాబు ఇంత స్వల్ప వ్యవధిలో ఎలా సాధించారా అని"

ఆమె తలవంచుకుంది....

"కంగ్రాట్స్ ఏకాంతగారూ! మీరు చాలా షార్ప్‌గా 'ఆలోచించ గలుగుతున్నారు...."

ఆమె పెదవులపై నిర్లిప్తతతో కూడిన చిరునవ్వు....

"స్తబ్దంగా బ్రతుకుతున్న నేనింకా ఆలోచించగలిగే స్థితిలో ఉన్నానని తెలుసుకునే అవకాశమిచ్చినందుకు మీకు నేను అభినందనలు తెలియ పర్చాలి...."

"ఒక నిజం చెప్పనా....నిజానికి నేనే ఫజిల్ ఇచ్చింది మీ మానసిక సంఘర్షణలోనుంచి మిమ్మల్ని మళ్ళించాలని" ఆశ్చర్యంగా చూసింది.... ఆమె జవాబు చెప్పకముందే అడిగాడు మీ సబ్జెక్ట్ మాథమెటిక్సా"

ఒక మామూలుచదువుగల ఏ వ్యక్తి మీ ఫజిల్‌ని ఇంత సునాయాసంగా పరిష్కరించలేదన్నది అతడిగతం తెలియజెప్పిన అనుభవం....

"ఉహూ.... సైకాలజీ"

నిరుత్తరుడైనట్టు చూసాడు.... తను ఇంతసేపూ మాట్లాడింది మనస్తత్వ విశ్లేషణలో తన అవసరం అంతగా లేని ఆడపిల్లతో....

"మరి ఎలా చెప్పగలిగారు...." అడిగాడు.

"ఆలోచించాను...."

"ఒప్పుకుంటారుగా.... ఆలోచించగలిగినవాడు ఎలాంటి సమస్యలనైనా పరిష్కరించగలమని...."

చివాలున తలపైకెత్తి అతడి కళ్ళల్లోకి చూసింది.... తానేమిటీ అన్నది తెలియకుండానే తనకు మానసికమైన ధైర్యాన్నిస్తున్నాడు.

"మీ సబ్జెక్టు సైకాలజీయేనా"

"కాదు.... యంత్రాలతో కలసి బ్రతకాల్సివచ్చినా యాంత్రికంగా బ్రతకడం ఇష్టపడని నేను ప్రస్తుతం చదువుతున్నది మెకానికల్ ఇంజనీరింగ్"

"కాని మనస్తత్వాన్ని సైతం మేథమెటికల్‌గా ఎలా ఆలోచించగలుగుతున్నారు"

"జీవితం వేదాంతపరమైన గణితశాస్త్రం అని నమ్మేవాణ్ని కాబట్టి" స్వాభావికంగా అన్నాడు. దేశం గర్వించదగ్గ ప్రముఖ గణిత శాస్త్రవేత్త రామానుజంగారి కొడుకైన భాస్వంత్ మహర్షి. అతని నేత్రాలు సైతం విజ్ఞానాన్ని దాచుకున్న గ్రంథాలయాల్లా కనిపిస్తుంటే ఒక భక్తురాలిలా చూస్తూ వుండిపోయింది.

"అలసిన నా జీవితయానంలో అనుకోకుండా దర్శనమిచ్చి ఒక అపురూపమైన వ్యక్తిత్వాన్ని ప్రదర్శించిన ఓ మిత్రుడా! లోకాతీతమైన దైవశక్తేదో ఈ ప్రపంచాన్ని నడిపిస్తూందనినమ్ముతూహఠాత్తుగా ఆవిశ్వాసం నుంచి దూరమైన నన్ను భౌతికవాదంనుంచి ఆస్తికవాదంవేపు మళ్ళించావు. నా భావిజీవితం ఏం కాబోతుందో ఇంకా స్పష్టంగా తెలీని నేను నాలాటి నిర్భాగ్యుల్ని కాపాడే శక్తిని నీకాదేవుడు ప్రసాదించాలని కోరుకోవడం మినహా ఏం చేయలేని నిస్సహాయురాల్ని"

* * * *

అసురసంధ్యవేళ....

ఆ పల్లె అస్తమిస్తున్న సూర్యుడి అరుణ కిరణాలను కప్పుకుంటూ చీకటి రాకకోసం ఎదురుచూస్తున్నట్టుగా వుంది.

దూరాన మోగుతున్న గుడిగంటలు తీగ తెగిన వీణపలికే అపశ్రుతుల నాదాల్లా వినిపిస్తున్నాయి.

ఆ సమయాన....ఉత్సాహంగా ఒక చిన్న గుడిసెలో అడుగు పెట్టారు రామానుజంగారు. చేతిలో మరచెంబు....దాన్నిండా దేవుడి గుడి నుంచి నింపి తీసుకొచ్చిన తీర్థంఉంది.

పెచ్చులూడిన మట్టిగోడను ఆనుకుని నిరాసక్తంగా కూచునివున్న ఆయన అర్ధాంగి లక్ష్మి భర్తను చూడగానే నీరసంగా లేచింది.

మొహానికి పసుపురాసుకొని అభ్యంగన స్నానం చేసి నుదుట కుంకుమ దిద్దుకుని కాళ్ళకున్న మెట్టెలు మెడలోని తాళి స్పష్టంగా కనిపించేట్టు మూర్తీభవించిన మహాలక్ష్మిలా అలంకరించుకుని వుండమని ఆదేశించి వెళ్ళారాయన.

ఇప్పుడుకాదు....

ఎన్నడూ లేనిది చాలా వేకువనే నిద్రలేచి తూర్పున వెలుగురేఖలు పూర్తిగా విచ్చుకోకముందే సంధ్యా వందనానికి ఏటికి వెళుతూ కోరిన కోర్కె అది....

ఇప్పటి వరకూ భర్త రాకకోసమే ఎదురుచూస్తూకూర్చుంది....

పెడక్కి వేలాడగట్టిన దండెంపై ఉన్న మాసిన బట్టలమధ్య కూలిన ఒక సామ్రాజ్యపు కోటగోడల్లా నీరసంగా నిలబడ్డ మట్టిగోడల మధ్య అలనాటి వైభవానికి మచ్చుకైనా సాక్షీభూతంకాని ఆ చిన్న గుడిసెలో ఆమె నిజంగానే మహాలక్ష్మిలా దర్శనమిచ్చింది.

ఆయన అలా ఎందుకు ఆదేశించారో ఆమెకు తెలీదు.... అసలు ఆయనమాట జవదాటటం తెలీని సాధ్వి ఆమె....నలభయేళ్ళ వారి దాంపత్య జీవితంలో ప్రశ్నించబడడమూ చెప్పింది ఆచరించడం తప్ప జవాబు చెప్పడం తెలీని మగనాలి ఆమె.

మూడు రోజుల క్రితం ఒక విస్ఫోటంతో వారి బ్రతుకులు ఛిన్నాభిన్నమైనప్పుడు మాత్రం భర్త కళ్ళలో వేదన్ని చూసిందామె. అంతరించిపోయిన వైభవాన్ని నిశ్శబ్దంగా నీళ్ళు నిండిన కళ్ళతో చూస్తూ తమ దాంపత్య జీవితాన్ని రాజసంతో నెరిపిన భవంతిని ఆస్తిని సర్వం కోల్పోయి కానలకేగుతున్న రామునివెంట నడిచిన సీతలా ఈ గుడిసెకి చేరుకుంది....

కాని నిన్నటినుంచీ భర్తలో చూస్తున్న మార్పే ఆమెకు అర్థం కావడంలేదు.

ఈ రోజు మళ్ళీ ఎప్పటిలా ఆయన ఉత్సాహంగా వుండడం చూసి ఇది శాశ్వతమైతే బాగుణ్ణన్నంతగా భగవంతుణ్ని ప్రార్థించింది.

"లక్ష్మి" ఆర్ద్రంగా పలికింది ఆయన కంఠం.... ఒళ్ళంతా కళ్ళు చేసుకున్నంత ఉద్వేగంతో తన జీవితంలో సహధర్మచారిణిగా అడుగుపెట్టిన తొలిరోజు చూసినంత ఉత్సాహంతో ఆమెను ఆపాదమస్తకం పరిశీలిస్తూ కొన్ని క్షణాలు ఉండిపోయారు.

"మన దశ ఎందుకిలా మారిందని బాధపడుతున్నారా" ఆధ్యాత్మికంగా అడిగిన ఆయన అతని పాదాలముందు రాలిపడిన నీటిబొట్లు చూస్తూ

అమాంతం ఆమె తలను పైకెత్తి "ఈ రోజు వైకుంఠ ఏకాదశికదూ.... నువ్విలా కన్నీళ్ళు పెట్టకూడదు" కళ్ళు తుడిచారు.

"ఇప్పుడు నేనెందుకింత ఆనందంగా వున్నానో తెలుసా లక్ష్మి! నువ్వు మెట్టిన ఇంటినే నీదనుకున్న నా సర్వస్వాన్ని నువ్వు కోల్పోయినందుకు బాధపడుతున్నావని తెలిసి నేను కట్టించిన గుడికి వెళ్ళాను" ఆయన గొంతు వణుకుతూంది. నిశ్శబ్దంగా నన్ను చూస్తున్న రాముడ్ని ప్రార్థించి ఇక మనఇంట కన్నీళ్ళే ఉండకుండా చేస్తావని ప్రమాణం చేసి ఆ దేవుడి తీర్థాన్ని తీసుకొచ్చాను...."

లోపలనుంచి కూతురు అర్చన దగ్గు వినిపిస్తూంది....

"అమ్మాయిని పిలువు" నిస్త్రాణగా అన్నాడు. ఆమె కదిలింది....

మరోరెండు నిముషాలలో అక్కడకు వచ్చింది పదహారేళ్ళ కూతురు, ఆమె అడుగులు తడబడుతుంటే అర్థమైందాయనకు ఆకలి ఎంత రాక్షసంగా ఓడిస్తున్నదీ....

మూడు రోజులుగా ఆ ఇంట ఎవరూ తిండిప్రసక్తి లేకుండా గడిపారు. ఉండికాదు.... లేక కట్టుబట్టల్తో బజారుపాలైన రామానుజంగారు కావాలనుకొంటే ఆ వూళ్ళో తిండి పుట్టక కాదు. సంపాదించలేని నిస్సహాయతాకాదు.

ఒక నిర్లిప్తత....దానం చేయడమే తప్ప చేయిచాచడం తెలీని స్థితిలో దశాబ్దాలు గడిపారు. అందుకే అభిమానంతో ముందుకొచ్చిన వాళ్ళనీ కాదన్నారాయన.

నాన్న అభిమానం గురించి అర్చనకు తెలుసు....

అందుకే ఆకలి లేనట్టు నటించింది. ఆమె నటిస్తున్నట్టు తండ్రిగా ఆయనకీ తెలుసు. కాని తెలిసీ తెలియనట్టు వూరుకుండిపోయారు.

గణితశాస్త్ర విజ్ఞానఖనిగా అంకెలతో గారడీలు చేస్తూ లక్షలు సంపాదించిన ఆ వ్యక్తి ఒక మనిషి గారడీకి బలైపోయానని ఆ క్షణంలోనూ ఆలోచించడం లేదంటే కారణం ఆ సమయంలోకూడా దైవంపై ఆయనకు సన్నగిల్లని నమ్మకం....,

అంకెల్ని తప్ప మనుషుల్ని విభజించి ఆలోచించడం ఆయనకు చేతకాదు....

"అమ్మా అర్చనా" కూతుర్ని తన వారగా కూర్చోబెట్టుకున్నారాయన....

తపోభంగమైన ఓ మహర్షిలా బడలికగా చూస్తూ" చాలా క్లిష్టమైన ఓ లెక్క నిన్ను అడగబోతున్నానమ్మా" అన్నారు. కాగితంపై తప్ప నిజానికి నోటిలెక్కలా చెప్పలేని సమస్యది. నాకు నమ్మకముంది అయినా నువ్వు చెప్పగలవని"

రేపోమాపో సగర్వంగా మెట్టినింటికి వెళ్ళాల్సిన ఆమె వూహించలేదు ఓ మహా యజ్ఞానికి తండ్రి హోమాన్ని లిఖిస్తున్నాడని....వూహించినా ఆమె అడగదు.... అలా పెంచారు సంతానాన్ని.

"నాలాంటి ఒక తండ్రి తన చివరిక్షణాలలో నూరెకరాల ఆస్తిని తన భార్యకి చిన్నకూతురికి పెద్దకూతురికి ఒకటిపై మూడు, ఒకటిపై నాలుగు, ఒకటిపై అయిదు వంతులుగా విభజించి పంచాలనుకున్నారు. హఠాత్తుగా పెద్దకూతురు చనిపోయింది"

ఆయన భారంగా కళ్ళు మూసుకున్నారు.

ఆయన ఆలోచనల్లో సుమారు రెండు దశాబ్దాల క్రితం తనమాట కాదని పట్టుదలతో ప్రేమించినవాడితో ఇక జన్మలో గడప తొక్కనని వెళ్ళిపోయి చాలా దారుణంగా వరదల్లో ప్రాణాలు కోల్పోయిన పెద్దకూతురు నయన మెదిలింది....

ఉబికి రాబోయిన కన్నీళ్ళను బలవంతంగా ఆపుకున్నారాయన "అప్పుడు ఆస్తిని భార్యకీ చిన్నకూతురికి మాత్రమే పంచాల్సివచ్చింది. అప్పుడు న్యాయంగా ఎవరికెంత రావాలో చెప్పగలవా"

రెండే రెండు క్షణాలు అర్చన ఆలోచించింది. అంతే "అప్పుడు భార్యకీ చిన్నకూతురికీ ఆస్తిని ఒకటిపై మూడు, ఒకటిపై నాలుగు. నిష్పత్తిలో కలిసి విభజించడమే న్యాయం నాన్నగారూ. అప్పుడు నాలుగు భాగాలు ఒకరికి మూడుభాగాలు మరొకరికి చెందుతాయి. అంటే భార్యకి 4/7 చిన్న కూతురికి 3/7 వంతుగా పంచాల్సి వస్తుంది"

అభినందనగా చూసేరు "నువ్వు నా కూతురివమ్మా నాకు తెలుసు నువ్వు నాలా తప్పుచేయవని....అమ్మా" గొంతులో తన్నుకొస్తున్న బాధను బలంగా నిగ్రహించుకున్నారు.... "గణితశాస్త్రమే తప్ప నీతిశాస్త్రం తెలీని నీ తండ్రి మూడు రోజులుగా నీ ఆకలిసంగతి పట్టించుకోని ఈ తండ్రి నీ మేధస్సుకి అభినందిస్తూ నూరు ఎకరాల ఆస్తిలో వాటా ఇవ్వలేకపోయినా నూరు మిల్లీలీటర్ల ఈ తీర్థంలో మూడువై ఏడు వంతుల భాగాన్ని పంచుతున్నానమ్మా.... ఇది తక్కువని నన్ను తిట్టుకోవుకదూ"

గ్లాసులోపోసి అందించిన తండ్రిని రెండే రెండు క్షణాలపాటు యధాలాపంగా చూసి మరుక్షణం గటగటా త్రాగేసింది.

ఆ వృద్ధుడి ప్రేవుల్లో శూలాల్లా పొడుస్తున్న బాధ.... ఇక్కడే గుండె నిబ్బరం చేసుకోవాలి అనుకున్నాడు భార్యకి వాటాగా తీర్థాన్ని అందిస్తూ....ఆమె అందుకుంది. ఎందుకో వారించాలనిపించి చేతిని ముందుకు జాపాడు కాని అప్పటికే ఆమె తాగేసింది.

'ల....క్ష్మి' ఆయన కళ్ళల్లో నీళ్ళు సుడులు తిరుగుతున్నాయి.

"ఈరోజు వైకుంఠ ఏకాదశండీ....ఆలా కళ్ళనీళ్ళు పెట్టుకో కూడదు" వినడమే అలవాటైన ఆమెజీవితంలో అదే తొలిసారి అనడం.... "ఈ రోజు చాలా మంచిరోజుకదండీ"

"ల....క్ష్మి"

"అవునండి....వైకుంఠ ఏకాదశినాడు సుమంగళిగా భర్త చేతుల్లో ప్రాణాలు వదలడం ఏ ఆడదానికైనా వరం క....దూ" ఆమె బాధగా కడుపు పట్టుకుంది.

"అయితే అందులో నేను విషం కలిపానని నీకు ముందే తెలుసా" అమాంతంగా భార్యను ఒడిలోకి తీసుకున్నారు. "ఊహించగలిగానండీ" ఆమె నేత్రాలలో ఆనందబాష్పాలు...." వద్దండీ.... మీరు నిబ్బరంగా బ్రతకడమే తెలిసిన నేను అలా దిగులుగా కళ్ళనీరు పెట్టుకుంటే చూడలేను"

"లక్ష్మీ.... లక్ష్మీ...." ఉద్విగ్నుడై ఊగిపోతున్నారాయన.... అప్పుడు చూశారు కూతుర్ని.... ఆమె నిశ్చింతగా గోడకి జారగిలబడి ప్రశాంతంగా చూస్తోంది తండ్రిని....

"అమ్మా అర

"ఎందుకునా

కూలిపోయినపుడు

చేసుకోవడం చ

వత్తిగా మీరే

తండ్రిని ఓ

నీకు అనిప

హత్తుకున్నాడు,

"లేదునాన్నా...

సారి నాకు జన్మనిచ్చి మళ్ళ

వేడుకుంటాను.... ని.... జ

సమిధ మండిపోయింది.

నిశ్శబ్దంగా రోదిస్తూ కొన్ని

అలాగే వదిలి మొలలోని పేకెట్టుని ప్

కలిపారు.

జారినట్టు శరాఘాతాల తాకిడితో శరీరం, అంత

నను ముక్కలుగా పద్మవ్యూహంలో ప్రాణాలు

మన్యుడిలా ఆ గుడిసెలో అడుగు పెట్టాడు.

నిశ్శబ్దం....

చీకట్లో ఆ గుడిసె ఒ మృత్యుకూపంలా కనిపిస్తుంటే నిశ్శ

జారగిలబడి ఉన్న చెల్లిని నేలపై పడివున్న తండ్రిని చూస్తూ

నెమ్మదిగా మూలుగుతున్న తల్లిని సమీపించాడు....

శలేక అంతా ఆలసిపోయి ఉన్నారు....

ల్తో తనను చూడలేక మొహం చాటేసుకుంటు

మ్మను సమీపించాడు.

నాటకం తెరలా బడలిక

మరింతగా

యత్నిసూ

మరో అరనిమిషంలో జింక్ సల్ఫేట్ కలుపబడిన తీర్థం తాగేసారు.

విషం ఇప్పుడు ఎక్కువడంతో చాలావేగం. ఆయన ఒంటిలో పని చేయడం మొదలుపెట్టింది నిన్న మొన్నటివరకూ బ్రహ్మరథం పట్టిన ప్రపంచంనుండి వీడ్కోలు తీసుకుంటున్నట్లు చుట్టూ చూసేరు....

భార్య నేలపైపడి మెలితిరిగిపోతూ అంది.... "ఏమం....డీ ఎందుకో భాస్వంతను చూడాలని....పి....స్తోంది.

ఉలికిపడ్డారాయన హఠాత్తుగా ఏదో గుర్తుకొచ్చినట్లు.

శరీరం పట్టుదప్పి పంచేంద్రియాలు పగబట్టినట్లు అతనికి సహకరించకపోయినా చాలా ఆవేశంగా.... బలాన్ని కూడగట్టుకుని ఓ....కాగితాన్ని అందుకున్నారు....

గూటిలో ఉన్న పెన్నుతో ఏదో రాయాలని ప్రయత్నించారు.... కళ్ళు మసకలు కమ్ముతున్నాయి. మెదడు మొద్దుబారిపోతూంది....

కొ ప్రయత్నం చేశారు....

అభినందనగా చూసేరు "నువ్వు నా కూతురివ
నువ్వు నాలా తప్పుచేయవని....అమ్మా" గొంతులో తన్ను నుకున్నది పూర్తిగా
బలంగా నిగ్రహించుకన్నారు.... "గణితశాస్త్రమే తప్ప నీ
నీ తండ్రి మూడు రోజులుగా నీ ఆకలిసంగతి పట్టించుకోని లక్ష్మి....
నీ మేధస్సుకి అభినందిస్తూ నూరు ఎకరాల ఆస్తిలో వాటా ఇవ్వా దని ఇక్కడ
నూరు మిల్లీలీటర్ల ఈ తీర్థంలో మూడున్నై ఏడు వంతుల ుంది మీరే
తున్నాడమ్మా.... ఇది తక్కువని నన్ను తిట్టుకోవుకదు హృదయంతో....

గ్లాసులోపోసి అందించిన తండ్రిని రెండే వెక్కి భర్త పాదాలను
యధాలాపంగా చూసి మరుక్షణం గటగటా త్రాగే

ఆ వృద్ధుడి ప్రేవుల్లో శూలాల్లా పొ
గుండె నిబ్బరం చేసుకోవాలి అనుకున్నా డు.
అందిస్తూ....ఆమె అందుకుంది. ఎం
ాడు కాని అప్పటికే ఆ
న కళ...

3

భాస్వంత్‌కి ఏదో కొత్త ఇంటికి కాదు కొత్త లోకంలోకి అడుగు పెట్టినట్టుంది.

అప్పటికే సగం మానసికంగా చచ్చిపోయివున్నాడు....

స్టేషన్ నుంచి సరాసరి ఇంటికి వెళితే తెలిసింది అది జప్తు చేయబడి ఎప్పుడో ప్రభుత్వ పరమైందని....

అర్జెంటుగా రమ్మని టెలిగ్రాం ఇచ్చిన రామయ్యతాత కోసం ఆలయనికి వెళితే తాత జాడలేదు.

ఎవరో చెప్పారు సర్వం కోల్పోయిన తన కుటుంబం ప్రస్తుతం ఎక్కడ తలదాచుకున్నదీ....

ఒక పీడకలలోకి జారినట్టు శరాఘాతాల తాకిడితో శరీరం, అంత కన్నా ఎక్కువగా మనసు ముక్కలుగా పద్మవ్యూహంలో ప్రాణాలు కడతంటిపోతున్న అభిమన్యుడిలా ఆ గుడిసెలో అడుగు పెట్టాడు.

అంతటా నిశ్శబ్దం....

మసక చీకట్లో ఆ గుడిసె ఒ మృత్యుకూపంలా కనిపిస్తుంటే నిశ్శబ్దంగా గోడకి జారిగిలబడి ఉన్న చెల్లిని నేలపై పడివున్న తండ్రిని చూస్తూ నెమ్మదిగా చాలా నెమ్మదిగా మూలుగుతున్న తల్లిని సమీపించాడు....

ఆకలి బాధకు తాళలేక అంతా అలసిపోయి ఉన్నారు....

గాయపడిన గుండెలతో తనను చూడలేక మొహం చాటేసుకుంటున్నారు....ఏంటది.

'అమ్మా'

అధురుతున్న గుండెలతో అమ్మను సమీపించాడు.

చరమాంకంలోకి ప్రవేశించిన నాటకం తెరలా బడలికగా వాలిపోతున్న కనురెప్పల్ని బలంగా తెరవాలని ప్రయత్నిస్తూ చూసింది అతని తల్లి ....

ఒక సన్నని మెరుపు....చివరి చూపుకైనా దక్కిసందుకు.

దేవుడు ఆ క్షణంలోనైనా తన మొర ఆలకించినందుకు ఆమె కళ్ళల్లో అనూహ్యమైన మెరుపు....

"బాబూ" ఆమె పెనుగులాడుతూనే అతడి చెంపల్ని స్పృశించింది...."ఒక జీవితకాలం....ఆలస్యమైపోతుందనుకున్నాను....నాన్న...." తమకంగా అతడి తలను దగ్గరకు తీసుకుని ముద్దులతో ముంచెతుత్తూంది....

ఏదో చెప్పాలన్న ఆరాటంతో....ఏ ఆఖరి సందేశాన్నో సంజ్ఞయిషినో ఇవ్వాలన్న తొందరపాటుతో అమె పెదవులు గొణుగుతున్నాయి....

"నీ తరం....వచ్చేసరికి....నీకు....ఏం మిగలకుండా....అంతా....

కోల్పోయాంరా....ఓటమి....ఎరుగని మీ నాన్న....దేవుడ్ని నమ్మి....దేవుడికే ఉనికి నివ్వగలిగిన నీ తండ్రి....గణిత శాస్త్ర....విద్యాలయాన్ని కట్టించి తన జీవితానికో....పరమార్థాన్ని....కల్పించుకోవాలని....అహో రాత్రులు శ్రమించిన....నీ తండ్రి....తన....లక్ష్యం....పూర్తికాకుండానే....ఒక....అసంపూర్తి గ్రంథంలా—" అమె వెక్కి వెక్కి పడుతూంది.

పూర్తిగా చెప్పాలనుకున్నది చెప్పలేకపోతున్న నిస్సహాయతకీ మీదపడుతున్న మృత్యువు బారినుండి కొన్ని లిప్తలపాటైనా తప్పించుకోవాలని దారుణంగా మథనపడుతూంది....“నాన్న అందరం....పోయామని....అంతే....పోయిందని....ఓడిన....వాడిలా....తలవాల్చకు .... రాలిన ఈ రంగంలో ఒకడిగా కూలిన మా బ్రతుకుల్లో....మిగిలిన....మనిషిగా....నూరేళ్ళు బ్రతికి....నిర్వంశమౌతున్న....ఈ” ఆమె గొంతులోంచి రక్తం ఎగజిమ్ముతూంది....“మీ....నాన్న....లక్ష్యాన్ని....నువ్వు....పూర్తిచేసి....ధన్య....” ఆమె పెదవులు నిశ్శబ్దంగా ఆగిపోయాయి....అలసటగానైనా కదలిక కనుపాపలు, ప్రేత కళతో హఠాత్తుగా నిలిచిపోయాయి....నిర్జీవంగా ఆమె చేతులు వెనక్కి వాలిపోయాయి.

భయంగా భ్రాంతిగా చూశాడు....

ఇంకా నమ్మకం కుదరడం లేదు ఇదంతా వాస్తవమేనని....

కళ్ళ వెనుక నీటి కుండలు అప్పుడే చిల్లులు పడి చలమల్లా చిమ్ముతుంటే....

“అమ్మా” ఆగిపోయిందొక ఆర్తనాదం.

కంఠనాళాలు పగిలే రాపిడి గొంతులో....

అమ్మ గుండెలపై తలాన్చి ఉలికిపడుతూ వేదనతో వెక్కి పడుతూ చాలా సేపు అలాగే ఉండిపోయాడు....

స్మశాన స్తబ్ధతను మించిన నిశ్శబ్దం....సమీపంలో వెలుగుతున్న గుడ్డిదీపాన్ని చూస్తున్నట్టు కూర్చుని ఉంది అర్చన....చప్పుడు చేయకుండా చెల్లిని సమీపించాడు....

“అ....మ్మా....అర్చనా” అతని గుండెలు ఎగిసిపడుతుంటే నెమ్మదిగా తట్టేడు ఇంకా చావని ఆశతో....

అతని చేతుల్లోకి జారిపోయింది.

అతని కన్నీళ్ళు ఆకతాయిగా తనను అల్లరిపెడుతూ “అమ్మ జుట్టులా నాతల చాలాఒత్తుగాఉంటుంది, కదురా....అని అడిగే జుట్టుపై బడి మెరుస్తున్నాయి....

మబ్బుచాటున దాగిన చందమామలా పెరిగిన చెల్లి చెంపలు విషంలో పాలిపోయి ఉన్నాయి.

శవాలుగా మారిన తనవాళ్ళ మధ్య నిస్సహాయంగా చతికిలబడి మండుతున్న కాష్టాలను పరామర్శించే కాటికాపరిలా పక్కకు చూసేడు....

అక్కడ నేలపై నిశ్శబ్దంగా అనంతం వరకూ సాగలేక ఆగిన సరళరేఖలా పడివున్న గణిత శాస్త్ర కోవిదుడైన తండ్రి కనిపించాడు.

“నా....న్నా”

తండ్రి చెంపలపై తలాన్చి పొగిలి పొగిలి ఏడ్చాడు....

“అంకెల గారడీతో దేశమంతా అబ్బురపడేట్టు తిరుగులేని శంఖారావాన్ని పూరించి అసదృశమైన కీర్తి గడించిన నా తండ్రీ! ఏ శక్తి మన బ్రతుకుల్నిలా భాగించి ఓడించింది. ఏ లెక్కకైనా లిప్తల్లో జవాబు చెప్పగల నువ్వు ఏ జవాబు తెలీక నన్నిలా ‘శేషం’ మిగిల్చి నీ దారి చూసుకున్నావు.... నీ సంఖ్యనుంచి ఈ అంకెని తప్పించి ఎందుకు వెళ్ళిపోయావు....”

గుండెకి గండిపడినట్టు వా రాత తెగి నవనాడులా కృంగినట్టు పెనుతుఫానుకి ప్రకంపించిపోతున్న ఒక ఇసుక రేణువులా నలిగిపోతూ జరిగిన దానికి సాక్ష్యంగా ఉన్న విషపూరితమైన గ్లాసుల్నీ....తండ్రి సమీపంలో పడి ఉన్న పొట్లాన్నీ చూసేడు.

ఆకాశం నేలకూలలేదు....

సముద్రం ఇంకిపోలేదు....

కాలచక్రం ఆగిపోలేదు....

కాని భాస్వంత్ కళ్ళు మాత్రం రక్తాశ్రువుల్ని చిందిస్తూనే ఉన్నాయి.

అతని ముందు....రాకాసిలా నోరు తెరిచిన ఒక లోయ. లోయలో చీకటి....చీకటి స్వగతంలో ఊపిరాడని విస్మృత ఒంటరి మార్గం....

ప్రపంచానికి ఆ క్షణాన ఈ పూరి గుడిసెలో జరిగిన ఒక ఘోరం గురించి తెలీని సమయంలో....

అసంకల్పితంగా చూసేడు తండ్రి రాస్తూ సగంలో ఆపిన కాగితాన్ని....ఆ సమయంలోనే....

* * * *

మరో పల్లెలో....

ఒక నిశిరాత్రి నిట్టూరుస్తున్న వేళ....

కేవలం రెండు పెట్రోమాక్సులైట్ల వెలుగుతో ఒకచిన్న పెంకుటింటి ఆవరణలోంచి ఓ పెళ్ళి ఊరేగింపు బయలుదేరింది.

ఆ పెంకుటిల్లు రిటైరయిన సోమశేఖరం మాస్టారిలాగే జవసత్వాలుడిగి వుంది.

పెచ్చులూడిన గోడలు, రంగువెలసిన పెంకులు, ఇంటిచుట్టూ పెరిగిన పూలమొక్కలు, ఎవరూ కోరకుండానే ఎదిగిన కలుపుమొక్కలు. అప్పుడెప్పుడో అదో పర్ణశాలలా బాసిల్లి వుండవచ్చన్న అనుమానాన్ని కలిగిస్తున్నాయి.

ఆ రాత్రే ఆ ఇంట ఓ పెళ్ళి జరుగుతున్న సూచనగా వసారాలో కొబ్బరి ఆకులతో అలంకరించబడిన చిన్న మంటపంతప్ప మరే ఆర్భాటమూ లేదు....

ఆ ఇంటిలోనే మాస్టారి దాంపత్యం మొదలయింది.

ఆ ఇంటినే ఒకనాడు ఊరి వాళ్ళంతా ఓ గురుకులంగా భావించేవారు.

ఆ ఇంటి గోడలమధ్యే మాస్టారి భార్య అనసూయ ముగ్గురు పిల్లల్ని కన్నదికూడా....

ఉద్యోగ నిమిత్తం ఇంటర్వ్యూకని వెళ్ళి తప్పిపోయిన పెద్దకూతురు గురించి ఆ దంపతులు అహర్నిశమూ కుమిలి కన్నీళ్ళు చిందించిందీ ఇంటిలోనే....

ఏ దురదృష్టం మూలంగానో తమకు దూరమైన నిశాంత గురించి ఊళ్ళోనలుగురూ నాలుగురకాలుగా వ్యాఖ్యానాలుచేసి చిత్తక్షోభ కలిగిస్తూంటే చిన్నకూతురు భవిష్యత్తుకది ఆటంకం కాకూడదని సముద్రంలో మునిగి చనిపోయిందన్న ఒక అబద్దానికి సృష్టి జరిగిందీ ఆ ఇంటిలోనే....

తిరిగిరాని నిశాంత ఇక తిరిగిరాదన్న ఆలోచనతోనేగాక లేచిపోయిందనే నోళ్ళకు భయపడి "కాదు చచ్చిపోయింద"ని నమ్మించడానికి పెద్దకూతురు కర్మకాండల్ని ముగించింది ఆ ఇంటిలోనే....

మాస్టారు నడుస్తున్నారు పల్లకీ వెనుక పుట్టెడు వేదనతో వడలిన ఒక వృద్ధ మహర్షిలా.

మట్టిరోడ్డుపై ఆయన్ని అనుసరిస్తున్న శ్రేయోభిలాషుల్నీ పిల్లల్నీ దాటి ఓ చెట్టుచాటుగా నిలబడిన మాస్టారి కొడుకు గిరి గుప్పున బీడీ పొగ వదుల్తూ తన్మయం చెందుతున్నాడు.

పల్లకీలో కూచున్న సరళకు ఆ ఊరి బేండుమేళం వాయిస్తున్న సంకరజాతి సంగీతం వినిపించడంలేదు. అక్క గుర్తుకొచ్చి కళ్ళు నీలాల్ని కురిపిస్తున్నాయి....

పల్లకీ రామాలయాన్ని చేరుకుంది. వధూపరుల్ని గుడిలోకి తీసుకు వెళ్ళిన సోమశేఖరం మాస్టారు దైవసాన్నిధ్యంలో నూతన దంపతులపేరిట అర్చన చేయిస్తుంటే గుండెల్లో సన్నగా బాధ మొదలయింది.

ఇప్పుడు సీతను చూస్తున్న మాస్టారికి తప్పిపోయిన కూతురు గుర్తుకొస్తూంది.

"ఎందుకమ్మా చిట్టితల్లీ.... పెళ్ళే చేసుకోకుండా పెద్దకొడుకులా నాకు అండగా ఉంటానని మాట వరసకైనా ఎందుకన్నావు. ఈ ముసలి తండ్రిపై నీకున్న ప్రేమకు ఆ దేవుడికే కన్నుకుట్టిందా లేక తథాస్తు దేవతలే

నీ ఆలోచనల్ని అవకాశంగా తీసుకున్నారా. నా తల్లి 'నిశాంత' నూరు అబద్దాలతో నిన్ను లేకుండాచేసి నువ్వు ఎక్కాల్సిన పల్లకీలో నీ చెల్లెని కూచోబెట్టాను. నన్ను క్షమిస్తావా?"

సీతజాడ తెలియని రాముడెంత విలపించాడో అంతకుమించి కూతురి జాడ తెలియని ఆ వృద్ధుడు కుమిలిపోయాడు.

ఇక్కడ మాస్టారిలా మొరపెట్టుకుంటున్న సమయానికే....

అక్కడ....

'అమ్మా' అన్న పిలుపుతో పెరటిలోంచి లోపలికి వెళ్ళబోతున్న అనసూయ తక్కున ఆగింది ఉలికిపాటు ఉలికిపాటుగా....

చాలా పరిచయమైన కంఠమది.

ఆ తల్లి ప్రేవులు మెలిపెట్టేటంత ఆర్తిని కలిగించిన పిలుపది.

ఉద్వేగంతో అనసూయ రెండడుగులు ముందుకేసింది.

ఇంటిలోంచి పెరటివరకూ పరుచుకున్న ఓ వెలుగు కిరణం చెట్టు వారన నిలబడ్డ ఆకృతి ఎవరిదో స్పష్టం చెయ్యగానే ముందు అనసూయకి కాళ్ళాడలేదు.

ముందు కలేమో అనుకుంది.

కాదు అని తెలుసుకున్న మరుక్షణం "అమ్మా నిశాంతా!" అంటూ రెండే రెండు అంగల్లో కూతుర్ని చేరుకుని అమాంతం అక్కున చేర్చుకుంది.

"తిరిగి రావనుకున్న నా చిట్టితల్లీ ఇంత హఠాత్తుగా ఎలా ప్రత్యక్షమయ్యావే.... ఇన్ని నెలలుగా ఏమయ్యావే.... వెళ్ళినదానివి తిరిగిరాక ఊరివాళ్ళ నోళ్ళలో ఎందుకంతలా నానిపోయావ్.... నా తల్లీ.... ఏ తల్లి తండ్రులూ చేయని మహాపాతకానికి మమ్మల్నెందుకు ప్రోత్సహించావ్.... నిశాంతా.... నువ్వు లేవని, తిరిగిరావని నీ ఖర్మకాండల్నీ పూర్తిచేశాం!"

ఘనీభవించిన దుఃఖం గండిపడిన కడలిలా వరదలై పొంగి పొరలుతుంటే....

తెప్పరిల్లిన తల్లి హఠాత్తుగా వెనక్కి జరిగింది ఏదో గుర్తుకొచ్చినట్టు.

"అమ్మా!" చెప్పబోయింది నిశాంత.... బయలుదేరిన తాను ఎలా వంచింపబడిందీ.... విధి వంచితురాలై సర్వం కోల్పోతూ కూడా అమ్మా నాన్నల కోసం ఎంత పరితపించిందీ స్పష్టం చేయాలనుకుంది.

కాని అనసూయ అవకాశమివ్వలేదు. గగర్పాటుగా చుట్టూ చూసింది. వున్న బంధువులు ఊరేగింపుతో వెళ్ళారు.

ఒక ముసలి అవ్వ మాత్రం లోపలి వంటగది నానుకుని ఉన్న బావిదగ్గర అంట్లు తోముతూంది.

అమ్మలోని ఆ అలజడికి అర్థం వెదికే స్థితిలోలేని నిశాంత సమీపంలోని మంటపాన్ని చూసి "పెళ్ళెవరిదమ్మా!" ఉత్సాహంగా అడిగింది—"సరళదే కదూ!"

తలవంచుకునే తలూపిందామె....

"సరళేది?" చెల్లెల్ని చూడాలన్న తొందరపాటామెలో....

"ఊరేగింపులో వుంది!" సత్తువ సన్నగిల్లిపోతుంది అనసూయలో.

"సరైన సమయానికే వచ్చాను కదమ్మా!"

అదే.... అదే ఆ తల్లి బాధపడుతున్నదీ భయపడుతున్నది కూడా.... రాజ్యం కూడనివేళ అక్కడ ప్రత్యక్షమైంది.

"చెల్లి నా కోసం బాగా ఏడ్చి వుంటుంది కదే...." చిరుగర్వంతో నిశాంత కళ్ళు అనందబాష్పాల్ని రాలుస్తున్నాయి. "నాన్నెలా ఉన్నారమ్మా.. నా కోసం బాగా బెంగపెట్టుకుంటారు కదూ"

అప్పటికి అనసూయలో చలనంలేదు....ఆమె కాళ్ళు వణుకుతున్నాయి. ఏ తల్లికీ కూడని బాధాకరస్థితి అది.

"అమ్మా" బదులివ్వని తల్లి వేపు చూస్తూ ఆర్ద్రంగా పిలిచింది నిశాంత మరోమారు....

"నువ్వింకా బ్రతికే వున్నావా?" సరిగ్గా అప్పుడు వినిపించింది వెనుకగా ఓ కంఠం....

తలతిప్పి చూసింది నిశాంత....

ఎదురుగా గిరి నిలబడి ఉన్నాడు....తమ్ముడ్ని దగ్గరగా చూడాలనేమో కాస్త ముందుకు జరిగింది.

‘ఆగు’

నిశాంత గుండె కలుక్కుమంది.

“ఎందుకిలా వచ్చావు” కర్కశంగా అడిగాడు.

నిశాంత వణికిపోతూ నిస్సహాయంగా తల్లి వేపు చూసింది. ఇది కాదు ఆమె కోరుకున్నది. అమ్మ మాట్లాడదేం ?

“చెప్పేది నీకే.... వెంటనే బయటకు నడు” తొందరచేశాడు.

“అమ్మా!”ప్రపంచంలోని దైన్యమంతా మూటగట్టుకున్నట్టు ఒణికింది నిశాంత కంఠం....”

“వాళ్ళు తిరిగి వస్తున్నారే” ఉరిమినట్లుగా అన్నాడు గిరి. ఎవడితోనో లేచిపోయిన నువ్వు— చచ్చావని ఊరందర్నీ నమ్మించి నాన్న సరళ పెళ్ళి చేస్తున్నాడు. ఇప్పుడు నువ్విలా బ్రతికి రావడం నలుగురికీ తెలిస్తే మేమంతా చావాలి....అంతేకదా....సరళ మొగుడు దాని మెడలో కట్టిన తాళి తెంపుకుని వెళ్ళిపోతాడు....నాన్న గుండాగి చస్తాడు....వీలైనంత త్వరగా నువ్విక్కడ్నుంచి దయచేయకపోతే ఇక్కడ చాలా అనర్థాలు జరిగిపోతాయి....వెళ్ళమంటుంటే” హడావుడి పడుతున్నాడు గిరి.

శిలాప్రతిమలా నిలబడిపోయింది నిశాంత రెండు క్షణాలపాటు.... తను విన్నది పునశ్చరణ చేసుకుంది....భ్రమపడుతున్నానా అనుకుంది.... భ్రాంతి కాదు....నిజమే....గిరి నిజంగా అంటున్నాడా మాటలు.

ఉన్నట్టుండి ఉవ్వెత్తున దుఃఖం ముంచుకురాగా తల్లి పాదాల్ని చుట్టేసింది. “అమ్మా....నేను కావాలని చెడిపోలేదే....చేయని పాపానికి బలయ్యానమ్మా....మిమ్మల్నందర్నీ చూడాలని ఆశతో తిరిగొచ్చానమ్మా! నన్ను గెంటేయొద్దని తమ్ముడికి చెప్పమ్మా”

ఒక పసికందులా కుదిపేస్తూంది....అనసూయ ఊపిరితిత్తుల్ని ఎవరో ఉక్కుపిడికిలితో బిగిస్తున్నట్టు కుమిలిపోతూంది....

ఇన్నాళ్ళూ తిరిగిరాని కూతురు ఇక ఎన్నటికీ తిరిగిరాదనుకున్న పెద్ద కూతురు సరిగ్గా ఇలాంటి రాకూడని వేళ తిరిగి వస్తుందనిగాని ఆ తల్లి ఊహించివుంటే తన కడుపునే నిలువునా కోసుకుని పదిలంగా దాచుకోటానికి ఓ చిన్న గుడి కట్టుకుని ఉండేది.... నవమాసాలు మోసినపుడు ఇచ్చిన వెచ్చదనాన్ని ప్రశాంతతని నూరేళ్ళపాటు అందించి ఓదార్చేది.... కాని నిశాంత హఠాత్తుగా వెనక్కివచ్చింది. తాము అందర్నీ మభ్యపెట్టి కట్టిన అబద్ధాల కోటను కూల్చి అందులో అందర్నీ సమాధి చేసేట్టుగా.”

“మాటాడమ్మా.”

ఒక్క మాటతో ఒక్క జవాబుతో ఒక చిన్న అండతో ఆ ఇంట తన స్థానాన్ని పదిలపరుచుకోవాలన్న ఉద్వేగం నిశాంతలో.

“నేను తల్లినే....” అనసూయ కంఠం గద్గదికంగా వణికింది. “పోయిందనుకున్న కూతురి కోసం ఉన్న కూతురి సుఖానికి తిలోదక మివ్వనా.... లేక ఏ తప్పూచేయని నీ చెల్లిని బలి చేసి నీకు ఆశ్రయం ఇవ్వనా.... నువ్వే నా స్థానంలో వుంటే ఏం చేసేదానివి....”

చివాలున తలపైకెత్తి తల్లి కళ్ళలోకి చూసింది....

అంటే తను కూడా నన్ను వెళ్ళిపోమంటుందా....

“అ....మ్మా—” బయటకురాని ఓ ఆర్తనాదం ఆమెను నిలువునా కుదిపేస్తుంటే “నీ అభిప్రాయమూ అదేనా” గొణుగుతున్నట్టు తదేకంగా చూస్తూ అడిగింది.

ప్రపంచమంతా కాదన్న మహాపాతకాన్ని అయినా క్షమించి కన్న నలుసుని గుండెల్లో దాచుకునేది తల్లి ఒక్కతే అన్న భావం ఆశతో నిస్సత్తువగా రెండడుగులు ముందుకేసింది.

అనసూయ తనేమీ చేయలేని నిస్సహాయతని వ్యక్తం చేస్తూ అశ్రుసిక్త నయనాలతో నెమ్మదిగా తల అడ్డంగా ఊపింది.

అంతే....

అవచూర్ణిత హిమవన్నగమై అవశిష్ట శిలా సదృశమై అవదీర్ణవస తాంబరమై కూలిపడిన అవపథంలా నిలబడిపోయింది నిశాంత.

ఎందరో పతితులు భ్రష్టులు బాధాసర్పదష్టులు శనిదేవత రథచక్రపుటిరుసుల మధ్య నలిగి పడిన దీనులు, హీనులు, తిరస్కృతులు బహిష్కృతులు దౌర్భాగ్యానికి ప్రతినిధిలా నాడులు కదిలినట్టు ప్రేవులు కదిలినట్టు నిస్తేజంగా ఒక నీటిబొట్టు ఆమె నేత్రాలనుంచి జారిపడింది ఆమె ప్రయత్నం లేకుండానే.

చుట్టూ చూసింది.... సుపరిచితమైన పరిసరాలు.... ఇక్కడే అమ్మ చేతితో గోరుముద్దలు తిన్నది— ఈ ముంగిటనే నాన్న చేరువలో కూచుని ఎన్నెన్నో కబుర్లు చెప్పింది.

ఈ ప్రాంగణంలోనే చెల్లిని తమ్ముడ్ని ఆడించింది. ఆకాశంలో చందమామ చూపుతూ ఆరిందిలా కథలు చెపుతూ కలలు కన్నది....

'వెళతానమ్మా' శలవు తీసుకుంటున్నట్టు చూసింది చివరిసారిగా....

నిగ్రహించుకోలేని అనసూయ మమతల తీవెలు కంఠనాళాన్ని ఉరి తాడులా కోస్తుంటే 'వెళ్లొస్తానమ్మా' అంది సడలిపోతున్న ధైర్యంతో....

"అమ్మా" తప్పు చేసినట్టు తల వంచుకున్న తల్లి తలని తనే తల్లిలా పైకెత్తి "చెడినదానమ్మా నేను— ఎప్పుడో చచ్చిపోయిన ఆడదాన్ని.... వెళుతున్న నేను తిరిగివచ్చే అవకాశమే లేని నేను వెళ్ళివస్తానని ఎలా చెప్పగలను. మీ అందరికీ శాపంగా ఎలా మారగలను" శుష్కంగా అంది.

తల్లి రక్తంతో తడిసి అప్పుడే పుట్టిన పసిగుడ్డులా కనిపంచే కూతురు కదిలి వెళుతూంటే తట్టుకోలేని నిర్భాగ్యపు తల్లి "ఎక్కడికెళతావే" అంది రెండడుగులు ముందుకేసి.

"ప్రపంచం చాలా పెద్దదమ్మా" నిశాంత నిరాసక్తంగా చూసింది "అమ్మ ఒడికన్నా విశాలమైనది.... అక్కడ పుణ్యాత్ములకే కాదు.... పాపులకీ చోటు వుంటుందమ్మా."

లంకాపురి నుంచి తిరిగివచ్చిన సీత మళ్ళీ చేయని నేరాలకై కానలకేగుతున్నట్టు నిశాంత నడుస్తుంటే నిస్పృహగా చెట్టుకు జారగిలపడిన అనసూయ మూగగా రోదిస్తూంది.

ఎన్ని క్షణాలు గడిచాయో ఆమెకు తెలీదు....

"అనసూయా."

భర్త పిలుపుతో వాస్తవంలోకి వచ్చింది.... తేరుకుని చుట్టూ చూస్తే అప్పటికే ఊరేగింపు నించి తిరిగివచ్చారంతా....

"ఎందుకీ కన్నీళ్ళు?.... తిరిగిరానిదానికోసం తపస్సు చేస్తే మాత్రం ఆ దేవుడు కరుణించెనా.... నా ముద్దుల కూతురు జాడ మనకు తెలిసేనా...."

"ఏమండీ...." అతని గుండెలపై వాలిపోయింది.... దేవుడు కరుణించాడని కూతురు జాడ తెలిసిందని తనే రాక్షసంగా వెళ్ళగొట్టానని చెప్పాలన్నంత ఉద్వేగంతో నోరు తెరిచింది....

కాని....

అప్పుడే నవజీవన యౌవనంలో తొలి అడుగుపెట్టి ముగ్ధలా ఓ మూల ముడుచుకు కూచున్న చిన్నకూతురు సరళ కనిపించింది. వడలిన ఎండుటాకులా వున్న భర్తవేపు చుట్టూ వున్న ప్రపంచంవేపు చూస్తూ ఆ సాహసం చేయలేకపోయింది.

"అమ్మా.... అక్షూ లెక్కడున్నాయి ఫ్రెండ్స్ కివ్వాలి" గిరి అడిగాడు విసుగ్గా దూరం నుంచే.

అప్పుడు గుర్తుకొచ్చిందా తల్లికి....

ఇంటికొచ్చిన పెద్దకూతుర్ని పనిగట్టుకుని బయటికి నెట్టింది తప్ప ప్రేమగా పిడికెడు అన్నమైనా పెట్టలేదని. మమతల కోసం మనసునీ— బంధాల కోసం బ్రతుకునీ పంచడమే తప్ప నీకంటూ ఏదీ ఉంచుకునే సాహసం చేయలేని ఓ భారతనారీ....! ఎక్కడున్నావమ్మా మనువు....! స్త్రీలను పూజించేచోట దేవతలున్నారన్న ధర్మస్మృతి ఏ కాటిలో కాలిపోయింది?

నిశాంత నడుస్తూంది నిశిరాత్రిలో....

గమ్యంలేని ప్రయాణమది.

ఎందరి సానుభూతితో ఇంటికి చేరింది. ఏమీకాని టిటిఇ కొద్దిపాటి మానవతతో అన్నలా తనకు ఆసరా అయితే పురుషుల్లో ఒక పుణ్య

పురుషుడిలా ఒక మిత్రుడు సాహసంతో తనను ఆదుకుని అండ కాగ గాడు.... అంతకుమించి....

తన కన్నీళ్ళకు కరిగిన ఒక అక్కలాంటి ఆడది పర్యవసాన గురించి పట్టించుకోకుండా వేశ్యా వాటికనుంచి తనను తప్పించి చేయరా సాహసం చేసింది....

కాని....

ఇందరి ఆప్యాయతలతో తిరిగి వచ్చిన తనకు ఇప్పుడు దక్కి దేమిటి....

ప్రపంచమంతా పెద్ద ప్రశ్న?

* * * *

"అమ్మా"

మొహంపై తగిలిన పిడికిలి దెబ్బకు నేలపై వెల్లకిలాపడింది సరోజ..

రావూఫ్ ఆమె జుట్టు పట్టుకుని పైకి లేవనెత్తాడు....

సరోజ పెదవి చిట్లి రక్తం బయటకు చిమ్ముతూంది. పలసై ఎనిమిది గంటలుగా సాగుతున్న నరమేధానికి సాక్ష్యంలా.

"చెప్పవే.... జాగ్రత్తగా కాపలా కాయమని నీకప్పచెబితే అది తప్పించుకునే మార్గాన్ని చూపించి ఇంత ద్రోహం ఎందుకు చేశావు" ఈసారి ఘర్‌వాలీ జమునాబాయి చేయి సరోజ చెంపకు తాకింది.

అప్పటికి సరోజ మాటాడలేదు.... ఆమె నోటినుంచి రక్తంబొట్లుగా జారుతున్నా కళ్ళు మాత్రం తడి ఆరినట్టు పొడిగానే చూస్తున్నాయి.

అసలు ఆ నరక కూపంలో బలవంతంగా అడుగుపెట్టిన తొలిరోజునే ఆమె కన్నీళ్లు ఇంకిపోయాయి.... ఇన్నేళ్ళ నికృష్ట జీవితంలో ఆమెకు మిగిలింది కమిలిన కొద్దిపాటి అందం.... రోగాలతో రొష్టులతో కలుషితమైన రక్తమూను....

పెళ్ళి చేసుకుంటామని మభ్యపెట్టి లేవదీసుకొచ్చిన అమ్మాయిల్ని, ఉద్యోగాలిప్పిస్తామని నమ్మించి మోసంచేసి తీసుకొచ్చిన అమ్మాయిల్ని

వ్యాపార నిమిత్తం బలవంతంగా రొంపిలోకి లాగే ఆ వ్యభిచార కేంద్రాల్లో కొందరికి మందిచ్చి బలాత్కరించి రంగంలోకి దింపితే మరికొందర్ని ఆకలితో మాడ్చి వాతలుపెట్టి వ్యాపారంలోకి లాగుతారు.... ఇంకా మొండికేస్తే ఒళ్లు హూనంచేసి శరీరంపై ఏసిడ్ చల్లి మర్మావయాన్ని బ్లేడ్లతో కోసి చివరికి ప్రాణాలనైనా తీయడానికి సిద్ధపడతారు....

ఒకనాడు మొరార్జీదేశాయిలాంటి ప్రముఖుని ప్రయత్నంతో కనుమరుగైన ఆ ప్రాంతాలు బొంబేలో మళ్ళీ పుట్టగొడుగుల్లా లేచాయి అంటే కారణం.... బ్యూరోక్రసీ....

చాలా రాక్షసంగా ఒకనాడు పడుపు వృత్తిలో అడుగుపెట్టిన సరోజ జీవచ్ఛవంలా బ్రతకడానికి అలవాటుపడినా హఠాత్తుగా ఆమెలో సంచలనం రేపింది 'నిశాంత' అనే తనలాంటి ఓ తెలుగుపడుచు జీవితం....

అందుకే సుమారు మూడునెలలు మొండికేసిన ఆమెను చూస్తూ కలత పడింది.

కాళరాత్రిలో ఒంటరిగా కూచుని అమ్మా నాన్నల్ని గుర్తు చేసుకుంటూ కుమిలే నిశాంత సరోజ జీవితంలో ఒక పరిష్కరించాల్సిన సమస్యగా అయింది.

కాని అంతలోనే సామూహిక మానభంగానికి గురైంది నిశాంత....

అప్పటికీ రాజీపడలేదా జీవితంతో....

అడవిలో ఏ కోనలోనో అందంగా విరిసిన ఓ లేతగులాబీ క్రూర మృగ పదఘట్టానికి రాలి నేలకూలితే జాలిపడేదెవ్వరు?

అయినా సరోజ ఊరుకోలేదు....

ఒకనాడు కష్టమర్లెవరో తనతోపాటు నిశాంతని బుక్ చేసుకుని ఓ బంగళాకి తీసుకువెళతామంటే తను కాపలా ఉంటానని ఘర్‌వాలీకి చెప్పి నిశాంత బయలుదేరేట్టు చేసింది.... యుక్తిగా తప్పించింది.

దానికి పర్యవసానంగా ఇప్పుడు ఆ గదిలో రాక్షసంగా హింసింపబడుతూంది.

"రావూఫ్" సౌంజ్ఞ చేసిన ఘర్‌వాలీ బయటకు నడిచింది.

అతడి చేతిలో ఇప్పుడు ఒక బ్లేడు వుంది.... అ వేశ్యావాటికలో ఎదురుతిరిగిన ఆడపిల్లల మర్మావయాల్ని గాట్లుపెట్టడంలో పైశాచికంగా హింసించి వారిని దారిలో పెట్టడంలో చాలా చరిత్రగలవాడు రావూఫ్....

భయంగా రెండడుగులు వెనక్కి వేసింది....

మరుక్షణం ఆ నాలుగుగ్గోడల మధ్య రావూఫ్ చేతిలోని బ్లేడు తన క్కన మెరియడమూ లిప్తపాటులో సరోజ బ్లౌజు చిరిగి స్థనాగ్ర భాగాన్ని చీరి ఓ శనగగింజలా కత్తిరించబడడమూ చాలా వేగంగా జరిగిపోయింది.

బిడ్డలకు పాలందివాల్సిన వక్షాలనుంచి రక్తం ఉబికి వస్తుంటే.... "అమ్మా" అంటూ గుండెలకు చేతుల్నానించి గోడకి జారగిల బడిపోయింది సరోజ....

రావూఫ్‌కి పూనకం వచ్చింది.

ఆమె శరీరంలోని అందమైన భాగాలు పీలికలై పోతున్నాయి.

అయినా ఆమె కళ్ళు వర్షించడం లేదు,

మరణ యాతనకన్నా ఓ మనిషి వేదనలో భాగంపంచుకున్న ఆనందం ఆమెలో....

సరోజలోని నిర్లిప్తత రావూఫ్‌ని మరింత పేట్రేగేట్టు చేస్తుంది.

ఆమె కళ్ళు మూతలు పడుతున్నాయి. అక్కడ జరుగుతున్న ఒక కరాళ నృత్యంలో....

కాని ఆ క్షణంలోనూ సరోజ పెదవులు అస్పష్టంగా కదులుతున్నాయి...." ఈ నరకంలో నుంచి దాటి నీ వాళ్ళను చేరుకున్న నా చిట్టి చెల్లి.... ఒక మంచి పనిచేసే అదృష్టాన్ని కల్గించి నా బ్రతుక్కి ఓ పరమార్థాన్ని కల్గించిన నా బంగారు బొమ్మా.... నువ్వు నిశ్చింతగా ఉంటే చాలు నా జన్మ ధన్యమైనట్టే."

ప్రపంచానికి తెలీని చీకటి గదిలో రాక్షసంగా హింసించబడుతున్న ఆమెకేం తెలుసు ఈ చోటు కాదని వెళ్ళిన నిశాంతకూ తన ఇంట చోటు లేకుండాపోయిందని....

* * * *

ఉరి తీయబడబోతున్న వ్యక్తి తలపై కప్పబడిన నల్లటి ముసుగులా చీకటి ప్రకృతిని ఆక్రమించిన ఆ నిశిరాత్రి వేళ....

సద్దుమణిగిన పల్లెను దాటిన ఏకాంత గమ్యం తెలియని ఒక వ్యధిత జీవన యాత్రికురాలిలా మామిడితోపును చేరి కన్నెగా కన్నుమూసిన ప్రమీలా మందిరం మెట్లపై కూచుని వుంది....

ఆమెకు జరిగింది గుర్తుకు రావడం లేదు.

జరగబోయేదేమిటో ఆలోచించే శక్తికూడా లేదు.

జరిగింది కలకాదని తెలుసుకున్న మరుక్షణమే ఆమె దుఃఖం గడ్డ కట్టుకుపోయింది.

అది— ఇక ఏమీ మిగలనివేళ తనకెవరూ లేరని తెలుసుకున్న వేళ మనిషిలో కలిగే నిర్వేదం....

సరిగ్గా అప్పుడు చూసింది.

మందిరంలో నుంచి వాలుగా పడుతున్న విద్యుద్దీపపు కాంతిరేఖలో ముందుగా కనిపించింది రంగారావు—

అంటే....

ఒకనాడు తనకు ట్రైనులో పరిచయమై ఇంటర్వ్యూ కనివెళుతున్న తనను మాటలతో బుజ్జగించి నమ్మించి ఉద్యోగ విషయంలో రికమండ్ చేయిస్తానని చెప్పి ఆ రొంపిలోకి నెట్టిన తొలి రాక్షసుడు....

అతడి వెనుక అండగా నడుచుకు వస్తున్న ముగ్గురు భయంకరులైన గూండాలు యమకింకరుల్లా....

హఠాత్తుగా వెన్నులో చలి మొదలైంది.... కొన్ని క్షణాల క్రితం వరకూ ఆమెను ఆక్రమించిన నిర్లిప్తత చెదిరి ఊపిరితిత్తుల్ని పిడికిళ్ళతో ఎవరో పిసుకుతున్నట్లు ఉక్కిరి బిక్కిరైపోయింది.

అంతే....

వీధిలోకి పరుగెత్తింది....

మందిరం చుట్టూవున్న మామిడితోపులోని స్తబ్ధత చెదిర్చిన ఆ నిశి రాత్రి వేళ ఓ లేగదూడలా ఆమె ముందుకు దూసుకుపోతుంటే....

ఒకే జింకను పంచుకోవాలని వేటాడుతున్న నాలుగు వ్యాఘ్రాల్లా ఆ నలుగురూ వెంటాడుతున్నారు....

4

పరుగెత్తుతున్న నిశాంత పాదాల క్రింద ఎండుటాకులు నలిగి చిత్రమైన శబ్దాన్ని చేస్తున్నాయి.

వెనుక తూటాల్లా దూసుకువస్తున్న వ్యక్తుల ఊర్పులు ఆమెను మరింత భయకంపితురాల్ని చేస్తుంటే అలసటగా ఓ చెట్టుకు చేరగిలబడింది.

ఆయాసమో, ఆకలిబాధో కడుపులో సూలాల్లా గుచ్చుతున్న నొప్పి....

కొన్ని క్షణాలపాటు హఠాత్తుగా నిశ్శబ్దం ఆవరించింది.

ఆమెకూ అర్థమైంది వెంటాడుతున్న వ్యక్తులు ఆమె ఉనికి కోసం దిక్కులు పరికిస్తున్న విషయం.

ఆమె గుండె సవ్వడి తప్ప ఆమెకే చాలా స్పష్టంగా వినిపిస్తూంది....

ఆ క్షణాన ఆమెను ఆదుకున్నది ఆ దట్టమైన ఆ చీకటే....

అక్కడక్కడ వెలిగి ఆరిపోతున్న మిణుగురు పురుగులు.... అంతవరకూ ఆగి మళ్ళీ మొదలైన కీచురాళ్ళ రొద.... ఆమె ఆలోచిస్తూంది నీరసంగా చెట్టుకు జారగిలబడి....

సమీపంలో పాద చప్పుడైంది.... ఆమె ఊపిరి బిగపట్టుకుని నిలబడింది.

ఆ చప్పుడు ఏ విష సర్పానిదో అయితే.... అది తనను కాటేసి కడతేర్చితే బ్రతికిపోతాను భగవంతుడా అని ఆమె ఆలోచిస్తూందంటే అది ఆమె తప్పుకాదు.

శత్రువుల దండయాత్రలా తునాతునకలైన ఒక శిథిల శిల్పం ఆమె.... తనవాళ్ళంటూ ఎవరూలేని ఉన్నా ఎవరికీ ఏమీకాని మొన్న పూచి నిన్నవాడిన ఓ గడ్డిపూవులాంటి జీవితం ఆమెది.

'ఎటుపోయిందంటావ్' రంగారావు గొంతువినిపించింది దూరంగా....

క్షణాలు గంటల్లాగ గడుస్తున్నాయి.

అప్పుడు చూసారు వాళ్లు దూరంగా శారదానది గట్టుపై పరుగెత్తుతున్న ఓ ఆకారాన్ని.

“ఉదర్ దేఖో” నిశ్శబ్దాన్ని చెదిర్చిందో కంఠం....

మళ్ళీ వేట మొదలైంది....

నిశాంత పరుగెత్తుతూంది ఓడిన ఒక సామ్రాజ్ఞిలా....

బలాన్ని కూడగట్టుకుంటూ ప్రాణం కడంటిపోతున్నా పరుగెత్తుతూ పట్టణంలో అడుగుపెట్టింది.

అప్పటికే ఆమెకు చాలా సమీపంగా వచ్చేశారు.... ఓ సందులోకి నిశాంత రక్షించమంటూ ఆర్తనాదం చేయబోయి, మళ్ళీ ఆగిపోయింది....

నిశ్శబ్దంగా వీథి ఒడిలో నిద్రపోతున్న అక్కడి వాతావరణాన్ని సైతం భంగపరిస్తే తనను ఎవరన్నా ఆదుకోవచ్చేమో కాని తెల్లవారేసరికల్లా ఏ ఒక్కరి మూలంగానైనా తన గురించి తన వాళ్ళకి తెలిసిపోవచ్చు.

కేవలం మూడుమైళ్ళ దూరంలో వున్న తన తండ్రికిగాని ఆ వూరి వాళ్ళకిగాని తన ఉనికి తెలిసిననాడు ఓ కుటుంబం ఛిన్నాభిన్నమైపోతుంది.

ఆ ఆలోచనే ఆమె గొంతు నొక్కింది....

అందుకే అనాలోచితంగా కొద్దిగా ద్వారం తెరచివున్న ఓ పెంకుటింటిలోకి దూరింది. ద్వారాన్ని ఆనుకునే రొప్పుతూ నిలబడిపోయింది.

బయట పరుగెత్తుతున్న వ్యక్తుల అడుగుల చప్పుడు ఆ ఇంటిని దాటుకుంటూ వెళ్ళిపోవడం స్పష్టంగా అర్థమైంది. అలా ఎంత సేపు నిలబడిందో ఆమెకు గుర్తులేదు.

బయట మరే ప్రమాదం లేదన్న నిర్ధారణకు వచ్చేక ద్వారాన్ని తె
బోయింది.

“ఆగు” కర్కశంగా వినిపించిందో కంఠం....

అప్పుడు చూసిందామె ఇంటిలోపల గోడకి జారగిలబడి కూర్చొ
ఉన్న ఓ భయంకరాకారాన్ని....

హరికేన్ లాంతరు వెలుగులో సైతం కాలుతున్న నిప్పుల్లా కనిపి
చాయి ఆ వ్యక్తి నేత్రాలు....

భయవిహ్వలంగా ఠక్కున ఆగింది....

తాగుతున్న సీసాని పక్కనపెట్టి నెమ్మదిగా పైకిలేచాడు....

మరో సింహం బోనులో అడుగుపెట్టినట్లు బాధపడిపోయింది....

మరొక్క క్షణం అతడాలస్యం చేస్తే రోడ్డుమీదకి పరుగెత్తేదే...

కాని అప్పటికే ఆమె చేతినందుకుని బలంగా లాగేడా వ్యక్తి....

ఒక ఆర్తనాదం ఆమె గొంతునుంచి వెలువడబోయి మళ్ళీ భీతి
గొంతులోనే సమాధి అయిపోయింది.

* * * *

ఒక కాళరాత్రి గడిచిపోయింది.

రక్తతూణీరాల్ని చిందించిన సూర్యుడు అరుణకిరణాలతో రుణం తీ
నట్లు క్రమంగా తీక్షణదృక్కుల్తో పైకెగబ్రాకుతున్నాడు.

శవాల మధ్య నిద్రలేమితో రాత్రంతా గడిపిన భాస్వంత్ ఇంకా రెప్ప
వేయకుండానే పైకి చూస్తూ పడుకుని వున్నాడు....

ఉప్పెనలా ఉబికివస్తున్న కన్నీళ్ళు రాత్రెప్పుడో పూర్తిగా ఇంకిపోయి
కళ్ళల్లో ప్రేతకళనుమాత్రం మిగిల్చాయి....

“నాయనా రామానుజం” పిలుస్తున్నారెవరో....

వినిపించడంలేదు భాస్వంత్‌కి....

తలుపులు దబదబా బాదుతున్నారు....

ఇప్పుడు కొద్దిగా వినిపించినా ఇంకా ట్రాన్స్‌నుంచి తేరుకోనట్లు
అలాగే వుండిపోయాడు.

ఆదొక భావాతీత ధ్యానం....

కళ్ళల్లో కళ్ళముందు మనసులో మనిషిలో అంతా శూన్యమే....

ఏదో జరుగుతూంది సమీపంలో....

తపస్సునుంచి తేరుకున్నట్టు భాస్వంత్ నెమ్మదిగా పైకిలేచి ముందుకు చూశాడు.

అప్పటికే తలుపుల్ని విరగకొట్టి లోపలికి చొచ్చుకొచ్చారు జనం....

అందరికన్నా ముందు కనిపించింది రామయ్య తాత....

అరక్షణంలో అక్కడ జరిగిందర్థమైంది తాతకి.... అంతే.... “నాయనా భాస్వంత్” భాస్వంత్‌ని గుండెలకు హత్తుకున్నాడు.

ప్రపంచానికి తాత్వికదర్శనం చేయగల ఒక వేదాంతిలా బ్రతుకుతున్న రామయ్య తాత ఎవరూలేని ఒంటరివాడిగా జీవితాన్ని ఎప్పుడో ప్రారంభించాడు.... జ్ఞాన సముపార్జనతో అంతా అఖండ సచ్చిదానందమే అన్న సత్యాన్ని తెలుసుకున్న అక్కడి సన్నివేశానికి ఎంత చలించిపోయాడూ అంటే “నా చేతుల్లో ఏమీ లేదు అని తెలిసిన ఆ వృద్ధుడుకూడా ఇంత దారుణం జరుగుతుందని గుర్తించగలిగి ఉంటే నిన్ను కాపాడుకునేవాణ్ని రామానుజం” అన్నాడు ఖేదంతో నలిగిపోతూ.

తండ్రిని ఓదార్చాలని ఓదార్చగలడని రహస్యంగా తనే భాస్వంత్‌కి టెలిగ్రాం ఇచ్చి వేదాంత చర్చకోసం మరో పల్లెకువెళ్ళి అప్పుడే తిరిగొచ్చిన ఆ వృద్ధుడు ఒక ఋషిగా ధైర్యాన్ని చిక్కబెట్టుకోడానికి చాలా వ్యవధి కావలసి వచ్చింది.

ఆ తర్వాత....

కర్మకాండల్ని పూర్తిచేయడానికి ఏర్పాట్లు చేయడానికి పూనుకున్నారు.

అప్పటికే భాస్వంత్‌లో చలనం లేదు....

ఎందుకో ఆ శవాలనైనా జీవితకాలం అపురూపంగా దాచుకోవాలనిపిస్తూంది.

కాని అప్పటికే ఒక దావానలంలా వ్యాపించిపోయిందావార్త....

మరో అరగంటలో పోలీసులు రావడమూ శవాల్ని అటాప్సీ కోసం

తరలించడమూ జరుగుతుంటే యాంత్రికంగా చూస్తూ వుండిపోయా భాస్వంత్.

ఆ ఇంట ఒకేసారి మరణించిన వ్యక్తుల చావుకి హేతువైన పరి తుల్ని నిర్ధారించలేరు. పోస్ట్మార్టం చేసిన డాక్టర్లయినా.... కేవలం మర నికి కారణమైన విషాన్ని మాత్రం గుర్తించగలిగారు.

మూడుగంటల వ్యవధిలో శవాలని తిరిగి అప్పగించారు. అంత ప్రాచుర్యంగల వ్యక్తి రామానుజంగారు.

అంత్యక్రియలకి వూరంతా వెంట వచ్చింది.

తన ఉనికితో ఆ చిన్నపల్లెకి దేశపటంలో ఓ ప్రాముఖ్యతని కలిగి చిన రామానుజంగారి చివరియాత్రలో సహకరించాలని వూరి పెద్దలం ముందుకు రావడంతోపాటు ఘనమైన వీడ్కోలు కోసం గంధపు చెక్కల్ని ఏర్పాటు చేయబోయారు.

అదీ తిరస్కరించాడు భాస్వంత్.

ఆ తండ్రికి కొడుకే అతడు కూడా. బ్రతుకులోనే కాదు చావులో సైతం అభిమానం ప్రదర్శించగల ఒక స్వాభిమానికి పుట్టిన వ్యక్తిగా తనే గోతిని తవ్వాడు.

ఊరంతా విడ్డూరపడేట్లు చివరికి రామయ్య తాతే ఆశ్చర్యపడేట్లు మూడు శవాల్ని ఒకే సమాధిలోకి దించుతుంటే 'భాస్వంత్'ను వారించాడు రామయ్య తాత.

“నన్నాపకు తాత! ఒకే ఇంట కలిసి బ్రతికిన నా తల్లిదండ్రుల్ని వా కలయికకు ప్రతిరూపంగా ఈ నేలపై అడుగుపెట్టిన నా చెల్లెని ఇక్కడకూడా కలిపే సమాధి చేస్తాను. కలిసి బ్రతికిన వాళ్ళను కలుపుతూనే ఈ చివ మజిలీ పూర్తి చేస్తాను” ఒక స్వప్నంలోలా జవాబిచ్చాడు.

“కాని.... సాంప్రదాయాలు....” తాత మరేదో చెప్పబోతుంటే.

“వాటితో నాకు పనిలేదు తాతా” వాదించాడు ఒక ఉన్మాదిలా....

అదీ భాస్వంత్‌ను బాల్యంనుండి తెలిసిన రామయ్యతాత భయపడిన తొలిక్షణం....

ఒక బడబాగ్ని భాస్వంత్ శరీరాన్ని క్రమంగా స్వాధీనపరచుకుంటున్నట్లు అతడి కళ్ళు అగ్నిపూల్లా మెరుస్తున్నాయి.

వచ్చిన వాళ్ళంతా వెళ్ళిపోయారు.

సూర్యాస్తమయవేళవరకూ భాస్వంత్ ఒంటరిగానే శ్రమపడుతున్నాడు నిర్వికారంగా....

స్వేదంతో అతడి ఒళ్ళు తడిసిపోయింది.

ఆకాశంలా సూర్యుడు కక్కినరక్తం గడ్డకట్టినట్లు ఓ విశ్వజి మృత్యుగీతిని ఆలపిస్తున్న చివరి క్షణాన....

మట్టిని పూడ్చి సమాధిముందు మోకరిల్లిన భాస్వంత్ రాల్చిన ఆఖరి కన్నీటిబొట్టు ఇసుకలోపడి ఇంకిపోయింది.

అలా ఎంతసేపు మౌనంగా కూర్చున్నడో భాస్వంత్‌కు తెలీదు....

చీకటి ముసురుకుంటుంటే లాలనగా భాస్వంత్ భుజంపై చేతిని ఉంచాడు తాత.

భాస్వంత్‌లో చలనం లేదు....

“నాయనా భాస్వంత్” ఆధ్యాత్మికంగా అతని తల నిమిరాడు “మృత్యుః సర్వహరశ్చాహమ్.... అన్నింటినీ హరించే మృత్యువుని నేనే అన్నాడు భగవంతుడు. సృష్టి సంవిధానములో మృత్యువన్నది ఒక అధ్యాయమే తప్ప సంవిధానాన్ని భగ్నంచేసే ప్రక్రియ కాదు. నీ వాళ్లన్నదీ నీలోనే.... సముద్రంలో అలయి కలుసుకునేది విడిపోయేది సముద్రంలోనే.”

యుద్ధహోమంలో అకాల మృత్యువుకు బలైన హితుల్ని చూస్తూ మృత్యుమేఘం కమ్మివేసిన అర్జునుడ్ని ఓదార్చుతున్న నారాయణుడిలా ధైర్యాన్ని నూరిపోస్తున్నాడు తాత.

భాస్వంత్ తలపైకెత్తలేదింకా.

“కోవెలనీ కాటినీ ఒకే దృష్టితో చూడగలిగిన మనిషిని ఈ దుఃఖం ఓడించలేదునాయనా.”

“తాతా” భాస్వంత్ నెమ్మదిగా తలతిప్పి చూశాడు. “లోక సంగ్రహమ్ వాపి సంపస్యనే కర్తు మర్హపి అని కూడా అన్నాడు శ్రీకృష్ణుడు. అధర్మశక్తుల్ని అరికట్టి ధర్మాన్ని నిలబెట్టాలీ అని స్పష్టం చేశాడు కదూ....”

"అతడు దేవుడు...."

"కాని మనిషిని అదులేకపోయాడు."

రామయ్యతాత వెంటనే జవాబు చెప్పలేకపోయాడు.

భాస్వంత్‌తో జరుగుతున్న మానసిక సంగ్రామాన్ని ఎలా నివారించాలో ఆ జ్ఞానవృద్ధుడికి తోచడం లేదు.

"తాతా" రామయ్యతాత చేతినందుకున్నాడు. "నేను జ్ఞానిని కాదు.... సర్వాన్ని కోల్పోయిన వేళ క్షమ పేరిట నిర్వికల్ప సమాధిలోకి జారిపోయే పరిత్యాగిని అంతకన్నా కాదు.... అందుకే...." ఒక్క క్షణం ఆగేడు. "ఈ సమాధిపై ప్రమాణంచేసి నిన్నో నిజం చెప్పమంటున్నాను. ఎందుకు నాన్న ఇలాంటి అఘాయిత్యం చేశాడు. ఏ పరిస్థితులు మా కుటుంబాన్ని ఛిన్నాభిన్నం చేశాయి." ఆ మరుభూమిలోని నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ నెమ్మదిగానే అడిగాడు. ఈ ప్రశ్న రామయ్య ఊహించనిది కాదు....

కాని ఇంత తొందరగా అడుగుతాడనీ అదీ తననిలా ఓ ఇబ్బందికరమైన స్థితిలోకిలాగి నిలదీస్తాడని మాత్రం ఊహించలేదు.

"నాకు జవాబు కావాలి తాతా" మరోమారు రెట్టించాడు.

"బ్రతుకును తత్వ తహః లెక్కించిచూస్తే జమాఖర్చులతో పనిలేదు నాయనా: జీవితం వ్యాపారపు బజారు కాదు.... పరిపూర్ణత్వం వికసించే కోటి రేకుల కమలం.... ద్వంద్వం నుంచి తేరుకో.... పూర్ణం నుంచి పూర్ణాన్ని తీసినా మిగిలేది పూర్ణమే. సృష్టి జీవిత రహస్యాన్ని ఒక్క సూత్రంలో ఇముడ్చుకున్న మహాసూక్తి ఇది."

"తాత్వికమైన ఏకత్వంలో పరిపూర్ణత్వాన్ని జీర్ణించుకున్న విశ్వమానవుడ్ని కాను నేను. ఈ జీవితం ప్రపంచం ఒక పరిపూర్ణ అనంత సత్యపు నిరంతరావిష్కృతిలోని అంతర్భాగాలని తెలీని అజ్ఞానిని మాత్రమే."

"కాని...."

"నాకు వాస్తవం కావాలి తాతా. వేదాంతం కాదు." భాస్వంత్ ఎంత నిశితంగా చూశాడూ అంతే రామయ్యతాత అతడి చేతిలో బిగుసుకుంటున్న తన చేతిని వెనక్కి లాక్కోలేకపోయాడు...." విశ్వ ప్రకృతి వికాసంలో

అంతే....

ఆ తర్వాత చాలా వేగంగా చోటు చేసుకున్నాయి ఎన్నో అనర్థాలు. K2 కాంట్రాక్టరుగా కాక కోట్ల విలువచేసే ప్రభుత్వ కాంట్రాక్టుల్ని అంతవరకూ ఎన్నో సవ్యంగా చేయించగల్గిన బంగార్రాజు ఇబ్బందిలో కూరుకుపోయాడు"

నిర్మాణం పూర్తవుతున్నకొద్దీ వాయిదాలుగా ప్రభుత్వం నుంచి డబ్బును పొందుతున్నా పని పూర్తయ్యేక ఆరునెలలపాటు ఎర్నెస్టుమనీ డిపాజిట్‌తోపాటు పది శాతం వరకూ ప్రభుత్వం సెక్యూరిటీగా తనతోనే వుంచుకోవడం సాంప్రదాయం.

అయితే ఇప్పుడు జరిగింది చాలా అనూహ్యమైన సంఘటన. అప్పటికే మామూళ్ళ రూపంతో ఎంతో ఖర్చుచేసేసాడు బంగార్రాజు. ఇంకా చాలా మొత్తంలో ప్రభుత్వం నుంచి డబ్బు రావాల్సి ఉంది. అది చెల్లించబడదు సరికదా కాంట్రాక్టరు స్వంత పెట్టుబడితో మొత్తం నిర్మాణం జరపాలి. ఒకవేళ ప్రభుత్వమిచ్చిన డిజైన్ లోపముంటే బాధ్యత ప్రభుత్వానిదే అయ్యుండేది. కాని ఇప్పుడు నిర్మాణ లోపంగానే నిర్ధారింపబడింది.

ఈ బ్యూరోక్రటిక్ వ్యవస్థలో ఇలాగే నిర్ధారించడమన్నది ప్రభుత్వానికో సమస్యకాదు.

మామూలు కాంట్రాక్టు అయితే బంగార్రాజు తనకున్న పలుకుబడితో గండంనుంచి సునాయాసంగానే గట్టెక్కేవాడే. కాని ఇది కోట్ల ఖరీదుచేసే పెద్ద కాంట్రాక్టిది. రేపోమాపో ప్రారంభోత్సవం కావాల్సిన ఈ కూలిన బ్రిడ్జి విషయంలో మంత్రులుగాని మామూళ్ళతో అంతవరకూ తనకు సహకరించిన ఇంజనీర్లుగాని రిస్కు తీసుకోలేని క్లిష్ట పరిస్థితి అది.

ఇప్పటికే జరగబోయేది కాంట్రాక్టరు ఆస్తుల్ని ప్రభుత్వపరం చేసుకోవడం మరో కాంట్రాక్టరుకు బ్రిడ్జి నిర్మాణ కార్యక్రమాన్ని అప్పచెప్పడమూను.

ఇందులో లావాదేవీలుగాని అనినీతికి సరైన నిర్వచనం గాని

తెలీని స్లీపింగ్ పార్టనర్ మాత్రమే అయినా రామానుజంగారు ఇది విని అవాక్కయిపోతే....

ఒడుపు తెలిసిన బంగార్రాజు జరగబోయేది త్వరగా ఊహించగలగడంతో ఆస్తినంతా తన కూతురి పేరిట రాసి చాలా స్వల్ప వ్యవధిలో ఇన్‌సాల్వెన్సీ పిటిషన్ ఏక్ట ప్రకారం తనను తాను రక్షించుకోగలిగాడు.

ఇక ఆహుతైంది రామానుజం మాత్రమే. సర్వాన్నీ కోల్పోయి కట్టుబట్టలతో వీధిన పడ్డారాయన.

ఆయనకి తెలిసిన నీతిశాస్త్రంలో కూడికలే తప్ప గణిత శాస్త్రంలోలా తీసివేతలు భాగహారాలు లేవు.

తాత చెప్పిందంతా విన్నాడు మౌనంగానే.

అప్పుడు అర్థమైంది. తండ్రికి అంతటి ఆత్మీయుడైన బంగార్రాజు కనీసం అంత్యక్రియలకు సైతం ఎందుకు రానిదీ.

“కేవలం స్నేహం మూలంగా వ్యాపారంలో అడుగుపెట్టిన మీ నాన్న స్నేహాన్ని వ్యాపారంగా మార్చుకున్న ఆ బంగార్రాజు నీచబుద్ధికి బలయ్యాడు బాబూ”

“తాతా” విస్లిష్టంగా పిలిచాడు. “తప్పు బంగార్రాజుదెలా అవుతుంది. అంకెల గారడీతప్ప మనుషుల గారడీ తెలీని నాన్నది తప్పు.... నాన్న లెక్కల్లో నిష్ణాతుడు మాత్రమే తాతా....లౌక్యంలో కాదు.... అందుకే....” ఆ వాక్యాన్ని అతడు పూర్తిచేయలేదు.

తాత చూస్తుండగానే భాస్వంత్ నెమ్మదిగా లేచాడు.

వారించబోతుండగానే వేగంగా అడుగులు వేస్తూ ముందుకు సాగిపోయాడు.

ఎక్కడికి వెళుతున్నాడు....ఆందోళనగా చూస్తున్న తాతకి భాస్వంత్ అన్నమాటలు వినిపించాయి మరోమారు.

“ధర్మం వేపే నిలబడతాను తాతా! ఒకవేళ నిజం నన్ను రాక్షసంగా కదిలించినా రాక్షసుడిలా ప్రవర్తించనని ప్రమాణం చేస్తున్నాను.”

* * * *

తూలి పడబోయిన నిశాంత ‘అతడు’ చేతిని వదిలిపెట్టగానే నిలదొక్కుకుంది. ఆవేశంగా బయటకి నడిచి నిర్మానుష్యంగా ఉన్న సందును చూసి మరో రెండు నిముషాల్లో వెనక్కివచ్చాడు.

“తరుముకొచ్చింది పోలీసులా” అడిగాడు నిషాగానే అర్థంకాలేదామెకు....

“ఒకవేళ ఈ సమయంలో నువ్వు పోలీసులచేతికే చిక్కుంటే ఏ గూండాకూడా నిన్ను కాపాడలేకపోయేవాడు....”

అంత భయంలోకూడా నివ్వెరపోతూ వింటూంది. అతడన్న మాటలు అస్సలు బోధపడటం లేదు.

“గూండాలకీ కొన్ని నైతిక సూత్రాలుంటాయి. ఈ దేశంలో ఒక నీతి అంటూలేని జాతి పోలీసులదొక్కటే” ముందుకు నడిచి ‘ఇలారా’ అన్నట్లు సౌంజ్ఞచేశాడు. ఆమె నడిచింది.

అతడు ఇందాకటి స్థానంలోనే కూచుని నవారు మంచానికి సమీపంలో నిలబడ్డ నిశాంతను చూస్తూ నాపేరు నాగరాజు. నేనొక కాంట్రాక్టుని ఇళ్ళు కట్టను. డబ్బులు తీసుకొని ఒళ్లు హూనం చేస్తుంటాను. కాళ్ల విరిచేయడానికింత చర్మం వలిచేయడానికింత అని ఒక రేటు తీసుకొని కాంట్రాక్టు ప్రకారం కార్యక్రమాలు నిర్వహిస్తుంటాను. అసలు నువ్వు....” యథాలాపంగా ఆమెను అడగబోతూ చూసాడు.

తోటలో గీరుకున్న ముళ్ళమూలంగా ఆమె పాదాలు రక్తాన్ని చిమ్ముతుంటే “అయ్యో....పిచ్చిపిల్లా....ఇదంతా ఏంటి” అంటూ దూది అయొడిన్ తీసుకువచ్చాడు....ఆమె వారించే అవకాశం ఇవ్వకుండానే బలవంతంగా నవారుమంచంపై కూర్చోబెట్టి కాటన్‌తో గాయాలు శుభ్రంచేస్తుండే ముందుగా అతడికి పిడికిలిపై రెండు నీటిబొట్లు రాలాయి. తర్వాత ఆమె వెక్కిళ్ళు వినిపించాయి.

“ఛ ఛ....ఆ ఏడుపంటేనే నాకు అసహ్యం” మందలింపుగా చూసేడు. కాదు ఒక అన్నలా శాసించాడు....” మనిషికి మొదటి శత్రువు ఈ నిస్సహాయతేనమ్మా....కనిపించదు....శత్రువులా మీద కలియబడదు.

కాని కబళిస్తుంది. క్రమంగా నాశనం చేస్తుంది" ఎందుకో అతడి గొంత ఆర్ద్రమైంది.

మరికొన్ని క్షణాల్లో ఆమె ముందు ఓ కేరియర్ ఉంచాడు. "మం బిగిస్తే తప్ప తిండి ముట్టనమ్మా! అందుకే ఇంకా నిండుగానే వుంది తిను" ఆమె ముందు పరిచాడు ఓ అన్నలా....

క్షణం భయం మరుక్షణం ఆత్మీయత. దుఃఖం ఆమెను నిలువు పిండిపేస్తుంటే మారు మాటాడకుండా అతడి సమీపంలో కూచుంది. సిగ్గ విడిచి ఆబగా తింటుంటే అతడి మనసు ద్రవించినట్లు రెప్పలార్పకుం అలాగే చూస్తూ వుండిపోయాడు.

ఎడారిలాంటి ప్రయాణంలో మరో ఒయాసిస్సులాంటి ఆ చిన్న మజిలీలో ఆమె ఎంతటి ప్రశాంతతను పొందగలిగిందీ అంటే కానలకేగి సీతమ్మ వాల్మీకికి తన కథను వినిపించినట్లు అడక్కుండానే అంతా చెప్పింది. చెబుతూనే నిద్రలోకి జారిపోయింది.

అదీ కొంత సేపే....

మాగన్నుగా నిద్రపోతున్న నాగరాజు ఏదో చప్పుడు కావడంతో నెమ్మదిగా కళ్ళు తెరిచాడు.

బయట తలుపులు బాదుతున్నారెవరో....

అప్పటికే నిద్రలేచిన నిశాంత నడవబోతున్న అతడ్ని ఉలికిపాటుతో వారించబోయింది. ఆ క్షణంలో తనను కొన్ని క్షణాలక్రితం వర వెంటాడిన ముఠాయే గుర్తుకు వచ్చింది.

ప్రమాదాలు అతనికి కొత్త కాదన్నట్లు మృదువుగా ఆమె చేయి విడిపించుకొనివెళ్ళి తలుపులు తెరిచాడు. గూండాలు కాదు....ఎదురుగా పోలీసులు....

రెప్పపాటులో లోపలికి దూసుకొచ్చారు.

"ఎవర్తది" నిశాంతను చూడగానే ఇన్స్‌పెక్టర్ నోటినుంచి వెల వడిన తొలి ప్రశ్నది. సీత శీలాన్నైనా శంకించగల సమర్థుడిలా కనిపించిన అతడ్ని చూడగానే భయంగా ఒక్క అడుగు వెనక్కి వేసింది నిశాంత.

"ఎక్కడ్నుంచి లేపుకొచ్చావు నాగరాజా" ఆ వ్యంగ్యతకి ఉద్రేకంగా నాగరాజు పిడికిళ్ళు బిగుసుకున్నాయి....

అయినా తమాయించుకున్నాడు. "ఇన్స్‌పెక్టర్....నేను నేరాలుచేసే నేరస్థుడన్నమాట నిజమేగానీ ఈమె నాకు ఒక చెల్లిలాంటిది తప్ప...."

"చాలు" హుంకరించిన ఎస్సై ఆమెను సమీపించబోతుంటే అడ్డు వచ్చాడు నాగరాజు. "అసలామె ఎవరనుకున్నారు"

ఎవరన్నదీ విడమర్చి చెప్పబోయిన నాగరాజు తన గురించి ఏమీ చెప్పవద్దన ఒక అర్థింపు ఆమె కళ్ళల్లో ద్యోతకంగానే బాధగానే నోరు నొక్కుకున్నాడు.

ఒక క్రిమినల్‌గా పోలీసు బలగమంటే నాగరాజుకి భయంలేదు.... కాని తొలిసారిగా భయపడ్డాడు. పోలీసుల్ని చూసికాదు. ఒక నిర్భాగ్యురాలి బ్రతుకు నవ్వులపాలవుతున్నందుకు.

తాడో పేడో తేల్చుకునైనా ఆమెను కాపాడాలన్నంత ఉద్వేగంతో తిరగబడాలనుకుంటున్న సమయంలో అప్పుడందామె. "అన్నయ్యా! జరగాల్సిందంతా ఏనాడో జరిగిపోయింది. అదే నాకు తెలియకుండానే. ఇంకా ఏం మిగిలిందని బాధపడాలి" ఇక్కడ కాకపోయినా ఎక్కడో ఒక చోట తను చెడిన ఆడది. అనవసరమైన రాద్ధాంతంతో తను ఎవరన్నదీ ఎందుకిలా వచ్చిందీ తెలియపరిచిన నాకు మరింత అల్లరిపాలు కావడంతప్ప ప్రయోజనం లేదు.

తాడిచెట్టుకింద కూర్చుని పాలుతాగుతున్న వ్యక్తి తను. తప్పు తాడిచెట్టుది కాకపోయినా శిక్ష తప్పదు.

ఆ నిశ్శబ్ద నీరవ నిశీధిలో ఊహించని మరో మలుపు తిరిగిన తన కథకు గమ్యమేమిటో తెలీని ఓ ప్రయాణికురాలిలా పోలీసుల వెంట నడిచింది.

* * * *

"హాయ్! వాట్ ఎ సర్‌ప్రైజ్" అడుగుపెడితేనే చాలు మాసిపో తుందనిపించే కార్పెట్‌పై పాదాన్నుంచి ద్వారం దాటిన భాస్వంత్ ఆగిపోయాడు....

విశాలమైన ఆ భవంతి బంగార్రాజుదైతే అలా అతడ్ని సమ్మోహనంగా పలకరించింది రజని....బంగార్రాజు ఏకైక పుత్రికారత్నం.

వయసుకుమించి పెరిగిన పొంకాన్ని చాలా ఇరుగ్గా దాచాలని ప్రయత్నిస్తూ మేక్సీలో సెక్సీగా చూస్తూంది. "ఇన్ని ఉత్తరాలు రాసినా జవాబు ఇవ్వనివాడిని ఇంత హఠాత్తుగా ప్రత్యక్షమయ్యావూ అంటే" హాల్లో నిలబడి చికెన్ ప్రెసిడెన్సీతో పెరిగిన శరీరంలోని ఫేట్ పోటెక్కిన సముద్రరలా ఉన్మాదంలో ముంచుతుంటే రొప్పుతూ చూసింది.

అది ఆరాధనో, మోహమో ఆమెకు తెలీదు. కాని ఆమెకు వూహ తెలిసిన నాటినుంచీ అతనే ఆమె కలల రాకుమారుడు. కాబట్టి భాస్వంత్‌ను చూసినప్పుడల్లా తండ్రి క్వారీలోని ఒక కొండరాతిలా తన ఒంటిని వూహించుకొని భాస్వంత్‌ను మాత్రం తనను నుగ్గుచేసే డిటనేటరైతే బాగుండ్నని ఆలోచించడం అలవాటు చేసుకొంది. అందుకే తన కోర్కెని పచ్చిగా వ్యక్తం చేయడానికి ఆమె ఏనాడూ వెనుకాడలేదు.

భాస్వంత్ ఆమె స్థితిని గమనించే పరిస్థితిలో లేడు.

"మీ నాన్నగారున్నారా"

"ముందు నా ప్రశ్నకు జవాబు చెప్పు....బాంబే ఇన్ని ఉత్తరాలు రాసాక....ఒక్కదానికీ జవాబివ్వలేదేం"

"మీ నాన్నగారెక్కడ" నిర్లిప్తంగా అడిగాడు మరోమారు....

"లేరు...." నిగ్రహించుకుంటూ చూసింది చుట్టూ. నౌకర్లు అంతా ఎవరి పనిలో వాళ్ల నిమగ్నమై ఉన్నారు. "ఎనీహా! సారీ భాస్వంత్....చాలా అనర్థం జరిగిందటగా" చాలా కృత్రిమంగా సానుభూతిని ప్రకటించింది."

"మీ నాన్నగారెప్పుడొస్తారు"

"అబ్బా....ఏంటీ ఒకటే ప్రశ్న.... ఏం నేనెలా వున్నానో అడిగితే నీ ముల్లేం పోయింది"

భావరహితంగా చూసాడామెను "రజనీ? ఒక్క ప్రశ్నకు జవాబు చెబుతావా?"

అదే ఆమెకా క్షణంలో ఓ పెద్ద వరమైంది. మౌనంతోనే ఏళ్ళ

తరబడి తనను పిచ్చిదాన్ని చేసిన భాస్వంత్ ఇప్పుడేదో ప్రశ్న అడుగుతుంటే అదే ఆమెలోని మరో ప్రశ్నకు జవాబులా అనిపించింది.

"అడుగు భాస్వంత్" రెండడుగులు ముందుకేసి, "కాని ఇక్కడ కాదు. ఇలారా ఠీవిగా మెల్లెక్కుతూ తన గదిలోకి దారితీసింది.

భాస్వంత్ మరేదీ ఆలోచించే స్థితిలోలేడు. రాణివాసంలో అసూర్యంపశ్యలా బ్రతికే ఓ యువరాణి ఆదేశానికి బద్ధుడైన సైనికుడిలా ఆమెను అనుసరించాడు."

డబ్బున్నవాడి అహానికి ప్రతీకలా గదినిండా ఖరీదైన అలంకరణ.

"ప్రాణ స్నేహితుడిలాంటి మీనాన్న నా తండ్రికెందుకు అన్యాయం చేసాడు" మామూలుగా అడిగాడు.

"ముందలా కూర్చో"

భాస్వంత్ కూర్చోటానికి రాలేదు. "నాకు జవాబు కావాలి రజనీ....అమాయకుడైన మా నాన్నపై ఎందుకిలా పగ సాధించాడు"

దురదృష్టవశాత్తూ అతడి ప్రశ్నలకి జవాబు చెప్పే స్థితిలో లేదు ఆమె కూడా. ఎన్నడూ దొరకని ఏకాంతం లభించింది. దాన్ని క్యాష్ చేసుకోవాలనుకుంటూంది.

ఒక విటుడ్ని రహస్యంగా గదిలోకి రప్పించుకున్నట్లు దీర్ఘంగా నిశ్వసిస్తూ 'కూర్చోమంటుంటే' డిస్టెంపర్ గోడకి ఆనుకుని వున్న ఫోమ్ బెడ్‌ను చూపించింది.

ఎందుకో ఆమె కళ్ళల్లోకి చూసే శక్తిలేనట్టు తలకాస్త పక్కకు తిప్పాడు.

గోడలపై అందమైన ఆయిల్ పెయింట్స్.

"బాగున్నాయా"

మేక్సీ జిప్‌లాగి అతడి కళ్ళల్లోకి చూస్తూ అడిగింది. ఆ ద్వంద్వం అర్థంకాని అమాయకుడుకాడతడు" నేను వచ్చింది జవాబు తెలుసుకోడానికి రజనీ"

"చెబుతాను.... ముందు నా ప్రశ్నకు నువ్వు జవాబివికా"

ఉద్దేశ్యం కాదు శ్లేష పునరావృతమైంది.

కొన్ని క్షణాల క్రితమే తన వాళ్ళనందర్నీ మట్టిలో కలిపి అక్కడకు వచ్చిన భాస్వంత్ తను మిన్నాగుల కేజ్‌లో అడుగుపెట్టినట్లు వూహిం స్థితిలో లేడు.

"వ్యాపారంలోకి భాగస్వామిగా రప్పించుకుని లాభాన్ని పంచుకో నికి సిద్ధపడ్డ మీనాన్న నష్టాన్ని మాత్రం నా తకద్రిపైనే ఎందుకు రుద్దాడు" రెప్పలార్పకుండా నేలపైకి చూస్తూనే అడిగాడు.

"ఆ కష్టం సంగతి మర్చిపో భానూ! నాకు భాగస్వామివైతే నీ కోరినంత లాభాన్ని నేనందిస్తాను" త్రాచుబుసలా వినిపించిందామె కంఠం.

సూదిమొన మోపితే వినబడేటంత నిశ్శబ్దం ఆ గదిలో.

"నేను నీతో వ్యాపారం చేయడానికి రాలేదు రజనీ" మళ్ళీ యధాలాపంగానే అన్నాడు.

క్షణాలు గంటల్లా గడుస్తున్నాయి.

"ఇది వ్యాపారమో వ్యవహారమో.... పేరుతో పనేంటి భాస్వంత్" సెగలు చిమ్మేవల్కనోగా మారిన రజని మరింత దగ్గరగా వచ్చింది "రా! ఈ ఆస్తిని నా సంపదని నీ సొంతం చేసుకుని...." గొణుగుతూ ఇంకా చేరువైంది.

అతడి గుండె సవ్వడి అతడికే స్పష్టంగా వినిపిస్తూంది. నెమ్మదిగా చాలా నెమ్మదిగా తలపైకెత్తాడు త్యాగి.

అంతే....

ఉలికిపాటుగా ఒక్క అడుగు వెనక్కి వేసాడు.

పెటేలమన్న గుండెగుడితో ఘనభోమండలాన్ని ఏకంచేసే ప్రళయ ఝుంకార జేనింటల మ్రోత....కృశానువు వధ్య శిలపైకి ఈడ్చి కృపాణాల తాకిడిలో మెదడును ముక్కలుచేసి కాల్చుకు తింటున్న భవం....అనుభవం.

శతఘ్నుల్ని మించిన గురితో నగ్నంగా నవుతున్న యవయవ్వన సంపద.

టాన్స్.... భావాతీతధ్యానం.... క్షణాల రాపిడిలో నెమ్మదించిన ఉద్విగ్నత....

ఏడ్చే పసికందు నోటికందించి ఆకలిని తీర్చగల మా మెయన్ గ్లాండ్స్. అమ్మ కడుపులో ఇంకా పూర్తిగా ఆకృతిని సంతరించుకోని కపల్లాంటి మాంసపుముద్దలు....

నిర్వికల్ప సమాధిలోకి జారిన జ్ఞానిలా శుష్కమైన చిరునవ్వు అతడి పెదవులపై అతడి నేత్రాలు అరమోడ్పులౌతున్నాయి" నిన్ను కట్టుకున్నవాడికీ నీ కడుపున పుట్టినవాడికి మాత్రమే పరిమితం కావాల్సిన ఆ సంపద నా కెందుకు రజనీ."

అతడి వాక్యమింకా పూర్తికాలేదు. ఆమె ఎప్పుడు గడియ పెట్టిందో మరెప్పుడు అతడ్ని సమీపించింధో రెప్పపాటులో అతడ్ని పెనవేసుకుపోయింది గండిపడిన గోదారిలా ఊపిరాడనివ్వని ఉప్పెనలా....

ఊర్పులు.... వేడిసెగలు అతడి చెంపల్ని కాల్చేస్తున్నాయి.

చేతివేళ్ళను కుంచెగామార్చి అతని శరీరపు ఆకృతికి రంగుల్ని అద్దుతున్నట్లు స్పృశిస్తూందామె.

అచంచలమైన అతడి నిగ్రహానికి ఆమె మరింత బుసకొడుతూ సన్నని మూలుగులతో ఓ కొండచిలువలా అతడ్ని చుట్టేసింది.

సరిగ్గా అప్పుడు....ఏదో చప్పుడు....అది వినిపించింది భాస్వంత్‌కు మాత్రమే....

"రజనీ" తలుపులు బాదుతున్న బంగార్రాజు బయటనుంచి గావుకేకలు పెడుతున్నాడు.

5

అప్పటికిగానీ రజనీ వాస్తవంలోకి రాలేదు....

రేపురావాల్సిన డాడీ వూరునుంచి అంత అర్జెంటుగా ఎలా తిరిగి వచ్చాడో ఆమెకు అర్థంకాలేదు.

శరీరమంతా స్వేదంతో తడిసిపోతుంటే చాలావేగంగా ఆలోచిస్తూంది....

తల్లిలేని ఆమెను తండ్రి ఏంత అపురూపంగా పెంచిందీ ఆక్షణంలో గుర్తుకొచ్చి ఆమెలో అనూహ్యమైన కలవరాన్ని రేపింది....

అంతే....

ఏదో నిర్ణయించుకున్న రజని వెంటనె చేతికందిన చీర నొకదాన్ని నొకదాన్ని ఒంటికి చుట్టేసుకుంది.

క్రమక్రమంగా గొంతు తీవ్రతని పుంజుకుంటున్న తండ్రి పిలుపుకు బదులిస్తూ అమాంతం పరుగున వెళ్ళి తలుపు తీసింది.

ఏం జరుగుతున్నదీ బంగార్రాజు వూహించేలోగానే....

"డాడి" అంటూ తండ్రిని కావిలించుకుని పసిపిల్లలా ఏడ్చేసింది.

ఆ ఏడుపులో సమయానికి నువ్వు రాకపోతే నేనేమయ్యేదాన్నన్న భీతి ఈ రాక్షసుడు నామీద ఏంతటి అఘాయిత్యానికి సిద్ధపడ్డాడో చూడు అన్న నిస్సహాయత....

భాషతో కొంత, భావంతో మరికొంత కూతురు చెప్పింది. విన్న బంగార్రాజు పశువుగా మారిపోయాడు.

సరిగ్గా ఇక్కడే ఒక ఉన్నవాడి అహం కాళింగనాగులా బుస కొట్టింది....

భాస్వంత్ తేరుకునేలోగానే అతడి ఒంటిపై ఛెళ్‌మంటూ ఓ హంటర్ దెబ్బ తగిలింది....

నిన్న మొన్నటి వరకూ చాలా సుకుమారంగా పెరిగిన దేహంముందు తట్టుకోలేనట్టు కొద్దిగా వణికింది.

మరోదెబ్బ....

భాస్వంత్ పిడికిళ్ళు బిగుసుకున్నాయి.

ఒక్క క్షణం ఆ క్షణంలో వెయ్యోవంతు భాస్వంత్ తనను తానే మరచివుంటే తాతకిచ్చిన మాటా మరిచిపోయేవాడు.... తండ్రి సమాధిపై చేతినుంచి చేసిన ప్రమాణాన్ని మరచి ఓ హత్యను చాలా సునాయాసంగా చేయగలిగేవాడు.

కానీ ఇంకా మరిచిపోలేదు.

అందుకే.... రాక్షసంగా ప్రవర్తిస్తున్న హంటర్ విన్యాసానికి అతని శరీరం సైతం ప్రకంపించడం మానేసింది.

ఎన్ని నరాలు చిట్లుతున్నాయో, ఎంత రక్తం చిమ్ముతుందో చూడకుండా చాలా పాశవికంగా హింసిస్తున్నాడు బంగార్రాజు.

ఆ సమయంలో అతడనుభవిస్తున్న హింసాకాండలో అతిసహజంగా పెదవును దాటి రావాల్సిన 'అమ్మా' అన్న పదం సైతం గొంతులోనే సమాధికాగా నేత్రాల్లో మాత్రం మండుతున్న రక్తపుజీరలు అస్తవ్యస్తంగా పేరుకుంటున్నాయి.

బంగార్రాజు అలిసిపోతూ కూడా ఆగకుండా ఇంకా పైశాచికంగా కొడుతూనేవున్నాడు....

ఈ సంధి కాలంలోనే భాస్వంత్ వ్రయ్యలౌతున్న శరీరం నుంచి విడిపోయి మనసుతో ఆలోచిస్తున్నాడు.

"బంగార్రాజూ! నువ్వు ఓ మామూలు మనిషివైనా ఈ క్షణాన ఇంత బలవంతుడివి కావడానికి కారణం నీకున్న అహం అని తెలుసు ... ఆ అహానికి కారణం నీకున్న పరపతి అనీ తెలుసు.... ఆ పరపతిచ్చింది నీకున్న డబ్బనీ తెలుసు....కానీ నాకింతవరకూ తెలీనిదొక్కటే....డబ్బుతో ఏర్పడిన ఈ దర్పం ధర్మాధర్మ విచక్షణ సైతం మరపించగలదని నిర్దోషిని సైతం దోషిగా మార్చి నా తండ్రిలాంటి దేవుళ్ళను ఆహుతి చేయగలదని, డబ్బుని, ఆ డబ్బుని సృష్టించిన మనిషిని పుట్టించిన దేవుడుకూడా ఈమారణాస్త్రం ముందు నిరాయుధుడిలా తలవంచగలదనీ ఇప్పుడే.... సరిగ్గా ఇక్కడే తెలుసుకున్నాను.... అందుకే.... యీ క్షణాన నీమీద కసితో తిరుగుబాటు చేయలేకపోతున్నాను. కానీ ఏ తప్పుచేయని నన్ను హింసిస్తూ కూడా నీ కళ్ళల్లో మెరుస్తున్న రాక్షసానందాన్ని మాత్రం చాలా ఏకాగ్రతగా గమనిస్తున్నాను.... చూడ ముచ్చటగా వుంది బంగార్రాజూ! కసి అంటూ పెంచుకుంటే నీమీదకాక నీకింత అండనిచ్చిన ఆ డబ్బుపై ఉధృతంగా పెంచుకొని నా జీవితం ఫణంగా పెట్టయినా నీలాంటి వాళ్ళనెందర్నో

ఉత్పత్తి చేయగలిగిన దానితోనే ఒక మహా సంగ్రామానికి సిద్ధపడాలనుంది ఇలాంటి చోటకూడా మౌనాన్ని ఆశ్రయించిన ఆ దేవుడిని నిలదీసి అత ఉనికినే ప్రశ్నించాలనుంది.”

భాస్వంత్ మనసులో ఓ మహాయజ్ఞానికి అంకురం ఏర్పడుతున్న క్షణాలవి....

బంగార్రాజు రొప్పుతున్నాడు కొడుతూనే—

అప్పటికే భాస్వంత్ శరీరం పూర్తిగా రక్తసిక్తమై పోయింది....

స్పృహ తప్పుతున్నట్టుగా వుంది— కాదు నిస్పృహలోంచి మరో కొత్తభాస్వంత్ జన్మిస్తున్నట్లు అనిపిస్తూంది....

ఆ పైశాచిక కరాళనృత్యాన్ని చాలా స్పష్టమైన ఒక లక్ష్యాని అంకురంగా ఒక మానసిక వ్యాయామంగా భావిస్తూ....

వేలును గురుదక్షిణగా ఇచ్చుకున్న ఏకలవ్యుడ్ని, కంటిముక్కంటికి భక్తితో అర్పించిన కన్నప్పని, పేవున్ని వీణతంత్రులుగా మార్చుకుని పరమాత్ముడ్ని రమింపజేసిన రావణుడ్ని గుర్తుతెచ్చుకుంటూ రేపటి గమ్యానికి ఇది ఈనాడే సమర్పించుకుంటున్న నైవేద్యంగా అనుకుంటున్నాడు.

బంగార్రాజు అలసటగా ఆగిపోయాడు....

విచిత్రమైన స్తబ్దత ఆవరించిందా గదిలో—

కాళ్ళ సైతం కదిపే సత్తువని కోల్పోయాడు భాస్వంత్.

అయినా బయటికి నడుస్తూ రెప్పలు భారంగా వాలిపోతున్నా రజనీని చూశాడు చాలా మామూలుగా.

టాలమీని చంపి సీజర్ని చేబట్టి చివరికి అతడి హత్యకుకారణమైన క్లియోపాత్రాలా, అనుభవం కోసం మగాడ్ని గదిలోకి రప్పించుకుని తర్వాత అతడ్ని అంతంచేసి రాక్షసానందాన్ని పొందిన రోషనారలా అనిపించలేదు·

డబ్బుకున్న బలమేమిటో తనకు రుజువు చేయడానికి దేవుడు పంపిన ఓ గంధర్వకన్యలా కనిపించింది·

ఆ నిశీధివేళ భవంతిని దాటుతూ ఒక్కమారు వెనక్కి చూశాడు.

అక్కడ....తన జాతి మనుషులు తనలాగే నిస్సహాయులైన/ నౌకర్ల

జాలితో చూస్తున్నారు నిజం తెలిసినా పెదవికి చేటు తెచ్చుకునే ప్రమాదానికి సిద్ధపడలేక....

* * *

దభేలున తెరుచుకున్నాయి గుడితలుపులు....

నిశ్శబ్దంగా వున్న ఆ నిశిరాత్రి వేళ....

అప్పుడే అమ్మ కడుపులోనుంచి భూమిపై అడుగుపెట్టిన ఒక ప్రాణిలా కవోష్ణ రుధిరధారలు కారుతుండగా అక్కడ అడుగుపెట్టాడు భాస్వంత్.

రాముడి పాదాలముందు వెలుగుతున్న దీపం ఒక ప్రళయ ఝంఝా మారుతమే గుడిలోకి ప్రవేశించినట్టు పటపటా వణికింది.

కొన్ని గంటల క్రితం అర్చనలతో నిండిన ధూపసుగంధం దీప నిర్వాణ గంధంలా అనిపిస్తూంటే.... “దే....వు....డూ....” ఉక్రోషంగా అరిచాడు భాస్వంత్.

విష్ణువు ఉనికికోసం ముల్లోకాలు వెతుకుతున్న హిరణ్యకశిపుడిలా ఘనాఘన ఘీంకార జీవార్ష జడధిలా తూలుతూ బలాన్ని కూడగట్టుకుంటూ ఒక్కో అడుగు ముందుకేస్తున్నాడు....

లోకంతో నాకేం పనన్నట్టు సహధర్మచారిణియైన సీతను పక్కనుంచుకొని నిశ్చల గంభీర ముద్రతో నిలబడివున్న రాముడ్ని చూస్తుంటే రోషాగ్నికీలలు అతడి నేత్రాలనుంచి రాలుతున్నాయి....

శోభిత ఖచభరమైన దుఃఖం జర్జరిత విద్వధనమై ఉబికివస్తుంటే మెల్లిగా మెలమెల్లగా నడిచి నడిచి ఆసరగా జేగంట నందుకున్నాడు....

మరుక్షణం ఒక ఉన్మాదిలా గంట అంచును వ్రేళ్ళతో పట్టుకుని....

“ఏష సర్వేశ్వర ఏష సర్వజ్ఞ ఏషోన్తర్యా
మ్యేషయోనిః సర్వస్య ప్రభవా ప్యయోహిభూతానాం”

నువ్వే సర్వేస్వరుడివి నువ్వే సర్వజ్ఞుడివి. నువ్వే సర్వాంతర్యామివి. నీ నుండే సమస్తమూ ఉద్భవిస్తే ఈ దారుణ మారణ కాండలన్నిటికీ కారణం నువ్వే కదూ....

ఉప్పెనలా ఉబికి వస్తున్న ఉద్వేగంతో గంటను మరింత క్రోధంతో ఊపగానే లోహపు లోలకం తాకిడికి అతని వ్రేళ్ల చిట్లి రక్తం బొట్లుగా నేలపై చిమ్ముతూంది....

“భోగార్థం సృష్టిరిత్యాన్యే క్రీడార్థమితి చాపరే
దేవస్యైష్య స్వభావో యమాప్తకామస్య కాస్పృహా”

ఓ భోగార్థమూ ఈ జగత్తు సృష్టింపబడినదన్న సత్యమే నిజమైతే, నీ వీలా వినోదం కోసమే ఈ సృష్టి జరిగితే నీ బిడ్డల్నే పావులుగా చేసుకుని పరహసించడం నీకే చెల్లింది కదూ....

జేగంట మ్రోతతో నీరవనిశీధి ఉనికి పడుతుంటగా నుగ్గవుతున్న చేతి వ్రేళ్ళ బాధను పంటిబిగువున అదిమి పెట్టుకుని మరింత ఉక్రోషంగా గంటను కదిలిస్తున్నాడు.

“న భవత్యమృతం మత్యం నమర్త్యమమృతంతథా
ప్రకృతే రన్యథా భావోనకథం చిద్భవిష్యతి”

అమృతత్వానికి మర్త్యత్వంగాని, మృత్యువుకి జీవరంగాని సాధ్యం కానప్పుడు సహజ ప్రకృతిని మార్చుకోవటం దేనికైనా అసంభవమైనప్పుడు నాయీ ప్రస్తుత స్థితిని అంగీకరించడమూ నీ బాధ్యతే అవుతుంది....

పిచ్చివాడిలా పూనకం వచ్చినట్టు చేగంటల సవ్వడితో గుండె మంటలార్చుకునే విహ్వలత్వంతో అరచేతిని నజ్జుగా మార్చుకుని అలసటగా నడిచి నేలపై పేరుకున్న రక్తంలోనుంచి నడుచుకుంటూ ముందుకు నడిచాడు.... నిస్త్రాణతో తూలి పడబోయి రాముడి బుజాలపై ఆసరాగా చేతినుంచాడు....

“దేవుడూ....” నూతిలోనుంచి వినిపిస్తున్నట్లు నీరసంగా పలికిందతడి కంఠం. “మనిషి ఇలా నీ ఆసరా కోసం నీపై ఆధారపడతాడన్న నమ్మకమే కదూ నిన్ను దేవుడిగా మార్చింది....కాని....” గాద్గదికంగా ఆగిపోయాడు క్షణం....“ఇప్పుడిలా నీపై చేతులుంచి ఆసరా తీసుకున్నది ఇక ముందు నీ అండతో నాకు పనిలేదని చెప్పడానికే” అతడ్ని నిలువునా కుదిపేసే వైరాగ్యంలోనుంచి పుట్టుకొచ్చిన ఆయాసమో ఆవేశమో కళ్ళనుంచి నీళ్ళు బొట్లుగా రాలుతూ రాముడి పాదాల్ని అభిషేకిస్తున్నాయి.

“రాముడూ” ఉబికివచ్చిన ఒక అరణ్యరోదన అది గుర్తుందా! నా తండ్రే నీకోసం ఈ గుడి కట్టించాడు. జ్ఞాపకముందా? నీకీ ఉనికినిచ్చింది నా తండ్రేనని అర్థమైందా కొన్ని గంటల క్రితమే నిన్ను నమ్మిన వాళ్ళనందర్నీ సమాధి చేసి ఆ దుఃఖం నుంచి విముక్తి కాకముందే మరోమారు నీ జాతి మనుషులచేత మానింపబడి ఇలా వచ్చానని.”

అలసటగా కనురెప్పలు వాలిపోతున్నాయి. అయినా మొండిగా నిలదొక్కుకుంటున్నాడు.

“దేవుడూ” పిలిచాడు....జవాబు లేదు.

“దేవుడూ” అరిచాడు విగ్రహాల పునాదులే కదిలేట్లు. జవాబుగా గర్భగుడి ప్రతిధ్వనించింది.

“ధ్వని నాదే ప్రతిధ్వనీ నాదే అయితే నీ అస్థిత్వాన్ని అర్థమేముంది” ఉద్విగ్నుడై నిలదీస్తున్నాడు “ఏం దేవుడివి నువ్వు....దశాబ్దాల అకుంఠిత దీక్షతో నిష్కామ యోగిగా బ్రతుకుతూ నిరంతరం నీ చింతనతోనే తన జీవితాన్ని అంకితం చేసిన నా తండ్రి నీకీ ఆలయాన్ని కట్టించాడే.... ఏం అదుకున్నావు? ‘మాధవసేవతో పాటు మానవసేవ కూడా తనకు ముఖ్యమేవన్న జిజ్ఞాసతో నీ ఆలయంతోపాటు ఒక విద్యాలయాన్ని నిర్మించాలని, కలలుకని నిస్వార్థంతో తపించిపోయాడే.... ఏం చేయూతనిచ్చావు? నీకు ఉనికి నిచ్చినవాడిని కాపాడలేని నువ్వు శిష్టరక్షణతో నీ ఉనిక్కి ఓ అర్థం కల్పించుకోలేని అసమర్థుడువైన నువ్వు దేవుడివెలా అవుతావు....నీకైతే ధూపదీపనైవేద్యాలు కావాలి.... ఆర్తత్రాయపరాయణుడు, భక్తవత్సలుడూ అన్న విశేషణాలతో నిండిన స్తోత్రపారాయణ కావాలి....కాని....నువ్వు మాత్రం నిన్ను నమ్మినవాడ్నిగాక నిన్ను నిలువునా అమ్మగలవాడ్ని ఆదుకుంటావు....ఎందుకిలా చేసావయ్యా అని భక్తులు మొరపెట్టుకుంటే ‘ఇది పరీక్ష’ అన్న పదంతో పలాయనవాదాన్ని ప్రకటిస్తావు.

దేవుడూ....స్వార్థమే తప్ప నీ దైవత్వానికి అర్థమేది పరమార్థమేది....అదేరయ్యా నీ జాతి చరిత్ర....

వానరుల అండతో నీ లక్ష్యాన్ని సాధించాలనుకున్న నువ్వు చెట్టు చాటు నుంచి వాలిని హతమార్చేవు....

అమృతం రాక్షసుల వశమౌతుందన్న భీతితో మోహినిగా రూపు దాల్చి అది నీ జాతివాళ్ళకందేట్టు చేశావు. ఔదార్యంలో నీకన్నా గొప్ప వాడైనా దానం పేరిట రాక్షస రాజైన బలిచక్రవర్తిని యుక్తిగా నేలమట్టం చేశావు.

అన్నదమ్ముల మధ్య అందమైన ఒక వైషమ్యాన్ని రగిల్చి విభీషణుడి అండతో రావణుడ్ని అంతం చేశావు."

ఎవడనగలడయ్యా నువ్వు స్వార్థపరుడివీ అవకాశవాదివీ కావని.... అయినా నువ్వు దేవుడివే "వ్యగ్యంగా పరహసించాడు" మిస్టర్ దేవుడూ! నీ చరిత్రలో ఏపుట తిరగేసినా నువ్వు ఉపయోగించింది శక్తికాదు....యుక్తి ఆ యుక్తే నాతోటి మనుషులూ ఉపయోగిస్తున్నారు....సాటి మనుషుల్ని నేలమట్టం చేస్తున్నారు....

నైతిక విలువలకు ధార్మిక చింతనకీ ఏనాడో తిలోదాలిచ్చినా ఓ దేవుడూ....! నీ చరిత్ర సమస్తం స్వార్థపూరిత సమరం అయినపుడు నా జాతివాళ్ళను నేనెలా నిందిస్తాను?

నాకు తెలుసు. నిన్ను కదిలించాలీ అంటే నేనిపుడు నా బ్రతుకుని కొనసాగించాల్సింది నీ భక్తుడిగా కాదు.... అలా చేస్తే నేనూ నా తండ్రిలా అన్యాయమైపోతాను....అందుకే నువ్వు అనుక్షణమూ భయపడే రాక్షసుడిగా ఈ క్షణమే నేను మారిపోతున్నాను....కనీసం ఆ విధంగానైనా పితృవాక్య పరిపాలనలో అదర్శ పుత్రుడవని అనిపించుకున్న నీతో సమవుజ్జీగా మారి మరణించిన నా తండ్రి కోరిక కోరూపాన్నిచ్చి పున్నామనరకంలో ఘోషించే ఆయన ఆత్మకు ఓ తృప్తిని మిగుల్చుతాను.

ఇక్కడే ఇప్పుడే నీతో ఒక సవాలు చేస్తున్నాను.

"ఇలా చూడు"

నిస్సత్తువగా తూలిపోతూనే జేబులోంచి ఓ కాగితం తీసాడు.

అది మరణానికి చేరువవుతున్న చివరిక్షణాల్లో భాస్వంత్ నుద్దేశించి రామానుజంగారు రాసిన అసంపూర్తిసందేశం....

హఠాత్తుగా భాస్వంత్ కళ్ళు నీటి కుండలయ్యాయి. అక్షరాలను చూస్తుంటే.

"భాస్వంత్....

రాలిపోతున్న నా ఈ చివరి క్షణాలలో నాకు తెలిసిన గణితశాస్త్ర చికిత్సతో నిన్ను ఓదార్చబోవడంలేదు.... అంకెల సంకెళ్ళను ఛేదించుకుని అపారవిజ్ఞాన ఖనిననిసించుకున్న నాకు ఓ 'లెక్క'ను నీ ముందుంచుతూ దానికి వీలైతే నీ నుంచే ఓటమి ఎరుగని జవాబును ఆశిస్తున్నాను.

నా అసంపూర్ణలక్ష్యం: విద్యాలయ్యం.

నా పెట్టుబడి: చెరగని విశ్వాసం.

గుణకం: నా ఆస్తి

గుణీతం: నా మానవత్వం

శేషం: ఓటమి.

ఇది మాత్రమే నాకు తెలిపింది.

ఒకవేళ నేను గెలవాలి అంటే నేనేం చేయాలి?

ఏ సక్తి నన్ను గెలిసింది.

సరిగ్గా ఈ వాక్యం రాస్తుండగానే ఆయన ప్రాణాలు అనంతవాయువుల్తో కలిసింది.

"నాన్నా" అపుత్రస్యగతిర్నాస్తి!

నీ లక్ష్యాన్ని నెలవేర్చి పున్నామ నరకంనుంచి నిన్ను తప్పించిన కొడుకుగానే కాక నీ ఆశయసిద్ధికోసం నా జీవితాన్నే పెట్టుబడిగా పెట్టి నిన్ను పునీతుడ్ని చేయగల సమర్థుడిగా నువ్వు అగిపోయినచోట నేను నా ప్రయాణాన్ని మొదలు పెట్టబోతున్నాను. నిన్ను గెలిపిస్తాను. నేను గెలుస్తాను."

అతడి కళ్ళిప్పుడు రోషాగ్నులు వెదజల్లుతున్నాయి.

"రాముడూ! మా నాన్న నీకు నెలవుగా అమర్చిన అద్దె కొంపలో హాయిగా బ్రతుకుతూ అవిశ్వాసంతో మమ్మల్ని వంచించిన దేవుడుగా....

చేయని నేరానికి నాన్న సర్వస్వం కోల్పోయి ఓడిన చక్రవర్తిగా కోట కాటికి తరలిపోయినపుడు నీకు మాత్రం ఈ స్థానమెందుకు. వెకేటిట్, ఉనికే మాయ అయినపుడు నా తండ్రి ఆస్తిని నువ్వుమాత్రం ఎందుకు భవించాలి. అందుకే చాలా మర్యాదగా నాన్న ఆరాధించిన ఒక శిల నిన్ను త్వరలో ఖాళీ చేయించే ప్రయత్నంగా నా సంగ్రామాన్ని మొ పెట్టబోతున్నాను,

నేను ఓడానా ఈ కోవెల నీదే అవుతుంది.

గెలిచి తిరిగి వచ్చినా నీకు స్థానభ్రంశం తప్పనిసరవుతుంది"

ఆవేశంగా రాముడు భుజాలకున్న విల్లును పట్టుకున్నాడు.

ఆ చిన్న రాపిడికే పగిలిన అతని వేళ్ళనుంచి గడ్డకట్టిన రక్తం ధారగా స్రవించడం మొదలు పెట్టింది.

"The moral agreement executed this day betwe Sri Rama S/o, Dasaratha hereinafter called assigdnor

and

K. Bhaswanth Maharshi S/o Late K. Ramanuj hereinafter caeled the assignee witnesseth as follow

నేను ఉపయోగించే శక్తి విలువ X
నాలక్ష్యం: విద్యాలయ నిర్మాణం
పెట్టుబడి: స్వశక్తి పక్కవాడి బలహీనత
మార్గం; లౌక్యం
కాలం: జీవితం
శేషం; విజయం.
నా చివరిరూపం GAINT

తండ్రి రాసిన కాగితాన్ని సగంచింపి వేళ్ళనుంచి చిమ్ముత రక్తంతో మొత్తం రాసేడు.

తానేం చేస్తున్నాడో తనకే తెలీని ఒక విచిత్రపరిస్థితిలో రక్తం కాగితం అంచున సంతకంచేసి రొప్పుతూ శ్రీ రాముడ్ని సమీపించాడు.

అభయమిస్తున్నట్టు దక్షిణహస్తాన్నించి నిలబడిన విగ్రహంకేసి రెప్ప ార్చకుండా కొన్నిక్షణాలు అలానే చూసి హఠాత్తుగా ఏదో గుర్తుకొచ్చినట్టు తన రక్తాన్ని రాముడి బొటనవేలుకు రాసి దాన్నే కాగితానికి అద్ది ఒకవ్రేల ముద్రగా మార్చగలిగాడు.

దేవుడికీ మనిషికీ మధ్య జరిగిన చిత్రమైన ఒప్పందం.

మహర్షుల మేధకు సైతం అందనిది వాల్మీకి కల్పనకు సైతం తోచనిది సాధించగలిగాడు ఒక మనిషి భాస్వంత్ మహర్షి·

"అమ్మా సీతమ్మా" అప్పుడు చూసేడు నిశ్చలంగా తననే గమనిస్తున్న సీతమ్మని. "మా ఒప్పందానికి నిన్ను సాక్షిగా నేను సంతకం చేయమనడంలేదు. నీ మనస్సాక్షితో నేను చేసింది ఎంతవరకూ సమంజసమో ఆలోచించమంటున్నాను. నా బాల్యాన్ని అమ్మలాంటి నీ ఒడిలోనే గడిపాను. నిన్న మొన్నటి వరకూ అమ్మా నాన్నలతో పాటు నేనూ మీజంటను స్తుతించి మీ ఆశీస్సులకోసం అర్థించాము.... కాని ఇప్పుడు నేను నీ భర్తనొక శత్రువుగాకాక ఒక శక్తిగా ఎదిగి మరలిరావాలని బయలుదేరుతున్నాను. శీలవతివైన నిన్ను అగ్నిపునీతను కమ్మని శాసించి నిర్దాక్షిణ్యంగా అడవిపాలుచేసిన ఈ పెద్దమనిషికే అండగా వుంటావో లేక అలనాడు తండ్రితోనే పోరాటానికి సిద్ధపడ్డ నీ లవకుశలకు నేనొక అంశగాభావించి నాకు ఆసరా అవుతావో నీ ఇష్టం." కాంట్రాక్టు పారాల్ని మడచి ఆమె చీర చెంగున ఒక బంగారంలా ముడివేశాడు· "నేను తిరిగి వచ్చేవరకూ ప్రపంచానికి సంబంధంలేని ఈ కాగితాల్ని నీదగ్గరే భద్రంగా వుంచుకో అమ్మా. అమ్మగా నన్ను ఆశీర్వదించి పంపు"

అతడు బయలు దేరాడు.

లేదు. ద్వారం దాటబోయి ఠక్కున ఆగిపోయాడు. ఏదో గుర్తుకొచ్చినట్టు.

ఆ క్షణంలో చాలా చిత్రంగాఅతడికి గుర్తుకొచ్చింది. అప్పుడెప్పుడో అతడికి పదేళ్ళ వయసుండగా సీతమ్మవారి మెడలోనుంచి తను దొంగిలించిన మంగళసూత్రం.

వెంటనే మేకోతలు సుబ్బులూ జ్ఞప్తికి రావడం కళ్ళల్లో గ్ర నీళ్ళు తిరగడమూ చాలా వేగంగా జరిగిపోయాయి.

ఇప్పటికి ఎదురుగా నిలబడి ఉన్నాడు రామయ్యతాత వ్యాకులపాటు అతడ్నే చూస్తూ.

* * *

మొండికా ఎదురు తిరిగిన నాగరాజును ఒకవేళ పోలీసులు కోర్టు తీసుకురావడం జరిగితే పరిస్థితి ఎలా ఉండేదో.

కాని అతడ్ని పోలేసులు తమ కస్టడీలోనే ఉంచుకున్నారు.

పట్టుబడిన ఇద్దర్నీ కోర్టుకా హాజరుపడచడం ఒక ఆనవాయితీ. కా ఇక్కడ అది అతిక్రమించ బడింది.

చట్టం పరిధిలో తమకున్న అవకాశాల్ని ఉపయోగించుకున్న పో సులు "తన మర్మావయాల్ని బాహాటంగా ప్రదర్శించిందన్న" అభియోగం చార్జిషీటు ఫైల్ చేసి ఆమెను మాత్రమే కోర్టులో హాజరుపరిచారు.

కోర్టు ఆమెను వేశ్యగా నిర్ధారించింది.

SUPRESSION OF IMMORAL TRAFFIC ACT 195 ప్రకారం (ఈ ఏక్టులోని మొదటి అక్షరాల్ని వరుసగా పేర్చితే SITA అ తుంది. కాబట్టి దీన్ని "సీతా" ఏక్టుగా వ్యవహరిస్తుంటారు లాయర్లు)

ఓ పతివ్రత పేరుగల ఏక్టుతో పతితల్ని శిక్షిస్తున్నారా లేక ప వ్రతల్నే పతితలుగా నిర్ధారిస్తున్నారా. ఇలాంటి భారతీయ శిక్షాస్మృ కారణం కాగలిగిన మేధావుల్లారా! మీకు నా జోహార్లు!

అభియోగాన్ని ఖండించలేదామె.

కన్నవాళ్ళు నిరసించిన నిర్భాగ్యురాలామె. ఇప్పుడు చట్టమూ ఆమె చేయని నేరానికి ఏభై రూపాయలు జరిమానా విధించింది. జరిమానా చెల్లిం చనినాడు పదిహేనురోజుల కారాగారవాసం.

తీర్పు విన్న నిశాంత శుష్కంగా నవ్వింది.

ఒక ఆడదాన్ని అంచెలంచెలుగా నంజుకు తినడానికి ఇటువ్యవస్థ లోనే కాదు అటు చట్టపరంగా కూడా ఇన్ని మార్గాలున్నాయా.

నా నిస్పహాయితమీద ఇంత అందంగా ఆడుకోగలుగుతున్న ఓ న్యాయాధిపతీ. మీకు నా శుభాభివందనాలు. జైలుశిక్షకు సిద్ధంగా ఉన్నాను.

అలా ఆమె అన్నప్పుడు ముందుగా విడ్డూరపడింది శిక్షవిధించిన మేజిస్ట్రేటు.

వేశ్యావాటికల్ని నడిపేవాళ్ళు అలవాటుగా జరిమానా చెల్లించి అమ్మాయిల్ని తీసుకుపోవటం ఆయనకి తెలుసు మరి ఈ అమ్మాయేంటీ ఇలా ఇలా మాట్లాడుతూంది.

"ఆశ్చర్యపోతున్నారా న్యాయాధిపతిగారూ! నేను మీ తీర్పును ధిక్కరించడం లేదు.... నేను పతితని అవునా కాదా అన్న మీమాంసతో మిమ్మల్ని ప్రశ్నించడమూ లేదు....నా మాట ఎలా వున్నా నాలాగే ఇలాంటి నికృష్ట స్థితిలో బ్రతుకుతున్న సాటి ఆడవాళ్ళ విషయంలో కాస్త ఆలోచించమని వేడుకుంటున్నాను....ఒక రాక్షస నీతితో నాతిని నీతి బాహ్యురాలైన శిల్పంగా మార్చిన ఈ సంఘంలో చట్టంతో కేవలం శిక్ష మాత్రమే విధించేకన్నా అందరిలానే బ్రతకాలనుకున్న దురదృష్టవంతులైన ఆడపిల్లలకి అవకాశముంటే కాస్త పునరావాసానికి మార్గం చూపించమంటున్నాను...." పలకని రాతిదేవుడి ముందు యుగయుగాలుగా ఆర్తితో అలమటించే ఈ దేశపు ఆడదానికి ప్రతినిధిగా కాదు తనలాంటి ఎందర్నో చూసి తల్లడిల్లిన మనసుతో తపించిపోతూ నిగ్రహాన్ని కోల్పోయినట్టు మాట్లాడుతూంది." ఇక్కడ శిక్షించాల్సింది మా జాతిని కాదు న్యాయమూర్తిగారు! ఒక మనిషి పెంచుతున్న కుక్క మరో మనిషిని కరిస్తే పెంచుతున్న మనిషిని శిక్షించే చట్టం ఒక ఆడదాని బ్రతుకిలా కావటానికి కారణమైన ఈ వ్యవస్థను శిక్షిస్తే న్యాయంగా ఉంటుందంటున్నాను. సీతలూ, సావిత్రులూ పుట్టిన నేల యిదని గతం గురించి బాజాలు వాయించుకునే కంటే పతితలుగా మార్చబడే పతివ్రతలనైనా కాస్త కాపాడే ప్రయత్నం చేయమంటున్నాను...." ఆమె ఆగిపోయింది మాట్లాడుతున్నదల్లా. దుఃఖం గొంతు కడ్డంపడుతూంది. కనుకొలకులనుంచి జారుతున్న నీళ్ళు గండిపడిన వాగులా ఆమె నిలబడ్డ బోను అంచుపై పడుతున్నాయి నిస్త్రాణగానే,

న్యాయమూర్తి యథాలాపంగా చూడటం లేదామెను. అతనికున్న పరిధిలో ఇలా మాట్లాడుతున్న ఈ విచిత్రమైన ఆడపిల్ల గురించి మనిషిగా ఆలోచిస్తున్నాడు....

భారత రాజ్యాంగంలోని 19 (1) (g) అధికరణం ప్రకారం వేశ్య కూడా తన వృత్తిని నిరాఘాటంగా నిర్వహించవచ్చు అని పాశ్చాత్య నాగరికతను అనుకరించే ఈ వ్యవస్థలో పాశ్చాత్య దేశాల మాదిరిగానే వేశ్యలందరికి లైసెన్సులు మంజూరు చేయడం న్యాయమని 'భారతీయ వేశ్యా సంక్షేమ సంఘం' ఖైరతీలాల్ భోలా ఆధ్వర్యాన ఢిల్లీలో నిర్వహిస్తున్న ఉద్యమం గుర్తుకొచ్చింది.

మౌనంగా చూస్తూ ఉండిపోయాడు చాలా సేపటి వరకూ.

సరిగ్గా ఆ సమయంలో "జరిమానా నేను చెల్లిస్తాను యువరానర్" అన్న ఓ కంఠం వినిపించి అక్కడి నిశ్శబ్దం చెదిరిపోయింది.

అందరితోపాటు నిశాంత కూడా తలతిప్పి చూసింది అటువేపు.

అంతే....

ఆ స్థితిలో కూడా తృళ్ళిపడింది అక్కడ నిలబడివున్న వ్యక్తిని చూసి....

6

అతడు రంగారావు....

తనను ఒకనాడు బలిపశువును చేసి నాశనం చేసింది చాలక ఇంకా వెన్నంటుతున్న కిరాతకుడు....

ఇక్కడ తన వునికినెలా గుర్తించాడూ అన్న దిగ్భ్రమంలో ఆమె వుండగానే జరిమానా చెల్లించాడు.

బయట కారిడార్‌లో ఎదురైన రంగారావుని చూడగానే అసంకల్పితంగా ఆగిందామె.

"ఇప్పుడు నీ మార్గాలన్నీ శాశ్వతంగా మూసుకుపోయాయి నిశాంతా... కాదు మూసేసాను....ఆ ప్రయత్నంలోనే ఇక్కడ నిన్ను చట్టపరంగా కూడా వేశ్యగా మార్చేసాను"

ముందు అతడంటున్నదేమిటో ఆమెకు అర్థంకాలేదు.

"అర్థంకాలేదా నిశాంతా! ఆ రాత్రి నువ్వు మానుండి తప్పించుకున్న తర్వాత ఏ ఇంటిలో దూరిందీ మేం చూసాం. అందుకే ఆగిపోయాం."

నిశ్చేష్టురాలై వింటూందామె!

"నీకు ఆశ్రయమిచ్చిన నాగరాజు నిజానికి ఒక చిన్నసైజు క్రిమినల్ అయినా వాడ్ని ఉన్న ఫళంగా ఢీకొనడం మాకు సాధ్యం కానిపని అని నాకుతెలుసు. పైగా అలాంటి అపరాత్రివేళ అనవసరంగా రాద్ధాంతానికి సిద్ధపడితే వూరంతా నిద్రలేవడం మా ప్రయత్నం బలహీనపడడమూ తప్ప ప్రయోజనంలేదని అనిపించింది. అందుకే నిన్ను లీగల్‌గా ఆ ఇంటినుంచి తప్పించాలని పోలీస్ రైడింగ్ ఏర్పాటు చేశాను."

చాలా వాడిగా ఆమె గుండెల్లోకి దూసుకుపోయింది అతడన్న చివరి వాక్యం.

"అంతేకాదు....వాస్తవం నోరునొక్కే ప్రయత్నంలో నాగరాజుని పోలీసులపై ఎదురు తిరిగాడన్న నేరంతో కస్టడీలో చేర్పించే ఏర్పాటు చేసాను. లేకపోతే వాడు బోనులో నిర్భయంగా నిజం కక్కి నిన్ను రక్షించే అవకాశం తీసుకుంటాడు కాబట్టి...."

కర్కశంగా నవ్వుతున్నాడు.

ఆమెను ఉచ్చులనుంచి బయటకి పంపిన సరోజ నిశాంతకీనాడు చెప్పింది ఆంధ్రరాష్ట్రంనుంచి అమ్మాయిలను తరలించే ముఠావెనుక వున్న బలమైన హస్తం ఎవరిదో.

కాని ఆ ముఠాకి నాయకుడైన ప్రభంజనరావు ఇంతటి బలాఢ్యుడని ఆమె వూహించలేకపోయింది.

రాష్ట్రంలో ప్రముఖ పారిశ్రామికవేత్తగా రాజకీయాలను సైతం శాసించగల అనధికార శాసనకర్తగా ప్రజలకు హితుడిగా రాష్ట్రంలో వీలైనన్ని పతితా సేవా సదన్లను స్థాపించడమే తన ధ్యేయమన్నట్లు అనాథలైన యువతుల్ని అవకాశవాదంతో ఒక వలయంలో ఇరికించే కుహనా సంఘ సంస్కర్తగా ప్రభంజనరావు ఎంతటి ప్రాపకంగలవాడూ అంటే రంగారావు నుండి ఫోన్ అందుకున్న వెంటనే ఆ రాత్రికి రాత్రే భాగ్యనగరంలో కూచుని అనకాపల్లిలోని పోలీసు బలగాన్ని ఒక్క ఫోన్ కాల్‌తో కదిలించగలిగాడు.

నిజానికి ఒక ఆడపిల్ల గురించి అంతలా నిద్రాభంగం చేసుకోవల్సిన అగత్యం అతడికిలేదు. కాని అప్పటికే రంగారావు ద్వారా విన్నాడు. తప్పించుకు తిరిగివచ్చిన యువతి మామూలు నిప్పురవ్వకాదు....గాలిలోని ప్రాణవాయువుని పీల్చుకుని మంటగా మారగల చదువుకున్న ఆడపిల్ల. పైగా తన వాళ్ళమూలంగా కూడా నిరాశ్రయురాలైనది. అంతకుమించి చాలా అందగత్తె. అదీ అన్నిటికన్నా ప్రభంజనరావుని అతిగా ఆకట్టుకున్నది.

"ఏమంటావ్ నిశాంతా! నీకు మిగిలింది ఒకటేదారి"

నిర్లిప్తంగా నవ్వింది. "నాలాంటి ఒక సామాన్యమైన ఆడపిల్ల కోసం ఇంతబలమైన ఉచ్చుల్ని పన్నగలిగిన రంగారావ్! బజారులో ఒక పశువుని వేలంవేసి కొనుక్కుపోయే కసాయివాడికన్నా కొద్దిపాటి ఔదార్యముంటుందే....అదికూడా నీకు లేకుండా నిన్ను కనిపెంచిన నీ తల్లిని తలుచుకుంటుంటే నాకు జాలి కలుగుతూంది"

చూయింగ్‌గమ్‌లాంటిదేదో నముల్తూ భావరహితంగా చూస్తున్నాడు.

"రంగారావ్! మనిషికి తప్పించుకోలేని భయంకరమైన సంఘటన ఏమిటో తెలుసా....మరణం....దానికి సిద్ధపడ్డ వాళ్ళని నువ్వుగాని నీ బలగానికి ఆధిపత్యం వహించే ప్రభంజనరావులుగాని ఏమన్నా చేయగలరంటావా!! అడిగింది యధాలాపంగానే సరిగ్గా నేనున్నది అలాంటి స్థితిలోనే....కాబట్టి నా దారికి అడ్డం తొలగిపో"

అతడి పెదవులపై ఓ వికృతమైన నవ్వు...."నువ్వు ఎలాంటి గొప్ప జీవితానికి దూరం కాబోతున్నావో నీకు అర్థంకాదు నిశాంతా"

"ఆ! నిజమే "వ్యంగంగా నవ్వింది." యుగాల తరబడి ఈ సృష్టిలో ఒక అల్పప్రాణిగా ఉద్భవించి మీ బలమైన పురుష వ్యవస్థ జాలికి నోచుకోక ఆడది ఎంత అధోగతికి జారిపోతుందో నాకు తెలుసు."

క్రమంగా ఆమె మొహం జేవురించి పెదవులు రోషంగా అదురుతున్నాయి. "శరీరం శాస్త్రం దృష్ట్యాగాని జీవశాస్త్రం దృష్ట్యాగాని నిజానికి నీకూ జంతువుకీ తేడా లేకపోయినా మరే ఇతర జంతువులలోను లేని విశిష్ట లక్షణాలు మూలంగా నువ్వు మానవుడివై పోయావు. నీకు ప్రకృతి ఇచ్చిన బలంతో సాంకేతికంగా ఎదిగి సిద్ధాంతాల వక్రప్రభావాల భాష్యంతో ఈ ప్రపంచాన్నే శాసించే ప్రయత్నం చేస్తూ ఆర్థిక సాంఘిక రాజకీయాల వ్యవస్థలను నీకనుకూలంగా మార్చుకుని సగం స్వప్నంగా సగం మనిషిగా బ్రతుకుతున్న స్త్రీని నీ రథాశ్వాల బలమైన పగ్గాలుగా మార్చుకున్నావు. స్తన్యమిచ్చిన తల్లిని సైతం కామప్రకోపిత దృక్కులతో చూస్తూ ఆ నైతిక పతనాన్నే పురోగమనంగా భావించడం అలవాటు చేసుకున్నావు!

ఓ పురుషుడా! ఇది నీ తప్పుకాదేమో....నిన్నిలా మలిచిన నీ పూర్వీకులైన పురుష వ్యవస్థది. ఈ సర్వచరాచర సృష్టికి మూలమైన స్త్రీ అధోభాగాన్ని యజ్ఞవేదికగా భావించవలసిందని ఉపనిషత్తుల్లో వివరించి స్త్రీ సంగమంతో పురుషబల సమర్పణ చేయడం అదే మగవాడు దైవసాయుజ్యం కోసం నెరిపే మహార్పణంగా భావించే నీజాతి వాళ్ళు ఒకనాడు స్వార్థంతో చూపిన దారిలోనే నువ్వు నడుస్తున్నావు....సంసారిని సానిగా మార్చి మగ దేవతలకు దేవదాసిగా మిగిల్చి మీ కోర్కెల తేనె తుట్టల్నుంచి జారే రసాస్వాదనే ఆడదాని జీవిత లక్ష్యంగా చరిత్రల్ని సృష్టించి అప్పుడూ ఇప్పుడూ నీ ఆధిక్యతను నిరూపించుకుంటున్నావు.

కాని మిస్టర్ రంగారావ్! నేను ఆ వెల్లువలోనే ఒక పూచిక పుల్లనైనా నిస్సారంగా కొట్టుకుపోదలచుకోలేదు. నా బ్రతుక్కి ఓ అర్థాన్ని

కల్పించుకోవాలనుకుంటున్నాను. మీ మారణ హోమాల్లో సమిధలై ఎందరో పతితల్లా కాక సాధ్యమైతే ఒక కొత్త చరిత్రకు కారణం కాదల కున్నాను. ఆ విధంగా నా మార్గాలన్నీ మూసేస్తామని భ్రమపడుతున్న మీ వ్యవస్థ ద్వారాలకు నేను అడ్డంగా నిలబడబోతున్నాను."

ఆమె కదిలింది ముందుకు.

రంగారావు ఓ రెండడుగులు వేసాడు. కాని కోర్టు ప్రాంగణంలో ఉన్న లాయర్లనీ జనసందోహాన్ని చూసి ఆమె నోరుమూయించే సాహసం చేయలేక పోవడమే కాదు. ఆమె గమనాన్ని సైతం నిరోధించ లేకపోయాడు.

ద్వారం దగ్గరే నిలబడ్డ అతని అనుచరులా కొద్దిగా ముందుక రాబోయారు.

కాని ఆమె అప్పటికే రోడ్డు క్రాస్ చేసింది.

వెంట అనుసరించబోయిన రంగారావు అతడి అనుచరులా ఓ బస్సువారికి అడ్డంగా రావడంలో క్షణంపాటు ఆగిపోయారు.

ఎదురుగా కమ్యూనిటీ హాల్లో ఏదో కాన్ఫరెన్స్ జరుగుతూంది.

ఆదరాబాదరాగా అక్కడకు వచ్చి ఆ జనసందోహంలో ఎక్కడ వుందో పరికిస్తూ చాలా పేపు నిలబడిపోయారు.

వారి ముందునుంచే ఓ కారు దూసుకువెళ్ళి పోవడం వారు గమనించారు. కాని అందులోనే వెనుకసీటులో ఒదిగి కూచున్న నిశాంతను గుర్తించ లేకపోయారు.

"తెగించిన ఆడపిల్ల అందులోను చదువుకున్న అమ్మాయిల మూలంగా జరిగే అనర్థాలు నీకు తెలీవు రంగారావ్! అందుకే చాలా జాగ్రత్తగా అమ్మాయి నోరు మూయించాలంటున్నాను" అన్న ప్రభంజనరావ మాటలుగుర్తుకొస్తుంటే చేష్టలుడిగి నిలబడిపోయాడు రంగారావు."

పైగా వెళ్తూ నిశాంత ఛాలెంజింగ్‌గా అన్న మాటలు అతడ్ని మరింత వణికించాయి.

ఇప్పుడేదన్నా జరిగితే ప్రభంజనరావు తనను క్షమించడు.

అందుకే చాలా ఉన్మాదిలా గాలిస్తున్నాడు. బెంజ్‌కారు అప్పటికే అనకాపల్లి సరిహద్దుల్ని దాటింది.

"ఎవరు మీరు"

కారుని కొద్దిగా స్లోచేస్తూ అడిగాడు కారు నడుపుతున్న వ్యక్తి.

వెనుక వెంటాడుతున్నారేమో అన్న భయంతో మరింత ముణగ దీసుకూర్చున్న నిశాంత వెంటనే మాట్లాడలేదు"

"మిమ్మల్నే" ఈసారి కారు ఆపేసాడు రియర్‌వ్యూ మిర్రర్‌లోంచి తలవెనక్కి తిప్పిన ఆ వ్యక్తి.

భయంతో అప్పుడు తల పైకెత్తిందామె "ప్లీజ్....నన్ను దించేయకండి. వాళ్లు నన్ను తరుముతున్నారు" ఆమె గొంతు భీతిగా వణికింది.

అలసిన అందమైన ఆమె కళ్ళను తదేకంగా అతడు చూస్తే స్పష్టమైన ఆర్ద్రతతో నిండిన ఓ మధ్య వయస్కుడైన వ్యక్తిని ఆమె ఆర్థిస్తుట్లుగా చూసింది.

"ముందుకు రండి" డోర్ తెరిచాడు.

కొద్దిగా స్థిమితపడిన మనస్సుతో ఫ్రంటుసీటులోకి వచ్చింది. కారు మళ్ళీ ముందుకు సాగిపోతుంటే చెప్పండి. మీరెవరు....మిమ్మల్ని తరుముతున్న ఆ వ్యక్తులెవరు నెమ్మదిగా అడిగాడు.

ఆమె తలవంచుకుంది. అతడు అనుకున్నా కాదన్నా చెప్పక తప్పని స్థితి. అందుకే సిగ్గువిడిచి అంతా చెప్పింది ఓ పాఠం అప్పచెప్పినట్లు.

మౌనంగా విన్నాడు—విన్నతర్వాత కూడా అతడి మొహంలో ఇందాకటి భావమేతప్ప మార్పులేదు.

కారు అప్పటికే విశాఖపట్నం చేరుకోవడంతోపాటు కింగ్‌జార్జ్ హాస్పటల్ వెనుకవున్న ఆఫీషియల్ కాలనీవైపు మళ్ళించాడు. "ఇప్పుడేం చేద్దామనుకుంటున్నారు" అడిగాడు.

జవాబులేని ప్రశ్నది "చెప్పండి" రెట్టించాడు మళ్ళీ, నిజానికి ఉక్రోషంతో ఇందాక చాలా చాలా అనేయగలిగింది కాని ఆమెకూ తోచడంలేదు. తనేం చేయాల్సిందీ,

అందుకే "ఏం చేయమంటారు" నిస్సహాయంగా అడిగింది.

"చూడండీ" భావరహితంగా ఆమె కళ్ళలోకి చూసేడు "సమస్య ఎదుర్కోవడం రెండు రకాలు. ఓటమికో రాజీపడటం లేదా ఓడించడ మొదటిది ఎంత సులభమో రెండోది అంతకష్టం. ఇప్పుడు చెప్పండి మీ మార్గాన్ని ఎన్నుకోవాలనుకుంటున్నది."

చాలా సేపటి వరకూ నిశ్శబ్దం.

"మిస్ నిశాంతా....ఈ ప్రపంచంలో మంచిచెడూ అన్నవి విడి లేవు. మన ఆలోచనల్నిబట్టి చూసే దృక్కోణాన్ని బట్టి అలా నిర్ధారిం బడతాయి. సులభంగా పొందగలిగే మరణం కన్నా కష్టపడి సాధించే జీవిత లోనే నిజమైన ఆనందముంటుందన్నది నా విశ్వాసం"

చాలా నమ్మకంగా అతడివేపు చూసింది.

"నేను చావాలనుకోవడం లేదు. కష్టపడి జీవితాన్ని సాధించాల కుంటున్నాను."

"దెన్ వెల్‌కమ్."

కారు డోర్ తెరిచాడు. చాలా విశాలమైన గెస్టుహౌస్‌లోకి వ ఆగిందది.

ఆమె విభ్రమంగా చూస్తూంది.

"సీతలా శోకాన్ని మూటగట్టుకుని గుండెలవిసేలా నిస్త్రాణ ఏడ్చినంత కాలం ఈ దేశంలో ప్రభంజనరావులు శక్తివంతులుగా బ్ర తూనే వుంటారు. "కమాన్" మీ కన్నీటికథకి ఓ అక్షర రూపం యివ్వం ఆడది అర్ధరాత్రేకాదు పట్టపగలుసైతం స్వేచ్ఛగా తిరగలేని ఈ దౌ గ్యపు దేశంలో పుట్టిన ఓ ఆడపిల్లగా ఇక్కడ జరుగుతున్న ఒక మా హోమాన్ని ప్రజల సమస్యగా మార్చి మీ బాధాపరితప్త హృదయా కాస్త ఊరట కల్పించుకోండి."

ఆమె విస్ఫారిత నేత్రాలతో చూస్తూంది అతడ్నే.

"అవును నిశాంతగారూ! ఈ విషయాన్ని మీరు పోలీసులకే తెలియపరిచి వుంటే మీగోడు రికార్డులలో సమసిపోయి ఎందరి దీనాలాపనల్లాగా అదీ సమాధి అయ్యేది. రాజకీయ నాయకులతో చర్చించివుంటే పరిష్కారం మాట అటుంచి తమ ప్రాచుర్యాన్ని పెంచుకునే ఓ ఆయుధంగా మాత్రం మిగిలేది" ఆగేడు క్షణంపాటు. "మీకు నేను ఎంతవరకూ అండకాగలనన్నది నేను ఇదమిద్ధంగా చెప్పలేకపోయినా మిమ్మల్నో అమ్ములపొదిగా మార్చుకుని చాలా పెద్ద మనిషిగా చలామణీ అవుతున్న ప్రభంజనరావు పునాదుల్ని మాత్రం కదిలించగలనని హామీ ఇస్తున్నాను.

"మీరు...." అప్పుడు అడిగిందామె అతనెవరో తెలుసుకోవాలన్న ఉత్కంఠతో.

"ఉపాధ్యాయ. 'అనుదినం' దినపత్రిక్కి యజమానిని"

పక్కలో బాంబు పడ్డట్టు అదిరిపడింది— తను యాదృచ్ఛికంగా కలుసుకున్నది అంత సేపూ తను మాట్లాడిందీ ఇంతవరకూ తనకుధైర్యాన్ని నూరిపోసి తన సమస్యకి అక్షరరూపం ఇమ్మని ప్రోత్సహించింది రాష్ట్రం మూడు ప్రాంతాలనుంచి ఒకసారి విడుదలయ్యే. అత్యధిక సర్క్యులేషన్ ప్రజాదరణగల 'అనుదినం' పత్రికాధిపతి ఉపాధ్యాయతోనా!

ఆ సాయంకాలమే స్పెషల్ ఎడిషన్‌లో....

ఇక్కడ సీతలు అమ్మబడును. రాష్ట్రంనుంచి అమాయకులైన ఆడపిల్లల్ని తరలిస్తూ వారి రక్తమాంసాలతో వ్యాపారం చేస్తున్న ఓ ముఠా వ్యవహారం గురించి రెడ్‌లైట్ ఏరియానుంచి తప్పించుకున్న ఓ దీనురాలే స్వయంగా రాస్తున్న కన్నీటి కథ త్వరలో ప్రారంభం"

బాక్స్ ఐటమ్‌గా ప్రచురించబడింది.

ఉపాధ్యాయ అంచనా తప్పుకాలేదు.

అది సరిగ్గా తగలాల్సినచోటే తగిలింది.

ఒక బలమైన వ్యవస్థకు అధిపతిగావున్న ప్రభంజనరావు జీవితంలో తొలిసారి ఇబ్బందిగా కదిలాడు.

జూలు విదిలించుకున్న సింహంలా బోన్ దగ్గరికి పరుగెత్తాడు.

* * *

"ఎక్కడికి బయలుదేరుతున్నావు?"

చివరిసారి తనవాళ్ళను ఖననం చేసిన సమాధినుంచి శలవు తీసుకుని ఒక మహాసంగ్రామానికి బయలుదేరుతున్న క్షతగాత్రుడైన సైనికుడులాంటి భాస్వంత్ ఎదురుగా నిలబడ్డ రామయ్య తాతను చూసి ఆగేడు.

"విన్నే భాస్వంత్. ఏమైపోతున్నావు. ఎక్కడకు బయలుదేరుతున్నావు" రెట్టించాడు భాస్వంత్ చూపుల్లోని తీక్షణతకు భయపడుతూనే.

"నేను గెలిచే చోటుకి. నన్ను గెలిపించే కొత్తప్రపంచంలోకి"

"నువ్విప్పుడు నిలబడిందీ ఆ ప్రపంచంలోనే" ప్రచండభానుని కిరణాల కాంతిలో స్మసాన వాటికలోని ఓ మూల చితిమండుతోంది.

భాస్వంత్ భుజంపై చేతినుంచాడు తాత "అక్కడ కాలుతున్నమనిషి ఏప్పుడో ఒకసారి ఓడినవాడే అయ్యుంటాడు. గెలవాలని తపించిన వాడూ అయ్యుంటాడు." "తాతా" స్థిరంగా పలికిందతని కంఠం. ఇలా కాలకతప్పదని కర్మసిద్ధంతాన్ని కాళ్ళకు చుట్టుకుని కూర్చుని వుండడుగా"

"నీ మనస్తాపమే నీచేత ఇలా మాట్లాడిస్తూంది భాస్వంతా"

"ఇది మరిచి పోవాలనే నా ఈ ప్రయాణం"

"స్వప్నంలాంటి జీవితమిది. నువ్వు చూసిందీ చేసిందీ అంతా స్వప్నంలాగే భావించు."

"అసంభవం తాతా! నా ఈ చేతుల్తో నావాళ్ళని సమాధి చేసానే.... అది స్వప్నమెలా అవుతుంది నా చేతుల్లో కళ్ళు మూసిన నా తల్లి చివరి ఆర్తనాదాన్ని స్వయంగా విన్నాక అది స్వప్నమెలా అవుతుంది. కూలిన ఒక సామ్రాజ్యపు చివరి ప్రతినిధిగా నా కుటుంబం ఎంత చిన్నాభిన్నమైందో కళ్ళారా చూసాక అది స్వప్నమెలా అవుతుంది? ఈ స్మశానం.... ఈసృష్టి అంతా స్వప్నమేనా"

"పరిపూర్ణ ఏకత్వంగల ఈసృష్టి గొడ్రాలి బిడ్డవలే పుట్టనేలేదు" ఒక జ్ఞానిలా వేదాంతాన్ని ఎరుకపరిచాడు....

"నేను పుట్టానుగా"

"లేదు నువ్వూ పోయిన నీవాళ్ళు అంతా ఆ సృష్టిలో ఒకభాగమే. రూపాయి మారినా మూలం ఒక్కటే. అలలైనా కెరటాలైనా సముద్రంలో భాగమే...."

"అలా అనుకుని ఓటమిని అంగీకరించమంటావు. నా కుటుంబాన్ని కూల్చిన వ్యక్తుల బలానికి తల ఒగ్గమంటావు" అసహనంగా అడిగాడు.

"ఆ వ్యక్తులా ఈ బ్రహ్మాండంలోని వారే"

"అలాంటప్పుడు ఈ కక్షలకీ, కారణ్యాలకీ, మోసాలకీ, ద్వేషాలకీ కారణమేమిటి"

"ఇనుము నేలపై పడినా పగలదు. కాని గాజు పగులుతుంది. అది పదార్థ లక్షణం"

ఉక్రోషంగా తాతవేపు చూసాడు "అది ఆ పదార్థలక్షణమే అయితే నా ఈ ఆలోచనలనీ సదార్థ లక్షణంగానే అంగీకరించు"

తాత లిప్తపాటు మాట్లాడలేకపోయాడు. "ఏదో చేయాలనుకోవడం అజ్ఞానం భాస్వంత్."

ఆ జ్ఞానాన్ని అనుభవంతోనే తెలుసుకోనియ్"

"ప్రారబ్ధాన్ని బట్టి ఈ జీవితం సాగిపోతుంది" నిగ్రహం కోల్పోతున్న భాస్వంత్‌ని వాదించే ప్రయత్నంగా మరో అడుగు ముందుకేసాడు.

"సాగనీయ్ తాతా! జరిగేదంతా ప్రారబ్ధాన్ని అనుసరించే అయితే నా ప్రారబ్ధానికి నువ్వు కర్తవెలా అవుతావు"

తాత చేయిని విడిపించుకుని భాస్వంత్ ముందుకు కదిలాడు.

"నాయనా భాస్వంత్" తాత గొంతు వణికింది. "నాదారి మళ్ళించాలని ప్రయత్నిస్తున్న ఓ జ్ఞానీ,, స్మశానం అంచున నిలబడి వెనక్కి తిరక్కుండానే అన్నాడు "నాకు వేదాంతం తెలీదు. నీ మిధ్యావాదాన్ని అర్థంచేసుకునే ఓపికా లేదు. కాని నేను ఒక తిరుగుబాటుకి సిద్ధపడి వెళుతున్నాను. నాకున్న ఆయుధాలు రెండు.... ఒకటి నా స్వశక్తి.... మరోటి పక్కవాడిబలహీనత

నా లక్ష్యాలు రెండు.... ఒకటి నా తండ్రి చివరికోరిక తీర్చడం, రెండు తన ఉనికే గొప్పదని గర్వపడుతున్న దేవుడ్ని ఓడించడం. ఇది ఇప్పటి ఈ పదార్ధ లక్షణం...."

ఆవేశంగా ముందుకు నడిచాడు.

ఇప్పుడతడికి చాలా ఆనందంగా ఉంది. బాధ్యతలు లేవు. బంధాలు లేవు. ఒక లక్ష్యం తప్ప.

హఠాత్తుగా అతని కాళ్ళు ఆగిపోయాయి.... ఇప్పుడతడు నిన్నగాక మొన్న సవాల్ చేసిన రామాలయానికి అభిముఖంగా వున్నాడు.

గర్భగుడిలో చిరుదీపపు కాంతిలో తల్లిలా తనకు వీడ్కోలు చెబుతున్న సీతమ్మ కనిపించింది. మరుక్షణం బోసిగావున్న ఆమె మెడ దర్శనమిచ్చింది.

"బావ"

సుమారు ఓ దశాబ్దపు పూర్వం తనను అపురూపంగా పలకరించే సుబ్బులు గుర్తుకొచ్చింది.

గుండెల్ని మెలిపెట్టే ఆర్ద్రిత మెదడు నరాల్ని పెకిలించే సూలాలతో పొడుస్తున్న నొప్పి"

"తాతయ్యా మా అమ్మని ఎందుకిష్టపడడు.

"మా నాన్నని కాదని మీ అమ్మ మీ నాన్నతో వెళ్ళిపోయిందిగా"

"తప్పేంటి"

పదేళ్ళ వయసున్న తనకూ తోచని ప్రశ్నది. అందుకే ఏడేళ్ళ సుబ్బులుకి తనూ జవాబు చెప్పలేకపోయాను.

"అమ్మమ్మని మా ఇంటికి వెళ్ళొద్దని చెప్పాడటగా తాతయ్య"

"ఆ.... వెళితే తను విషంతాగి చచ్చిపోతానన్నాడు"

"మా అమ్మ ఏడుస్తుంది"

"మా అమ్మ కూడాను"

"మరి తాతయ్య మా మొహాలెప్పుడూ చూడడటగా"

"ఆ"

"మరి మనకి పెళ్ళెలా అవుతుంది" అరిందలా అడిగింది.

"మనం చేసేసుకుందాం"

"ఎలా"

"ఇదిగో చేతిలోని తాళిబొట్టు చూపించాడు.

"ఎక్కడిది?" విభ్రమంగా అడిగింది.

"మా రామాలయంలో సీతమ్మ మెడలోది. దొంగిలించి తీసుకొచ్చాను.

"అమ్మో" సుబ్బులు కళ్ళల్లో భయం.

"అమ్మ వారికి కోపం రాదూ"

"అప్పుగా తెచ్చాను పెద్దయ్యాక తీర్చేద్దాంగా"

సుబ్బులు మెడలో తాళికట్టేసాడు రహస్యంగా.

సుబ్బులు కళ్ళల్లో నీళ్ళు....తనకీ ఏడుపొచ్చింది

"అమ్మకి తెలిస్తే కొడుతుందేమో" సుబ్బులు అంది.

"ఎక్కడన్నా దాచేయ్"

నడుస్తున్నవాడల్లా టక్కున ఆగిపోయాడు ఎవరో ఢీకొట్టినట్టయి....

మళ్ళీ నడుస్తున్నాడు....

ఆ తర్వాత ఏడాదే అనకాపల్లి శారద నది వరదల్లో సుబ్బులూ, అక్కా అంతా ప్రాణాలు కోల్పోయారు....

ఒక సన్నని నీటిపొర అతడి కళ్ళల్లో....

ఇప్పుడు తనకెవరూ లేరు....అంతటి సంఘర్షణలోనూ ఎంతో తృప్తిగా వుంది....

సరిగ్గా అప్పుడు చూసాడు అతడి కళ్ళముందే నేలపైపడి గుండె పట్టుకుని మూలుగుతున్న ఓ వృద్ధుడ్ని.

పట్టించుకో కూడదనుకున్నాడు....తన ప్రయాణంలో ఇలాంటి సెంటిమెంట్స్‌కి తావివ్వకూడదనీ అనుకున్నాడు.

అయినా క్షణంపాటు గుండె అట్టడుగు పొరల్లో చిత్రమైన మధనం. చుట్టూ కనుచూపు మేరలో ఎవరూ లేరు.

ఇక తప్పదు....కొద్దిపాటి మానవతా దృక్పథంతో ఆ వృద్ధుడికి దగ్గరయ్యేడు.

అమాంతం అతడ్ని చేతుల్లోకి తీసుకున్నాడు.

* * * *

అర్ధరాత్రి గడిచి చాలా సేపయింది....

గెస్టుహౌస్‌లోని ఓ గదిలో ఆదమరిచి నిద్రపోతున్నాడు ఉపాధ్యాయ.

అప్పటివరకు రాసి అలిసిపోయిన నిశాంత కాగితాల్ని దొంతరగా పేర్చింది.

త్వరలో ఒక సీరియల్ ఫీచరుగానో కథగానో ప్రచురించబడే పతితల దీనాలాపనలకి ప్రతీకది....

ఎందుకో రాస్తున్న కొద్దీ ఆమె గుండెల్లోభారం దించుకుంటున్నట్లుగా ఉంది.

నెమ్మదిగా ద్వారం తెరిచి బాల్కనీలోకి వచ్చింది.

దూరంగా సముద్రపు హోరు....

ఆకాశంలోని చంద్రుడు రాల్చే జిలుగు వెలుగుల తోరణాలు కడలి వక్షంపైపడి సముద్ర గర్భంలోని బడబాగ్నిని చల్లార్చే ప్రయత్నం చేస్తున్నట్టుగా వున్నాయి.

సరిగ్గా అప్పుడు చూసింది....

తనకు సమీపంలో నిలబడ్డ నలుగురు దృఢకాయుల్ని.

భయంతో ఓ కేక వేయబోయింది.

కాని అప్పటికే ఆలస్యమై పోయింది.

7

బలంగా నిశాంత చేతిని పట్టుకున్న ఓ గూండా మరోక్షణంలో ఆమె నోరును అరవకుండా మూయబోతుంటే పళ్ళతో గట్టిగా కొరికేసింది....

బాధగా చేతిని వదిలాడు.

జరుగుతున్నదేమిటో తక్కిన ముగ్గురు గ్రహించేలోగా రెప్పపాటులో గదిలోకి పరుగెత్తి చాలావేగంగా గడియపెట్టింది.

భయంతో ప్రకంపించిపోతూ పక్కగదిలో వున్న ఉపాధ్యాయుని నిద్రలేపాలని మధ్యనున్న ద్వారంపై దబదబా బాదింది కేకలు పెడుతూ.

ట్రాంక్విలైజర్స్ మత్తులో గాఢనిద్రలో వున్న ఉపాధ్యాయకు ఆమె గోడు వినిపించలేదు.

అప్పటికే కిటికీ అద్దాలను పగులగొట్టి లోపలికి వచ్చే ప్రయత్నం చేస్తున్నారు గూండాలు....

ఏమైపోయాడీయన....ఎంతకీ పలకడేం. ఉన్న ఒక్క నౌఖరూ సమయానికి రాడేం....

ఏం చేయాలిప్పుడు....

ప్రమాదం ఎంతవేగంగా పైబడబోతున్నదీ గ్రహించిన ఆమె ఇక ఎక్కువగా ఆలోచించే వ్యవధిలేనట్టు వెనుక ద్వారంవేపు చూసింది ఒక్క సెకండుపాటు.

మరో అరక్షణంలో ద్వారాన్ని తెరుచుకుని మెట్లపై నుంచి దూకుతున్నట్టుగా క్రిందికి దిగి కారిడార్‌లోకి పరుగెత్తింది.

అక్కడ నేలపై ఎవరో కొట్టిపడేసిన శవంలా పడివున్నాడు నౌఖరు.

ఆమెకు అర్థమైపోయింది అంత సేపు అతడెందుకు పలకలేదీ,

మంత్రించి వదిలిన బాణంలా శరాఘాతం నుంచి తప్పించుకు ప్రయత్నం చేస్తున్న ఓ చిన్నగువ్వలా కాంపౌండ్ గేటుదాటి చీకటిలో దూసుకుపోయింది.

పరుగు....

పరుగు....

ఒక మృత్యు గహ్వరంలాంటి చీకటిలోకి పరుగుతీసి కొద్దిగా అ వెనక్కి చూసింది.

సందు మలుపు తిరుగుతూ కనిపించారు గూండాలు.

లాభంలేదు....

తన బ్రతుకు చివరి అధ్యాయంలోకి అడుగుపెడుతూంది.

నిశ్శబ్దంగా సమాధుల్లా పడివున్న ఇళ్ళల్లో నుంచి ఏ వ్యక్తి తనని రక్షించలేరు.

ఆ క్షణాన ఆమెను అంతలా కలవరపరిచింది బ్రతుకుమీద తీ కాదు.

ఏం చేయకుండానే ఏమీ సాధించకుండానే బ్రతుకును ముగించవల వస్తుందే అన్న బాధ.

ఆమె అలసిపోతూంది....అయినా బలాన్ని కూడగట్టుకుని ఆ ముష్కరులనుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తూంది.

సరిగ్గా అప్పుడు చూసింది కింగ్ జార్జి హాస్పిటల్లో ప్రవేశించడాని అనుకూలంగా తెరిచివున్న ముఖద్వారాన్ని....

ఆ సమయంలో ఎటుపోవాలో తెలీని నిశాంత అసంకల్పితంగా హాస్పటల్లోకి తన వేగాన్ని మళ్ళించింది.

ఎవరూ లేరనుకుంది ద్వారం దగ్గర కాపలాగా.

కాని ఆమె అడుగుల చప్పుడికి నిద్రలోనుంచి కళ్ళు తెరిచిన గూర్ఖా ఎవరు అంటూ ఒక్క ఉదుటున ముందుకు వచ్చాడు.

ఆమెను వెంటాడే మరో నలుగురు దృఢకాయులు తనను క్రాస్ చేస్తుంటే లాఠీతో వారిని అడ్డగించబోయాడు,

మరుక్షణం అతడి మెడపైన బలంగా ఓ దెబ్బపడింది.

తూలి పడబోతూ గట్టిగా అరవబోయిన గూర్ఖా గడ్డంపై మరో ముష్టిఘాతం తాకగానే మెదడులోని సెరెబ్రల్ కార్టెక్స్ అదిరినట్లు స్పృహ తప్పిపోయాడు.

అప్పటికే నిశాంతి నిశ్శబ్దంగా వెలుగుతున్న నియాన్ లైట్లకాంతిలో ఓ గాలి కెరటంలా కదిలి ఓ వార్డులోకి అడుగుపెట్టడమూ ఓ బెడ్డుపైన పడుకునివున్న ఎనిమిదేళ్ళ పసివాడిని కావలించుకుని నిద్రను నటిస్తూ దుప్పటి కప్పుకోవడమూ జరిగిపోయింది.

ఆమె గుండెచప్పుడు ఆమెకే స్పష్టంగా వినిపిస్తుంటే చెవులు రిక్కించి వుండిపోయింది.

ఏమైంది దేవుడూ. ఇప్పుడేం జరగబోతూంది?

కాలం సర్పంలా నన్నెందుకిలా వెంటాడి తరుముతుంది.

కనిపించని క్షుద్రశక్తులేవో ఆమెపైబడి నరనరాల్ని పీకి పీలికలు చేస్తున్నట్టు భయం అణువణువునా వ్యాపించిపోతుంటే ఆమె ప్రయత్నం లేకుండానే కళ్ళ మంచి వేగంగా నీళ్ళు మూసుకొన్నాయి.

“ఎవర్నువ్వు” అడిగాడు.

ఆ ప్రశ్న వినిపించింది దూరంగా కాదు. సమీపంలో పడుకుని వున్న పసివాడినుంచి. రెప్పలార్పకుండా ఆమెనే గమనిస్తున్నాడు బాబు.

ఇప్పుడు మరో సమస్యలో ఇరుక్కున్నట్టు వెనువెంటనే అర్థమైందామెకు.

తాను ప్రవేశించింది ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లోకి అని గోడపై వున్న అక్షరాల ద్వారా గ్రహించగానే ఏ క్షణంలో ఏ డాక్టరు అక్కడ అడుగుపెడతారో అన్న భీతితో ఈ క్షణాన నన్ను రక్షించగల్గిన దేవుడివి నువ్వేనన్నా” అన్నట్టు అతడి చెంపల్ని మృదువుగా తాకింది.

“నీ పేరేం పేరు” ఈసారి కాస్త మృదువుగా.

”నిశాంతి” చెప్పింది,

"అంటే....ఎవరి మమ్మీని" మరో ప్రశ్న వేసాడు.

రాలి పడబోతున్న ఒక నీటిబొట్టు ఆమె కనుకొలకుల్లోనే ఆగిపోయింది.

"నీకు బాబీ లేదా...." అడిగాడు మళ్ళీ.

బాబీ ఎవరు?" అర్ధంకానట్టు చూసింది.

"నేనే...." ఈ మాత్రం తెలిదా అన్నట్టుగా నవ్వాడు" మరి నాకు మమ్మీ లేదుగా అందుకని—" అస్పష్టమైన ఒక నీలి నీడ ఆ పసివాడి కళ్ళల్లో కదలాడటం ఆమె గమనించింది.

దుప్పటి పూర్తిగా తొలగించి చూసింది.

పాలుగారే లేతవయసులో ఏ ఆర్తిలోనో ప్రాణాల కడంటిపోతున్నట్టు పాలిపోయిన కళ్ళు చెంగలువులతో చెక్కిన చెంపలపై దేవుడురాసిన నీలి మరకలా కనిపించాయి.

"ఏమైంది మీ మమ్మీ" పరిశీలనగా చూస్తూనే అడిగింది.

"ప్చ్" పెదవులను విల్లులా ఉంచాడు అర్థంకాని జవాబుని అర్థమయ్యేట్టు చెప్పే ప్రయత్నంలా....

దూరంగా ఎక్కడినుంచో బాధాకరమైన ఓ మూలుగు వినిపిస్తుంది. ఆమె చుట్టూ గమనిస్తూనే వుంది.

సమీపంలో ఎక్కడా చప్పుడు లేకపోవడంతో వీలైనంత త్వరగా మరో ఉపద్రవం జరక్కముందే వెళ్ళిపోవాలనుకుందేమో పైకి లేచింది.

"మీ బాబీననుకుని వచ్చిపడుకున్నావా" అడిగాడు.

టక్కున ఆగి బాబీవేపు చూసింది "అహ"

"ఇప్పుడు మీ బాబీ దగ్గరికి వెళతావా"

"ఆహా" ఎవరో ప్రేవులు మెలిపెడుతున్నట్లు కదిలింది.

"తమకెవరూ లేరు"

ఆవేశంగా బయటికి కదలబోతుంటే "మరి నాకు మమ్మీలా వుండిపోతావా" బాబీ అన్నాడు, గిరుక్కున వెనక్కి తిరిగింది. రెండే రెండు

అంగల్లో బెడ్డును చేరి భావరహితంగా చూసింది" నీకు మమ్మీ అంటే అంత ఇష్టమా?

"ఓ....బోలెడంత" కళ్ళు చక్రల్లా వెడలు చేసాడు.

"ఎవరో—నేనెవరో తెలీని నీకు నేను మమ్మీనెలా అవుతాను" ఉద్వేగంతో అంది.

"ఎందుకు కావు? నేనిష్టపడితే అయిపోతావు"

"అదికాదు బాబూ—అసలు మమ్మీ అంటే" ఆమె వాక్యాలు యింకా పూర్తికాలేదు.

"గాడ్స్ గ్రేటెస్టు గిఫ్ట్ ఫరాల్ టు చెరిష్, టు లవ్, టు రెస్పెక్టు అండ్ ఒబే టిల్ వుయ్‌పెరిష్" కంఠస్థం చేసినట్టు వల్లించాడు."

"ఎవతె నీకిదంతా ఎవరు...." టపటపా రాలిన నీటిబొట్లు బాబీకి కనిపించకుండా తలతిప్పి" ఎవరు నేర్పారు" అంది సన్నగా కంపిస్తూ.

"మా టీచర్"

"మరి—మీ టీచర్ చెప్పింది పూర్తిగా నీకు అర్థమైందా"

"ఉహూ కొంకెం కొంచెం అర్థమైంది. కాని మమ్మీ అంటే నాకు బోలెడు ఇష్టం."

"లేనివన్నీ మనిషికి ఇష్టంగానే వుంటాయి బాబీ" గొణిగినట్టుగా అంటుంటే హఠాత్తుగా ఆమెకు తన తల్లీ గుర్తుకొచ్చింది.

"టీచరు చెప్పింది తప్పా"

"లేదు బాబీ—ఒక చిన్ని ప్రపంచంలో బ్రతుకుతున్న నీకు ఆ మాటల్లోని సారాంశం పూర్తిగా అర్థంకాకపోయినా అది నిజంగా నిజం" దుఃఖంతో ఆమె గొంతుపూడుకుపోయింది" అందుకే ఐ ఒబేడ్ మై మదర్ విత్ రెస్పెక్టును మై సెల్ఫ్"

అర్ధం కానట్టుగా చూసేడు చాలా సేపటివరకూ

"అంటే ఇప్పుడు నీకు మమ్మీలేదా"

నిశాంత కళ్ళల్లో నీరు ఇప్పుడు స్పష్టంగా చూసేడు బాబీ. "అయితే నాకు మమ్మీగా వుండిపోతావా"

ఎలా కాగలను నా చిన్న నేస్తం....ఎవరికి ఏమీకాని నేను నీకు అమ్మెనెలాకాను.

కాలం కంచెగామారి మేసిన చేనువైన నేను.

నీ చేతికుంచెలో ఒక చేవ్రాలు నెలకాగలను.

ఒక మోదమా ప్రమోదమో తెలీని స్థితిలో ఆమె వుండగానే అద్దం తలుపుల్ని తెరుస్తున్న చప్పుడైంది.

ఉలికిపాటుగా అటు చూసింది.

"ఎవరు మీరు" అడిగింది ఎదురుగా నిలబడివున్న స్టేఫ్‌నర్సు."

ఏం జవాబు చెప్పాలి. ఇప్పుడే జరగపోతూంది.

"మిమ్మల్నే—"

"మా మమ్మీ" అనుకున్నట్టుగా లేచివచ్చి నిశాంత చేతిని పట్టుకున్నాడు బాబీ.

ఇప్పుడు ఆశ్చర్యపోవడం ఆమె వంతైంది.

"నీకు మమ్మీ ఉన్నా—" సందిగ్ధంగా ఆగిపోయిన నర్సుకేసి చూస్తూ "నాకోసం తిరిగొచ్చిందనుకో....అప్పుడు"అన్నాడు బాబీ బొమ్మలు పైకి ఎగరేస్తూ.

"ని....నిజమా....సారీ బాబీ—కాని ఇలాంటి వేళలో—" తొట్రుపడుతూంది బాబీ ఏ కుటుంబానికి చెందిన వాడో తెలిసిన నర్స్" క్షమించండి. బహుశా మీ అబ్బాయిని రహస్యంగా చూడాలని....ఇలాంటి వేళ వచ్చారన్నమాట."

అవునన్నట్టుగా తలూపిన నిశాంతకు ఇప్పటికీ అంతా అర్థమైంది.

"బాబీకి తల్లి వుంది కాని ఎందుకో దూరంగా వెళ్ళిపోయింది.

"మేడమ్" నర్సు అంటుంది "మీ స్థాయికీ చెందిన వాళ్ళకు చెప్పగలదాన్ని కాదు—కాని బాబీ మీకోసం మీ ప్రేమకోసమే ఎంత అలమటించిపోతున్నదీ అర్థమైన ఒక ఆడదానిగా ఇప్పటి మీ నిర్ణయాన్ని మాత్రం అభినందిస్తున్నాను—ఒకరకంగా మీరులేని లోటుతోనే బాబీ ఎంత

వున్నా ఏమీలేని ఓ అనాధలా మానసికంగా కృంగిపోయాడు.... మీవారికి ఫోన్‌చేయనా" అంది.

"వద్దు" వారించింది నిశాంత ఆగిపోయింది నర్సు.

ఏమిటిది బాబీ నేర్పుతో అల్లిన ఒక కథలో ఇప్పుడు చిత్రంగా తను ఒక తల్లి పాత్రలో అభినయిస్తూందా.

"సో బాబీ—నౌ యూ ఆర్ గోయింగ్ టు మెడిసన్స్" అంటూ నర్సు ఓ మందుబాటిల్ తెరిచి స్పూన్లో మందుపోసింది.

"తీసుకోనా" అన్నట్టుగా చూసాడు నిశాంతవేపు.

నిశాంత తలూపగానే బుద్ధిమంతుడైన మంచి బాలుడిలా మందు తాగేసాడు.

"గుడ్ బోయ్" అభినందించి నర్స్ "చూసేరా మేడమ్ మందు తాగనని మమ్మీకావాలని మా ప్రాణాలు తీసేవాడు. ఇప్పటికి మాకీ శ్రమ తప్పించారు" వెళుతూ "బాగా అలిసిపోయినట్టున్నారు. రెస్టు తీసుకోండి ఏమన్నా అవసరమైతే బజర్ నొక్కండి" అంది.

నర్స్ వెళ్ళిన చాలా సేపటి వరకూ నిశాంత తేరుకోలేదు.

"భలే....భలే నిజంగా మమ్మీ అనుకుంది కదూ" ఆకతాయిగా చప్పట్లు కొడుతున్న బాబీనే చూస్తూ క్షణంలో ఎంత మార్పు పసివాడిలో అనుకుంది.

ఏదో అడగాలనీ అనిపించింది.

కాని అది తనకు అవసరంలేని కథ....

తెల్లవారే వరకూ మాత్రమే ఉండే ఈ బంధాన్ని మరింత బలంగా మార్చి బాబీ మనసులో అనవసరమైన రాపిడికి తను కారణం కాలేదు.

అందుకే తమాయించుకుంటూ "నిద్రపోవూ" అంది.

"జోలపాడవూ" మళ్ళీ చిలిపిగా అన్నాడు ఆమెనే అనుకరిస్తూ.

అప్రయత్నంగా ఆమె పెదవుల్లో లాస్యం చోటు చేసుకుంది. బాబీని పొదివి పట్టుకుని బెడ్‌పైకి చేర్చింది.

ఆమెను కావలించుకుని క్రమంగా నిద్రలోకి జారిన బాబీని చూస్తూ అనుకుంది."

"తెల్లారిన నా బ్రతుకులో ఒక చిన్న వేగుచుక్కలా కలిసి అరక్షణమైనా కదిలించిన చిన్నకొండా! నా బ్రతుకు నడిసముద్రంలో చుక్కానిలేని నావని నీకెలా చెప్పను.... నీలాంటి చిట్టి తండ్రిని దూరం చేసుకున్న అ తల్లి నీకు చేరువ కావాలని తానెంత కోల్పోయిందీ తెలుసుకుని గాయపడిన నీ లేతమనసుకు శాశ్వతంగా ఊరటనందించాలని కోరుకుంటున్నాను."

ఒక నీటిబొట్టు బాబీ చెంపపై జారి తళుక్కుమంది.

* * * *

"హల్లో"

నడుస్తున్న విశాంత టక్కున ఆగిపోయింది. ఎదురుగా భాస్వంత్ నిలబడి వున్నాడు.

తెల్లవార్లూ బాబీ దగ్గరే వుండిపోయిన విశాంత హాస్పిటల్లో సందడి మొదలు కావడంతో ఇక ప్రమాదం వుండదన్న నిర్ధారణకు వచ్చాక నిద్రపోతున్న బాబీని చివరిసారిగా చూసి బయలుదేరింది.

"బాగున్నారా" అడిగాడు భాస్వంత్.

"అవునూ మీరేంటి ఇలా వచ్చారు" తనే ముందుగా ప్రశ్నించింది ఆ ప్రశ్న అతడినుంచి వస్తే తనేం జవాబు చెప్పాలో తెలీని స్థితిలో.

ఆ క్షణాన కూడా ఆమె పరిసరాల్ని పరిశీలనగా గమనించడం మరిచిపోలేదు."

"పరోపకారంలెండి" నవ్వేడు మృదువుగా. "వినూత్నంగా ప్రారంభించాలనుకున్న నా జీవితయానంలో నేనిష్టపడని చిన్న మజిలీ....ఆగాల్సి వచ్చింది" ఓ వృద్ధుడు తన కళ్ళముందే నేలపై కూలిపోవడం మొదలుకుని అతడ్ని హాస్పటల్లో చేర్పించడం వరకూ అంతా చెప్పాడు.

"నిజానికిది చాలా మామూలు. కేసనుకున్నాను" అప్పటికి కొన్ని గంటల క్రితమే ఎంజోగ్రామ్ పరీక్ష ద్వారా గుండెకు రక్తాన్ని తీసుకుపోయే ఓ ఆర్టెరీ" ఒకచోట బాగా సన్నపడి మామూలుగా జరగాల్సిన రక్తప్రసారం పరిమాణం తగ్గిపోయిందని తెలుసుకుంటే....

కార్డియాక్ కేథడరైజేషన్ టెస్టులో ఇంట్రావీనస్ కేథటర్‌తో గుండెలోని రక్తం సాంపిల్ తీసి అందులో ప్రాణవాయువు తగ్గిన వాస్తవాన్ని తెలుసుకున్నారు డాక్టర్లు.

"నేను తర్కం మాట్లాడటంలేదు విశాంతగారూ మన చుట్టూ వున్న గాలే కలుషితమైనప్పుడు రక్తంలోని ప్రాణవాయువు మాత్రం కలుషితం కాకుండా ఎలా వుంటుంది. మనిషి జీవితమే క్షణం....క్షణం కుంచించుకుపోతుంటే మనిషి వంటిలోని బ్లడ్ వెసెల్స్ మాత్రం కుచించుకుపోక ఏమౌతాయి. సాలోచనగా చూసేడు మరెటో "ఇప్పుడు బైపాస్ సర్జరీ చేయాలట. అదీ ఇక్కడ కాదు....అలాంటి ఫెసిలిటీస్ ఈ హాస్పటల్లో లేవు. అమెరికన్ హాస్పటల్‌కి తీసుకు వెళ్ళాలి. కాని....సుమారు ముప్ఫై వేల ఖర్చుతో ఒక పేద వృద్ధుడు తనను తాను ఎలా కాపాడుకోగలడు."

ఆమె వింటోంది మౌనంగానే.

"అదికాదు నేనిప్పుడు ఆలోచిస్తున్నది....మనిషి సృష్టికి కారణం దేవుడే అయితే ఆ దేవుడి సృష్టిని ఇప్పుడు డబ్బనే ఒక మారణాస్త్రం దారుణంగా ప్రశ్నించి తన ఆధిక్యతను నిరూపించుకోజూస్తోంది. అంటే డబ్బుతో దేవుడ్ని సైతం ధిక్కరించవచ్చని మీరు అంగీకరిస్తారా"

"అతడి అంతరాళంలోని ఏ సంఘర్షణ అతడిచేత యిలా మాట్లాడిస్తున్నది ఆమెకు తెలీదు.

వీలైనంత త్వరగా తను అక్కడనుంచి ఉపాధ్యాయను చేరాలని తాపత్రయపడుతూంది.

సరిగ్గా అప్పుడు చూసింది.

థియేటరులోనుంచి స్ట్రెచర్ పై వార్డులోకి తీసుకువెళుతున్న స్పృహలేని ఓ వృద్ధుడ్ని.

వెనువెంటనే "ఈయనే నిశాంతగారూ....నేను చెప్పిన మనిషి" అన్నాడు మామూలుగా....

ముందు అవాక్కయింది.

ఆ తర్వాత శరీరంలోని శక్తి హఠాత్తుగా సన్నగిల్లినట్టు తూ గోడకి జారగిలబడిపోయింది.

భాస్వంత్ రక్షించింది ఎవర్నో కాదు....తప్పిపోయిన పెద్దకూతురి నిశాంత కోసం అహర్నిశలూ ఆలోచిస్తూ గుండెను తునకలుగా మార్చుకున్న శేఖరం మాస్టార్నే....

"ఏమైంది మీకు" ఊపిరి అందనట్టు పెనుగులాడుతున్న నిశాంత్ చూస్తూ అడిగాడు భాస్వంత్.

చెప్పింది అతడెవర్నదీ ఒక విశ్చేష్టత మెరుపులా అతడి మెదడు నరాలపై ఛేళ్మనిపించింది.

అదీ కొంతసేపే....

వెంటనే తేరుకున్నాడు "థెంక్‌గాడ్! అంటే మీరిలా వచ్చింది మీ ఇంటికి నేనిచ్చిన టెలిగ్రాం అందుకున్నారనే అన్నమాట....అదేంటో మరి మీ అమ్మ....తమ్ముడూ" స్పృహ కోల్పోతూ శేఖరం మాస్టారు ఇచ్చిన వివరాల్ని మననం చేసుకుంటూ అడుగుతుంటే ఆమె దూరంగా మరటో చూస్తూ వుండిపోయింది.

"ఇప్పుడు నేను ఆ ఇంటి మనిషిని కాదు" నెమ్మదిగా అంది.

అర్థంకాలేదు అతనికి.

"ఒకవేళ.... మావాళ్ళు వచ్చినా నా ఉనికి దయుంచి వాళ్ళకి తెలియనియ్యొద్దు ప్లీజ్" ఉవ్వెత్తున పొర్లిన దుఃఖంతో చేతులు జోడించింది.

"నేను....నాన్నకి తెలియకుండా ఇంట్లో వాళ్ళచేత తరిమేయబడిన ఆడదాన్ని....నాన్న దృష్టిలో మాత్రం నేను మరణించిన ముద్దుల కూతుర్నే....దయుంచి నా విషయం నాన్నకు తెలియనివ్వద్దు" పొర్లుకొస్తున్న దుఃఖంతో మొహాన్ని చేతుల్లో కప్పుకుంది....

అస్పష్టంగానైనా అర్థమైందతడికి చాలా. ఆ రోజు ట్రైనులో కలిసిన ఈ నిర్భాగ్యురాలు ఇప్పటికీ అదేస్థితిలో మిగిలిపోయింది.

సరిగ్గా అప్పుడే అతడిలో చాలాబలంగా ఓ ఆలోచన రూపుదిద్దుకుంది.

"ఇప్పుడేం చేద్దామనుకుంటున్నారు"

ఏడుస్తున్నదల్లా నెమ్మదిగా తలెత్తి చూసింది.

ఇదే....సరిగ్గా ఇదే ప్రశ్న తనను విడిచిపెట్టకుండా వెంటాడుతున్నదీ.

"అలా దిగులుగా చూడడం కాదు....జవాబు చెప్పండి."

మౌనం రెండు నిముషాల పాటు....

తర్వాత కట్టలు త్రెంచుకున్నట్టు దుఃఖం ఆమెపైబడి మరోమారు ఓడించింది. "ఏమిచేయాలో....ఏమిటో.... నేనేం చెప్పేది"

"ఛఛ.... ఆ నిస్సహాయతంటే నాకు చాలా అసహ్యం" చాలా అసహనంగా పక్కకు తిరిగాడు.

"నా స్థానంలో మీరుంటే తెలిసేది"

చివాలున తల పైకెత్తాడు. వెనువెంటనే ఓ నవ్వు. నిర్లిప్తంగా.

"నిశాంతా!" గుండెలోతుల్లోని విషాదాన్ని అదిమిపెడుతూ నెమ్మదిగా పెంచాడు. "నాతో మీరు పోల్చుకుంటున్నారా" నా స్వస్వం అనుకున్న వాళ్ళనందర్నీ ఒకే సమధిలో పూడ్చి ఇకపై ఒక్క కొత్త తాత్విక దర్శనంతో జీవిత ప్రయాణాన్ని మొదలు పెట్టిన నన్ను విషాదమంటే ఏమిటో ప్రశ్నిస్తున్నారా! నా అనుకున్న వాళ్ళనందర్నీ కోల్పోయి కొన్ని గంటలు గడవకముందే నిబ్బరంగా నిలబడి మీతో ఇలా మాటాడుతున్న నన్ను అతడు చెప్పాలనుకున్నది ఇంకా పూర్తికాకముందే అతడి కళ్ళనుంచి జలజలా నీళ్ళు రాలుతుంటే రొప్పుతున్నట్టు ఆగిపోయాడు.

"ఇవి— ఇవి నేను నిస్సహాయగిగా రాల్చుతున్న కన్నీళ్ళుకావు... పూర్తిగా తడిఆరని స్మృతులు చిమ్ముతున్న చివరి నీటిబొట్లు."

ఆమె విభ్రమంగా అతడ్నే చూస్తూంది.

క్షణాలు గడుస్తున్నాయి. క్షతగాత్రులైన ఇద్దరు సైనికుల మధ్యచిత్రమైన నిర్లిప్తతని దొర్లొస్తూ....

కాళ్ళకు సాక్స్ లేవని బాధపడేకంటే అసలు కాళ్ళేలేని వాడ్ని చూసి సంతృప్తిపడాలి నిశాంతా!" స్థిరగంభీరదృక్కుల్తో ఆమెను చూస్తూ "యాదృచ్ఛికంగా ఆనాడు కలసిన మనం ఈరోజు ఇలా మళ్ళీ కలియడం చిత్రమే అయినా నా ప్రమాణంతో తొలి అధ్యాయానికి ఈరోజే శ్రీకారంచుట్టి మీ నాన్నగార్ని కాపాడటానికి అవసరమైన ఆ డబ్బునే మారణాస్త్రంపై మొదటి విజయం సాధించాలని వెళుతున్నాను.... మీరు నిశ్చింతగా వుండండి" వెళ్ళిపోయాడు భాస్వంత్.

ఎలా....

అంతడబ్బు ఎలా సాధించి తీసుకు రాగలను....

ఇప్పుడు ఏం జరగబోతూంది.

సాలోచనగా ముందుకు నడిచింది నాన్నను ఒకసారి చూడాలని.... కాని సరిగ్గా అప్పుడే ఎదురుగా వస్తున్న అమ్మదీ తమ్ముడ్ని గమనించగానే ఉలికిపాటుగా ఓ స్థంభంవారకు వెళ్ళిపోయింది.

* * * *

మనిషి జీవితంలో అనూహ్యమైన పరిణామాలు ఏర్పడడ వాస్తవమో చాలా సన్నివేశాల్లో కేవలం శ్రోతగానో ప్రేక్షకుడిగానో మిగిలిపోవడం అంతే సహజం....

భాస్వంత్ తిరిగి వస్తాడని చాలా నమ్మకంగా ఒకగంటపాటు హాస్పటల్లో రహస్యంగా దాగునే ఎదురు చూసింది నిశాంత....

తండ్రిని చూడాలనే ఉద్వేగాన్ని అణుచుకోలేక చూసే స్వతంత్రం లేక మానసికంగా నలిగిపోతూనే పిచ్చిదానిలా మరికొన్ని గంటలు గడిచింది.

ఆ తర్వాత సముద్రపు ఒడ్డుకు చేరుకుంది.

మధ్యలో ఓ వార్డుబోయ్‌ద్వారా తండ్రి పరిస్థితి గురించి భాస్వంత్ రాక గురించి ఆరా తీయడం ఆమె మరచిపోలేదు.

టెన్షన్.. తనగురించికాదు. తండ్రి పరిస్థితి సృష్టించిన టెన్షన్ కొన్ని గంటలక్రితం వరకూ ఉన్న ఆందోళన్ని మెటీరియలిస్టిక్‌గా అధిగమించింది.

ఎదురుగా ఎగిరిపడుతూ మరుక్షణం ఎగిరి వెనక్కి వెళ్ళిపోతున్న కెరటాల్ని చూస్తుంటే చిత్రమైన ఆలోచలు....

మరలివచ్చిన కెరటాల్ని కడుపులో దాచుకుంటున్న కడలినిచూస్తుంటే ప్రాపంచికమైన చాలా సమస్యలకు అస్పష్టంగానైనా కనిపిస్తున్న పరిష్కారం.

మరో అరగంట వరకైనా ఆమె ఆలోచనలు అలాగే కొనసాగితే పర్యవసానం ఎలా వుండేదో....

కాని సరిగ్గా ఆ సమయంలోలి....

పిలిచారెవరో....

సమీపంలో నాగరాజు నిలబడి వున్నాడు. మొన్నరాత్రి నీడనిచ్చి తనమూలంగా తనూ ఆపదలో చిక్కుకున్న వ్యక్తి.

ఈ విశాలనగరంలో ఉదయంనుంచీ ఆమెకోసం గాలిస్తున్న నాగరాజు ఆమెను కలియటం అనుకోని సంఘటన. కాని జీవితంలో జరిగే చాలా సంఘటనలు అనుకోనివే—

నిన్నటిరోజు పోలీసుల కష్టడీలోంచి బయటకివచ్చిన నాగరాజు నిశాంతకు జరిగిన అవమానం మాత్రమే కాదు.

అతడికున్న అవమశంతో నిశాంత్‌ను వెంటాడుతున్న వ్యక్తుల గురించీ తెలుసుకున్నాడు.

రాత్రి అయ్యేసరికి గాలింపు మరింత తీవ్రతం చేయబడిందన్న వార్తను సేకరించాడు.

అంతే....

ప్రత్యర్థుల ఎంతబలవంతులో తెలిసి రంగంలోకి తనూదిగేడు.

వైజాగ్ చేరుకున్నాక ఉదయం నుంచీ చాలా అసహనంగాగడిపేడు. అతనివృత్తి ఆడపిల్లల్ని రక్షించడం కాదు.

కాని ఎందుకో చాలాబలంగా ఆకట్టుకున్న నిశాంత్ ఒక లేగదూడలా అనిపించింది. పైగా మలుపుతిరిగిన ఆమె కథలో తానూ ఓ పాత్రగా మారేడు.

అక్కడ అభియోగాన్ని ఎలాగూ రక్షించలేకపోయాడు. కనీసం ఇక్కడైనా ఆమెకు అండకావాలి.

"అమ్మా నిశాంతా! నువ్వేలాంటి ప్రమాదకర పరిస్థితుల్లో చిక్కుకున్నావో నువ్వూహించలేవు. ప్రభంజనలోవు ముఠా నీ కోసం గాలింపును ఉధృతం చేసింది.

"చేయనీయన్నయ్యా" ఇంకా పోగొట్టుకోడానికేం మిగిలిందన్న వైరాగ్యంతో చూసింది అతన్ని.

"నీకు తెలీదమ్మా" ఆ ముఠా ప్రాచుర్యం గురించి అతడు పరేదో చెప్పబోతుండగా వారించింది. అతడికీ అంతవరకూ తెలీని తన తండ్రి కథను తెలియపరిచింది.

చాలా సేపటివరకూ స్తబ్ధంగా నిలబడిన నాగరాజు చివరికి అన్నాడు. "నిశాంతా! నీకు నేను పూర్తిగా సహకరించలేకపోయినా ప్రస్తుతానికి కొంత సర్దగలనమ్మా! నీ రక్తపు కూడు నాకెందుకూ అని నిరసించక నా సహాయాన్ని అంగీకరిందువంటే మరో రెండురోజుల్లో తక్కింది ఏర్పాటుచేసే ప్రయత్నం చేస్తాను."

ఇప్పుడు ఆమె చూసింది ప్రపంచం నిరసించే ఒక రాక్షసుడిలో ఔదార్యాన్ని మాత్రమే కాదు దుష్టుడిని దేవుడిగా మార్చగల దివ్యక్షణాల్ని.

"నువ్వు ఒంటరిగా వుండటం క్షేమంకాదు కాబట్టి నాతోరా. కాపలాగా వుంటూ డబ్బు తీసుకుని నిన్ను క్షేమంగా హాస్పటల్ దగ్గర దిగబెడతాను" గొంతులోని తీవ్రతని ఆమె అర్థంచేసుకుంది.

మరో గంటన్నరకల్లా అనకాపల్లి చేరుకున్న నాగరాజు నిశాంతతో సహా ఇంటికి వెడుతూ జనసందారంలేని ఓ రహస్య మార్గాన్ని ఎన్నుకున్నారు.

మునుమాపువేళ....

శారదా నది ఒడ్డున వున్న మామిడితోటలో నడుస్తున్న ఇద్దరూ టక్కున ఆగిపోయారు ఒకచోట—

చెట్ల చాటునుంచి చెమ్మదిగా ముందుకొచ్చారు సుమారు ఆరుగురు ధృఢకాయలు.

క్రూరమృగాల్లా కర్కశకగా నవ్వుతున్న వారిచేతుల్లో పొడవాటి చైన్లతోపాటు.... మెరుస్తున్న చాకులున్నాయి.

భయంతో వణికిపోతున్న నిశాంతచేతిని పట్టుకున్న నాగరాజు చుట్టూ చూసేడు.

కనుచూపుమేరలో ఎవరూ లేరు.

కాని వెనుకనుంచి కూడా మరోనలుగురు నెమ్మదిగా రావడాన్ని గమనించాడు.

ఒక ప్రళయానికిముందు ఏర్పడే ప్రశాంతత అక్కడచోటుచేసుకుంది.

8

ఒకటి....రెండు....మూడు....

క్షణాలు భయానకంగా దొర్లిపోతున్నాయి....

నిశాంత అప్పటికే పూర్తిగా చెమటతో తడిసిపోయింది.

ఇప్పుడేం జరగబోతూంది?....మామూలు ప్రశ్నే....

కొన్ని నెలలుగా ఈ క్షణం వరకూ ఆమెను వెంటాడుతున్న ప్రశ్న అది....

చాలా చేరువగా వచ్చారు చుట్టుముట్టిన గూండాలంతా.

ప్రమాదాన్ని పూర్తిగా పసిగట్టిన ఓ కళింగ నాగులా ఒక బుస లాంటి నిట్టూర్పు విడిచిన నాగరాజు బొడ్డులోంచి సర్రున పైకి లాగాడు. సుమారు ఆరంగుళాల పొడవున్న చాకును.

ఎదురుగా నిలబడ్డ వ్యక్తులకు ఆలోచించుకునే వ్యవధికూడా ఇవ్వలేదు....

వాళ్ళు తేరుకునేలోగానే ఇద్దరి పొట్టలు చీలిపోయాయి.

రక్తంధారగా పైకి చిమ్మడంతో తక్కినవాళ్ళు కాస్త వెనక్కి జరిగారు.

అదే నాగరాజు కోరుకున్నది కూడా.

ఒడుపుకి వేగాన్ని జోడించాడు. వెనకడుగు వేసిన వ్యక్తులపై ఓ మెరుపులా లంఘించి చాకుతో మరో ముగ్గురికి గాయాన్ని చేసాడు.

క్షణంలో వాతావరణం మారిపోయిందక్కడ.

నిశాంత వణికిపోతూ మధ్యలోనే నిలడిపోయింది.

ఇప్పుడామె కళ్ళకు నాగరాజు పద్మవ్యూహాన్ని ఛేదిస్తున్న అభిమన్యుడు కనిపించాడు.

గగుర్పాటును కలిగిస్తున్న వాతావరణం.

మరో రెండు నిముషాలు గడిచింది. అప్పటికే ఇలాంటి ప్రమాదాలు తనకు కొత్తకాదని నిరూపించుకున్న నాగరాజు చంపాలని వచ్చిన వాళ్ల చావుదప్పితే చాలని పరుగు లంకించుకోవానికి కారణమయ్యాడు.

ఆలస్యం చేయలేదతడు.

ఒకవేళ గాయపడ్డ ఏ వ్యక్తులైనా ప్రాణాలు పోగొట్టుకోవడం జరిగితే ఆ వార్త ప్రభంజనరావుకి చేరుతుంది. తన ఆధిక్యతను విఖ్యాపించుకునే ప్రయత్నంగా తన సేనని పోరాటానికి దింపడం మాత్రమే గాక ఇటు పోలీసు బలగాన్ని సైతం తనపైకి మళ్ళిస్తాడు.

అందుకే చాలా వేగంగా నిశాంతను ఇంటికి తీసుకువెళ్ళాడు.

ఆమె ఇంకా జరిగిన నరమేధపు సంఘర్షణ నుంచి తేరుకోనే లేదు.

ఓ హరికేన్ లాంతరు వెలిగించి పెట్టె అడుగునవున్న కరెన్సీ నోట్లను తీసాడు.

"నిశాంతా! నీ తండ్రిని కాపాడాలన్న వుద్దేశ్యంతో హామీ ఇచ్చిన అనుకోని అవాంతరం మూలంగా ఇప్పటికి ఈ డబ్బు మాత్రమే నీకు ఇవ్వగలుగుతున్నాను. పోలీసులకి చిక్కకుండా వుండగలిగితే నీకిచ్చిన మాట నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తాను."

తనకేమీ కాని ఒక వ్యక్తి తనకోసం అంతటి ఆత్మత్యాగానికి సిద్ధపడ్డమేగాక ఈ స్థితిలో కూడా ఇంకా సహకరించాలన్న ఆలోచన్ని వ్యక్తం చేస్తుంటే బదులేం చెప్పాలో తెలీని స్థితిలో అలాగే నిలబడి చూస్తూ వుండిపోయింది.

"నిజానికి ఈ డబ్బును నేను సంపాదించింది అక్రమమార్గంలోనే అయినా గాడితప్పిన నా బ్రతుక్కి ఇది ఏ విధంగానూ ఉపయోగపడదమ్మా! ఈ విధంగానైనా ఒక మంచిపనికి దీన్ని నేను అందించగలిగితే నా జీవితానికి ఓ సార్థకత ఏర్పడిన తృప్తయినా మిగులుతుంది.

పది హేనువేల రూపాయల్ని ఆమె చేతిలో వుంచాడు.

కాదనలేకపోయింది. జీవితం నడిపిస్తున్నట్టే కదలడం అలవాటైన ఒక మామూలు ఆడపిల్లలా ఆ క్షణంలో ఆమెకళ్ళు చెమర్చితే అది ఆమె తప్పుకాదు.

"వెళ్ళమ్మా! నువ్వు మరో ప్రమాదంలో చిక్కుకోకముందే ఇక్కడ్నుంచి వెళ్ళిపో" తొందరచేసాడు "ఒక్క అభ్యర్థన. ఒకవేళ నిన్ను మళ్ళీ నేను కలిసే అవకాశం లేకపోయినా నేను చేస్తానన్న సహాయం విషయంలో నేను మాటతప్పినా నన్ను మన్నించు" తలవంచుకున్నాడు.

ఆమె రెండడుగులు ముందుకేసింది వెళ్ళాలని. కాని ఎందుకో ఏదో చెప్పాలని ఆగింది.

అప్పటికే నాగరాజు నెమ్మదిగా ట్రంకుపెట్టె అడుగున వున్న ఓ ఫోటోలాంటిదేదో తీసాడు.

మరుక్షణం ఆమెను నిలువునా కుదిపేసే వెక్కిళ్ల లాంటివి వినిపించాయి.

ఆమె విశ్చేష్టురాలై చూసింది.

నాగరాజు కళ్లూ నీళ్ళు చిలికించగలవని ఆమె తెలుసుకున్న తొలిక్షణమది.

"ఒక నివేదనలా గొణుగుతున్నాడు నెమ్మదిగా" నువ్వు దూరమయ్యేక రక్తాన్ని కళ్ళచూడడమే అలవాటు చేసుకున్న నేను నీకోసం ఇన్నాళ్లు పదిలంగా దాచుకున్నవి ఈ కన్నీళ్ళే. నువ్వు లేనపుడు నేనెలా బ్రతికితేనేం అంటూ ఈ దారిలో అడుగుపెట్టాను. ఇప్పుడు మలుపు తిరిగిన ఈ యాత్ర గమ్యానికి సిద్ధపడుతూ వెళ్ళిపోతున్నాను. గుడ్‌బై."

నిశాంత ఉత్సుకతని చంపుకోలేక పోయింది.

నెమ్మదిగా చాలా నెమ్మదిగా అతడ్ని సమీపించింది. ఓదార్చడానికన్నట్టుగా.

అంతే....అసంకల్పితంగా ఫోటోలకి చూసి....

అతడి ప్రక్కన ఫోటోలో ఉన్న వ్యక్తిని గుర్తించి గగుర్పాటుతో ఒక్క అడుగు వెనక్కి వేసింది.

'అన్నయ్యా' ఆమె ఉద్వేగంతో అరచిన అరుపు ఆమె గొంతులోనే సమాధి అయిపోయింది.

* * *

ఖరీదైన బంగార్రాజుగారి భవంతి ఖరీదైన మనుషులతో సందడిగా వుంది.

పగలు ఒకటి రెండుసార్లు వచ్చిన భాస్వంత్ బంగార్రాజు దర్శనం కాకపోవడంతోనూ పైగా సాయంకాలం అక్కడ ఓ మినిస్టర్‌గారికి పార్టీ ఏర్పాటు చేయబడిందని తెలియడంతోనూ ఆయన్ని కలుసుకోవటానికి అదే సరైన సమయమని నిర్ధారించుకున్నాడు.

చీకటిని చీల్చే విద్యుద్దీపాల తోరణాలతోనూ సిటీనుంచి వచ్చిన ఖరీదైన ఆహూతులతోనూ చాలా ఆర్భాటంగా వుంది భాస్వంత్ వచ్చేసరికి.

అక్కడ దూరంగా ఓ టేబుల్ దగ్గర నిలబడిన బంగార్రాజు అతడి రంగులో కలిసిపోయిన గ్రే కలర్ సూట్‌లో రోడ్స్ అండ్ బిల్డింగ్స్ మంత్రివర్యులలో ఏదో జోక్స్ వేస్తున్నాడు.

అర్థమైంది భాస్వంత్‌కి అతడా పార్టీ ఎందుకు ఏర్పాటు చేసింది.

బ్రిడ్జి కూలిపోవడంతో కాస్త పరపతి దెబ్బతిన్న బంగార్రాజు మొన్న లౌక్యంతో తండ్రిని ముంచితే ఇప్పుడు తన పేరు బ్లాక్ లిస్టులోకి వెళ్ళకుండా మంత్రిగార్ని మందుతోనూ, విందుతోనూ ముంచాలని ప్రయత్నిస్తున్నాడు.

'తెలివైన బాస్టర్డు' అనుకున్నాడు తనలో తానే నవ్వుకుంటూ.

ఓ టేబుల్ ముందు కూచుని వున్న భాస్వంత్‌కి చుట్టూ వున్న వ్యక్తులెవరూ కనిపించడంలేదు. అంత ఖరీదైన వాతావరణంలో తానో పిపీలకాన్ని అన్న విషయమూ స్ఫురణకు రాలేదు.

మనిషి జీవితం కథ కాకపోయినా కథల్ని మించిన అవాస్తవిక సంఘటనలు, ట్రాజెడీలు ఒక మనిషిని నిర్భాగ్యుడిని చేస్తే మరో మనిషిని భాగ్యుడ్నిడ్ని చేస్తాయి.

నెమ్మదిగా ఓ బేరర్‌ని పిలిచి "అర్జెంటుగా ఈ కవరుని బంగార్రాజుగారి కందచేయ్. వెంటనే చదవమని చెప్పు" అందించాడు.

ఆ కవరుపై "మోస్ట్ కాన్ఫిడెన్షియల్" అన్న అక్షరాలు విడిగా రాయడం అతడు మర్చిపోలేదు.

ఒక ప్రముఖుడితో చాలా విలువైన కాలాన్ని సద్వినియోగం చేసుకుంటున్న బంగార్రాజు ముందు తనను డిస్టర్బ్ చేసిన బేరర్‌ని చూసి "యూ బాస్టర్డు" అనబోయి వెంటనే ఆ కవరుపై ఉన్న అక్షరాల్ని కూడబలుక్కని చాలా సహజమైన ఉత్సుకతతో అందుకున్నాడు.

మరుక్షణం "ఎక్స్‌క్యూజ్మీ సర్" అంటూ మంత్రిగారి అనుమతి

తీసుకుని ఓ మూలకెళ్ళి లైటు వెలిగించి కవరు చించాడు. అందులో ఓ ఉత్తరం కనిపించింది.

"డియర్ భాస్వంత్...."

మొదటి ఆ డ్రెస్సింగ్ చూడగానే ఇదేంటి అంటూ కాస్త అర్థం కానట్టు మొహంపెట్టిన తర్వాత అక్షరాలు తనకు చాలా పరిచయమైనవిగా గుర్తించి చాలా వేగంగా చదవడం మొదలుపెట్టాడు.

"నీకోసం ఎన్ని నిద్రలేని రాత్రులు గడుపుతున్నానో నీకెలా తెలిసేది. నువ్వయితే హాయిగా బొంబే వెళ్ళావు. నాకు మాత్రం మహా బోర్‌గా ఉంటుంది. అందుకే నీ రూపాన్ని తలచుకుని ఆ రూపాన్ని నెమ్మదిగా నా మీదకు లాక్కుని నీ చేతుల్తో నా పావడాని నెమ్మదిగా పైకెత్తుతున్నట్టు వూహించుకుని నీ వ్రేళ్ళు నా ముడుకులపై నుంచి నెమ్మదిగా పైకి....పైపైకి...."

'ఛఛ' జుగుప్సగా తల విదిలించి అడుగున వున్న 'రజని' అన్న పేరు చూడగానే ఉక్రోషంతో వూగిపోయాడు.

'అయినా ఇది ఈ వేళలో ఎందుకు పంపేడు. ఎక్కడ వాడు' అనుకుంటూ తలపైకెత్తిన బంగార్రాజుకి 'హలో' అన్న పలకరింపు వినిపించింది.

ఎదురుగా భాస్వంత్ నవ్వుతూ నిలబడి వున్నాడు.

"నువ్వా...." ఆవేశంగా రెండడుగులు ముందుకేసిన అతడ్నే చూస్తూ "అసలు సంగతి అందరికీ తెలిస్తే అనవసరమైన కంపు....అరవకుండా ఉత్తరాన్ని దాచేయండి" అన్నాడు భాస్వంత్.

"ఏంటిది...." నిస్సహాయంతో బంగార్రాజు పిడికిళ్ళు బిగుసుకున్నాయి.

"నెను చేయబోయే ఓ చిన్న వ్యాపారానికి అవసరమైన ముడి పదార్థం."

"ఏంటి....ఏంటా వ్యాపారం" తనను తాను నిగ్రహించుకోలేకపోతున్నాడు.

"చార్లెస్ డికెన్స్ అనుకుంటా 'హియర్ యిజ్ ది రూల్ ఫర్ బార్గెయిన్స్ డూ అదర్ మెన్ ఫర్ దే వుడ్ డూ యూ' అని....అంటే ఇచ్చిపుచ్చుకునే బార్టర్ సిస్టం గురించే మరోలా చెప్పాడు"

"అంటే నన్ను బ్లాక్‌మెయిల్ చేస్తున్నావన్నమాట"

"దానికి నువ్వే పేరుపెట్టినా నాకు అభ్యంతరం లేదు బంగార్రాజూ"

ఆ ఏకవచన ప్రయోగానికి మరో చోటైతే భాస్వంత్ ప్రాణాలు తీసేవాడే. కాని ఇది అనువుగాని వేళ.

"అవకాశాలూ ఆపదలూ రెండూ మారువేషాలు వేసుకొని వస్తాంటాయి మిస్టర్ రాజూ! నువ్వు అప్పుడివనే మారువేషంలో మా నాన్నని దెబ్బతీస్తే నేను అవకాశాన్ని ఒక అవసరానికి ఉపయోగించుకుంటున్నాను. చెప్పు. నీ కూతురు భవిష్యత్తు ఖరీదెంతనుకుంటున్నావు."

కొన్ని సెకండ్లపాటు మౌనంగా నిలబడిపోయాడు బంగార్రాజు.

"నిన్న నీ కూతురు శీలాన్ని నేను అపహరించబోయానని నా మీద చేయిచేసుకున్నావు. నా మౌనాన్ని అపార్థం చేసుకున్నావు తప్ప వాస్తవాన్ని గ్రహించలేక పోయావు. ఇప్పుడీ నిజాన్ని నేను ఆయుధంగా వాడుకుంటే కోట్లు ఖరీదుచేసే నీ అహం, నూరేళ్ళ నీ కూతురి భవిష్యత్తు నట్టేట కలిసిపోతుంది."

"ఎంత కావాలి" టక్కున అడిగాడు.

"నలభై వేలు"

చివాలున తలపైకెత్తాడు బంగార్రాజు.

"నీ భేషజానికి, నీకున్న స్థాయికి నేనడిగింది చాలా స్వల్పమే బంగార్రాజూ...."

ఏమనుకున్నాడో "సరే మొత్తం ఎన్ని ఉత్తరాలున్నాయి" అడిగాడు బంగార్రాజు.

"ఒక సీరియల్ నవలకి సరిపడ్డంతగా వున్నాయి. చూస్తావా" భుజానికి తగిలించుకున్న బేగ్‌లో నుంచి తీయబోతుంటే "అక్కర్లేదు" అన్నాడు బంగార్రాజు.

రా! లోపలికి అంటూ ఇంట్లోకి తీసుకువెళ్ళి మొత్తం ఉత్తరాల్ని చూసాడు. సందేహంలేదు. చాలా గ్రంథముంది.

అయిదు నిముషాల్లో కేష్ అందించాడు వణుకుతున్న చేతుల్తో.

"థేంక్స్" డబ్బు తీసుకున్నాక కృతజ్ఞతను వ్యక్తం చేసాడు.

"అన్నీ ఇచ్చేసినట్టేగా"

"నమ్మకంతో సాగించాల్సిన వ్యాపారంలో ఆత్మీయుల్ని సైతం అమ్ముకోడానికి అందరూ బంగార్రాజులా ఉండరు మిస్టర్ రాజూ! నేను రామానుజం కొడుకుని" బయటికి నడుస్తూ క్షణం ఆగేడు "చివరగా ఒక్క మాట ఈ చిన్న ఓటమికి నువ్వు అవమానపడి నామీద ఏమన్నా ప్రయోగం చేయడానికి సిద్ధపడ్డావా.... మరుక్షణం నీపై మరో డైనమైట్‌ను ఉపయోగించాల్సి వస్తుంది. ఒక్కగానొక్క కూతురుగా ఆలోచించు. నాన్నకి లెక్కలే తెలుసు. కాని నాకు లౌక్యం తెలుసు...."

ధాన్వంత్ బయటికి వచ్చేసాడు.

కారిడార్‌లో నుంచి వెలుతుంటే హఠాత్తుగా రజని ఎదురుపడింది చీకటిలో ఓ స్తంభం మాటున నిలబడి.

"రజని" భావరహితంగా చూసేడు. "లౌక్యంలో నువ్వా తండ్రి కూతురివని నిరూపించుకున్నావు. ఈ రోజు నిజానికి నాకు ఇష్టం లేకపోయినా ఒక నిర్భాగ్యుడి ప్రాణాలు కాపాడే ప్రయత్నంలో ఒక భాగ్యవంతుడి బలహీనతని క్యాష్ చేసుకున్నాను. నువ్వు రాసిన ఉత్తరాలు నన్ను కదిలించలేకపోయినా మీ నాన్నని మాత్రం బాగానే కలవరపెట్టినట్టున్నాయి. స్వశక్తి పక్కవాడి బలహీనతల్ని ఉపయోగించుకునే నా పథకంలో మొదటి అస్త్రాన్ని ఇప్పుడిలా ప్రయోగించాల్సి వచ్చినందుకు నన్ను క్షమించు."

ఆమె ఏదో చెప్పాలనుకుంది.

కాని అప్పటికే ధాన్వంతా వెళ్ళిపోయాడు.

* * *

ఉద్విగ్నత నుంచి తేరుకున్న నిశాంత అమాంతం అతడి చేతిలోని ఫోటోని లాక్కుని మరింత పరిశీలనగా చూసింది.

"అన్నయ్యా" స్వప్నంలో పలికింది "సరోజ....నీ భార్య అన్నయ్యా"

విస్తుపోయిన నాగరాజు "నీకు.... నా సరోజ తెలుసా" అన్నాడు ఉద్వేగంగా.

"ఎందుకు తెలీదన్నయ్యా. మోసపోయిన నేను ఆ నరకకూపంలో అడుగుపెట్టిన వాడు కుమిలిపోతున్న నన్ను తల్లిలా లాలించింది, చివరికి ప్రాణాలకు తెగించి నన్నావలయం నుంచి తప్పించింది ఈ సరోజే."

పదునైన బల్లెం అతడి గుండె లోతుల్లోకి దూసుకుపోయినట్టు నిస్సత్తువగా తూలి గోడకి జారగిలపడిపోయాడు.

"అంటే....అంటే నా భార్య ఇప్పుడు కామాటిపురాలో వుందా" శక్తిని కూడగట్టుకుంటూ అడిగాడు.

"అవునన్నయ్యా! తనూ నాలాగే వంచనతో ఆ వలయంలో చిక్కుకుంది. చావులాంటి బ్రతుకుతో రాజీపడుతూ....

ఉద్రేకంతో తలపట్టుకుని నిశ్శబ్దంగా నిలబడిపోయాడు చాలాసేపు.

అతను కుమిలిపోతున్నాడో కసితో ఉడుకెత్తిపోతున్నాడో తెలీదు. కాని మొత్తమంతా కంపించిపోతున్నాడు.

చాలాసేపటి నిశ్శబ్దం తర్వాత నెమ్మదిగా తలపైకెత్తాడు.

మసక వెలుతురులో చూసింది అతడి కళ్ళలో ఎర్రగా పేరుకున్న జీరల్ని ఆ జీరల నుంచి రాలిపడుతున్న అశ్రుకణాల్ని.

"ఇది నా స్వయంకృతమే నిశాంతా. ఆ సత్యాన్ని ఇప్పుడు తెలుసుకున్నాను. చదివిన చదువుకి సార్ధకత లేక బ్రతకడానికి సరైన మార్గం దొరక్క నేను ఒకనాడు ప్రభంజనరావు ముఠాలో ఓ వ్యక్తిగా అడుగుపెట్టాను. పాప పుణ్యాల ప్రసక్తికి అతీతంగా సుఖంగానే బ్రతుకుతున్నానని భ్రమపడిన నాకు జ్ఞానోదయాన్ని కల్గించిందీ నా జీవితంలో అడుగుపెట్టిన సరోజ. అంతే ముఠాలో ఓ ముఖ్యుడిగా మెలిగిన నేను ప్రభంజనరావు నుంచి తప్పుకున్నాను....కాని...."

ఆ కడుక్షణం "నా భార్య దూరం కావడానికి ప్రభంజనరావే కారణ మని ఇప్పుడు తెలుసుకున్నాను. అమ్మా విశాంతా! నువ్వెందుకొచ్చినా ఎలా కలిసినా నాకోమంచి వార్త చెప్పావు.... ఆ సంతోషంతో ఒక పోరాటాని సిద్ధపడి ముందుకు సాగిపోతాను"

ఇప్పుడతడు పోలీసులకు లొంగకుండా సరాసరిసరోజకోసం బయలు దేరే నిర్ణయాన్ని తీసుకున్నాడు.

వెళ్ళబోతున్న అతడ్ని వారించింది "అన్నయ్యా నువ్వెళ్తున్నది ఒక ప్రమాద భూయిష్టమైన వలయంలోకి"

"నా భార్య దూరమైన రోజునే ప్రమాదాల్ని ఆహ్వానిస్తూ బ్రతకడం అలవాటు చేసుకున్నాను విశాంతా! ఈ పోరాటం తప్పనిసరి బి ఎషేంష్డ టు డై అంటిల్ యు హేవ్ వన్ సమ్ రియల్ విక్టరీ"

అతను ఒక మృత్యువులా ముందుకు దూసుకుపోయాడు.

సరిగ్గా ఇదేసమయానికి....

కింగ్ జార్జి హాస్పటల్లో అడుగుపెట్టిన భాస్వంత్ విశాంత కోసం చాలా సేపు గాలించి ప్రయోజనం లేకపోవడంతో శేఖరం మాస్టారి బెడ్డు దగ్గరకి వచ్చాడు.

అప్పటికే దిక్కుతోచని స్థితిలో వున్నారు మాస్టారి భార్య, కొడుకు గిరీ.

భాస్వంత్ ఎవరో వారికి తెలేదు. కాని అతడు డాక్టర్లను కలిసి శేఖరం మాస్టార్ని సర్జరీ కోసం అమెరికన్ హాస్పటల్‌కి తరలించుకు వెళ్తుంటే మౌనంగా చూస్తూ వుండిపోయాడు.

మరుసటిరోజే అపరేషన్‌కు ఏర్పాట్లుచేయబడ్డాయి.

డబ్బుని అనసూయమ్మగారికి అందించాడు.

ఆ రాత్రి.... చాలా నిశ్శబ్దంగా కళ్ళనీరు పెట్టుకుంటున్న మాస్టార్ని కలిసినప్పుడు ఎందుకో అయనలో తన తండ్రిని చూసేడు భాస్వంత్.

ఆ కళ్ళల్లో కాంతి క్షీణిస్తున్నా చెరగని స్వాభిమానం ప్రతంచానంతో

సాదరంగా దర్శించగల అర్ద్రిత భాస్వంత్‌లో ఎంతటి స్పందన్ని కలిగించాఱం అంటే ఒకచిన్న అబద్ధంతోనైనా ఆమున్ని ఊరడించాలనుకున్నాడు.

చాలా ప్రమాగభరితమైన ఆపరేషన్‌కు సిద్ధంగాబోతున్న ఆవృద్ధుడిని ఒక మంచి వార్తతో ఓదార్పును అందించాలనుకున్నాడు.

"నాకు తెలుసు మాస్టారూ నేనెవరూ ఎందుకిదంతా చేస్తున్నానని మీరూ మీ వాళ్ళంతా ఆశ్చర్యపోతున్నారు. నిజానికి నేను మీకేం మేలు చేయడంలేదు. ఒక బాధ్యతని నిర్వర్తిస్తున్నాను నేను. నేను మీ విశాంతను ప్రేమించి పెళ్ళిచేసుకున్న వ్యక్తిని."

చాలా నెమ్మదిగా చెప్పినా అది చాలా బలమైన సందడినే సృష్టించింది అక్కడ.

రవి, అనసూయలు విభ్రమంగా చూస్తున్నారు.

"నిజానికి ఈ సమయంలో ఈ విషయం చెప్పకూడదనుకున్నాను. విశాంత కూడా చెపొద్దంది. కాని మిమ్మల్ని చూస్తుంటే చెప్పకతప్పలేదు.

ఆ వృద్ధుడి కళ్ళలో కృతజ్ఞతతోనో లేక కూతురు క్షేమంగానే వుందన్న ఆలోచనో కనుకొలకుల నుంచి నీళ్ళు రాలుతున్నాయి.

జరిగింది తెలిస్తే మీరు క్షమించరని ఇన్నాళ్ళూ బాధపడింది. ఈ సంగతి తెలిసి నాదగ్గర కళ్ళనీరు పెట్టుకుంటే డబ్బున్నది నాకు సమస్యకాదు కాబట్టి ఇలా సహకరించాలని వచ్చాను. ఎంత భయస్తురాలు అంటే మీ దగ్గరికి రావటానికి సాహసం చేయలేకపోయింది."

అబద్ధాల్ని పేర్చుకుంటూ పోయాడు అలవాటు లేకపోయినా.

భాస్వంత్ ఆలోచన తప్పుకాలేదు.

శేఖరం మాస్టారు ఆత్మీయతగా భాస్వంత్ తల నిమిరారు. "బాబూ చల్లని కబురు చె....ప్పా....వు"

ఆయన దుఃఖంతో రొప్పుతున్నారు. "నాకు.... నాకిప్పుడు ఎంత ఆనందంగా వుందంటే ఈ క్షణంలో నా ప్రాణాలు పోయినా దిగుల్లేదు."

"ప్లీజ్.... మీరు"

“నన్ను మాటాడనీ బాబూ.... మళ్ళీ ఆ అవకాశం వస్తుందోరాదో నీకు తెలీదు నేనెంత పిరికివాడ్నో.

ఇంటర్వ్యాకని వెళ్ళిన కూతురు జాడ తెలీక లోకులు ఏం కూస్తారో అన్న భయంకో చిన్నకూతురి భవిష్యత్తుకది అటంకం అవుతుందని స్వార్థంతో అది బ్రతికుండగానే చచ్చిపోయిందని చెప్పి కర్మకాండలు పూర్తిచేసాను. ఏ తండ్రీ చేయని పాపానికి సిద్ధపడ్డాను. అందుకే నేను చేసిన దానికన్నా అది చేసింది స్వల్పమే అన్న భావంతో నా కూతురు నిర్ణయాన్ని ఆనందంగా అంగీకరిస్తున్నాను.” ఉద్రేకంలో మాటలు దొరకనట్టు చాలా బలాన్ని కూడగట్టుకొని మనసులోని బాధని వెళ్ళగక్కుతున్నారాయన.

ఒక సహాయం చేస్తావా బాబూ”

ఒక వరం కోరుతున్నట్టు చూసారాయన.

“రేపంటూ ఇక నాకు వుంటుంధో లేదో నాకు తెలీదు. ఒకవేళ ఆపరేషను పూర్తయినా ఎన్నాళ్ళు బ్రతుకుతానో అంతకన్నా తెలీదు. నాకు.... నాకు నా నిశాంతని ఒక్కసారి చూడాలనుంది. ఒక మరణ వాంగ్మూలంలా నేను చేసిన తప్పిదానికి క్షమార్పణలు చెప్పుకోవాలనుంది....తీసుకురావూ.”

ఇది భాస్వంత్ వూహించనిది.

అందుకే అప్రతిభుడిలా చూస్తుండిపోయాడు.

ఎలా.... నిశాంత ఎక్కడుందో తనకి తెలీదే. చావు బ్రతుకుల మధ్య వున్న ఈ వృద్ధుడి కోరిక తనెలా తీర్చగలడు.

బాబూ చెప్పానుగా ఇది నా ఆఖరికోరిక. తప్పకుండా తీరుస్తావు కదూ” అభ్యర్థిస్తున్నాడాయన.

దారుణమైన సందిగ్ధతతో చిక్కుకుపోయాడు భాస్వంత్.

కాదంటే లేక నిజంచెబితే ఆయన తట్టుకోలేడు.

ఇది అసాధ్యమైన విషయమైనా సాధ్యంచేయాలి.

చాలా గట్టిగా నిర్ణయించుకున్నాడు బాస్వంత్. రేపు జరిగే ఆపరేషన్

లోగా కాకపోయినా ఆపరేషన్ అయ్యేకైనా నిశాంతను తను తీసుకురాగలగాలి.

నిశాంతరాకే అతడికి ఆయువును పోయగల నిబ్బరాన్ని కలిగించడం నిజమైతే తన తండ్రి చివరిచూపుకైనా నోచుకోని తను ఈ మంచిపనితో ఒక లోటును భర్తీచేయాలి.

ఇది సెంటిమెంటుకాదు.... ఒక సవాల్....

పైకిలేచాడు.

అవసరానికి మించిన డబ్బు ఇచ్చాడు తను. కాబట్టి ఇప్పటికి తన అవసరం ఉండదు వారికి.

అనసూయ, గిరిలు ఆశ్చర్యంనుంచి ఇంకా లేరుకోకముందే అతడు బయటికి నడిచాడు.

ఎలా....

చీకటిలో చేడుస్తూ ఆలోచిస్తున్నాడు.

నిశాంతను ఎలా వెదకాలి.... ఆమె ఎక్కడుంది.

ఒకవేళ్ళ ఆపదలో చిక్కుకుందా....

అతడి ఆలోచన తప్పుకాలేదు.

అప్పటికే నిశాంతను బంధించిన ముఠా కారులో ఆమెను భాగ్యనగరంవేపు తరలించుకు వెళ్ళిపోతున్నారు.

9

ఒకరాత్రి ఒకపగలూ నిశాంతకోసం వెదికి వెదికి అలసిపోయాడు భాస్వంత్.

మధ్యాహ్నం గడిచి మూడుగంటలు కాసస్తున్నా ఇంకా అతడి

ప్రయత్నం ఆగలేదు.... అలాగే నడుస్తూనే వున్నాడు భోజనంకూడా చేయలేదు. వీలుచిక్కక కాదు. డబ్బుల్లేక.

నిన్న అతడు నలబై వేల రూపాయలకి అధిపతి. ఇప్పుడు జేబులో చిల్లి గవ్వ సైతంలేని వ్యక్తి.

ఈ చిన్న సమస్యలు కాదు అతడ్ని బాధిస్తున్నది....ఆ వృద్ధుడికిచ్చినమాట నిలబెట్టుకోవాలి.

ఈ పాటికి డాక్టర్లు బై పాస్ సర్జర్‌లో నిమగ్నమై వుంటారు.

రక్తప్రసరణ సవ్యంగా సాగని బ్లడ్ వెస్సల్‌ని తొలగించకుండా కాలిలోని మరో వెస్సల్‌ని తీసి అక్కడ కలిపి ఎలక్ట్రిక్ షాక్‌ద్వారా రక్తం పాస్‌జేసి మళ్ళించే బైపాస్ పర్జరీ ఎంత ప్రమాద భూయిష్టమైనదీ అతనికి తెలీనిది కాదు.

పోస్టు ఆపరేటివ్ సమస్యలూ అధికంగానే పుంటాయి.

అందుకే ఎలాగైనా నిశాంతను కలుసుకుతీరాలీ తీసుకురావాలీ అనుకున్నాడు.

కాని ఎలా....ఎక్కడుందామె.

అతడు ఆలోచనలనుంచి తేరుకునేసరికి ఎదురుగా వాల్తేర్ రైల్వే స్టేషన్ కనిపించింది.

ఆగేడు సాలోచనగా.

సిక్త్‌సెన్స్....ఇంట్యూషనల్‌గా లోపలికి వెళ్ళమని ప్రేరేపిస్తూందతడ్ని.

అనాలోచితంగా లోపలికి వచ్చాడు....

ప్లాట్‌ఫాం అంతా గాలించాడు. ఏదో బండికోసం వెయిట్‌చేస్తున్న ప్రయాణీకులతో కోలాహలంగా వుంది.

ఓ మారు ఆ చివరినుంచి ఈ చివరదాకా నడిచాడు.

ఇప్పుడేం చేయాలి....అసలు ఎందుకొచ్చాడు తనిక్కడికి....ఏదైనా వూరెళితే....

ఏదో ఇంట్యూషన్.

ఏ వూరు వెళ్ళాలి? వెళితే మాత్రం నిశాంత జాడ తెలుస్తుందని నమ్మకమేంటి?

నవ్వుకున్నాడోమారు....ఏ నమ్మకంతో తను దేవుడిముందు సవాల్ చేసాడు, ఏ నమ్మకంతో తను లక్ష్యాన్ని సాధిస్తానని ప్రగల్భాలు పలికాడు. సరిగ్గా అదే....ఆ నమ్మకంతోనే తను యిప్పుడు ప్రయాణం సాగించాలి.

అదృష్టమనేది నిజంగా అనుకోకుండా తారసపడేది అయితే అది తదకు అక్కర్లేదు. వెదికి పట్టుకోవాలి దృష్టంకాని అదృష్టాన్నయినా.

ఎంత వేగంగా యిలా నిర్ణయించుకున్నాడో అంతే వేగంగా తను అదృష్టాన్ని అన్వేషిస్తూ సాగిపోవాలి అనుకుంటూ మరోగమ్మత్తయిన నిర్ణయం తీసుకున్నాడు.

అది—

ముందొచ్చిన ట్రైనులో ఎక్కి ప్రయాణం చేయాలని.

అది ఏ దిక్కుదైనా ఫర్వాలేదు. వెళ్ళడం జరగాలి. అంతే సమీపంలో నడుచుకు వెళ్తున్న ఓ టి. సిని వెంటనే ఆ స్టేషన్నుంచి బయలుదేరే ట్రైనేది అని అడిగితే హైద్రాబాద్ వెళ్ళే గోదావరి ఎక్స్‌ప్రెస్ అని తెలియపరిచాడు.

అప్పుడు టైమ్ నాలుగు కావస్తోంది. మరో నలభై అయిదు నిమిషాల్లో డిపార్చర్.

అయితే ఇప్పుడు భాస్వంతు ముందున్న సమస్య డబ్బులు....అరగంట వ్యవధిలో డబ్బులు సంపాదించి టిక్కెట్టు కొనుక్కుని బయలుదేరాలి.

ఎలా—

సరిగ్గా అప్పుడే అతని దృష్టి ప్లాట్‌ఫాంపై గుంపుగా చూచున్న విద్యార్థి విద్యార్థినులపై పడింది.

చాలా హుషారుగా మాటాడుకుంటున్నట్టు అనిపించిన వారికి చాలా సమీపంగా నడిచి ఓ గర్డర్‌ని ఆనుకుని నిలబడిన భాస్వంత్‌కి అర్థమైంది అక్కడో క్విజ్ కార్యక్రమం లాంటిది నడుస్తూందని.

అందరిలోనూ తానో ఆధిక్యుడ్నని నిరూపించుకునే ప్రయత్నంగా ఓ యువకుడు చాలా ఉధృతంగా తన క్విజ్ పరిజ్ఞానాన్ని ప్రదర్శిస్తున్నాడు.

అందులో కేవలం అమ్మాయిల్ని ఆకట్టుకోవాలన్న తపనే ఎక్కువగా వున్నట్టు అర్థమైంది భాస్వంత్‌కి.

అదే....అలాంటి బలహీనతే భాస్వంత్ కోరుకునేది కూడా.

“సో....డియర్ గాళ్స్....ఇంత సేపటినుంచి నేనడిగిన ఏ ఒక్క ప్రశ్నకీ మీలో మీలోనే ఏంటి నా సోదర విద్యార్థులుకూడా జవాబు చెప్ప లేకపోయారు. చివరగా చిన్న క్విజ్....అయిదు నిముషాలలో చెప్పగలిగితే ఏభై రూపాయలిస్తాను” అంటూ సవాల్ విసిరాడు ఆ విద్యార్థే.

అంతాసరే నన్నట్టు ఉత్సుకంగా తలలూపేరు.

భాస్వంత్ మరో దిశగా నిలబడి వున్నా చాలా ఏకాగ్రతగా వుంటున్నాడు.

“ది డేష్ సర్జెన్ వాజ్ డేష్ డేష్ టు ఆపరేట్ బికాజ్ హి హేడ్ డేష్ డేష్....” ఆగేడు విద్యార్థి. కావాలంటే కాగితాలపై నోట్ చేసుకోండి. అయితే ఇందులో ముఖ్యంగా మీరు వేయాల్సింది నేను చెప్పిన ఖాళీ (డేష్)లో ఒక అక్షరాల వరుసైనా ఒకేలాంటి పదమైనా రావాలి....అంటే అన్ని డేషుల్లోనూ ఒకటే పదం లేక ఒకే అక్షరాల వరుసవుండాలి” రిపీట్ చేసాడు ఇంకా స్పష్టంగా అర్థం కావాలన్నట్టు.

విద్యార్థులూ విద్యార్థినులూ కాగితాలపై రాసుకుని సాధించాలన్న పట్టుదలతో కృషి చేస్తున్నారు.

ఇటు భాస్వంత్ కూడా నోట్ చేసుకున్నట్టు అక్కడివారికి తెలీదు. ది సర్జెన్ వజ్ టు ఆపరేట్ బికాజ్ హి హేడ్.

చాలా అరుదైన మేధస్సుగల భాస్వంత్‌కి కేవలం ఒకటిన్నర నిముషాలు మాత్రం పట్టింది అందులో కిటుకు అర్థంచేసుకోడానికి.

“అప్పుడే మూడు నిముషాలు గడిచిపోయింది” అన్నాడు ఆ విద్యార్థే.

భాస్వంత్ నెమ్మదిగా వెనక్కి తిరిగాడు .... క్విజ్ విచ్చిన విద్యార్థి తనను గమనించడంలేదన్న నిర్ధారణకు వచ్చేక సమీపంలో వున్న ఓ విద్యార్థిని నెమ్మదిగా తట్టడం వెనువెంటనే కాగితాన్ని అందించడమూ జరిగిపోయింది.

ఇదెవరూ గుర్తించలేదు.

ఆ విద్యార్థి చాలా హుషారుగా ‘యస్....నేను పూర్తిచేసాను’ ఆంటూ కాగితాన్ని క్విజ్ మాస్టరు కందించాడు.

అందులోని సరైన జవాబు చూడగలిగిన ఆ విద్యార్థి నిజానికి కొన్ని క్షణాలవరకూ నమ్మలేకపోయాడు.

ఎలా....కరెక్టు ఆన్సరేంటి అంటూ విద్యార్థినులూ ముందుకు చొచ్చుకొచ్చారు.

The notable surgeon was not able to operate because he had no table.

ఒకే పదాన్ని డేష్‌ల్లో అవసరమైన పద్ధతుల్లో విడదీసి అక్షరక్రమం అదే వుండేట్టు తయారుచేయడిన ఆ వాక్యమది.

క్విజ్ విచ్చిన విద్యార్థి కాస్త ఇబ్బందిగానైనా ఏభై రూపాయలు అందించగానే క్విజ్‌ను పూర్తిచేసిన విద్యార్థిని అంతా “కంగ్రాట్స్ మిస్టర్ వివేకా” అంటూ అభినందించారు.

“సారీ....నిజానికీ ఈ క్రెడిట్ దక్కాలిసింది నాకు కాదు....ఈయనకి” అంటూ భాస్వంత్‌ని చూపించాడు.

అదే భాస్వంత్‌కి ఆ క్షణాన కావలసిందైనా చాలా మొహమాట పడుపోతున్నట్లుగా చూసేడు.

“హియరీజ్ ది పర్సన్ హూమ్ యు షుడ్ డిఫీట్ మిస్టర్ రాజా” ఓ అమ్మాయి ప్రోత్సాహించింది ఇందాకటి క్విజ్ మాస్టరైన రాజాని.

“ధైర్యముందా” ఛాలెంజింగ్‌గా అడిగాడు రాజా.

భాస్వంత్ భావరహితంగా చూసేడు.

“కమాన్”

అదే....ఆ బలహీనతే భాస్వంత్ క్యాష్‌చేసుకోవాలనుకుంటున్నది.

"ఈ రాజా సంగతి మీకు తెలీదేమో....ఇంటర్ కాలేజి క్విజ్ కాంపిటేషన్‌లో నెంబర్ వన్....ఓ అమ్మాయి రాజాని మెచ్చుకోలుగా చూసింది.

తను నిప్పు రగిల్చాడు....ఇప్పుడు అమ్మాయిలు ఆజ్యంపోస్తున్నారు. రాజాలో కసి ఏ నిష్పత్తిలో వెలిగిపోతున్నదీ. అతడి మొహం చూడగానే అర్థమైపోయింది.

"నేనంత తెలివైన వాడ్నికాదుమరి" అవతలివాడి అహాన్ని చాలా అందంగా కాపాడే మొదటి అస్త్రాన్ని భాస్వంత్ ప్రయోగించాడు. "ఒకవే రాజా ఓడిపోయారు అనుకోండి."

"ఇంపాసిబుల్" అమ్మాయిలముందు మాటవరసకైనా అలాంటి వాక్యాన్ని వినే సహనంలేనట్టు అరిచాడు" రా....రంగంలోకి దిగుదాం....నన్ను ఓడించగలిగితే నీకు వందరూపాయలిస్తాను."

"ఎ సబ్జెక్టులో అయినా ఫర్వాలేదు" భాస్వంత్ అడిగాడు.

"లెక్కల్లో అయితే మా రాజా ఫస్ట్" ఇందాకటి అమ్మాయే అతడి తరఫున వకాల్తా పుచ్చుకుంది.

ఇక్కడే భాస్వంత్ మౌనాన్ని అపార్థంచేసుకున్నాడు రాజా.

"అవును. మేథమెటిక్స్‌కు సంబంధించిన క్విజ్ అయితే బెటరు" ఆకలిమూలంగా కొంత అలసటతో మరికొంత కళతప్పిన భాస్వంతుని ఓ అనామకుడిగా అమ్మాయిలు సైతం అనుకుంటే అది వారితప్పుకాదు.

అప్పటి భాస్వంతు వేషమేకాదు అతడి ప్రవర్తనా అలాగే వుంది.

"మాస్టారు లెక్కల్లో క్విజ్ అనేసరికి మీనమేషాలు లెక్కపెడుతున్నారు" ఓ విద్యార్థి ఎగతాళిగా అన్నాడు.

"సరే" తల పంకించిన భాస్వంతు ఓ మారు టైము చూసుకున్నాడు. నాలుగుంపావు కావస్తోంది. ట్రైను ప్లాట్‌ఫాంపైకి వచ్చినా రిజర్వేషన్ వుందన్న ధైర్యంతోనో లేక ఇక్కడ తమ 'రాజా' గెలుపు చూడాలన్న ఆసక్తితోనో ఎవరూ ట్రైన్‌వేపు దృష్టి మళ్ళించలేదు.

"ఇద్దరు తండ్రులున్నారు. మొదటి తండ్రికి కొడుకంటే విపరీతమైన ప్రేమ....అతడికి అన్నీ తనే అమర్చాలన్న దృక్పథం కలవాడు. అందుకే నిజానికి తన కొడుకు సంపాదించే స్థితిలోవున్నా పండక్కి బట్టలు కుట్టించుకోమని ఆరువందల రూపాయలిచ్చాడు. ఇకపోతే రెండో తండ్రి తన కొడుకుపై అభిమానం వున్నా అంత డబ్బు ఖర్చుచేయడం సుతారమూ ఇష్టంలేనివాడు. పైగా అతడు మెజీషియన్ కాబట్టి తను పోయేలోగా కొడుక్కి మేజిక్ నేర్పాలని దానికి కావలసిన పరికరాన్ని కొనుక్కురమ్మని రెండువందలిచ్చాడు.

ఆ కొడుకులిద్దరూ తండ్రులదగ్గర డబ్బు తీసుకొని ఓచోట వారిదగ్గరున్న మొత్తం లెక్కచూస్తే...."

"ఎనిమిది వందలుంటుంది" అన్నాడు విద్యార్థి టక్కున.

"లేదు....ఆరునందలున్నాయి" భాస్వంతు జవాబు చెప్పాడు "అదెలా సాధ్యమో చెప్పాలి."

"ఆదెలా....ఆరువందలు రెండువందలూ కలిపితే...." వాక్యపూర్తి కాకుండానే అర్థోక్తిలో ఆగిన మరో విద్యార్థి "బహుశా రెండో తండ్రి మెజీషిన్ కాబట్టి తన హస్తలాఘవంతో కొట్టేసాడేమో" అన్నాడు అనుమానంగా.

భాస్వంతు చూస్తున్నాడు ఉత్సుకతగా.

తమలో తామే చాలాసేపు తర్కించుకున్న విద్యార్థులు చివరికి అది తమకి అంతుపట్టదన్నట్టుగా చివరికి ఉత్కంఠగా రాజావేపు చూసారు.

ఒకటి....రెండు....మూడు....

అయిదు నిముషాలు గడిచింది.

రాజా నుదట చెమటలుపట్టింది అప్పటికే....ఇలాంటి ఓటమిని అతడు భరించలేకపోతున్నాడు....అదీ అమ్మాయిముందు.

మరో నిముషం గడిచేలోగా భాస్వంతుకి వందరూపాయలనోటు అందించాడు.

"థేంక్స్" అంటూ అందుకుని ట్రైన్ డిపార్చర్ టైంకావడంతో బుకింగాఫీకేసి నడక సాగించాడు.

"ఎక్స్‌క్యూజ్‌మీ"

ఓ యువతి కంఠం వినిపించింది వెనుకగా.

చేతిలో హేండ్ కేగ్‌తో నిలబడి వుందో యువతి.

ఎందుకో....

ఆమెను చూడగానే కొన్ని క్షణాలవరకూ రెప్పవేయలేకపోయాడు చాలా చిత్రమైన ఆకర్షణ ఆమె కళ్ళలో.

"చెప్పండి" అన్నాడు ఆపాదమస్తకం ఆమెను పరిశీలిస్తూనే.

"మీరు జవాబు చెప్పకుండానే డబ్బు తీసుకుని వెళ్ళిపోతున్నారు" కొద్దిగా అర్థమైందీ భాస్వంతుకి ఆమె ఆ గుంపులో కూర్చోకపోయి వారితో వచ్చిన టీచరో. లెక్చరరో అయ్యుంటుందని సమీపంలో ఎక్క నిలబడి అంతా గమనిస్తూ వుందని.

"క్విజ్‌లో ఓడితే వందరూపాయలిస్తానని అన్న విద్యార్థి దగ్గ డబ్బు తీసుకోవాలని ఓ సమస్యనిచ్చాను తప్ప జవాబు చెబుతాన అనలేదే."

ఆమె బిత్తరపోయిందా జవాబుకి.

"చెప్పడం ధర్మం"

"అభ్యంతరం లేదు. చెబితే మీరు మరో వందిస్తారా" కా రోషంగా చూసింది.

"అమాయకుడిలా నటించి బాగానే క్యాష్ చేసుకున్నారు"

"కొన్ని సాధించాలంటే మనిషికి తెలివైన అవివేకం అవసర అంటాడు చార్లెస్ కిట్టరింగ్" అతడు వెళ్ళాలని రెండడుగులువేసి క్షణ ఆగేడు "మీ పేరు."

నిర్లక్ష్యంగా చూసింది. "సమ్ 'ఎక్స్' అనుకోండి."

"ఐసీ మీరు మేథమెటిక్స్ లెక్చరర్ అన్నమాట" అన్నా టక్కున.

ఈసారి మరింత నివ్వెరపోయిన ఆమె "ఎలా గుర్తించారు" అం అంత కోపంలో కూడా.

"జీవితంలో జవాబు తెలీని చాలా వాస్తవాల్ని ముందు 'ఎక్స్' అంటూ ఎష్యూమ్ చేసుకోవడం లెక్కలమాష్టార్లకి అలవాటేగా."

ఆమె విశ్చేష్టనుంచి ఇంకా తేరుకోకముందే వెళ్ళిపోయాడతను....

అయితే చాలా దూరం నడిచిన భాస్వంత్ మరోమారు ఆమెను చూడాలన్న ఉత్కంఠను చంపుకోలేక వెనక్కి తిరిగి చూసిన చూపు ఆమె చూపులో కలిసినప్పుడు వెంటనే తల తిప్పుకుంది.

* * *

"మిస్టర్ ఉపాధ్యాయా! చాలా తెలివిగా నామీద ఒక ప్రయోగం చేయబోయావు... కాని పురిటలోనే సంధి కొట్టేసిందని చెప్పటానికి భాధ పడుతున్నాను" ప్రభంజనరావు కంఠం వ్యంగంగా పలికింది.

ఇద్దరు ప్రముఖుల మధ్య చాలా సీరియస్‌గా ఫోన్‌లో సాగుతున్న సంభాషణ అది.

"మిస్టర్ ఉపాధ్యాయా....నా మాట విని వెంటనే నామీద సాగించబోయే ప్రచ్ఛన్నయుద్ధాన్ని ఆపేయ్...."

ప్రభంజనరావుని రివాల్వింగ్ చైర్‌లో కూచుని ఉపాధ్యాయని హెచ్చరిస్తున్నాడు.

అప్పటికి కొన్ని గంటల క్రితమే అతడు రంగారావునుంచి ఫోన్ అందుకున్నాడు విశాంతను బంధించి తీసుకొస్తున్నట్టు....

చాలా నిశ్చింతగా వుందిప్పుడు.

ఉపాధ్యాయా! నాకు తెలుసు నేను సాగించే కొన్ని కార్యకలాపాలను ప్రజల దృష్టికి తీసుకురావడంలో నీ పత్రికపరంగా నువ్వెంత ప్రయత్నిస్తున్నదీ....ఇన్నాళ్లూ అది భరించాను. ఎందుకంటే నువ్వులాగే తీగ ఈ డొంకని కదిలించేటంత బలమైనది కాదని....కాని ఈ ఫీచర్ నిజంగానే నా పునాదుల్తోపాటు ఒక ప్రజాసమస్యగా మారి నాకు అండనిచ్చే బ్యూరోక్రిటిక్ శక్తుల్ని సైతం కదిలించగల మారణాస్త్రమౌతుంది" ఆగేడు క్షణం. "ఇంతకీ నేను చెప్పనేలేదు కదూ నువ్వు ఆశ్రయమిచ్చిన విశాంత ఇప్పుడు నా అధీనంలో వుంది....అంతేకాదు.... నువ్వు ఫీచర్ ప్రారంభించిన మరుక్షణం ఒక శవంగా మారబోతూంది."

అవతలివేపు ఉపాధ్యాయ చాలా తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

ఒక అమాయకురాలైన ఆడపిల్ల అందులోనూ కేవలం తన ప్రోత్సాహంతో తాను అండకాగలనన్న నమ్మకంతో రిస్కు తీసుకోవడానికి సిద్ధపడిన యువతి ఇప్పుడు కొన్ని క్షణాలలో ప్రాణాలను కోల్పోతుందీ అంటే....

పూర్తిగా తనే బాధ్యుడు కాబోతున్నాడు.

ఉపాధ్యాయకి తెలీనది కాదు ప్రభంజనరావు శక్తి సంపత్తుల విషయం.

అనుకున్నది అక్షరాలా అమలు చేయగల సమర్థుడు.

"మాట్లాడు ఉపాధ్యాయా?"

"చాలా తెలివిగా నా ప్రయత్నాన్ని విరమించుకునేట్టు చేయగలుగుతున్న మిస్టర్ ప్రభంజనరావూ! ఒక్కమాట....ఫీచర్ ని ఆపుతాను.... అంతేకాదు.... ఆ అమ్మాయిని క్షేమంగా నాకు అప్పచెప్పటానికి ఎంత కావాలో తెలియచేస్తే సంతోషిస్తాను."

"ఏం తెలివితేటలు ప్రదర్శిస్తున్నావా"

"లేదు....నువ్వు నమ్మడానికి నేను ఎంత పెట్టుబడి పెట్టాలో తెలియచేయమంటున్నాను."

"అంటే...." ప్రభంజనరావు ఆగేడు "ఆ ఫీచర్ ప్రచురించనప్పుడు దానితో నీకేం పని"

"ఆ ప్రశ్నకు నేను జవాబు చెప్పాల్సిన అగత్యం వుందని నేననుకోవడం లేదు. ఒకవేళ ఆమెను నువ్వు ఈ క్షణంలో చంపినా ఇప్పటికే ఆమె రాసిన తన కథతో కొంతవరకైనా నిన్ను సాధించగలను. నా అభిలాష అదికాదు కాబట్టే ఓ యాభై వేలిస్తాను ఆమెను క్షేమంగా నాకు అప్పచెప్పమంటున్నాను.

ప్రభంజనరావు అలోచిస్తున్నాడు.

* * *

ఉదయం పదిగంటల వేళ....

చీకట్నే గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో దిగి పరిచయంలేని పరిసరాల్ని చూస్తూ ఎక్కడెక్కడో తిరిగిన భాస్వంత్ ఆకలిగా వుండడంతో ఓ రెస్టారెంట్ లో అడుగుపెట్టి కావలసినవి ఆర్డర్ చేసి అరగించాడు.

చిత్రం....అతడి దగ్గరున్నవి తొమ్మిది రూపాయలు మాత్రమే అయితే బిల్లు పదహారు చిల్లరైంది. దిగులు పడలేదు. నవ్వుకున్నాడు.

ఈ సర్వచరాచర సృష్టిని దాచుకున్న లోకాలు "మూడు" ఆయితే అనంతంలో సైతం పోరాడగల అంకెల అస్త్రాల్ని దాచుకున్న 'గణితం' లోనూ అక్షరాలు మూడే. 'మనిషి'లోని అక్షరాలు 'మేధస్సు' అన్న పదంలోని అక్షరాలూ మూడే.

ఇవే తన లక్ష్యానికి అండగా తీసుకునే వివరాలు.

ఈ థియరీనే తాను అనుసరించి అనుకున్న గమ్యాన్ని చేరాలనుకుంటున్నాడు.

సాలోచనగా తలతిప్పి చూసిన భాస్వంత్ కళ్ళబడింది తన సమీపంలో కూచుని గుసగుస మాటాడుకుంటున్న ఓ జంట.

ఇంకా పూర్తిగా ట్వీన్స్‌దాటని జీన్స్‌లో వున్న అమ్మాయి అప్పుడప్పుడే యవ్వనంలో అడుగుపెడుతున్న ఓ అబ్బాయితో ఏదో మొరపెట్టుకుంటుంది.

శ్రవణేంద్రియాలకి పనిపెట్టి శ్రద్ధగా వింటున్నాడు భాస్వంత్.

"నాకు భయంగా వుంది సునిల్....డాడీ సంగతి నీకు తేలీదు. డబ్బు స్టేటస్ అంటూ అలోచించే మనిషి....ఫారిన్ లో వున్న బావకే నన్ను కట్టబెట్టాలని చూస్తున్నాడు...." ఇంచుమించు కళ్ళనీరు పెట్టుకుంటున్నట్టుగా తలవంచుకునే చెబుతూంది,

"బాధపడకు శిరీషా....అన్నీ సవ్యంగా జరుగుతాయనే ఆశిద్దాం...."

అదే.... ఆ మాత్రం చాలు అనిపించింది భాస్వంత్ కి.

"ఏంటమ్మా శిరీషా....బాగున్నావా" అంటూ వారిని సమీపించాడు.

తెల్లమొహంవేసుకుని చూస్తున్న వారిదగ్గర కూచుని "ఏమంటాడు చిట్టిబాబు" అన్నాడు.

"చిట్టిబాబెవరండీ" అంది అర్థంకానట్టు

"అదేనమ్మా మీ డాడి"

"మా డాడీపేరు డి.బి. రాజు."

"అవునమ్మా! అసలు పేరదే. కాని మాడాడీ మీనాన్నని చిన్నతనంలో చిట్టిబాబూ అని పిలిచేవాడు....నువ్వు చిన్నపిల్లవి. నీకా విషయా అన్నీ తెలీదనుకో. అవునూ మీ బావ ఫారెన్నుంచీ ఈ మధ్యరావాలిగా....వచ్చేడా" గడగడా చెప్పుకుపోతుంటే తను ఎప్పుడూ చూడకపోయినా 'డాడీ'కి బాగా పరిచయస్థుడని మాత్రం బోధపడిపోయింది.

"భయపడకు మీ ఇద్దర్ని ఇక్కడ చూసినట్టు నేను చెప్పనులే" అన్నాడు ఆమెకళ్ళలో రెపరెపలాడుతున్న భయాన్ని చూసి.

ఆమెకు వెంటనే అక్కడనుంచి వెళ్ళిపోవాలనుంది.

"ఏంటోనమ్మా శిరీషా! మీనాన్న మహామొండి ఘటం....మీప్రేమ చెట్టెక్కుతుంది తప్ప గట్టెక్కుతుందన్న నమ్మకం నాకులేదు."

ఏంటీ....తన ప్రేమగురించి కూడా ఈయన మాట్లాడేస్తున్నాడూ అంటే కొంపదీసి డాడీ ఏర్పాటు చేసిన స్పైకాదు కదా అనుకుంది ఓ క్షణం.

"ఓహ్" నవ్వేడు "నీకు చెప్పలేదు కదా నేనెవరన్నదీ నేనో న్యూమరాలజిస్టుని....సంఖ్యలతో అవతలి వారి జాతకాల్ని అంచనా వేస్తుంటాను.... మాడాడి అంత ఆస్తిపరుడు అయ్యాడూ అంటే మీ డాడీ సంఖ్యాశాస్త్రం మూలంగానే. నువ్వు చిన్నపిల్లవి నీకు తెలీదు."

వెళ్ళిపోవాలనుకున్న ఆమె క్షణం అతడివేపు ఆరాధనగా చూసింది.

ఆ సమయంలో తన భవిష్యత్తు గురించి ఆ అమ్మాయి తెలుసుకోవాలనుకుంటే అది చాలా సహజమైన ఆకాంక్షే.

అదే భాస్వంత్ కోరుకుంటున్నది కూడా.

"చూడమ్మా....ఉదాహరణకి ఈ క్షణం మీ ప్రేమ సంగతి ఆలోచిద్దాం....అయిదు నిమిషాల్లో మీ పరిస్థితేం కాబోతున్నదీ చెబుతాను...." అతడి వాక్యం పూర్తికాకముందే బేరర్ వచ్చి వారి టేబుల్పై వున్న బిల్లు తీసుకువెళ్ళబోతుంటే "అదిగో! అది కూడా" అంటూ తన టేబుల్ వేపు చూపించి జేబులో చేతులు పెట్టాడు.

"ఇట్సాల్‌రైట్ అంకుల్ నేనిచ్చానుగా" అంటూ బేరర్‌తో చెప్పింది ఆ బిల్లు కూడా తీసుకెళ్ళమని.

"మీరిద్దరూ పక్కపక్కగా కూచోండి" అన్నాడు.

సునీల్ శిరీషకు సమీపంలో కూర్చున్నాడు. "నేను చెప్పేది సంఖ్యాశాస్త్రంగా అంతా అంకెలలో పని మీ దగ్గర ఓ కాగితం ఉందా" అన్నాడు.

ఆమె ఉత్సుకతగా నోట్ బుక్‌లోని ఓ కాగితం చింపిచ్చింది.

"చూడండి....నేను మీరు చెప్పబోయే జవాబు కాగితంలోరాసి ఇదిగో మడిచి నీకిస్తున్నాను" అంటూ ఓ నెంబరురాసి ఆమెకిచ్చి వేలెట్‌లో దాయమన్నాడు....ఆమె దాచింది.

"ఇప్పుడు నేను మిమ్మల్ని కొన్ని సంఖ్యాపరమైన లెక్కలు అడుగుతున్నాను. ఒకవేళ అది నా జవాబులానే వచ్చిందనుకోండి. మీరుఇబ్బందిలో చిక్కుకున్నట్టే" ఉపోద్ఘాతాన్నిచ్చి "ముందు మీరిద్దరూ మూడు అంకెలుగల ఓ నెంబరేదన్నా తలచుకోండి. ఇద్దరూ కూడబలుక్కుని అది నాకుకనిపించకుండా మీ నోట్ బుక్‌లో రాయండి" అన్నాడు.

కొన్ని సెకండ్లపాటు వాళ్ళలో వారే మంతనాలు జరుపుకుంటుంటే "ఒక్క విషయం ఆ మూడు అంకెలుగల సంఖ్యలో మొదటి అంకెకి మూడో అంకెకి కనీసం రెండు తేడా వుండాలి" అన్నాడు భాస్వంత్.

వారు రాసేరు. 214

"రాసేరా" అన్నాక "ఇప్పుడు ఆ నెంబరు తిరగవేసి పెద్దసంఖ్యలోనుంచి చిన్న సంఖ్య తీసేయండి" అంటూ సలహా యిచ్చేడు.

తిరగేసాక అది 412 కావడంతో 412లోనుంచి 214 మైనస్‌చేసారు.

$$\begin{array}{r} 412 \\ 214 \\ \hline 198 \\ \hline \end{array}$$

“వచ్చిన సంఖ్యని మళ్ళీ తిరగేసి దానికి ప్లస్ చేయండి” భాస్వంత్ కళ్లు మూసుకునే అన్నాడు.

$$\begin{array}{r} 198 \\ +\ 891 \\ \hline 1089 \\ \hline \end{array}$$

“అయ్యిందా” అంటూ కళ్ళుతెరిచిన భాస్వంత్ వారు అవుననగానే “ఇప్పుడు ఇందాక నేనిచ్చిన ఆన్సర్‌తో అది కంపేర్ చేయండి” అన్నాడు.

శిరీష వేలెట్‌లో వున్న కాగితాన్ని మడతవిప్పి చూసింది.

అంతే....పక్కలో బాంబుపడ్డట్టు అదిరిపడింది.

ఇందాక భాస్వంత్ ఇచ్చిన కాగితంపై రాసిన సంఖ్య కూడా 1089.

ఆమె కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి....

అంటే.... ఇంక తమ ప్రేమ ఫలించదన్నమాట భాస్వంత్ అన్న ఈ మాటే ఆమెను ఆ క్షణంలో అంతగా కలవరపరిచింది.

భాస్వంత్ టేబుల్‌పై వున్న దినపత్రికలో తలదూర్చి చదువుకుంటున్నాడు.

“అంకుల్”

“ఊ” తల పైకెత్తకుండానే జవాబిచ్చాడు.

“రెండు ఆన్సర్లు ఒకటిగానే వున్నాయి” అంది బెంబేలుపడుతూ....

“నిజమా” అంటూ నోట్‌బుక్‌పై వారు చేసిన లెక్కనే తానిచ్చిన కాగితాన్ని మార్చి మార్చి చూసి “ప్చ్” అన్నాడు కాస్త బాధను అభినయిస్తూ....

“అంకుల్ అంటే మేం విడిపోతామా” అప్పటికే ఆమె చెంపలపైకి జారుతున్నాయి కన్నీళ్ళు.

ఒక్క క్షణం క్షణంలో వెయ్యోవంతు తాను చేసింది లెక్కలగారడీ అని వారు తాను విపరించిన పరిధిల్లో ఏ మూడంకెల సంఖ్య తీసుకున్నా ఫలితం అదే వస్తుందని చెప్పేయాలనుకున్నాడు.

తమాయించుకున్నాడు.

ఆ లేతమనసు గాయపడిందన్న వాస్తవాన్ని గ్రహించి “భయపడకమ్మా....నేనున్నానుగా” అన్నాడు నిజాయితీగానే.

“కానీ ఆన్సర్ అదే వచ్చిందిగా.”

“అదేనమ్మా నా ప్రత్యేకత....లెక్కలతో లోకంపై దండెత్తుతున్నవాడ్ని ఈ చిన్న లెక్కకి జవాబు చెప్పలేనా” ఆమె కళ్లు తుడిచాడు. “నీ పెళ్ళి సునీల్‌తోనే జరిగితీరుతుంది జరిగేట్టు నేనుచేస్తాను....సరేనా” బలమైన హామీ ఇచ్చాడు.

“నిజంగానా అంకుల్....ప్రామిస్.”

ఆమె చేతిలో చేతినుంచి “ప్రామిస్” అన్నాడు.

ఎందుకో తప్పకుండా వారిద్దరికీ పెళ్ళి జరిగేట్టు చూడాలని అతడి కనిపిస్తే అది భాస్వంత్ తన సంకల్పంగా అంగీకరిస్తాడే కాని దైవికంగా అని మాత్రం అంగీకరించడు.

వారు వెళ్ళిపోయారు....

రెస్టారెంటు బయటికి వస్తూన్న భాస్వంత్ ఒక్కక్షణం అప్రతిభుడై నిలబడిపోయాడు.

అతడి ఇంట్యూషన్ తప్పుకాలేదు.

విశాంత ఓ ఫియట్‌లో వెళుతూ కనిపించింది.

ఆ క్షణంలోనూ అతడు ఒక విషయం గమనించడం మరిచిపోలేదు.

ఆమె వెళ్తున్న కారు నెంబరు....

ఎ డి బి 6304

10

ఫియట్ అప్పటికే చాలాదూరం వెళ్ళిపోయింది.

స్తబ్దుడై నిలబడి పోయాడు చాలా సేపటివరకు....

మొత్తానికి నిశాంత కనిపించింది. అదే అతడ్ని ఆ క్షణాన కాస్త ఊరడించిన విషయం.

కానీ ఎలా ఇంత పెద్ద నగరంలో ఆ కారును వెతికి పట్టుకోవడమెలా?

హఠాత్తుగా అతని మెదడులో ఇందాక దినపత్రికలో చదివిన ఓ వార్త మెదిలింది.

"రాత్రి టేంకుబండపై ఆటోను గుద్ది కారు పరారీ"

మరో పదినిమిషాలలో భాస్వంత టాంక్‌బండ్ పోలీసు స్టేషన్ చేరుకున్నాడు.

ట్రాఫిక్ ఎస్ఐని కలుసుకుని ఇందాక నిశాంత వెళుతున్న కారు నెంబరును మననం చేసుకుంటూ చెప్పాడు. ఆ కారే ఆటోను గుద్ది పారిపోవటం తను చూసాడని ఒక పౌరుడిగా తన ధర్మాన్ని నిర్వర్తించే ఉద్దేశంతో వచ్చాడతను.

"రాత్రే మీరెందుకు కంప్లైయింట్ చేయలేదు" అడిగాడు యస్సై.

"ఓ అర్జెంటు పనిమీద టాక్సీలో వెళ్ళిపోతూ వెంటనే రిపోర్టు చేయలేకపోయాను" అన్నాడు.

భాస్వంత అంచనా తప్పుకాలేదు.

మరో అయిదు నిమిషాలలో రోడ్ ట్రాన్స్‌పోర్టు అథారిటీ ఆఫీసుకు ఫోనుచేసి ఆ కారు యజమాని ఎవరన్నదీ తెలుసుకోగలిగారు పోలీసులు.

"ఇంపాసిబుల్" అన్నాడు యస్సై భాస్వంత చెప్పింది నిజం

కాదేమో అన్న అనుమానంతో...."ఆ కారు ఎవరిదనుకుంటున్నారు. ఈ సిటీలో చాలా ప్రముఖుడైన ప్రభంజనరావుగారిది."

అర్థమైంది నిశాంత జీవితం ఎంత బలమైన కబంధహస్తాల్లో ఇరుకున్నది.

సుగర్ ఫ్యాక్టరీలకు. రైస్ బ్రాన్ ఆయిల్ ఫ్యాక్టరీకి. ఫ్లోర్‌మిల్సుకి యజమాని అయి వుండి ఎన్నికల పత....నిర్మాణంతో ప్రజా బాహుళ్యంలో ఎంత పరపతిని సంపాదించిందీ ఒక దేవుడుగా ఎంత మందిచేత ప్రస్తుతింప బడుతున్నదీ ఎస్సై చెప్పి అలాంటి మనిషికిగాని ఆయన మనుషులకుగాని ఇలా ఏక్సిడెంట్ చేసి పారిపోవలసిన అగత్యం లేదని" తేల్చిపారేశాడు.

భావరహితంగానే చూస్తూ వుండిపోయాడు. "దేవుడుగా ప్రస్తుతింప బడుతున్నాడా ఇన్స్‌పెక్టర్. ఒక రావణుడిలా రాజ్యమేలుతున్నా. ఉన్న వాడు కాబట్టి ఒక రాముడై వెలుగుతున్న ఈ చిల్లర దేవుళ్ళే నా లక్ష్యాలు. ఇలాంటి దేవుళ్ళ ప్రతినిధుల్నే నేను ఎదిరించాలనుకుంటున్నది ఎదుర్కొనేది కూడా" మనసులోనే అనుకుంటూ "దెన్ సారీ ఇన్స్‌పెక్టర్....పొరపాటు పడ్డారేమో, శలవు తీసుకుని బయటకు వచ్చాడు."

మనసును ఆలోచనల అమ్ములపొదిగా మార్చుకుంటూ నడుస్తున్నాడు భాస్వంత.

* * * *

"పిచ్చిపిల్లా!"

బంజారాహిల్స్‌లోని ఓ భవంతిలో నాగులకోనలాంటి ఓ మారుమూల గదిలో భయవిహ్వలురాలై చూస్తున్న నిశాంత జుట్టు పట్టుకుని రాక్షసానందంతో పలకరించాడు. ప్రభంజనరావు.

ఆమె పులినోట చిక్కిన లేడిపిల్ల లా నీరసంతో గిలగిలలాడుతోంది.

పిడికిలిని మరింత బిగించిన ప్రభంజనరావు ఉత్సాహంగా చూస్తున్నాడు.

ఆడపిల్లల రక్తమాంసాలతో వ్యాపారంచేసే అతడికి సెంటిమెంట్స

ఏవీ లేవు అని చెప్పడానికి ఆ క్షణానే అతడి కళ్ళల్లో మెరుస్తున్న పాశవికమైన ఉత్కంఠను గమనిస్తే చాలు బోధపడిపోతుంది.

మెదడు తెగి బయటపడేటంత బాధతో నిస్సహాయంగా నీళ్ళ చిమ్ముతున్న ఆమె కళ్ళలోకి మరింత క్రౌర్యంగా చూస్తూ "చాలా అలసిపోయినట్టున్నావు ఒక్క అరగంటలో నా కార్యక్రమాన్ని మొదలుపెడతాను. ఈలోగా రెస్టు తీసుకో....అందంగా అలంకరించుకో....వయసు దాటినట్లు కన్పిస్తున్నా నేను ఎంత హుషారుగా ఉంటానూ అన్నది నీకు అర్థమయ్యేట్టు చేస్తాను....ఆ తర్వాత ఇక్కడ నాకు దొరికిన సంతృప్తిని బట్టి ఆలోచిస్తాను నిన్నేం చేయాలీ అన్నది ఓకే" ఆమెను నెట్టాడు.

గోడకు తలకొట్టుకొని అలసటగా నేలపైకి జారింది.

ప్రభంజనరావు బయటకు వచ్చాడు.

"జీవన్"

హాల్లో కూచున్న జీవన్‌రావు లేచాడు ప్రభంజనరావుని చూడగానే. సిటీలోని కొన్ని ఫేక్టరీల్లో కార్మిక నాయకుడైన జీవనరావు ప్రభంజనరావుకి కుడిభుజంలాంటివాడు.

"అందమైనదేకాదు చాలా తెలివైనదీ కూడా అనిపిస్తూంది దాన్ని చూస్తూంటే. కాకపోతే మన రంగంలో తొందరగా ఇమిడేట్లు లేదు" ఉత్సాహంగా నడిచి టేబుల్‌కి అభిముఖంగా కూర్చున్నాడు.

కొందరు కొన్ని వ్యాపకాలలో రిలాక్సవుతుంటారు.

మరికొందరు కొన్ని ఆటల్లో నిమగ్నమై మానసికమైన గ్లానిని మర్చిపోయే ప్రయత్నం చేస్తారు.

ఈ సూత్రం చక్రవర్తులు మొదలుకుని సామాన్యుల వరకు వర్తించేదే....

కొన్నిగంటల క్రితం వరకూ చాలా టెన్షన్‌లో గడిపిన ప్రభంజనరావు ఇప్పుడు మానసికమైన రిలీఫ్‌ను పూర్తిగా కోరుకుంటున్నాడు.

ఒక అరగంట గడువిచ్చాడు నిశాంతకు,

ఇప్పుడతడు టేబుల్‌పై పదకొండు అగ్గిపుల్లల్ని ఒకదాని ప్రక్క మరొకటి పేర్చి "కూర్చో" అన్నాడు జీవన్‌రావుతో.

చిన్నతనంలో ఎప్పుడో నేర్చుకున్న ఆట అది....ఇంత ఎదిగినా ఆ ఆటను ఆటపై ఉత్సాహాన్ని సెంటిమెంటల్‌గా పెంచుకుంటూ ప్రత్యర్థిని సునాయాసంగా ఓడించడం అలవాటు చేసుకున్నాడు.

ఏళ్ళ తరబడి ఆడుతున్నా ఆటలోని ఒడుపుని అర్థం చేసుకోలేని జీవన్‌రావు ఎప్పుడూ ఓడిపోతూనే ఉంటాడు.

ఇది కేవలం ఇద్దరు మాత్రమే ఆడే ఆట....

మొదట ప్రారంభించే వ్యక్తి ఒకటి, రెండుగాని లేక మూడు అగ్గిపుల్లలుగాని ఒకసారి మూడు అగ్గిపుల్లలు మించకుండా తీస్తాడు.

ప్రత్యర్థి కూడా ఒకేసారి మూడు అగ్గిపుల్లలు మించకుండా తీయాలి.

ఇలా కొనసాగిన ఆటలా ఆఖరి అగ్గిపుల్లను తీసినవాడు ఓడిపోయినట్లు లెక్క. అంటే ప్రత్యర్థికి చివరిలో ఒక అగ్గిపుల్ల మిగిలేట్లు చేయాలి.

ఆట ప్రారంభించమన్నాడు ప్రభంజనరావు.

క్షణం ఆలోచించిన జీవన్‌రావు మూడు అగ్గిపుల్లల్ని ఒకసారి తీయబోతుంటే "ఓడిపోయారు" అన్నారెవరో....

పరిచయంలేని ఆ కంఠం విన్న ప్రభంజనరావు జీవన్‌రావు ఒకేసారి తలలు తిప్పి చూసారు.

అక్కడ సమీపంలో భాస్వంత్ నిలబడి వున్నాడు.

"ఎవర్నువ్వు" ప్రశ్నార్థకంగా చూసేడు ప్రభంజనరావు.

"నా పేరు భాస్వంత్"

"నిన్నిలా ఎవరు రానిచ్చారు" మరో ప్రశ్న....

"తెలివి వుంటే ఎక్కడికైనా చొచ్చుకుపోవచ్చు. ఏ స్థాయికైనా ఎదగొచ్చు అని నిరూపించగలిగిన మీరు ఇలాంటి ప్రశ్నవేయడం సమంజసంగా లేదు ప్రభంజనరావుగారూ?" ప్రభంజనరావు అహాన్ని సంతృప్తి పరచే మొదటి అస్త్రాన్ని విసిరాడు. "నాకు తెలుసు ఈ భవంతిలో నాకు ప్రవేశం దొరకదని" అందుకే మీటర్ రీడింగ్ కోసం వచ్చినట్టు మీ అను

యాయుల్ని మధ్యపెట్టి లోపల అడుగుపెట్టాను. ఒక అగ్గిపుల్లతో అం రాష్ట్రాన్నే తగలబెట్టే సమర్థులైన మీ దర్శనం చేసుకుంటూనే ఆట మొదటి స్టెప్స్‌లోనే తప్పుచేస్తున్న ఈయన్ని వారించి నా మేధస్సేమి నిరూపించుకునే ప్రయత్నం చేసాను"

అలసటలోనైనా అనూహ్యమైన కాంతిని తనమీద తనకు నమ్మకాన్ని వ్యక్తం చేస్తున్న భాస్వంతు కళ్ళల్లోకి చూస్తూ "ఈ ఆట నీకు ప్రావీణ్యముందా" అన్నాడు ప్రభంజనరావు.

"నిజానికి పరిచయం కూడా లేదు."

"అలాంటప్పుడు ఇది తప్పని ఎలా అనుకున్నావు" ఈసారి జీవ రావు అడిగాడు.

"ఈ ఆటగురించి ఎప్పుడో విన్నాను అంతే....అందుకే పదకొం అగ్గిపుల్లలు వున్న ఈ ఆటలో ముందు మూడుకాక రెండు అగ్గిపుల్ల తీస్తే తప్ప గెలవటం అసాధ్యమని మీకు చెప్పాలనిపించింది...."

ప్రభంజనరావు కళ్ళు మెచ్చుకోలుగా చూసాయి.

"వివరించి చెప్పగలవా"

చెప్పాడు భాస్వంతు "ముందు రెండు అగ్గిపుల్లలు తీస్తే ఇం తొమ్మిది మిగుల్తాయి. ప్రత్యర్థి మూడుకన్నా ఎక్కువ పుల్లలు తీ గూడదు కాబట్టి అతడి వంతు అయ్యాక అయిదు పుల్లలు టేబుల్ మిగిలేట్టు మొదటివ్యక్తి జాగ్రత్తపడాలి. ప్రత్యర్థి మూడుకన్నా ఎక్కు తీయలేడు. ఒకటికన్నా తక్కువ తీయలేడు. మిగిలిన దాంట్లో మొదటివ్య టేబుల్‌పై ఒకటే అగ్గిపుల్ల మిగిలేట్లు జాగ్రత్త పడొచ్చు"

"శహభాష్" అభినందించాడు ప్రభంజనరావు.

ఇన్ని సంవత్సరాల అనుభవంలో కూడా ఈ చిన్న సూత్రా విశ్లేషించలేకపోయిన జీవనరావుని ఓ మారు చూసిన ప్రభంజనరా "అంటే నాతో ఆడగలవాడివి ఇన్నాళ్ళకు దొరికావు" అన్నాడు.

"ఆడగలడమే కాదు.... అవకాశమిస్తే ఓడించగలను కూ భాస్వంతు నెమ్మదిగా అన్నా అది చాలా బలంగా ప్రభంజనరావు అహా తాకింది.

"నాకు తెలుసు ఇప్పుడు మీరు నన్ను బయటికి గెంటేయబోతున్నారని....మీలాంటి మేధావి నాలాంటి ఓ సామాన్యుడితో ఓటమికి అంగీకరించలేరని మరో అస్త్రం."

నిజంగా 'గెటవుట్' అంటూ అరిచేవాడే....కాని టక్కున ఆగిపోయాడు.

"దెన్ కమాన్" ఇంచుమించు అరిచినట్లుగా ఆజ్ఞాపించాడు.

జీవన్‌రావు ప్రక్కకు తొలగడమూ భాస్వంతు కూర్చోవడమూ రెండు క్షణాల్లో జరిగిపోయింది.

"ఒకవేళ నువ్వు ఓడితే...." అడిగాడు ప్రభంజనరావు.

"జీవితాంతం మీకు ఊడిగం చేస్తాను"

"దానివలన నాకొరిగేదేమిటి"

"ఎంత ఒరిగేది ఇప్పుడు గెలుపుతో నేను చూపించే మేధస్సుతోనే మీకు అర్థమవుతుంది" భాస్వంతు మామూలుగా అన్నాడు...."ఒకవేళ మీరు ఓడితే...."

"ఇంపాసిబుల్" ఆ పదాన్నే భరించలేనట్లుగా అరిచాడు....

"ప్రతి ఆటగాడూ గెలవాలనే కృషిచేస్తాడు ప్రభంజనరావుగారూ.... నేను గెలుస్తానూ అని కాదుకాని ఒకవేళ మీరు ఓడితే ఏమిస్తారు అని అడుగుతున్నాను" చాలా యుక్తిగా పదాల్ని ఎన్నుకుంటూ ప్రభంజనరావుతో పోరాటానికి సిద్ధపడుతున్నాడు.

"ఏం కావాలి"

బలిచక్రవర్తి వామనుడ్ని అడిగినట్లు ఠీవిగా చూసాడు.

భాస్వంతు కళ్ళు వేగంగా నేలని పరికించాయి.

"ఈ గదిలోని మొజాయిక్ ఫ్లోరింగ్‌లో సుమారు అరపై నాలుగు గళ్ళున్నాయికదూ"

ఇంత స్వల్పవ్యవధిలో ఎలా లెక్కపెట్టాడా అన్న ఆశ్చర్యంలో

ప్రభంజనరావు నిశ్చేష్టుడై చూస్తుంటే జీవన్‌రావు అయిదు నిమిషాలలో 'కరెక్ట్' అన్నాడు అబ్బురంగా మొత్తం లెక్కపెట్టి.

"మీకు ధాన్యపు గిడ్డంగులలా వున్నాయి" ప్రభంజనరావుకి ముందు అర్థంకాలేదు. గళ్ళకీ గిడ్డంగులకీ సంబంధమేమిటో....

"ఉంటే"

"సింపుల్ నేను గెలిస్తే మొదటిగడిలో ఒక ధాన్యపుగింజ రెండో గడిలో రెండు, మూడో గడిలో నాలుగు....నాలుగొ గడిలో ఎనిమిది చొప్పున డబుల్‌చేస్తూ ధాన్యమిప్పించండి. పేదవాడ్ని."

పగలబడి నవ్వాడు ప్రభంజనరావు.

పడిపడి నవ్వాడు....బలిచక్రవర్తిని మూడడుగుల నేల దానం చేయమని వామనుడు కోరినట్లు ఆలోచించాడే తప్ప ఆ మూడడుగుల నేల ఆధారంతోనే వామనుడు బలిచక్రవర్తిని ఏం చేసిందీ మరచిపోయాడు.

"రైట్" అదెంతపని అన్నట్లుగా రంగానికి సిద్ధమౌతూ అగ్గిపుల్లల్ని పేర్చాడు.

పదకొండుకాదు.

ఈసారి క్రమం మారింది.

మొదటి వరుసలో మూడు, రెండో వరుసలో అయిదు, మూడో వరుసలో ఏడు అగ్గిపుల్లల్ని వుంచిన ప్రభంజనరావు "ఇప్పుడు ఈ ఆటలో మరో చిన్న మార్పు మిస్టర్....ఒకే పంతులు ఒక వరుసలోని ఎన్ని అగ్గిపుల్లల్నయినా నువ్వు తీసేయవచ్చు."

"భాస్వంతు ఒక ధ్యానంలోలా అగ్గిపుల్లలకేసి చూస్తూ వుండిపోయాడు.

"ప్రారంభించు" ట్రాన్స్‌లోకి జారిన భాస్వంతుకి ప్రభంజనరావు అన్నమాట లీలగా వినిపించింది.

అతడి బుర్ర ఇప్పుడు ఒక కంప్యూటర్‌లా ఆలోచిస్తూంది.

ఆ గదిలో ఇసుకరేణువు రాలిపడితే వినవచ్చేటంత నిశ్శబ్దం.

భాస్వంతు పెదవులు కదులుతున్నాయి నెమ్మదిగా, రెండు అయిదూ ఏడూ, మూడూ నాలుగూ ఏడూ, మూడూ అయిదూ ఆరు, ఒకటి ఒకటి ఒకటీ.

ప్రత్యర్థిని ఓడించాలీ అంటే ఆట ఎక్కడ ఎలా ప్రారంభించాలో క్రమంగా అర్థమౌతూంది.

ఒక మెరుపు మెదడులో....

మెదడు అరల్లో సన్నని ప్రకంపన....అంతే.

ఏ రెండు వరుసల్లో అయినా ఒక సరిసంఖ్య వుండేట్టు ఆటలో జాగ్రత్తపడితే చాలు.

ప్రభంజనరావు రెప్పలార్పకుండా చూస్తున్నాడు.

ఒకటి....రెండు....మూడు—సెకండ్లు గడిచాయి.

అంతే....

రెండో వరుసలోని అయిదు అగ్గిపుల్లల్లో ఒకటంటే ఒకటి మాత్రం తీశాడు భాస్వంతు.

ప్రభంజనరావు ప్రక్కలో బాంబు పడ్డట్లు అదిరాడు.

"అయిపోయింది ప్రభంజనరావుగారూ....మీరు ఆట ప్రారంభించక ముందే నేను గెలిచాను" అంటూ తను అనుకున్న టాజింగ్ కాంబినేషన్స్" గురించి వివరించాడు.

తొలిసారి బహుశా ప్రభంజనరావుకి జ్ఞానం తెలిసాక, ఇక్కడ ఈ క్షణంలో ఇంకా పూర్తిగా వయసే రాని ఓ అబ్బాయి చేతిలో ఓడిపోయాడు.

బాధపడలేదు....జీవితంలో బాగా ఎదిగిన అతడు ఎదగాలనుకుంటున్న ఒక వ్యక్తిలోని నిబ్బరాన్ని కేవలం ఆ నిబ్బరంతోనే ఆత్మవిశ్వాసాన్ని అందంగా వ్యక్తీకరించి ఆ వ్యక్తీకరణ్ని గెలుపుకి అన్వయించుకున్న అతడి మేధస్సుని చూసి ముచ్చట పడుతున్నాడు.

"వెల్...." నిట్టూర్చిన ప్రభంజనరావు ఓడిపోయాను అన్న పదాన్ని వ్యక్తంచేయకుండానే జీవన్‌రావుని చూసి "ఆ ధాన్యం అతడడిగినట్లు ఏర్పాటు చేయి" అన్నాడు.

జీవన్‌రావు కదలబోయేంతలో "ఒక్క క్షణం" అన్నాడు భాస్వంత.

"మీరు ఇవ్వాలనుకుంటున్న ధాన్యం ఎన్నని అనుకుంటున్నారు" అడిగాడు.

"కూడితే అదే వస్తుందికదా" జీవన్‌రావు జవాబు చెప్పగానే నవ్విన భాస్వంత "అంత సులువుకాదు రావుగారూ, ఇప్పును ఎన్నిధాన్యం ఇవ్వాలీ అన్నది మరో గణిత శాస్త్రజ్ఞుడు తప్ప మీరు చెప్పలేరు" అన్నాడు.

ప్రభంజనరావుకు ముందు అర్థంగాక అంత కష్టమా అనుకున్నాడు. ఆ తర్వాత కాస్త ప్రయత్నించి ఇహ లాభంలేదని ఎక్కడికో ఫోన్ చేసాడు.

ఒకటి....రెండు....మూడు....అయిదు నిమిషాలు గడిచాక అవతలి నుంచి జవాబు వచ్చింది. "ఒకనాడు ఇలాగే పురుషోత్తముడనే రాజు ఒక పండితుడితో చదరంగంలో ఓడి పందేన్ని సైతం చెల్లించలేకపోయాడు. ప్రభంజనరావు....నువ్వు ఆ సంఖ్య వింటే చాలా ఆదిరిపడతావు....

18446744073709551615

నీ దగ్గరేకాదు ఈ దేశంలో ఒకే సంవత్సరం పండించిన ధాన్యం మొత్తం కలిపినా సరిపోవు"

ప్రభంజనరావు నుదుట చెమటపట్టింది.

ఫోన్ పెట్టేశాడు....అతడు తప్పు వినలేదు. అసలు ప్రభంజనరావు ఆ క్షణాన ఎంక్వయిరీ చేసి అది సామాన్యుడ్ని కాదు. ప్రస్తుతం దేశంలో గణితశాస్త్ర నిష్ణాతుడిగా చలామణి అవుతున్న జానకీరాంని—మరో మూడు రోజుల్లో ఉస్మానియాలో ఏర్పాటు చేయబడిన 'మేథమెటికల్ ఒలంపియాడ్' కోసం ప్రత్యేకంగా వచ్చాడతడు.

ప్రభంజనరావు స్థబ్దంగా ఉండిపోవడం చూసి మృదువుగా నవ్విన భాస్వంత "ఇప్పుడు నేను చేసిన ప్రయత్నం మిమ్మల్ని గెలవాలనికాదు ప్రభంజనరావుగారూ—నా తెలివిని మీ దగ్గర ప్రదర్శించి ప్రాపకం సంపాదించుకోవాలన్న తాపత్రయం మాత్రమే. కాబట్టి గెలిచిందైనా పందెం చెల్లించాల్సిన అగత్యం లేదు—కాని ఒక్క రిక్వెస్టు" ఆగేడు క్షణంపాటు

"ఇక్కడ ఒకవేళ నాకేదన్నా నష్టం జరిగితే అది మరోచోట పూడ్చుకోవడానికి ప్రయత్నిస్తాను. ఒక్కసారి మీరు ఒక్కరోజుపాటు నిశాంతను నాతో పంపగలరా."

విభ్రమంగా చూసేడు ప్రభంజనరావు "ఎలా తెలుసు నీకు నిశాంత" అన్నట్టుగా.

"నన్ను అంచనా వేయడానికి ప్రయత్నించకండి ప్రభంజనరావు గారూ! ఈ సమాజం మీద ఒకకసితో ప్రయాణం సాగిస్తున్నవాడ్ని మీలాంటి మేధావుల అడుగుజాడల్లో నడిచి ఎదగాలనుకుంటున్నవాడ్ని—" నర్మగంభీరంగా చూసేడు ప్రభంజనరావుని.

"నేనేమిటో మీకు పూర్తిగా అర్థంకావాలీ అంటే ఇంకా చాలా వ్యవధి కావాలి. నేనడుగుతున్నది నిజానికి పెద్దకోరికకాదు. పందెమే ముఖ్యమైతే ధాన్యం అడిగి మిమ్మల్ని యుక్తిగా మభ్యపెట్టేకంటే సునాయాసంగా మీ దగ్గర డబ్బు గెలుచుకునేవాడ్ని. అక్కడ మీరు మాట తప్పనూ అన్న అపప్రధ లేకుండా ఉండాలీ అంటే ఇక్కడ ఒక చిన్న సహాయానికి మీరు సిద్ధపడాలి"

చాలా ఆకర్షితుడవుతున్నాడు ప్రభంజనరావు భాస్వంత మాటలు వింటుంటే.

అది మాత్రమేకాదు అంత ప్రముఖుణ్ని విశేషంగా ఆకట్టుకున్నది.

చాలా స్వల్పవ్యవధిలో తన సామ్రాజ్యంలోకి చొచ్చుకురావడమే కగా ఈ వ్యవస్థపై చాలా కసిని వెళ్ళగక్కుతున్నాడు.

ఇలాంటి ఒక్కటి ఒక్కటంటే ఒక్కటి మారణాస్త్రం ఉంటే చాలు తన చాలా పనులు సులభసాధ్యమవుతాయి.

"నేను మీకు శత్రువునుకాదని మీరనుకుంటే ఒకవేళ శత్రువునే అయినా మీకున్న బలగంతో ఈ శత్రువుని ఢీకొనడం పెద్దవిషయంకాదన్న నమ్మకం మీమీద మీకుంటే నా కోరికను మన్నించండి.... లేదా వెళతాను" "అభ్యంతరంలేదు" వెంటనే జవాబిచ్చాడు ప్రభంజనరావు. "నీలాంటివాడు

నాకూ కావాలి. కాబట్టే చాలా కష్టపడి సాధించిన ఆ అమ్మాయిని నీతో పంపడానికి అంగీకరిస్తున్నాను."

"ఆ అమ్మాయి పరంగాగాని, నా మూలంగాగాని మీ కిచ్చిన మాట తప్పనని నేను హామీ ఇస్తున్నాను."

"తప్పిననాడు ఈ ప్రభంజనరావేంటో నీకింకా స్పష్టంగా తెలియపర్చాల్సి ఉంటుంది.

నవ్వేడు భాస్వంత్ "ఒక వటవృక్షం క్రింద సేదదీర్చుకోవాలనుకుంటున్న బాటసారిని నేను. వటవృక్షాన్నే కూల్చేయాలని ఆలోచించే కుమ్మరిపురుగును కాదు. అదే నా లక్ష్యమైతే నేను ప్రవేశించే మార్గం ఇది మాత్రం అయ్యుండేదికాదు"

ప్రభంజనరావు పూర్తిగా నమ్మేశాడు. అతడికున్న అపారమైన అనుభవం భాస్వంత్‌ను నమ్మేట్లు చేసింది.

"వెళ్ళు.... సరిగ్గా రెండురోజుల్లో ఇక్కడ ఉండాలి. నేనే కారు ఏర్పాటు చేస్తాను"

ప్రభంజనరావు చేతుల్ని పట్టుకుని కృతజ్ఞతగా స్పృశించాడు!

అక్కడ ఒక మహా సంగ్రామానికి చేతులు కలుపుతున్న భావం ప్రభంజనరావు మనసులో కలిగితే అది పూర్తిగా భాస్వంత్ స్పర్శద్వారా చూపించగలిగిన ఒక అనుభూతే.

మరో రెండు నిముషాలలో భాస్వంతు నిశాంత గదిలో అడుగు పెట్టాడు.

ద్వారం తెరుచుకుని కాంతి చొచ్చుకువస్తుంటే ఓమూల గాయపడిన లేడిపిల్లలా ముడుచుకుని కూచున్న నిశాంత ఏదో ఉపద్రవాన్ని వూహించింది. కాని....

ఎదురుగా భాస్వంతు నిలబడి వున్నాడు.

అనుక్షణం తనకు అందగా దేవుడి మెడలో తను వేయని ఒకపూలదండగా ప్రత్యక్షమవుతున్న ఓ మనిషి.

"లేవండి" చేతినందించాడు.

ఆమె లేవలేదు....

భయంతోనూ భీతితోనూ వెక్కిపడుతూ నేలకి తలవంచింది.

రెండు నీటిబొట్లు అతడి పాదాల్ని అభిషేకించాలన్న తాపత్రయంతో మునివ్రేళ్ళపై జారాయి.

"మీ నాన్నగారికి మాట ఇచ్చాను" చెప్పాడు జరిగింది.

ఆమె కళ్ళల్లో పేరుకుపోయిన నీటిపొరలు అస్పష్టంగా కనిపించే ఒక దేవుడ్ని చూస్తున్న అనుభూతిని కలిగిస్తుంటే మరో క్షణంలో మరింత నాశనం కావలసిన తన బ్రతుకులో ఈ మలుపేమిటి అనుకుంటూ "రాలిన సుమాల్నే కాని నీ భక్తురాలుని కానే అయినా కోరని వరంలా నా కళవరపాటులోకి ఎందుకు తొంగిచూస్తావు. నేనెవరిని నీకేమౌతానని"

అతడు నెమ్మదిగా ఆమె చేతినందుకుని పైకి లేవదీసాడు. "బయలుదేరండి"

ఆమె పెనుగులాడుతూంది ఏదో చెప్పాలని....

అవకాశమివ్వలేదతడు.

"అవునూ....మనం వెళ్ళేది భార్యాభర్తలుగా కాబట్టి మీ మెడలో తాళి అవసరమనుకుంటా కదూ" అన్నాడు యధాలాపంగానే....

క్షణం ఒక క్షణంలో వెయ్యోవంతు చిత్రమైన పులకింత ఆమె శరీరంలో....

మరుక్షణం ఆమె చీరచెంగున వున్న ఓ ముడిని విప్పింది.

ముడిలో పదిలంగా దాచిన ఒక మంగళసూత్రాన్ని ఆమె మెడలో వేసుకుంటుంటే. "రడీగా వుంచారే" అన్నాడు.

వారు బయలుదేరారు.

ఇక్కడ చాలా చిత్రంగా భాస్వంతు ఒక విషయాన్ని గమనించలేకపోయాడు.

నిశాంత మెడలో వేసుకున్న సూత్రం కాసుపైవున్న ఇంగ్లీష అక్షరాలు అతడు చూసివుంటే ఓ చిత్రమైన సత్యం అతడికి తెలిసివచ్చేది.

ఆ తాళిబొట్టే ఒకనాడు తండ్రి కట్టించిన గుడిలోని సీతమ్మవారి మెడలోనుంచి అతడు దొంగిలించిందీ బాల్యంలో తన మేనగోడలు సుబ్బులకి మెడలో కట్టిందీను.

11

భారంగా కళ్ళుతెరిచిన శేఖరం మాస్టారికి బెడ్డుకు సమీపంగా ముందు కనిపించింది నిశాంత.

అంత నిస్త్రాణలోనూ ముందు తను కలగంటున్నానా అనుకున్నారాయన.

లేదు.... నిజంగా.... నిజంగా తన ముద్దుల కూతురే.... బ్రతికి లేదన్న నిజాన్ని ప్రపంచానికి తెలియపరచాలని కర్మకాండల్ని ముగించిన తన పెద్దకూతురే.

“అ....మ్మా....” పిలుపు గొంతు దాటి రాలేకపోతూంది.... కానీ కళ్ళనుంచి మాత్రం తన తప్పిదానికి నీళ్ళు మాత్రం ఉబికి వస్తున్నాయి.

తండ్రిని ఓదార్చాలని ఉద్వేగంగా రెండు అడుగులు ముందుకివేసి టక్కున అగింది....

ఇంటెన్సివ్ కరోనరీ కేర్ యూనిట్‌లోవున్న తండ్రిని సమీపించడానికే ముందు డాక్టర్లు అంగీకరించలేదు. పరిశుభ్రంగా బయటి వాతావరణానికి భిన్నంగా జాగ్రత్తలు తీసుకుంటే తప్ప రోగి ప్రాణానికెంతముప్పో డాక్టర్లు తెలియపరచడంతో ఆయన్ని తాకే సాహసం చేయలేక ఇక్కడ కూడా విధివశాత్తూ దూరంగానే వుండిపోయింది.

ఓపెన్‌హార్టు సర్జరీ మూలంగా శరీరమంతా బేండేజీ ఉన్నా తన గుండెను తనే తెరిచి కూతుర్ని గుండెల్లో దాచుకోవాలన్నంత ఉద్రేకంతో ఊగిపోతుంటే వెక్కిపడుతూ తల అడ్డంగా వూపింది నీళ్ళు నిండినకళ్ళతో.

“ఆవేశ పడకండి” వారింపుగా అన్నాడు భాస్వంత మాస్టార్ని చూస్తూ.

ఆపరేషన్ జయప్రదంగా ముగిసినా ఇంకా ఆయన ప్రమాదంనుంచి పూర్తిగా తప్పించుకోలేదన్న డాక్టర్లు విషయాన్ని కొన్ని క్షణాలక్రితమే భాస్వంతుతో చెప్పారు.

నిశాంత ఎంత తల్లడిల్లిపోతున్నదీ ఒక్కక్షణం అవకాశమిస్తే తండ్రి గుండెలపై పడి ఎలా రోదించాలను కుంటున్నదీ గ్రహించిన భాస్వంతు మృదువుగా ఆమె తల నిమిరాడు.

ఏ తండ్రికోసం ఎంత తపించిపోతుందో ఆ తండ్రి ప్రమాదం నుంచి గట్టెక్కాలని ఆ క్షణాన భాస్వంతు అప్రయత్నంగా దేవుడ్ని మనసులోనే తలచుకుంటే అది అతని తప్పుకాదు.

దశాబ్దాల తరబడి అతడిలో జీర్ణించుకుపోయిన ఒక విశ్వాసాన్ని బలంగా పెరికేయాలని ప్రయత్నిస్తున్నాడే తప్ప వంశానుగతంగా పెనవేసుకుపోయిన నమ్మకాన్ని ఇప్పుడప్పుడే ఎలా దూరం చేయగలడు?

“నన్ను....” శేఖరం మాస్టారు కంఠంలో సుడులు తిరుగుతున్న వేదన చివరికి గొంతు వచ్చింది. “నన్ను క్షమించలేవా తల్లీ....”

“వద్దు నాన్నా” ఆమె గొంతు వణికింది దుఃఖోద్విగ్నంగా.

“దూరంగా వెళ్ళిపోయావు.... వెళ్ళినా ఈ ముసలితండ్రి గురించే ఆలోచిస్తూ.... నిన్ను మేం చంపినా.... ఈ తండ్రి చావకూడదనీ.... నీ భర్త సహాయంతో....” పదాల్ని కూడపలుకుతూ నెలల తరబడి బాధని వెళ్ళగక్కే ప్రయత్నంలో వున్నారాయన.

అక్కడ ఎలాంటి కృతజ్ఞతా తనకి అక్కర్లేనట్టు నిలబడివున్నాడు భాస్వంతు.

డాక్టర్ వచ్చాడప్పుడే....

ఇచ్చిన గడువు తీరిపోయింది....వెళ్ళమన్నట్టుగా సంజ్ఞచేశాడు.

అదే తను చివరిసారిగా తన కూతుర్ని చూడడం అనుకున్నారేమో

ఆయన "అమ్మా విశాంతా!...." రొప్పుతున్నారాయన. "ఏం నీ అన్యాయం చేసినా దేవుడు నీకు ఇలాంటి భర్తనిచ్చి న్యాయం చేశాడమ్మా"

విశాంత ఇక తమాయించుకోలేనట్టు బయటికి నడిచింది....

అక్కడ గిరి అనసూయలు నిలబడి వున్నారు.

"నిజమేనమ్మా విశాంతా....చెడిన ఆడదాన్ని కూడా చేరదీసాడు అంటే నీ భర్త నిజంగా దేవుడే...."

మరొకరు చేసిన న్యాయం గురించి అమ్మ కృతజ్ఞతలు తెలియపరుస్తుంటే విశాంత ఏడుపు ఆగిపోయింది.

"చేసినదానికి సిగ్గు పడుతున్నానమ్మా! ప్రపంచంతో ఇప్పుడు నా పనిలేదు....నువ్వింక స్వేచ్ఛగా నీ భర్తతో ఇంటికి రావచ్చు."

చురుక్కుమంది విశాంతకీ....

"ఆ...." పిచ్చిదానిలా నవ్వుతూ చూసింది "నిజంగానా అమ్మా ఇప్పుడు హఠాత్తుగా నీకు మమకారం పుట్టుకొస్తుందా...." ఒక్కక్షణం ఆగింది. "ఏరోజు నేను నాశనమయ్యానో ఆరోజు సగము చచ్చిపోయాను రాత్రి నువ్వు నన్ను బయటికి నెట్టావో ఆరోజు పూర్తిగా చచ్చిపోయానమ్మా....ఎప్పుడు మీరు నన్ను చనిపోయినట్టు ప్రపంచానికి తెలియపరిచారో బ్రతికొస్తే నన్ను ప్రేతాత్మననుకుంటారు...."

ఆమె బయటకి నడిచింది.

"వెళ్దామా?" అన్నాడు భాస్వంత్. ఆమె కారెక్కబోతుంటే కారులో మాటాడుకోడానికి వీలు పడదేమో అన్నట్టుగా "ఒక్క మాట" అంటూ చూసేసు. "మీరు కావాలనుకుంటే ఆ వలయం నుంచి పూర్తిగా తప్పిస్తాను"

"తప్పించి?...." ప్రశ్నార్థకంగా చూసింది. "ఏం చేద్దామని?"

"అది కాదు" తొట్రుపడ్డాడు ఆమె ప్రస్తుత మానసికస్థితిని అర్థం చేసుకోవడంలో తొందర పడ్డానన్నట్టుగా. "మీకు కావాలంటే కొత్త జీవితానికి ప్రయత్నిస్తాననంటున్నాడు"

"కొత్తా?" ఆమె అంత దుఃఖంలోనూ నిశ్శబ్దంగా నవ్వింది

"అంటే....మీరు ఇప్పుడు తాత్కాలికంగా తీసుకున్న ఒక స్థానాన్ని నాకు శాశ్వతమైన వరంగా ఇస్తారా"

ఉలిక్కిపడ్డాడు....చాలా సేపటి వరకూ గొంతు పెగల్లేదు.

"ఖంగారు పడకండి....ఇప్పటికి మీరు చేసిందే నేను ఆజన్మాంతం గుర్తుంచుకోవాల్సిన మేలు భాస్వంత్‌గారూ! ఇంతకుమించి వరాన్ని కోరే హక్కు నాకు ఎలాగూ లేదు....ఇలాగే నన్ను వదిలేయండి. నేను సుఖంగానే వున్నానన్న భ్రమలోనైనా నా కుటుంబాన్ని మిగలనివ్వండి....ప్రభంజనరావులాంటి బలవంతుల శక్తికి వాళ్ళు బలికాకుండా వుండాలంటే నన్ను అక్కడికే చేరనివ్వండి."

మౌనంగా ఆమెతోపాటు అతడూ కారెక్కాడు.

కానీ ఆప్పుడే అతడిలో ఎలాంటి ఆలోచన రూపు దిద్దుకున్నదీ ఆమె వూహించివుండదు.

* * * *

"నీ మాట నువ్వు నిలబెట్టుకున్నందుకు సంతోషం మిస్టర్ ఉపాధ్యాయా....కాబట్టే నేను విశాంత ప్రాణాలుతీయకుండా విడిచిపెట్టాను" ప్రభంజనరావు ఫోనులో మాటాడుతున్నాడు ఉపాధ్యాయతో.

"కానీ నాకు విశాంత కావాలి. దానికి ఏభై వేలిస్తాననీ అన్నానే"

"దానిమీద నేను చాలా పెట్టుబడి పెట్టానే. ఏభై వేలతో ఎలా చేతులు దులుపుకుంటాననుకున్నావు?" తన వ్యాపారదక్షతను ప్రదర్శిస్తూ జవాబిచ్చాడు ప్రభంజనరావు. "ఆలోచించు....ఈ వేలంపాటలో ఇంకా ఎక్కువ ధర పలక్కపోదన్న నమ్మకంతో ఫోన్ క్రాడిల్ చేశాడు ..."

సరిగ్గా ఆ సమయంలో విశాంతతో సహా ఆ గదిలో అడుగుపెట్టాడు భాస్వంత్.

విశాంత లోపలికి వెళ్ళిపోయింది.

"వెల్....మాట నిలబెట్టుకున్నావు" అన్నాడు ప్రభంజనరావు భాస్వంత్‌ని అభినందిస్తున్నట్టుగా చూస్తూ....అయితే ప్రభంజనరావు అక్కడే

అ సంభాషణని త్రుంచి వుంటే బాగుండేది....దాన్ని కాస్తా పొడిగించి ఉపాధ్యాయ నిశాంత కోసం పెట్టిన బేరం గురించి బయటికి అనేశాడు.

సాలోచనగా చూసిన భాస్వంత్ "మీ స్టేచర్‌లో వున్న వ్యక్తులకి శత్రువులుంటారంటే నాకు ఆశ్చర్యంగా ఉంది" అంటూ మరికాస్తా లోపలికి చొచ్చుకుపోయాడు.

"నీకు తెలీదు భాస్వంత్....బహుశా ఇప్పుడిప్పుడే ప్రపంచాన్ని కొత్త కోణంలో చూస్తున్నవాడివి నువ్వు....అందుకే నువ్వు వూహించలేవు...."

".... ...."

"నాకున్న ప్రత్యర్థులు ఇద్దరే ఇద్దరు....ఒకడు ఉపాధ్యాయ....పత్రికపరంగా నా వ్యవహారాల్ని ప్రజల దృష్టికి తెచ్చి నన్ను దెబ్బ తియ్యాలని ప్రయత్నిస్తున్నవాడు. రెండోవాడు...."

"రెండోవాడు...." ఉత్సుకతగా అడిగాడు.

"శిరీష డిస్టిల్లరీస్ యజమాని డి.బి.రాజు"

'డి.బి.రాజు.... శిరీష....'

ఎక్కడో ఎక్కడో విన్నట్టుంది. ఒక్క నిముషం. అంతే గుర్తుకొచ్చింది.... 'అంటే శిరీషకు తండ్రి కదూ' అన్నాడు కొద్దిగా తనకు తెలిసిన విషయాన్ని వుపయోగించి ఎక్కువగా తెలుసుకోవాలన్న లాజిక్‌ను ఉపయోగిస్తూ.

"ఎస్....బంగార్రాజు....డి. బంగార్రాజు"

భాస్వంత్ పక్కనుంచి ఓ మిస్సయిల్ దూసుకుపోయినట్టనిపించింది.

అతని మెదడు చాలా వేగంగా పని చేయసాగింది. "బంగార్రాజంటే వైజాగ్‌లో ఆ మధ్య బ్రిడ్జి కూలి...."

"ఎస్ వాడే....వాడొట్టి సివిల్ కాంట్రాక్టరే కాదు. ఇక్కడ బ్రేవరీస్ యజమాని—నాకు రైస్‌బ్రాన్ ఆయిల్ కంపెనీలో ప్రత్యర్థి"

భాస్వంత్ ఉద్రేకాన్ని తమాయించుకుంటూ తన మొహంలోని

భావాలు బయటికి వ్యక్తం కాకుండా చాలా జాగ్రత్తపడుతూ అన్నాడు. "అందేటి. రజని ఒక్కతేగా కూతురు"

నవ్వేడు ప్రభంజనరావు. "వాడికి ఒక్క బిజినెస్సూ కాదు. ఒక పెళ్ళామూ కాదు."

"అంటే శిరీష మరో భార్య కూతురన్నమాట" తనలో తాను అనుకుంటున్నట్టు కొద్దిగా గొణిగి "మీరిక నిశ్చింతంగా ఉండండి ప్రభంజనరావుగారూ....ఈ చిల్లర దేవుళ్ళను తుదముట్టించే ప్రయత్నంలో మీకు నేను అండగా వుంటానని హామీ ఇస్తున్నాను" నమ్మకంగా చూసేడు.

"నీకు తెలీదు భాస్వంతు. వాళ్ళు బలవంతులే."

"వ్యాపారంలో బలాన్ని నిర్ణయించేది భుజబలంకాదు ప్రభంజనరావుగారూ....బుద్ధిబలం" ఒక చిన్న అస్త్రాన్ని అమ్ముల పొదిలోనుంచి బయటకు లాగుతూ అన్నాడు "ఫరెగ్జాంపుల్ నన్నే తీసుకోండి. మిమ్మల్ని నా తెలివితో ప్లీజ్ చేశాను....నిశాంతను నాతో పంపమని అర్థించి పాతికవేలు సంపాదించాను."

నిశ్చేష్టుడై చూస్తున్నాడు ప్రభంజనరావు.

"నిజానికి ఆ పాతికవేలు ఆటలో మీ దగ్గరే నేను సంపాదించి వుండేవాడినేమో. కానీ నా వుద్దేశం నేను మీ దగ్గర ప్రాపకం సంపాదించగలగడం. బిజినెస్ మరొకరితో నెరపడమునూ."

"అవునూ....నిశాంత మూలంగా పాతికవేలు ఎలా సంపాదించగలిగావు"

మామూలుగా నవ్వేసి "ఒక చిన్న వైద్యశాస్త్ర ప్రయోగానికి నిశాంతను అమెరికన్ హాస్పటల్‌కు తీసుకువెళ్ళాను" అన్నాడు.

ప్రభంజనరావు నుదురు చిట్లించడం భాస్వంతు గమనిస్తూనే వున్నాడు.

"మీకు తెలీదు ప్రభంజనరావుగారూ....సాంకేతికం ఎంతో ఎదిగిన అమెరికా వంటి దేశాల్లోని శాస్త్రజ్ఞవూహకు సైతం అందకుండా ఒక కిల్లర్ డిసీజ్‌గా మరో మనిషి శరీరంలోని రోగనిరోధకశక్తిని హరించి ప్రపంచం

గడగడలాడించే జబ్బు ఈ దేశంలో ఒకరిద్దరికి మాత్రం సోకిందని అందులో బొంబే రెడ్‌లైట్ ఏరియా నుంచి తప్పించుకు వచ్చిన నిశాంత ఒకతెని బొంబేలో చెక్‌చేసి డాక్టర్లు ఓ కాన్ఫరెన్స్‌లో వ్యక్తం చేస్తే ఆమె కోసం వెదుకుతున్న విశాఖపట్టణం డాక్టర్ల దగ్గరకు తీసుకువెళ్ళి ఒక చిన్న ప్రయోగంలో పాతిక వేలు సంపాయించాను.

"అంటే" ప్రభంజనరావు గొంతు వణికింది. "ఆమెకున్న జబ్బేమిటి?"

"ఎయిడ్స్"

ఒక శతఘ్ని పేలినట్టు అదిరిపడ్డాడు ప్రభంజనగావు.

భాస్వంతు ఇక్కడే ఆగిపోదలచుకోలేదు.

ఆ విషాన్ని పూర్తిగా అతడికి ఎక్కించే ప్రయత్నంగా చెప్పుకు పోతూనే వున్నాడు.

"మనిషి రక్తంలోని తెల్లకణాల్లో టి–4 లింఫోసైం అనేది ఓ ప్రత్యేక కణం. ఈ కణాలే మనిషి నాడి నిరోధకశక్తిని పెంచేవి. ఎయిడ్స్ వైరస్‌లోని జిపి–1 అనే వైరస్ ప్రొటిన్ రక్తంలోని టి–4 ప్రోటిన్‌ను గుర్తించి దానితో బంధం ఏర్పరచుకుంటుందని డాక్టర్ జె. సైన్‌మెక్ డేగల్ చెప్పడంలో."

"అపేయ్ ఇక" అన్నాడు ప్రభంజనరావు.

అప్పటికే అతడు చెమటతో పూర్తిగా తడిసిపోయాడు.

ఒకవేళ నిశాంతతో తను శారీరకమైన సంబంధం ఏర్పరచుకుని వుంటే తనేమయ్యేవాడు.

అదృష్టవశాత్తూ అది భాస్వంతు ద్వారా తెలిసింది కాబట్టి సరిపోయింది. కానీ లేకపోతే తనూ చివరికి నికృష్టమైన చావు చచ్చేవాడు.

వెంటనే ఫోన్ అందుకోబోయాడు ప్రభంజనరావు.

"ఆగండి" అంటూ భాస్వంత్ అతడ్ని వారించి 'ఉపాధ్యాయపై ఆమెను ఓ విషకన్యలా ప్రయోగించడమొక్కటే అయితే అది పట్టి పగ తీర్చుకోడం మాత్రమే అవుతుంది" అంటూ తను డయల్ చేశాడు.

మరో రెండు నిమిషాల్లో ఉపాధ్యాయ లైన్‌లోకి వచ్చేడు. "మిస్టర్ ఉపాధ్యాయా! నిజంగా మీకు నిశాంత ప్రాణాలపై అంతటి ఆసక్తి వుంటే ఆమె నిజంగా మీకు కావాలీ అనుకుంటే మీ స్థాయికి ఆమెకోసం ఓ అయిదు లక్షలు వెచ్చించటం కష్టం కాదనుకుంటాను. నేనెవరన్నదీ మీకు అనవసరం ఏంలేదు....నాకూ ప్రభంజనరావు గారికి చిన్న పందెం వచ్చింది. సామూహికంగా రేప్ చేయించి పదీ నిముషాల్లో నిశాంత ప్రాణాలు పోయేట్టు చేయగలనని ఆయనంటే కాదు అరగంటలో అయిదు లక్షలు సంపాదిస్తానని నేను అన్నాను. ఆమె బ్రతికి బయటపడుతుందో లేక ఇక్కడ ఇప్పుడే రాక్షసమైన చావు చస్తుందో తెలుసుకునే ప్రయత్నంలో ఒక అరగంట వెయిట్ చేద్దామనుకుంటున్నాం. మీ ఇష్టం" అవతలి వ్యక్తి అభిప్రాయం వినకుండానే ఫోన్ క్రెడిల్ చేశాడు.

ఏ సంభాషణ ఎక్కడ త్రుంచివేయాలి అన్న నిర్ణయించుకోవడం కూడా వ్యాపారదక్షత అన్న భాస్వంత్ బలంగా నమ్మే సూత్రాల్లో ఒకటి.

"నమ్మకముందా?" ప్రభంజనరావు అడిగాడు నిజానికి నిశాంతను మరో క్షణమైనా ఆ భవంతిలో ఉండే మూడ్‌లో లేడు.

"ఒక్క అరగంట వ్యవధి కావాలి ప్రభంజనరావుగారూ, ఒక ఆడదాని కోసం నిజంగా ఏభై వేలు పెట్టుబడి పెట్టడానికి అతడు సిద్ధపడ్డాడూ అంటే నిశాంత చాల అవసరం అవతలి వ్యక్తికి అన్న ఆలోచనతో స్త్రీ వ్యామోహంలో పడి రాజ్యాలే కోల్పోయిన మన గత చరిత్రను గుర్తుచేసుకుంటూ చిన్న ప్రయోగం చేశాను. లెట్స్ వెయిట్ అండ్ సీ."

వారి నమ్మకం వమ్ముకాలేదు.

మరో ఇరవై నిమిషాల్లో ఉపాధ్యాయ కారుడ్రైవర్‌ను పంపాడు డబ్బుతోసహా.

నిశాంత వెళ్ళిపోయింది. బేరాల్లో అమ్ముడుపోయిన ఒక మృగంలా.

చిత్రమేమిటంటే వెళ్తున్న నిశాంతను సైతం తేరిపారచూసే సాహసం చేయలేకపోయాడు ప్రభంజనరావు.

"పాపం ఉపాధ్యాయ" భాస్వంత్ నవ్వుతూ బ్రీఫ్‌కేసు తెరిచి ఏభై వేలు ప్రభంజనరావుకి అందించాడు.

"ఇదేమిటి?"

"వ్యాపారమే ప్రభంజనరావుగారూ .... ఓ అరగంట వ్యవధిలో మీరందించిన ముడిపదార్థాన్ని ఉపయోగించి సంపాదించిన డబ్బు....నిజానికి ఇది మీకు చెందాల్సిందే"

ఏభై వేలు తీసుకున్న ప్రభంజనరావు తన దశాబ్దాల జీవితానుభవంలో అవసరాల్ని అందమైన అవకాశాలుగా మార్చుకుంటున్న ఓ చాకులాంటి కుర్రాడ్ని చూస్తున్నాడు. అదీ తొలిసారి.

"ఇదిగో మరో లక్ష" భాస్వంత నోట్లను ముందు పడేసాడు.

"దేనికి?"

"మీ మరో ప్రత్యర్థి బంగార్రాజుపై పోరాటానికి మీరందించాల్సిన మరో ముడి పదార్థానికీ పెట్టుబడి."

అర్థం కాలేదు ప్రభంజనరావుకి.

ఏమిటింత వేగంగా దూసుకుపోతున్నాడీ భాస్వంతనే యువకుడు.

"ఆ విషయంలో నేనేమివ్వాలని ఇంత పెట్టుబడి పెడుతున్నావు."

"మీకు సుగర్ ఫ్యాక్టరీ వుంది. అంతేకాదు మీ ఫ్యాక్టరీలో బైప్రోడక్టుగా మొలాసెస్ స్పిరిట్ తయారుచేస్తున్నారు."

"అవును."

"ఆ స్పిరిట్‌తో బంగార్రాజు లిక్కర్ తయారుచేసే శిరీష బ్రేవరీస్‌కి అవసరముంటుంది."

"ఆయితే"

"మీరు ఆ స్పిరిట్ డీలర్‌షిప్ నాకు ఇప్పిస్తే దాన్ని చావుదెబ్బ కొట్టే ఓ ప్రయత్నం చేస్తాను."

ఆలోచనలోపడ్డాడు ప్రభంజనరావు.

"నాకు తెలుసు ప్రభంజనరావు గారూ! నాకా డీలర్‌షిప్ ఇవ్వడం అంత సులభమైన పనికాదని....కాబట్టే ప్రభుత్వపరమైన అడ్డంకుల్ని అధిగమించి మీరు అది సాధిస్తే బంగార్రాజుని మట్టి కరిపించే బృహత్తర పథకాన్ని నేను రూపొందిస్తాను."

భాస్వంతుపై అప్పటికే ప్రభంజనరావుకి ఎంత నమ్మకం ఏర్పడింది అంటే అనుకున్నది అక్షరాలా అమలు చేయగల సమర్థుడన్నది స్వల్పవ్యవధిలో రుజువైంది.

ప్రభంజనరావు 'సరే' అనడానికి వుద్యుక్తుడవుతుండగా అన్నాడు "కానీ ఆ ప్రయత్నంలో నేను గెలవాలీ అంటే డీలర్‌షిప్ నా పేరుమీద ఉండకూడదు."

"మరి"

"మిస్టర్ జగపతి పేరుపై ఏజన్సీకోసం ప్రయత్నించాలి."

"ఆయనెవరు?"

నవ్వేడు భాస్వంత "నాకూ తెలీదు."

ప్రభంజనరావుకి అంతా అగమ్యంగా వుంది.

"నేను చేసే ప్రతీదీ కాలిక్యులేటెడ్‌గా వుంటుందన్నది నేను నమ్మే విషయాల్లో ఒకటి ప్రభంజనరావుగారూ. ఇందులో మీరు సహకరిస్తే గణిత శాస్త్ర పరంగా కూడికలూ తీసివేతలూ మాత్రమే తెలిసిన బంగార్రాజుకి భాగహారమూ అంటే ఏమిటో ప్రాక్టికల్‌గా తెలియపరుస్తాను."

ప్రభంజనరావు భాస్వంతుని పేట్ చేస్తుండగా గుర్తుకొచ్చింది.

ఉస్మానియా యూనివర్శిటీలో జానకీరాం ఆరోజు నిర్వహించే "మేథమేటికల్ ఒలింపియాడ్"కి తనని ఆహ్వానించిన విషయం.

"నాకున్న వ్యాపార ఒత్తిడులు నాకు అనుకూలించకపోయినా జానకీరాం నాకు మంచి మిత్రుడు....ఓ పది నిముషాలపాటు ఉండి వద్దామనుకుంటున్నాను....వస్తావా?"

భాస్వంత లేచాడు.

ఎందుకో హఠాత్తుగా ఆ క్షణాన అతడికి చనిపోయిన ప్రముఖ గణితశాస్త్రవేత్త తన తండ్రి గుర్తుకొచ్చాడు.

* * *

"మమ్మీ"

కారులోనుంచి దిగిన నిశాంత ముందు అవాక్కయింది.

ఆమె ఇంకా తేరుకోకముందే ఓ పసివాడు ఉత్సాహంగా ఆ బంగ నుంచి పరిగెత్తుకురావడం ఆమెను కావలించుకోవడం క్షణాల్లో జరి పోయింది....

అప్పుడు చూసింది....

దిగ్భ్రమతో "బాబీ" అంటూ అక్కున చేర్చుకుంది.

ఒకరాత్రి తనకు రక్షణ ఇచ్చిన పసికందు ఇక్కడ ఇలా దర్శ మిచ్చాడేమిటి?

ఈ పసికందుకీ ఉపాధ్యాయగారికీ సంబంధమేమిటి.

"నాకు ఉన్న ఒక్కగానొక్క కొడుకు నిశాంతగారూ!రండిలోపలికి" సాదరంగా ఆహ్వానించాడు ఉపాధ్యాయ.

"భగవంతుడా ఏమిటీ చిత్రమైన పరిచయాలు.... ఎదురుదెబ్బలు.... పలకరింపులూ...."

"నిశాంతగారూ" ఆర్ద్రంగా పిలిచిన ఉపాధ్యాయ బయటికి చూస్తూనే అన్నాడు. "ఒకరోజు యాదృచ్ఛికంగా కలిసిన మీరు నా దగ్గర్నుంచి వెళ్ళిన రాత్రి వీడికెంతటి మమకారాన్ని అందించారూ అంటే ఏళ్ళతరబడి వాడిలో పేరుకుపోయిన స్తబ్దత చెరిగిపోయింది. ప్రతిక్షణమూ మీపేరూ మీతలపే.... అపరాత్రి నిద్రలేచి లేని అమ్మకోసం వాడు చేసే అల్లరిని మాన్పించే శక్తిలేక ఏ క్షణం ఏమౌతాడోనని ఇన్నాళ్ళూ డాక్టర్ల చేతికి అప్పచెప్పాను. ఇప్పుడు వాడి కోరికమేరకి మిమ్మల్ని దగ్గరికి చేర్చాను...."

నిశాంతని ఇంకా చేతుల్తో చుట్టేసేవున్నాడు బాబీ.

"ఈ ప్రపంచంలో నాకు మిగిలింది నేను బ్రతుకుతున్నదీ కేవలం వాడికోసమే నిశాంతా! అతిశయోక్తి అనుకోకండి....కాబట్టే నేను ఇప్పుడు మిమ్మల్ని రక్షించడంలో పోగొట్టుకున్న దానికన్నా పొందిందే ఎక్కువని సంతృప్తిపడుతున్నాను....ఈ ఇల్లు ఇక మీదేనన్నంత నిశ్చింతగా ఉండండి"

ఉపాధ్యాయ వెళ్ళిపోయాడు....

అప్పటికే ఇంట్లో తన గురించి ఏం చెప్పారో నౌకర్లందరూ గౌర పురస్సరంగా "రండమ్మగారూ" అంటూ ఆహ్వానిస్తుంటే నమ్మలేక పోతూందామె.

"రా....మమ్మీ.... ఇల్లు చూపిస్తా" బాబీ కంఠంలోని ఆ పిలుపు ఆమె గుండెను తాకి క్షణంపాటు వివశురాల్ని చేసింది.

ఆమె చీకటి కుహరంలాంటి జీవితంలో చిరుకిరణంలా అడుగు పెట్టిన బాబీ వెంటనే నడిచిందామె.

సరిగ్గా ఇదే సమయంలో....

ఉస్మానియా కేంపస్‌లోని ఓ ఆడిటోరియంలో ప్రముఖ గణిత శాస్త్రజ్ఞుడు జానకీరాం "మేథమేటికల్ ఒలింపియాడ్" నిర్వహించబడు తూంది.

అక్కడ విశ్వవిద్యాలయానికి చెందిన గణితశాస్త్రానికి చెందిన ప్రొఫెసర్లూ, విద్యార్థులూ మాత్రమేకాదు.... వివిధశాఖల్లో నిష్ణాతులైన ఎందరో వ్యక్తులు, ఆహ్వానితులూ పత్రికా విలేకరులు, మరెందరో సమావేశమైవున్నారు

గణిత శాస్త్రానికి సంబంధించిన ఎలాంటి సమస్యకైనా క్షణాల్లో ముడివిప్పి సునాయాసంగా జవాబు చెబుతుంటే ఎటు చూసినా చప్పట్లూ, కేరింతలూ.... ప్రొఫేసర్లుసైతం విద్యార్థుల్లా మారిపోయారు.

"ఒక ప్రశ్న సర్" ఒక విలేకరి లేచాడు. "ఇప్పుడు నేను అడుగుతున్నది గణితశాస్త్రానికి సంబంధించిందికాదు. మీ ప్రొఫెషన్‌కి సంబంధించినది. ఒకవేళ కీర్తిశేషులైన రామానుజంగారే ఇంకా బ్రతికుంటే ఇంకా ఆయనే నెంబర్ వన్‌గా...."

షిట్...." అరిచాడు జానకీరాం "ఇంకెక్కడి రామానుజం చచ్చి బ్రతికిపోయాడు... ఒకవేళ బ్రతికివున్నా నేను నా పాండిత్యంతో మానసికంగా చంపి వదిలిపెట్టేవాడ్ని"

"స్టాపిట్" ఒక కేక వినిపించింది ఆడిటోరియం దద్దరిల్లేటట్లు....

అలా అరిచింది విలేకరి కాదు....

ఖాస్వంత్....

అతడి కళ్ళు రోషాగ్ని కీలల్ని వెదజల్లుతున్నట్టు ఎరుపెక్కాయి.

"మిష్టర్ జానకిరాం.... ఎక్కడునావు ఇన్నాళ్ళూనీవు. నిన్నగాక మొన్నటివరకూ తిరుగులేని చక్రవర్తిగా బ్రతికిన రామానుజం చచ్చిబ్రతక లేదు. నీలాంటి కుహూరం మేధావుల్ని బ్రతికించాడు తనువచ్చి."

"నో"

"అరవకు...." గణిత శాస్త్రాన్ని ఔపోసన పట్టినట్టు భాస్వంత్ ఒక్కో అడుగు ముందుకేసుకొస్తుంటే ఆడిటోరియం అంతా విభ్రమంగా చూస్తూంది.

అప్పటికే ప్రభంజనరావు వెళ్ళిపోయాడు.

అనంత ప్రయాణం సాగించిన ఓ సూర్యకిరణం భాస్వంత్ డయాస్ దగ్గరకు వస్తుంటే నిర్వాహకులు అడ్డుకోబోయారు.

"అతడ్ని ఆపకండి" జానకీరాం వారించాడు. "ఏం నా పాండిత్యం మీద నీకు నమ్మకం లేదా...."

వికృతంగా నవ్వేడు భాస్వంత్ "అదే మిస్టర్ జానకీరాం. ఈ సభా ముఖంగా నీ శాస్త్రంలో నువ్వు చాలా అల్పుడివని నేను నిరూపిస్తే తర్వాత నీ పరిస్థితి ఎలా వుంటుందా అనికి ఆలోచిస్తున్నాను."

"అంతటి మొనగాడివా"

"యస్" ధృడంగా పలికాడు "మిస్టర్ జానకిరాం.... ఈక్షణంలోనే ఇందరి మధ్యవర్తులముందు నేను నీతో పోటీకి సిద్ధపడుతున్నాను. నువ్వు ఓడితే నాకేమీ ఇవ్వనక్కరలేదు. కాని నేను ఓడిననాడు చరిత్రపుటలో రామానుజం పేరు కనిపించకుండా చేస్తాను. నా చేతుల్తో ఒక మారుమూల గ్రామంలో ఉన్న అతడి సమాధిని శిథిలం చేసి మరీ వదిలిపెడతాను."

అతడంటున్న మాటలేమిటో అతడెవరో అక్కడెవరికీతెలీదు....

కానీ జరగబోయే ఓ చిత్రమైన పోరాటాన్ని చూడాలని అంతా కుతూహల పడుతున్నారు.

"ఏం.... సిద్ధంగా వున్నారా మిష్టర్ జానకిరాం"

అవమానంతో ఉడికెత్తుకుపోతూ "కమాన్" చేయి చూపించాడు డయాస్పైకి రమ్మన్నట్టు.

భాస్వంత వేదికపైకి నడుస్తున్నాడు.

ఆడిటోరియం కాలం స్తంభించినట్టు నిశ్శబ్దంగా వుంది ఒకవిస్ఫోటనానికి ముందు క్షణంలా....

12

"పేరు?" జానకీరాం అడిగాడు సాధికారికంగా.

"ఋషి" భావరహితంగా జవాబిచ్చిన భాస్వంతును మరింత అవహేళనగా చూస్తూ "ఎన్నాళ్ళు తపస్సుచేసావు నాతో తలపడాలని" అన్నాడు.

భాస్వంతులో చలనంలేదు.

అదే చూపు ఆ చూపుల్లో జానకిరాంంవంటి ఒక భౌతికవాదికి అర్థం కాని అధ్యాత్మికమైన నిశ్చలత.

వేలకొద్దీ ప్రేక్షకులతో నిండిన ఆడిటోరియం చాలా ఆసక్తిగా గమనిస్తున్నారు. ఒక ప్రముఖుడికీ మరో అపరిచితయువకుడికీ మధ్య సాగుతున్న చర్చని—

గళం పూర్తిగా విప్పని ఒక పసికందు గణితశాస్త్రకోవిదుడై తనతో పోటీ పడుతున్నాడన్న ఆలోచన కలిగిన జానకీరాం భాస్వంతును ఒక పిచ్చి వాడ్ని చూస్తున్నట్టు చూస్తున్నాడు.

నిజమే.... భాస్వంత ఒక వెర్రివాడిలా 'వున్నాడు.... అయితే ప్రపంచంలో మేధావులంతా అలాగే కనిపిస్తారని మెటీరియలిస్టు అయిన జానకీరాంకి ఆ క్షణంలో గుర్తుకురాంపోతే అది అతని తప్పుకాదు. పొరలు పొరలుగా అతడి వ్యక్తిత్వంపై పేరుకుపోయి అహానిది.

"నిజానికి నిన్నిలా పోటీకి తలపడనివ్వటమే నేను నీకుయిచ్చిన గొప్పసదావకాశము" వ్యంగ్యంగా నవ్వేడు జానకీరాం "కాబట్టే పేరూ వూరూలేని నీచేత ప్రశ్నలడిగించుకునే హీనస్థితికి నేను దిగజారలేక నేనే కొన్ని ప్రశ్నలడగాలనుకుంటున్నాను....· వాటికి నువ్వు జవాబు చెప్పగలిగితే....

"మీరు ఓటమిని అంగీకరించినట్టే నన్నమాట" టక్కున అన్న భాస్వంత్ వాక్యం జానకీరాంకు తగలాల్సినచోట చాలా బలంగా తాకడంతో "నాన్సెన్స్" అసహనంగా అరిచాడు.

జానకీరాం వూహించలేక పోతున్నాడు. అక్కడ భాస్వంత్ ఒక మేధావి ఆలోచనల్లోని సరళతని రెచ్చగొట్టి అదుపు తప్పేట్టు చేస్తున్నాడని అతడిలోని నిగ్రహాన్ని దెబ్బతీసే ప్రయత్నంగా పదజాలాన్ని వాడుతూ సైకాలాజీకల్‌గా ముందు దాడిచేస్తున్నాడనీను.

"కేవలం తొమ్మిది ప్రశ్నలు మాత్రం నిన్ను అడుగుతున్నాను. ఒక్కోదానికి పదిహేను సెకండ్ల వ్యవధి మాత్రం యిస్తున్నాను గెట్‌రెడీ"

భాస్వంత్ కళ్ళు అరమోడ్పులయ్యాయి....

నెమ్మదిగా ట్రాన్స్‌లోకి జారిపోయాడు....

ఇప్పుడతనికి ఎదురుగా కూర్చున్న వ్యక్తులు కనిపించడంలేదు.

ఒక శూన్యం ఆ శూన్యాన్ని పూర్తిగా ఆక్రమించిన తండ్రిరూపం పెదవులు గొణుగుతున్నాయి నెమ్మదిగా.

"నీ అపారమైన విజ్ఞానంతో అనంతంవరకూ వ్యాపించిన నాతండ్రి ఒక అహంకారికి బుద్ధిచెప్పే ప్రయత్నంలో తలకుమించిన భారాన్ని నెత్తిన వేసుకున్నాను. కోటానుకోట్ల అణువులతో నిండిన నీ రక్తంలోనుంచి రూపు దిద్దుకున్న ఒక అణువున్నేను....అణువంత శక్తిని నాకు ప్రసాదించు.... నాలో ఆవేశించి నన్ను కొన్ని క్షణాలపాటు నీ ప్రతిరూపంగా మార్చి సహకరించు."

"సిద్ధంగా వున్నావా" జానకీరాం రెట్టించాడు.

అప్పుడు కళ్ళు తెరిచాడు భాస్వంత్.... ఇప్పుడతడి నేత్రాలు నిజంగానే ఋషిత్వాన్ని సిద్ధించుకున్నాయి.

"కేవలం తోమ్మిది ప్రశ్నలు"

"ఏం తొమ్మిది మీ లక్కీనెంబరా" అన్నాడు భాస్వంత్ మృదువుగా నవ్వుతూ.

జానకీరాం పిడికిళ్ళు బిగుసుకున్నాయి.

"గణితశాస్త్రంలో తొమ్మిదికున్న ప్రత్యేకతని వివరించగలరా" భాస్వంత్ ప్రశ్నలోనుంచే తొలిప్రశ్నను ఉత్పత్తిచేసి అతనిపైకి ఒడుపుగా విసిరాడు జానకిరాం....

రెండేరెండు సెకెండ్ల వ్యవధి.... భాస్వంత్ చెప్పడం మొదలు పెట్టాడు.

"అంకెల్లోకి అతి ప్రత్యేకతగల నెంబరు తొమ్మిది. ఏ సంఖ్యనైనా తొమ్మిదిచేత గుణిస్తే వచ్చినసంఖ్యలోని అంకెల్ని విడిగా కలిపితే మళ్ళీ తొమ్మిదే అవుతుంది· తోమ్మిది నుపయోగించే అతిపెద్దసంఖ్యని తయారు చేయ్యొచ్చు"

"వివరించగలరా"

"9 9 9 నైన్‌రెజ్డు టుది నైన్త్ పవరాఫ్ నైన్ .... నైన్‌పవరాఫ్ నైన్‌యూజ్ 387420489....ఇప్పుడు 9 387420489ను ఒక సంఖ్యగా విప్పితే అది 428124773తో ప్రారంభమై 89తో ముగుస్తుందని గణిత శాస్త్రజ్ఞాలు సైతం గ్రహించగలిగారుకాని సుమారు మూడువందల అరవై తొమ్మిది మిలియన్ల అంకెలుగల ఆ సంఖ్యని సుమారు అయిదువందల మైళ్ళ నిడివిగల పేపరుపై మాత్రం పూర్తిగా రాయగల ఆ సంఖ్యని ఇంత వరకూ ఏ శాస్త్రజ్ఞుడూ పూర్తిగా రాయలేకపోయాడు."

సరిగ్గా ఇక్కడే జానకీరాం ఒక్కక్షణంపాటు తొట్రుపడ్డాడు. ఆ తొట్రుపాటుని ఆడిటోరియంలోని చప్పట్లు మరింత ఉధృతం చేసాయి.

అంతే నిగ్రహాన్ని కోల్పోతూ మరో ప్రశ్నకి సిద్ధపడ్డాడు....

"ఆ తొమ్మిది మధ్య అంకెగా ఓ పేలండ్రోంను రాసి ఆ ప్రోడక్టు రావటానికి "ఒకటి" అనే అంకె ఎంతవరకూ కారణమయ్యేదీచెప్పగలరా"

"పేలండ్రోం" అంటే ఎటునుంచి చూసినా ఒక వరస అంకెలు వుండటం.

భాస్వంతు మననం చేసుకున్నాడు మనసులోనే

123456789 87654321— పేలండ్రోం

"ఒకటి" అనే అంకె ఎంతవరకూ కారణమౌతుంది ఈ సంఖ్య రావడానికి- అదే ప్రశ్నలో రెండో అర్థభాగం....

భావాతీత ధ్యానంలా మూడు సెకండ్ల వ్యవధిమాత్రం తీసుకున్నాడు.

111 111 111 X 111 111 111

12345678987654321

తొమ్మిది ఒకట్లుగల సంఖ్యను తొమ్మిది ఒకట్లుగల సంఖ్యచేత గుణిస్తే వచ్చేది ఆ పేలండ్రోం.

అదిరి పడ్డాడు జానకిరాం.

సరిగ్గా అక్కడే అర్థమయ్యిందతడికి అంకెలగారడీతో ఆతడ్ని ఓడించడం దుస్సాధ్యమని....

ఎవరీ అబ్బాయి.... పేరుకూడా ఎప్పుడూ వినలేదే....కమ్ప్యూటరంత వేగంగా ఎలా ఆలోచించ గలుగుతున్నాడు....

"2073.... ఈ సంఖ్య నేను పుట్టిన రోజుని నెలనీ స్పష్టంచేస్తుంది. చెప్పగలరా ఆ రోజేమిటో నెలేదో"

ఇందులోని మెలిక భాస్వంతు గ్రహించి వుండడని పొరపాటుపడిన జానకీరాంకి తెలీదు. అది చాలా చిన్నతనంలోనే తండ్రి అతనికి నేర్పాడని.

"పదిహేడవతేదీ, ఎనిమిదోనెల" టక్కున జవాబిచ్చాడు—

"జవాబిచ్చాడు."

"ఎలా వివరించాలి" అసహనంతో అరచి దాన్ని ప్రశ్నగామార్చి మరో మంచి అవకాశాన్ని చేజార్చుకున్నాడు జానకిరాం.

"పుట్టిన రోజును రెట్టింపుచేసి దాన్ని పదిచేత గుణించి వచ్చినదానికి డెభై మూడు కలిపి అలా వచ్చిమొత్తాన్ని అయిదుచేత గుణిస్తే ఓ సంఖ్య వస్తుంది. దానికి నెల కలిపితే 2073 అయింది· మీ పుట్టినరోజు నెలా తెలుసుకోవాలి అంటే 2073లో నుంచి 365 తీసివేయాలి అప్పుడు 1708 వచ్చింది· అందులో మొదటి రెండు అంకెలూ పుట్టినతేదీని చివర రెండు అంకెలూ నెలనీ తెలియపరుస్తాయి"

ఆడిటోరియం మరోమారు చప్పట్లతో ప్రతిధ్వనించింది· అదే నిజానికి అదే జానకీరాం సహనాన్ని దారుణంగా దెబ్బతీస్తూంది.

"1940వ సంవత్సరంలో ఇరవైమూడు జనవరి ఏరోజు చెప్పగలవా" అడగలేదు అరిచాడు.

మేథమేటీషియన్స్ని ఒలింపియాడ్‌లో సామాన్యంగా అందరూ అడిగే ప్రశ్న అది.

భాస్వంతు కళ్లు మూసుకున్నాడు. ఇలాంటి లెక్కల్లో నాన్న నేర్పిన టేబుల్స్ని గుర్తుచేసుకుంటూ పదకొండు సెకెండ్ల వ్యవధి తీసుకుని "మంగళవారం" అన్నాడు. టక్కున "కరెక్టు" అన్నాడు ఆడిటోరియంలోని ఓ ప్రొఫెసర్ ఉద్వేగంగా·

జానకీరాం మొహం పాలిపోయింది.

క్షణక్షణానికి అతడిలోని బేలెన్స్ తరిగిపోవడానికి కారణం భాస్వంతులో అణుమాత్రమైనా చెక్కుచెదరని చిరునవ్వు.

"గణితంలోని Π (పై)ని ఇంగ్లండులోని కొందరు గణిత శాస్త్రకోవిదులు ఇంగ్లీషులోని ఓ వాక్యంతో రిప్రజెంట్ చేసేవారు ఎలా ఏమిటంటే.

"MAYIHAVE A LARGE CONTAINER OF COFFEE అనే వాక్యాన్ని "పై" విలువను 3.1415926 ఏడు దశాంశాల స్థానంవరకూ గుర్తుంచుకుని వాడేవారు. ఈ సంఖ్యలోని ఒక్కో అంకె ఆ వాక్యంలోని పదంలోని అక్షరాల సంఖ్యను ప్రతిఫలిస్తుంది"

జానకీరాం స్వేదంతో తడిసిపోయాడు.

ఒంటిలో హఠాత్తుగా చిత్రమైన నిస్త్రాణ ఏర్పడిపోయింది.

"ABCDEX 4 - EDCBA. "ప్రూవిట్"

క్షణంపాటు స్తబ్ధంగా వుండిపోయాడు భాస్వంత్.

ఈ పజిల్లోని ఒక్కో ఇంగ్లీషు అక్షరం ఒక్కో అంకెని రిప్రజెంట్ చేస్తే మొదటి అయిదంకెల సంఖ్యని నాలుగుచేత గుణిస్తే వచ్చే సంఖ్య జవాబులోని ఇంగ్లీషు అక్షరాలతో సరిగ్గా సంఖ్యాపరంగా సరిపోవాలి·

క్లిష్టమైన పజిల్"

బాల్యంనుంచే తండ్రి ఆధ్వర్యంలో భాస్వంత ఆడుకున్నదిఅంకెలతో అంకెలే అతడి ఆట వస్తువులు. అందుకే ఎక్కువ ఇబ్బందిపడలేదు.

అతడి మస్తిష్కంలో అదృశ్యంగా వున్న అంకెలు ఒక్కోటివచ్చి అక్షరాల స్థానంలో రూపు దిద్దుకున్నాయి.

A–2 B-1 C–9 D–7 E-8
ABCDEX 4 – E2CBA
21978 X 4 – 87912

అంతే జవాబు చెప్పాడు.

ఎక్కడివాడో ఏం చదువుకున్నాడో తెలీని ఓ అనామకుడి IQ ని తక్కువగా అంచనావేసిన జానకీరాం మెదడులోని నరాలు చిట్లిపోయే పరిస్థితి ఏర్పడితే అక్కడ ఆడిటోరియం మాత్రం చాలా అపదృశమైన ఆనందాన్ని అనుభవిస్తూంది.

మిన్ను ముట్టే హర్షధ్వానాలు.

"మిస్టర్ ఋషీ – చప్పట్లను చూసి మురిసిపోతున్నావేమో. నేను ఇప్పుడు అడగబోయే చివరి మూడు ప్రశ్నలు."

"క్షమించాలి....మీకిక మిగిలింది ఒకే ఒక్క అవకాశం." భాస్వంత్ సరిదిద్దాడు.

"నో" అరిచాడు జానకిరాం.

"ఆక్రందన చేసి లాభంలేదు మేథమేటిషియన్‌గారూ.

వరుసగా చెప్పమంటారా మీరెన్ని ప్రశ్నలు ఏమేం అడిగారో.... మొదటి తొమ్మిది ప్రత్యేకత ఏంటి అన్నారు. రెండోది లార్జెస్టు నెంబరు తొమ్మిది మూలంగా వివరించమన్నారు."

"అది మొదటి ప్రశ్నలోనిదే" సమర్థించుకోబోయాడు.

"లేదు. వివరణ కోరింది రెండో ప్రశ్న అవుతుంది"

"అవును" అన్న కేకలు వినిపించాయి ఆడిటోరియంలో నుంచి.

జానకీరాం ఆగిపోయాడు.

"మూడోది తొమ్మిదితో ప్రేలండ్రోం....నాలుగోది 2073 లో పుట్టినరోజునీ నెలనీ గుర్తించమన్నది....అయిదోది దానికోసం మీరడిగిన వివరణ...."

"లేదు....ఆ వివరణ అదే ప్రశ్నలోనిది."

"కాదు....కాదు" కేకలు ప్రేక్షకుల్లోనుంచి....

జానకీరాం అనుభవంలో ఇలాంటి సన్నివేశాన్ని ఎదుర్కోవడం తొలిసారి. చాలా తక్కువ వ్యవధిలో అక్కడవున్న వాళ్ళందర్నీ భాస్వంత ఆకట్టుకున్న విషయాన్ని గ్రహించేసాడు.

"ఓకే...." అస్థిమితంగా భాస్వంత్‌ని చూస్తూ "మిస్టర్ ఋషీ!" మిగిలింది నాకు ఒకే ఒక్క అవకాశమని ఒప్పుకుంటూ నా చివరి ప్రశ్నను అడుగుతున్నాను చూస్తాను ఇప్పుడు నీ ఐక్యూ ఏమిటో...."

బ్లాక్ బోర్డువేపు నడిచిన జానకిరాం చాక్‌పీస్‌తో 'IX' రాసి ఇది రోమన్ అంకెల్లో తొమ్మిదిని సూచిస్తుందికదూఅంటూ ప్రశ్నించబోయి "అదే తొమ్మిదో ప్రశ్నని భాస్వంత్ ఎక్కడ తేల్చిపారేస్తాడో అన్న భయంతో ఆ వాక్యాన్ని త్రుంచేయకుండా పొడిగించాడు"

"ఈ తొమ్మిదిని చెరపకుండా ఆరుగా మార్చాలి."

నిజానికిది గణితశాస్త్రంకాదు ఒక కసితో మంటతో భాస్వంత్‌పై అతడో తెలివైన పజిల్ నుపయోగించాడు.

"భాస్వంత అటువేపే సాలోచనగా చూస్తూ వుండిపోయాడు.

ఒకటి రెండు మూడు అప్పుడే పది సెకండ్లు గడిచిపోయాయి.

ఏమీ తోచడంలేదు.

ఆ అంకెల్ని చెరపకుండా ఆరుగా మార్చాలి.

ఎలా....

పన్నెండు సెకండ్లు అయిపోయాయి.

భాస్వంత కణతలనుంచి హఠాత్తుగా చెమట బిందువులు రాలుతున్నాయి.

మానసికమైన నిబ్బరంతో మరణించిన తన తండ్రే తనను ఆదేశించి నట్టు అంతవరకూ పూర్తిగా సాధించాడు."

ఇప్పుడు మరికొన్ని సెకెండ్ల లో పరాజయానికి సిద్ధపడుతున్నాడు.

సరిగ్గా అప్పుడు చూసాడు ఆడిటోరియంలో అడుగుపెడుతున్న ఓ వ్యక్తిని.

ఆమె....ఆమే....

ఒకనాడు విశాఖపట్టణం రైల్వే స్టేషనులో చూసిన లెక్కల లెక్చరర్....సమ్ ఎక్స్.

"సమ్ ఎక్స్" మననం చేసుకుంటుంటే ఎక్కడో ఏదో స్ఫురిస్తున్న భావం.

"సమ్ ఎక్స్" ఏదో అస్పష్టంగా మనసును తాకుతోంది.

మిగిలింది రెండు సెకండ్లు.

సమ్ ఎక్స్....సమ్ ఎక్స్....స....క్స్....సిక్స్....

అంతే. చాలా వేగంగా 'S' రాసేడు 'IX' కు ముందు.

అది SIX గా మారింది. చప్పట్లు....భూనభోమండలాల్ని ఏకంచేసే ప్రతిధ్వనులు.

జానకీరాం తలవాలిపోయింది.

ఆ యూనివర్శిటీ చరిత్రలో ఏనాడూ వూహించని ఒక అద్భుతమైన సంఘటన అది.

ఆగకుండా అలసిపోకుండా సాగుతున్న కరతాళధ్వనుల మధ్య ఒక దోషిలా ఓడిన చక్రవర్తిలా నిలబడ్డ జానకీరాంని చేరిన భాస్వంత "నేను గెలవలేదు?మీ అహం మిమ్మల్ని ఓడించింది" అనేసినెమ్మదిగాక్రిందికిదిగాడు.

పత్రికా విలేఖర్లు కెమెరాలతో అతడ్ని చుట్టుముట్టాడు. యూనివర్శిటీ ప్రొఫెసర్లు సైతం అతడితో మాట్లాడాలని ఉత్సుకత చూపించారు.

వారి మధ్య తనో ప్రత్యేకమైన వ్యక్తిగా గుర్తింపబడాలన్న ఉత్సుకత లేని భాస్వంత అందర్నీ తప్పించుకుని బయటకు వెళ్ళాడు.

"ఎవరీ ఋషి" ఒక అర్థంకాని రాజర్షిలా మిగిలిపోయాడు అందరి దృష్టిలో.

"హల్లో" కారిడార్ చివరలో పలకరించింది ఓ స్తంభం వారన నిలబడ్డ రశ్మి...."కాంగ్రాట్స్"

అనూహ్యమైన రిలీఫ్ ఫీలయాడు భాస్వంత ఆమెను ఒంటరిగా అక్కడ చూడగానే.

"మీరింత జీనియస్ అని ఆనాడు నేను వూహించలేదు."

"ఊహించివుంటే ఏంచేసేవారు."

"చెప్పేదా" పెదవుల్ని బిగించి తెరలుగా జారుతున్న మంద హాసాన్ని మృదువుగా నొక్కిపెట్టింది. "అప్పుడు స్టేషన్లో. మీరు మా స్టూడెంట్సుని అడిగిన లెక్కలో ఇద్దరు తండ్రులూ ఇద్దరు కొడుకులూ అన్నది అబద్ధమని తాత తండ్రికొడుకు అన్న వరుసని మీరలా వ్యక్తంచేసి మభ్యపెట్టారని కాబట్టే ఆరువందల్లో రెండు వందల్ని మైనస్చేసినా ఆరు వందలే ఎందుకు మిగిలాయో గుర్తించగలిగేదాన్ని."

"గుడ్ గుర్తించారన్న మాట."

"అఫ్కోర్స్! కాస్త ఆలస్యంగా" అనేసి "అతనూ అంత పాప్యులర్ మేథమేటీషియన్ని మట్టి కరిపించారుకదా....ఇప్పుడు మీకెలా వుంది"అంది.

"ఆ క్షణంలో మీరు లోపలికి అడుగుపెట్టకపోతే ఎలా వుండేదో గాని గెలిచానుకాబట్టి ఆ గెలుపుకి కారణమైన మిమ్మల్ని గట్టిగా అభినందించాలనుంది.

విస్తుపోతూ చూసింది "గెలుపుకి నేను కారణం కావడమేమిటి?"

"నిజం మిస్సెక్స్గారూ!"

మిస్....సెక్స్ అన్నట్టు వినిపించడంతో క్షణంలో ఆమె మొహం వివర్ణమైపోయింది.

"క్షమించండి — నా నుద్దేశ్యం మిస్ 'ఎక్స్' అని — మీరే అన్నారుగా మీ పేరు అదే అని" ఆమె కళ్ళల్లో నుంచి దృష్టి మళ్ళిస్తూ "మీకు ముక్కుమీద కోపమనుకుంటాను" అన్నాను కాస్త నీళ్ళుగారిపోతూ.

"ఏం? ఎందుకలా అనిపించింది?"

"ముక్కు సూదిగా వున్నవాళ్ళకి కాస్త కోపమెక్కు వుంటుందని మా బామ్మచెప్పేదిలెండి"

"మీ బామ్మగారి ప్రహసనం గురించి నాకేం చెప్పనక్కర్లేదులెండి...."

"అవునూ—అసలు విషయమే చెప్పటం మరిచిపోయానుకదూ...."

"అదే మీరు ఆడిటోరియంలో అడుగుపెట్టేసరికి నేను ఎలాంటి టెన్షన్‌లో వున్నానూ అంటే ఇహ మరో అరక్షణంలో చేతులెత్తేసేవాడ్ని. అప్పుడు ఆ 'సమ్ ఎక్స్' అన్న పదం గుర్తుకురావడంతో అది క్రమంగా సెక్స్ అనక సిక్స్‌గా నా వూహల్లో రూపుదిద్దుకుని నన్ను గెలిపించింది."

"చిత్రంగా వుంది."

"ఏది. సెక్స్‌కీ సిక్స్‌కీ సంబంధం వుండటమా" ఆమె మరోమారు సీరియస్‌గా మారుతున్నట్టనిపించడంతో.

"క్షమించాలి. ఫాక్ట్ చెప్పాను....నా గెలుపులో మీరే సగభాగం అని...."

ఆగిపోయాడు ఆ 'సగ భాగం' అన్న పదం అసంకల్పితంగా జారడంతో తొట్రుపడుతూ.

ఆమెకేసి సూటిగా చూడలేనట్టు అతడు తల తిప్పుకుంటుంటే మృదువుగా నవ్వు వినిపించింది.

"రక్షించారు" అన్నాడు.

ఎందుకో చాలా ఆహ్లాదంగా వుంది భాస్వంత్‌కి ఆమె సమక్షంలో నిలబడటమూ మాట్లాడటమూ....

"నా పేరు రశ్మి. ఇక 'ఎక్స్' అంటూ అడ్రస్ చేయకండి. సరేనా"

"సరే.... ఆ చేత్తోటే మీ అడ్రసు కూడా చెబితే...."

"చేత్తో ఏమిటో...."

"మరీ లిటరల్‌గా ఆలోచించకూడదు మేథమెటిక్స్ లెక్చరర్స్. పోనీ ఆ నోటితోనే అంటాను....సరేనా"

ఫకాలున నవ్వింది .అతడి హృదయాంతరాళంలోని ఏ తారో కదిలినట్టు....

చెప్పింది.

"బై" దూరంగా జనం వస్తుంటే శలవు తీసుకుని వెళ్ళిపోయింది.

కొన్ని క్షణాలవరకూ చూపుల్ని మరల్చుకోలేకపోయాడు.

సరిగ్గా అదే సమయంలో అతడి ముందో కారువచ్చి ఆగింది.

"వెల్‌కం మిస్టర్ భాస్వంత్"

కారు డోర్ తెరిచి అతడ్ని ఆహ్వానిస్తున్నట్టుగా నిలబడివున్నాడు.

అతడు ఉపాధ్యాయ....

మరో క్షణంలో అతడితోపాటు కారులో వెళ్తున్న బాస్వంత్ గమనించలేదు తనను ప్రభంజనరావు మనుషులు కొందరు కనిపెడుతున్నారన్న విషయం.

* * * *

"మమ్మీ ఇంకా చాలంటున్నానుకదా" బాబీ మారాం చేస్తున్నాడు అన్నం సరిపోయిందంటూ.

విశాంత బ్రతిమిలాడుతూంది "మంచి బాబీవి కదా మరి ఇంకా తినాలి."

"చాలంటుంటే."

"చాలదంటుంటే."

"నీకెలా తెలుసు" అమాయకంగా చూసేడు.

బాబీ బొజ్జనిండిందోలేదో మమ్మీకి తెలీదా" లాలనగా చెంపల్ని స్పృశిస్తూ అడిగేసరికి ఆ పసికందు కళ్ళల్లో చిత్రమైన మెరుపు "మరి నువ్వు తొందరగా పెద్దాడివికావాలీ నీ మీద కలియబడే పిల్లలందరికీ బుద్ధి చెప్పాలీ అంటే బలం కావాలిగా. మరి బలం రావాలీ అంటే బువ్వతినాలిగా."

"బువ్వతినేస్తే బలం వస్తుందా."

"ఓ....బోలెడంత."

"సురేష్ గాడికన్నా ఎక్కువొస్తుందా."

"ఆ."

తలపంకించాడు ఏదో స్ఫురిస్తున్నట్టుగా....

"అయితే పెట్టు" ప్రత్యర్థులకన్నా తను బలవంతుడ్ని కావాలని తీర్మానించుకున్నట్టు నోరు తెరిచాడు.

"గుడ్ బాయ్...." మరో ముద్దు నోటికందించింది.

చీటికి మాటికీ కడుపు చూసుకుంటూ హఠాత్తుగా ఏదో గుర్తుకొచ్చినట్టయి "మమ్మీ! నా బొజ్జకంటే నీ బొజ్జ కొంచెం పెద్దదికదా" అన్నాడు వేళ్ళతో నిశాంత పొట్టకొలుస్తూ.

"అవునూ"....

"మరీ...." బోలెడంత సిగ్గుపడిపోతూ నవ్వేసి అనుమానంగా ఆగిపోయాడు.

"అడుగమ్మా" ప్రోత్సహించింది.

"అదే మమ్మీ....నేను బాబీనికదా....ఇంత పొడవున్నానుకదా."

"మరి మమ్మీ బొజ్జ ఇంత చిన్నగా వుందికదా. మరి బాబీ ఈ పొట్టలో ఎలా పడతాడు?" చిత్రమైన ప్రశ్న వేసాడు. ఇంకా నిశాంతకు అర్థంకాలేదేమో అన్నట్టుగా చూస్తూ "అదే మమ్మీ బాబీలు పుట్టకముందు మమ్మీల బొజ్జల్లో దేవుడు పడుకోబెడతాడటంగా" అన్నాడు ఇప్పటికైనా బోధపడిందా అన్నట్టు చూస్తూ.

ఆమె నవ్వింది నీళ్ళు జివ్వున కళ్ళల్లో తిరిగేట్టు....

లేని అదృష్టాన్ని మాటల మూటలతో అందంగా అపాదిస్తూ అరక్షణపు అందమైన అనుభూతికన్నా కారణమౌతున్న బాబీని చూస్తూ అమాంతం అతడ్ని దగ్గరకు తీసుకుని ముద్దుల్తో ముంచెత్తింది.

తన చెమ్మగిల్లిన కళ్ళను బాబీ చూడకుండా జాగ్రత్త పడుతూ ఒక ఉన్మాదినిలా అతడ్ని గుండెలకు హత్తుకుని 'నా చిన్ని బాబీ' ఈ బాబీ పుట్టినపుడు యింతే పెద్దగా వుండదమ్మా....అమ్మ బొజ్జకు సరిపోయినంతే వుంటాడు" అంది అనుమాన నివృత్తి చేస్తూ....

"మమ్మీ" ఊపిరికందని పెనుగులాట బాబీ మనసులో. నిశాంత ప్రతి క్షణమూ తనని నిజం మమ్మీలా కావలించుకోవడం సర్దాగా వుంది

"నువ్వు డబ్బుల మమ్మీవా....అంటే డబ్బు తీసుకుని నన్ను పెంచే మమ్మీవా."

నిశాంత నిరుత్తరు రాలైంది.

"మరి....నేనూ డాడీని డబ్బులడిగి జీతమిస్తాను. ఇలాగే మమ్మీలా ఎప్పటికీ నన్ను ప్రేమగా చూస్తావా"

ఆమె కళ్ళు వర్షిస్తున్నాయి ఆకాశంనుంచి రసాతలానికి జారే శివగంగలా.

"నువ్వు రేపటి నుంచి స్కూలుకు రావాలి. మరేమో సురేష్‌గాడు, రాజిగాడు వీళ్ళందరి మమ్మీలు కారులో వాళ్ళని స్కూల్లో డ్రాప్ చేస్తారని గర్వం కదా. నువ్వు నాతో రావాలి. వాళ్ళందరు చూస్తుండగా వాళ్ళ మమ్మీల్లాగే నన్ను దగ్గరకు తీసుకుని ఒరే బాబీ....మధ్యాహ్నం బాగా బువ్వ తినాలి" బాబీ కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. వెక్కి పడుతూనే చెప్పుకుపోతున్నాడు. "బట్టలవ్వీ మాపుకోకూడదు. బాగా చదువుకోవాలి. ఎవ్వర్తోనూ కొట్లాడకుండా ఇంటికి రావాలి....మరేమో...." దుఃఖం బిగిసి పట్టినట్టు ఠక్కున ఆగేడు ఇక చెప్పలేనట్టు.

బాబీని చిన్ని కృష్ణున్ని గుండెల్లో దాచుకున్న ఒక గర్భగుడిలా గుండెలకు హత్తుకుంది.

"అమ్మకోసం అంగలార్చుకుపోతున్న చిన్నికొండా

అమ్మకంలో ఇక్కడ అడుగుపెట్టినా నీకు అమ్మనెందుకాలేదు.

నమ్ము నాన్నా.... నువ్వు కోరితే వేదదీర్చగల యశోదనౌతాను. నీ శోకాన్ని శ్లోకంగా మార్చుకుని ఏకావీరాయని నేతను కావ్యంగా మిగిలిపోతాను."

ఆమె నేత్రాల నుంచి జారుతున్న వేడి అశ్రువులు బాబీ తలపై ఆశీస్సులుగా రాలిపడుతున్నాయి.

* * * *

"బ్రేవో డియర్ భాస్వంత్....యూ ఆరే జీనియస్" ఉద్రేకపడుతూనే విస్కీని గొంతులోకి పోసుకున్నాడు ఉపాధ్యాయ.

హోటల్ బంజారాలోని ఓ గదిలో కూర్చున్న ఉపాధ్యాయ అప్పటికి తాగింది ఎన్నో పెగ్గో గుర్తుచేసుకునే స్థితిలో లేడు కాని నిర్విరామంగా తాగుతూనే వున్నాడు.

"అసలు నువ్వెందుకు తాగకూడదనుకుంటున్నావు."

"నేను కోరేటి ఇంతకంటే బలమైన మత్తు కాబట్టి."

"ఏంటది?"

"డబ్బు....డబ్బు సంపాదన."

"అది నేనిస్తాను...."

"అయాచితంగా వచ్చిన డబ్బు నేనిష్టపడను."

"ఏం...."

"కాంట్రాక్టు బ్రేకవుతుంది కాబట్టి."

"కాంట్రాక్టా?" వాలిపోతున్న కనురెప్పల్ని భారంగా పైకెత్తి "ఎవరితో" అడిగాడు.

"దేవుడితో."

నిషా దిగినట్టు తల విదిలించాడు ఉపాధ్యాయ "నువ్వు అసలు అర్థంకావటం లేదు."

"అయితే నా మీద మీరింత ఆసక్తిని ప్రదర్శించేవారుకాదేమో.

నవ్వేడు "దేర్ యూ ఆర్...." అభినందనగా భాస్వంత్ చేతులు నొక్కి "చాలా స్వల్పకాలంలో నీ గురించి తెలుసుకున్నాను భాస్వంత్....నిశాంత కొంతే చెప్పింది కాని నేను అంతకంటే కాస్త ఎక్కువ గ్రహించాను. అందుకే నీ స్నేహం కోసం నీలాంటి ఒక మేధావి సహకారం అర్థిస్తున్నాను" అభ్యర్థనగా చూసేడు.

"నేను ఒకచోట కట్టుబడలేను ఉపాధ్యాయగారూ. నా లక్ష్యం వేరు. నేను నడిచే తోవవేరు....కాబట్టే మీ దగ్గర సైతం యుక్తిగా డబ్బు సంపాదించటానికి నేను వెనుకాడలేదు."

"ఇదే....ఈ నిజాయితీయే భాస్వంత్ నీలో నేను ఇష్టపడేది....ఐ రియల్లీ లవ్యూ...." ఆగేడు క్షణంపాటు. "మిస్టర్ భాస్వంత్....నువ్వు డబ్బుకోసం తెలివి నుపయోగిస్తే నేను చావుకోసం డబ్బు నుపయోగించుకుంటున్నాను. జీవితంలో పొందాల్సిన దానికోసం నువ్వు తపించి పోతుంటే పోగొట్టుకున్న జీవితంకోసం నేను బ్రతుకుపై పగతీర్చుకుంటున్నాను"అతడు తొట్రుపడుతున్నాడు.

తాగడం కోసమే బ్రతుకుతున్నట్టు విపరీతంగా తాగుతున్నాడు.

చీకటి పడింది. "వెళదామా" అన్నాడు భాస్వంత్.

"నన్ను చూస్తే అసహ్యంగా వుందా" అడిగాడు ఉపాధ్యాయ.

నిర్లిప్తంగా నవ్వేడు "మిస్టర్ ఉపాధ్యాయా ఎక్కడో ఏ మూలనో మీరంటే అభిమానమే ఏర్పడివుండకపోతే ఇంత కాలాన్ని మీకోసం వినియోగించేవాడ్నికాదు....కమాన్."

మరో అరగంటకల్లా ఉపాధ్యాయకారులో అతడింటికి వచ్చారు.

తూలిపడుతున్న ఉపాధ్యాయకు ఆసరా ఇస్తూ పోర్టికోలో నుంచి ద్వారాన్ని సమీపిస్తుండగా చూసేడు గ్లాసుడోర్స్‌లోనుంచి.

నిశాంత బాబీని ఒడిలో కూచోబెట్టుకుని బుజ్జగిస్తూంది. ఏ విషయంలోనో.

ఉపాధ్యాయ నిలబడిపోయాడు ఒక అపురూపమైన దృశ్యాన్ని చూస్తున్నట్టు.

"చూసేవా భాస్వంత్" అతడి మొహం వివర్ణమైపోయింది క్షణంలో "ఎవరు పతిత అనుకోని స్థితిలో సర్వం కోల్పోయి తనదికాని బిడ్డకోసం అమ్మగా ఈ ఇంట అడుగుపెట్టి తల్లిలా లాలించే ఈ ఆడదా లేక మాతృత్వాన్ని తెగత్రెంచుకుని కేవలం సుఖంకోసం మరో మగాడ్ని ఆశ్రయించిన నా భార్యా....ఎవరు....ఎవరు పతితలు?"

షాక్....భాస్వంత్ కేదో కొత్త విషయం అవగతమైనట్టు చూసేడు ఉపాధ్యాయవేపు....

"నువ్వూహించలేవు భాస్వంత్. ఈ ఆరిస్టోక్రాట్ కుటుంబాల్లో

సెంటిమెంట్సన్నవి సుఖాల మరుగున ఎంత లాఘవంగా సమాధి అయిపోయేది. నా భార్య చనిపోలేదు....లేచిపోయింది"

భాస్వంత్ అడగలేదు వివరాల్ని.

"ఈ ప్రపంచంలో స్నేహమనే పదానికి అర్థంలేదు భాస్వంత్.

"జాగ్రత్తగా తరచిచూడు—ఎటుచూసినా నమ్మకద్రోహమే" ఉపాధ్యాయ ఆ మాటలు అంటుంటే హఠాత్తుగా తండ్రి గుర్తుకొచ్చాడు. స్నేహం పేరిట నమ్మకద్రోహానికి సిద్ధపడ్డ బంగార్రాజు జ్ఞప్తికొచ్చాడు."

"నీకు తెలుసా నా భార్య ఎవరితో లేచిపోయిందో?"

నిజానికి పెద్ద ఆసక్తిగా లేదు భాస్వంత్‌కి.

కాని చెప్పాడు ఉపాధ్యాయ.

"ఒకనాడు నాకు మంచి స్నేహితుడు ఇప్పుడు పెద్ద ఇండస్ట్రియలిస్టూ అయిన బంగార్రాజుతో."

అంతే—

పక్కలో భూమి చీలినట్టు అదురుపాటుగా చూసేడు భాస్వంత్.

13

అంతవరకూ స్నేహానికి సిద్ధపడని భాస్వంతు ఇప్పుడు నేను మీకు స్నేహితుడ్ని అన్నట్టు స్నేహపూర్వకంగా చేతుల్ని కలిపాడు.

అది ఒక ఓదార్పులా ఉపాధ్యాయకి అనిపించింది తప్ప భార్య విషయంలో తనతో మొరపెట్టుకుంటున్న సుగ్రీవుడికి రాముడిస్తున్న అభయంలా కనిపించలేదు.

"పదండి లోపలికి."

ద్వారం దగ్గరే వెనక్కి మరలాలనుకున్న భాస్వంతు ఇప్పుడు ఇంటిలో అడుగుపెట్టాడు.

* * *

"మమ్మీ" ఓ ఆర్తనాదంని నిశిరాత్రి వణికేలా—"నన్ను వదిలెళ్ళకు మమ్మీ" మరో ఆక్రందన.

ఉలికిపాటుగా పైకిలేచాడు భాస్వంతు.

వాల్‌క్లాక్ ఆపరాత్రి గడిచి రెండుగంటలు సూచిస్తూంది.

ఉపాధ్యాయ బలవంతంపై ఆ రోజు అక్కడే భోంచేసి పడుకున్నాడు.

సమీపంలో మరో బెడ్‌పై నిద్రపోతున్న ఉపాధ్యాయలో చలనం లేదు.

భాస్వంతు గది బయటకి నడిచాడు.

పక్కగదిలో నిశాంతను కావలించుకుని వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు బాబీ....

నిద్రలో కలవరపాటుతో అరిచిన బాబీని బుజ్జగిస్తూంది నిశాంత.

మరో అరక్షణం గడిచేక బాబీ మళ్ళీ నిద్రలోకి జారిపోయాడు.

సరిగ్గా అప్పుడు చూసింది నిశాంత కిటికీదగ్గర నిలబడ్డ భాస్వంత్‌ని.

అతడు వెనక్కి మరిలాడు. కాని అప్పటికే ఆమె బయటికివచ్చింది.

"నిద్రరాలేదా" అంది తనేముందు పలకరిస్తూ.

భాస్వంత్ జవాబివ్వలేదు.... ఎలా నిద్రపోగలడు తను,

సాధించాల్సింది అపాలమై అనుక్షణం మనసును దొలిచేస్తుంటే హాయిగా ఎలా విశ్రమించగలడు.

"కన్నతల్లికి దూరమైన బాబీ మానసికంగా దెబ్బతిని ప్రతిరాత్రీఇలా కలవరపాటుతో అరుస్తుంటాడు.

"దూరమైన జీవితంకోసం కలతచెందడంలో చిన్నా పెద్దాతేడాలేదు నిశాంతా."

హఠాత్తుగా ఏ స్మృతులో అతడిని కుదిపేస్తున్నట్టు కళ్ళల్లో ఎర్రని జీరలు,

"ఇక్కడే వుండి పోకూడదూ" కొన్నిగంటలక్రితం ఉపాధ్యాయ చేసిన ప్రపోజల్‌నే ఆమె రిపీట్ చేసింది.

"కఠిన శ్రమతో ఒక శ్రమబద్ధమైన జీవితాన్ని సాధించే తపనగా తుట్టలో తేనెను చేర్చాలని జీవిత కాలాన్ని వెచ్చించే ఒక తెనిటీగను నేను. బందీనెలాకాను."

"మీ లక్ష్యానికి మేమెవ్వరమూ అడ్డురాం"

"నా నిర్వికల్ప సమాధికి ఈ పరిసరాలు సహకరించవు"

అమె మరేదో చెప్పబోయింది. ఆ ప్రసక్తిని మళ్ళించాలనుకున్నాడు "ఇప్పటికి మీ జీవితం ఓ కొలిక్కి వచ్చింది కదూ"

"ఎలా అనగలుగుతున్నారా మాట" దుఃఖంతో ఆమె గొంతు వణికింది.

"ఉపాధ్యాయ దేవుడు కదూ"

"నేను నాశనమయ్యాక నా జీవితంలో తారసపడ్డవాళ్ళు చాలామంది దేవుళ్ళే."

"అలాంటప్పుడు ఇంకా ఎందుకు మీలో అశాంతి"

క్రమంగా ఆమె మొహం వివర్ణమైంది. క్రోధంతో ఆమె కళ్ళు ఎరుపెక్కాయి. "ప్రతిక్షణమూ నేనెందుకిలా అయిపోయానూ అన్నది గుర్తుకొస్తుంటే నా బ్రతుకిలా కావటానికి కారణమైన వ్యక్తులమీద పగ తీర్చుకోవాలని కోరుకోవడం దురాశవుతుందా"

"దురాశే నిశాంతా.... నువ్వో ఆడపిల్లవి...."

"కాని బ్రతుకుమీద ఆశలేని దాన్ని"

"అయితే మాత్రం రోటిలో తల దూర్చటం వివేకమనిపించుకుంటుందా నిశాంతా! నా పోరాటానికి చాలా అప్రయత్నంగా అవకాశాలు అనుకూలిస్తున్నాయి. నీ శత్రువైన ప్రభంజనరావుకి నా శత్రువు బంగార్రాజు శత్రువు.... నీకు నీడనిచ్చిన ఉపాధ్యాయకి నా శత్రువు శత్రువే.... ఇది చాలు నా మార్గాన్ని నేను సుగమం చేసుకోటానికి"

ఆమె చూస్తుంది నిశ్శబ్దంగా.

"అక్ష లోగిళ్ళలో కూర్చుని కూలాసాగా కోట్లను గడిస్తూ బ్రతుకుతున్న ఈ చిల్లరదేవుళ్ళను సాధించాలీ అంటే శత్రువులాకాక మిత్రుడిలా చొచ్చుకుపోవాలి.... వారి వ్యాపకాల్లో అనాసక్తిగా వున్నట్టు నటిస్తూనే వాళ్ళ ఆర్థికమైన బలాలపై చావుదెబ్బ తీసి సామాజికంగా నిర్వీర్యుల్ని చేయాలి. ఈ బ్రతికున్న దేవుళ్ళకు నైవేద్యం అందిస్తూనే గుండెల గర్భగుళ్ళను కూల్చి ఆ విగ్రహాలను నేలమట్టం చేయాలి."

"నాస్తికుల్లా ఎందుకాలోచిస్తారు"

"నేను పోరాడేది చిల్లర దేవుళ్ళతో నిశాంతా. ఆ పోరాటంలో భక్తుల్ని రక్షించే ప్రయత్నమేవున్న నాకు నేను నాస్తికుడ్నా ఆస్తికుడ్నా"

ఆమె జవాబు చెప్పలేకపోయింది.

"నేను మీకు అండగా వుంటాను."

"నేను రాముడ్ని కాదు ఒక సీతను అపహరించిన రావణుడితో పోరాడటానికి. కృష్ణుడిని అంతకన్నా కాదు. సత్యభామతో కలిసి సంగ్రామానికి సిద్ధపడటానికి. మనిషిని. స్వశక్తితో పక్కవాడి బలహీనతలపై అస్త్రాలను సారించి సాధించాలనుకుంటున్నవాడ్ని"

"అదికాదు...." ఆమె మరేదో చెప్పబోయింది.

"నిశాంతా! నీ అవసరం నిజంగా కావాలీ అనిపిస్తే ఎప్పుడైనా పరోక్షంగా వుపయోగించుకుంటాను. అంతవరకూ ఈ నాటకంలో నన్నొక్కడ్నే సూత్రధారిని కానియ్" ఆమె తల వంచుకుంది నిశ్శబ్దంగా.

ఆ క్షణంలో ఒక నిస్సహాయతతో కూడిన ఉద్రేకంతో ఆమె కళ్ళ నుంచి నీళ్ళు కారేయ్ విస్తారంగా.

"భయపడకు నిశాంతా! దేవుడు రాసిన ఒక నాటకంలో నిజంగా మనం పాత్రలమే అయితే నేను నా విలాసంకోసం స్వయంగా ఒక రంగస్థలాన్ని నిర్మిస్తున్నాను. అందులో నాకు తోచిన సన్నివేశాల్ని ప్రదర్శించి నా లక్ష్యానికి తగ్గట్టు పాత్రల్ని నడిపించాలనుకుంటున్నాను"

"కాని" ఆమె గొంతు వణికింది భయంగా.

"జీవితంలో ఎప్పటికీ ఓటమన్నది ఎరుగకపోవడమే నిజమైన

గెలుపు కాదు నిశాంతా! ఓడుతూ తిరిగి నిలబడాలని ప్రయత్నించడమే అసలు గెలుపు" నిర్లిప్తంగా నవ్వేడు. "ఆఫ్‌కోర్స్ ఈ నాటకంలో నేనెంత మంచి నటుడ్ని అయినా ఒక్కోమారు హఠాత్తుగా రంగంనుంచి నిష్క్రమించడం తప్పనిసరికావచ్చు, అదే డ్రామా. నిజం నిశాంతా! మనం తొలిసారి ట్రైనులో కలవటం దేవుడు రాసిన డ్రామా అయితే కొన్ని గంటల పాటు అయినా నీకు భర్తగా నటించడం నేను సృష్టించిన మరో డ్రామా"

భాస్వంత్ కదిలాడు.

వారిద్దరికీ తెలీదు ఉపాధ్యాయ వారి మాటలు వింటున్నాడని.

* * *

"వెల్‌కమ్ మిస్టర్ భాస్వంత్"

ప్రభంజనరావు గొంతులో చిత్రమైన వ్యంగ్యం ధ్వనించింది. అయినా పట్టనట్టు నవ్వు మొహంతోనే చూసాడు భాస్వంత్.

"మొత్తానికి జానకిరాంని మట్టికరిపించావు. ఆ విషయంలో మాత్రం నీ తెలివిని అభినందిస్తూ సమయానికి వచ్చావు కాబట్టి నేనేమిటో అన్నది నీకు తెలియపరచాలనుకుంటున్నాను. కమాన్."

తన కోసమే ఎదురు చూస్తున్నట్టు ప్రభంజనరావు ముందుకు నడుస్తుంటే మౌనంగా అనుసరించాడు భాస్వంత్.

విశాలమైన హాలులోనుండి వరుసగా రెండుగదులు దాటేక ఓ ఆడిటోరియంలా వున్న పెద్దగదిని చేరుకున్నారు.

తన కభిముఖంగా వున్న గ్లాస్‌డోర్స్‌లోనుంచి ఎదుటి దృశ్యాన్ని చూసిన భాస్వంత్ ముందు అది తెరపై ప్రదర్శింపబడుతున్న సన్నివేశమేమో అనుకున్నాడు.

కాని మరో రెండుక్షణాల్లో తెలిసిపోయింది.

తను చూస్తున్నది సినిమా కాదు....

మనిషన్నవాడు భరించలేని ఓ రాక్షసకాండ.

అక్కడ బేబీలైట్ల వెలుగులో వీడియో కెమేరాతో ఓ బ్లూ ఫిలిం చిత్రీకరిస్తున్నారు.

నగ్నంగా నేలపైపడిన ఓ పద్దెనిమిదేళ్ళ అమ్మాయి తనను తాను రక్షించుకునే ప్రయత్నంగా చేతులు జోడించి ఆర్తనాదాలు చేస్తూ అటూ ఇటూ దొర్లుతూంటే పూర్తిగా దిశమొలలతో నిలబడ్డ నలుగురు దృఢకాయలు ఆమెను బలంగా పట్టుకుని చెరిచే ప్రయత్నం చేస్తున్నారు.

భాస్వంత్ రక్తం లావాలా శరీరాన్ని మండిస్తూంది.

ఒక భయంకరమైన అటవిక వ్యవస్థను దర్శిస్తున్నాడతను.

ఏ ఇంటి ఆడబిడ్డో దురదృష్టవశాత్తూ ఈ ముష్కరుల చేతిలో పడితే లేడిపిల్లను నంజుకుతింటున్న వ్యాఘ్రాల్లా ఆమెను సర్వనాశనం చేస్తున్నారు.

ఆమె సహకరించడంలేదు. అంత నిస్త్రాణలోనూ బలాన్ని కూడ కూడగట్టుకుని ఎదురు తిరుగుతూంది.

వీడియో కేమేరా పట్టుకున్న వ్యక్తి ఆమె పెనుగులాటను అటూ ఇటూ కదుల్తూ చిత్రీకరిస్తున్నాడు.

ఈ తిరుగుబాటును ఇక తాళలేనట్టు ఓ వ్యక్తి ఆమె జుట్టు పట్టుకుని బలంగా ఆమె చెంపమీద కొట్టాడు.

ఆమె పెదవులు చిట్లి రక్తం చిమ్ముతుంటే నీరసంగా స్పృహతప్పిపోతూ ఒక శవంలా నేలమీదకి జారిపోయింది.

ఇదే అదనుగా మరోవ్యక్తి ఆమె కాళ్ళను బలంగా పట్టుకున్నాడు.

భాస్వంత్ పిడికిళ్ళు బిగిసుకున్నాయి.

ఏం చేయాలి? తన కళ్ళముందు ఓ నిర్భాగ్యురాలు ఓ చిల్లరదేవుడి లోగిలిలో పాశవికంగా పీలికలు చేయబడుతూంది. తమాయించుకున్నాడు చాలా బలంగా.

ఇక చూడలేనట్టు వెనక్కితిరిగాడు.

"మిస్టర్ భాస్వంత్.... ఈ మధ్య గల్ఫ్‌దేశాల్లో సహజంగా చిత్రీకరించిన బ్లూ ఫిలింస్‌కంటే ఇలా రాక్షసంగా రేప్‌చేస్తుండగా తీసిన కేసెట్స్‌కే మంచి గిరాకీ ఏర్పడింది దానితో...."

అప్పటికే భాస్వంత్ వివరణ అక్కరలేనట్టు చేతిని పైకెత్తాడు ఇక ఆపమన్నట్టుగా....

భాస్వంత్ జేవురించిన మొహం చూస్తూ, ఆత్మీయంగా అతని భుజం మీద చేయివేసి బయటికి నడిపిస్తూ—"ఈమాత్రం దానికే ఇంత కదిలిపోతున్నావు...." వికృతంగా నవ్వాడు-"ఇక నా అంతటి వాడివెలా కాగలవు? అసలు నీకు నేను చూపించింది చాలా స్వల్పం. ఒక్క శ్యాంపిల్ దోస్!"

"ప్రభంజనరావుగారూ...." భాస్వంత్ ఆయాసంతో రొప్పుతున్నాడు లోపలినుంచి సన్నని లేగదూడ మూలుగుల్లా వినిపిస్తుంటే— "మీ గొప్పతనాన్ని వ్యక్తం చేయడానికి నాకిలాంటి దృశ్యాల్ని చూపాల్సిన అవసరం లేదు....మీరేమిటో తెలిసాకనే మీ దగ్గరకు వచ్చింది."

"అవునూ!" గర్వంగా నవ్విన ప్రభంజనరావు "అది చూస్తూ ఎలా ఫీలయ్యావో చెప్పనేలేదు" అన్నాడు.

"ఒక్కమాటలో చెప్పాలంటే సీతను అపహరించుకు వెళ్ళినా, సంస్కారంగానే డీల్‌చేసిన రావణాసురుడెంత ఉన్నతుడో తెలిసింది. కాళ్లూ చేతులూ విరిచి, రాక్షసానందాన్ని ప్రదర్శించకుండా ఒక్కవేటుతో మేకతల నరికే కసాయివాడి ఔన్నత్యమూ బోధపడింది" ఉద్వేగాన్ని కనపడనీయకుండా తనూ నవ్వేసాడు భాస్వంత్....

"సో....మరి నువ్వు నా అండ కోరినట్టు నటిస్తూ, నా ప్రత్యర్థి ఉపాధ్యాయతో చేతులు కలపడం ఎంతవరకూ సమంజసంగా వుందంటావు" ప్రభంజనరావు ఇప్పుడు సూటిగా అసలు విషయానికి వచ్చాడు.

అప్పటికి అర్థమయింది భాస్వంత్‌కి. ప్రభంజనరావు దుగ్ధకి అసలు కారణమేమిటో.

ఈసారి పెదవులు బిగబట్టి నవ్వాడు భాస్వంత్. "అదే.... అదే ప్రభంజనరావుగారూ! మీకు నాకు ఉన్న తేడా...."

ప్రభంజనరావు నొసలు చిట్లించాడు.

"మీరు ప్రయోగంవరకే ఆలోచిస్తారు. నేను ఫలితాన్ని ప్రత్యక్షంగా పరీక్షించే ప్రయత్నం చేస్తాను" క్షణం ఆగేడు భాస్వంత్. "మీరూహించలేరు

మీ ప్రత్యర్థి ఉపాధ్యాయ నిశాంత మూలంగా ఎంతవేగంగా మృత్యుముఖానికి ప్రయాణిస్తున్నది."

ప్రభంజనరావు నిశ్చేష్టుడై చూస్తూ వుండిపోయాడు.

"సరే....మరి నా స్పిరిట్ లీడర్‌షిప్ ఎంతవరకూ వచ్చింది" అడిగాడు భాస్వంత్.

"అయిపోవచ్చింది.... కాని మరో రెండులక్షలు ఖర్చుచేయాలి" ప్రభంజనరావు మాత్రం నిజాయితీగానే అన్నాడు.

"అంతేకదా....త్వరలోనే ఏర్పాటుచేస్తాను" భాస్వంత్ వాక్యం ఇంకా పూర్తికాలేదు. రంగారావు వచ్చాడు అక్కడికి దూకుడుగా.

"అయ్యగారూ!"

ఏం జరిగిందన్నట్టు చూశాడు ప్రభంజనరావు.

"అంతా పూర్తయింది- కాని ఆ పిల్ల చచ్చిపోయింది."

భాస్వంత్ గుండెల్లోనుంచి ఓ బల్లెం దూసుకుపోయినట్టు స్థాణువయ్యాడు.

మనసు మూగగా చలించింది. ఒక మారణకాండ తన కళ్ళముందు సాగుతున్నా ఆపలేని తన నిస్సహాయతకి.

"సరే! అది రేప్ చేస్తుండగానే చచ్చినట్టు క్లోజప్‌లో స్పష్టంగా తీసారా....లేదా" చాలా మామూలుగా అడిగేడు ప్రభంజనరావు. మరో పది వేలు ఎక్కువ గిట్టుబాటవుతాయి. రేప్‌తోపాటు అది 'జరుగుతుండగా చచ్చినట్టు షాట్ తీస్తే?"

బుచ్చర్ రియల్ బుచ్చర్....కాని బాల్....

ప్రభంజనరావు క్రూరత్వానికి అక్కడ పరాకాష్ఠను చూస్తుంటే భాస్వంత్ కణతలపై స్వేదం పేరుకుపోతూంది.

* * *

ఉదయం తొమ్మిది గంటలవేళ....

పబ్లిక్‌స్కూలు ఆవరణలో కారు ఆగింది....

నిశాంతతోపాటు కారుదిగిన బాబీచుట్టూ చూసేడు ఉత్సాహంగా.

బాబీతోపాటు మరో యువతి కారులో రావడంతో క్లాస్ రూమ్స్‌కి వెళుతున్న కొందరు విద్యార్థులు ఆగేరు.

ఇంతవరకూ కారు డ్రయివరు మాత్రమే డ్రాప్ చేసేవాడు.... ఇప్పుడు మమ్మీలా నిశాంత వచ్చింది.

అదికాదు బాబీని ఆనందపరిచింది. వాళ్ళకిమాత్రమే మమ్మీలున్నంత గర్వంగాపోజుపెట్టే సురేష్ తాజీలాంటి కొందరు స్నేహితులు కారిడార్‌లో నిలబడి విభ్రమంగా చూస్తున్నారు.

స్కూల్ బెల్ మ్రోగుతుంటే గుర్తుందా అన్నట్టు చూసేడు బాబీ.

ఆమె నెమ్మదిగా తల పంకించింది.

బాబీ కారిడార్‌ను చేరుతూ సురేష్‌కేసి చూసేడు....

"బాబీ" పిలిచింది నిశాంత.

వెనక్కితిరిగేడు గర్వంగా....

"మధ్యాహ్నం పూర్తిగా భోంచేసేయాలి. బట్టలన్నీ మురికి చేసుకోవద్దు. ఎవ్వరితోనూ పోట్లాడొద్దు. బాగా చదువుకోవాలి" సాధ్యమైనంత గట్టిగా అందరికీ వినిపించేట్టు అంటుంటే బాబీ మనస్సు చెప్పలేని గర్వంతో ఉక్కిరిబిక్కిరయి పోయింది.

అలాగే అంటూ తలవూపి టాటాచెప్పి 'ఇప్పుడేమంటారు' అన్నట్టు చూసేడు సురేష్ తాజీలవేపు.

హఠాత్తుగా వాళ్ళంతా అసూయతో నలిగిపోతున్నట్టుగా అనిపించింది బాబీకి.

"బాబీ" మళ్ళీ కేక వినిపించింది.

'ఇదేంటి చెప్పమన్నవన్నీ చెప్పేసిందిగా....మమ్మీ మళ్ళీ ఎందుకు పిలుస్తుందబ్బా?' అనుకున్నాడు.

కారిడార్‌కు సమీపంగా నిలబడి ఉందామె.

నెమ్మదిగా చేతులు చాచింది దగ్గరకు రమ్మన్నట్టు.

ఇది బాబీ చెప్పని విషయం!

అర్థం కానట్టుగా ఆమెను చేరుకున్నాడు.... కాదు ఒడిలో వాలిపోయాడు.

ఆమె ఉద్వేగంతో బాబీని పొదివి పట్టుకుని, చెంపల్ని ముద్దెట్టుకుంటూంది.

ఒకటి రెండు కాదు....వరుసగా బోలెడన్ని ముద్దులు.

ఇదో కోరని వరంలా అనిపించిన బాబీ చేతుల్తో ఆమె మెడను చుట్టేసాడు.

ఒకటి....రెండు... మూడు నిమిషాలు గడిచాయి.

అతడు పట్టు సడలించడంలేదు.

"టైమవుతుందమ్మా" అంటూ బలంగా చేతుల్ని విడిపించుకుంది.

అంతే.... నిశ్చేష్టురాలయింది.

బాబీ కళ్ళనుంచి నీళ్ళు రాలుతున్నాయి నిశ్శబ్దంగా.... ఎన్నాళ్ళ తపస్సో ఫలించినట్టు ఎన్నిజన్మల తర్వాతనో అమ్మ అతడికి కలిసినట్టు అప్రయత్నంగా ఉబికి వస్తున్న నీళ్ళను ఆపకుండా అలాగే చూస్తూ వుండిపోయాడు.

ఏగుండె అట్టడుగు పొర కదిలిందో ఏ మాతృత్వపు మమకారం ఆమె ప్రేవుల్ని మెలిపెట్టిందో నిగ్రహించుకోలేనట్టు మరో మారు అతడ్ని చుట్టింది "బాబీ....నా వరాల కొండా" అంటూ.

"మమ్మీ" వెక్కిపడుతున్నాడు. నువ్వు డబ్బుల మమ్మీవా....నాకు నిజం మమ్మీవి కాదుకదా" ఈ అపురూపమైన క్షణాలు నాకు శాశ్వతం చేయవా అన్నంత తమకంతో బాబీ గొంతు మూలుగుతూంది.

"నేను నీకు డబ్బుల మమ్మీనీ కాదమ్మా....నిజం మమ్మీనే. నువ్వే నాకు బంగారుకొండవైతే నువ్విచ్చే డబ్బుతో ఇక నాకేం పని" బాబీ నుదుటిపై ముద్దు పెట్టుకుని చెరిగిన అతడి తలను సర్ది కళ్ళు తుడిచి "వెళ్ళరా నాన్నా" అంటూ క్లాస్‌రూం వేపు పంపేసింది.

బాబీ వెళ్ళిన కొన్ని క్షణాలవరకూ ఆమె తేరుకోలేకపోయింది.

వికలమైన మనసుతో కారు నడుపుతున్న నిశాంత బేగంపేట సమీపంలో రోడ్డు వారగా నడుస్తున్న భాస్వంత్‌ను చూసి అతడ్ని పిలవాలని ఆరాపింది.

కాని అప్పటికే భాస్వంత్ ఓ కాలేజి ఆవరణలో అడుగుపెట్టడంతో అసలతడు అక్కడికెందుకెళ్ళాడో అర్థంకాక క్షణం అలాగే చూసి మ కారును ముందుకు పోనిచ్చింది.

◆ ◆ ◆

"రశ్మి—డౌన్ డౌన్—ప్రిన్సిపాల్ డౌన్ డౌన్"

కాలేజి ప్రాంగణంలో నిలబడివున్న విద్యార్థుల కేకలతో హోరెత్తి పోతూంది.

వాతావరణం ఏ విషయంలోనో చాలావేడిగా వుందని గ్రహించి భాస్వంత్ విద్యార్థులు చేస్తున్న నినాదాల్లో రశ్మిపేరు దొర్లడంతో సాలో నగా ఆగేడు.

ఒక్కక్షణం తటపటాయించేడు. ఆ వలయంలో పొరపాటున ఏ క్రొత్తవ్యక్తి అడుగుపెట్టినా ఎలాంటి అవమానాన్ని భరించాల్సి వచ్చే అతడి వూహకందనిది కాదు.

అయినా భాస్వంత్ నిజానికి చాలా నిర్వేదంతో కూడిన మూడ్‌లో వున్నాడు.

అప్పటికే కొన్ని క్షణాల క్రితం టేంక్‌బండ్‌లో ఆత్మహ చేసుకుని చచ్చిపోయిందని ఓ అమ్మాయి శవాన్ని పోలీసులు తీస్తే నే సదన్‌లకు ప్రజల మనిషిగా చలామణి అవుతున్న ప్రభంజనరావు "నేనుండ మీకి ఆత్మహత్యలెందుకన్నట్టు" పక్కనే నిలబడి తీయించుకున్న ఫోటో ఓ దినపత్రికలో చూసేడు.

నిజానికి ఆ అమ్మాయి అతడి అఘాయిత్యానికే బలైన ఆడపిల్ల...

ప్రపంచానికి తెలీని ఓ హత్యను ఆత్మహత్యగా నిర్ధారించి త ప్రాపకాన్నింకా పెంచుకునే ప్రయత్నం చేస్తూన్న చిల్లరదేవుడి గురించి ఆలోచిస్తూనే రశ్మిని చూడాలని వచ్చాడక్కడికి.

"హల్లో మిస్టర్ జీనియస్" ఎగతాళిగా వినిపించిందో కంఠం.

తలతిప్పి చూసిన భాస్వంత్‌కు ఆ రోజు వాల్తేరు రైల్వే ప్లాట్‌ఫాం తనను ఛాలెంజ్ చేసిన విద్యార్థి రాజ కనిపించాడు.

మరుక్షణం కేకలు....కేరింతలు.

హల్లో అంటూ బదులు చెప్పిన భాస్వంత్ ఆ క్షణాన అక్కడ ఎక్కువసేపు నిలబడటం మంచిది కాదనిపించడంతో—

కారిడార్‌లో భయంగా నిలబడ్డ విద్యార్థినులను దాటుకుంటూ ప్రిన్సిపాల్ రూంలోకి నడిచాడు.

తలపట్టుకూర్చున్న ప్రిన్సిపాల్ భాస్వంతు రశ్మి గురించి అడగ్గానే ఎవరితడు అన్న ఆసక్తిని సైతం ప్రదర్శించకుండా చేయిచూపించాడు ఓ గదివేపు.

"మిస్ రశ్మి"

నెమ్మదిగా వెనక్కి తిరిగింది కిటికీలో నుంచి బయటకు చూస్తూ నిలబడ్డ రశ్మి.

చాలా అరుదైన ఆకర్షణగల ఆమె మొహం నివర్ణమైవుంది.

"ఏంటిదంతా"

"దురదృష్టం భాస్వంత్‌గారూ! ఒక ఆడపిల్లని పందెం పేరిట ఓ అబ్బాయి ముద్దు పెట్టుకుని అవమానించినా శిక్షించలేని కుహనా రాజకీయాల మధ్య లెక్చరర్‌గా బ్రతకడం" ఆమె గొంతు వణికింది. "ఆ తప్పుచేసిన వాడు పలుకుబడిగలవాడి కొడుకట. కాబట్టే ప్రిన్సిపాల్‌తో పాటు స్టాఫ్‌సైతం కొరివితో తలగోక్కోవద్దని నాకే నచ్చచెబుతున్నారు."

"ఎవరా అబ్బాయి"

"రాజ" చెప్పింది భావరహితంగా చూస్తూ "ప్రభంజనరావనే ఓ ప్రముఖ వ్యక్తి కొడుకు."

ఒక్కసారిగా గుండెల్లోకి ఫౌంటెన్‌లా ఉబికిన రక్తం సర్దుకోగానే "ఐసీ" అన్నాడు భాస్వంతు.

తండ్రి గుణాల్ని పుణికి పుచ్చుకున్న కొడుకన్నమాట.

"చెప్పండి ఒక లెక్చరర్‌గా విద్యార్థుల్లో క్రమశిక్షణ గురించి ఆలోచించడం నా తప్పా! అన్ని కాలేజీలు ఇలానే వుంటాయా!

ఆమె జీర్ణించుకోలేక పోతుంది. నిశ్శబ్దంగా వుండిపోయాడు చాలా సేపటి వరకూ.

"మిస్ రశ్మి" మృదువుగా మందహాసం చేస్తూ చూసాడు. "ఒకనా కట్టెలు కొట్టుకుని బ్రతికిన లింకన్ ఆ తర్వాత అమెరికా ప్రెసిడెంట్ అయ్యాడు కాబట్టి ప్రెసిడెంటు కావడానికి కట్టెలు కొట్టడం ఓ అర్హతగా భావించగలమా. ఎక్కడో ఎప్పుడో జరిగే న్యాయం అన్నివేళలా జరి తీరాలని రూలేమన్నా వుందా"

"మీరు మాటాడేది అనుకోని సంఘటనల గురించి నేను చెబుతున్న న్యాయబద్ధంగా జరగాల్సిన వాటి గురించి"

"బరువునుబట్టి పరిణామాన్ని బట్టి రెక్కల సైజునుబట్టిగాని తే టీగకు ఎగిరేశక్తి వుండకూడదంటుంది. ఎయిరో డైనమిక్స్ థియరీ. కా ఈ సాంకేతిక పరిజ్ఞానం ఆ తేనెటీగకు తెలీదు కాబట్టే ఎంచక్కా ఎగిరేస్తూ తేనెను సంపాదించుకుంటుంది. ఇది తర్కంకాదు రశ్మి! చిత్రమైన శక్తు బలంలో నడుస్తున్న ఈ వ్యవస్థలో బ్రతకాలీ అంటే దానికనుకూలంగా మారి మనకనుకూలంగా మలచుకోవాలని నేను తెలుసుకున్న సత్యం."

అతడి తర్కం తనకు నిజానికి రుచించకపోయినా ఏ మూలనో బ్రతకడానికేం చేయాలో అన్న సత్యం మాత్రం బాధాకరంగానైన ధ్వనిస్తుంటే ఊరటగా ఫీలైంది.

"చెప్పండి ఇప్పుడు మీరు బయటకు వెళ్ళాలనుకుంటున్నారా."

"అమ్మను హాస్పిటల్‌కు తీసుకువెళ్ళాలి. నిజానికి నేను హాఫ్ డే శలవు పెట్టాను" అందామె తలవంచుకుని.

"రండి నాతో"

"మీకు తెలీదు వాళ్ళ గురించి."

"అయితే నా గురించి మీరు చాలా తెలుసుకోవాలి"

"ఎందుకో నాకు భయంగా ఉంది"

"ప్రభంజనరావుకి భయపడి పోలీసులకు సైతం ఫోన్ చేయడానికి సాహసించలేని మిమ్మల్ని చూస్తుంటే ఆ విషయం నాకు ఇందాకే అర్థమై పోయింది. 'రండి' ఆమె జవాబు నాశించకుండా బయటికి నడిచాడు.

రశ్మి వూహ తప్పుకాలేదు.

కారిడార్ దగ్గరే భాస్వంతును అటకాయించాడు రాజా. "ఆగు"

"అర్జెంటుగా వెళ్ళాలి" భాస్వంత్ నెమ్మదిగా అన్నాడు.

"ఇంతమందిని దాటుకుని ఎలా వెళ్ళగలవు" రశ్మిని ఎలా తీసుకెళ్ళ గలవు అన్న ధ్వని వుంది రాజ అడిగిన తీరులో.

"నువ్వు తెలివైన వాడివి రాజా! ఆ ప్రశ్నకు జవాబు నన్ను అడగడం నిన్ను నీవు కించపరుచుకోవడమే అవుతుంది" సుతిమెత్తగా ఓ అస్త్రాన్ని వదిలాడు.

విద్యార్థులంతా రాజాకి సపోర్టుగా నిలబడివున్నారు ఎలాంటి పరిణామానికైనా మేం సిద్ధమేనన్నట్టు.

రాజా ఆలోచిస్తున్నాడు. ఒక్క అరక్షణం ముందు భాస్వంత్ వదిలిన సమ్మోహనాస్త్రం ఎంతబలంగా పనిచేస్తూందీ అంటే ఒకనాడు తనను తెలివిగా వంచించిన భాస్వంతును ఇంతమంది సమక్షంలో అవమానించా లనుంది.

"కేవలం ఫిజికల్‌గా అయితే నిన్ను ఈ క్షణంలో ఏమన్నా చేయ గలను మిస్టర్....కాని నా వుద్దేశం అదికాదు" ఈ మధ్యనే నేర్చుకున్న ఓ సూపర్ ఇంటిల్లిజెంట్ పజిల్ రాజా బుర్రలో తిరుగుతూంది. నిజానికి అది గణితశాస్త్రానికి సంబంధించింది కాదు. అసాధారణమైన మేధస్సుకు తప్ప తోచనిది.

"నేనో ప్రశ్న అడుగుతాను. ఆ పజిల్‌ను నువ్వు విప్పగలగాలి.... ఫెయిలయ్యావో నువ్వు అండగా నిలిచిన మేడమ్ చీరవిప్పి మాముందు నడిపించాలి. మొండికేసి వెళ్ళాలని ప్రయత్నిస్తే ఆ పని మేమెలాగు చేస్తా మనుకో."

భాస్వంత్ అనాలోచితంగా రెండడుగులు ముందుకేసాడు రాజాని నిలువునా పాతేయాలన్నంత ఉద్వేగంతో మళ్ళీ తమాయించుకున్నాడు.

రశ్మి వెనక్కి మరలబోతుంటే "ఆగు రశ్మి" భాస్వంత్ ఇంచుమించు ఆదేశించాడు.

ఒక విద్యాలయంలో ఎంత పరపతిగల వాడైనా చదువు చెప్పే ఓ ఉపాధ్యాయినిపై ఇలాంటి నీచమైన కోరికను ప్రదర్శించడం హేయంగా ఉన్నా సంగ్రామానికి తను సిద్ధం కావాలనుకున్నాడు....గెలిస్తే సరి....ఓడితే....తను ఇంకా ప్రాణాలతోనే వున్నాడు కాబట్టి వాటిని పెట్టుబడిగా వుపయోగించవచ్చు.

భయంకరమైన నిశ్శబ్దం చోటు చేసుకుంది.

"సరే" అడగమన్నట్టు చూసాడు భాస్వంత్. రశ్మి అరక్షణంపాటు ఉలికిపడింది.

రాజా ఇద్దరు విద్యార్థులతో రహస్యంగా ఏవో మాటాడి వారిని అక్కడ ద్వారాలు మూసివున్న రెండు క్లాస్‌రూమ్స్ దగ్గర నిలబడమన్నాడు.

వారు వెళ్ళి నిలబడ్డాక భాస్వంతును చేరి "మిస్టర్ ద్వారాలు మూసివున్న ఆ రెండు గదుల్లోని ఒక గదిలో ఇందాక నేను ముద్దుపెట్టుకున్న అమ్మాయి వుంది. అది మాకు తెలుసు....నీకు తెలీదు కాబట్టి తెలివిగా కనుక్కోవాలి. అయితే అక్కడ నిలబడివున్న విద్యార్థుల్లో ఒకడి పేరు 'ఎక్స్' మరోడి పేరు 'వై' అందులో ఒకడు ఎప్పుడూ నిజమే చెబుతాడు. మరోడు ఎప్పుడూ అబద్ధమే మాటాడతాడు. ఒకే ఒక ప్రశ్నతో అమ్మాయి ఏ గదిలో వుందో నువ్వు తెలుసుకోవాలి. ఫేయిలయ్యావా రశ్మిగారి చీర విప్పి...."

అసహనంగా చేయిపైకెత్తాడు భాస్వంతు ఇక ఆపమన్నట్టు.

"అయిదు నిముషాల గడువిస్తున్నాను" మరో హెచ్చరిక రాజా కంఠంలో. "ఒక్క ప్రశ్నతో 'ఎక్స్' 'వై'ల నుంచి నిజం తెలుసుకోవాలి."

అందులో నిజం చెప్పేదెవరూ అబద్ధం చెప్పేదెవరో భాస్వంతుకు తెలీదు.

తను తొందరపడి నోరు జారేనా?

రెండు నిముషాలు గడిచేక తోచని జవాబు కోసం ఆలోచిస్తూ అనుకున్నాడు.

భావరహితంగా నిలబడి వుంది.

ఈ మాత్రం పరిచయంతో నామీద ఇలాంటి పందెం ఒడ్డటానికి నీకున్న అధికారం ఏమిటని ప్రశ్నించడమూ లేదు....జరగబోయే పరిణామానికి భీతిల్లడమూ లేదు....

వధ్యశిలవేపు నడిచే ఓ లేగదూడలా వుంది.

భాస్వంత్ వెన్నులో సన్నగా చలి మొదలైంది.

అప్పటికే మూడో నిముషం గడిచిపోయింది.

రాజా తన మిత్రబృందంకేసి చూసాడు. ఒకవేళ భాస్వంతు మాట తప్పితే ఏం చేయాలో సంకేతాల ద్వారా తెలియపరుస్తూనే—

నాలుగో నిముషం గడిచింది.

అందరిలోనూ ఉత్కంఠత అధికమౌతోంది.

ఎలాంటి రక్తపాతానికైనా సిద్ధపడగల రాజా మిత్రులవేపు చూస్తున్నాడు గర్వంగా.

14

మరో అరనిముషం గడిచింది.

టెన్షన్‌తో నిలబడ్డ భాస్వంత్ మెదడులో ఒక చిన్న మెరుపు....

ఆ క్షణాన ఏ జవాబూ తోచివుండకపోతే ఒక జీవితకాలంపాటు రశ్మిముందు దోషిగా నిలబడడమో దానికి సిద్ధపడనినాడు ఆమెను రక్షించే ప్రయత్నంలో బహుశా ప్రాణాలు పోగొట్టుకోవడమో జరిగేదేమో.

మూసివున్న ద్వారాలకు మధ్యగా నిలబడ్డ ఎక్స్ వై అనే ఇద్దరు విద్యార్థుల్ని చేరుకున్నాడు "నేను ఒక గంట క్రితం వచ్చి ఆ అమ్మాయి కుడిపక్క గదిలో వుందికదా అని అడిగివుంటే మీరు అవుననేవారా"

ఒక ప్రశ్నను విడివిడిగాకాక ఒకేసారి ఇద్దర్నీ అడిగేసరికి టక్కున ఇద్దరూ అడ్డంగా తలూపేరు.

"సో మిస్టర్ రాజూ? అమ్మాయి ఎడంవేపు గదిలో వుంది" అన్నాడు భాస్వంత్ వెనువెంటనే.

సరిగ్గా అప్పటికి అయిదు నిముషాలు గడిచింది. రాజు తల వాలిపోయింది ఓటమిని అంగీకరిస్తున్నట్టుగా.

రశ్మి నుదుటపట్టిన చెమటని తుడుచుకుంది తేరుకుంటూ.

ఇక్కడ భాస్వంత్ ఉపయోగించింది ఒక అసాధారణమైన తర్కం. అంతే....

అమ్మాయి ఏ గదిలో వుందీ అనే అతడు అడిగివుంటే నిజం చెప్పేవారు ఎడంవేపు అని చెబితే అబద్ధం చెప్పేవాడు కుడిపక్క గదిలో అని అబద్ధం చెప్పేవారు.

అయితే అందులో ఎవరు నిజం చెబుతున్నారు ఎవరు అబద్ధం చెబుతున్నారు అన్నది భాస్వంతుకి తెలీని విషయం.

అందుకే ప్రశ్నని భూతకాలానికి అన్వయించి యుక్తిగా 'అవుననేవారా' అంటూ తన జవాబుతో వార్ని కన్‌ఫ్యూజ్ చేసాడు.

సత్యం పలికేవాడు ఇద్దరిలో ఎవడన్నాకాని ఎప్పుడడిగినా అది నిజం కానప్పుడు అడ్డంగా తలూపుతాడు. ఇది తిరుగులేని సత్యం.

ఇక అబద్ధం మాత్రమే చెప్పేవాడు గంటక్రితం అడిగితే అవుననేవాడివా అనగానే అప్పుడు కాదన్నా ఇప్పుడు ప్రశ్నకి అబద్ధమే బదులివ్వాలి కాబట్టి అడ్డంగా తలుపుతూ పరోక్షంగా నిజం చెప్పాడు.

అదే....ఆ చిన్న లాజిక్‌తోనే ఒక ప్రశ్నతో ఇద్దరి దగ్గర్నుంచి యుక్తిగా జవాబు రాబట్టేడు.

"థేంక్యూ మిస్టర్ రాజు" భాస్వంత్ అన్నాడు మృదువుగా.

రశ్మితోపాటు బయటికి నడుస్తుంటే విద్యార్థులంతా బిత్తరపోయి చూస్తున్నారు.

కాలేజీ ఆవరణ దాటుతుండగా మొహమంతా వాడిపోయి వున్న రశ్మిని చూస్తూ అన్నాడు. "క్షమించండి రశ్మీ! నేను పందెం ఒడ్డినా ఒడ్డకపోయినా మీమీద ఎలాగూ అలాంటి అఘాయిత్యానికి సిద్ధపడేట్టు వున్నారన్న ఆలోచనతో మీ అనుమతి లేకుండా రిస్క్ తీసుకున్నాను."

"ఒకవేళ మీరు ఓడిపోయి వుంటే" తలవంచుకునే అంది.

"జీవితంలో తొలిసారి ఓటమిని అంగీకరిస్తూ ఓడిన నేను ఇక బ్రతకటం వృధా అనుకుని మిమ్మల్ని రక్షించుకోవటానికి బహుశా ప్రాణాలు పోగొట్టుకోటానికైనా సిద్ధపడేవాడ్ని."

ఆ జవాబుతో అసంకల్పితంగా ఆమె నేత్రాలు చెమ్మగిల్లడం భాస్వంతుకు తెలీదు.

"ఏదో సర్దాగా మిమ్మల్ని కలవాలని వచ్చి పెద్ద నాన్సెన్స్‌కి కారణమయ్యాను....ఫర్ సేవ్‌మీ" రిక్షాను పిలిచి ఆమెను పంపేశాడు.

ఒక 'ఎక్స్‌లా పరిచయమై' 'ఇన్‌ఫెనిటి'లా ఆమె మనసులో అతడు స్థానాన్ని కైవసం చేసుకుంటున్న అతడి గురించి ఆలోచిస్తూ "నేనెందుకిలా ఓడిపోతున్నాను" అనుకుందామె బాధగా.

భాస్వంత్ వెనక్కి మరలాడు.

"అంకుల్" శిరీష నిలబడి వుంది. అప్పుడు తెలిసింది ఆమె కూడా అదే కాలేజీ విద్యార్థిని అని.

చిత్రమేమిటంటే కాలేజీలో హోరు చల్లబడి ఎవరిళ్ళకు వారు వెళ్ళిపోతున్నారు.

"బావ మరో మూడు నెలల్లో ఫారెన్నుంచి వస్తున్నాడు"

ఆర్థమైంది భాస్వంత్‌కి....

నిజానికి ఒకనాడు హోటల్లో తను చెల్లించాల్సిన బిల్లుకోసంయుక్తిగా ఒక ఆడపిల్ల అమాయకత్వాన్ని కేష్ చేసుకున్నా ఇప్పుడామె బంగార్రాజు కూతురు.... తన ప్రత్యర్థిని పరోక్షంగా దెబ్బతీయటానికి తనుపయోగించదగ్గ అస్త్రం,....

ఇక్కడ ఈ క్షణాన భాస్వంత్ ఆలోచిస్తున్నది బంగార్రాజు లోగిలిలోకి తను చొచ్చుకుపోదగ్గ అవకాశంకోసం మాత్రమే కాదు, తననంత అమాయకంగా నమ్ముతున్న అమ్మాయికి ఎలా సహకరించాలా అన్న విషయంకూడా....

సాలోచనగాచూస్తూ ఆమెతో నడిచి ఓ హోటల్‌లోకి దారితీసాడు.

ఫేమిలీ రూంలో కూర్చున్నాక అడిగాడు "చూడమ్మా.... సునీల్‌ని నువ్వు గాఢంగానే ప్రేమిస్తున్నావుకదూ"

"ప్రామిస్ అంకుల్" అంది. నవ్వొచ్చింది శిరీష బదులిచ్చినపద్ధతికి.

మరి క్షణం అగి "మీ డాడీకి నువ్వంటే చాలా ఇష్టమా" అన్నాడు.

తలూపింది అవుననన్నట్టుగా.

"మీ మమ్మీ నీకు సహాయం చేయదా" ఏష్‌ట్రేని చేత్తో తిప్పుతూ అడిగిన భాస్వంత్ ఆమెవేపునుంచి జవాబు రాకపోయేసరికి తల పైకెత్తాడు.

శిరీష లేత చెక్కిళ్ళపైనుండి నీళ్ళు జారుతున్నాయి.

"మమ్మీ ఎప్పుడో చచ్చిపోయింది. ఇప్పుడు ఆ స్థానంలో రుక్మిణీ దేవి వచ్చింది కాని నా గురించి అసలు పట్టించుకోదు."

"రుక్కిణీదేవి అంటే ఉపాధ్యాయ భార్య కదూ"

మీకు తెలుసా అంకుల్ అన్నట్టు క్షణంచూసి తలూపింది.

"మరి మీ అక్కయ్య రజనీ నీకు సహకరించదా"

"రజని కూడా నాకు సొంత అక్కకాదు. రజని వాళ్ళమ్మ వేరు. మా అమ్మవేరు...." వివరంగా చెప్పింది.

అర్థమైంది భాస్వంత్‌కి.... రుక్మిణీదేవి బంగార్రాజుకి మూడోభార్య.

చాలా సేపటి నిశ్శబ్దం తర్వాత అన్నాడు "సరే.... సునీల్‌తో నీ పెళ్ళి జరిగేటట్టు చేస్తాను. దాని ముందుగా మీరిద్దరూ నాతో సహకరించి కొన్ని ఫోటోలు తీసుకోవాలి. తర్వాత నువ్వు నాతో గెస్టుహౌస్‌కి వచ్చి రెండ్రోజులుండాలి."

భాస్వంత్ ప్రస్తుతం ఉపాధ్యాయ గెస్టుహౌస్‌లో వుంటున్నాడు.

"అంటే నేను నిన్ను రెండ్రోజులపాటు కిడ్నాప్ చేస్తున్నానన్న మాట."

శిరీష ఉలిక్కిపడింది.

* * *

బంగార్రాజు చాలా అసహనంగా అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు తన ఇంటిలో. రుక్మిణీదేవి కూడా తనకు పెద్దగా ఆసక్తిలేకపోయినా బాధను వ్యక్తం చేస్తున్నట్టు అభినయిస్తుంది.

"ఏమైంది.... కాలేజి వదిలి పెట్టి అప్పుడే మూడుగంటలైంది. అప్పుడే చీకటి పడుతూంది. శిరీష ఎక్కడికెళ్ళివుంటుంది. అప్పటికే తను రెండుసార్లు కాలేజీకి ఫోన్ చేశాడు.

కారు డ్రైవరు ఖాళీగా తిరిగివచ్చాడు.

పిచ్చివాడిలా ఓ గంటక్రితమే రోడ్లన్నీ గాలించాడు తను కూడా.

సరిగ్గా ఆ సమయంలో ఫోన్ రింగయింది.

దూకుడుగా వెళ్ళి అందుకున్నాడు. "హల్లో"

"ఏంటీ.... గొంతు వణుకుతూంది.... మీ శిరీష గురించేకదూ...."

"ఎవర్నువ్వు?"

నవ్వు వినిపించింది "చాలా రొటీన్ క్వశ్చన్.... చూడు రాజూ! మీ శిరీషను నేను కిడ్నాప్ చేసాను."

"వ్వాట్?"

"అలా కీచుగా అరవకు.... మీ అమ్మాయి ప్రస్తుతం నా అధీనంలో వుంది. మరేంలేదు. నాకు అర్జెంటుగా ఓ అయిదు లక్షలు కావాలి.... కేష్ మాత్రమే.... దాన్ని నువ్వు హయత్‌నగర్ దాటేక వున్న ఇరవైమూడో మైలురాయిదగ్గర రాత్రి రెండుగంటలకి నాకు అందించాలి. అదీ కారుదిగాల్సిన పనిలేదు. అక్కడ దట్టంగా చెట్లున్నాయిగా.... అందులో నేను నిలబడి వుంటాను కాబట్టి నువ్వు కారుకాస్త స్లోచేసి బ్రీఫ్‌కేస్ బయటికి విసిరేసనుకో.... దాన్ని నేను కలెక్టు చేసుకుంటాను.... ఉదయానికల్లా మీ అమ్మాయి మీ ఇంటిలో వుంటుంది."

బంగార్రాజుకు నుదుట చెమట పట్టేసింది అప్పటికే.

"డబ్బు నీకు అందించాక నా కూతుర్ని నాకు అప్పచెబుతావని గ్యారంటీ ఏమిటి"

"నేను నీ విషయంలో గ్యారంటీ కోసమే ఉదయం వంపుతానన్నది. అగింది అవతలి స్వరం కాసేపు. "మరోమాట— పిచ్చిపిచ్చిగా పోలీసుల సహాయం తీసుకోవాలని ప్రయత్నించావనుకో.... మరేంలేదు నీ కూతురి శవం మాత్రమే నీకు దక్కేది. ఆలోచించుకో..... రాత్రి రెండుగంటలకి

హయత్‌నగర్ దగ్గర ఇరవై మూడో మైలురాయి దగ్గర....అయిదులక్షలు”

“అదిసరే బేంకులన్నీ మూసేసాక అంతడబ్బు ఈ రాత్రికిరాత్రి ఎలా కేష్‌రూపంలో నీకు అందివ్వగలను”

“పేరులోని బంగారమున్న మిస్టర్ రాజా.... బ్లాక్‌మనీ వుంటుంది సర్దు.... ఓకే”

ఫోన్ పెట్టేసిన చప్పుడు వినిపించింది.

బంగార్రాజు అస్థిమితంగా నిలబడ్డం చూసిన రుక్మిణీదేవి “ఏమిటండీ ఎవరు ఫోన్‌చేసింది” అడిగింది ఆదుర్దాగా.

ఆమెకు నిజానికి కొంత అర్థమైంది. అర్థమైనదానికన్నా ఆమెను ఎక్కువ కలవరపరిచింది అయిదులక్షలు అన్నపదమే.

చెప్పాడు బంగార్రాజు.

“బాగుందండీ.... ఎవరో ఫోన్‌చేస్తే అంతడబ్బు చదివించేయడమేనా.... పోలీసుల్తో ట్రాప్‌చేసి పట్టుకుంటేసరి....”

ఆమె ఫోన్ దగ్గరకు వస్తుంటే అడ్డుకున్నాడు.

“వద్దు రుక్మిణీ.... నీకు తెలేదు. ఇందులో పోలీసుల జోక్యం నేను ఇష్టపడను.”

“ఎందుకని....”

“ఎందుకంటే నలుగురికీ తెలిసి నానారభసయ్యే అవకాశముంది కాబట్టి. మరో మూడునెలల్లో ఇండియాకి తిరిగివస్తున్న నా మేనల్లుడికి అసలు సంగతి తెలిస్తే పెళ్ళికి అది అవాంతరమవుతుంది కాబట్టి.”

“ఇప్పుడేం చేద్దామంటారు”

రెండే రెండు క్షణాలు ఆలోచించాడు.

మరో నిముషంలో ఎక్కడికో ఫోన్ చేశాడు.

“మల్కాన్‌సింగ్ కావాలి”

ధూల్‌పేటలో చాలా బలగమున్న గూండా అతడు.... హత్యలు చేయడంలో పెద్ద ప్రొఫెషనల్....

“నేను మాటాడుతున్నా” బొంగురుగా వినిపించింది అవతలినుంచి....

“నేను బంగార్రాజును” చెప్పాడు జరిగింది. “మీరు చేయాల్సింది వాడ్ని అ తోటలోనే కాపుకాచి పట్టుకోవడం.... వాడ్ని ఉతికి ఆరబెట్టయినా డబ్బుతోపాటు నా కుమార్తై ఆచూకి తెలుసుకుని ఇంటికి తీసుకురావడం జరగాలి.... మూడో కంటికి తెలియకూడదు.”

“ఆ ముక్కంటికి తెలియనివ్వను”

“మనిషిని పంపు.... ఓ ఏభై వేలు అడ్వాన్సుగా ఇస్తాను.”

ఫోన్ క్రెడిల్ చేసాను.

చాలా బలంగా వ్యూహం పన్నేడు.

మల్కాన్‌సింగ్ చరిత్ర తెలిసిన వాడెవ్వడూ అతని శక్తిని తక్కువగా అంచనా వేయడు.

టెన్షన్‌తో కూర్చున్నాడు ఓ పదినిమిషాలపాటు....

ఇంతలో బయట బజర్ మోగింది.

వెళ్ళి తనే తలుపుతెరిచిన బంగార్రాజు మల్కాన్‌సింగ్ మనిషి వచ్చాడేమో అనుకున్నాడు కాని అతనికెదురుగా నిలబడివున్నది భాస్వంత్.

ముందు చీదరింపుగా చూసేడు.

“డి. బి రాజు అంటే మీరా” అన్నాడు భాస్వంత్ ఆశ్చర్యాన్ని నటిస్తూ.

“ఎందుకిలా వచ్చావు” అసహనంగా అడిగేడు.

“వచ్చేవాడ్ని కాదు బంగార్రాజుగారూ....కాని ఓ అమ్మాయిని టాక్సీలో ఎవరో కిడ్నాప్‌చేసుకు వెళ్తుంటే చూసిన నేను ఆమెను రక్షించే ప్రయత్నం చేశాను. అందులోనుంచి ఓ నోట్ బుక్ విసిరింది. ఆక్రందనలు చేస్తున్న అమ్మాయి. అదృష్టవశాత్తు అందులో మీ అడ్రసు వుండేసరికి మీకు తెలియపరచాలని వచ్చాను.” శిరీష దగ్గర తను తీసుకున్న కాలేజీ నోట్ బుక్ బంగార్రాజుకు అందించి వెళ్ళాలని వెనక్కి తిరిగాడు.

“భాస్వంత్” బంగార్రాజు పిలిచాడు.

"క్షమించండి రాజుగారు! కేవలం ఒక మానవతా దృక్పథంతో ఇలా సహకరించాలని వచ్చానుగాని అది నేను అతిగా ద్వేషించే వ్యక్తి ఇల్లనిగాని ఆ అమ్మాయి మీ కూతురనిగాని తెలుసుకోలేకపోయాను"

బంగార్రాజు మాటాడలేదు.

”కూర్చో....”

"వ్యవధిలేదు···· వెళ్ళాలి.... ఒక బాధ్యతగల పౌరుడిగా! నేను చూసింది పోలీసులకి తెలియపరచాలి....

"నో" అడ్డంగా నిలబడ్డాడు బంగార్రాజు "దయుంచి ఆ పనిమాత్రం చేయకు...."

"ఏం" నిజానికి భాస్వంత్ అక్కడకు వచ్చింది ఇలా నోట్ బుక్ ద్వారా తెలుసుకోవాలనుకున్నది ఒకవేళ పోలీసుల అండగాని అతడు తీసుకోవాలనుకుంటున్నాడా అన్నవిషయం సేకరించడానికే....

"పెళ్ళికావాల్సిన ఆడపిల్ల.... ఈ విషయం నలుగురినోళ్ళలోనానడం నాకు ఇష్టంలేదు."

ఒరే బ్రూట్ నీ వాళ్ళనేసరికి ఎంత స్వార్థంతో ఆలోచిస్తావురా....

సరే అన్నట్టు తలూపి కాఫీ సైతం తీసుకోకుండా బయటికినడిచాడు.

అక్కడ భాస్వంత్ చేసిన తప్పు ఒక్కటే.... పోలీసులు అండ తీసుకోనివాడు తన కూతురి విషయంలో ఏలాంటి జాగ్రత్తలు పాటిస్తున్నాడని యుక్తిగానైనా తెలుసుకునే ప్రయత్నం చేయకపోవటం....

భాస్వంత్ టైం చూసుకున్నాడు.

అప్పుడు రాత్రి ఏడుగంటలైంది.

* * * *

"బాబీ"

ఎత్తైయిన బిర్లామందిరం ఆవరణలోని గోడకు ఆనుకుని హుషారుగా క్రిందికి చూస్తూ చీకటి నీటిలో లేత కార్తిక దీపాల్లా సాగిపోతున్న కార్లను చూస్తూ మాటాడుతున్న బాబీని పిలిచింది నిశాంత.

బాబీ పలకలేదు.

"మమ్మీ— ఆకాశం తిరగబడి నేలమీద కొట్టేసినట్టు చుక్కల్లా నేల మీద దీపాలు భాగున్నాయి కదూ."

నిశాంత ఉపాధ్యాయతో బాబీ పుట్టినరోజునాడు అర్చన చేయించాలని వచ్చింది.

ఉపాధ్యాయ పేరాపెట్ వాల్‌ని ఆనుకుని నిలబడి బాబీనే గమనిస్తున్నాడు.

ఇంత స్వల్ప వ్యవధిలో ఎంతటిమార్పు.

పట్టుచీర కట్టుకుని సాక్షాత్తూ మహాలక్ష్మిలా కనిపిస్తున్న నిశాంతను క్షణంపాటు పరికించిన ఉపాధ్యాయ అసంకల్పితంగా దేవుడ్ని మనసులోనే ధ్యానించాడు.

"భగవంతుడా! తెలిసి చేయని పాపానికి ఈ నిర్భాగ్యురాలి జీవితం ఎందుకు మోడువారిపోవాలి. ఆమె కోరుతున్న బ్రతుకును దక్కించేటట్టు నువ్వు సహకరించని నాడు నీ ఉనిక్కి అర్థం లేదయ్యా" హఠాత్తుగా ఉపాధ్యాకి భాస్వంత్ గుర్తు కొచ్చాడు.

ఇద్దరి సమాగమానికి తను ప్రయత్నించి సాధించగలిగితే తనజీవితం ధన్యమైపోదూ.

బాబీని పొదివి పట్టుకుని "వెళ్దామా" అంది ఉపాధ్యాయని ఉద్దేశించి నేలపైపు చూస్తూనే.

వారి పరిచయంలో ఒకరికళ్ళల్లో మరొకరు చూసి మాటాడుకునే అవకాశాలు ఇంతవరకూ రాలేదు.

"లేదు నిశాంతా" మృదు గంభీరంగా బాబీనే గమనిస్తూ అన్నాడు "నవ్వగలిగే అదృష్టాన్ని కోల్పోయినట్టు యిన్నాళ్ళూ స్తబ్ధంగా బ్రతికిన బాబీని ఇంకా కొద్దిసేపలా చూడనియ్. వాడి మాటలు అల్లరిచూస్తూ నన్ను తరించి పోనీయ్"

అతడి మనసంతా కృతజ్ఞతతో ముకుళించుకు పోతుంది.

మరో అరగంట తర్వాత ఇంటికి వచ్చేసారు....

బాబీకి అన్నం పెట్టాలని వంటగదివేపు వెళుతున్న నిశాంత "అక్కా!" అన్న పిలుపుతో గభాలున వెనక్కి తిరిగింది.

అక్కడ గిరి ఆమె తమ్ముడు నిలబడివున్నాడు.

ఒక్క క్షణం ఆశ్చర్యపోయినా మరుక్షణం ఆత్మీయంగా తమ్ముడ్ని చేరుకుని నాన్న విషయం అడగాలని నోరు తెరవబోతుండగా "కొత్తబావ బాగావున్న బాపతులాగా వున్నాడు." అంటూ ఇంటినంతా కలియచూసేడు గిరి. "అవునూ నేనిక్కడికెలా వచ్చానని అబ్బురపడిపోతున్నావు కదూ. మా ఫ్రెండ్స్‌తో ఐటిఐ టూరుకని హైదరాబాధ్ వచ్చిన నేను సిటీ తిరుగుతూ ఇందాక బిర్లా మందిర్ దగ్గర నిన్ను మరో పెద్దమనిషితో చూసి ముందు అదిరిపడ్డాను.... ఇప్పుడు అర్థమైపోయింది మా అక్క మజిలీ మార్చిందని."

గిరి గొంతులోని వ్యంగం ఓ శతఘ్నిగా మారి రాక్షసంగా ఆమె గుండెల్లోనుంచి దూసుకుపోయింది.

"ఫోన్లే అక్కా! ఈ విషయాలేం నాన్నకి తెలియనివ్వన్లే.... తెలిస్తే పాపం బ్రతకడుగా"

"ఒరేయ్ మీ అక్కనురా. కాష్టంలో కాలిపోతున్న నా బ్రతుకును చూసి జాలిపడక నా నిస్సహాయతమీద ఎందుకాడుకోవాలని ప్రయత్నిస్తున్నావురా".

ఆమె కళ్ళల్లో నీరు జివ్వున తిరిగి కనుకొలకులనుంచి జారిపడాలని ప్రయత్నిస్తుంటే "ఎందుకొచ్చావిలా" అంది ఉక్రోషంగా.

"భలేదానివే అక్కా ఎంతైనా నీ తమ్ముడ్ని కదా" ఓ అవకాశ వాదిలా చూసేడు. "మరేంలేదు.... నాకు అర్జెంటుగా పదివేలు కావాలి.... నాకు అంటే నాకు కాదు. నాన్నకోసమే.... పరిస్థితి బాగోలేదుగా.... బోలెడంత ఖర్చవుతూంది."

గిరి మాటల్లో వాస్తవంకన్నా బెదిరింపే కనిపిస్తుంటే నిభాయించుకోలేకపోయింది. "లేదు.... నా దగ్గర డబ్బులేదు. అంతడబ్బు యివ్వడానికి నేనేం ఈ ఇంటి యజమానురాలిని కాదు."

"కాకుండా అంత ఖరీదైన చీరలు కడుతున్నావా ఈ ఇంటిమనిషిలా

"ఒరేయ్. ఒరేయ్" నీ తోబుట్టువున్రా! నా స్థితిని అర్థంచేసుకో" అన్నట్లు అడ్డంగా తలూపి బాధగా గోడకి జారిగిలబడింది.

"అక్కా.... నాన్నదగ్గర నీ బ్రతుకేమిటో చెప్పకూడదుగా.... కాబట్టి వెంటనే డబ్బు సర్దు."

ఉప్పెనలా దుఃఖం మనసును ఉక్కిరి బిక్కిరి చేస్తుంటే గెటవుట్ అంటూ అరవబోయింది.

కానీ అప్పటికే ఉపాధ్యాయ అక్కడికి వచ్చాడు "చూడూ" గిరిని పిలిచి చేతిలో డబ్బుంచాడు.

"అవసరమైనప్పుడు డబ్బుకోసం నువ్వురావచ్చు"

గిరి డబ్బు అందగానే ఇక అక్కడ పనిలేనట్టు చూసి 'అక్క ఒక బంగారు బాతు సుమా' అన్న ఆలోచనరాగానే హుషారుగా బయటికి నడిచాడు.

"చూడండీ" విశాంతను ఉద్దేశించి ఉపాధ్యాయ అన్నాడు...."నిజానికి డబ్బుతో మిమ్మల్ని నేను కొని ఇక్కడకు తీసుకొచ్చినా డబ్బుతో వెలకట్టలేని ఓ వ్యక్తి ఈ చీకటి లోగిలిలో దీపం వెలిగించి చాలా ముఖ్యమైన స్థానాన్ని పొందిన మీరు పరాయి వ్యక్తిలా ఆలోచించడం నేను భరించలేను....బాబీ మాత్రమే కాదు....ఈ యిల్లూ ఈ ఆస్తీ అంతటిలోనూ మీకు అధికారముందని గుర్తుంచుకోండి"

ఆమె జవాబు నాశించనట్టు వెళ్ళిపోయాడు.

స్థాణువులా నిలబడిన విసాంత నెమ్మదిగా నేలపై చతికిలబడిపోయింది నిస్సత్తువగా.

"ఛీ ఛీ" బాబీ వచ్చాడు ఎక్కడ్నుంచో.

ఆమె కళ్ళు తుడుస్తూ "పిచ్చి మమ్మీ....పిచ్చి పిల్లలాగా ఏడుస్తావా యింత పెద్దపిల్లవి" ఆమె చెంపలమీద ముద్దుపెట్టుకున్నాడు.

ఆ కొద్దిపాటి ఓదార్పుకే ఆమె ఎంత కదిలిందీ అంటే బాబీని అమాంతం గుండెలకు హత్తుకుని వెక్కి వెక్కి ఏడ్చింది.

* * *

అర్థరాత్రి దాటి....

ఒంటిగంటా యాభై నిముషాలు కావస్తోంది.

భాగ్యనగరం సిటీ పొలిమేరలు దాటేక దట్టంగా అలుముకున్న చీకటిలో ఇరవై మూడో మైలురాయి దగ్గర ఓ పొదమాటున నిలబడి వున్నాడు భాస్వంత్.

ఎముకలు కొరికే చలి....

రోడ్డు నానుకుని వున్న గుబురు చెట్ల మధ్యనుంచి కీచురాళ్ళ రొద భయానకంగా వినిపిస్తూంది.

హైవే రోడ్డుమీద వాహనాల సంచారమూ లేదు.

సుమారు రెండు గంటలు కావస్తుండగా సిటీవైపునుంచి ఓ కారు వస్తున్నట్టు హెడ్‌లైట్లు కనిపించాయి.

భాస్వంతు వెన్నులో సన్నగా వణుకు మొదలైంది.

కారు ఇరవై మూడో మైలురాయి దగ్గర స్లోకావడం ఓ బ్రీఫ్‌కేసు క్రిందపడడమూ జరిగింది.

కారుముందుకు సాగిపోగానే ఉత్సుకతగా అందుకున్నాడు. బ్రీఫ్‌కేస్ తెరిచి చూసేడు.

వంద రూపాయల నోట్లు పేర్చి వున్నాయి.

"గుడ్....అతి తెలివి ప్రదర్శించలేదు" అనుకుంటూ వెనక్కి మరలిన భాస్వంతు టక్కున ఆగేడు.

చెట్లమధ్యనుంచి చిరువెన్నెల కాంతిలో ఓ పదిమంది దృఢకాయులు నడుచుకుంటూ వస్తున్నారు. చేష్టలుడిగినట్టు నిలబడిపోయినాడు భాస్వంత్.

క్రమంగా అర్థమైంది బంగార్రాజు ఎలాంటి వలపన్నిందీ.

దట్టమైన చీకటిలో మసకగా ఆకారాలుతప్ప ఏ పక్కనుంచి ఎవరొస్తున్నారో గుర్తు పట్టలేని స్థితి.

ప్రమాదం ఎంత బలంగా సమీపిస్తున్నదీ గ్రహించిన భాస్వంత్ ఒక్క అంగలో వెనక్కి తిరగాలనుకున్నాడు.

కాని అప్పటికే....

ఓ పదునైన ఆయుధమేదో అతని జబ్బని చీరేసింది వెనుకగా.

'అమ్మా' అన్న సన్నని మూలుగు....

బాధతో చేయి పడిపోతుంటే బ్రీఫ్‌కేస్ కుడిచేతికి తీసుకున్నాడు.

రక్తంతో షర్టు తడిసిపోతుంటే చుట్టూ చూసాడు. ఇనుపకడ్డీల్తో చైన్లతో చాకుల్తో మీదికి లంఘించారు దుండగులు.

15

దట్టమైన ఆ చీకటిలో....

మృత్యుమేఘాల్లా చుట్టుకుంటున్న వ్యక్తుల్ని అంత బాధలోనూ ఒక్కక్షణం కళ్ళను చిట్లించి చూశాడు భాస్వంతు.

లాభంలేదు. తన కథ ఇక్కడే ముగిసిపోకూడదు.

శారీరకమైన నొప్పి అతడ్ని సమూలంగా ఓడించే ప్రయత్నం చేస్తుంటే దేహ పరిత్యాగం చేస్తున్నట్లు ఒక జ్ఞానిలా మనసును వేరు చేశాడు.

మరుక్షణం మేఘాల రాపిడిలో తళుక్కున మెరిసిన ఓ మెరుపులా నభంనుంచి భూమికి జారిపడిన ఒక పిడుగులా మారిపోయాడు.

అతని కళ్ళముందిప్పుడు పైబడుతున్న యమకింకరుల్లాంటి ఆ వ్యక్తులు కనిపించడంలేదు.

కొనవూపిరితో కొట్టుకుంటున్న తల్లి నిస్త్రాణగా నేలకూలిన తండ్రి శవం. కన్నెగానే కన్నుమూసిన చెల్లి ఇందిర ప్రాణాల్ని పరోక్షంగా హరించి హంటర్‌తో తన శరీరాన్ని తునకలు చేస్తున్న బంగార్రాజు వికృత పరిహాసం....ఇవే కనిపిస్తున్నాయి.

కుడిచేతిలోని బ్రీఫ్‌కేసు ఇప్పుడొక మారణాయుధంగా మారి కరాళ నృత్యానికి సిద్ధపడ్డ మృత్యువయ్యాడతడు.

టప్ టప్‌మన్న శబ్దాలుమాత్రం వినిపించాయి.

మొదలు నరికిన చెట్లలా ఒక్కో వ్యక్తి నేలకూలుతున్నాడు. ఆ ఉన్మాదమే మరో అయిదు నిమిషాలు కొనసాగితే అతడ్ని తలపడిన వ్యక్తుల ప్రాణాలు గాలిలో కలిసిపోయేవే.

కాని హఠాత్తుగా గుర్తుకొచ్చింది తన లక్ష్యం హంతకుడిగా మారడం కాదని.

అంతే....మరుక్షణం కర్తవ్యమేదో తోచినట్టు చీకటిలో కలిసాడు రెండడుగులు వెనక్కివేసి.

నేలపై పడ్డ గూండాలు సర్దుకుని ముందుకు ఉరకబోతుంటే "ఆగండి" ఓ శతఘ్ని పేలినట్లు హెచ్చరిక వినిపించింది.

"కదిల్తే సూట్ చేస్తాను"

టక్కున ఆగిపోయారు.

దూరంగా ఓ పొదదగ్గర మసకగా తెల్లని షర్టు కనిపిస్తోంది.

అతడి చేతిలోనే రివాల్వర్ ఏ క్షణాన పేలుతుందో తెలీనట్లు చేష్టలుడిగి నిలబడిపోయారు గూండాలు.

ఒకటి....రెండు....మూడు....పది నిమిషాలు గడిచింది.

హఠాత్తుగా నిశ్శబ్దం.

ప్రత్యర్థి ఎందుకిలా తాత్సారం చేస్తున్నదీ గుర్తించలేకపోయారు. మరో అరనిమిషం తరువాత ఆ పొద దగ్గరికి వెనుకగా చేరిన ఓ గూండా అరిచాడు...."సాబ్....ఇక్కడ ఎవుడూ లేడు....అది చొక్కా మాత్రం పొదమీద తగిలించి ఎల్లి పోయిండు"

అదే ఇంతసేపూ అతడక్కడ నిలబడి ఉన్నట్లు మభ్యపెట్టిందని అప్పుడు గ్రహించారు.

వెంటనే పరుగులు పెట్టారు అడవిలాంటి ఆ ప్రదేశంలో.

* * * *

తూలుకుంటూ గెస్టుహవుస్‌ని చేరాడు భాస్వంత్. శరీరంలో సత్తువ సన్నగిల్లి పోగా మెట్లవరకూ వచ్చి ఇక శక్తిలేనట్లు స్పృహతప్పిపోయాడు.

ఉపాధ్యాయ ఆ సవ్వడికి బయటికి వచ్చి చూసేడు.

నిజానికి అతడు అక్కడికి వచ్చింది నిన్న రాత్రి తన మనసులో నిశాంత భాస్వంతుల విషయంలో మెదిలిన ఒక ఆలోచనకు రూపమిచ్చే ప్రయత్నంగా మాటాడాలని.

అందుకోసమే అతడికోసం నిరీక్షిస్తూ రాత్రంతా తాగుతూనే కూర్చున్నాడు.

ఒంటిపై షర్టులేదు. చర్మం చీలి ధారగా ప్రవహించిన రక్తం అట్టలా గడ్డకట్టుకుపోయి వుంది.

ఇక తాత్సారం చేయలేదు.

ముందు డాక్టరుకి తర్వాత నిశాంతకి ఫోన్‌చేశాడు. మరో గంటకల్లా భాస్వంతుకి ప్రథమ చికిత్స జరిగింది. బేండ్‌జ్‌తో డ్రెస్ చేసిన డాక్టరు వెళ్ళిపోయాక స్పృహలోలేని భాస్వంతుని చూస్తూ ఉండిపోయారు ఉపాధ్యాయ నిశాంతలు.

మరో గంట గడిచింది. భాస్వంతులో ఇంకా చలనం లేకపోవడంతో అవసరమైతే తనకు ఫోన్ చేయమని చెప్పి ఉపాధ్యాయ వెళ్ళిపోయాడు.

ఉపాధ్యాయకు నిజానికి వెళ్ళాలని లేదు. కాని ఎందుకో ఆమెను భాస్వంతుకు చేరువగా ఏకాంతంగా వదిలి పెట్టాలనిపించింది.

సుమారు ఉదయం ఎనిమిది గంటలవేళ భాస్వంతు కళ్ళు తెరిచాడు.

ఎదురుగా నిశాంత కనిపించింది. ఒళ్ళంతా సంకెళ్ళతో కట్టిపడేసినట్టు నొప్పి....తానెక్కడున్నదీ గ్రహించిన భాస్వంతుకు రాత్రి జరిగిందంతా లీలగా గుర్తొచ్చింది. ఉద్వేగంలో అతడు పైకి లేవబోతుంటే వారించింది నిశాంత.

"ఏమిటిది" నిశాంత గొంతు వణికింది. "ఏమౌతున్నారు మీరు?"

అంత బాధలోనూ నవ్వాడు. "ఒక చిల్లర దేవుడితో జరిపిన పోరాటంలో తగిలిన గాయం—అడుగు ముందుకు వేసేవేళ మరింత జాగ్రత్తగా వుండమని హెచ్చరికగా తెలియజెప్పిన ఓ చిన్న అనుభవం."

"అనుకోనిదేమన్నా జరిగితే...." ఆమె వాక్యం ఇంకా పూర్తి కాలేదు....

"అదే జీవితమన్న నిర్వచనాన్ని ఆనందంగా అంగీకరిస్తాను. ఒక వేళ నేను అనుకున్నదే జరిగితే జీవితంపై నేను సాధించిన గెలుపుకి సంతృప్తిపడతాను."

"ఆ సంతృప్తి ఈ మార్గంలోనే ఎందుకు సాధించాలనుకుంటున్నారు" ఆర్తిగా చూస్తూ అడిగింది.

"నిజానికీ నేను అవలంభించాలనుకున్నది బుద్ధిబలాన్నే అయినా ఒక్కోమారు భుజబలం ఉపయోగించడం తప్పనిసరి."

"మీకేమన్నా జరిగితే...."

"కాలం స్తంభించిపోదు....నా కాలం చెల్లిపోతుంది....అంతే."

అతడెంత స్వాభావికంగా జవాబిచ్చినా అతడి మాటల్లోని మొండితనం ఆమెను బలంగానే కదిలించింది.

"ఓడిన నాలాంటి వాళ్ళనెందర్నో ఓదార్చగల మీరే ఎందుకిలా మాట్లాడుతున్నారో అర్థంకావడంలేదు.

"కాకపోవడమే నయం నిశాంతా" ఆధ్యాత్మికంగా చూస్తూ అన్నాడు. "కొన్ని జీవితాల్ని ఎంత తరచిచూసినా జవాబులు దొరకవు అర్థంకాని ప్రశ్నలు తప్ప....నా జీవితమూ అలాంటిదేనని సరిపెట్టుకో."

ఆమె తలపంచుకుని వుండిపోయింది చాలా సేపటిదాకా—

"నిజమే....నేనెవర్ని మీకేమవుతానని మీరు నాకు చెప్పాలి" నివేదనకుగానీ వేదన పంచుకోడానికి గానీ అర్థంకాని ఓ దౌర్భాగ్యురాలు తను.

"నిశాంతా!" అతడేదో చెప్పబోయాడు.

ఆమె కళ్ళనుంచి రాలిపడుతున్న నీటిబొట్లు అతడికి కనిపించకుండా మరెటో చూస్తూ అంది" వద్దు....మీరు సంజాయిషీ ఇచ్చినా వినగలిగేటంత గొప్పదాన్నికాదు....మీ ఇష్టం....కాని ఒక్కమాట" చిత్రంగా ఒణికిందామె కంఠం "ఎవరికెవరమూ ఏం కాకపోయినా కొన్ని అదృష్టాలను కొందరు అర్హులు కాకపోయినా మనసు స్పందించడం మానదు వస్తాను" వెళ్ళిపోయింది వెనక్కి చూడకుండానే.

కొన్ని సెకండ్ల పాటు స్తబ్ధంగా నిలబడిపోయాడు. సరిగ్గా అప్పుడు గుర్తుకొచ్చింది మేడమీద గదిలో శిరీష ఉన్న విషయం....ఎవరికీ కనిపించకుండా అందులోనే ఉండమని చెప్పాడు. షర్టు వేసుకుని వెళ్ళాడామె ధగ్గరికి.

"శిరీషా"

పరుగున వచ్చింది. పడుకుని ఏదో మేగజైన్ చదువుతున్న అమ్మాయి. సునీల్‌తో ఆమెకుగల సంబంధాన్ని స్పష్టంచేసే ఫోటోల్ని ఫారిన్‌లో వున్న ఆమె బావకు పంపే ఏర్పాట్లు చేసాడు ఆరోజే.

"మరో రెండు గంటల్లో మీ ఇంటికి వెళదువుగాని" అంటూ హామీ ఇచ్చి క్రిందికి దిగివచ్చాడు.

బంగార్రాజు నెంబర్‌కు డయల్ చేశాడు.

"మిస్టర్ రాజూ...."

ఒక బాంబ్ పేలినట్టు అదిరిపడ్డాడు బంగార్రాజు. అప్పటికే మల్కాన్‌సింగ్ మనుషులువచ్చి జరిగిన ఉదంతాన్ని తెలియపరచడంతో బెంబేలు పడుతున్నాడతడు.

"మాట తప్పేవుకదూ...."

"లేదు" బంగార్రాజు గొంతు తడారిపోయింది. "లెంపలేసుకుంటాను. నా కూతుర్నేం చేయకు."

"వెంటనే రెండు లక్షలు ఫైను కట్టు...."

"అలాగే" చాలా త్వరగా అంగీకరించిన బంగార్రాజు "ఎలా అందించమంటావు చెప్పు" అన్నాడు.

"సరిగ్గా మరో అరగంటకల్లా రెండు లక్షల కేష్‌ను ప్రభంజనరావుకి అందించు."

"వ్వాట్?" సరిగ్గా వినలేదేమో అనుకున్న బంగార్రాజు ఆశ్చర్యంగా అడిగాడు.

"అదేరా....రెండు లక్షలు ప్రభంజనరావుకు అందజేయమంటున్నాను. మరో విషయం నిశ్శబ్దంగా అందించాలి తప్ప పెదవి విప్పకూడదు" బంగా

ర్రాజు మొహంలో రంగులు మారాయి. అంటే దీనికంతటికీ మూల కారకుడు, దీని వెనుకవున్న వ్యక్తి తన ప్రత్యర్థి ప్రభంజనరావన్నమాట.

భాస్వంత్ అతడలా అనుకోవాలనే కోరుకున్నాడు కూడా.

"జవాబు చెప్పవేం"

"అలాగే పంపుతాను"

"నిన్నకూడా ఇలాగే అన్నావు....మాట తప్పితే ఇక నీకు మరో అవకాశమివ్వను. నీ కూతురి శవాన్నే ఇక నీకు పంపేది"

"లేదు అరగంటలో పంపుతా" బంగార్రాజు ఫోన్ పెట్టేశాడు.

శిరీషను చేరుకున్న భాస్వంత్ "అమ్మా శిరీషా! మరో గంటలో నేనే మీ నాన్న దగ్గరకు చేరుస్తాను గుర్తుందిగా....ఏం చెప్పాలో...."

"గుర్తుందంకుల్—చెప్పేదా—నేను కాలేజీనుంచి బయటికొచ్చి నడుస్తుంటే హఠాత్తుగా నా ప్రక్కన ఓ టేక్సీ ఆగింది. అమాంతం నన్ను లోపలికి లాగేసి గొంతు నొక్కేయడంతో నేను కేకలు పెడుతూ ఓ నోట్ బుక్ బయటికి విసిరేసాను. వాళ్ళేమో నా కళ్ళకు గంతలు కట్టేసి ఎక్కడికో తీసుకెళ్ళారు—కళ్ళకున్న గంతలు తీసేసరికి ఓ పాడుబడిన బంగళాలో వున్నాను అచ్చు సినిమాలోలా."

"దట్స్ గుడ్—ఇప్పుడు మరో చిన్న మార్పు—నిన్ను నిజానికి ఒంటరిగా ఇంటికి పంపాలనుకున్నాను ముందు—కాని నేనే స్వయంగా తీసుకెళ్తున్నాను"

"నువ్వా అంకుల్ ప్రమాదంకదూ" భయంగా అడిగింది.

"ఆ ప్రమాదం దాటాలంటే నువ్వు చెప్పే కథని కాస్త పొడిగించాలి" అంటూ మరికొంతసేపు రీహార్సల్ చేయించాడు.

"అంకుల్ సునీల్‌తో నిజంగానా పెళ్ళి—" అమాయకంగా మరో మాట అడుగుతుంటే ఆప్యాయంగా తల నిమిరి "తప్పకుండా జరుగుతుందమ్మా—నేనున్నానుగా, ముందు నీ బావతో మాత్రం పెళ్ళి జరక్కుండా ఆగిపోతుంది" అన్నాడు.

భాస్వంత్ మరో గంట తర్వాత ప్రభంజనరావుకి ఫోన్ చేశాడు "రెండు లక్షలు అందేయా" అంటూ.

"నువ్వు పంపేవా" అప్పటికే ఎవరు పంపిందీ అర్థంకాని ప్రభంజనరావు ఆశ్చర్యంలో తలమునకలవుతున్నాడు.

"అవును—స్పిరిట్ విషయంలో మరో రెండు లక్షలు అవసరమన్నారుగా."

"గుడ్—స్పిరిట్ డీలర్‌షిప్ పూర్తయింది భాస్వంత్."

"నాకు తెలుసు ప్రభంజనరావుగారూ మీలాంటి సమర్థులు తలుచుకుంటే ఎలాంటి అసాధ్యమైనా సాధ్యమవుతుందని....మరో గంటలో మీ దగ్గరుంటాను."

* * * *

"డాడీ"

శిరీష పరుగున వెళ్ళి బంగార్రాజును కావలించేసుకుంది.

శిరీషను చూడగానే ఆనందంతోపాటు భాస్వంత్ ఆమెతోపాటు రావడం అతడ్ని చాలా ఆశ్చర్యపరచింది.

శిరీష చెప్పుకుపోతూంది జరిగిందంతా....

"డాడీ రాత్రంతా నాకు అన్నం పెట్టకుండా ఎంత ఏడిపించారో తెలుసా....అందుకని నేను తెల్లవారగానే ఆకలేస్తుందని మారాం చేయడం మొదలుపెట్టాను. తలుపులు తెరిచారు డాడీ. బుర్రమీసాలతో, మళ్ళీ బుగ్గల మీద కత్తిగాట్లతో ఎంత భయంకరంగా వున్నాడో తెలుసా....అచ్చు దొంగల సినిమాల్లోలా ఉన్నాడు ఓ గూండాగాడు వచ్చి 'తింటావా బేబీ' అంటూ రెండు ఇడ్లీలు తెచ్చిచ్చాడు....నేను తింటూ కూర్చున్నాను. వాళ్ళనే చూస్తున్నాను" కాస్త ఆగింది భాస్వంత్ చెప్పిన ఆర్డరు గుర్తు చేసుకోడానికి అన్నట్టు.

"వాళ్ళేమో బాగా సారా తాగున్నారు. పేకాట ఆడుకుంటున్నారు.... నన్ను పిచ్చిపిల్ల అనుకున్నారేమో వాళ్ళంతా ఆటలో మునిగి ఉండడంచూసి నెమ్మదిగా నేను బయటికి నడిచాను. అంతే ఒకడు చూశాడు" భాస్వంత్ చెప్పినట్టు భయాన్ని నటిస్తూ ఏడ్చేసింది కూడా.

ఆప్యాయంగా తలనిమిరి కూతుర్ని మరింత దగ్గరకు తీసుకున్నాడు బంగార్రాజు.

"పరుగెత్తాను డాడీ....నువ్వు గుర్తుకొచ్చావు....చంపేస్తారేమో అని బలమంతా కూడగట్టుకుని మరీ పరుగెత్తాను....వాళ్ళేమో నా వెంటపడ్డారు. ఓ చోట పడిపోయాను కూడా" అంటూ అంతకుముందే భాస్వంత్ ఓణీకి ఓమూల అంటించిన బురదని చూపించింది" సరిగ్గా అప్పుడు చూసాను రోడ్డుమీద వెళుతున్న లారీల్ని అంతే....వెళ్ళి అడ్డంగా నిలబడ్డాను. లారీలు ఆగిపోగానే అందులోనుంచి డ్రైవర్లతోపాటు ఈ అంకుల్ దిగి వాళ్ళ వెంటపడ్డారు. పారిపోయారనుకో సినిమాలోలా...."

జరిగిన పీడకలను గుర్తుచేసుకుంటూ కూతురెంత కలవరపడిపోతుందో అన్న బాధతో బంగార్రాజు "నా చిట్టితల్లీ....ఎలాంటి గండంనుంచి తప్పించుకున్నావ్" అన్నాడు.

భాస్వంత్ భావరహితంగా చూసేడు. ఇది చాలా దైవికంగా జరిగిన సంఘటన రాజుగారూ! నిజానికి నేను ఆ స్పిరిట్ టేంకర్స్‌తో వెళ్ళాల్సిన పనిలేదు. కాని డీలర్ నాకు చాలా కావలసినవాడు కావడంతో బయలుదేరాను. ఇంతలో కాకతాళీయంగా ఈ సంఘటన జరిగింది" భారంగా నిట్టూర్చాడు "దాంతో లారీల్ని అటు పంపి నేను శిరీషతో ఇలా వచ్చాను."

ఆ క్షణాన బంగార్రాజు మనసులో ప్రభంజనరావుపై ఉక్రోషం మరింత ఉధృతమవటానికి కారణం రెండు లక్షలు ఇచ్చాక కూడా తన కుమార్తెను విడిచిపెట్టకుండా ఆమె తనంతట తానుగా తప్పించుకునే అవసరాల్ని కల్పించడం....

కసిగా పళ్ళు నూరేడు.

భాస్వంత్ ఇక వెళతానన్నట్లు బయలుదేరబోతుంటే "క్షణం ఆగు" అంటూ వారించిన బంగార్రాజు రెండు నిమిషాల్లో లోపలికివెళ్ళి తిరిగొచ్చి ఓ పదివేల రూపాయల నోట్లకట్ట అందించాడు.

అభిమానం దెబ్బతిన్నట్లుగా చూసేడు భాస్వంత్ "క్షమించండి. ఈ డబ్బు నాశించి నేనీ సహాయం చేయలేదు."

కాస్త తత్రుపడ్డాడు బంగార్రాజు....ఆ సమయంలో బంగార్రాజుకి

అసంకల్పితంగానే గుర్తుకొచ్చింది భాస్వంత్ ఎలాంటి అభిమానవంతుడికి కొడుకో....

"సారీ....నా వుద్దేశ్యం అదికాదు...."

"రాజుగారూ! ఒకనాడు మీమీద కసితో యుక్తిగా మీ దగ్గర సాధించిన ఆ డబ్బు విషయంలోనే ఇప్పటికీ సిగ్గుపడుతున్నాను. మరోసారి అలాంటి తెలివితక్కువ పని చేయను....కాకపోతే ఒక సహాయం చేయండి" క్షణం ఆగేడు భాస్వంత్ బంగార్రాజును ఓరగా గమనిస్తూ....

"మీరు అభ్యంతరం కాదనుకుంటే మన వూళ్ళో మీకెందుకు పనికిరాకుండా పడివున్న మీ పాతిక ఎకరాల్ని నాకు అమ్మండి. రేటు విషయంలో కాంప్రమైజ్ కానక్కర్లేదు...." తండ్రికోరిన విద్యాలయం కోసం కోరుకొంటున్న స్థలమది.

'ఎందుకూ' అని బంగార్రాజు అడగలేదు సరికదా అంత డబ్బు భాస్వంత్ ఎలా సంపాదించగలిగాడా అన్న ఆలోచనలో పడ్డాడు.

"ప్రస్తుతం నేనో టెక్నికల్ కన్సల్టెన్సీని నడుపుతున్నాను రాజుగారూ....బాగానే సంపాదించ గలుగుతున్నాను."

బంగార్రాజులోని వ్యాపారవేత్తని నెమ్మదిగా తట్టడం మొదలుపెట్టాడు.

"టెక్నికల్ కన్సల్టెన్సీ అంటే...."

"ఉదాహరణకి మీకు బ్రేవరీస్ వుంది....అందులో మీరు బ్రాందీ విస్కీలు తయారుచేస్తారు. ఉత్పత్తి దెబ్బ తింటూంది లేదా మార్కెటింగ్‌లో సమస్యలు తలెత్తుతున్నాయి. అలాంటప్పుడు...." భాస్వంత్ వాక్యం ఇంకా పూర్తికాలేదు.

మనసులోని ఉక్రోషాన్నంతా వెళ్ళగక్కేడు బంగార్రాజు.

తన శత్రువైన మరో పారిశ్రామికవేత్త ప్రభంజనరావుకి అనుయాయుడైన జీవన్‌రావు తన ఫేక్టరీ కార్మికులకు నాయకుడై ఉత్పత్తిని ఎలా దెబ్బ తీస్తున్నదీ ఆ ఏడాది తానెంత నష్టపోయిందీ అంతా చెప్పాడు.

నిర్లిప్తత నటిస్తూ నవ్వేడు భాస్వంత్. "చిత్రంగా వుంది రాజుగారూ!

మీలాంటి వ్యాపారదక్షతగల వ్యక్తులకు ఇలాంటి సమస్యలుండడం ఆశ్చర్యమే. అయినా పోటీ వ్యాపారంలో వుండాలికాని వ్యాపారవేత్తల మధ్య ఉండడం అది వ్యక్తిగత కక్షలకు దారితీయడం దారుణమే.... ఉదాహరణకి ఈరోజు సంఘటనే తీసుకోండి” చాలా అస్పష్టంగా చెబుతూనే తానెంతవరకూ వెళ్ళగలిగేది పరోక్షంగా హెచ్చరించాడు. “మీ శిరీషను ఎవరో కిడ్నాప్ చేయడం నాకు తెలుసు కాబట్టి రేపు అమ్మాయి పెళ్ళి విషయంలో దీన్ని అడ్డం పెట్టుకుని నేను సాధించాలనుకోవడం సమంజసం కాదుకదూ.”

బంగార్రాజు గొంతు తడారింది క్షణంపాటు.

“చెప్పు భాస్వంత్ నా సమస్యకి పరిష్కారం చెబితే సుమారు మూడు లక్షలకు అమ్మాలనుకున్న ఆ కొండభూమిని నీకు రెండు లక్షలకే ఇచ్చేస్తాను....” ఆవేశంగా అన్నాడు.

ఒక వ్యాపారదక్షతగల మేధావిని అంతవరకూ యుక్తిగా లాక్కురాగలిగిన భాస్వంత్ చివరి అస్త్రాన్ని ప్రయోగించే ప్రయత్నంగా “చాలా సింపుల్ రాజుగారూ” అన్నాడు ముందు.

“నిజానికి ఆ మధ్య బొంబేలో ఓ బ్రెవరీస్ కంపెనీలో ఫైర్ ఏక్సిడెంట్ జరిగింది నిజానికి ప్రమాదవశాత్తు కాదు. నా సలహామీద ఆ యాజమాన్యమే అలా చేసింది. ఇన్సూరెన్సు డబ్బుతో నష్టాన్ని పూడ్చుకుంది” అంటూ ఓ అందమైన కట్టుకథ నమ్మేట్లు చెప్పి ఇప్పుడు బంగార్రాజు ఏం చేయాల్సిందీ కూడా వివరించాడు.

భారీ నష్టాలతో నడుస్తున్నా ఉత్పత్తి అధికంగానే వున్నట్లు రికార్డ్స్ సృష్టించి ఉన్న లిక్కర్ స్టాకంతా గోడౌన్‌లో ఉంచాలి....ఇది మొదటిది.

ఎలాగూ పర్మిట్ వుంది కాబట్టి జగపతి ఏజెన్సీస్‌నుంచి ఓ పది లక్షల రూపాయల స్పిరిట్ తీసుకున్నట్లు క్రెడిట్ పర్చేజ్ (నెలరోజుల్లో డబ్బు చెల్లించే పద్ధతి) కాగితాల్నిచ్చి నిజంగా స్పిరిట్ ముట్టక దాన్ని ఆ గోడౌన్స్‌లోనే స్టోర్ చేసినట్లు ఆధారాల్ని కల్పించడం ఇది రెండోది....

తర్వాత మొత్తం గోడౌన్స్ తగలబెట్టి స్పిరిట్-లిక్కర్స్‌కు సంబంధించిన నష్టాన్ని వివరిస్తూ ఇన్సూరెన్స్‌కు క్లెయిమ్ చేయడం.... యిది మూడోది.

ఇక నాలుగోది నిజంగా స్పిరిట్ తీసుకోలేదు కాబట్టి దాన్ని బ్లాక్ మార్కెట్‌లో పర్మిట్ లేనివాళ్ళకూ పర్మిట్‌ను మించి అవసరమైన వాళ్ళకు రహస్యంగా దాన్ని తరలించడమూ డబ్బు చేసుకోవడం, దానికి ఓ అయిదు శాతం భాస్వంత్‌కి ముట్టచెప్పటం.

ఈ ఆలోచన బంగార్రాజుకి నిజంగానే నచ్చడానికి కారణం ఈమధ్య బొంబేవంటి నగరాలలో చాలా రెగ్యులర్‌గా జరుగుతున్న వ్యాపార ప్రహసనాలివి.

“మార్వలెస్ భాస్వంత్” జగపతి ఏజన్సీస్ నుంచి నువ్వు స్పిరిట్ సప్లయ్ చేసినట్లు డాక్యుమెంట్స్ అందచేసేవంటే మీకు రావాల్సిన కమిషన్ నేను ముట్టచెబుతాను.”

“అంతేకాదు బంగార్రాజుగారూ.... దీనిద్వారా మీ ప్రత్యర్థి ఏ లక్ష్యంతో మీ ఉత్పత్తి దెబ్బతీసి, మీపై కక్ష సాధించాలనుకుంటున్నాడో అతడ్ని పరోక్షంగా సాధించబోతున్నారు మీ ఆర్థికమైన నష్టాన్ని యిలా పూడ్చుకోవడంద్వారా” బంగార్రాజు మండుతున్న గుండెలపై మరింత చన్నీళ్ళను చల్లాడు.

ఆ తర్వాత వారంరోజుల్లో చాలా అనూహ్యమైన వేగంతో జరిగిపోయాయి ఎన్నో సంఘటనలు.

బంగార్రాజు ఎందుకూ పనికారాదన్న పాతికఎకరాల్ని రెండులక్షలకి అమ్మేసాడు భాస్వంత్‌కి.

బంగార్రాజుపై ఎలా చావుదెబ్బ తీస్తున్నదీ వివరించిన భాస్వంత్ ప్రభంజనరావు అండతో చాలా సునాయాసంగా “జగపతి ఏజన్సీస్” పేరు మీద సంపాదించిన లైసెన్స్ ఆధారంగా డాక్యుమెంట్స్‌ని అందజేసాడు.”

మరో మూడురోజుల్లో గోడౌన్స్ తగులబెట్టే ఏర్పాట్లు పూర్తిచేస్తూ బంగార్రాజు ఓ అనుమానాన్ని వ్యక్తం చేశాడు.

"జీవన్‌రావు మనుషులు ఫేక్టరీలో చాలాఏక్టివ్‌గా ఉండే కార్మికులు. వాళ్ళు రహస్యాన్ని గ్రహించి మనకు వ్యతిరేకంగా ఇన్స్యూరెన్స్ కంపెనీకి సాక్ష్యమిస్తే?"

క్షణం ఆలోచించిన భాస్వంత్— "ఎంతమందున్నారు జీవన్‌రావు ముఖ్య అనుచరులు?" అడిగాడు.

"ముగ్గురు...."

"సస్పెండ్ చేయించండి ఈరోజే!"

"ఎలా?"

"క్రమశిక్షణా రాహిత్యమనే ఓ ఆయుధాన్ని ఆసరాగా తీసుకుని."

బంగార్రాజు అనాలోచితంగా చేసేసాడు.

వ్యక్తిగత యుక్తితో ఒక సామూహిక శక్తిపై చావుదెబ్బ తీసే ప్రణాళిక అమలుచేసాడు భాస్వంత్.

ఇద్దరు బలవంతులయిన ప్రత్యర్థుల్ని ఒడుపుగా దెబ్బతీసే ప్రయత్నంలో సమయోచితంగా ఒక్కో అస్త్రాన్ని ప్రయోగించటంతోపాటు....

ఇద్దరు చిల్లర దేవుళ్ళను పునాదుల్తో సహా పెకిలించే ఒక మహా సంగ్రామంలో వారిని అధికమైన చావుదెబ్బ తీయడమే మొదటి లక్ష్యంగా భావించి సరిగ్గా ఆ ప్రాంతాన్నే ఎన్నుకున్న భాస్వంత్....

ప్రభంజనరావుకి ముఖ్య అనుచరుడయిన జీవన్‌రావుకు స్థానభ్రంశం కలిగించవినాడు ఎప్పటికయినా తనకు ముప్పే అని భావించి తన యజ్ఞంలో అప్పటికి అతడ్నే సమిధగా మార్చేడు కాని....

ఆ తర్వాత అది ఎన్ని అనర్థాలకు దారి తీస్తుందో ఆ క్షణాన వూహించలేకపోయాడు.

16

"ఇది దారుణం....నీ వ్యూహంలో నా అనుచరుల్ని ఇలా దెబ్బ తీయడం నేను సహించను" జీవన్‌రావు భాస్వంత్‌మీద మండిపడుతున్నాడు.

తన ముఖ్య సహచరుల్ని బంగార్రాజు సస్పెండ్‌చేయడంతో దిక్కుతోచక ప్రభంజనరావు దగ్గర గగ్గోలు పెడుతుంటే కావాలని తనే చేయించినట్టు చెప్పాడు బాస్వంతు.

"మిష్టర్ జీవన్‌రావ్! నేను అనుకున్న పథకం ప్రకారం అమలు కావాలీ అంటే ఈ మాత్రం త్యాగం చేయాలి...."

"అసలు వాళ్ళు అడ్డమెలా అవుతారు?"

"అవుతారని బంగార్రాజు అనుమానాన్ని ప్రకటించాడుకాబట్టి అతడికి నామీద మరింత నమ్మకం కలిగేట్టు ఈ సలహా ఇచ్చాను."

"నేనూరుకోను!" జీవన్‌రావు తోకత్రొక్కిన త్రాచులా మారిపోయాడు.

"అప్పుడు పరోక్షంగా మీరు ప్రభంజనరావుగారిపై ధ్వజం లేపినట్టు అవుతుంది" సాలోచనగా చూస్తూ అన్నాడు భాస్వంత్. "మీ గొడవలతో బంగార్రాజు అనుకున్నది చేయడం మానేస్తాడు."

"మానేయనియ్!"

"అంటే ప్రభంజనరావుకంటే మీ అనుయాయులు ముఖ్యమా?"

ఈ వాక్యం నిశ్శబ్దంగా కూచున్న ప్రభంజనరావు అంతరాళంలో అనుకోని పొరని తాకి ఆగింది. "చెప్పండి జీవన్‌రావ్! మీకింత బలాన్నిస్తున్న ప్రభంజనరావుగారు ముఖ్యమా? మీ బలగం ముఖ్యమా?"

చాలా తెలివిగా విభజించాలని ప్రయత్నిస్తున్నావు మిష్టర్ భాస్వంత్! నీ రాజకీయం నా దగ్గర ప్రదర్శించకు" జీవన్‌రావు ఆవేశాన్ని విగ్రహించుకుంటూ ఒత్తి పలికాడు.

"ఇది రాజకీయం కాదు జీవన్‌రావ్! సర్పయాగం.... ఇందులో కళింగనాగులే కాదు....మామూలు సర్పాలా ఒక్కమారు బలవుతాయి."

"ప్రభంజనరావుగారూ! ఇంత వింటూ మీరిలా మౌనంగా ఉండడం నాకు నచ్చడంలేదు" జీవన్‌రావు నిలదీశాడు.

"నచ్చకపోతే ఓ మూడురోజులపాటు నోర్మూసుక్కూర్చో! అంతా అయ్యాక అప్పుడు నీ వాళ్ళ సంగతి ఆలోచిద్దాం!" కసురుకుంటున్నట్లుగా అన్నాడు ప్రభంజనరావు.

అవాక్కయాడు జీవన్‌రావు.

వారిద్దరి మధ్య ఉన్న దశాబ్దాల పరిచయంలో ఇలాంటి విసుగునతడు ప్రదర్శించడం తొలిసారి.

అసహనంగా మరెటో చూస్తూ అన్నాడు జీవన్‌రావు—"ముందొచ్చిన చెవులకన్నా వెనకొచ్చిన కొమ్ములు వాడి కదూ....కానివ్వండి!"

జీవన్‌రావు రోషంగా వెళుతూ చూసిన చూపు భాస్వంత్ గమనించలేదు.

ప్రభంజనరావుకి అసంతృప్తిగా ఉన్నా, తన ప్రత్యర్థి చాలాబలమైన చావుదెబ్బ తింటున్నందుకు కాస్త తృప్తిగా ఉంది.

"ఓమారు ఫ్యాక్టరీకి వెళదాం రా!" అంటూ భాస్వంతును తోడు తీసుకుని జీడిపట్ల కారులో బయలుదేరాడు ప్రభంజనరావు.

అంతకుముందే ఆయనతో రెండు మూడుసార్లు వచ్చాడు భాస్వంత్!

తవుడుతో తయారు చేయబడే రైస్ బ్రాన్ ఆయిల్ కంపెనీ అది.

ధాన్యం మిల్లులనుంచి తవుడ్ని క్వింటాల్స్ చొప్పున కొనుగోలుచేసి ఆయిల్‌గా మార్చి, "ఇండ్‌లీవర్" వంటి సబ్బుల ఫ్యాక్టరీకి సరఫరా చేస్తుంటాడు ప్రభంజనరావు.

బంగార్రాజుకి కూడా ఇలాంటి ఫ్యాక్టరీ ఉంది.

సబ్బుల తయారీలో ఉపయోగపడే మీ తవుడు నూనెని ఇద్దరూ "ఇండ్‌లీవర్"కి సరఫరా చేస్తుంటారు.

స్వల్ప పెట్టుబడితో ఎక్కువ లాభాన్ని పొందే అవకాశమున్న

తవుడునూనె పరిశ్రమల్లో రాష్ట్రంలోని ముఖ్యప్రత్యర్థులు ఇద్దరే కావడంతో "ఇండ్‌లీవర్" వంటి భారీ పరిశ్రమకి తమలో ఒక్కరే సప్లయర్స్ కావాలని చాలారోజులుగా చేస్తున్న ప్రయత్నాల్లో శత్రువులుగా మారిపోయారు.

"బంగార్రాజు అంటే నీకు చాలా కక్షగా ఉన్నట్టుందే!" కారు నడుపుతూ హఠాత్తుగా అడిగాడు ప్రభంజనరావు.

"అవును! మిమ్మల్ని మించి నాకు శత్రువతడు" నిశ్చలంగా జవాబిచ్చాడు. క్షణంపాటు తలతిప్పి భాస్వంత్‌ని చూసిన ప్రభంజనరావు అతడి ముఖంలోని స్థిరత్వాన్ని కంఠంలో అస్పష్టంగా దొర్లిన కాఠిన్యాన్ని గుర్తించాడు.

"అవును ప్రభంజనరావుగారూ! నిజానికి బంగార్రాజు మీకుమామూలు ప్రత్యర్థి. కానీ నాకు ఆగర్భశత్రువు."

"చిత్రంగా ఉందే!"

"కొన్ని నిజాలు తెలియనంతవరకూ చిత్రంగానేఉంటాయి ప్రభంజనరావుగారూ! నా కుటుంబం చిన్నాభిన్నం కావటానికి నా వాళ్ళనుకున్న మనుషులంతా ఒకసారి ఆత్మహత్యలతో ప్రాణాలు తీసుకోవడానికి కారణం బంగార్రాజు నమ్మకద్రోహమే! ఒక్కక్షణం నన్ను నేను మరిచిపోతే హంతకుడిగా మారయినా అతడ్ని మట్టుపెట్టేవాడ్ని! కానీ ఉద్దేశం అదికాదు."

ఆగేడు పెదవుల్ని కసిగా బిగబట్టి, "వాడ్ని నమ్మకంగానే స్మాష్ చేయాలి! మానసికంగా వాడ్ని చిత్రవధ చేసి, అది చూస్తూ నేను తృప్తి పడాలి! అందుకే ఒక చిన్న నాటకంతో వాడిదగ్గర గట్టిగానే డబ్బు తస్కరించాను. మీ దగ్గర చేరిన రెండులక్షలూ వాడు పంపినవే!"

విభ్రమంగా చూసిన ప్రభంజనరావు కారును కొద్దిగా స్లో చేశాడు. భాస్వంత్ ఉద్రేకాన్ని, అతడి మాటల్లోని నిజాయితీని గమనిస్తుంటే ప్రభంజనరావులో చాలా అనుమానాలకు జవాబు దొరుకుతుంది.

"నిజానికి మీ అండ నేను కోరుకున్నది. మీకు బంగార్రాజు శత్రువని ముందే నాకు తెలుసు కాబట్టే ప్రభంజనరావుగారూ! నాకూ మీలాంటి ఓ

బలమయిన వ్యక్తి ఆసరా కావాలి. అది నాకు చాలు నేను అనుకున్నది సాధించడానికి."

భాస్వంత్‌ని ఈ క్షణంలో తనకు చాలా ముఖ్యమైన వ్యక్తి అని ప్రభంజనరావు అనుకోవడంలో తప్పులేదు.

అంతగా ఇంప్రెస్ చేసాడు....

ఫ్యాక్టరీలో నడుస్తున్నారిద్దరూ.

కార్మికులంతా వినయంగా నమస్కరిస్తూ, పక్కకి తొలిగిపోతుంటే భాస్వంత్ ప్రభంజనరావు వెంట నడుస్తున్నాడు.

తవుడు స్టాక్ చెక్‌చేయడానికి గోడౌన్‌వేపు వెళుతుండగా భాస్వంత్ నెమ్మదిగా అన్నాడు—"నా ఉద్దేశం జీవన్‌రావు అనుమానించదగ్గ వ్యక్తి అన్నది కాకపోయినా మీ పథకం బంగార్రాజు దగ్గరకు ముందే చేరవేయకుండా మీరు కాస్త జాగ్రత్తపడాలి."

టక్కున ఆగేడు గోడౌన్‌లోకి అడుగుపెడుతూ.

"నీ కెందుకలాంటి అనుమానం వచ్చింది?"

"మీ మీద కాకపోవచ్చు. నా మీద కసి పెరిగుండొచ్చుగా!"

"నన్ను కాదని అతనేం చేయడు!"

"అంత నమ్మడం వ్యవహార దక్షత కాదేమో ప్రభంజనరావుగారూ"

క్షణంపాటు ప్రభంజనరావు సూటిగా చూసేడు భాస్వంత్ కళ్ళలోకి-"మీకు చెప్పాల్సిన వాణ్ణి కాదు. డబ్బుకోసం. పరపతి కోసం మనిషి తరతమ బేధాలు పాటించడని."

తవుడు సంచుల్ని చూస్తూ ముందుకు నడుస్తుండగా భాస్వంత్—"ఈ తవుడులోని క్వాలిటీ మూలంగా ఆయిల్ దిగుబడి ఏమన్నా పెరుగుతుందా?" అని.

"పెరుగుతుంది కాబట్టే మార్కెట్ పోటీ తట్టుకోవడం కోసం నేను చాలా ఖరీదయిన తవుడ్ని అంటే లేబరేటరీలో చెక్ చేయించి ఇరవై శాతం నాణ్యత వున్న తవుడ్నే కొనుగోలు చేస్తుంటాను."

హఠాత్తుగా చేతిని ముందుకుచాచి ఓ బేగ్‌లోని తవుడ్ని అందుకున్న భాస్వంత్—"ఇది ఇరవై శాతం నాణ్యతగల తవుడంటే నమ్మకం లేదు నాకు" అన్నాడు.

"ఏం? తవుడు గురించి నీకు తెలుసా?"

"బాగా బ్రతికున్న రోజుల్లో మాకు ఫ్లోర్‌మిల్లుండేవి ప్రభంజనరావు గారూ! ఇది పదిశాతం నాణ్యతమించని తవుడని నమ్మకంగా చెప్పగలను."

ప్రభంజనరావు భృకుటి ముడిపడింది.

వెంటనే ఆ బేగ్‌లోని తవుడిని శేంపిల్‌గా ఒక లేబరేటరీకి పంపాడు.

రెండుగంటల్లో ఫలితం వచ్చింది.

అంతే ప్రభంజనరావు షాక్‌తిన్నాడు. భాస్వంత్ చెప్పిందే నిజం కావడంతో.

ఒక చిన్న అనుమానం అదుపులో అతడిలో ప్రవేశించి, క్రమంగా మేరువుగా మారి చిత్రమైన మీమాంసలోకి జార్చింది.

దానిక్కారణం ప్రతిసారీ తవుడు కొనుగోలు చేసేది జీవన్‌రావు కాబట్టి....

అంటే.... జీవన్‌రావు చాలా నమ్మకంగా వాసాలు లెక్కపెడుతున్నాడన్నమాట!

"మిష్టర్ భాస్వంత్! ఎంత గొప్పగా ఊహించగలిగావు? నువ్వు అసాధ్యుడివి!" మనసులోనే అనుకున్నాడు.

నిజమే! భాస్వంత్ అసాధ్యుడు....

కాబట్టే గోడౌన్ వాచ్‌మెన్ చేతిలో ఓ వెయ్యిరూపాయలుంచి ఆ ఒక్క తవుడు బస్తాని యుక్తిగా అక్కడకు చేర్చాడు. జీవన్‌రావుపై అనుమానాన్ని రేకెత్తించే ప్రయత్నంగా.

సరిగ్గా ఇక్కడే ప్రభంజనగావు జీవన్‌రావుల మధ్య చాలా బలమైన ఓ అగాధం ఏర్పడిపోయింది.

* * *

ఉదయం పదిగంటల వేళ....

రశ్మి కాలేజీలో అడుగుపెట్టింది.

ఆ రోజు అనూహ్యమైన ఆసంఘటన తర్వాత ఆమె మానసికమైన గ్లానితో వారంరోజులు సిక్‌లీవ్ పెట్టేసింది.

అయినా ఏదో అశాంతి....

అనుక్షణం ఆ సంఘటన కన్నా భాస్వంతే ఎక్కువగా గుర్తుకు వస్తుంటే అది భరింపశక్యంకాని బాధకు గురిచేసింది.

ఆడది కోరుకునే అపురూపమైన లక్షణాలు భాస్వంత్‌లో ఎన్నిఉన్నా అతడ్ని తన జీవిత పొలిమేరల్లో సైతం అడుగుపెట్టనివ్వలేదు తను....అది దేవుడి శాపం....

అందుకే మానసికమైన వ్యాయామంతో అతడ్ని ఆలోచనల నుంచి దూరం చేసుకొనే సాధనచేసి ఆరోజే కాలేజీకి వచ్చింది మళ్ళీ....

ఆవరణలో అడుగుపెట్టిన తన కొలీగ్ ఒకామె ముందు వెళుతుంటే పలకరించబోయింది.

ఆమె విననట్టుగా ముందుకు గబగబా వెళ్ళిపోతుంటే అర్థం కాలేదు.

విద్యార్థినులు కొందరు స్థంభాలవార నిలబడి తననే చిత్రంగా చూడడం గమనించింది.

విద్యార్థులు ఈలలు వేస్తుంటే ఏంజరిగిందో అర్థంకానట్టు నెమ్మదిగా ముందుకు నడుస్తూ....

అప్పుడు చూసింది గోడలపై రాసివున్న రాతల్ని....

"శీలాన్ని కాపాడిన మగాడి చేతుల్లో శలవుపెట్టి మరీ సాగిస్తున్న శృంగార కాండ"

"రశ్మి శీలం భస్మమైపోయింది."

ముంతుఉక్రోషంతో కంపించింది....తర్వాత ఆమె కళ్ళనుండి బొట బొటా నీళ్ళు రాలేయి.

ఆవేశంగా ప్రిన్సిపాల్ గదిలో అడుగుపెట్టి నిలబడింది.

ఎలా....ఆ రాతల్ని అంగీకరించారు మీరు?"

"నిజానికి ప్రిన్సిపాల్‌కి ఆమెపైన చాలా నమ్మకముంది....కానీ ఆ

రాతల్ని ఆపలేని తన నిస్సహాయతకి 'ఇది తన తలరాత'ని సరిపెట్టుకునే మనస్తత్వంగలవాడు కావడంతో ఆమెకు వెంటనే జవాబు చెప్పలేకపోయాడు.

"మిమ్మల్నే సర్....నాకు జవాబు కావాలి"

"కొన్ని విషయాల్ని మనం ఈజీగా తీసుకోవాలి రశ్మీ" అన్నాడు ఆమె వేపు సూటిగా చూసే ధయిర్యం లేనట్టు.

"బుల్‌షిట్.... ఏంటీ ఈజీగా తీసుకునేది. ఇదే మీ కూతురి విషయంలోనో లేక మీ చెల్లెలి విషయంలో జరిగితే మీరు ఈజీగా తీసుకునే వారా?"

రాజా రాయడం చూసినా కోపంరాని ప్రిన్సిపాల్ ఇప్పుడు మాత్రం చాలా ఆవేశం వచ్చేసింది. "యూ ఆర్ ఎక్సీడింగ్ యువర్ లిమిట్స్"

"లిమిట్స్" నవ్వింది అవహేళనగా "ఆ పదానికి మీకు అర్థమే తెలిసివుంటే అల్లరిమూకని ఎప్పుడో హద్దుల్లో వుంచేవారు మాస్టారూ! మీరో బ్రతకనేర్చిన బడిపంతులు....కాబట్టే బ్రతుకుతెరువు కోసం మీ వ్యక్తిత్వాన్ని సైతం అమ్ముకుంటూ ఈ విద్యాలయాన్ని రాక్షసుల నిలయంగా మార్చేయగలుగుతున్నారు....నిజానికి నేను సిగ్గు పడాల్సింది జ్ఞానం లేని ఆ మూర్ఖులు రాసిన రాతలక్కాదు. మీలాంటి అజ్ఞాని దగ్గర పని చేయడానికి...."

అతడికి మాటాడే అవకాశమివ్వలేదామె.... టేబుల్‌మీదున్న ఓ కాగితాన్ని అందుకుని ఆవేశంగారాసి అతడిపైకి విసిరింది.

"ఇది శలవుచీటీ కాదు. శాశ్వతంగా ఈ కాలేజీనుంచి శలవు తీసుకునే ప్రయత్నంగా ఇస్తున్న రాజీనామా"

ఆమె ఉద్రేకంగా ద్వారంవేపు నడిచి క్షణంఆగింది. "మీ వయసులో వున్న వ్యక్తికి ఇలా చెప్పాల్సి రావడం నిజానికి బాధాకరమైన విషయమే అయినా ప్రిన్సిపాల్ అంటూ ఇక్కడ బోర్డు పెట్టుకోవడం మూర్ఛరోగి మెడలో ఉన్న బిళ్ళలాంటిదే....ప్రిన్సిపల్స్‌తో బ్రతకడం నేర్చుకోండి."

ఆమె వెనక్కి తిరక్కుండానే అనాల్సింది అనేసి కారిడార్‌లోనుంచి బయటకు వెళ్తూ చూసింది.

అక్కడ రాజు రాస్తున్నాడు....

"రాసక్రీడలు పూర్తి చేసినా మేడమ్మా....నీకు తోడుగా నిలిచిన ఆ మగాదేడమ్మా?...."

రాయడం పూర్తికాగానే వెనక్కి తిరిగిన రాజా వెనుకగా నిలబడ్డ రశ్మిని చూసి బిత్తరపోయాడు.

వెంటనే తేరుకుని ముందుకు నడవబోతుంటే "ఒక్క క్షణం" అంది.

ఠక్కున అగేడు.

"ఒరేయ్" నవ్వింది నిర్లిప్తంగా. "తిన్నగా వెళ్ళి మీ అమ్మనడగరా. నువ్వు పిండంగా రూపుదిద్దుకోడానికి మీ నాన్న వాటా ఎంతో....ఏ మగాడు తోడైతే నిన్ను మీ అమ్మ కన్నదో కనుక్కుని నాకు చెప్పు."

అవమానంతో రెండడుగులు ముందుకేసిన రాజా చేతిలోని పెయింట్ డబ్బాని లిప్తపాటులో లాక్కున్న రశ్మి అమాంతం ఆ రంగుని అతడి మొహంపై పారబోసింది.

"బ్రూట్....వెళ్ళి అద్దంలో చూసుకో....అడవి జంతువు కనిపిస్తుంది."

రశ్మి వెళ్ళిపోయింది.

కాలేజీ ఆవరణలో నిలబడ్డ అంతా ఈ వినోదాన్ని చూడడం రాజా అహాన్ని ఎంత బలంగా దెబ్బ తీసిందీ ఆ కొద్దిపాటి తొందరపాటు చర్య మూలంగా రశ్మి ఎలాంటి ఆపదల్లో చిక్కుకోబోతున్నదీ అక్కడ ఎవరికీ తెలీదు....

రాజా నిజంగానే ఓ క్రూరమృగంలా చూస్తూ నిలబడ్డాడు.

* * *

"శిరీష బ్రేవరీస్ గోడౌన్ మంటలకు ఆహుతి కావడం నిర్లక్ష్యమా.. లేక కావాలని చేసిన నిర్వాకమా?"

అంతకుముందు రాత్రి జరిగిన అగ్నిప్రమాదం గురించి తాటికాయలంత అక్షరాలతో 'అనుదినం' పత్రికలో ప్రచురించబడింది.

ఈ వార్త ఆధారంతో తను ఇన్సూరెన్సు క్లెయిమ్ విషయంలో బంగార్రాజుకు అడ్డుపడడం చాలా తేలికన్న ఆలోచనతో ప్రభంజనరావు మహదానంద పడిపోతున్నాడు.

తన చాంబర్‌లో అడుగుపెట్టిన భాస్వంత్‌ని చూసి కూర్చోమని సౌంజ్ఞచేసి "మొత్తానికి ఉపాధ్యాయ గట్టిగానే సొట్ట పెట్టాడయ్యా బంగార్రాజుకి....ఇది నలుగురి దృష్టికి వెళుతుంది కాబట్టి ఇన్సూరెన్సు వాళ్ళు ఒళ్ళు దగ్గర పెట్టుకుని మరీ డిటైల్స్‌లోకి వెళతారు" అన్నాడు.

"దాని కోసమే ప్రభంజనరావుగారూ....ఆ వార్త ప్రచురించేటట్టు చేసింది." భాస్వంత్ జవాబు ముందు అర్థం కాలేదు.

"అంటే?"

"ఉపాధ్యాయతో నాకున్న పరిచయాన్ని ఇలా కేష్ చేసుకున్నాను.... ఆ సంఘటనకి సాధ్యమైనంత భారీగా పబ్లిసిటీ ఇవ్వమన్నాను."

ఒక శత్రువుని పడగొట్టడానికి ఎన్ని కోణాలనుంచి ఎంత బలంగా ప్రయత్నిస్తున్నదీ గుర్తించిన ప్రభంజనరావు ఎంతటి ఉద్వేగాన్ని పొందాడూ అంటే అమాంతం భాస్వంత్‌ని లేచి కావలించుకున్నాడు.

"మహా ఘటికుడవయ్యా...."

"నన్ను అలా అభినందించక్కర్లేదు ప్రభంజనరావుగారూ.... ఉపాధ్యాయతో నాకున్న పరిచయంలోని స్వార్థాన్ని అర్థం చేసుకోండి.... అది చాలు"

ఇప్పుడు భాస్వంత్ తనకో మార్గదర్శకుడేమో అన్నంత ఆవేశం వచ్చింది. "అవునూ" సాలోచనగా చూస్తూ "జీవన్‌రావు విషయంలో నీకెందుకు అనుమానం వచ్చింది?" అన్నాడు తపుడు విషయంలో తనకతను ద్రోహం గురించి వివరించకుండానే....

దీనికి పెద్ద విశ్లేషణ అక్కర్లేదు ప్రభంజనరావుగారూ! చరిత్ర.... సుయోధన సార్వభౌముడి పంచనచేరి అతడి మనిషిగానే నటిస్తూ అతడిపె

చావుదెబ్బ తీసిన శకుని కథ తెలిస్తే చాలు.... ఈ జీవన్‌రావుల వ్యక్తిత్వం ఏమిటో అర్థమైపోతుంది."

ఎక్కడివాడీ యువకుడు?.... ఈ వయసులో ఎంతటి మేధస్సు

ఇంతింతై వటుడింతై అన్నట్టు ఎంత ఉధృతంగా ఎదిగిపోతున్నాడు?....

"ఈ లైటరు మీదే కదూ...." అన్నాడు భాస్వంత్ టేబుల్‌మీద వున్న సిగరెట్ లైటర్ పక్కనున్న ఓ సిగరెట్ ప్యాకెట్లును చూస్తూ....

"అవును" అన్నాడు ప్రభంజనరావు ఇంకా ఆలోచనల్లోంచి తేరుకోకుండానే....

"రావుగారూ.... ఈ లైటరు మీ సిగరెట్ పేకెట్టు మొత్తం ఖరీదు నూటపది రూపాయలు అనుకుందాం. సిగరెట్ పేకెట్టు ఖరీదుకన్నా లైటరు ఖరీదు వంద రూపాయలు ఎక్కువైతే అప్పుడు సిగరెట్ పాకెట్టు ఖరీదెంత వుంటుంది?"

"పది రూపాయలు" అన్నాడు టక్కున అదో ప్రశ్నా అన్నట్టు.

ఫకాలున నవ్వేసాడు భాస్వంత్. "అదే రావుగారూ చిత్రం....కోట్ల విలువచేసే వ్యాపారంలో మునిగే మీరు ఆ ఉత్తేజంలో ఇలాంటి చిన్న విషయాల్లో ఏకాగ్రతని కోల్పోతారు. చెప్పండి సిగరెట్ పేకెట్ లైటర్ల మొత్తం ఖరీదే నూటపది రూపాయలు. లైటర్ ఖరీదు సిగరెట్ ప్యాకెట్ కన్నా వందరూపాయలు ఎక్కువ అంటే టక్కున మీరు పేకెట్టు ఖరీదు పదిరూపాయలు అనేసారు. అలాంటప్పుడు లైటరు ఖరీదే పది ప్లస్ వంద మొత్తం నూటపది కావాలిగా?"

తను చెప్పిన జవాబులో తప్పు తెలుసుకున్నాడు ప్రభంజనరావు. 'కరెక్ట్' మృదువుగా నవ్వేసి "లైటర్ ఖరీదు నూట అయిదు, పేకెట్టు ఖరీదు అయిదు రూపాయలు" అంటూ బదులిచ్చాడు. "అవునూ.... ఇదంతా....?"

"ఎందులకూ అంటే బలమైన ప్రత్యర్థులపైన ఏకాగ్రత చూపే

మీరు జీవన్‌రావు వంటి ఇంటిదొంగలను అంచనా వేయడంలో ఎంత విఫలమవుతున్నారో సోదాహరణంగా తెలియపరిచాను."

"మార్వెలస్" చప్పట్లు కొడుతూ "రియల్లీ ప్రాక్టికల్" అన్నాడు ప్రభంజనరావు మనస్ఫూర్తిగా.

సరిగ్గా ఆ సమయంలో హఠాత్తుగా లోపలికి వచ్చిన రంగారావు "లాక్కొచ్చాం సార్" అన్నాడు.

ప్రభంజనరావుకి అర్థమైంది.

"ఒక్క క్షణం భాస్వంత్" అంటూ బయటికి నడిచిన ప్రభంజనరావు ఎవరితోనో అంటున్నాడు "ఓహ్....నువ్వా ఆ ఆడత్రాచువి. ఫర్వాలేదు.... వయసులో వున్నావు....పైగా ఆవేశంలో అందంగా కూడా కనిపిస్తున్నావు. నేనేమిటో చూపిస్తాను. లోపలికి ఈడ్చేయండి. లైటింగ్....వీడియో కెమెరా సిద్ధం చేయండి....పది నిమిషాల్లో వస్తాను"

భాస్వంత్ ఉత్సుకతని ఆపుకోలేకపోయాడు.

ఆ రోజు రాక్షసంగా అత్యాచారం చేయబడి ప్రాణాలు వదిలిన అమ్మాయిని ఇంకా అతడు మరిచిపోలేదు....మరో బలిపశువా?

నెమ్మదిగా గది బయటకు నడిచిన భాస్వంత్ అక్కడ బలవంతంగా లోపలికి నెట్టబడుతున్న వ్యక్తిని చూసి పెతేల్మని మెదడు పగిలినట్టు అవాక్కయిపోయాడు.

రశ్మి....

రశ్మి నరకకూపంలోకి నెట్టబడుతూంది....

స్థాణువులా నిలబడ్డ భాస్వంత్ శరీరంలోని రక్తం జివ్వున ఎగజిమ్మింది.

17

"స్టాపిట్"

అసంకల్పితంగా అరిచాడు భాస్వంత్....

రశ్మిని లోపలకు తీసుకువెళుతున్న రంగారావుతోబాటు ప్రభంజనరావు సైతం క్షణంపాటు నిశ్చేష్టులైపోయారు.

వీరందరికన్నా భాస్వంత్‌ను ఆ మూడలో చూసిన రశ్మి మరింత ఆశ్చర్యపోయింది.

అందరికన్నా ముందు తేరుకున్న ప్రభంజనరావు "ఏంటి భాస్వంత్ ఎవరనుకున్నావు ఆవిడ...." అతడి వాక్యం ఇంకా పూర్తి కాకుండానే జవాబిచ్చాడు భాస్వంత్.

"నా మేనకోడలు."

"వ్వాట్" ప్రభంజనరావు భృకుటి ముడిపడింది.

"అవును ప్రభంజనరావుగారూ! కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్న రశ్మి నాక్కాబోయే భార్య కూడా...."

"రశ్మి మొహంలో కదలాడే భావాల్ని చూసే సాహసం చేయలేనట్టు భాస్వంత్ ప్రభంజనరావుకేసి చూస్తూనే అబద్ధమాడేసాడు.

ఆ సమయంలో అంతకన్న మరో మార్గం కనిపించలేదు భాస్వంత్‌కి.

రంగారావు ప్రభంజనరావు ఆదేశం కోసమన్నట్టుగా రశ్మి చేయి వదలి చూస్తున్నాడు.

"ప్రభంజనరావుగారూ" భాస్వంత్ కంఠంలో చిత్రమైన అభ్యర్థన. "ఒకవేళ రశ్మి మూలంగా మీకేమన్నా అవమానం జరిగితే దానికి నేను క్షమార్పణలు చెప్పుకుంటాను....ఈసారికి వదలిపెట్టండి."

సందిగ్ధంలో పడిపోయాడు ప్రభంజనరావు.

ఎలాంటి దారుణానికైనా సిద్ధపడగల ప్రభంజనరావు ఏనాడూ వెనకడుగు వేయలేదు.

అతడికున్న పరపతి అలాంటిది. కాని తొలిసారి అతనికి చాలా ముఖ్యుడూ కావలసినవాడూ అయిన భాస్వంత్ కోసం ఆవేశాన్ని దిగమింగుకుంటూ విడిచిపెట్టమన్నట్టుగా సౌంజ్ఞ చేసి "నీకో మేనకోడలుందని ఏనాడూ చెప్పనేలేదు" అన్నాడు భాస్వంత్‌ను చూస్తూ.

"కుటుంబ కలహాల మూలంగా దశాబ్దాల క్రిందటే విడిపోయాం. అయినా మేం మాత్రం ఒకరినొకరు ఇష్టపడుతుంటాం" చాలా సులభంగా నమ్మించేట్టు గొంతును ధ్వనింపజేసాడు.

"సరే....మరోసారి ఇలా జరక్కుండా చూడు."

"ఆ విషయంలో నేను హామీ ఇస్తున్నాను. రా రశ్మి" భాస్వంత్ కృతజ్ఞతగా ప్రభంజనరావుగారిని చూసి రశ్మి చేతిని చనువుగా అందుకున్నాడు.

భాస్వంత్ స్పర్శకు ఆమె పులకించిపోలేదు.... భయవిహ్వలత నుంచి ఇంకా పూర్తిగా బయటపడని ఆమెకిదంతా విస్మయంగా ఉంది.

లైబ్రరీ నుంచి వస్తున్న తన పక్క హఠాత్తుగా ఓ టేక్సీ ఆగడం అందులోనుంచి ఓ వ్యక్తిదిగి లోపలికి లాగి నోరునొక్కుతూ ఆ భవంతికి తీసుకురావడం అంతా సినిమాఫక్కీలో జరిగిపోయింది.

అంత గుండె దడలోనూ నిర్లిప్తంగా నవ్వుకుంది. అసలు సాంఘికమైన భద్రతే లేనట్టు ఒక మనిషిపై మరో మనిషి ఇలా పట్టపగలు దాడి చేయడంలో ఏ దిశకు దేశం పురోగమిస్తూందీ అని ఆమె ఆలోచించడం లేదు. అడదాని స్వేచ్ఛకు అర్ధరాత్రి మాత్రమే ముప్పు వాటిల్లేట్టుందని ఆనాడు తలపోసిన గాంధీగారి అమాయకత్వానికి జాలిపడుతూంది.

"ప్రభంజనరావు ఎంతటి ప్రమాదకరమైన మనిషో తెలిసిన నేను మిమ్మల్ని రక్షించే ప్రయత్నంలో కొద్దిపాటి చనువు తీసుకున్నాను క్షమించండి."

కాంపౌండ్ దాటేక ఒక సంజాయిషీ ఇచ్చుకున్నట్టు అన్నాడు

భాస్వంత్....క్షణంలో తెల్లారిపోవాల్సిన బ్రతుకును కాపాడిన భాస్వంత్‌ను కృతజ్ఞతగా చూడలేకపోతూంది.

ఆమె పక్కనుంచి ఏ జవాబూ రాకపోయేసరికి భాస్వంత్ అన్నాడు. "ఆ సమయంలో కాకతాళీయంగా నేను అక్కడ వుండబట్టి సరిపోయింది. లేకపోతే...."

"ఏం జరిగేది...." అంది సునిశితంగా అతడ్ని చూస్తూ....

తొట్రుపడ్డాడు ఆమె కంఠంలోని తీవ్రతను గుర్తించి "ఇప్పుడు జరిగిన దానికి నేను ఆశ్చర్యపోవడంలేదు భాస్వంత్‌గారూ. ఒక మేధావి చాలా నిజాయితీపరుడు అనుకున్న మీరు బ్రతుకుతున్నది ఇలా అని తెలిసి మీ గురించి నేను వేసిన అంచనాకి నన్ను నేనే అసహ్యించుకుంటున్నాను" ఆమె గొంతులో సన్నని ప్రకంపన.

"పొరపాటు పడుతున్నారు...." అప్రతిభుడౌతూ జవాబు చెప్పబోయాడు.

"మీరు కాదు....మీ విషయంలో పొరపాటు పడింది నేను" స్థిరంగా జవాబు చెప్పింది నడుస్తూనే.

"రశ్మీ...." అతని గొంతు బాధగా వణికింది. "నేను అక్కడ వాళ్ళ మధ్య వున్నా బ్రతుకుతున్నది వాళ్ళలా కాదు."

"కాకుండానే దేనికీ తలఒగ్గని ప్రభంజనరావులాంటి ఓ రాక్షసుడు మీకింత విలువ యిచ్చాడంటే నన్ను నమ్మమంటారు."

హఠాత్తుగా భాస్వంత్ మెదడులో శూలాలు పొడుస్తున్నట్టు నొప్పి. నరాల్ని ఎవరో పీకుతున్నట్టు నాడీ మండలంపై ఇనుప పాదాల్తో నర్తిస్తున్నట్టు భరింపశక్యంకాని బాధ.

చాలా బలాన్ని కూడగట్టుకుంటూ నడుస్తున్నాడు.

రశ్మితో చాలా మాటాడాలనుంది. ఆమెకు తన కథనంతా వివరించి చెప్పాలన్నంత ఉద్వేగం....

"నేనేమిటీ....ఎందుకిలా బ్రతుకుతున్నానూ అన్నది నువ్వు అర్థం చేసుకోలేవు."

"స్టేషన్‌లో తెలివితేటలతో అందర్నీ మభ్యపెట్టగలిగిన మీరు నా ఆదతనంపై అసంకల్పితంగా పందెమొడ్డి అంత కష్టమైన పజిల్‌కి సునాయాసంగా జవాబు చెప్పగలిగిన మీరు యిప్పుడు అందంగా నన్ను నమ్మించగల న్న నమ్మకం నాకుంది మిష్టర్ భాస్వంత్!" ఆమెకు ఇష్టం లేకుండానే కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. "కాని ఒక్క విషయంలో నన్ను రక్షించినందుకు కృతజ్ఞురాలినే! కాని ఇకముందు నేను ఇష్టపడని ఆ'మేనకోడలు' అన్న పదాన్ని మాత్రం మీరలా అవకాశం తీసుకుని ఉపయోగించి, పరోక్షంగా మీ అభిష్టాన్ని తెలియపరిచే ప్రయత్నం చేయకండి" రశ్మి చెంపలపై నుంచి నీళ్ళు రాలేదు. "ఆ పిలుపు నేను ఎవరిదగ్గరా ఆశించనిది. పదిలంగా ఒక జీవితకాలం దాసుకునే ఒకస్మృతిని మరోమారు అలా మైలపరిచే ప్రయత్నం చేయకండి. అయినా నేరస్తులమధ్య బ్రతికే మీకు సెంటిమెంట్స్ కూడానా" వెళ్ళిపోయిందామె అతడి జవాబుకోసం ఎదురుచూడకుండానే.

భాస్వంత్ మనసంతా అర్థంకాని ఒక వేదనతో నిండిపోయింది.

"పొరపాటు పడ్డావు రశ్మి....నాకు సెంటిమెంట్స్ లేవని ఎలా అనగలిగావు! మేనకోడలు అన్న పిలుపుతో ఆ పదాన్ని నేను మైలపరిచానా?"

ఒక సన్నని నీటితెర అతడి నేత్రాంచలాలలో నిలిచింది నిస్సహాయంగా....

హఠాత్తుగా ఒక స్మృతి శకలం పగిలి గుండె అట్టడుగు పొరని థిలంగా మార్చింది.

"బావా...." సుబ్బులు ఆకాశదీపంలా మేఘాల మాటున నిలబడి పిలుస్తున్న అనుభూతి.

అప్పటికే పొద్దువాలి చీకటి పూర్తిగా ఆక్రమిస్తుంది.

ఆ చిన్న సందులో లైట్లు వెలిగాయి చీకటిని చీల్చలేని ఆకాశ కిరణాల్లా.

సరిగ్గా ఆ సమయంలో ఓ బలమైన ఆకారమేదో హఠాత్తుగా అతడ్ని

వెనుకనుంచి వాటేసుకుని గభాలున రోడ్డువారన వున్న ఓ చెట్టు దగ్గర లాక్కుపోయింది.

పట్టు విడిపించుకోవాలని విశ్వప్రయత్నం చేస్తున్న అతడికి సాధ్యపడటంలేదు.

మెడనరాలు చిట్లిపోయేంత నొప్పి....

బలాన్ని కూడగట్టుకుని విదిలించే ప్రయత్నం చేస్తుండగా యిప్పుడిప్పుడే మానుతున్న భుజానకైన గాయంనుంచి రక్తం వెచ్చగా వీపుపై చిమ్మసాగింది.

* * *

"ఆలస్యమైందేమో!"

మంచంపై నుంచి లేచివచ్చిన రశ్మి తల్లి నీరసంగా ద్వారాన్ని ఆనుకుని అడిగింది—"కాలేజీలో ప్రయివేటు క్లాసులేమన్నా తీసుకున్నావా?"

రశ్మి జవాబు చెప్పలేదు.

ఎదురుగా వున్న సీతారాముల విగ్రహాన్ని తదేకంగా చూస్తూ వుండిపోయింది.

ఆగకుండా విరామం ఎరుగునట్టు కళ్ళనుంచి స్రవిస్తున్న నీటికి ఆమె వారధి వేయలేకపోతూంది.

ఎందుకీ సంచలనం తనలో....

భాస్వంత్ ఆలోచనలతో తను అలిసిపోతుందా?

లేక మనసే మైలపడుతున్నట్టు వణికిపోతూందా....

రశ్మి జవాబు చెప్పకపోయేసరికి ఆమె తల్లి నెమ్మదిగా గదిలోకి వచ్చింది. "ఏం జరిగిందే?"

అప్పటికీ రశ్మి జవాబు చెప్పలేదు.

ఆమె గుండెల్లో జరుగుతున్న ఒక చిత్రమైన మథనాన్ని చెప్పే స్థితిలో లేదామె.

"అమ్మా రశ్మీ!" ఈసారి ఆమె సమీపంలోనే కూర్చుని అడిగింది.

"ఎందుకే అలా వున్నావు?"

"నేను...." ఆగింది రశ్మి క్షణంపాటు.

"నేను ఉద్యోగం మానేసానమ్మా!" అంది నెమ్మదిగా.

కొన్ని నిమిషాల నిశ్శబ్దం.

"పిచ్చిపిల్లా! ఆ మాత్రం దానికే ఇంత బాధపడిపోవాలా?" మధ్యతరగతికి దిగువగా బ్రతికే కుటుంబమైనా అదో పెద్ద సమస్య కాదన్నట్టు ఆమె ఆప్యాయంగా కూతురు తల నిమిరింది. వివరాలు సయితం అడగలేదు. "రశ్మి—నేను కానీ నీ తండ్రికానీ కోరుకునేది నువ్వు ఉద్యోగంచేసి మాకు సంపాదించి పెట్టాలని కాదమ్మా.... నీ మొండిపట్టు మాని పెళ్ళికి అంగీకరిస్తే?"

"అమ్మా!" రశ్మి గొంతు బాధగా ధ్వనించింది. "ఆ విషయం ప్రస్తావించొద్దని చెప్పాను."

"ఎలా వూరుకోనే?" బాధగా గుండెలు పట్టుకున్న ఆమె రొప్పుతూంది.

"నేను సిరులు కోరలేదు.... ఆస్తుల్ని ఆశించలేదు.... పేదరికంలో మగ్గుతున్న నీ కోరిక మేరకు చదివించాను.... ఉద్యోగం చేస్తానంటే దానికి అంగీకరించాను. ఇప్పుడు మానేసినా పట్టించుకోకుండా వున్న ఒక్కగానొక్క కూతురు సుఖపడాలని ఆరాటపడుతున్నాను.అమ్మారశ్మీ! నేనురాలిపోయేలోగా ఆ చిన్న వరాన్ని నాకు ప్రసాదించమని అడగటం దురాశఅవుతుందా తల్లీ!"

రశ్మి జవాబు చెప్పలేదు.

"ఏం జరిగిందే నీకు....ఏమైందని పెళ్ళి విషయంలో ఇలా మొండికేస్తున్నావు?" ఆయాసపడుతూనే నిలదీసింది ఎప్పటిలానే.

"ఇది ఈనాటిది కాదు....సుమారు మూడు సంవత్సరాలుగా ఆమె మంచమెక్కిన దగ్గర్నుంచీ కూతురుపై వత్తిడి తీసుకొస్తూనే వుంది.

"ఈ మందులు తీసుకో!" రశ్మి ప్రసక్తిని మార్చే ప్రయత్నం చేసింది.

కాని ఎప్పటిలా రశ్మి తల్లి వూరుకోలేదు— "నాకు జవాబు కావా రశ్మీ! మీ నాన్న కేంప్‌నుంచి వచ్చేసరికి నువ్వు తేల్చి చెప్పాలి. లేకపోతే నేను తలకొట్టుకు చస్తాను."

"అమ్మా!" రశ్మి చేతుల్తో మొహాన్ని కప్పుకుంది.

క్షణంలో ఓ పసికందుగా మారింది.

అలా ఎంత సేపు ఏడ్చిందో ఆమెకు గుర్తులేదు.

ఆమె నెమ్మదిగా తలపైకెత్తింది. చాలా సేపటి తర్వాత ఏదో నిర్ణయించుకున్నట్టుగా....

సరిగ్గా ఇదే సమయంలో....

అపరిచితుడైన వ్యక్తి తాలూకు పట్టు సడలించుకున్న భాస్వంత్ అమాంతం అతడ్ని నేలపై పడగొట్టి లేవకుండా ఒడిసిపట్టుకున్నాడు— "ఎవర్నువ్వు?"

"ప్రభంజనరావు మూలంగా నాకు జరిగిన అన్యాయంతో అతడి ముఠాలో అందిన ప్రతివ్యక్తినీ అంతం చేయాలనుకుంటున్న నాగరాజుని" క్రోధంతో పట్టు విడిపించుకునే ప్రయత్నం చేస్తున్నాడు. "నిన్ను ఇందాకే చూసాను అతడి బంగళాలోనుంచి రావడం. అనుసరిస్తూవచ్చాను. అందుకే నిన్నే తొలివ్యక్తిగా ఎన్నుకున్నాను."

"పొరపాటు పడ్డావు....నేను ప్రభంజసరావు మనిషిని కాను" పట్టు సడలించి పైకిలేచాడు...."అసలు నీకూ అతనికి వున్న శతృత్వం ఏమిటి?"

ఓ మూల రాయిమీద చతికిలబడి అడిగాడు నాగరాజుని నిశితంగా చూస్తూనే.

తన భార్య సరోజ గురించి అంతా చెప్పాడు నాగరాజు. "యింత కష్టపడి వెళ్ళినా చివరికి నా భార్యను చూడలేకపోయాను."

"ఏం ఏమైంది...."

"బహుశా చనిపోయి వుండొచ్చు....లేదా ఎదురు తిరిగినందుకు చంపబడి వుండొచ్చు" నాగరాజు దుఃఖావేశాలతో కదిలిపోతూ అన్నాడు.

"నాకు బ్రతుకంటే తీపిలేదు....చావంటే భయంలేదు.... మిగిలిందొక్కటే కోరిక....అది ప్రభంజనరావునీ వాడి ముఠాని సాధ్యమైనంత త్వరగా సమాధి చేయడం!"

భాస్వంత్ సాలోచనగా చూసేడు. మరో ఓడిన నిర్భాగ్యుడి కధే తను విన్నదికూడా. "నాగరాజూ బలవంతుడయిన వాలిని రాముడు లాంటి వాడు కూడా చెట్టుచాటునుంచే దెబ్బకొట్టాడు. కారణం ఆ క్షణాన శక్తికన్నా యుక్తి అవసరమనిపించింది కాబట్టి. ప్రభంజనరావు వాలికన్నా బలవంతుడు జనారణ్యంలో ఒక భయంకరమైన క్రూరమృగంగా మనుషుల్ని వేటాడుకు తింటున్నాడు. వీడ్ని కొట్టాల్సింది భుజబలంతో కాదు....బుద్ధి బలంతో!

"అంత సహనం నాకులేదు!"

"అయితే నీ కోరిక తీరకముందే వాళ్ళచేతుల్లో నువ్వు కడతేరి పోతావు!"

"దానికి నేను సిద్ధమే!"

"అప్పుడు నీ పగ అసంపూర్తిగానే మిగిలిపోతుంది" నిర్వేదంగా నవ్వేడు భాస్వంత్—"మిష్టర్ నాగరాజూ! మనం ఉపయోగించిన యుక్తికి అవాంతరం వచ్చినపుడే శక్తిని ఉపయోగించాలి. అది నా థియరీ. నిజానికి మనం ఇద్దరం కూడా ప్రయాణిస్తున్నది ఒకేతరహా నావలో....నాతో చేతులు కలుపు....నీ పగ చల్లార్చే ప్రయత్నం నే చేస్తాను."

నాగరాజు జవాబు చెప్పలేదు.

"ప్రభంజనరావులాంటి చిల్లర దేవుళ్ళను దెబ్బతీయాలీ అంటే ముందు వాళ్ళకింత బలాన్నిచ్చిన పరపతిని నేలమట్టం చేయాలి. ఆపరపతికి కారణమైన ఆర్థికమైన శక్తిని మనం సొంతం చేసుకోవాలి. చెప్పు....నాతో చేతులు కలిపి నా లక్ష్యంలో నాకు అండగా వుండగలవా?"

కొన్నిక్షణాల నిశ్శబ్దంతర్వాత నాగరాజు ఆవేశంగా చేతినిముందుకు చాచాడు.

"దట్స్ గుడ్! నువ్వు ఇకముందు నాతోనే కలిసి ఉండబోతున్నావు. ఈ రోజునుంచి నీ పేరు జగపతి!"

"అదేంటి?"

"అదంతే! నువ్వు కొన్నిరోజులపాటు ఒక స్పిరిట్ ఏజన్సీ అధిపతిగా జగపతి పేరుతో చలామణి కాబోతున్నావు."

* * *

అర్ధరాత్రి దాటింది.

గెస్ట్‌హౌస్‌లోని ఓ మూలగదిలో నాగరాజు ఆదమరచి నిద్రపోతున్నాడు.

రాస్తున్న భాస్వంత్ నెమ్మదిగా తల పైకెత్తాడు. చాలా కాగితాలు రాసి చించేసాడు అప్పటికే.

"డియర్ రశ్మి!

నేనొక స్పందనలేని మనిషిగా మీకు కనిపించానా? దుర్మార్గుల దౌష్ట్యం మూలంగా బలయిన ఒక కుటుంబంలో మిగిలిన చివరి ప్రాణిని నేను. నేనే ఇష్టపడని ఒక కృత్రిమ మార్గంలో పయనిస్తున్న శాపగ్రస్తుడ్ని.... ఎవరికి చెప్పుకోను? నా నష్టాన్ని ఎలా భర్తీచేయను? జ్ఞానం తెలీని వయసులో ప్రపంచాన్ని ఒక పవిత్ర దేవాలయంగా, కనిపించే ప్రతి మనిషికీ దేవుడి స్వహస్తాలతో రూపుదిద్ది నేలకు పంపిన నిర్మల మూర్తులుగా భావించడమే అలవాటయిన వాడ్ని....నా స్వప్నం ఏ క్షణాన చెదిరిపోయిందో దేవుడు శృతిచేసి వదిలిపెట్టిన రాగవిపంచిలాంటి నా మనసు ఏ నిముషాన విషాన్ని అద్దిన కుంచెగా మారిందో మీకుతెలిస్తే నా జీవితమేమిటో మీరు అర్థం చేసుకోగలరు!

రశ్మీ! నిన్న మొన్నటివరకూ చిరుగాలి తాకిడికి సయితం అలజడిచెందే లేత చిగురుటాకును చూసి 'అయ్యో పాపం!' అంటూ చెమ్మగిల్లే నా కళ్ళు ఇప్పుడు ఎండిన ఇసుక ఎడారులయ్యాయి. సరిగ్గా అలాంటి సమయంలో ఒక ఒయాసిస్సులో దర్శనమిచ్చారు మీరు.

ఎందుకో ఏ జన్మ బంధమో మిమ్మల్ని చూసిన మరుక్షణం నేను కట్టుకున్న కుహనా హర్మ్యపు పరిధినుంచి పక్కకు తొలిగి యుక్తితోనే ఏదన్నా సాధించగల నేను మీ ప్రేమను గెలవడంలో మాత్రం నా సహజ వ్యక్తిత్వాన్నే పెట్టుబడిగా పెట్టాలని ప్రయత్నించాను.

రశ్మీ! సంధ్యావార్చటానికి వెళుతున్న రాముడు తన విల్లును ఓ చెట్టుకు జారవేశాడట. తిరిగి వచ్చిన రాముడు బాణం కొనక్రింద కొనవూపిరితో కొట్టుకుంటున్న ఓ కప్పనిచూసి జాలిపడి, 'నేను చూడకుండా చేసిన పొరపాటుకు క్షంతవ్యుడ్ని. ముందే ఎందుకు కేకవేసి నా తప్పిదాన్ని గుర్తుచేయలేదూ అని అడిగాడట. ఎవరన్నా నాకు అన్యాయంచేస్తే 'రామా రామా' అంటూ వేడుకుంటాను. రాముడే నాకు ముప్పు తెచ్చినపుడు ఇంకే దేవుడ్ని వేడుకోనూ అందట....నా జీవితం అటువంటిదే రశ్మీ!

నదీతీర సైకతాలలో నిలబడి ఆకాశంలో బారులుగా ఎగురుతున్నకొంగల్ని, నర్మ గంభీరంగా సాగిపోయే నదీమతల్లిని రోజూ నాకు తాయిలం అందించే రేగిచెట్లను, ఒడిని అందించి నా పద ఘట్టనకు లయబద్ధంగా శృతిపలికే కొండల్ని చూసి మురిసిపోవడమే చేతనయిన నేను ఎందుకిలాంటి రొంపిలో పయనిస్తున్నదీ మీకు చెప్పాలని వుంది....మీకు మాత్రమే వివరించాలనుంది."

కొన్ని నిముషాల అవకాశమిస్తే నా గుండె వాకిళ్ళను తెరిచి మీ కోసం త్రికరణశుద్ధిగా ఎంత తపించిపోతున్నానో తెలియపరచాలనుంది.

ఆ అదృష్టాన్ని నాకు కలిగించరూ!

ఇప్పటికి మీకేమీ కాని
భాస్వంత్!

ఉత్తరాన్ని మడిచి షర్టుజేబులో వుంచాడు.

బడలికగా వుంది.

కిటికీ దగ్గరగా వెళ్ళి నిలబడ్డాడు.

చీకటి వెలుగుల సమ్మేళనంలా నిశ్శబ్దం ముడుచుకున్న ప్రకృతి చుట్టూ.

ఎందుకిలా మధనపడుతున్నాడు.

తనను కాదంటున్న ఆమె స్నేహంకోసం ఎందుకు వెంపర్లాడుతున్నాడు.

ఏ పాశం తననిలా బంధించి ఈ మజిలీకోసం ఆరాట పెడుతూంది.

నిశ్శబ్దాన్ని చీల్చుతూ గదిలో ఫోన్ రింగయింది.

ఆలోచనల నుంచి తేరుకుని ఈవేళలో ఫోన్‌చేసింది ఎవరా అనుకుంటూ రిసీవర్ అందుకున్నాడు.

నిశాంత గొంతు భీతితో వణికిపోతూంది. ఆమె చెప్పేది పూర్తిగా వినే సహనం లేనట్టు ఉద్వేగంగా క్రేడిల్ చేశాడు.

అంతే....ఓ శతృఘ్నిలా బయటికి దూసుకుపోయాడు.

18

ఆఘమేఘాలపై ఉపాధ్యాయ ఇంటిని చేరుకున్న భాస్వంత్ ద్వారం దాటగానే టక్కున ఆగిపోయాడు.

స్మశాన స్థబ్దత ఆవరించివున్న అక్కడి వాతావరణం చూడగానే మనసేదో కీడును శంకిస్తుంది.

ఇంటి నౌఖరులంతా నిశ్శబ్దంగా నిలబడి వున్నారు ఉపాధ్యాయ గది ముందు.

నెమ్మదిగా బలాన్ని కూడగట్టుకుంటూ చాలా నెమ్మదిగా గదిలోకి నడిచాడు.

అక్కడ డాక్టర్ కూడా వుండటంతో భాస్వంత్ అనుమానం మరింత బలపడింది. ఒక్క అంగలో ఉపాధ్యాయ పడుకుని వున్న బెడ్‌ని చేరుకున్నాడు. ఉపాధ్యాయ స్పృహలో లేడు. ఉండుండి వెక్కి పడుతున్న అతడి పెదవుల మధ్యనుంచి రక్తం స్రవిస్తుంది అతడి ఒంటిలో ఇక ఇమడలేనట్లు.

నిశాంతను గాని బాబీనిగాని పరామర్శించే సాహసం చేయలేనట్లు డాక్టర్‌కేసి చూసేడు.

"డాక్టర్ అనుమాన నివృత్తికోసం నెమ్మదిగా పిలిచాడు.

"ఆయన లివర్ పూర్తిగా దెబ్బతింది" నిస్సహాయంగా చూస్తూ "పరిస్థితి పూర్తిగా చేజారిపోయింది. మహాబ్రతికితే మరికొన్ని గంటలు...." అన్నాడు.

"నో" ఒక ఆర్తనాదం భాస్వంత్ గుండె లోతుల్లోనుంచి ఉబికి రాబోయి ఓడి కంఠంలోనే సమాధి అయిపోయింది.

నిశ్శబ్దంగా తలతిప్పి బాబీ వేపు చూసాడు. నిశాంతను కావలించుకుని వెక్కిపడుతున్నాడు.

బ్రతికున్న తల్లికి ఎప్పుడో దూరమయ్యాడు. ఇప్పుడు మరికొద్ది క్షణాల్లో బ్రతకని తండ్రికీ దూరం కాబోతున్నాడు.

ఓదార్పులకీ, భాష్యాలకీ అందని భయంకరస్థితి అది. సరిగ్గా అప్పుడు చూసాడు భాస్వంత్.

కళ్ళు తెరిచిన ఉపాధ్యాయ తననే గమనిస్తున్నాడు. అంతేకాదు. ఏదో చెప్పాలని ఇక చెప్పే అవకాశం ఇంతకుమించి రాదని చాలా ఆరాట పడుతున్నాడు.

ఆ స్థితిలోకూడా చెక్కుచెదరని ఆత్మవిశ్వాసం ప్రేతకళతో నిండిన అతడి అందమైన కళ్ళల్లో వెలుగుతున్న సంతృప్తి భాస్వంత్‌ను ఎంత దారుణంగా కదిలించాయో అంటే భాస్వంత్ కళ్ళల్లో గిరుక్కున నీళ్ళు తిరిగాయి.

ఏంటీ! ఎండిపోయాయనుకున్న కళ్ళలో ఇంకా నీళ్ళు మిగిలే ఉన్నాయా....లేక మహోన్నతుడైన ఈ మనిషికోసం మనసు రక్తాన్ని అశ్రువులుగా మార్చి సాగనంపుతూందా....

మరో అరక్షణంలో భాస్వంత్ ఉపాధ్యాయ సమీపంలో కూర్చున్నాడు....

పైకి లేవాలని ప్రయత్నిస్తుంటే భాస్వంత్ సహకరించాడు.

ఒక పసికందును పొదివి పట్టుకున్నట్లు చేతులతో అతడ్ని స్పృశిస్తూ గుండెలకు హత్తుకున్నాడు.

నెమ్మదిగా పెదవుల్ని తెరిచాడు "భా....స్వ...." ఆ ఒక్క పదం సైతం పూర్తికాలేదు....భళ్ళున రక్తాన్ని కక్కేసాడు. భాస్వంత్ షర్టంతా రక్తంతో తడిసిపోయింది.

"డాడీ" బాబీ మూలుగు సమీపంలోనుంచి.

ఆ పిలుపు బహుశా ఉపాధ్యాయ గుండె కొసల్ని తాకి ఎంత కలచివేసిందో అతడి కళ్ళల్లోనూ రక్తపు జీరలు....

"భా....స్వం....త్...." రొప్పుతూ కడంటి పోతున్న ప్రాణాలను బలంగా ఆపే ప్రయత్నం చేస్తూ అంటున్నాడు. "నాకిక దిగుల్లేదు....నేను లేకపోయినా....బాబీకి అమ్మగా నిశాంత ఉంది....అందుకే నా వీలునామా అంతా నిశాంత....పేరునే రాసేసాను....కాని నిశాంత ఒంటరిది....నీ అంత....నీకోసం....భా...." ఇంకా ఇంకా చెప్పాలని ఎగిరిపోతున్న హంస రెక్కల్ని బలంగా పట్టుకుని మనసంతా విప్పి చూపాలని చాలా ప్రయత్నించాడు.

సాధ్యం కాలేదు....

సరిగ్గా ఇక్కడ ఈ స్థితిలోనే ఉన్నవాడైనా అంతకుమించి మనసున్నవాడిగా పురుషుల్లో పుణ్యపురుషుడిగా ఎందరి హృదయాల్లోనో శాశ్వతంగా నిలిచిపోయిన ఉపాధ్యాయ అధ్యాయం ముగిసిపోయింది. ఎక్కడో ఒక తోకచుక్క రాలిపోయింది.

నడిరేయి నిట్టూర్పులా ఒక తీతువు రోదించింది.

ప్రపంచానికి అందని ఒక అముద్రిత కావ్యంలా చిరిగిన మానవత్వపు చివరి పుటల్ని తన చేతికందించి కనుచూపు మేరకు కదిలి వెళ్ళిపోయిన ఉపాధ్యాయ శరీరాన్ని మరింత బలంగా గుండెలకు హత్తుకున్నాడు భాస్వంత్....

అతని కోసమే పదిలంగా దాచుకున్నట్లు కళ్ళు ఆగకుండా అశ్రువుల్ని వర్షిస్తున్నాయి....

"ఓ మనీషీ! ముష్కరుల పదఘట్టనలో గుండె పగిలిన భూదేవి నిస్త్రాణగా రోదిస్తుంటే నీ కన్నీళ్ళను తుడవటానికి నేనున్నానమ్మా అంటూ మానవత్వపు మొలకల్ని నీ ప్రేమామృతంతో మొలిచి పెంచి పెద్దచేస్తూ అలిసిన మా హృదయాల్లో అసదృశమైన ఒక స్థానాన్ని కల్పించుకున్నావు. కాష్టంలో నువ్వు కాలినా ఒక కమనీయ కృతిలా మా స్మృతిలో మిగిలిపోయావు. పయనమైన ఓ ప్రియనేస్తం....మన చిన్న పరిచయంలో నేను నిర్మించని ఆలయంలో దేవుడిగా మిగిలి పంచభూతాల్లో లయమైన నీకు ఇదే నా అశ్రుతర్పణం."

* * * *

ఒక చిత్రమైన అధ్యాయం ముగిసిపోయింది. నిన్న సంఘం చెక్కిన శిథిల శిల్పమైన నిశాంత ఇప్పుడు లక్షాధికారిణి.

ఒక విరాగిణిగా మారింది. కాని నిర్వేదంతో మిగిలిపోలేదు. తనకంత స్థానాన్నిచ్చి వెళ్ళిపోయిన ఉపాధ్యాయ అసంపూర్తి గ్రంథానికి తనే చివరి పేజీగా మారి పత్రిక బాధ్యతను తీసుకుంది. ఎవరూ లేని బాబీకి ఇప్పుడు అన్నీ తానే అయింది.

భాస్వంత్‌కు కొన్ని రోజులపాటు ఉపాధ్యాయ ఆలోచనలు వెంటాడాయి. మనిషి జీవితం ఎంత చిన్నదో గ్రహించినట్లు తండ్రి చివరికోరిక సాధ్యమైనంత త్వరలో నెరవేర్చాలన్న దృక్పథంతో విజ్ఞానభారతి నిర్మాణ బాధ్యతలు నాగరాజుకి అప్పజెప్పి అతడ్ని వైజాగ్ పంపేశాడు.

తన దగ్గరున్నది సరిపోయినంత డబ్బుకాదని తెలుసు. అయినా నిర్మాణం ఆగకుండా చిల్లరదేవుళ్ళపై అస్త్రాలను సారించి డబ్బు సంపా

దించాలన్న ఆలోచన కలవాడు కాబట్టి ముందు నిర్మాణ కార్యక్రమాలు ప్రారంభించమన్నాడు.

ఒకరోజు హఠాత్తుగా నిశాంత దగ్గరకు వచ్చాడు భాస్వంత్. ఉపాధ్యాయ చనిపోయిన తర్వాత భాస్వంత్ రావడం ఇది రెండోసారి. అంతే.

"మనం అర్జెంట్‌గా వైజాగ్ వెళ్ళాలి నిశాంతా" అంటూ ఆమె తండ్రి పరిస్థితి బాగోలేదని అతడు తెలుసుకున్న సమాచారాన్ని అందించాడు.

ఒక్క క్షణంపాటు దిగులుపడిందేమోకాని పూర్వంలా కుమిలిపోలేదా వార్త విని. జీవితం అందిస్తున్న అనుభవాల ఒరిపిడిలో ఆమె చాలా రాటుదేలిపోయింది.

అందుకే మరోమారు భాస్వంత్‌కి భార్యగా అవతారమెత్తి బయలుదేరింది అతడితోపాటు.

* * *

"అమ్మా నిశాంతా" అనసూయ మొహం చెల్లనట్టే నేలవేపుకు చూస్తూ కూతుర్ని పిలిచింది.... "అబ్బాయి నువ్వూ కొన్నిరోజులపాటు ఇక్కడే వుంటే మాకు కాస్త ధైర్యంగా వుంటుందమ్మా" చావు బ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న భర్తను చూస్తూ అందామె.

తల్లిని అపాదమస్తకం చూసింది నిశాంత....తన తండ్రి మరణ యాతన కన్నా ఒకనాడు తన విషయంలో చేసిన తప్పిదానికి సిగ్గుతో కుమిలిపోతూందని అర్థమౌతుంది.

డాక్టర్లు సైతం ఇదమిద్ధంగా తేల్చి చెప్పలేని స్థితిలో వున్న తండ్రిని చూస్తుంటే నిశాంతకు కళ్ళనీళ్ళ పర్యంతమౌతూంది.

అయినా తమాయించుకుంది. అంతకు పూర్వమే ఢిల్లీ ఇన్‌స్టిట్యూషన్ మెడికల్ సైన్సెస్‌నుంచి కొందరు స్పెషలిస్టులను రప్పించే ప్రయత్నంగా డాక్టర్లతో మాట్లాడి డబ్బు ఏర్పాటు చేసింది.

ఇప్పుడు ఆమెకు మనశ్శాంతికన్నా దానికి పనికిరాని బోలెడంత డబ్బుంది. ఎంతైనా ఖర్చు చేయగల స్థితిలో ఉందామె.

"అమ్మా....ఉండడానికి అభ్యంతరం లేదుకాని....అవతల బోలెడు పనులున్నాయి. తరచూ చూడడానికి వస్తుంటాను...."

అనసూయ కూతుర్ని పట్టుకుని భోరుమంటూ ఏడ్చేసింది. తామింత చేసినా తమగురించి ఇంతలా ఆలోచిస్తున్న కూతురు కళ్ళలోకి చూసే ధైర్యంలేకపోతుందామెకు.

తల్లి మనస్సును అర్థం చేసుకున్న నిశాంత నిర్లిప్తంగానే తల్లి తల నిమిరింది. "అమ్మా! నువ్వంటే నాకు కోపం లేదమ్మా....బహుశా నీ స్థానంలో నేను నిలబడ్డా ఆ రోజు అలాగే ప్రవర్తించేదాన్నేమో."

భాస్వంత్‌ను ఒక్క క్షణంపాటు చూసి తలదించుకుంది అనసూయ. "బాబూ భాస్వంత్ తల్లిగా నేను క్షమించలేనంత పొరపాటు చేసాను.... అయినా నా కూతురికి న్యాయంచేసి దానికో జీవితాన్ని ప్రసాదించావు.... మాటల్లో తప్ప నీకు కృతజ్ఞతలు తెలపలేని నిస్సహాయురాల్ని."

భాస్వంత్‌తోపాటు నిశాంత బయలుదేరింది మరో అరగంట తర్వాత....

అయితే....

భాస్వంత్‌గాని నిశాంతకాని గమనించలేదు....అప్పటికి కొన్ని క్షణాల క్రితమే లోపలికి రాబోయిన రశ్మి కిటికీ దగ్గరే నిలబడిపోయిందని అంతకు కొన్ని గంటల క్రితమే రామయ్య తాతద్వారా భాస్వంత్ తన బావని ఆమె తెలుసుకుందని....రశ్మి కళ్ళల్లో అశ్రువులు నిర్వేదంగా రాలి పడుతున్నాయి.

* * * *

"రాజా"

ఒక హోటల్ గదిలో రాజాకి గ్లాసులో లిక్కర్ పోసి అందిస్తూ జీవన్‌రావు ఒక కొత్త పథకానికి అంకురం వేస్తున్నాడు. "నీలాంటి స్టేటస్ వున్నవాడ్ని ఒక సామాన్య కుటుంబీకురాలైన రశ్మి అంతలా అవమానించడం భరింప శక్యంకాని విషయమైనా మీ నాన్నగారే ఆమెను క్షమించి వదిలిపెట్టినపుడు నువ్వలా ఆమెకోసం వెంపర్లాడడం నాకు నచ్చడంలేదు."

ఇరవయ్యేళ్ళ వయసులో తండ్రిస్థాయి పరంగా ఒంటపట్టిన రాజా అహాన్ని ‘బీరు‘పోసి పెంచుతున్న జీవన్‌రావు అతనికది కూడదంటూనే రెచ్చగొడుతున్నాడు.

"జీవన్‌రావ్...." విషాగా చూసేడు రాజా "నేను మహా మొండి ఘటాన్ని....ఓటమిని అంగీకరించేటంత తక్కువస్థాయిలో లేనివాడ్ని. మానాన్న అడ్డమొస్తే మాత్రం నేను చేతులు ముడుచుకు కూచుంటానని ఎలా అనుకుంటున్నావు."

నవ్వేడు జీవన్‌రావు ఒక తోడేల్లా. "అది నాకు తెలుసు రాజా! ఆ రోజు నీ మొహంమీద రంగుపోసి అందరిమధ్య అల్లరిచేసింది....నిజమే అది నాకూ తలతీసినంత పనిలా అనిపించింది. కాని అది కూడా సామాన్యురాలు కాదే.... పైగా భాస్వంత్‌గాడికి మేనకోడలు. నువ్వేమన్నా అల్లరి చేద్దామని ప్రయత్నిస్తే వాడు మధ్యకొస్తాడు."

"వాడుకాదు వాడి తలలో జేజమ్మ కూడా నన్నేం చేయలేదు" హుంకరించాడు.

"తొందరపడుతున్నావు రాజా! రశ్మిలాంటి పొగరున్న ఆడదాన్ని లొంగదీసుకోవడం అంత సులభంకాదు...."

రెచ్చిపోయాడు రాజా. "నన్ను వెధవకింద జమకడుతున్నావా జీవన్‌రావ్."

"కాదు రాజాబాబూ! కాదన్న ఆడదాన్ని కాళ్ళదగ్గరకు తెచ్చుకోవడమన్నది మగసిరి అనిపించుకుంటుందన్న విషయం నేనూ ఒప్పుకుంటాను గాని దానికి నీ సాహసం సరిపోతుందా అని ఆలోచిస్తున్నాను...." ఆగేడు. రాజా ముఖ కవళికల్ని గమనిస్తూ "ఈ విషయంలో ఓడిపోయానూ అని బాధపడేకంటే మరచిపోవడమే నయమనుకుంటున్నాను."

"జీవన్" మైకంలో ఓ బాటిల్ నేలపైకి విసిరాడు. భళ్ళన పగిలిపోయింది.

తన పాచిక బలంగానే పనిచేస్తున్న విషయం జీవన్‌రావుకి అర్థమైపోయింది.

"కోపం తెచ్చుకోకు రాజాబాబూ! నీ శక్తియుక్తులు నాకు తెలిసినా రశ్మి విషయంలో మాత్రం అవి అమలుపరచడం సాధ్యమా అని...."

"స్టాపిట్...." ఉద్రేకంతో అరిచి పైకిలేచాడు. "నా గురించి నువ్వెంత తక్కువగా అంచనా వేస్తున్నావో అర్థమైంది జీవన్‌రావ్ ఎదురులేని నా తండ్రికి పుట్టినవాడ్ని నేను...."

హఠాత్తుగా రశ్మి అన్నమాటలు గుర్తుకొచ్చాయి.

"మీ అమ్మనడుగు నిన్నెవడిక్కందో" అంటూ ఆమె ఎగతాళిగా అన్న వాక్యాలు సైతం ఆ క్షణాన గుర్తుకొచ్చి నిలువునా కంపించిపోయాడు రాజా.

"మిస్టర్ జీవన్‌రావు ఆ పొగరుగల ఆడదానికి పాఠం చెప్పడం నాకు ఒక సమస్యకాదు. త్వరలోనే నీకు నిరూపించబోతున్నాను" అంటూ ఆవేశంగా బయటికి నడుస్తూ దభేలున తలుపు మూసేడు.

జీవన్‌రావు పెదవులపై కర్కశమైన ఓ చిర్నవ్వు మెరిసింది. భాస్వంత్‌పై పరోక్షంగా దెబ్బతీసే ప్రయత్నంగా ఒక చిన్న నిప్పురవ్వ రగిల్చాడు.

అదిచాలు ఈ కథ అనూహ్యమైన కొత్తమలుపు తిరగడానికి....

జీవన్‌రావు సామాన్యుడు కాదు....కార్మిక నాయకుడిగా మేధావుల్ని సైతం వెధవాయిలుగా మార్చగల ప్రజ్ఞగలవాడు.

ఆ రోజే తన మిత్రబృందంతో రశ్మిని బలవంతంగా ఊరి పొలిమేరలకు లాక్కుపోయే పథకం వేశాడు రాజా. అటు రాజకీయాల్లోనూ ఇటు పోలీసు వర్గాల్లోనూ చాలా పరిపతిగల ప్రభంజనరావు కొడుకు.

* * * *

"ఎవరమ్మా నువ్వు" సమీపంలో వచ్చి నిలబడ్డ రశ్మిని చూస్తూ అడిగింది అనసూయ.

తనకు అన్ని రోజులూ తారసపడిన వ్యక్తి భాస్వంత్ అని రామయ్య తాత ద్వారా తెలుసుకుని నిశాంతను చూడాలని వాళ్ళ ఇంటికి వెళితే ఆమె ఎప్పుడో చచ్చిపోయిందన్నారు. ఓదార్పుగా ఒకసారి అనసూయమ్మని

కలవాలని వూరి వాళ్ళు చెప్పిన వివరాల ప్రకారం రశ్మి హాస్పిటల్‌కు వచ్చింది.

తీరా అక్కడకు వచ్చేక యాదృచ్ఛికంగా నిశాంతనూ భాస్వంత్‌నూ చూసింది.

ఒక్కక్షణం అక్కడ జరుగుతున్న చర్చ విని వుండకపోతే 'బావా' అంటూ ఆమె లోపలికి దూసుకుపోయేదే....కాని నిశాంత బ్రతికివుందని తెలుసుకుని తనకు ఒకనాడు తాళికట్టిన బావే ఆమెకు భర్తని గ్రహించిన మరుక్షణం ఆగిపోయింది కిటికీ వారన.

రశ్మి తాను ఎవరన్నదీ చెప్పలేదు. కాని తను సుబ్బులుకీ నిశాంతకీ బాల్యస్నేహితురాలు అంది. ఒకచోట కలిసి చదువుకున్నామని చెప్పి మభ్యపెట్టింది అనసూయను.

“చిన్నతనంలో వరదల్లో సుబ్బులు చనిపోతే దురదృష్టవశాత్తూ మోసపోయిన కూతుర్ని తామే సంఘం దృష్టిలో చంపేసామని” తెలియజెప్పుతూ చెడిన తన కూతురికి జీవితాన్ని అందించిన భాస్వంత్‌ను ఒక దేవుడిగా అభివర్ణించింది.

అంతా నిశ్శబ్దంగా వుంది. కళ్ళల్లో నీరు పేరుకుంటుంటే చిట్టిబావలో ఒక దేవుడు కనిపించాడు. పవిత్రురాలై తిరిగి వచ్చిన సీతను అగ్నిపునీతవు కమ్మని శాసించిన రాముడికన్నా గొప్పవాడిగా అనిపించాడు.

“బావా” మనసులోనే ధ్యానించింది. “ఒకవేళ మళ్ళీ నీ మొహం చూపిస్తే నేను ఆత్మహత్య చేసుకుంటానని అమ్మతో తాత ఆనాడు అంతగా బంధాలే తెంచుకొని వుండకపోతే మన బాంధవ్యాలే కొనసాగి వుంటే నీకు నేను భార్యగా మిగిలేదాన్ని. అందరితోపాటు నేనూ చచ్చిపోయి వుంటాననుకున్నావు కదూ.”

మనసంతా విషాదం పేరుకుంటున్న నిశ్శబ్దంగా నిలబడిపోయింది.

“బావా! సీతమ్మ మెడలోని తాళితెచ్చి జ్ఞానం తెలీని వయసులో నా మెడనలంకరింపజేసావు.... అమ్మకు తెలిస్తే నన్ను చావగొడుతుందన్న భయంతో నిశాంతకిచ్చి దాయమంటే దాన్ని దాచుకున్న నా ప్రాణస్నేహితురాలికి నువ్వు భర్తవయ్యావు. చెడిన ఆడదానికి అంతటి అపురూపమైన స్థానాన్నిచ్చిన నిన్ను ఏమని పిలవను. ఎలా కొలవను. ఇది ఎవరితప్పూ కాదు బావా. దైవశాసనం....”

రశ్మి తన గమ్యానికి బయలుదేరింది అదే రోజు....

ఆ మరుసటి రోజు—

మసకచీకట్లు అలుముకుంటున్న అసురసంధ్యవేళ రాజా తన బలగంతో రశ్మి ఇంటిని చేరుకున్నాడు.

జీప్ ఆగడం ఆ చిన్ని సందులో అందరూ చూసేరు. కాని తాగిన మైకంలో యమకింకరుల్లా రశ్మి ఇంటిలోకి రాక్షసంగా దూసుకుపోవడం చూసికూడా ఎవరూ ఆపలేకపోయారు.

“రశ్మి”

రాజా అరుపుతో ఆ గది ప్రతిధ్వనించింది.

19

హఠాత్తుగా లోపలికి దూసుకువచ్చిన ఆగంతకుని చూసిన రశ్మి తల్లి ముందు వడలిన ఆకులా భయంతో వణికిపోయింది.

తాగిన మైకంలో ఒక క్రూరమృగంగా మారిన రాజా ఇంటిలో రశ్మి జాడలేకపోవడంతో “ఏదే నీ కూతురెక్కడ” అంటూ నిలబడే శక్తి సైతం లేని ఆమె జుట్టు పట్టుకుని గట్టిగా నిలదీసి నోటమాటరాని ఆమె స్థితికి మరింత పేట్రేగిపోతూ ఆమెను ఓ మూలకునెట్టి కసితో అందిన సామాన్లని నేలపై విసిరికొడుతున్నాడు.

బయట జనంపోగైనా వినోదాన్ని చూస్తున్నారు తప్ప ఎవరూ జోక్యం చేసుకోవడంలేదు.

పొరుగింటికి నిప్పంటుకుంటే ఆ నిప్పు తమ ఇంటికి వ్యాపించకూడదన్న స్వార్థంతో నీరుపోసే అక్కడి ప్రేక్షకులు ఇప్పుడు రగులుతున్న హోమంలో మాత్రం తాము సమిధులు కావడం ఇష్టంలేనట్టు చాలా ఉత్సాకతగా అంతా గమనిస్తున్నారు.

సుమారు పదిహేను నిముషాల మారణకాండ తర్వాత అలసిన రాజా ఇల్లుపీకి పందిరిగామార్చిన ఉన్మాదంలోనే అన్నాడు. "నీ కూతురికి చెప్పు రాజా వచ్చాడని తనకు జరిగిన అవమానానికి వెంటాడి మరీ బదులు తీర్చుకుంటున్నాడని."

రాజా బృందం వెళ్ళిన పదినిముషాలవరకూ ఆమె తేరుకోలేకపోయింది. ఆ సమయంలో ఇంట్లోలేని భర్తగురించి ఆమె ఆలోచించడం లేదు. రెండు రోజుల క్రితం స్నేహితురాలు దగ్గరకని చెప్పి వూరువెళ్ళిన ఒక్కగానొక్క కూతురు ఒక విషవలయంలో చిక్కుకుందని మాత్రం అర్థం చేసుకుని కళ్ళనీళ్ల పెట్టుకుంటూ వుండిపోయింది.

ఊరునుండి వచ్చిన రశ్మి అమాంతం తనని కావళవలించుకుని 'ఏం జరిగిందే' అంటూ భోరున ఎడుస్తూ జరిగింది చెప్పగానే నిశ్శబ్దంగా వూరుకోలేదు రశ్మి. తల్లి వారిస్తున్నా వినకుండా ఆ రాత్రే వెళ్ళి పోలీస్‌స్టేషన్‌లో రిపోర్టిచ్చింది.

చట్టం తనకేదో మేలు చేస్తుందన్న నమ్మకం లేకపోయినా కనీసం ఇకముందైనా అన్యాయం జరగకుండా ఆపుతుందని తలపోసిన ఆమె తను చేసింది వృథా ప్రయత్నమని తెలుసుకోవడానికి రెండురోజులు పట్టింది.

రశ్మిలో మరింత మొండితనం పెరిగిపోయింది.

* * *

"రశ్మి"

మేనేజింగ్ ఎడిటర్ చాంబర్‌లో కూచున్న విశాంత తనను కలుసుకోవాలని ఓ యువతి వచ్చిందని చెప్పగానే స్లిప్‌వేపు చూస్తూ కొన్ని క్షణాలు నిర్లిప్తంగా ఉండిపోయింది.

రశ్మి....ఆమెకు చాలా పరిచితమైన పేరు.

ఉపాధ్యాయ మరణించిన రాత్రి భాస్వంత్ షర్టుపై అతను రక్తం వాంతి చేసుకోగా దాన్ని శుభ్రం చేయడానికి తీసుకున్నప్పుడు జేబులో దొరికిన ఉత్తరంపై ఎడ్రసు చేయబడింది ఆ పేరుగల యువతికే.

ఒకవేళ ఆ అమ్మాయి ఈ అమ్మాయే అయితే.

తన ఆశయం నెరవేర్చుకోవడం సులభ సాధ్యమౌతుంది.

మనస్పూర్తిగా దేవుడ్ని ధ్యానించింది విశాంత ఇద్దరూ ఒకరే కావాలని.

నిజానికి విశాంత పత్రిక వ్యాపకంలో ఎంత బిజీగా వుందంటే ఎవరికీ అపాయిట్ మెంట్ ఇవ్వగల స్థితిలో లేదు.

అయినా పంపించమని చెప్పింది పి.ఏతో. ఇప్పుడు ఆమె మనసులో ఒకటే ఆలోచన. మహోన్నతుడైన భాస్వంత్‌ను ఆకట్టుకోగలిగిన ఆ యువతి ఎవరో తను చూడాలి.

"గుడ్ మాణింగ్."

"ఓ మధురస్వరం వినిపించింది.

రక్తంతో తడిసిన భాస్వంత్ ఉత్తరంలో నుంచి తల పైకెత్తిన విశాంతకు ఎదురుగా నిలబడ్డ రశ్మిని చూడగానే క్షణంపాటు గుండె లయ తప్పినట్టు అనిపించింది.

దానిక్కారణం రశ్మి చూపుల్లో మెరిసే స్నిగ్ధమోహన గాంభీర్యం ఒక్కటే కాదు. ఎక్కడో ఎప్పుడో ఎ జన్మలోనో చూసిన అనుభూతి.

రెప్పలార్చకుండా ఆమెనే తదేకంగా చూస్తూ 'కూర్చోండి' అంది. విచిత్రమైన నిశ్శబ్దం ఆవరించింది కొన్ని సెకండ్లపాటు.

"మిమ్మల్ని ఎక్కడో చూసినట్టుంది. కాదు మిమ్మల్ని చూస్తుంటే బ్బులు అంటూ ప్రేం ముద్దుగా పిలిచే నాబాల్య స్నేహితురాలు రశ్మి గుర్తుకొస్తోంది. ఆమె బ్రతికి లేదన్నది నాకు తెలుసుకాబట్టి కనీసం మనం ఎప్పుడో కలుసుకునైనా ఉండాలి."

రశ్మి సైతం వివశురాలైంది ఆ వాక్యం వినగానే. నిజానికి రశ్మి చాంబర్‌లో అడుగుపెట్టగానే అక్కడ నిశాంత కనిపించడంతో ముందు అబ్బుర పడింది. కానీ మొహంలో ఏ భావమూ కనిపించకుండా జాగ్రత్త పడింది.

“చెప్పండి నిజంగా మనం ఎప్పుడో ఎక్కడో కలుసుకున్నాం కదూ” నిశాంత వాక్యం పూర్తికాకుండానే రశ్మి కనుకొలకులలో ఒక నీటి అల బయటికి జారే ప్రయత్నం చేసింది. స్మృతుల శకలాలు గుండెల్ని కుదిపేస్తుంటే భారంగా తలవంచుకుంది.

“సుబ్బులూ అమ్మచేసిన సున్నుండలే ఇవి నీకిద్దామని తెచ్చాను.”

“నాకిష్టమైతే మాత్రం చేసింది నీకోసంగా.”

“నీకోసం నాకోసం అన్నావంటే తంతాను ఆ? ఏదన్నా మనం ఇద్దరమే పంచుకోవాలి.”

ప్రాణానికి ప్రాణంగా చూసుకున్న నిశాంత మాటలు మనసు అట్టడుగు పొరల్ని సుతిమెత్తగా స్పృశించి గతాన్ని గుర్తుచేస్తుంటే బాధగా అనుకుంది.

“నన్నొక తోబుట్టువులా చూసుకున్న ఓ ప్రియనేస్తం....నీ ప్రశ్నకు బదులేమని చెప్పను. గొబ్బిపూలకోసం గుట్టకు వెళితే నా కాళ్ళకు ముళ్లెక్కడ గుచ్చుకుంటాయోనని ఒంటరిగా నువ్వే ఏరి ఇద్దరికీ వంతులుగా పంచిన నా చిన్ననాటి స్నేహితురాలిని గాబట్టి నన్ను ఎక్కడో చూసినట్టు భ్రమపడుతున్నావని నిజం చెప్పనా. లేక బోగి పండగ కోసం గోడలకు పిడకల్ని అద్దుదామంటే నా చేతులు నొప్పిపెడతాయని ఆరిందలా ఆ బాధ్యతనీ నువ్వే తీసుకుని అక్కలా నాకు అన్నీ సమకూర్చిన ఆనాటి ఆడపిల్లవి నువ్వు కావని అబద్ధం చెప్పనా. ఏమనగలను. నేను కొలిచిన దేవుడు నిన్ను తన తలపులలోకి పిలిచినందుకు చేతులు ముకుళించడం తప్ప నీ తపస్సు ఫలంగా నీకు శాపవిమోచనమైనందుకు ఆనంద భాష్పాలు చిందించడం తప్ప పంచుకోనమ్మా. మరణంలో తప్ప నీ మనువులో మాత్రం భాగం ఎన్నటికీ కోరను,”

తేరుకున్న రశ్మి తలవంచుకునే అంది– వాస్తవాన్ని చెప్పి, ఒక్కసారి చిన్ననాటి నెచ్చెలిని కావలించుకుని కన్నీటితో అభిషేకించాలని ఉన్నా “నిజంగా నేనుపుట్టిందీ, పెరిగిందీ భాగ్యనగరంలోనేకాబట్టిమనం బాల్యంలో సయితం కలుసుకునే అవకాశం లేదు” ఒక అందమయిన అబద్దంతో నిశాంత ఆలోచన్ని చెరిపేసింది.

“దెన్ సారీ....” మృదువుగా నవ్విన నిశాంత “చెప్పండి!” ఏం సహాయం కావాలి అంది అదే వాత్సల్యం ఆమె గొంతులో.

తల పైకెత్తిన రశ్మి భాస్వంత్ జోక్యాన్ని తప్ప, తను ఏ కాలేజీలో ఉద్యోగం చేసిందీ, రాజాతో ఎలా గొడవయిందీ, చివరికి పోలీసులు తన విషయంలో ఎలా అశ్రద్ధను చూపిందీ అంతా వివరించింది.

సమస్యతోపాటు సరిగ్గా ఇక్కడ నిశాంతకు మరోవిషయం స్పష్టంగా అర్థమైపోయింది.

భాస్వంత్ ఒకనాడు అదే కాలేజీలోకి వెళ్ళడం తను చూసింది కాబట్టి అతను ఉత్తరంలో ఎడ్రసు చేసిన రశ్మి, ఈ రశ్మి ఒక్కరే!

నిశాంత వూహల్లో ఆధ్యాత్మికమైన తృప్తి మెదిలింది. ఉన్నవాడి అహానికి నీరాజనాలు పట్టే బ్యూరోక్రసిలో ఒంటరిగా పోరాడి ఏదీ సాధించలేం రశ్మి! దీన్ని ప్రజావేదికపైకి మళ్ళించాలి. అటు ప్రభుత్వం ఇటు ప్రజలూ పత్రికలలో ప్రచురించబడిన ఈ వార్తతో కాస్త కదలాలి. ఇప్పుడు నేను చేయబోతున్నది అదే” ప్రభంజనరావుని గుర్తుచేసుకుంటూ అంది నిశాంత.

మౌనంగా వుండిపోయింది రశ్మి.

“అయితే ప్రస్తుతం మీరు ఉద్యోగం మానేసినట్టేనన్నమాట!”

“ఆ!”

“పోనీ అంతవరకూ నాకో సహాయం చేస్తారా?” అంది నిశాంత. “డబ్బుకే లోటులేని నేను మీకు లెక్చరర్‌గా ఎంత సంపాదించగలరో అంత ట్యూషన్‌ఫీజు ఇచ్చుకుంటాను. దానికోసం రాగలరా?”

రశ్మి వెంటనే జవాబు చెప్పలేకపోయింది.

బావ ఆలోచనలలో మెదిలాడు.

బావను భర్తగా భావించే అధికారం లేకపోయినా బావను చూస్తూ బ్రతికే అదృష్టానికయినా నోచుకోవాలి.

ఇది రశ్మి ఆలోచనైతే కనీసం రశ్మి కోసమైనా భాస్వంత్ తరచుగా వస్తే వారిని కలిసే ఓ అదృష్టంతో ఈ జన్మలో చెడిన తను ఆ విధంగా పొందిన పుణ్యఫలంతో మరుజన్మలో అయినా ముత్తయిదువగా బ్రతికే భాగ్యానికి నోచుకోగలనని నిశాంత తలపోస్తూంది.

రశ్మి అంగీకరించింది.

ఆ మరుసటిరోజే "అనుదినం" దినపత్రిక మొదటి పేజీలో ఒక ఆడపడుచు మాన ప్రాణాలకు భంగం వాటిల్లుతుంటే రిపోర్టుచేసినా పట్టించుకోని పోలీసు వ్యవస్థ గురించి రాజా రశ్మిల మధ్య కాలేజీలో ఆరంభమైన తగువు మొదలుకుని రశ్మి యింటిమీద దాడి, పోలీసు కంప్లయింట్ వరకూ ఒక బాక్స్ ఐటమ్‌లా ప్రచురించబడింది.

నిశాంత అంచనా తప్పుకాలేదు. తప్పని పరిస్థితులలో పోలీసు వర్గం రాజని అరెస్టు చేయడంతో తొలిసారి ఒక పిచ్చుక తన చంద్రాయుధాన్ని తిప్పికొట్టగలిగినందుకు అవమాన భారంతో ఉన్మాదిగా మారాడు ప్రభంజన రావు.

ఇదే సరిగ్గా ఇక్కడే రశ్మి అనే ఒక మధ్యతరగతి తెగువగల అమ్మాయి చిక్కుల్లో మరింత ఇరుక్కుపోయిన చివరి క్షణం.

* * *

"నిజానికి ఈ యింటిలో నేనొక సేవకురాల్ని మాత్రమే. ఉపాధ్యాయ గారు చనిపోతూ ఆస్తినీ, బాబీని నాకు అప్పచెబితే ఒక గార్డియన్‌గా చూసుకుంటున్నాను.

ట్యూషన్ చెప్పటానికి రశ్మి వచ్చిన మొదటిరోజే తన గురించి కొద్దిగా తెలియపరచింది నిశాంత....

ఆమె చెప్పింది....

వింటున్న రశ్మి దృష్టి అలవోకగా నిశాంత మెడలోని తాళిబొట్టుపై పడింది. అది ఒకనాడు బావ తనకు కట్టిన తాళే!

క్లుప్తంగా వివరించిన నిశాంత కథను పూర్తిగా వినాలనిపించింది. చిన్ననాడు వరదల్లో ప్రాణాపాయస్థితిని దాటి ఉన్నదంతా కోల్పోయిన తాము ఎలా భాగ్యనగరాన్ని చేరుకున్నదీ చెప్పాలని అనిపించింది. అయినా తమాయించుకున్నది.

ఏనాడో పెళ్ళయిన ఒక ఆడపిల్లగా భాస్వంత్ చేరువవుతుంటే మనసు వికలమై తాను తప్పుచేస్తున్నట్టు నిద్రలేని రాత్రులలో గడిపింది. గాని దైవికంగా తనలో ఆ సంచలనాన్ని రేపింది బావే అని ఇప్పుడనిపిస్తుంటే తాను మానసికంగా కూడా పవిత్రురాలే అన్న ఆలోచన రశ్మి గుండెల్లోని భారాన్ని తెలిక పరుస్తూంది.

దేవుడు గీసిన వైకుంతపాళిలో కాలం కళింగనాగై తను నిచ్చెన ఎక్కినా పరమపధాన్ని చేరకుండా అడ్డుపడింది.

అయినా తనకు ఆనందంగా వుంది....

ఒకనాడు తనకు మమతపంచిన మనిషే ఇప్పుడు బావతో జీవితాన్ని పంచుకుంది. మూడురోజులు గడిచింది బాబీకి ట్యూషన్ ప్రారంభించి.

అయినా భాస్వంత్ జాడలేదు. మనసులో బావను చూడాలన్న ఆసక్తి అస్పష్టంగా.

ఆ మరుసటిరోజు సాయంకాలమే బాబీకి ట్యూషన్ చెబుతుండగా భాస్వంత్ వచ్చాడు.

సరాసరి నిశాంతగదికి వెళ్ళిన భాస్వంత్ ఆమెద్వారా ట్యూషన్‌టీచర్ గురించి విన్నట్టు ఓ రెండు నిముషాల తర్వాత రశ్మి దగ్గరికి వచ్చి—"హల్లో" అన్నాడు ఓ సోఫాలో కూర్చుంటూ.

రశ్మిలో సన్నని ప్రకంపన....

ఎందుకో సూటిగా చూడలేకపోయింది. ఆమె హృదయం చాలా తీవ్రమయిన మథనంతో క్షణంపాటు నలిగి నెమ్మదిగా తేరుకుంది.

"బాబీ" భాస్వంత్ బాబీని దగ్గరకుపిలిచి "ఓచిన్నపని చేస్తావునాన్నా" అన్నాడు.

"ఏంటంకుల్ మమ్మీతో చెప్పి కాఫీ తెచ్చేదా?" ట్యూషన్ వదిలించుకోవాలన్న అవకాశం కోసం కాచుక్కూర్చున్నట్టు అడిగాడు.

"అదికాదు....నీకు అంకెలు బాగా వచ్చా?"

"ఓ!" అన్నాడు కళ్ళను చక్రల్లా తిప్పుతూ.

"అయితే మీ యింటి పెరటిలో ఎన్ని మొక్కలున్నాయో లెక్కపెట్టి కరెక్టుగా చెప్పాలి!"

"చీకటి అంకుల్" అనేసి ఆ! అయిడియా లైట్లు వెలిగించి అప్పుడు లెక్కపెడతా" అంటూ ట్యూషన్ బాధ తప్పిపోయినందుకు ఆనందంగా బయటకు పరుగెత్తాడు.

ఇద్దరిమధ్య నిశ్శబ్దం చాలా సేపటివరకూ....

ఇలా ఒంటరిగా భాస్వంత్ ముందు కూర్చోవడం ఆమెకు ఇబ్బందిగా వుంది.

పైకి లేవబోతుంటే "ఒక్కక్షణం" అన్నాడు ఆగమన్నట్టుగా.

"నేను వెళ్ళాలి" అంది తలవంచుకునే.

"మీతో మాట్లాడాలి!"

కిటికీలోంచి బయటికుచూస్తూనే "నాతో మాట్లాడాల్సిన దేముంటుంది?"

"నా గురించి మీకు చాలా అపోహలున్నాయి!"

మృదువుగా నవ్వింది—"నాకు సంజాయిషీ ఇవ్వాల్సిన అగత్యం లేదు."

"ఉంది రశ్మి!" రెండడుగులు ముందుకు నడిచాడు. మీకు చాల చెప్పాలి. ఆ అవకాశం కోసం చాలారోజులుగా ఎదురుచూస్తున్నాను.

"చిత్రంగా మాటాడుతున్నారు?"

"చిత్రంగా అనిపిస్తున్నది నా మాటలు కాదు– రశ్మి మీ ప్రవర్తన!"

చివాలున తలతిప్పి అతడి కళ్ళల్లోకి చూసింది నా ప్రవర్తన ఎలా వుంటేనేం. అయినా ఇదంతా నాతో ఎందుకు మాటాడాలనుకుంటున్నారు."

"ఎందుకంటే" ఒక్కక్షణం ఆగేడు. "నే కోరుకుంటున్న వ్యక్తి అకారణంగా అపార్థం చేసుకోవడం నేను భరించలేని విషయం కాబట్టి."

"వ్వాట్" సరిగ్గా వినలేదేమో అన్నట్టు రెట్టించింది.

"మీరేం మాటాడుతున్నారో మీకు అర్థమౌతూందా."

"ఇప్పుడు అర్థం కావాల్సింది మీకే" దృఢంగా పలికింది తన కంఠం.

"మిస్ రశ్మి! మనిషి జీవితంలో చాలామంది వ్యక్తులు తారసపడుతుంటారు. కాని అందరూ ఆత్మీయులు కాలేరు. నా జీవితంలో నన్ను అంతగా ఆకట్టుకొన్న ఒకే ఒక వ్యక్తి మీరు."

షాక్ తిన్నట్టుగా చూసింది రశ్మి. ఆమెలో సన్నని వణుకులాంటిది మొదలైంది.

మహోన్నతుడని భావించిన ఈ మనిషి పిపీలిక ప్రమాణానికి దిగజారిపోతున్నాడేం?

లేదు....ఆ తర్వాత అతడు చెప్పబోయే ఏ ఒక్కపదాన్ని తను విని తట్టుకోలేదు.

అందుకే గది బయటకు వెళ్ళాలని రెండడుగులు వేయబోతుంటే వేగంగా ద్వారాన్ని సమీపించిన భాస్వంత్ ఆమెకు అడ్డంగా నిలబడ్డాడు.

"ఏమిటిది" ఆమెకు దుఃఖం వచ్చేట్టుంది.

"దౌర్జన్యం మాత్రం కాదు."

"మరి" ఆమె కంఠం ఉక్రోషంగా వణికింది. "ఒక ఆడపిల్లను వంటరిగా గదిలో ఇలా నిలదీసే ప్రయత్నం చేయడాన్ని ఏమంటారు."

"రశ్మి" భాస్వంత్ కంఠంలో హటాత్తుగా వినిపించిన తీవ్రతకు ఆమె కంపించింది. ఏం తక్కువని నన్ను తప్పించుకు వెళ్ళాలనుకుంటున్నావు."

ఒక డైనమైట్‌లా ఆమె మస్తిష్కాన్ని చిన్నాభిన్నం చేసింది భాస్వంత్ అన్న చివరిమాట....

ఒక హిమాలయంలా ఆమె వూహల్లో ఎదిగిన ఒక వ్యక్తి కల్మషాలను సైతం కడుపులో దాచుకుని నిశ్చల గంభీర ముద్రతో అనంతం వరకూ వ్యాపించిన కడలిలా కనిపించిన తన బావ యుగాల తపస్సు అనంతరం ప్రత్యక్షమైన ఆది మధ్యాంత రహితునిలా కొన్ని క్షణాల క్రితం వరకూ తన తలపుల్లో తటిల్లతలా మెరిసిన మనిషి అనపాయ అనర్ఘ అనన్యాదృశ ఉత్కృష్ట స్థానం నుంచి రసాతలానికి జారిపడిన ఉపదేహికగా ఉద్వేష్టిత కాలనాగులా అనిపించడంతో అతడ్ని దాటుకుని ఆవేశంగా బయటకు నడవబోయింది.

ఒక లిప్తకాలపు వ్యవధిలో అనాలోచితంగా ఆమె చేతిని పట్టుకున్నాడు.

మరుక్షణం ఒక వజ్రాయుధపు తాకిడిలా ఆమె చేయి భాస్వంత్ చెంపను తాకింది.

చెడిన ఆడదాన్ని చేరదీసి అదో మహోన్నతమైన త్యాగంగా భావించి తను ఏంచేసినా చెల్లుతుందన్న అతడి అహానికి జవాబు చెప్పినట్టు రశ్మి తృటిలో ఆ ఇంటి గడపను దాటి అదృశ్యమైంది.

ముందుకు ఒక వెల్లువలా దూసుకుపోయిన నిశాంత నిస్తేజంగా నిలబడిపోతే....

మెదడు కదిలినట్టు నరాలు కదిలినట్టు కృత్తివాసుని త్రిశూల విచ్ఛేదనంతో కృపాణమ్ మనసు పొరలను చీల్చి కృశానువురగిల్చినట్టు ఘనా ఘన ఘీంకార సదృశ ఝర్ఝరి చంచరీకమై చలిత జ్వలిత భాండాగారమై తెరలు తెరలుగా అతడి స్మృతి మతి లయతప్పినట్టు నీరసంగా నిస్త్రాణగా నేలపైకి జారేడు తలపట్టుకుని.

"భాస్వంత్" నిశాంత పిలవలేదు. కాని అతనికేదో జరుగుతున్నట్టు అర్థం చేసుకుంది ముందుకు వస్తూనే.

నిరంతరం ఆలోచనలో లక్ష్యసాధనే ధ్యేయంగా ఏర్పడుతున్న మానసిక గ్లానితో అతడెంత అలసిపోతున్నదీ గ్రహించిన నిశాంత వెనక్కి

అపస్మారకంగా జారిగిలబడిన అతడ్ని చేరుకుని సుతిమెత్తగా అతడి ఫాల భాగాన్నే స్పృశించింది

ఒకటి.. ..రెండు....మూడు....నిముషాలు.

నెమ్మదిగా ఒక స్వప్నంలోలా కళ్లు తెరిచిన భాస్వంత్ నేత్రాలలో పేరుకున్న రక్తపు జీరల్ని చూసిన నిశాంత భయంగా ఒక్క అంగుళం వెనక్కి జరగబోయింది.

కాని అప్పటికే ఆలస్యమైంది.

భాస్వంత్ కళ్ళకు చేరువగా అ క్షణాన కనిపించింది కె.బి.ఎమ్. అన్న అక్షరాలతో నిశాంత మెడలో వేలాడుతున్న తాళిబొట్టు....

దశాబ్దాల తపన చిట్లిపోయింది.

గగన కుసుమంగా మారిన గతం అతడి గుండెలోతుల్లోకి క్షిపణిలా చేరి క్షతగాత్రుడ్ని చేసింది.

మైకం.. ..మమేకం....కాంక్షిత దగ్ధకాసారం....

కుంభినసు బుసలతో గండిపడిన తామసం లాలసత్వపు సంకెళ్ళను, ఛేదించుకుని ఒళ్ళు విరుచుకుంది.

అంతే.. ..

నిశాంతను అతడి చేతులు చుట్టేసాయి.

గడ్డకట్టిన కోర్కెల తేనెతుట్ట తారుణ్య తుటారమై ఆమె ఒడలును తుత్తునియల్ని చేస్తుంటే పట్టుసడలించే ప్రయత్నంగా రొప్పుతూ దూరంగా నెడుతూంది.

క్షణాల వ్యవధిలో ఒక అగ్ని హోత్రం అక్కడ రగిలింది.

చేతనత్వాన్ని కోల్పోయి అంతశ్చేతన సైరిక వాంఛా దగ్ధుడైన భాస్వంత్ ఒక సృషిప్తిలోకి జారినట్టు నిశాంతను నేలపైకి నెట్టాడు.

నిశాంత అలసిపోతూంది.

ఒక్కక్షణం అది వరమో శాపమో తెలీని స్థితిలో అతను అర నిముషం అలసటగా అగి వెలుగుకోసం తపస్సు చేసిన వేగుచుక్కలా

ఊర్ముల వేడి సెగలతో తన చెంపల్ని తాకుతున్న భాస్వంత్ రూపాన్ని చూస్తూ అశ్రువులు నేలరాలుతుంటే నెట్టబోయిన చేతులు బలంగా అతడ్ని చుట్టేసింది.

20

ఎన్ని నిముషాలు నిశ్శబ్దంలో నలిగిపోయాయో ఎన్ని క్షణాలు ఆ సంగమ గర్భాన స్తంభించి పోయాయో ఇద్దరికీ గుర్తు లేదు.

వాస్తవంలోకి వచ్చేసరికి భాస్వంత్ చేతులు పట్టుసడలాయి.

స్వేదంతో తడిసిన అతడి శిరస్సు సిగ్గుతో వాలిపోయింది.

అవనత వదనమైన నిశాంత నేత్రాలనుంచి నిర్లిప్తంగా నీళ్ళు రాలుతుంటే అది స్వప్నమో సద్దు చేయకుండా కాలం రగిల్చిన కలవరమో అర్ధంకాని స్థితిలో ఒక శిల్పంలా వుండిపోయింది.

ఏం చేసాడు తను....తనకేం జరిగింది....బాధగా కణతలునొక్కుకుంటూ ఆమె కళ్ళల్లోకి చూడలేని నిస్సహాయతతో "క్షమించు నిశాంతా" అన్నాడు గాద్గదికంగా చాలా సేపటి నిశ్శబ్దం తర్వాత.

మౌనంగానే వుండిపోయింది....

"ఉప్పెనలా ఉబికిన ఉద్వేగంతో నన్ను నేను మరిచిపోయానెందుకో. ఏం చేస్తున్నానో కూడా తెలీని స్థితిలో ఒక ఉన్మాదినై పాశవికంగా ఇంత దారుణం...." వాక్యం సైతం పూర్తిచేయలేకపోయాడు తనపై తనకే ఏహ భావం కలిగి నిలువునా దహించి వేస్తుంటే....

ఆమె మౌనం ఒక మృదంగనాదమై అతడి గుండెల్ని మరింత కలచివేస్తుంటే "చెప్పు నిశాంతా! అనాలోచితంగా జరిగిన ఈ పొరపాటు

సరిదిద్దుకోడానికి నన్నేం చేయమంటావో, ఏంచేస్తే నా పాపాన్ని నేను ప్రక్షాళన చేసుకోగలనో నువ్వే చెప్పు" ఒక దోషిలా అడిగాడు....

అప్పుడు చూసింది భాస్వంత్‌నో మారు....

ఒక మేరువు శాపవశాన అణువుగా కుచించుకుపోతున్నట్టు కనిపించాడు....

"ఎండిన ఇసుక ఎడారిలా మారిన నా బ్రతుకులో అరక్షణమైనా వర్షించిన ఒక మేఘ శకలంలా అడుగుపెట్టిన నా ప్రియమిత్రుడా! ఎందుకయ్యా కలవరపడతావు....ఏనాడో పంకిలమైన ఈ నా దేహం విధి రాసిన శోకగీతమే కాని దేవుడ్ని స్తుతించగల శ్లోకం కాదే.... నీ లోకంలోకి నేను అడుగుపెట్టినా లేదూ నాలోకంలోకి నువ్వు అరుదెంచినా అదినేను నోచని నోముల పుణ్యఫలమేకాని నువ్వు చేసిన పాపమెలా అవుతుంది. రాయిగా మారిన నేను నీ స్పర్శతో కరిగాను. రసాతలానికి జారిపడే రసగంగలా పతనంలో సైతం అణువంత పవిత్రతను సిద్ధించుకునే ప్రయత్నం చేసాను. నీ గుండెల గర్భగుడిలో అడుగుపెట్టే అర్హతలేని నాకోసం దిగివచ్చిన నా దేవుడా! నీ చరణాలను తాకే అదృష్టంలేని నేనే అవకాశవాదినై నీ బ్రతుకు గీతంలో ఒక చిన్న చరణంగా మారిపోయే స్వార్ధపరురాలినయ్యాను. నీకిది శాపమేమో కాని నాకు మాత్రం వరమేనయ్యా."

ఆమె అశ్రువులు భాస్వంత్ పాదాలను అభిషేకిస్తున్నాయి. "ఒకవేళ ఇది నేరమే అయితే అందులో నేనూ బాధ్యురాలినే."

అప్పుడు....సరిగ్గా ఆ సమయాన మరోమారు భాస్వంత్ దృష్టి ఆమె మెడపై పడింది....

ఒక క్షణంపాటు తననుతాను మరిచే వివశత్వం అతడిలో....

అమాంతం ఆమె మెడలోని తాళిబొట్టును చేతిలోకి తీసుకుని "ఇది....ఇది నీ దగ్గరికెలా వచ్చింది నిశాంతా" అన్నాడు చిన్ననాడు మేకుతో తనపేరును కె.బి.ఎమ్.గా చెక్కిన అక్షరాల్ని నీళ్ళు నిండిన కళ్ళతో చూస్తూ....

ముందు ఆమెకు అర్ధంకాలేదు అతడి ఆసక్తికి కారణం....

"విశాంతా" అతడి కంఠం వణికింది బాధగా. "ఇదే నేను....నా సుబ్బులుకి కట్టిన తాళిబొట్టు....ఇది చూసిన మరుక్షణమే నన్ను నేను మరచిపోయాను....ఇంత అనర్థానికి సిద్ధపడ్డాను."

అతడి వాక్యం ఇంకా పూర్తికాలేదు విశాంత విభ్రమంగా అడిగింది. "అంటే....మీరు....మా సుబ్బులు చెప్పిన చిట్టిబావ...."

"నీకు...." భాస్వంత్ పెదవులు అదురుతున్నాయి. "సుబ్బులు తెలుసా విశాంతా."

ఆమె కళ్ళనుంచి జలజలా నీళ్ళు రాలేయి. చెప్పింది బావచేత తాళి కట్టించుకున్న సుబ్బులు అమ్మ చూస్తుందన్న భయంతో తన దగ్గర ఎలా దాచిందీ ఆ తర్వాత వరదల్లో ఎలా దూరమయ్యిందీ.

భావరహితంగా వుండిపోయాడు భాస్వంత్.

తాళి ఒకరికి కట్టేడు....

తనకు తెలియకుండానే ఆ తాళిని అడ్డం పెట్టుకుని విశాంతకు ఒకనాడు భర్తగా నటించాడు.

ఇప్పుడు ఆ తాళిని చూసి వివశుడై ....

నీటిపొర అచేతనంగా అతడి కనుకొలకుల్లో నిలిచింది రాలిపడటానికి సంశయిస్తున్నట్టుగా.

* * *

ఉదయం పదిగంటలవేళ....

ఇంకా చల్లారని వేదనతో నలిగిపోతున్న భాస్వంత్ హఠాత్తుగా గెస్టుహౌస్‌కు వచ్చిన బంగార్రాజును చూసి "హల్లో" అన్నాడు యాంత్రికంగానే....

"నా కొంపలు మునిగాయి" కుర్చీలో కూర్చుంటూ తలపట్టుకున్నాడు బంగార్రాజు....ఆయాసంతో రొప్పుతున్నాడతను.

"ఏం జరిగింది" విన్న జరిగిన అవాంఛనీయ సంఘటన నుంచి తేరుకోలేక పోతున్న భాస్వంత్ యథాలాపంగా అడిగాడు.

"ఇంకా ఏం జరగాలి....ఫ్యాక్టరీ గోడౌన్ తగలబెట్టాను ఇన్స్యూరెన్స్ డబ్బుతో నష్టాన్ని భర్తీచేయాలని. ఇప్పుడు పూర్తిగా మునిగిపోయాను...."

భాస్వంత్ తేరుకుంటున్నాడు నెమ్మదిగా....ఏం జరిగి వుంటుందో అతనికి తెలీకకాదు....కాని బంగార్రాజు నోటినుంచే వినాలనే కుతూహలంతో అర్థంకానట్టు మొహం పెట్టాడు.

"ఆ ప్రభంజనరావు ఇన్స్యూరెన్స్ వాళ్ళకి ఏం నూరిపోసాడో అది కావాలని చేసిన పనిగా నిర్ధారించి క్లెయిమ్ తిరస్కరించారు....ఒక్క పైసా కూడా రాదని మొండిచెయ్యి చూపించారు...."

ఒక మేరువులాంటి బంగార్రాజు అలా నిస్సహాయంగా కంపించిపోతుంటే చూడముచ్చటగా వుంది భాస్వంత్‌కి.

"అంతటితో ఆగినా బాగుండేది. నీ స్నేహితుడు జగపతి కూడా అవకాశవాదంతో నన్ను ముంచే ప్రయత్నం చేస్తున్నాడు."

కర్కశంలా పెదవులపై మెరవబోయిన మందహాసాన్ని బలవంతంగా అదిమిపెడుతూ "అతనేం అంటున్నాడు" భాస్వంత్ ముందుకు వంగేడు.

"కేవలం కాగితాలపైనే స్పిరిట్ ముట్టినట్టు రాసుకున్నాం ఆనాడు....గోడౌన్‌లో లిక్కర్‌తోపాటు స్పిరిట్ కూడా తగలబడిపోయినట్టు ఆధారాలు సృష్టించి ఆ డబ్బుకూడా ఇన్స్యూరెన్స్ నుంచి పొందాలని పథకం వేసాం.... ఇప్పుడు హఠాత్తుగా నా దగ్గరకు వచ్చిన జగపతి తను పంపిన స్పిరిట్‌కి డబ్బు చెల్లించమంటాడు" గగ్గోలు పెట్టేస్తున్నాడు బంగార్రాజు....

భాస్వంత్ మనసులో పిచ్చి ఆనందం....నిస్సహాయత అన్నది మనిషిని ఎంత దారుణంగా ఓడించి గేలిచేస్తుందో ఒకనాడు తన తండ్రినీ అలాంటి స్థితిలో నిలబెట్టిన బంగార్రాజుకు సోదాహరణగా నిరూపించగల్గిన ఆ క్షణం భాస్వంత్ చాలా అపురూపంగా కోరుకున్నది...:

ఇప్పుడు ఇన్స్యూరెన్స్ క్లెయిమ్ విఫలమై లిక్కర్‌ను చేజేతులా తగలబెట్టుకోవడమేగాక కేవలం కాగితాలలో మాత్రం సరఫరా అయిన

పదిలక్షల రూపాయల స్పిరిట్‌కు డబ్బు చెల్లించాల్సిన పరిస్థితి ఎదురవ్వడం బంగార్రాజేకాదు అతడి స్థానంలో వున్న ఎంత పెద్ద బిజినెస్ మేగ్నెట్ అయినా భరించలేని విషయం.

“చెల్లించకపోతే ఏం చేస్తానంటాడా జగపతి” అడిగాడు భాస్వంత్ జగపతి పేరుతో వెళ్ళిన నాగరాజును గుర్తుచేసుకుంటూ....!

“కోర్టుకు వెళతానంటాడు.”

“మైగాడ్” ఆశ్చర్యాన్ని ప్రకటించాడు భాస్వంత్.

“వూహించలేకపోయాం భాస్వంత్....దీని వెనుక ప్రభంజనరావు ఇంతబలంగా పనిచేస్తున్నాడనిగాని ఆ జగపతి ప్రభంజనరావుకు ఆత్మీయుడని గాని మనం వూహించలేకపోయాం.”

“అంటే జగపతి ఇలా ప్రవర్తించడంలో ఉద్దేశ్యం ప్రభంజనరావు ప్రోద్బలమంటారా.”

“స్వయంగా వాడే అంటేనూ....” చాలా అసహనంగా నలిగిపోతూ అన్నాడు బంగార్రాజు....

“బంగార్రాజుగారూ....” బాధగా అన్నాడు భాస్వంత్ “బిజినెస్ మేగ్నెట్స్ మధ్య పోటీ అన్నది నాకు తెలుసుకాని ఇంత వ్యక్తిగతంగా కక్ష తీర్చుకునే ప్రయత్నం చేస్తారన్నది నేను సైతం వూహించలేని విషయమే. ఇప్పుడు జగపతి మీ దగ్గర డబ్బు గుంజే ప్రయత్నం మాత్రమే కాదు నాకు రావాల్సిన కమీషను సైతం దక్కకుండా చేసాడంటే దీనికంతటికీ మూలకారణమైన ప్రభంజనరావు నాకూ శత్రువే....”

కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా వుండిపోయాడు.

“బాధపడకండి రాజుగారూ....వ్యాపారంలో ఒడుదుడుకులూ గెలుపు ఓటములన్నవి చాలా సామాన్యమని మీకు తెలియని విషయం కాదు. మీరు జగపతితో పేచీపడకుండా ఆ డబ్బు చెల్లించేయండి....”

చాలా ఇబ్బందిగా తల పైకెత్తాడు బంగార్రాజు.

“దానికి రెట్టింపు లాభం వచ్చేట్టు నేను ఓపథకం వేస్తాను” సాలోచనగా చూసి భాస్వంత్ నెమ్మదిగా వివరించాడు తన ఆలోచనల్ని....

అంత బాధలోనూ బంగార్రాజు మొహంలో కొద్దిపాటి మెరుపు.

“ఈ పథకం అమలు జరిగిన మరుక్షణం ఇండ్‌లీవర్‌కు మీరు మాత్రమే సప్లయిర్ అవుతారు.... ప్రభంజనరావు సరఫరా చేసిన తవుడు నూనెతో విపరీతమైన నష్టానికిగురయ్యే ఇండ్‌రీవర్ యాజమాన్యం అతడ్ని రోడ్డుపట్టించే స్థితికి కారకులవుతారు” భాస్వంత్ కంఠంలోని బలమైన ఆ హామీకి అతడి పథకంలోని మేధస్సుకి ఉత్సుకతగానే తేరుకున్న బంగార్రాజు లేచాడు ప్రభంజనరావు ఎదుర్కోబోయే గడ్డు పరిస్థితిని గుర్తుచేసుకుంటూ.

వెళుతున్న బంగార్రాజును చూస్తూ దగ్ధమౌతున్న రోమ్ సామ్రాజ్యాన్ని పరికించి పరమానంద భరితుడయిన నీరో చక్రవర్తిలా నవ్వుతున్నాడు భాస్వంత్....

* * * *

ఒక ‘మారుతి’ పోర్టికోలో ఆగడం, అందులోంచి భాస్వంత్ దిగడమూ చూసిన ప్రభంజనరావు అంతవరకూ వున్న అసహనస్థితి నుంచి తేరుకుంటూ సాదరంగా ఆహ్వానించాడు.

“వెల్....ఎదిగిపోతున్నావు” అభినందనగా చూసేడు.

ప్రభంజనరావు అప్పటికే బంగార్రాజు తిన్న దెబ్బగురించి తెలుసుకుని వుంటాడన్నది భాస్వంత్ ఊహించలేని విషయం కాదు.

చాలా ఉత్సాహంగా తనను అభినందించాల్సింది పోయి ముక్తసరిగా మాట్లాడటం ఆశ్చర్యమనిపించింది.

“ఏంటదోలా వున్నారు?” అన్నాడు భాస్వంత్ ప్రభంజనరావు ముఖకవళికల్ని గమనిస్తూ.

“మిస్టర్ భాస్వంత్!” ఆ గది ప్రతిధ్వనించింది ప్రభంజనరావు పిలుపుతో—

"నీ మేనకోడలు అదే ఆ అమ్మాయి రశ్మి కొండను ఢీకొనే ప్రయత్నంచేస్తూంది. కేవలం నిశాంతనే మరో పిచ్చిక ఆసరాతో...."

ప్రభంజనరావు వంటి పలుకుబడిగల వ్యక్తి రశ్మి విషయంలో ఎంత నిస్సహాయుడై పోతున్నదీ భాస్వంత్‌కు తెలీని విషయంకాదు....

ఉన్న ఒక్కగానొక్క కొడుకు రాజుపై "అటెమ్ట్ ఫర్ రేప్" అక్రమ గృహప్రవేశం, హత్యా ప్రయత్నాల వంటి అభియోగాన్ని మోపారు పోలీసులు. దానికి కారణం మరుగున పడిపోతున్న విషయాన్ని నిశాంత పత్రికద్వారా బయటపెట్టడం దానిపై అసెంబ్లీలో ప్రతిపక్షాలు నిలదీయడం వంటివి జరగడంతో తప్పనిసరి పరిస్థితుల్లో పోలీసులు బలంగా జోక్యం చేసుకోవాల్సి వచ్చింది.

అప్పటికీ పరిచితుడైన డైరెక్టర్ జనరల్‌ని సంప్రదించినా తన నిస్సహాయతని ప్రకటించాడు.

"దీనిమూలంగా నాకేదో అనర్థం జరుగుతుందని కాదు భాస్వంత్.... ఇంత ప్రతిష్టగల నేను ఇలాంటి చిన్నవిషయం కోసం ఆలోచించాల్సి రావడం నేను ఇష్టపడని విషయం...."

పరువుగల ఇంటి ఆడపిల్లలను వంచించి వెలయాలిగా మార్చగల సమర్థుడూ, మానభంగాలతో ప్రాణాలు తీస్తూ కూడా బ్లూఫిలింస్ ద్వారా డబ్బు చేసుకొనే కిరాతకుడూఅయిన ప్రభంజనరావు అలా మాట్లాడుతూంటే చూడటం నిజానికి ఆహ్లాదంగా ఉంది భాస్వంత్‌కి.

"ఇంతటి సమర్థులయిన మీరు ఈ చిన్న విషయానికి ఇంత ప్రాధాన్యత నివ్వడం చిత్రంగా వుంది."

"ఇంతవరకూ ప్రాధాన్యత ఇవ్వలేదు భాస్వంత్. ఇకముందు ఇవ్వాలనుకుంటున్నాను" క్షణం ఆగేడు. "నీకు ఆమె కేవలం మేనకోడలు మాత్రమేగాక కాబోయే భార్య కూడా అంటున్నావు కాబట్టి మర్యాదగా కేస్ విత్‌డ్రా చేసుకోమను....గోటితో పోతుంది."

"లేకపోతే...." భాస్వంత్ చేతిగోళ్ళను చూస్తూనే అన్నాడు.

"కానగోటితో కథను తిరిగి రాస్తాను. మా లోగిలిలోనే సమాధి

అయిన ఎందరో ఆడపిల్లల బ్రతుకుల్లో ఆమెను ఒకదానిగా మార్చేస్తాను" ఉక్రోషంగా అన్నాడు.

"మీరంతటి సమర్థులని నాకుతెలుసు ప్రభంజనరావుగారూ!" నిశితంగా చూస్తూనే అన్నాడు భాస్వంత్. "కాకపోతే అవతలివాళ్ళు అందరూ అసమర్థులని భావించడమే సమంజసంగా లేదు."

"ఏం.... ఎదిగిపోయావు కాబట్టి నువ్వా ఆమెతరఫున కదనరంగంలోకి దూకాలనుకుంటున్నావా?"

"కాదు....కాస్త అభిమానవంతురాలైన ఆమె కేస్ విత్‌డ్రా చేసుకోవాలీ అంటే ఇకముందు ఇలా జరగకుండా చూస్తానని మీ అబ్బాయిచేత ఓ కాగితం రాయించి ఇస్తే సరిపోతుందంటున్నాను."

"భాస్వంత్!" ఆవేశంగా వెనక్కితిరిగాడు ప్రభంజనరావు. "ఒక ఆడదాన్ని సమర్థిస్తూ నా శక్తిని నువ్వు శంకిస్తున్నావు."

"లేదు! ఇంతటి మేధాశక్తిగల మీరు నేను సమర్థిస్తున్నది ఎవరో ఒక ఆడదాన్ని కాదని నా మనిషేనని గుర్తించలేకపోతున్నందుకు బాధపడుతున్నాను."

"అంతవరకూ వస్తే నేను తర తమ భేదాల్ని పాటించను."

"అలాంటి ఆలోచనే వుంటే ముందు మీరు శిక్షించాల్సింది మీ అబ్బాయిని."

నిశ్శబ్దంగా ఓ మూల ముడుచుకు పడుకున్న కళింగనాగు రెచ్చిపోతున్న చిన్న కప్పపిల్ల చూసి నెమ్మదిగా తల పైకెత్తినట్టు ఒక్కఅరక్షణం పాలోటనగా భాస్వంత్ కళ్ళలోకి చూసాడు.

"ఎంత బలమైన ప్రేమ నీది భాస్వంత్!" తోడేలులా నవ్వాడు—"యస్....నన్నుకూడా కాదనే స్థాయికి ఎదిగిపోతున్నావూ అంటే నిజమే నీ ప్రేమ చాలా అపురూపమైంది సుమా!"

"గుర్తించారు" అదే నవ్వు భాస్వంత్ పెదవులపై కూడా.

"సరే! ఇప్పుడు నువ్వేం గుర్తించాలో చెబుతున్నాను విను....

ఇంతవరకూ అమ్ములపొదిలోని ఒక అస్త్రాన్నికూడా వాడని నేను ఇప్పుడు సరాసరి మారణాస్త్రాన్నే ఉపయోగించబోతున్నాను" ఆగేడు కొద్దిసేపు.

"నాలుగుగంటల టైమిస్తున్నాను. అంటే రాత్రి ఎనిమిది గంటల వరకూ అన్నమాట! ఆమె కేసు విత్‌డ్రా చేసుకోవాలి. లేదా రశ్మి అనే ఒక అమ్మాయి చరిత్ర ముగిసిపోతుంది. ఆమె శవం సైతం పోలీసులకు దక్కకుండా అంతర్ధానమౌతుంది."

ప్రభంజనరావు లోపలి గదిలోకి వెళ్ళిపోయాడు మరేం మాటాడేది లేదన్నట్టు.

భాస్వంత్ ఫాలభాగాన స్వేదం అలుముకుంది....

ఇప్పుడొక పోరాటం మొదలు కాబోతూంది.

తన లక్ష్యం తనను ఇష్టపడని రశ్మిని కాపాడటమే అయితే తనను తాను కోల్పోడానికయినా సిద్ధపడాలి.

తన జీవితాశయం నెరవేరాలీ అంటే రశ్మి అనే ఒక ఆడపిల్ల చరిత్ర ఎలా ముగిసేదీ తను పట్టించుకోవడం మానేయాలి.

ఏం చేయాలి?

సరిగ్గా ఇదే సమయంలో....

తన అనుచరులతో రశ్మి కథ ఎలా ముగించాల్సిందీ పథకం వేసి వారిని రంగంలోకి అప్పుడే దింపాడు ప్రభంజనరావు.

21

రశ్మిని కలుసుకోవడంగాని, కలిసి హెచ్చరించడంగాని భాస్వంత్‌కు వీలుకాని విషయం కాదు.

కాని తనను అకారణంగా ద్వేషిస్తున్న యువతి ఆమె....

తను ఎంత దగ్గర కావాలనుకుంటున్నాడో అంతగా దూరమవుతున్న ఆడపిల్ల.

విపరీతమైన టెన్షన్‌లో నలిగిపోతూనే నిశాంత ఇంటికెళ్ళాడు.

ఆ రోజు జరిగిన సంఘటన తర్వాత మళ్ళీ ఆమెను కలియడం ఇదే. ముక్తసరిగా చెప్పాడు ప్రభంజనరావు రశ్మి విషయంలో ఏం చేయాలనుకుంటున్న దీ....

"నిశాంతా! నన్ను ఇష్టపడని ఆడపిల్లమీద ఎందుకు ఇంత ఆసక్తిని ప్రదర్శిస్తున్నాను అని నువ్వడిగితే నా దగ్గర ఏ జవాబు లేదు. కాని ఒక చిల్లరదేవుడి అత్యాచారానికి ఆమె బలి కాబోతూంది. ఒకవిధంగా నీ అండతోనే ఆమె ఇంతవరకూ ముందుకు సాగింది కాబట్టి ఇప్పుడుకూడా నువ్వే ఆమె కేస్ విత్‌డ్రా చేసుకొనేట్టు వప్పించమంటున్నాను.

నిశాంత అర్థంకానట్టు చూసింది—"ఇంత చేసిందీ కేస్ ఉపసంహరించుకోవటానికా?"

"పట్టు విడుపులుండాలి నిశాంతా....పైగా ప్రభంజనరావు ఏమిటీ అన్నది ఒక ఆడపిల్లగా నువ్వు పూర్తిగా వూహించలేవు."

నిర్లిప్తంగా నవ్వింది రెప్పలార్చకుండా అతణ్ని చూస్తూనే-ప్రభంజనరావు ఏమిటీ అన్నది మీకంటే ముందు అనుభవ పూర్వకంగా తెలిసిన ఆడదాన్ని నేను."

"కాబట్టే కాస్త జాగ్రత్తగా వుండమంటున్నాను...." వాచీ చూసుకున్నాడు అసహనంగా. "మరో మూడుగంటల కాలంలో ఎలాంటి ఘోరం జరగబోతున్నదీ అర్థం చేసుకోమంటున్నాను."

ఇదికాదు భాస్వంత్‌నించి ఆమె కోరుతున్నది. అందుకే అస్థిమితంగానే అంది—"మీ ఉద్దేశ్యమూ అదే అయితే పోరాటంనుంచి పక్కకు తొలగటానికి నేనూ సిద్ధమే!"

మరో అయిదునిముషాలలో నిశాంత బయలుదేరింది రశ్మికోసం....

* * * *

హాస్పిటల్లో ఉన్న అమ్మదగ్గరకు బయలుదేరబోతున్న రశ్మి హఠాత్తుగా ద్వారంముందు నిలబడ్డ నిశాంతనుచూసి కొన్నిక్షణాలు మాటాడలేకపోయింది.

"రండి!" అంది తేరుకున్న వెంటనే .... నిశాంత ఆందోళనగానే లోపలికి వెళ్ళింది.

భాస్వంత్ ద్వారా తెలిసింది చెప్పిన నిశాంత...."ఈ పరిస్థితుల్లో పోలీస్ కేస్ ఉపసంహరించుకోవడమే నయమనిపిస్తుంది" అంది.

"ఇది చెప్పడానికా మీరు ఇంతదూరం వచ్చింది" విబ్బరంగా అంది రశ్మి.

"అదికాదమ్మా....ఒకనాడు తొందరపాటుతో నేను మీకు సహకరించబోయి పరోక్షంగా ఆపదల్లోకి నెట్టాను."

"కాదు ఆపదలో ఉన్న నన్నురక్షించాలని ఆరోజు సహకరించారు."

"ఆరోజు ప్రోత్సహించిన నేనే ఈ రోజు నిరుత్సాహపరుస్తున్నాను. జరగబోయే ప్రమాదం తెలిసిన ఆడదానిగా."

"చాలా థాంక్స్....జాగ్రత్త పడతాను."

"వ్యవధి లేదమ్మా....ఆపద ముంచుకొస్తుంది."

రశ్మి ముభావంగా ఉండిపోయింది. నిశాంత కర్థమైంది. రశ్మి బయపడటానికి బదులు మరింత మొండిదానిలా వ్యవహరించడానికి సిద్ధపడుతూందని.

"పోనీ" ప్రత్యామ్నాయంగా అంది నిశాంత. "వాళ్ళకు తలవంచడమే ఇష్టంలేనినాడు మీరు కొన్నిరోజులు నాతో వుండండి."

"ఎందుకు మీరిలాపిరికిమందు పోస్తున్నారో నాకు అర్థంకావడంలేదు" రశ్మిలో ఉక్రోషం అధికమౌతూంది. "పైగా ఇష్టంలేని ఇంటికివచ్చి, నేనెలా ఉంటాననుకున్నారు?" ఆరోజు భాస్వంత్ ప్రవర్తన గుర్తుకురాగా అసంకల్పితంగానే అనేసింది చివరి వాక్యాన్ని.

"పొరపాటు పడుతున్నావమ్మా....నేనుండగా అక్కడ నీకెలాంటి ఆపదనీ రానివ్వను."

"మీరున్నా నన్ను కాపాడలేరని ఆరోజే నాకు అర్థమైంది" అంది ఆరోజే అన్న పదాన్ని వత్తిపలుకుతూ.

నిశాంతకు ఆమె మాటల్లోని శ్లేష అర్థమైంది.

నిర్వేదంగా చూస్తూనే అంది— "భాస్వంత్ దుర్మార్గుడు కాదు.... తనకు ఇష్టమైన దానికోసం మారాంచేసే పసిపిల్లాడిలాంటివాడు."

ఆ జవాబుతో ఎంత వేగంగా నిశాంతవేపు తిరిగిందీ అంటే ఆమె స్థానంలో మరో ఆడదివుంటే ఆవేశంగా బయటికి నెట్టేసేది రశ్మి.

నిశాంత సైతం రశ్మి దృష్టిలో పిపీలక ప్రమాణానికి దిగజారిపోయిన క్షణమది....

కట్టుకున్నవాడి కోర్కె తీర్చటానికి నిశాంత చేస్తున్న ప్రయత్నంలో భర్తను వేశ్యదగ్గరకు తోడ్కొని వెళ్ళిన ఒక పురాణ పతివ్రత నడిబజార్లో భర్త మర్యాదని కాపాడుతూ అమ్ముడుపోయిన మరో సాధ్వి గుర్తుకురాగా జుగుప్సగా ఏహ్యంగా చూసింది. "నిశాంతా! మీరేం మాటాడుతున్నారో మీకు అర్థమౌతుందా?" పదాల్ని ఒత్తిపలుకుతూ అంది.

"తెలిసే మాటాడుతున్నాను."

"సిగ్గనిపించడంలేదూ!"

"అంత సిగ్గుపడాల్సిన పని నేనేం చేయలేదే!"

రశ్మిలో సహనం చచ్చిపోతూంది క్షణక్షణానికి.... "ఇలా మాటాడుతున్న మిమ్మల్ని ఏ పేరున సంబోధించాలీ ఏ విశేషణం వాడాలీ అర్థంకాని స్థితిలోకి నన్ను నెట్టిన నిశాంతగారూ! ఒక సంస్కారవంతురాలిగా మీరు చేస్తున్న ప్రయత్నాన్ని అసహ్యించుకుంటున్నాను....ఇప్పటి మీ మాటల్ని చూస్తుంటే ఆరోజు భాస్వంత్ నామీద అత్యాచారం చేయబోవడంలో మీకూ భాగం ఉందన్న నిర్ణయానికి వచ్చిన ఆడదానిగా మిమ్మల్ని మరో క్షణం ఇక్కడ నిలబడవద్దని చెప్పాలనుకుంటున్నాను. మీరు ఇంత దిగజారినా ఒక పెళ్ళయిన ఆడదానిగా నేను మాత్రం ఇలాంటివి అంగీకరించనని...."

"వ్వాట్" నిశాంత విభ్రమంగా చూసింది.

"యస్ నిశాంతగారూ....మీ రాయభారానికీ తల ఒగ్గటానికి నేను అవివాహితను కాను. పెళ్ళయినదాన్ని."

నిశాంత ఇంకా తేరుకోలేదు. రశ్మి ఎందుకో అబద్ధం చెబుతూందని పిస్తూంది.

"రశ్మీ....మీకు నిజంగా...." నిశాంత గొంతు తడబడుతూంది.

"అగ్నిసాక్షిగా కాకపోయినా దైవసాక్షిగా వివాహం జరిగిపోయింది ఏనాడో."

రశ్మి కళ్ళల్లో సుడులు తిరుగుతున్న నీళ్ళను చూస్తూ స్తబ్దంగా నిలబడిన నిశాంత తిరుగులేని భాస్వంత్ ఇక్కడ దైవికంగా ఓడిపోతున్నందున బాధగా తలవంచుకుంది.

అప్పటికి నిశాంత వచ్చి సుమారు అరగంట దాటింది. హఠాత్తుగా గుర్తుకొచ్చింది ప్రభంజనరావిచ్చిన గడువు సమీపిస్తూందని.

"నిశాంతా నన్ను వదలిపెట్టండి! ఇది నా వ్యక్తిగత విషయం కాబట్టి దయుంచి నాకు నేనుగానే తేల్చుకోనివ్వండి" ఒక్క అరక్షణం ఆగి, రశ్మి "కాని ఒక్క విషయం....మీ సలహాలు అంగీకరించలేదని గాని లేదూ నాకు సహాయం చేయాలని గాని ఇప్పుడు మీరు పోలీసులకు తెలియపరిచే ప్రయత్నం చేయకండి. ఎందుకంటే నా మూలంగా నా తల్లిదండ్రులు అన్యాయం కావడం నా కిష్టంలేని విషయం కాబట్టి" అంది.

నిశాంత ఇక చేసేదేమీ లేనట్టు బయలుదేరింది.

అప్పటికి చీకటిపడి అరగంట దాటింది.

మరో పదిహేను నిముషాలలో ఆ సందులోకి వచ్చి ఆగింది ఓ అంబులెన్స్ వేన్.

మసకగా వెలుగుతున్న విద్యుద్దీపాలక్రింద పొడవుగా పరుచుకుంటూ రశ్మి ఇంటివేపు సాగుతున్న నీడలు హాస్పిటల్ సిబ్బందివి కావు....

ప్రభంజనరావు పంపిన గూండాలు రశ్మిని తీసుకువెళ్ళాలని ఒక పథకంతో అక్కడ అడుగుపెట్టారు....

* * *

"హాయ్ భాసూ!" ఆఫీసులో చాలా టెన్షన్‌గా కూర్చున్న భాస్వంత్ పరిచితమైన కంఠం వినగానే తలపైకెత్తి చూశాడు. ఎదురుగా రజని.... బంగార్రాజు మొదటి గారాల కూతురు. ఒకనాడు తనను కాంక్షించి చాలా యుక్తిగా తనకు దేహశుద్ధి చేయించిన బరితెగించిన ఆడది.

సుమారు రాత్రి ఏడున్నర కావస్తున్నా నిశాంత నుంచి ఎలాంటి వార్తా అందకపోవడంతో మనఃస్థిమితాన్ని కోల్పోతూ నలిగిపోతున్న భాస్వంత్ ఆ క్షణంలో రజని అక్కడికెందుకొచ్చిందో ఊహించలేక పోయాడు.

రజని నవ్వుతూంది అప్పటిలాగే. ఆ నవ్వు మరోమారు కాటేయబోతున్న కళింగనాగును గుర్తు చేస్తూంటే మెదడు అరల్లో సన్నగా నొప్పి. అది క్రమంగా శూలాలతో పొడుస్తూ నాడీమండలపు నరాల్ని ఏ అదృశ్య శక్తో ఉక్కుపిడికిలితో బలంగా పెరికేస్తున్న బాధ....

అతడి కళ్ళల్లో ఎరుపు జీరలు చోటు చేసుకుంటున్నాయి. తనను తాను మరచిపోతున్న ఉన్మాదమేదో అతడ్ని వివశుడ్ని చేస్తుంటే సరిగ్గా అప్పుడు ఫోన్ రింగయింది.

నిశాంత నుంచే అన్న భ్రమతో రిసీవర్ అందుకున్నాడు కొద్దిగా తేరుకుంటూ "హల్లో".

"నేను బంగార్రాజుని మాటాడుతున్నాను.... మరేంలేదు ఈ ఉదయమే మా పెద్దల్లుడు వైజాగ్‌నుంచి వచ్చాడు....ఓ విషయంలో నీతో మాటాడాలనుకుంటున్నాం,"

రెండే రెండు క్షణాలు ఆలోచించిన భాస్వంత్ "అలాగే....వెంటనే" అంటూ ఫోన్ పెట్టేసాడు తానేం మాటాడిందీ రజనీకి అర్థంకాకుండా జాగ్రత్తపడుతూ.

"బాగున్నావా" అన్నాడు భాస్వంత్ తన ఆలోచనకి రూపమిచ్చే ప్రయత్నంగా....

రజని చనువుగా నవ్వుతూ దగ్గరకొచ్చింది "ఎంత ఎదిగిపోయావు నువ్వు."

నవ్వేడు కిరాతకంగా—

"నీలో అస్సలు మార్పురాలేదు" అంది ఎప్పటిలాగే హొయల్ని ప్రదర్శిస్తూ.

"పొరపాటు పడుతున్నావు రజనీ— అప్పుడు అంటే నువ్వు నన్ను కోరుకున్న రోజుల్లో అనుభవంలేక నిన్ను కాదన్నాను. ఇప్పుడు మారిన మనిషిగా నువ్వు కావాలంటే దేనికైనా సిద్ధపడాలనుకుంటున్నాను.

"నాలో మార్పురాకపోవడమంటే."

"యూ...." రజని ఒక్క క్షణం పాటు ఉన్మాదంతో వూగిపోయింది" అంటే నువ్వు నన్ను ఇప్పటికి అంగీకరించావన్నమాట...."

"నిరూపించమంటావా."

ఆ కొద్దిపాటి ప్రోత్సాహానికే ఆమెపైట జారిపోయింది. ఊర్పుల నిట్టూర్పులు ఆమె హృదయ స్పందన్ని ఉధృతంచేసి కుబుసం విడుస్తున్న త్రాచుబుసల్ని గుర్తుచేస్తుంటే ఫెటిల్మన్న శబ్దం అరక్షణంలో....బ్లౌజ్ బటన్స్ సంకెళ్ళను ఛేదించినట్టు రాలిపడ్డాయి....

రెప్పలార్పకుండా చూస్తున్నాడు భాస్వంత్.

అప్పటికే ఆమె 'బ్రా'ను సైతం తీసేసింది. నెమ్మదిగా చాలా నెమ్మదిగా రారమ్మన్నట్టు చేతులుచాచి ముందుకు నడుచుకువస్తుంటే కాంతి కుదిపేస్తున్నట్టు పైకి లేచాడు....

పూర్తిగా వివస్త్ర కాబోతున్న ఆమెను వారించాడు అది చాలన్నట్టు.

మంచుతో మరింత ఎత్తుకు ఎదిగి నిశ్వాసపు సెగలతో కలిగే ఎదిగిన హిమవన్నగాల్ని చూడడంలేదు భాస్వంత్....టేబుల్‌పై ఒక త్రాచులా ముడుచుకున్న 'బ్రా'నే తేరిపార చూస్తున్నాడు.

"భాసూ...." ఒక మూలుగు రజని కంఠంలో.... "అప్పటికీ ఇప్పటికీ పెరిగిన బ్రా సైజుచూసి ఆశ్చర్యపోతున్నావా....అది మావారి

కంపెనీలో తయారుచేసిందే....చూసేది దాన్ని కాదు....పరదాని తొలగించాను....పక్కకు చూడు...."

చూసేడు నిలబడ్డ భాస్వంత్. పక్కకికాదు దూరంగా స్వింగ్ డోర్స్‌కి అవతల రెండు ఆకారాల వేపు....

బంగార్రాజు అతని అల్లుడితో చాలా ఉత్సాహంగా వస్తున్నాడు.

మరో అరక్షణం— నిలబడిన ఈ నగ్నశిల్పాన్ని చూసి అచ్చరువొంది హతాశులై నేలకూలే అవురూపమైన దృశ్యాన్ని చూడబోతున్నాడు.

సరిగ్గా అప్పుడు ఆ లిప్తలనడుమ నలిగే అతి స్వల్పకాలంలో ఎక్కడో ఒక గుండె అర కదిలింది. ఒక మానవత్వపు తెర మృదువుగా అతడ్ని కదిలించింది.

అంతే....అనాలోచితంగా ఆమెను బాత్‌రూంలోకి నెట్టేసి బయట గడియపెట్టి వెనక్కి తిరిగాడు.

ఆమె అరిచేదే....కాని మరెవరిదో కంఠం వినబడేసరికి ఆగిపోయింది.

అల్లుడ్ని పరిచయం చేసిన బంగార్రాజు "అరె....ఇదేంటి" అన్నాడు టేబుల్‌పై పడివున్న 'బ్రా'ని ఆశ్చర్యంగా చూస్తూ.

"నిజానికి మేం వచ్చిందీ మేం తయారుచేస్తున్న బ్రాసరీల మార్కెటింగ్ విషయం మాటాడాలనే....చిత్రమేమిటంటే అది ముందుగానే మీ దగ్గరికి వచ్చింది" అన్నాడు స్థూలకాయుడిలా వున్న బంగార్రాజు అల్లుడు.

"అదే....ఇంత మంచి క్వాలిటీగల బ్రాసరీకి మార్కెట్‌లో డిమాండ్ ఎందుకు లేదో స్టడీ చేయాలనే నేనూ ఇందాకే తెప్పించాను.... ఎంతైనా బంగార్రాజుగారు నాకు చాలా కావాల్సిన మనిషిగా" భాస్వంత్ ఆందోళన్ని అదిమిపెడుతూ జవాబిచ్చాడు.

"చాలా కాకతాళీయంగా జరిగిన సంఘటన" బ్రాని చూస్తూ అన్న బంగార్రాజు "భాస్వంత్! ఎన్నో విధాలుగా నన్ను గైడ్ చేస్తున్న నువ్వు ప్రస్తుతం పోటీలో నెగ్గలేక మూలన పడివున్న లక్షల రూపాయల స్టాక్

ఎలా మార్కెట్ చేయాలో సలహా యివ్వాలి కష్టం వుంచుకోను." అంటూ తాము వచ్చిన పని గురించి చెప్పాడు.

కోరని వరంలా తన పొదిలోకి చొచ్చుకువచ్చిన మరో మారణాయుధంలా ఈ అవకాశాన్ని ఎలా వినియోగించుకోవాలి అని ఓ అయిదు నిముషాలపాటు ఆలోచించిన భాస్వంత్ టేబుల్‌పై వున్న 'బ్రా'ని అందుకుని పరిశీలనగా చూస్తూ నిజానికి ఏ లోపమూ కనిపించని ఈ ప్రోడక్ట్ ఇలాంటి సమస్య నెదుర్కోవడం కేవలం కస్టమర్స్ దగ్గరకు చేర్చటంలో మీరు పొందిన వైఫల్యమే అనిపిస్తూంది." క్షణం ఆగి "ఏమాత్రం వుంటుంది అమ్మకం కాని స్టాక్" అన్నాడు.

"సుమారు పదిలక్షల రూపాయలు" బంగార్రాజు అల్లుడు జవాబిచ్చాడు.

"వెంటనే ఉత్పత్తిని ఉధృతం చేయండి" అన్నాడు భాస్వంత్.

ముందు ఇద్దరికీ అర్థం కాలేదు అతడు చెబుతున్నదేమిటో.

"సైజులమాట అటుంచి సగటున బ్రాసరీ ఖరీదెంతో చెప్పండి."

"పన్నెండు రూపాయలు" టక్కున జవాబిచ్చాడు బంగార్రాజు ఉత్సుకతగా.

"ఇప్పుడు మీరు ఒక్కో బ్రాని పదిహేను రూపాయలకు అమ్మబోతున్నారు. ఈ పథకం జయప్రదం అయ్యేట్టు నేను సలహా ఇచ్చినందుకు పాతికశాతం కమీషను ఇవ్వ...." భాస్వంత్ చెప్పేదింకా పూర్తికాకుండానే బంగార్రాజు జోక్యం చేసుకున్నాడు. "నీ వ్యాపారదక్షతమీద నాకు నమ్మకముంది భాస్వంత్. ఈ పథకం అమలు జరిగే మరుక్షణం రాబడినిబట్టి ఏ రోజుకారోజు నీకు కమీషన్ అందజేస్తాను."

అప్పుడు వివరించాడు భాస్వంత్.

"అందాన్ని కాపాడుకునే యువతులకో అద్భుతమైన అవకాశం అంటూ రేపే మీ కంపెనీ తరపున అన్ని దినపత్రికల్లోనూ అడ్వర్‌టైజ్ చేయబోతున్నారు. మూడురూపాయలకే ఒక బ్రాసరీ అంటూ స్త్రీలను ఆకట్టుకునేట్టు స్పష్టంగా రాసి వివరాలకు మమ్మల్ని సంప్రదించండి అంటూ మీ కంపెనీ అడ్రసు ఇస్తారు."

చాలా ఆసక్తిగా వింటున్నారు బంగార్రాజూ అతని అల్లుడునూ.

"ఇంత తక్కువ ధరకి బ్రాసరీని ఊహించలేని స్త్రీలు వెర్రిగా మీ వెంట పడతారు....ఉత్తరం రాసిన ప్రతి యువతికీ మీరు ఒక్కోటి మూడు రూపాయల ఖరీదుచేసే అయిదు కూపన్‌లు పంపుతారు....తను ఒకటి నింపి మరో నలుగురు స్నేహితురాళ్ళకు తక్కిన నాలుగు అమ్మి మొత్తం పదిహేను రూపాయలు 'ఎమ్.ఓ' చేస్తే వెంటనే 'బ్రా' పంపిస్తామని ఆ కూపన్లలో వివరిస్తారు. పదిహేను రూపాయలు పంపిన మొదటి యువతికి మీరు 'బ్రా' పంపడంతోపాటు తక్కిన నలుగులు ఆడవాళ్ళకి మొదటి పద్ధతిలోనే ఒక్కొక్కరికీ అయిదేసి కూపన్‌లు పంపుతారు" ఆగేడు సాలోచనగా....ఒక చిన్న కెరటంలా మొదలైన ఈ ప్రయత్నం ఆ తర్వాత ఒక ఉప్పెనగా మారుతుంది. మీరు ఉత్పత్తి చేయలేనంత డిమాండ్‌కి కారణమవుతుంది."

ఉన్మాదంతో ఊగిపోయాడు బంగార్రాజు అల్లుడు....

ఇలాంటి చాలా సామాన్యమైన సర్క్యులేషన్ పథకం గురించి బంగార్రాజు వినక కాదు....కాని అది తనకు తోచనందుకు అనుకున్న ధరకన్నా ఎక్కువ ఖరీదుకే అమ్మే ఒక ప్రణాళికలా భాస్వంత్ దగ్గర తెలుసుకున్నందుకు బంగార్రాజు చాలా ఉత్సాహపడి వెళ్ళిపోయాడు అల్లుడితో సహా.

"చివరి ఆయుధాన్ని నీ మీద ప్రయోగించాను బంగార్రాజూ! చాలా స్వల్పకాలంలో నువ్వెటువంటి ఊబిలో కూరుకుపోతున్నదీ ఇప్పుడు నీకర్థం కాదు" అనుకున్నాడు భాస్వంత్ భావగర్భితంగా చూస్తూనే.

రెండు నిమిషాలు గడిచాయి, అప్పుడు గుర్తుకొచ్చింది భాస్వంత్‌కి రజని విషయం....

పూర్తిగా చెమటతో తడిసిపోయిన రజని భయంతో వణికిపోతూంది భాస్వంత్ తలుపు తెరిచేసరికి.

"రజనీ" తలవంచుకునే అన్నాడు. "నిజానికి నీకు అన్యాయం చేయాలనుకున్నాను. కాని ఎందుకో ఒక లిప్తపాటు నా మనసు నన్ను

విలదీసింది. ఒకనాడు ఆకతాయిగా నన్ను అల్లరిచేసిన ఒక పసికందులాంటి నీమీద కసితో నీ కాపరాన్ని ఖరీదు కట్టలేక చివరిక్షణంలో నీ భర్తనుంచి కాపాడాలని ఈ గదిలోకి నెట్టాను. ఇక్కడకూడా నీ కోరిక మన్నించనందుకు నన్ను క్షమించు.”

వెక్కిపడుతూనే తన చేతుల్తో అతడి పాదాలను స్పృశించాలనుకున్న రజనిని వారిస్తూ వెనక్కి జరిగిన భాస్వంత్ “వెళ్ళిపో రజనీ! మళ్ళీ ఎప్పుడూ నాకు కనిపించకు” అన్నాడు మంద్రస్వరంతో.

* * *

“లేదు సరే! ఇంత ప్రణాళికను సిద్ధం చేసుకుని మనం వెళ్ళినా అప్పటికే రశ్మి తప్పించుకుంది. బహుశా ఆమె తల్లి దగ్గరకు హాస్పిటల్‌కి వెళ్ళిందేమో” అంటూ ప్రభంజనరావుతో అంటున్న రంగారావు “లేదు....” అన్న ఓ అమ్మాయి కంఠం వినిపించడంతో వెనక్కి తిరిగాడు.

అక్కడ రశ్మి నిలబడి వుంది.

“మీరెంత బలంగా నాకోసం వలపన్నుతున్నారో నాకు తెలుసు ప్రభంజనరావుగారూ! అందుకే మీ వలలో నేను చిక్కకూడదని నా అంతట నేనుగా ఈ వలయంలోకి అడుగుపెట్టాను....”

ఆమె నిబ్బరానికి ఆశ్చర్యపోయిన ప్రభంజనరావు “గుడ్ నేనేమిటో తెలుసుకోగలిగావు” అన్నాడు ఉడికెత్తుతున్న ఒంటివేడితో ఆమెనే అపాదమస్తకం గమనిస్తూ “ఈ తెలివితేటలు ముందే వుంటే నువ్వింత ఇబ్బంది పడే అవకాశముండేది కాదు.”

“మీరు ఏ తెలివితేటల గురించి ఉటంకిస్తున్నారో నాకు అర్థం కావడంలేదుకాని నేనిప్పుడు వచ్చింది కేసు ఉపసంహరించుకోనని చెప్పడానికే అన్నది మీరు తెలుసుకుంటే మంచిది” ఆమె చాలా మామూలుగానే అన్నా అది ప్రభంజనరావు అహంకారపు పొరని బలంగానే చీల్చింది.

“పాఠాలు చెప్పటానికొచ్చావటే పంతులమ్మా” ప్రభంజనరావు రెండడుగులు ముందుకేసాడు లేడిపిల్లపై దూకబోతున్న పులిలా....

అరక్షణంపాటు ఆమె గుండె వేగంగా కొట్టుకుంది.

ఆమె వెనక్కి తలతిప్పింది.

కానీ అప్పటికే బయట ద్వారం మూసి గడియపెట్టారు అతడి ముఠా....తను ఒక ఉన్మాదిలా ఎలా తొందరపడిందీ ఆమె గ్రహించేలోగానే ప్రభంజనరావు బలంగా ఆమె చేతినందుకున్నాడు.

22

“మిష్టర్ ప్రభంజనరావ్”

రశ్మి పిలుపుతో ఆ గది ప్రతిధ్వనించింది. “ఒంటరి ఆడదాన్ని కాబట్టి మీరేం చేసినా చెల్లుబాటవుతుందని మీరనుకుంటే అది అవివేకమే అవుతుంది....”

చేతిని విదిలించుకుంది మొండిగా. “అన్ని జాగ్రత్తలతోనే ఇక్కడకు వచ్చాను.”

ప్రభంజనరావు భృకుటి ముడిపడింది.

“ఇంకా అర్థంకాలేదా ప్రభంజనరావుగారూ.... మీ దగ్గర నాకు జరగబోయే ప్రమాదాన్ని ముందే పసిగట్టిన నేను ఛీఫ్ మినిష్టర్‌కి, పోలీస్ కమీషనరుకీ, అనుదినం పత్రికాధిపతికీ ఎడ్రసు చేసిన మూడుసీల్డు కవర్లనీ భద్రంగా ఉంచానొకచోట. నేను సురక్షితంగా వెనక్కి వెళ్ళనినాడు ఆ కవర్లు చేరాల్సిన చోటుకి చేరడం మీరు కటకటాలు చూడటం వరుసగా జరిగిపోతుంది. చెప్పండి....ఏం చేద్దామనుకుంటున్నారు.”

వలలో చిక్కిన చేపపిల్లలా కనిపించిన రశ్మి ఇప్పుడు గదిలోకి అడుగుపెట్టిన త్రాచులా అనిపిస్తుంటే నిస్సహాయంగా అతని పిడికిళ్ళు బిగుసుకున్నాయి.

"నీ బావ అండతో చాలా పకడ్బందీగా పథకం వేసుకుని మరీ వచ్చావన్నమాట" అన్నాడు ప్రభంజనరావు కసిగా చూస్తూ.

"పొరపాటు పడుతున్నారు. మీరనుకుంటున్నట్టు భాస్వంత్ నాకు బావ కాదు."

అపనమ్మకంగా చూసేడు ప్రభంజనరావు. "అంటే భాస్వంత్ నిన్ను పెళ్ళి చేసుకోబోవడం కూడా నిజంకాదా" అన్నాడు.

నిర్లిప్తంగా నవ్వింది. "పెళ్ళయినవాడికి భార్య కావాల్సిన అగత్యం నాకు లేదు."

"అంటే" ఉద్విగ్నంగా చూసేడు.

"నిశాంతకు భర్తయిన భాస్వంత్‌కు నేను భార్యనెలా కాగలననుకుంటున్నారు."

చాలా మామూలుగా ఆమెకు తెలిసిన ఒక నిజాన్ని చెప్పేసింది కాని అది ఎంత వాడిగా ప్రభంజనరావు మెదడుని తాకిందీ అనాలోచితంగా ఆ విషయాన్ని తెలియపరిచి భాస్వంత్‌కు ఆమె ఎంత ప్రమాదాన్ని కొనితెచ్చి పెట్టిందీ రశ్మి వూహించలేదు.

"భాస్వంత్ నిశాంతను పెళ్ళి చేసుకున్నాడా" అనుమానంగా చూస్తూనే క్షణం ఆగి "అలాంటప్పుడు ఆ రోజు నిన్ను మేనకోడలుగా కాబోయే భార్యగా చెప్పి ఎలా తీసుకువెళ్ళాడు" అన్నాడు గొణుగుతున్నట్టుగా.

"సింపుల్....నన్ను ప్రమాదం నుంచి గట్టెక్కించాలని అలా అన్నాడు. అంతే."

సరిగ్గా ఇక్కడే భాస్వంత్‌పైగల ఒకనాటి చెరగని విశ్వాసానికి పూర్తిగా విఘాతం ఏర్పడిపోయింది.

"తెలివిగా నన్ను వెధవని చేసాడన్నమాట" అనుకున్న ప్రభంజనరావు "సరే రశ్మి! నీ మీద నేను ఎటువంటి అఘాయిత్యానికీ సిద్ధపడను.... మర్యాదగా కేసు ఉపసంహరించుకో" అన్నాడు.

"అదే మీకు మఖ్యమైతే ఇకముందు నామీద ఎలాంటి దాడి జరగదని మీ స్వహస్తాలతో ఓ కాగితం రాసివ్వండి."

"అసంభవం!" పళ్ళునూరేడు అహం దెబ్బతిన్న ప్రభంజనరావు.

"అప్పుడు నేను కేసు ఉపసంహరించుకోవడం అసంభవమే!"

"రశ్మి" అతడికంఠం తీవ్రంగా పలికింది. "నా గురించి నీకు పూర్తిగా తెలిసినట్టు లేదు."

"తెలుసు ప్రభంజనరావుగారూ! పట్టపగలు నడిరోడ్డుమీద ఒక సామాన్యుడి చేతిలోనే అత్యాచారానికి గురవుతున్న ఆడపిల్లలు బ్రతుకుతున్న ఈ దేశంలోని ఒక యువతిగా మీరెంత మనుషులో నాకు తెలుసు....

రాముళ్ళు రాళ్ళగామారి గర్భగుడిలో నక్కి కూర్చుంటే మీ వంటి రావణులు వీధుల్లో విశృంఖల విహారంచేస్తూ మనుధర్మస్మృతి గొంతునొక్కి వంతులు వారిగా మీదేశపు ఆడదాన్ని ఎలా నంజుకుతింటున్నారో నాకుబాగా తెలుసు. అయినా నేను యీ మాత్రం ఎదురుతిరిగానూ అంటే కారణం ఏ ఆడదీ చేయని సాహసంతో నాకో చరిత్ర సృష్టించుకోవాలని కాదు. ఏ నాడయితే మీతో విరోధం ప్రారంభమైందో ఆనాడే నేనో భయంకరమైన ప్రమాదంలో చిక్కుకున్నానని తెలిసిన ఆడదానిగా మీమీద గెలుపుకోసం కాక నేను ఓడిపోకూడదన్న ప్రయత్నంలో ఇలా ఆరాటపడుతున్నాను."

"అంటే.... ఇంత తెలిసికూడా నా మాటని మన్నించవన్నమాట!" నిశితంగా చూస్తూనే అన్నాడు.

రశ్మిలో చలనంలేదు.

ఆలోచిస్తున్నాడు ప్రభంజనరావు యిలాంటి మొండిపిల్లని ఎలా లొంగదీసుకోవాలా అని.

"రశ్మీ.... నీకు మరికొంత వ్యవధి ఇస్తున్నాను.... కూల్‌గా ఆలోచించు. అవసరమయితే నాకున్న పరపతి, పలుకుబడి ఏమిటో యింకా తెలుసుకోవాలని ప్రయత్నించు. పోలీసులు చార్జిషీటు కోర్టులో ఫైల్‌చేయకముందే నేను అడిగిన పద్ధతిలో ఒక నిర్ణయానికిరా" ఆగేడు సాలోచనగా. "లేదా నాచివరి అస్త్రాన్ని ప్రయోగించాల్సి వుంటుంది. అది చట్టానికి అందనిది. నా డబ్బుకు లొంగేదీను."

చివరిసారిగా హెచ్చరించిన ప్రభంజనరావు తన అనుయాయులకి సౌంజ్ఞచేశాడు.

ద్వారం తెరుచుకుంది.

నిజంకాని సీల్డ్‌కవర్ విషయాన్ని సమయస్ఫూర్తిగా చర్చించి, మృత్యు సంహ్వారంలాంటి ఆ గదిలోనుంచి బయటపడ్డ రశ్మికి పూర్తిగా అర్థమైపోయింది—నిజమైన ఆపద అప్పుడే ఆరంభమైంది తప్ప, అంతం కాలేదని....

* * * *

రేయి గడుస్తున్నా నిశాంత దగ్గరనుంచి ఎలాంటి వార్త అందకపోవడంతో చాలా టెన్షన్‌లో నలిగిపోయిన భాస్వంత్ ఇక జాప్యం చేయలేనట్టు నిశాంత దగ్గరకు బయలుదేరాడు.

యింటిదగ్గర లేదు....

ఆఫీసుకు ఫోన్‌చేసాడు....అక్కడా ఆమె జాడలేదు.

అనుకోనిదేమన్నా జరిగిందా అన్న ఆలోచనతో రోడ్లన్నీ గాలించాడు 'మారుతి' డ్రైవ్‌చేస్తూ.

లాభం లేకపోయింది.

ప్రభంజనరావు దగ్గరకు వెళ్ళాలని మనసు ప్రోత్సహిస్తున్నా, యిది సమయం కాదనిపించి ఆగిపోయాడు.

రాత్రి తొమ్మిదిగంటలవుతూంది. అంటే ప్రభంజనరావు యిచ్చిన గడువు అప్పుడే దాటిపోయింది.

ఒక్క అరగంట గెస్ట్‌హౌస్‌లో వెయిట్‌చేసి, అప్పటికి నిశాంత దగ్గర్నుంచి ఎలాంటి వార్తా రాకపోతే ఇక ప్రభంజనరావు దగ్గరికే సరాసరి వెళ్ళాలని తీర్మానించుకున్నట్లు కారును వెనక్కి మళ్ళించి, గెస్ట్‌హౌస్‌కు వచ్చేసాడు....

మనసెందుకో కీడును శంకిస్తున్నట్టు అర్థంకాని అలజడి గుండెల్లో.

నాగరాజు వూళ్ళోలేడు....విజ్ఞానభారతి నిర్మాణంలో తలమునకలై వున్నాడు.

ఆలోచిస్తూనే కారును పోర్టికోలో ఆపి. గది తలుపులు తెరిచి లైటు వేసాడు.

వెలుగు ఇబ్బందికరంగా వుంది.

నైట్‌క్వీన్స్ పరిమళాన్ని మోసుకొస్తున్న గాలి ఎందుకో ఆహ్లాదంగా అనిపించడంలేదు.

తెరిచివున్న కిటికీ దగ్గరకు నడిచి, దట్టంగా అలుముకున్న చీకటిని చూస్తూ నిశ్శబ్దంగా నిలబడ్డాడు ఓ పదినిముషాలపాటు.

హఠాత్తుగా మెదడు అరల్లో ఓ సన్నని నొప్పి శూలాలతో పొడుస్తున్నట్టు....

ప్రభంజనరావుతో తన ప్రచ్ఛన్న యుద్ధం ఆరంభమయ్యిందా?

నాడి మండలపు నరాల్ని మెలిపెట్టి లాగుతున్నట్టు తలలో హోరు.

తూలి పడబోతూ కిటికీ వూచల్ని ఆసరాగా పట్టుకున్నాడు కొంతసేపు....

లాభంలేదు....కొద్దిసేపు రిలాక్సవ్వాలి.

అంతే....భారంగా అడుగులువేస్తూ బెడ్‌దగ్గరికి నడిచాడు.

నెమ్మదిగా బలాన్ని కూడగట్టుకుంటూ దుప్పటిని పక్కకు జరిపాడు విశ్రమించాలని....

అంతే....

ముందు విషగాలిని కక్కినట్టు ఓ బుస వినిపించింది. తోకపై నిలబడ్డ సుమారు నాలుగడుగుల త్రాచునుచూసి మెరుపు వేగంతో జరగాలనుకున్నాడు.

కాని అప్పటికే వ్యవధి దాటిపోయింది.

అతడి మోచేతిలో త్రాచు కోరలు బలంగా గుచ్చుకున్నాయి.

* * * *

దేనికోసమో ఎదురుచూస్తున్నట్టు చాలా అధిమితంగా అటూ ఇటూ పచార్లు చేస్తున్న ప్రభంజనరావు వాచీ చూసుకున్నాడు.

అప్పుడు రాత్రి తొమ్మిది కావస్తోంది.

"వెళ్ళిన వాళ్ళింకా రాలేదేం?" అనుకుంటుండగా, ఎదురుగా నిలబడి వున్న జీవన్‌రావు కనిపించాడు. అతని పక్కన మరో యువకుడు....

ఆ క్షణంలో జీవన్‌రావు అక్కడికి రావటం ప్రభంజనరావుకి నచ్చలేదు.

ఒకనాడు చాలా ఆత్మీయుడూ కావలసినవాడూ అయిన జీవన్‌రావు ఇప్పుడు ప్రభంజనరావు ఇష్టపడని వ్యక్తులలో ఒకడు.

"ఏంటి? ఎందుకిలా వచ్చావు?" అన్నాడు మాటలాడటానికి టైం లేదన్నట్టు.

"మీకో వాస్తవం చెప్పించాలని" అన్నాడు తొణక్కుండానే.

"ఎవరతను?"

"మీకు చాలా కావలసినవాడు....పేరు గిరి....విశాంతకు తమ్ముడు."

"ఎందుకు తీసుకొచ్చావు?"

"ఒకనాటి మీ అంతరంగికుడిగా మీమీద అభిమానం చాపక నన్ను కాదని మీరు నమ్ముతున్న వ్యక్తి గురించి కొన్ని సత్యాలను ఎరుకపరచాలని."

యధాలాపంగా చూసేడు ప్రభంజనరావు—"ఏంటా నిజాలు?"

"రశ్మి భాస్వంత్‌కు మేనకోడలు అని మీకు తెలుసనుకుంటాను."

"నో....అలా అని భాస్వంత్ నన్ను మభ్యపెట్టాడు."

"ఇలా చెప్పి రశ్మి మిమ్మల్ని మభ్యపెట్టిందన్నమాట."

"వ్వాట్" ఒక పదునైన శరాఘాతం తన మెదడుపొరని చీల్చినట్టు ఉలికిపడ్డాడు ప్రభంజనరావు.

"ఆశ్చర్యపోకండి ప్రభంజనరావుగారూ? నేను గిరిని తీసుకొచ్చింది, వారి కుటుంబాల గురించి తెలిసినవ్యక్తిగా మీ అండను కోరుకుంటున్న వ్యక్తిగా ఇవన్నీ మీకు చెప్పించాలనే."

"అంటే రశ్మికూడా నన్ను తప్పుదోవ పట్టించిందా?"

"అవును" గిరి బదులుచెప్పాడు.

"నీకెలా తెలుసు" గిరివి చూస్తూ అడిగాడు.

"దశాబ్దాల మన స్నేహాన్ని దెబ్బతీసిన భాస్వంత్ ఇక్కడ అడుగుపెట్టడంలో అంతర్ధానమేమిటో తెలుసుకోవాలని భాస్వంత్ గురించి కొన్ని వివరాలు సేకరించమని నేనే గిరిని ప్రోత్సహించాను ప్రభంజనరావుగారూ. అప్పుడు తెలిసింది భాస్వంత్ మీదగ్గర అడుగుపెట్టింది తన పబ్బం గడుపుకునే ఆసరాకోసం తప్ప మీమీద అభిమానంతో కాదనీ" జీవన్‌రావు ఆగేడు. ప్రభంజనరావు ముఖ కవళికల్ని గమనిస్తూ."ప్రభంజనరావుగారూ! విశాంతకు భర్త అయిన భాస్వంత్‌కి మీరూ ఇప్పుడు శత్రువే!"

"అది నాకుతెలుసు జీవన్‌రావ్! నాకు రశ్మి గురించి వివరాలు కావాలి."

గిరి చెప్పడం మొదలుపెట్టాడు.

"జీవన్‌రావుగారి ప్రోద్బలంలో బయలుదేరిననేను ముందు రామయ్యతాతని కలుసుకున్నాను. భాస్వంత్ స్నేహితుడిలా నటిస్తూనే అతడి గురించి తెలుసుకునే ప్రయత్నంలో రశ్మి అక్కడకు రావడం సంగతి గ్రహించాను. భాస్వంత్ ఆమె బావగా తెలియపరిచిన రామయ్యతాత ఒక్కసారి భాస్వంత్‌ను చూడాలనుందని, అతడితోకలిసిరమ్మని ఆమెను పంపేడు....బాల్యస్నేహితురాలైన మా అక్క గురించి వాకబు చేయాలని, అమ్మను కలుసుకోవాలని వచ్చిన రశ్మి కాకతాళీయంగా భాస్వంత్‌నూ మా అక్కనూ చూసి తన కోరుకున్న స్థానాన్ని అక్క సొంతం చేసుకోవడంతో ఆమె తను ఎవరన్నదీ చెప్పకుండా అజ్ఞాతంగా వుండిపోవడం గమనించాను."

"సో...." ప్రభంజనరావు కళ్ళు ఎరుపెక్కాయి. "ఇప్పుడు ఈ నిజం తెలిసింది ఆ తాత నువ్వూ ఇద్దరే అన్నమాట."

"తెలిసినా తాత ఇకలేడు."

"ఏం?"

"నిన్ననే చచ్చిపోయాడు."

కొన్నిక్షణాల నిశ్శబ్దం ఆ గదిలో."

ఇప్పుడు తనతో కదనరంగంలోకి అడుగుపెట్టిన వాళ్ళు ముగ్గురు.

అందులో ఇద్దరు అబలలైతే వార్ని తనబలంతో సబలలుగా మార్చే ప్రయత్నం చేస్తున్న మూడోవ్యక్తి భాస్వంత్!

వారు ఎవరికేమైనా ఇప్పుడు తనకనవసరం.

తన అమూల్యమైన శక్తినిగాని కాలాన్ని కాని వారికోసం తను వెచ్చించలేదు.

దానికి ముందుగా తను చేయాల్సింది ఆయువుపట్టుపై సాధ్యమైనంత త్వరగా దెబ్బతీయడం.

"తెలిసిందా ప్రభంజనరావుగారూ.... భాస్వంత్ ఒక కాలకూట విషాన్ని నింపుకున్న ఒక నాగుపాము."

నవ్వేడు ప్రభంజనరావు—"అందుకే కర్ర విరగాలి.... పాము చావ కూడదన్న ఓ ప్రయోగాన్ని అప్పుడే చేసాను."

* * *

జరిగిందేమిటో అర్థమైన భాస్వంత్ అమాంతం పిడికిలితో పాముని అందుకున్నాడు. అది మరోసారి కాటువేయడానికి ముందే....

ఇది రెప్పపాటులో జరిగిపోయింది. అతని పిడికిలి బలానికి తాళ లేనట్టు త్రాచు ఉక్కిరి బిక్కిరవుతూ అతడి చేతిని చుట్టుకుంది.

పిడికిలిని మరింత బిగించాడు కసిగా...."కాలమా! నువ్వు సర్పంగా మారి నన్ను కాటేయాలని వచ్చావా? లేక ఏమని షో మృత్యువుతో లాలూచీ పడి నన్ను తుదిముట్టించే ఒక అస్త్రంగా ఇటు ప్రయోగించ బడ్డావా?"

ఆక్రోశిస్తూనే ఉద్రేకంగా విసిరాడు దూరంగా.

ఆ తర్వాత త్రాచుకేసి అతడి దృష్టి సారించలేదు.

క్రమంగా ఒంటిని స్వాధీనం చేసుకుంటున్న నొప్పికి బాధతో మెలి తిరిగిపోతూ బలాన్ని కూడగట్టుకుని రక్తం చిమ్ముతున్న గాయానికి ఎగువగా ఓ బెల్టు చుట్టాడు.

కళ్ళు మసకలు కమ్ముతున్నాయి. గుండెలో రక్తపీడనం అధికమౌతుంటే....

మెదడు మొద్దుబారిపోతూంది.

పాంచ భౌతికమైన దేహంపై ఆధ్యాత్మికమైన గెలుపుకోసం విఫల ప్రయత్నంచేస్తూ భారంగా అడుగులు వేస్తున్నాడు.

కాళ్ళు తడబడుతున్నాయి. ఇదే తన ప్రయాణంలో చివరి ఘట్టమా....?

కళ్ళముందు కడతేరిన తనవాళ్ళ ఆకృతులు అస్పష్టంగా....

"నాన్నా!" రొప్పుతున్నాడు. "దేవుడిని సయితం ధిక్కరించి, మొదలుపెట్టిన నాకు దీర్ఘయాత్రలో ఇది అనుకోని అవాంతరమే అయినా, ఈ ఓటమికి తలవంచను. నువ్వు విడిచిన అసంపూర్తి లెక్కకు నేను జవాబుగా మారి తప్ప, మృత్యువు వాతపడను. కాని ఇదంటే?"

అతడి నోటినుంచి బుద్బుదప్రాయమైన జీవితానికి నిర్వచనంలా నురగ స్రవిస్తూంది.

విస్మృతయానపు పదఘట్టనలు అతడి చెవుల్ని హోరెత్తిస్తున్నాయి.

క్రోధం....కసి....నీరుగా మారి కళ్ళలో సుడులుగా తిరుగుతుంటే మహాశక్తితో వాస్తవాన్ని ఓడించే విశ్వప్రయత్నం చేస్తున్నాడు.

"జీవం సర్వభూతేషు!"

జీవులలో జీవశక్తినైన నా జీవం అనంతంలో కలిసిపోకూడదు....

రెండడుగులు వేసాడు....

"లోక సంగ్రహమే నాపి సంపశ్యనె కర్తుమర్హసి."

నేను నమ్మిన ధర్మాన్ని నిలబెట్టి నాలాంటివాళ్ళ శ్రేయస్సును దోచే అధర్మ శక్తుల ఆట కట్టించేవరకూ నేను మిగలాలి....

మరో అడుగు ముందుకు వేసాడు.

"మృత్యుః సర్వహరశ్చాహవక"

అన్నింటినీ హరించగల మృత్యువును నేనే కావాలిగాని నాకు మృత్యువు లేదు.

నిస్సహాయంగా పళ్ళు నూరుతున్నాడు.

ఉఛ్వాస నిశ్వాసాలకు అవరోధంగా స్రవిస్తున్న రక్తపుణితలు విషపు నురుగులు నోటినీ నాసికనీ ఆక్రమిస్తుంటే....

"ఉద్భవశ్చ భ....వి....ష్య....తా....మ్"

పెదవులు గొణుగుతుంటే ఒకతరువులా మొదలుకదిలిన మేరువులా నేలపై కూలిపోయాడు,

కాటేసినత్రాచు అక్కడ కిటికీకి చుట్టుకుని చూస్తూవుంది పొంచివున్న మృత్యువులా....

23

బడలికగా కళ్ళుతెరిచాడు భాస్వంత్.

తను ఇప్పుడున్నది హాస్పిటల్లో అన్నది అర్థమైంది.

లీలగా గుర్తుకొచ్చింది జరిగిందంతా.

ఎలావచ్చాడు....సమీపంలో కూర్చునివున్న నిశాంత కనిపించింది.

ఆమె కళ్ళక్రింద ఎండిన కన్నీటి చాయలు.

రెప్పలార్చకుండా ఎటో చూస్తూందామె.

తెల్లవారుల్లా నిద్రలేమితో అలాగే కూర్చునివున్న ఆమె నిర్విరామంగా ఆలోచిస్తూ చాలా అలసిపోయింది.

రశ్మి విషయం మాటాడాలని గెస్ట్‌హౌస్‌కు ఆమెవచ్చేసరికి భాస్వంత్ ద్వారం దగ్గరే స్పృహతప్పి పడివున్నాడు.

నోటిలోనుంచి నురగలొస్తుంటే జరిగిందేమిటో ముందామెకు అర్ధం కాలేదు.

దూరంగా బుస వినిపించి చూస్తే అక్కడి కిటికీ వూచలకు చుట్టుకుని వున్న త్రాచు కనిపించింది.

అమాంతం అతడ్ని పైకి లేవనెత్తే ప్రయత్నం చేస్తుండగా ఫోన్ రింగయింది.

నిజానికి ఆది అదనుకాదని తెలిసిన ఆమె అందుకుంది. "భాస్వంత్ చరిత్ర ముగిసిపోయే వుంటుందికదూ. ప్రభంజనరావుతో ఆట మొతలెడితే ఇలాగే కాటేస్తాడని గుర్తుంచుకో!"

ఆమెను రెచ్చగొట్టాలని, ఆమె రెచ్చిపోయి ప్రభంజనరావుపై పగ సాధించే ప్రయత్నం చేయాలని జీవన్‌రావు అవకాశాన్ని వినియోగించుకొని అప్పుడు ఫోన్‌చేసాడు తనెవరన్నదీ చెప్పకుండా.

ఆమె ఆలస్యం చేయలేదు. తను నమ్మిన దేవుడ్ని మనసులోనే ద్యానిస్తూ తనకు తెలిసిన దేవుడ్ని రక్షించే ప్రయత్నంగా ఉస్మానియాకు తీసుకువచ్చింది.

"ఏంటీవీనమ్" ఇంజక్షనిచ్చి డాక్టర్లు చాలా శ్రద్ధతో అతడ్నికాపాడే ప్రయత్నం చేసారు.

మరో పదినిముషాలు ఆలస్యమైత్తే అతను మిగిలేవాడు కాదని డాక్టర్లు చెప్పిన విషయాన్ని ఆమె మరిచిపోలేకపోతూంది.

"నిశాంతా!"

భాస్వంత్ పిలుపుతో తేరుకున్న నిశాంత ఉద్వేగంతో అతడ్ని చేరుకుంది.

మృదువుగా ఆమె తల నిమురుతూ మౌనంతోనే కృతజ్ఞతల్ని వ్యక్తంచేస్తున్న ఆమె కన్నీళ్ళను దాచుకోలేకపోయింది....

రశ్మి విషయం అడిగాను ముందుగా ఆ స్థితిలోకూడా.

చెప్పింది. ఆమె మొండితనంగురించి తలవంచుకునే.

నవ్వేడు భాస్వంత్ నిర్లిప్తంగా "ఎందుకు నిశాంతా! ఎవరికెవరు ఏమౌతామని ఒకరికోసం ఒకరం ఎందుకిలా ఆరాటపడుతున్నాం.... సమయానికి నువ్వేవచ్చి వుండకపోతే నా యాత్రముగిసిపోయేది. ప్రభంజనరావు విజయగర్వంతో ఆనంద పడేవాడు...."

ఆమె అర్థంకానట్టు చూసింది.

"అవును నిశాంతా! ఏక్షణంలో ప్రభంజనరావుతో ముకాముకి పోరాటానికి నేను సంసిధతను వ్యక్తంచేసానో అప్పుడే వూహించాను ఇలాంటి ప్రమాదాన్ని.... అయితే ఈ ప్రయత్నాన్ని మాత్రం గెస్‌చేయలేకపోయాను."

"అంటే యీ విషప్రయోగం ప్రభంజనరావు చేయించాడని అప్పుడే వూహించారా."

తలూపేడు స్వాభావికంగానే.... నిశ్శబ్దం చాలా సేపటివరకూ.

"నిశాంతా! నా ప్రాణాలను కాపాడిన నీకు ఎలా కృతజ్ఞతలు తెలపాలో నువ్వీక్షణాన నిర్వహించిన మీ ధర్మాన్ని ఏ పేరున వ్యక్తీకరించాలో తెలియని స్థితిలో వున్న నేను నిజంగా లక్ష్యాన్నే చేరగలిగితే అస్తవ్యస్తమైన నా అసంపూర్తి జీవితగ్రంథంలో నీకు వెలలేని కొన్ని పుటల్ని కేటాయిస్తానని మాత్రం హామీ ఇస్తున్నాను. ఈ మృత్యు పోరాటంలో నాగెలుపు కోసమే అహర్నిశలూ శ్రమించే నీకు వీలైతే ఈ జీవితకాలంలోనే మీ రుణాన్ని తీర్చుకునే ప్రయత్నం చేస్తాను."

"ఆమె నేత్రాలనుంచి ధారగా స్రవిస్తున్న అశ్రువుల్ని తుడిచాను ఆత్మీయంగా.

ఆ సాయంకాలమే భాస్వంత్‌తోపాటు హాస్పిటల్‌నుంచి తిరిగివచ్చిన నిశాంత మరునటిరోజు ఉదయమే ప్రభంజనరావుకి ఫోన్‌చేసింది.

"మిష్టర్ ప్రభంజనరావ్."

"ఎవరూ...." ప్రభంజనరావు అడిగాడు.

"నేనే.... ఒకనాడు నీ ఉచ్చులో చిక్కుకుని కాటుతిన్నదాన్ని.... ఇప్పుడు నీ కోరల్ని పీకాలని కలలు కంటున్న అనుదినం పత్రిక యజమానురాల్ని."

"ఓహో.... ఏమిటి బుసకొడుతున్నావు?"

"కాదు. నీ గొంతునొక్కే సర్పయాగానికి సన్నద్ధమౌతున్నాను"

క్షణం ఆగిన ప్రభంజనరావు అర్థమైనట్టుగానవ్వి "అంటే సతీధర్మాన్ని ఇంకా నిర్వహించాలనుకుంటున్నావన్నమాట" అన్నాడు వ్యంగ్యంగా. సతీధర్మ అన్న పదం ఆమెననుకున్నా తాకినా అనుమానమేదో తలెత్తినా పెద్దగా శ్రద్ధచూపలేదు.

"అవును రావూ. ఇన్నాళ్ళూ మనసు నిప్పుల కొలిమిలా మండుతున్నా నిగ్రహించుకున్నాను. ఇప్పుడు నువ్వు నావాళ్ళమీద దండయాత్ర మొదలు పెట్టేసరికి బాహాటంగా యుద్ధానికి సిద్ధపడుతున్నాను."

అవతలవేపునుంచి జవాబు లేదు కొద్దిసేపటివరకూ....

"నీ పత్రిక ద్వారా పోరాడాలనుకున్నావు.... ఇప్పుడు రశ్మి ఇరుక్కుపోయింది.

రశ్మి ఏమైవుంటుంది. ఏమన్నా అఘాయిత్యం జరిగిందా అన్న ఆలోచనతోనే "రశ్మి కాదు ఇరుక్కున్నది నువు." అంది నెమ్మదిగా.

"పిచ్చిదానా.... రశ్మి నీ అండతోనే పేట్రేగే ప్రయత్నం చేసినా ఇంకా కొన్నిరోజుల గడువిచ్చాను. అది రేపు గెలుపుకోసం నేనిచ్చిన వ్యవధి తప్ప మీ అందరి గెలుపూ కాదని అర్థంచేసుకో.

అప్పటికి అర్థమైంది నిశాంతకు రశ్మిని ప్రస్తుతానికి విడిచిపెట్టబడిందని.

"అయినా.... ఆడదానితో ఎలా పోరాడగలనే"

"చూడు.... ఈవేళ విడుదలైన దినపత్రికలో మొదటిపేజీలోనే బాక్స్‌లో వేయబడిన అయిటంని"

"ప్రభంజనరావు అక్కడ దినపత్రిక అందుకున్నాడు.

మొదటి పేజీలోని బాక్స్ అయిటమ్‌ను చూసి నిజంగానే ఖంగుతిన్నాడు.

“సీతల్ని పతితలుగా మార్చుతున్న ఒకరాక్షసుడి విశృంఖల విహారం బాంబే రెడ్‌లైట్ ఏరియాకి వందలతో తరలించబడుతున్న అమ్మాయిల వాస్తవగాథలు. తన పలుకుబడితో ప్రభుత్వం నోరు నొక్కుతున్న ఆ ముఠా నాయకుడు ఎవరు.... పంతొమ్మిదవ తేదీనుంచి ధారావాహికలని ప్రచురించబడే యీ శీర్షిక....”

ఇక చదవలేనట్లు ఆగిపోయిన ప్రభంజనరావు కసితో పేపర్ని ముక్కలు ముక్కలుగా చించేసాడు.

పంతొమ్మిదవతేదీ అంటే సరిగ్గా మరో పదిహేనురోజులు.

ప్రభంజనరావు నుదురు చెమట పట్టింది.

అతడి కళ్ళలో రక్తపుజీరలు చోటుచేసుకున్నాయి.

* * *

““స్టాప్”

రోడ్డుకడ్డంగా నిలబడ్డారు రోడ్డు రవాణాధికారిలాంటి ఓవ్యక్తి.

‘తవుడునూనెను’ తీసుకు వెళ్తున్న పది ఆయిల్ టాంకర్స్ ఆగిపోయాయి—

సిటీ పొలిమేరల్లో ఇలాంటి అనుభవం కొత్తకాని లారీడ్రైవర్లు అంతా క్రిందికిదిగి లారీలో ప్రయాణం చేస్తున్న సూపర్వైజరు శివప్రసాదుతో బాటు ఆ వ్యక్తిని చేరుకున్నారు.

“మీ డ్రైవింగ్ లైసెన్సునీ, సీ బుక్సునీ నేషనల్ పర్మిట్ డాక్యుమెంట్సునీ చూపించండి” అన్నాడు....

అంతా లారీల్లోనుంచి తీసుకువచ్చి ఆ అధికారికి చూపించారు.

డాక్యుమెంట్సన్నీ చూస్తూ ఓ అరగంట కాలయాపన చేశాడా అధికారి.

తర్వాత లారీలన్నీ వరుసగా బయలుదేరాయి మళ్ళీ.

ఆర్ టి ఓ అధికారిలా నిలబడ్డ భాస్వంత్ మొహంలో ఓ చిర్నవ్వు మెరిసింది. పొదల్లోనుంచి బయటకు వచ్చిన నాగరాజుని చూడగానే.

“పూర్తయిందా” అడిగాడు భాస్వంత్.

“జయప్రదంగా.”

తర్వాత చివర పదోలారీ నిలబడివున్న ప్రదేశానికి వెళ్ళారు.

లారీలోనుంచి లీక్ అయిన సుమారు అయిదువందల లీటర్ల తవుడునూనె రోడ్డుప్రక్కన మట్టిలో ఇంకిపోయివుంది.

నిజానికి అది లీక్ అయింది కాదు.

డ్రైవర్లని ఒక అధికారిగా మభ్యపెట్టి అరగంట వ్యవధిపాటు ఏమార్చి తన మనుషులతో టాంకర్ వాల్వ్ ఓపెన్‌చేయించి తవుడునూనె బయటకు విడుదల చేసాడు.

తర్వాత అనుకున్న పథకం ప్రకారం పొదల్లోవున్న వేపనూనెను టాంకర్‌పైనున్న రంధ్రంద్వారా టేంకర్‌లోకి ఎక్కించాడు.

ప్లంజర్ సిస్టమ్ ద్వారా పెక్యవలుగా పంప్ చేయించి వేపనూనెని లారీలోకి ఎక్కించిన భాస్వంత్, సహకరించిన మనుషులకి డబ్బులిచ్చి పంపేసాడు.

ప్రభంజనరావుపై ప్రయోగించబడిన బలమైన అస్త్రమిదే. వేపనూనె కలవగానే తన రసాయనికమైన గుణాన్ని కోల్పోయే తవుడునూనె ఇంక ఎవరేకంపెనీలోని లక్షలలీటర్లను నిలవచేసే ఫేక్టరీ బంకర్స్‌లోకి ఎక్కించబడుతూంది. బంకర్స్‌లో అప్పటికే వున్న లక్షలలీటర్ల రైస్ ఒకఆయిల్ కూడా కల్తీ అవుతుంది.... పైప్స్‌లోనుంచి ఉత్పత్తి ప్రదేశానికి రప్పించబడిన ఆయిల్‌తో తయారుచేయబడే సబ్బులు “గట్టిపడక” ప్రోసెస్‌మొత్తం అస్తవ్యస్తమైపోయింది. వాస్తవం తెలుసుకునేసరికి కొన్నిరోజులుపడుతుంది ఫేక్టరీ యాజమాన్యానికి. ఆ తర్వాత ప్రయోగశాలద్వారా అర్థమైపోతుంది. జరిగిన అనర్థానికి మూలమెక్కడో. అంతే. లక్షలరూపాయల నష్టపరిహారంకోసం ఫ్యాక్టరీ యాజమాన్యం ప్రభంజనరావుపై చట్టపరమైన చర్యకు సిద్ధపడుతుంది.

ఆ రాత్రి నాగరాజును వైజాగ్ పంపేసాడు భాస్వంత్.

అనందంగా వుందతడికి. పిచ్చెక్కేటంత వివశత్వం. ఒకనాడు విశాంతకు యీనాడు విశాంతలాంటి ఆడపిల్లలకి ఎందరికో అన్యాయం చేస్తున్న ప్రభంజనరావు దారుణంగా అన్యాయమైపోతాడు.

ఆ మరుసటిరోజే బంగార్రాజు వచ్చాడు బ్రీఫ్ కేస్‌తో డబ్బుపట్టుకుని. "అద్భుతమైన రెస్పాన్సు వస్తూంది భాస్వంత్. వ్యాపారంలో వున్న నేను సైతం వూహించలేదు....ఒక సామాన్యమైన పథకం ఇంత బలంగా ప్రజల్లోకి చొచ్చుకుపోతుందని....ఉత్తరాలతో పంపుతున్న కూపన్లతో ఊపిరి తిరగడం లేదంటే నమ్ము." ఉత్సాహంగా భాస్వంత్ వాటాగా అయిదు లక్షలిచ్చాడు.

కేష్ చూస్తూ మృదువుగా మందహాసం చేసిన భాస్వంత్ "ఇప్పుడేం చూసారు రాజుగారూ. మరి కొన్నాళ్ళు ఆగండి. ఊపిరితిరక్క పోవడం కాదు. ఊపిరి అందదు. సరిగ్గా అదే సమయానికి ప్రభంజనరావు పంటా పండిపోతుంది" అన్నాడు.

"అన్నట్టు" వెళ్ళబోతున్న రాజు క్షణం ఆగి "మా మేనల్లుడు వచ్చేవారమే అమెరికానుంచి వస్తున్నాడు. బహుశా శిరీషకి యీ నెలాఖరున పెళ్ళి జరిగిపోతుంది" అన్నాడు.

బంగార్రాజు వెళ్ళిపోతుంటే "వన్‌మినిట్" అన్నాడు ఏదో గుర్తు చేసుకుంటున్నట్టు.

"డ్రాసరీస్ కంపెనీ మీ పేరున వుందా"

"అహఁ! నేను మేనేజింగ్ పార్ట్‌నర్ని....నాపెద్ద అల్లుడు పార్ట్‌నర్"

"మరి రైస్‌బ్రాన్ ఆయిల్"

"నేనే మొత్తం యజమానిని."

"ఓపని చేయండి...." సాలోచనగా చూస్తూ "మొత్తం ఆ ఫేక్టరీ మీ శిరీష పేర్న ట్రాన్స్‌ఫర్ చేయండి" అన్నాడు.

"ఎందుకు" అర్థంకానట్టు చూసేడు.

"ప్రభంజనరావు మీ మీద వేస్తున్న చివరి పథకంలో మీరు బలి కాకుండా వుండటానికి."

"భాస్వంత్....అస్సలు...."

"దయవుంచి ఇప్పటికి వివరాలు అడక్కండి. మీ మంచికోరి చెబుతున్నాను....అయినా శిరీష మీ అమ్మాయేగా. ఆస్తి మీ అమ్మాయి పేరున

అదే రజని పేరున మార్చి ఒకనాడు ఇన్‌సాల్వెన్సీ పిటీషను ద్వారామిమ్మల్ని మీరు రక్షించుకున్నారు— ఇదేం మీకు కొత్తకాదుగా" భాస్వంత్ గంభీరంగానే అన్నాడు.

బంగార్రాజు కొన్ని క్షణాల వరకూ మాటాడలేకపోయాడు. అతడి వూహ కందడంలేదు భాస్వంత్ ఆలోచనగాని ప్రభంజనరావు పథకంగాని.

తనపేరు నుంచి శిరీష పేరుమీదికి ట్రాన్స్‌ఫర్ చేయమంటున్నాడు. అదీ ఒక్క రైస్‌బ్రాన్ ఆయిల్ ఫేక్టరీ మాత్రం.... అంతేగా. "భాస్వంత్ నీ మేధస్సును శంకించని వ్యక్తిగా రేపే నేను శిరీషను ఆ ఫేక్టరీ యజమానురాలిగా చేస్తున్నాను" చెప్పి వెళ్ళిపోయాడు బంగార్రాజు.

"అంకుల్ నాకు సునీల్‌తో పెళ్ళవుతుందా" అమాయకంగా అడిగిన శిరీష రూపం గుర్తుకొచ్చింది.

ఆ సాయంకాలమే శిరీషకి ఫోన్ చేసాడు. "శిరీషా- నేనమ్మా భాస్వంత్‌ని."

"అంకుల్" ఆమె గొంతులో దుఃఖం స్పష్టంగా వినిపిస్తూంది. "మా బావ వచ్చేస్తున్నాడు."

"దిగులు పడకమ్మా. నీకు సునీల్‌తోనే పెళ్ళవుతుంది." ధైర్యం చెప్పాడు. "కాకపోతే నువ్వు కాస్త మొండిగా ప్రవర్తించాలి అవసరమైతే.

"ఎలా"

"మీ బావ వచ్చినా నేను పూర్వం ఏర్పాటు చేసిన ఫోటోల మూలంగా నువ్వు సునీల్‌తో అఫైర్‌లో వున్నావని తెలిసి నిన్ను కాదనాలి. లేదు నువ్వే కావాలి అన్నాడనుకో....కుదరదని చెప్పేయ్. సునీల్‌నే పెళ్ళి చేసుకుంటానను."

"నాన్న ఊరుకుంటాడా."

"ఊరుకుంటాడు" ఎందుకంటే రైస్‌బ్రాన్ ఆయిల్ కంపెనీకి నువ్వు యజమానురాలివౌతున్నావు కాబట్టి."

"అదెలా?"

"అదంతా నేను వేసిన పథకం శిరీషా....నువ్వు మేజర్‌వికాబట్టి

పైగా బోలెడంత డబ్బున్న వ్యక్తివి కాబట్టి అందర్నీ ఎదిరించైనా బ్రతకగలవు. ఏమంటావు?"

ఫోన్ క్రెడిల్ చేసాడు. "ఒకనాడు ఆకలి వేసిన నేను నీ డబ్బులు తిన్న పుణ్యానికి నీ తండ్రి ఆస్తి పూర్తిగా కొట్టక ముందే నీకోసం ఒక చిన్నమార్గం ఏర్పాటు చేసానమ్మా....నామీద నువ్వుంచిన నమ్మకాన్ని నిజంచేసే ప్రయత్నం చేసాను."

రిలాక్సింగ్‌గా సోఫాలో కూర్చున్నాడు.

భాస్వంత్ వూహిస్తున్నాడు ఆ తర్వాత ఎన్ని సంఘటనలు వేగంగా జరిగిపోయేదీ.

పోరాటపు చివరి అధ్యాయంలో అడుగుపెడుతున్న తను ప్రత్యర్థులకు అందుబాటులో కాక అజ్ఞాతంగా వుంటూనే కథ నడిపించాలి.

లేనినాడు తన కథ ముగిసిపోతుంది.

పైకి లేచాడు.

* * *

"ప్రభంజనరావుగారూ మీరు వెంటనే రశ్మి దగ్గరనుంచి కేసు విత్ డ్రా చేసుకుంటున్నట్టుగాని లేదా రాజీపడుతున్నట్టుగాని రాయించకపోతే చార్జిషీట్ ఫైలు చేయక తప్పదు....పైనుంచి వస్తున్న ఒత్తిడ్ని మేం తట్టుకోలేకపోతున్నాం."

ప్రభంజనరావుకి చాలా నమ్మకస్తుడైన ఓ పోలీసాఫీసరు చివరి హెచ్చరికలా అన్నాడు.

ఇప్పటికి మూడురోజులుగా ఎదురుచూస్తున్నాడు రశ్మి కోసం....

మరోపక్క నిశాంత ప్రకటించిన ప్రఛన్నయుద్ధం గడువు సమీపిస్తోంది.

భాస్వంత్ ఎక్కడున్నదీ అంతు చిక్కడంలేదు....

ఒకవేళ రాజా కేసు కోర్టుకు వెళితే మకుటంలేని మహారాజుగా వెలుగుతున్న తన పరపతి బజారుపాలు అవుతుంది. దానికితోడు నిశాంత

తన పత్రిక ద్వారా ఆ విషయానికి మరింత కవరేజ్ ఇస్తూ ప్రజల దృష్టిని తనపైకి మరికాస్త మల్లిస్తుంది.

ఈలోగా పత్రికలో ఆ ఫీచర్ మొదలైతే తన పునాదులు పూర్తిగా కదిలిపోతాయి.

ఏం చేయాలి....ఏదో చేయాలి.

దశాబ్దాల అకుంఠిత దీక్షతో కట్టుకున్న కోటబురుజులు కూలితే అందులో తను సమాధి కావటానికి సిద్ధంగా లేడు.

చాలా బలవంతుడైన ప్రభంజనరావు ఇద్దరు ఆడపిల్లల తాకిడికి ప్రళయ ప్రభంజనానికి ప్రకంపించిపోతున్న చిగురుటాకులా కదిలిపోతున్న క్షణమది.

"రంగారావ్" అరిచాడు ఒక పెనుభూతంలా....చెప్పాడేదో.

మరో అరక్షణంలో అతని మార్బలం బయటికి దూసుకుపోయింది.

అప్పుడు జవాబు చెప్పాడు పోలీసాఫీసరుకి. "నా చివరి ప్రయత్నంగా రశ్మిద్వారా మీ సమస్యని పరిష్కరించబోతున్నాను.... తప్పితే రశ్మిని దారుణంగా మానభంగం చేయించి చంపుతాను. ఆ తర్వాత నా ముఠాలో ఓ వ్యక్తిని మీకు నేరస్థుడిగా అప్పచెబుతాను....నేరంవాడు అంగీకరిస్తాడు. తన వ్యక్తిగతమైన ఓ కక్షతో ఇంతపనీ చేసానని శిక్ష అనుభవిస్తాడు ఎలా వుంది."

"అద్భుతం....కాని వాడు మీ మనిషిగా మాత్రం రికార్డు కాకుండా చూడండి."

"ఇది నాకు తొలిసారి గాదుగా. ఇలాంటి విషయాలలో జాగ్రత్త పడకుండా వుంటానా?"

ఫోన్ క్రెడిల్ చేసాడు....

అప్పుడు సరిగ్గా రాత్రి తొమ్మిదిన్నర అయింది.

* * *

తలుపుల్ని దబదబా మోదుతుంటే భయంతో క్షణం తెప్పరిల్లలేక పోయిన రశ్మి గడియ తీయకుండానే కిటికీ సందులోనుంచి బయటకి దూసింది.

అంతే.... ఆమెకు అర్థమైపోయింది....

జీపుదగ్గర యమకింకరుల్లాంటి వ్యక్తులు నిలబడి వున్నారు. వీధిలోని నాన్ని బెదిరిస్తున్నట్లుగా.

తలుపుల్ని బ్రద్దలుచేయాలని చేస్తున్న వారి ప్రయత్నాలు ఆమెకు ష్టమైంది. ఎంతటి బలమైన సంకల్పంతో ఆ ముఠా వచ్చిందీ....

వేగంగా ఆలోచిస్తుందామె....

ఏంచేయాలి? అమ్మ ఇంకా హాస్పటల్లోనే వుంది.

ఆలస్యంచేస్తే తను పూర్తిగా అన్యాయమైపోతుంది.

ఒక ఒంటరి ఆడపిల్లగా వీళ్ళని ఎదుర్కోవడం సాధ్యంకాని పని. కవేళ అంగీకరించి లొంగిపోతే....

లాభంలేదు....ఇన్నాళ్ళు లొంగని తన నిర్లక్ష్యానికి కేస్ విత్‌డ్రా సుకున్నా తనను విడిచిపెడతారన్న నమ్మకం లేదు....

మరో రెండునిమిషాలు గడిచాయి.

తలుపుల్ని పగులగొట్టి లోపలికివచ్చిన రంగారావు బృందం అంతా గ్గా అప్పుడుచూసారు పెరటి వేపునుంచి బయటికి పరుగెడుతున్న శ్మిని....

“అదిగో....”

వెంటపడ్డారు....

అప్పటికే రశ్మి సందుమొగనిదాటి మరణభీతితోచీకటిని చీల్చుకుంటూ సుకుపోతూంది.

మరో అరక్షణంలో మెయిన్‌రోడ్డును చేరుకునేదే....

అక్కడ ఎదురుగా ఇద్దరు గూండాలు నిలబడివున్నారు వికృతంగా వ్వుతూ.

వెనక్కి తిరిగింది....చాలా సమీపంలోకి వచ్చేసిన రంగారావు తోవకు వారధి వేసినట్టు నిలబడి ఉన్నారు తన మనుషులు.

రశ్మి కళ్ళనుంచి నీళ్ళు రాలుతున్నాయి భయంతో....

24

ఆ చిన్న సందులో వింతగా మూగిన జనానికి కళ్ళముందు జరుగుతున్న మారణకాండలో వినోదం తప్ప జోక్యం చేసుకోవాలన్న ధ్యాస కలగలేదు.

దిగ్బంధంలో ఇరుక్కున్న రశ్మి రంగారావు చేతికి చిక్కింది.

ఒక ఆక్రందన ఆమె నోటినుంచి వెలువడబోయి గుండెకడ్డం పడినట్టు గొంతులోకి సమాధి అయిపోయింది.

దూరంగా రశ్మి ఇంటిముందు అంతవరకూ ఆగివున్న జీప్ చాలా వేగంగా దూసుకు వచ్చిందక్కడికి.

చేపపిల్లలా గిలగిలా కొట్టుకుంటున్న రశ్మి నోరు నొక్కుతూ ఒక శవాన్ని మోసినట్టు పైకెత్తుకుని జీప్ వెనుకభాగంలో చేర్చాడు.

అందరూ కూర్చున్నాక జీపు ముందుకు కదిలింది.

రశ్మి ఇప్పుడు గింజుకోవడంలేదు.

చాలా నిశ్శబ్దంగా వుండిపోయింది వధ్యశిలపైకి వెళుతున్నట్టు.

ఈ మహాయజ్ఞంలో బలిపశువుగా మారుతున్నతనను ఇక ఆదేవుడు కూడా రక్షించలేడు.

ఎందుకో హఠాత్తుగా అమ్మ గుర్తుకొచ్చింది. ఆ తర్వాత చిన్ననాటి ప్రియనేస్తం రశ్మి ఒకనాడు తాళికట్టిన

జీపు వేగంగా దూసుకుపోతుంటే మృత్యు గహ్వరంలోకి అడుగు పెడుతున్న చివరిక్షణాల్ని ఆమె లెక్కపెడుతూంది.

"ఎక్కడికి?" రంగారావు అరిచాడు ముందున్న డ్రయివర్‌కేసి చూస్తూ....

"పోలీస్టేషన్‌కి!"

ఆ జవాబుకి అందరితోపాటు రశ్మికూడా ఉలిక్కిపడింది.

జీపు ఆగింది....

తల వెనక్కితిప్పిన వ్యక్తిని చూసి గూండాలందరూ నిశ్చేష్టు అయ్యారు.

ఇంతవరకూ జీపు డ్రయివ్‌చేసింది భాస్వంత్....

"నువ్వా...." అంటూ భాస్వంత్‌పై కలియబడిబోతుంటే "అటు చూడండి" అన్నాడు భాస్వంత్ నవ్వుతూ.

ఇప్పుడా జీపు కాచిగూడా పోలీస్ స్టేషన్‌కి అభిముఖంగా నిలబడి వుంది....

అందరూ నిస్సహాయంగా చూస్తుంటే నెమ్మదిగా అన్నాడు — "ఏం ఆగిపోయారు? సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రామకోటి లోపలే ఉన్నట్టుంది మిమ్మల్ని పరిచయంచేస్తే చాలు బుర్ర రామకీర్తనలు పాడిస్తాడు.... ఏం చేయమంటారు? మర్యాదగా దిగిపోతారా? లేకపోతే జీపును స్టేషన్‌లోకి మళ్ళించమంటారా?"

చుట్టూ జనంతో చాలా రద్దీగావుంది. ఎలాంటి హడావుడి చేసినా కటకటాలు తప్ప ప్రయోజనంలేదు.

చేసేదేమీ లేనట్టు దిగిపోయారంతా.

"రంగారావుని చూస్తూ అన్నాడు భాస్వంత్—"చూడూ! జీప్‌దగ్గర ఇందాక కాపలాఉన్న మీ స్నేహితుడు ఇంకా స్పృహతప్పే ఉండిఉంటాడు. వాడిసంగతి కాస్త చూడండి."

గూండాలు వెళ్ళిన తరువాత "ముందుకురండి" అన్నాడు రశ్మిని చూస్తూ.

బుద్ధిమంతురాలయిన బాలికలా ముందుకొచ్చి కూర్చుంది.

జీపు నడుపుతూ అన్నాడు— "చూడండి రశ్మీ! ఆడపిల్లకి ఆత్మవిశ్వాసం అవసరమే కాని. అది అహంకారంగా మారితే పరిస్థితులు ఇలాగే ఉంటాయి."

"అవునూ...."సిగ్గుతో తలవంచుకునే అంది. "సరిగ్గా ఆసమయానికి సినిమాలో హీరోలా ఎలావచ్చారు?"

"జవాబు మీ ప్రశ్నలోనే వుంది" నవ్వాడు. "సినిమాలో హీరోలా రావాలనిపించింది."

"అది కథ!"

"కొన్ని జీవితాలు కథకన్నా చిత్రంగాఉంటాయి రశ్మీ" గంభీరంగానే అన్నాడు.

"మీరు బాగా మాటాడుతారులెండి....కాదనను"

"మీరు కాదన్నా, నాతో మాటాడనన్నా చెప్పాల్సిందేదో నేను చెప్పాలిగా" అతడు వెంటనే సీరియస్‌గా మారిపోయాడు.

"చూడండి! ఒక్కోమారు ఏ పాశం మనల్ని బందిస్తుందో, ఏ బంధం మనల్ని వెంటాడి ఓడిస్తుందో మరి. ఓడిపోతూ కూడా ఆఓటమిలో ఆనందం పొందుతూ వుంటాం....మీకోసం నేను చేస్తున్న ప్రయత్నమూ అలాంటిదే....నాకు తెలుసు మీరు నన్ను ద్వేషిస్తారని. అయినా ఆసమయానికి వచ్చాను. ఇంట్యూషన్....అంతే! దానికి పెద్దతర్కం అక్కర్లేదనుకుంటాను."

ఆమె చూస్తున్నది మాటల్లో అపురూపమైన వ్యక్తిత్వాన్ని ప్రదర్శిస్తున్న విజ్ఞాన భండాగారాన్ని కాదు....

చిన్ననాడు రహస్యంగా తనను కలుసుకునేటప్పుడు ప్రపంచానికి

తెలీని ఓమూల గోప్యంగా తనకు తాళికట్టినప్పుడు ఇలాగే విశ్వాసాన్ని ప్రదర్శించిన బావని....చిట్టిబావని....

“ఏంటి చూస్తున్నారు?” అన్నాడు తల తిప్పకుండానే.

దొరికిపోయినట్టు గభాలున చూపు మరల్చింది.

“చిత్రమైన వ్యక్తి మీరు. ఇష్టాన్ని కాని అయిష్టాన్ని కాని పెదవి విప్పకుండా చూపులతో చెప్పేయగలరు” స్వాభవికంగానే అన్నాడు.

అప్పటికి జీపు నిశాంత యింటిదగ్గర ఆగింది.

నిశాంత బాబీతో సహా బయటకు వచ్చింది.

టూకీగా చెప్పాడు జరిగింది.

“చూడు రశ్మి! ఇప్పటి సంఘటనతో ముడి మరింత బిగుసుకుంది. ప్రభంజనరావు వేట ఉధృతమౌతుంది కాబట్టి, కొన్ని రోజులపాటు మీరిక్కడే ఉండటం మంచిది” మామూలుగా అని నిశాంతను చూసాడు— “నిశాంతా! నేను ప్రతిక్షణమూ నీకు కనిపించకపోయినా అనుక్షణమూ ఇక్కడి పరిస్థితిని గమనిస్తూనే వుంటాను....కాస్త జాగ్రత్తగా వుండండి.”

రశ్మి రెప్పలార్చకుండా చూస్తోంది భాస్వంత్‌నే.

“రశ్మి! నా పరంగా మీకు ప్రమాదం కలగదని హామీ యిస్తూ యింటిలోకి సైతం అడుగుపెట్టకుండా వెళుతున్నాను....గుడ్‌లక్!”

ఆ వాక్యం ఆమె గుండె అట్టడుగుపొరల్లో ఎక్కడో తగిలి బాధగా మెలిపెట్టింది.

అసంకల్పితంగా జారుతున్న కన్నీటిని ఆమె ఆపే ప్రయత్నం చేయలేదు.

“రండి భోంచేద్దురుగాని!” నిశాంత గొంతులోని ఆప్యాయత లజ్జగా తలవంచుకుంది రశ్మి.

“ఆయన్ని ఆపాల్సింది భోజనానికి.

“లాభంలేదమ్మా! ఆయన నిద్ర తిండిమరచి చాలారోజులై పోయింది”

డయినింగ్ టేబుల్‌దగ్గర వడ్డన చేస్తుంటే రశ్మి క్షణంపాటు తల పైకెత్తి చూసింది నిశాంత్‌వేపు.

అదే ఆత్మీయత....అదే మందహాసం.

ఎ తపస్సుతో సాధించారీ నిశ్చలతని....అంత టెన్షన్‌లో కూడా నిశ్చలంగా కనిపించిన బావకూడా గుర్తుకొచ్చాడామెకు.

“తొలిసారికూడా నన్ను ప్రభంజనరావునుంచి కాపాడింది ఆయనే” అంది రశ్మి.

“మిమ్మల్నే కాదు నన్నుకూడా ఆ రొంపినుంచి లాగిందీ ఆయనే!”

“ఈ సంఘటనతో బహుశా ఆయనకీ ప్రభంజనరావుకీ మధ్య గొడవ మొదలవుతుందేమో కదూ” అంది రశ్మి భయంతో జరగబోయేది తలుచుకుంటూ.

“ఇప్పుడేమిటి ఎప్పుడో మొదలయింది.

“ఎందుకు?”

“చెప్పమంటారా?” నిర్వేదంగా నవ్విన నిశాంత. ఒక విధంగా కారణం మీరే” అంది.

“నేనా!”

“అవును రశ్మి! మీపై బలప్రయోగానికి సిద్ధపడతానన్న రోజునే ప్రభంజనరావుకీ ఆయనకీ చెడింది. ఇప్పుడు తారాస్థాయిని చేరుకుంటుంది. కాని....” ఏదో రొప్పుతూ క్షణం ఆగింది నిశాంత.... మరుక్షణం నోటికి చేతినడ్డం ఉంచుకొని గభాలున సింక్ దగ్గరకువెళ్ళి భళ్ళున వాంతిచేసుకుంది.

“ఏం జరిగింది? ఒంట్లో బాగోలేదా?” రశ్మి ఆసరా ఇస్తూ అడుగుతుంటే నిశాంత కళ్ళు నీటికుండలయ్యాయి.

ఏం జరిగిందీ అర్థంకాగానే ఉత్సాహం, ఉద్రేకం, ఉన్మాదం ఆమెను నిలువునా కుదిపేస్తుంటే యుగాంతానికి చివరి క్షణంలో ఒకయుగం ఉదయించినంత లాలసత్వంతో స్వప్నంలోలా నడుస్తూ పూజగదిని చేరుకుంది నిశాంత.

నిశ్శబ్దంగా దేవుడుముందు మోకరిల్లి అశ్రువులతో శ్రీరాముడి పాదయుగళాన్ని అభిషేకించింది.

"ఈ సర్వ చరాచర సృష్టికి మూలకారకుడయిన ఓ భగవంతుడా! శబరి ఎంగిలితిని ఆమెకు ముక్తిని ప్రసాదించడంలో ఔచిత్యం నాకిప్పుడు అర్థమైంది. అస్తిత్వం లేకుండా పడివున్న ఒక ఇసుకరేణువు అయాచితంగా నీ పాదాలను తాకి పునీతమవటంలో గల అదృష్టం ఇప్పుడు నాకు బోధపడింది. అరవిరిసి కూడా అడవిపువ్వుగా రాలిపోవాల్సిన నా బ్రతుక్కి ఇంతటి ఉనికిని కలిగించావు....ఏ పూలతో నిన్ను కొలిచేది....ఏ గాలి అలగామారి నిన్ను తాకేది?"

నిశ్శబ్ద రోదనలో నిర్నిమేషని వేదనలో మిగిలిపోయింది.

"కంగ్రాచ్యులేషన్స్" అభినందించింది రశ్మి అప్పటికి అర్థమైనట్టు.

నిశాంత బాబీని అక్కున చేర్చుకుంది అమాంతం.

"ఏంటి మమ్మీ!" అర్థంకాలేదు బాబీకి.

"నీకు ఓ బుజ్జితమ్ముడు పుడుతున్నాడు" అంది రశ్మి బోధపరుస్తున్నట్టుగా.

"భలే....భలే....నిజంగానా మమ్మీ?" హుషారుగా నిశాంతను కావలించుకున్నాడు.

"ఈ శుభవార్త మీవారి చెవినవేస్తే బాగుండేది."

నివ్వెరపోయిన నిశాంత "మావారా....అంటే?" అర్థోక్తిగా చూసింది.

"ఆయనే....భాస్వంత్!"

నిర్వేదంగా నవ్వింది నిశాంత. "అమ్మా రశ్మీ! అలసిపోయిన నా ఎవతయానంలో అనుకోకుండా తారసిల్లిన దేవుడుకాని దేవుడు భాస్వంత్. పతరికో తాళికట్టి ఆ తాళి నా మెడలో చూసి తనను తాను మరిచి ఎప్పుడో జీవినమైన నాకు మాతృత్వపు వరాన్ని ప్రసాదించిన భగవంతుడు."

"అంటే...." రశ్మి గుండెల్లో దడ.

"భాస్వంత్ నా వాళ్ళను తృప్తి పరచటానికి నాకు భర్తగా నటించాడు తప్ప నిజానికి నాకు భర్తకాడు."

ఆవాస్తవం రశ్మి హృదయాంతరాళల్లోకి చొచ్చుకుపోయి క్షణంపాటు

వివశురాల్ని చేయగా "అంటే....బా...." బావ అన్న పదాన్ని పూర్తిచేసి తానెవరన్నది చెప్పాలని ఉద్రేకపడిన రశ్మి ఎవరో గొంతు నొక్కినట్టు టక్కున ఆగిపోయింది.

రెండుక్షణాలపాటు నిశాంతను చూసింది రెప్పలార్పకుండా.

ఏం తక్కువయ్యా నా స్నేహితురాలిలో....

విధి వక్రించి వేసిన ముద్ర తప్ప అందంలోకాని గుణంలోకాని బావకు భార్య కాగల ఏ అర్హత లోపించింది.

ఇంత చేరువైన వీరు రేపు మరింత దగ్గర కావచ్చు.

అందుకే తను నిశ్శబ్దంగానే వుండిపోవాలి.

నిశ్శబ్దంగా నిలబడి వారి కలయికలో ఒక అందమైన సమ్మేళనాన్ని దర్శించాలి.

అంతే తప్ప కొన్ని క్షణాల క్రితం వరకూ తనకున్న మధుర స్వప్నాన్ని చెరిపేసుకోకూడదు....

బావ విషయంలో మొన్నటి అపోహ ఇప్పుడు తొలగి మరో కొత్త వూహకి దారితీసింది.

* * *

జీప్ని రోడ్డుపై నిర్మానుష్యంగా వున్నచోట వదిలిపెట్టిన భాస్వంత్ ఆ రాత్రి తను కారు పార్క్ చేసిన హోటల్లోనే వుండిపోయాడు.

మనసంతా ఆందోళన....

తనకోసం ప్రభంజనరావు ఎలా వేటాడుతున్నదీ అర్థమౌతూంది స్వేచ్ఛగా తిరగడమూ ప్రమాదమేనన్న విషయం గ్రహించడంతో మరుసటి రోజు మధ్యాహ్నం వరకూ హోటల్లోనే వుండి బట్టలు బాగా మాసిపోవడంతో కారులో గెస్టుహౌస్కి బయలుదేరాడు.

రశ్మి విషయంలో కంగారుపడే ఆమె తల్లిదండ్రులకు ఆమె విషయంలో భయపడవద్దని చెప్పటం కోసం వెళ్ళాలి.

అది ముందుగా భాస్వంత్ చేయాలనుకున్నది.

పరిసరాలను ఏకాగ్రతగా గమనిస్తూనే గెస్టుహౌస్‌లో అడుగు పెట్టాడు.

ఫోన్ రింగవుతూంది గదిలోకి వచ్చేసరికి.

నెమ్మదిగా రిసీవర్ని అందుకున్నాడు.

"భాస్వంత్ నేను బంగార్రాజుని." చాలా సేపటినుంచి ప్రయత్నిస్తున్నట్టు హడావుడిపడుతున్నాడు. "నా కొంప మునిగింది."

భాస్వంత్‌కు తెలుసు అతడేం చెబుతున్నదీ.

అయినా మామూలుగానే అడిగాడు "ఏం జరిగింది?"

"పోలీసులు వారంటు పట్టుకుని నాకోసం వెదుకుతున్నారు."

"ఎందుకు"

"కస్టమర్స్ని మోసంచేసి లక్షలు కొట్టేసానని చీటింగ్ కేసు బుక్ చేసి నావెంటపడ్డారు."

నవ్వుకున్నాడు భాస్వంత్.

లక్షల కూపన్‌లు అమ్ముడుపోయాక కస్టమర్స్‌లో "ఫ్లో" ఒకచోట ఆగిపోతుంది. అంటే కొన్నిలక్షలు బంగార్రాజుకు జమయ్యాక కస్టమర్స్‌లో కనువిప్పు కలుగుతుంది. ఈలోగా తన కమీషను తనకు ముట్టచెప్పడంతో డబ్బు వెనక్కి సర్దుబాటు చేయలేని బంగార్రాజు ఇరుకునపడతాడు. దాని కిక్కరణం తెలివైన కస్టమర్స్ కొందరు కోర్టుకు వెళ్ళడం....

అయితే అనుకోకుండా తొందరపాటులో బంగార్రాజు చట్టపరంగా చేసిన ఒకే ఒక్క పొరపాటు—

"మూడు రూపాయలకో బ్రాసరీ" అంటూ పబ్లిసిటీలో స్పష్టం చేయడం.

ఈ లెక్కన మూడురూపాయలు ఒక్క కూపనుసైతం నింపిన కస్టమరుకి తక్కిన సర్క్యులేషన్‌తో సంబంధం లేకుండా బ్రాసరీలు అందించాలి....అలాచేస్తే కంపెనీ దివాళా తీస్తుంది. లేనినాడు బంగార్రాజు నేరస్థుడౌతాడు."

ఈ చిన్న మెలికతోనే బంగార్రాజును ముంచాడు భాస్వంత్.

"చూడు మిస్టర్ బంగార్రాజూ....నిన్ను కొంత ఆస్తిని శిరీష పేరున ట్రాన్స్‌ఫర్ చేయమన్నది అందుకే. ట్రై చేయి....ఇప్పుడు ఇన్‌సాల్వెన్సీ పిటీషన్‌తో నిన్ను నువ్వు కాపాడుకోగలవేమో."

"ఎలా....అదెలా సాధ్యమౌతుంది" బంగార్రాజు పొలికేకలు పెడుతున్నాడు.

"ఒకనాడు మా నాన్నని ముంచి ఐపి పెట్టేసావుగా. అలాగే."

"భాస్వంత్...." బంగార్రాజు అరిచాడు భాస్వంత్ పథకం అర్థమైనట్టుగా....

"ఏడవరా....దొర్లి దొర్లి ఏడువ్. నమ్మకద్రోహంలో నువ్వే నిష్ణాతుడివని నా తండ్రి విషయంలో నిరూపించుకున్న నేరానికి నా తండ్రికి పుట్టిన కొడుకుగా నేను వేసిన ప్రణాళికలో కూరుకుపోయిన నువ్వు గుండెలవిసేలా ఏడువు.... నీ యుక్తి నా స్వశక్తి దెబ్బతీసిన యీ క్షణాన్ని తలచుకుంటూ ఒక జీవితకాలం ఏడుస్తూ బ్రతుకు."

ఫోన్ పెట్టేసాడు భాస్వంత్ ఇక వినాల్సినదేమీ లేదన్నట్టుగా.

సరిగ్గా ఇదే సమయానికి....

ఇండ్‌లీవర్ కంపెనీ యాజమాన్యం కల్తీ తవుడునూనెని సరఫరా చేసి లక్షల ఖరీదు చేసే ఉత్పత్తి మట్టిపాలు కావడానికి కారణమైనందుకు పాతిక లక్షల రూపాయల నష్టపరిహారం కోసం పంపిన లీగల్ నోటీస్ కూడా అందింది ప్రభంజనరావుకి.

"రంగారావ్" పిచ్చివాడిలా అరిచాడు ప్రభంజనరావు "ఏంటిది ఏం జరిగింది.

అసలే మనఃస్థిమితం తప్పివున్న ప్రభంజనరావు ఊపిరి అందనివ్వకుండా మరో మారణాస్త్రం మీదికి సంధించబడటంతో తోకకొక్కినత్రాచుగా మారిపోయాడు.

"ఎలా ఇదెలా జరిగింది" రెట్టించాడు.

సరిగ్గా ఆ సమయంలో అక్కడికి పరుగెత్తుకు వచ్చాడు—ప్రభంజనరావు చిరకాల ప్రత్యర్థి ఇప్పుడు ఊబిలో కూరుకుపోయాక శత్రువుకి శత్రువైనందుకు హఠాత్తుగా మిత్రుడైన బంగార్రాజు.

"ఎందుకిలా వచ్చావు" అసహనంగా రంకె వేసాడు ప్రభంజనరావు.

"ఒక శత్రువు చేత దెబ్బతిన్న నేను నా శత్రువే నీ శత్రువు కూడా అని తెలియచెప్పటానికి."

చెప్పాడు బంగార్రాజు.

ఇద్దరు బలమైన ప్రత్యర్థులు కలిసిపోయారు.

ఇద్దరిదీ ఒకే లక్ష్యం....

"రంగారావ్" చాలా నిగ్రహంతో పిలిచాడు ప్రభంజనరావు.... అతడు చెప్పింది విన్నాక నేరాలలో ఆరితేరిన రంగారావుకే ముచ్చెమటలు పోసాయి.

* * *

మధ్యాహ్నం పన్నెండు గంటలవేళ....

భాస్వంత్ నెమ్మదిగా సందు చేరుకున్నాడు.

మరో అరఫర్లాంగు నడిస్తే రశ్మి ఇల్లు....రశ్మి కోసం తన మనుషుల్ని ప్రభంజనరావు కాపలాగా వుంచుతాడని తెలుసు....అందుకే ముందు జాగ్రత్తగా పరిసరాల్ని గమనించాడు.

అనుమానస్పదంగా లేదు. కాని మరో వందగజాలు నడిచాక టక్కున ఆగిపోయాడు అక్కడ రశ్మి ఇంటిముందు జనం గుంపుగా నిలబడి వుండటంతో.

ఏం జరిగి వుంటుంది.

సమీపంలోని ఓ పాన్‌షాపులో అడిగాడు.

కొద్దిసేపు తటపటాయించిన షాపు యజమాని రహస్యంగా చెప్పాడు. "ఆ ఇంటిగలాయన్ని రాత్రి ఎవరో చంపి రోడ్డుమీదపడేసారట. ఇంకా పోలీసులు వచ్చినట్టు లేరు."

భాస్వంత్ భృకుటి ముడిపడింది. "ఒకవేళ రశ్మి దొరకని అక్కసుతో ప్రభంజనరావే ఇదంతా చేయించాడా" అనుకున్న భాస్వంత్ స్తబ్దంగా కొద్దిసేపు నిలబడిపోయి ముందీ విషయం రశ్మికి తెలియపరచాలనిపించడంతో ఫోన్‌కోసం సమీపంలోని మెడికల్‌షాపుకి వెళ్ళాడు.

వాస్తవాన్ని వెంటనే ఉన్నదున్నట్టు చెబితే రశ్మి తట్టుకోలేదనుకున్నాడు. నిశాంతకు ఫోన్ చేసి "రశ్మిని వాళ్ళింటికి వెంటనే రమ్మను నిశాంతా! ఆమె తండ్రికి ఆరోగ్యం సరిగాలేదని చెప్పు" అన్నాడు.

ఆ తర్వాత నెమ్మదిగా ఆ గుంపువరకూ నడిచిన భాస్వంత్ రశ్మి తల్లి శవంపైపడి చేస్తున్న ఆక్రందనల్ని వినలేనట్టు దూరంగానే వుండిపోయాడు.

"దేవుడిలాంటి మనిషి మీరు....ఏ రాక్షసుడికి కన్నుకుట్టిందయ్యా....ఏపాపం చేసానని నా పసుపుకుంకుమల్ని చెరిపేసారయ్యా—పగవాడినైనా పల్లెత్తిమాటనని మామీద ఇంత అఘాయిత్యం చేసినవాడు పురుగులుగారిపోతాడయ్యా. మీరులేని నేనెలా బ్రతకనయ్యా...."

ఒక అరణ్య రోదనలా వినిపిస్తుంటే మరికాస్త దగ్గరకుచేరిన భాస్వంత్ ఉలికిపాటుగా ఆగిపోయాడు.

అక్కడ నుదుట కుంకుమ చెరిగిన ఆమె. ఆమె తన అక్క 'నయన' అంటే....రశ్మి....తను వెంటాడే రశ్మి తన మేనకోడలా—

"అ....క్కా" అన్న పిలుపు అతని నోటినుంచి వెలువడకముందే భాస్వంత్ దృష్టి శవంపై పడింది.

అంతే....ఒక శతఘ్ని పేలి అతడి మెదడునువ్రయ్యలు చేసినట్టు అచేతనుడైపోయాడు.

ఆ శవం- ఆరోజు తవుడునూనె లారీల్ని ఆపినపుడు వాటితో వెళతున్న సూపర్‌వైజరు శివప్రసాద్‌ది.

అంటే....ఆ కసితోనే ప్రభంజనరావు చంపించి వుంటే తన అక్క పసుపు కుంకుమలు చెరిగిపోవటానికి తన సుబ్బులు తండ్రిలేనిది కావటానికి తనే పరోక్షంగా కారణమయ్యాడు.

"ఇన్నేళ్ళ తర్వాత మనం ఇలా కలుసుకోవాల్సి వచ్చిందా అక్కా."

భాస్వంత్ కళ్ళనుంచి నీళ్ళు రాలేయి.

మెదడు అరల్లో శూలాలతో పొడుస్తున్నట్లు నొప్పి.

తూలిపడబోతున్న భాస్వంత్‌కి ఎవరో ఆసరా ఇచ్చారు. "శివప్రసాద్ నీకు బావని తెలుసుకున్న ప్రభంజనరావుగారు నీతో చేతులు కలిపే తవుడు నూనెని కల్తీ చేయించారన్న అపనమ్మకంతో రాత్రి హత్య చేయించారు."

అప్పుడు చూసేడు భాస్వంత్ పక్కన నిలబడి ఆసరా ఇచ్చిన రంగారావుని.

"యూ" నిగ్రహాన్ని కోల్పోతూ మీదికి లంఘించబోతుంటే పక్కలో గుచ్చుకుందేదో.

"భాస్వంత్ నీ నడుంపై ఇప్పుడు రివాల్వర్ గురిపెట్టబడివుంది." రహస్యంగా అన్నాడు. "చుట్టూ జనం వున్నారు కాబట్టి అల్లరి చేయకుండా నా వెంట నడిస్తే బ్రతికిపోతావు. లేదా నీకూ యీ రోజే అంత్యక్రియలు పూర్తవుతాయి."

భాస్వంత్ నిర్లిప్తంగా చూసేడు.

తెలిసి జరిగినా తెలియక జరిగినా యీ పాపానికి మూలకారకుడైన తను యీ స్థితిలో తన వాళ్ళకు తను పరిచయం కాలేడు.

ఒక చిల్లరదేవుడితో తను జరిపిన పోరాటంలో ఒక సామాన్య భక్తుడు ప్రాణాలు కోల్పోయాడు.

పిస్టల్ మరింత బలంగా నొక్కాడు రంగారావ్. "వ్యవధి లేదు- నడువ్."

భాస్వంత్ దృష్టి అసంకల్పితంగా దూరంగా వస్తున్న రశ్మిపై పడింది.

రంగాడావు ఆమెను చూడకూడదు....నడిచాడు గుంపులోనుంచి.

వెన్నులో సన్నగా చలి ప్రారంభమైంది భాస్వంత్‌కు తానెటువంటి ప్రమాదకరమైన వలయంలో అడుగుపెడుతున్నదీ గుర్తుకురాగానే....

25

గుంపులోనుంచి బయటకు వచ్చారు భాస్వంత్ రంగారావులు.

ఒక ఆత్మీయుడిలానే నడుంచుట్టూ చేతినుంచి పిస్టలును బలంగా నొక్కిపెట్టి నడుస్తున్నాడు రంగారావు....

సందుమొగదల వరకూ నడిచేక నెమ్మదిగా అడిగాడు భాస్వంత్ "కారెక్కడ" అంటూ.

క్షణంపాటు దృష్టి మరల్చాడు రంగారావు.

అదే అతడు చేసిన పొరపాటు....

బలాన్ని కూడగట్టుకున్న భాస్వంత్ ఒక్క ఉదుటున ఎడమ మోచేతితో రంగారావు పొట్టపై గుద్దడమూ కుడిచేత్తో పిస్టలు పట్టుకున్న రంగారావు పిడికిలిని పక్కకు తొలిగించడమూ రెప్పపాటులో జరిగింది.

సన్నని మూలుగుతో రంగారావు నేలకూలిపోతూ పిస్టలును వదిలాడు.

ఆ అవకాశాన్ని జారవిడుచుకోని భాస్వంత్ పాదంతో పిస్టలును పైకి తన్ని చేత్తో అందుకుని నేలపడ్డ రంగారావును చూస్తూ అన్నాడు. "ఒరేయ్ రంగారావ్....చెప్పు ప్రభంజనరావుకి. వేగం ఒక్కటే కాదు పోరాటానికి ఒడుపు కూడా కావాలని. త్వరలోనే భాస్వంత్ తనంతట తానుగా మీపైకి దండెత్తి వస్తున్నాడని...."

రంగారావు తేరుకునేలోగా భాస్వంత్ అదృశ్యమైపోయాడు.

* * * *

ఫోన్ రింగవుతుంటే ఉద్వేగంగా వెళ్ళి అందుకుంది విశాంత.

ఆమె ప్రశాంతంగా వుండలేకపోతుంది ఈ మధ్య....ఏ క్షణాన ఏ దుర్వార్త వినాల్సివస్తుందోనన్న భయం ఆమెను ప్రతిక్షణమూ పీడిస్తూంది.

"హల్లో" ప్రభంజనరావు కంఠం వినిపించింది ఆవలవేపు నుంచి "బాగున్నావా నిశాంతా."

"ఏం కావాలి" తొణక్కుండానే అడిగిందామె....

"ఒకటి భాస్వంత్ రశ్మిల ప్రాణాలు....రెండు రేపే ప్రారంభం కాబోయే నీ పత్రికలోని ఫీచరు ఆగిపోవడం....ఈ రెండూ కావాలి."

నవ్వింది నిశాంత అది అంత సులభమనుకున్నావా ప్రభంజనరావ్."

"ఎందుకు కాదు నిశాంతా! ఇన్ని చేయగలిగిన నేను ఈ మాత్రం సాధించలేననుకున్నావా."

"సాధించగలిగిననాడు నన్నెందుకు అర్థిస్తున్నావు."

"నీకు కృతజ్ఞతన్నది చాలా ఎక్కువ కాబట్టి."

అర్థం కాలేదామెకు.

"ఇంకా బోధపడలేదా నిశాంతా....ఒక్కసారి ఫోన్‌లో విను."

రెండు క్షణాల నిశ్శబ్దం తర్వాత "మమ్మీ" బాబీ ఆర్తనాధం వినిపించింది ఆవలి వేపు నుంచి.

"బాబీ" ఆమె గుండె దడదడలాడింది. "అక్కడికెలా వెళ్ళావు నాన్నా."

"మరేమో....నువ్వు రమ్మన్నావని చెప్పి వీళ్ళు నన్ను స్కూల్ నుంచి తీసుకొచ్చేసారు మమ్మీ....నన్ను చంపేస్తారట....సిగరెట్లతో నా ఒళ్ళంతా కాల్చేస్తున్నారు మమ్మీ" బాబీ భయంతో ఏడుస్తుంటే నిశాంత కదిలిపోయింది.

"లేదు నాన్నా....నేను....నేను నిన్ను రక్షించుకుంటాను." కడుపులోని ప్రేవులు మెలిపెడుతుంటే ఆక్రోశించినట్టుగా అందామె.

"వద్దు మమ్మీ....నువ్విక్కడకు రాకు. వస్తే చంపేస్తారు."

"నా వరాలకొండా" నిశాంత కళ్ళనుంచి జలజలా నీళ్ళు రాలేయి. "నువ్వే దక్కనినాడు నాకీ స్థానమెందుకు....నా బ్రతుకెందుకు."

"అలా అనకు మమ్మీ...." బాబీ ఆగేడు నీరసంగా "మరేమో నీకు బొజ్జుంది. ఆ బొజ్జలో నాలాంటి బాబీ వున్నాడు....నేను చచ్చిపోయినా నీకింకో బాబీ వుంటాడుగా."

"భగవంతుడా" నిస్సత్తువగా గోడకి జారగిలపడిపోయింది నిశాంత. "అమ్మనమ్మా నేను....బ్రతికున్న బాబీ నాకు ముఖ్యంకాని నా బాబీ చిలిపి మాటలు వింటూ నేను బ్రతకాలి కాని యింకా రూపుదిద్దుకోని ఆ పిండంతో నాకు పనేమిటమ్మా....నేను వస్తాను నిన్ను కాపాడుకుంటాను."

"వద్దు మమ్మీ....నా మాటవిను" బాబీనుంచి ఫోన్ లాక్కున్న ప్రభంజనరావు కర్కశంగా నవ్వుతూ అన్నాడు. "చాలా సెంటిమెంటల్ సీన్ కదూ నిశాంతా! చెప్పు సరిగ్గా ఒక గంట టైంయిస్తున్నాను....భాస్వంత్ రశ్మిల్ని నాకు అప్పచెబుతావో లేకపోతే తునాతునకలైన నీ బాబీ శరీరాన్ని ఓ పార్సిల్‌లా అందుకుంటావో తేల్చుకో....చూడూ....పోలీసుల సహాయం అర్థించావో అది తెలిసిన మరుక్షణం బలయ్యేది నీ ముద్దుల బాబీ అని గుర్తుపెట్టుకో."

ఫోన్ క్రెడిల్ చేసిన చప్పుడు....

నిశాంత స్థాణువులా నిలబడిపోయింది నీళ్ళు నిండిన కళ్ళతో.

దూరంగా గోడపై ఉపాధ్యాయ నిలువెత్తు చిత్రం....

"వెలకట్టలేని స్థానాన్నిచ్చి అదృశ్యమైన ఒక దేవుడిగా మిగిలిన మీరు చెప్పండి....మీరు అప్పచెప్పిన బాధ్యతను నేనెలా నిర్వర్తించేది. మీ వంశాకురాన్ని నేనెలా కాపాడుకునేది....నేను బాబీకి తల్లి కాకపోయినా తల్లిలాగే ప్రేమించే ఆడదాన్నని మీకు తెలుసుగా....చెప్పండి" గాద్గదికంగా ఆమె గొంతు వణికింది.

అప్పుడు విందామె అడుగులచప్పుడు....

వెనుక భాస్వంత్ నిలబడి వున్నాడు.

మొహంలో కాంతి క్షీణించి ప్రేతకళతో చూస్తున్న అతడ్ని నెమ్మదిగా చేరుకుని "ఏం జరిగింది అలావున్నారేం" అంది.

"అలసిపోయాను నిశాంతా....నా యాత్రలో పూర్తిగా అలసిపోయాను" అతడి గొంతు జీరబోయింది. "చిల్లర దేవుళ్ళపైనే దండయాత్ర సాగించాలని ప్రయత్నించిన నేను, యీరోజు పరోక్షంగా ఒక నిర్భాగ్యుడి ప్రాణాలు కోల్పోవటానికి కారణమయ్యాను."

ఆమె విభ్రమంగా మరింత చేరువగా వచ్చింది.

"నిశాంతా! రశ్మి తండ్రి నా మూలంగా ప్రాణాలు పోగొట్టుకున్నాడు. ప్రభంజనరావుచే హత్య చేయబడ్డాడు."

అది ఆమెను బలంగానే కదిలించిన మొదటి షాక్.

"అసలు...." తడబడిపోతున్నాడు మాటలు కూర్చలేనట్టు "రశ్మి.... రశ్మి ఎవరోకాదు....నా మేనకోడలు....నీ బాల్యస్నేహితురాలు అయిన సుబ్బులు."

తూలిపడబోతున్న నిశాంత నిశ్చేష్టతతోనే నిలదొక్కుకుంది.

"ఎంత దురదృష్టవంతుడ్నో చూసావా నిశాంతా అక్కను చూసాను....నేను ప్రాణప్రదంగా ప్రేమించిన రశ్మి ఎవరో తెలుసుకున్నాను. అయినా నేనెవర్నైందీ చెప్పలేని స్థితిలో వెనక్కి వచ్చేసాను." భాస్వంత్ చెప్పుకుపోతూనే వున్నాడు.

కాని నిశాంతకి ఆ మాటలేం వినిపించడంలేదు.

ఆలోచిస్తూంది వికలమైన మనసుతోనే. విరాగిణిలా చూస్తూనే రశ్మి ప్రవర్తన గుర్తు చేసుకుని మథనపడుతూంది.

"రశ్మి! ఎక్కడో చూసానంటే కాదు నేనిక్కడే పుట్టి పెరిగా నన్నావు. మెరుపుల మరకల్లా నా మనసులో ముద్రవేసుకున్న నీ జ్ఞాపకాలను కావాలని తుడిచివేసే ప్రయత్నంగా ఒక అబద్ధం చెప్పి నన్ను జోకొట్టావు. ఎందుకమ్మా ఏ ఆలోచనలతో నన్ను మభ్యపెట్టాలనుకున్నావు....ఎందుకే సుబ్బులూ....ఎందుకిలా చేసావు. నువ్వెవరన్నదీ నిజం తెలిస్తే నేను అన్యాయమైపోతాననుకున్నావా....నీ పుణ్యఫలం నువ్వు నోచిన నోములు నాకే చెందాలని త్యాగానికి సిద్ధపడ్డావా....ఇద్దరం విడిపోయాం....కలిసిన మీరిద్దరూ విడిగా బ్రతికారు. ఇప్పుడు ముగ్గురం కలిసినా ఎవరికెవరో తెలియకుండా ఒకరికొకరయ్యాం." కళ్ళలోనుంచి నీళ్ళు సుడులు తిరుగుతుంటే విధి రాసిన వింత కథలోని ఇప్పుడు తిరగబోయే మలుపు గురించి ఆలోచిస్తూంది.

సరిగ్గా అప్పుడు మళ్ళీ ఫోన్ రింగయింది....నిశాంత అందుకుంది తేరుకుని.

ప్రభంజనరావు హెచ్చరిక మరోమారు.... భాస్వంత్ అడిగినా చెప్పలేదామె. కాని నిలదీసాడు. అయిష్టంగానే అంతా చెప్పింది.

"నిశాంతా...." భాస్వంత్ పెదవులు అదురుతున్నాయి. "నా అంతిమ యాత్రకు సమయం ఆసన్నమైంది. ఇందరి జీవితాలు నామూలంగా ఆహూతి కావడం నేను ఇష్టపడను—ప్రభంజనరావుని కలుసుకోటానికి వెళుతున్నాను."

దృఢనిశ్చయంతో కదలబోయిన భాస్వంత్ పాదాల్ని చుట్టేసింది. "వద్దు మీరు వెళ్ళొద్దు.... నా మనసేదో కీడు శంకిస్తూంది."

"తప్పదు నిశాంతా! అస్తవ్యస్తంగా మారిపోతున్న మన జీవితాలకు మొదటి ఆసరా ఇచ్చింది ఉపాధ్యాయ. బాబీకి అనుకోనిది జరిగిననాడు మన బ్రతుకులకి ఓ అర్థంలేదు. నన్ను వెళ్ళనియ్."

"నేనూ తోడుగా వస్తాను."

"నువ్వు తోడుగా వుండాల్సింది రశ్మికి."

ఆమెకు అర్థంకాలేదు.

"అవును నిశాంతా! ఒకవేళ యీ పోరాటంలో నేను తిరిగిరానినాడు మీరు ఒకరికొకరు తోడుగా వుంటారు. తిరిగివస్తే మీకు నేను అండగా వుంటాను."

"నా మాట వినండి" మొండిగా కదలబోతున్న భాస్వంత్‌ను వారించే ప్రయత్నం చేస్తూందామె. "రశ్మి కోసమైనా మీరు బ్రతకాలి."

భావగర్భితంగా చూసాడు నిశాంతను ఓ క్షణంపాటు "నిశాంతా మనిషి జీవితం ఓ అనుభవాల సమ్మేళనమే అయితే అందులో అసంకల్పితంగానైనా నాకో అద్భుతమైన అనుభూతిని మిగిల్చిన ఆడదానివి నువ్వు. న్యాయమేదన్నా కాని నేను బ్రతికివుంటే మీ ఇద్దరూ నాకు ముఖ్యులే." గంభీరంగా మారిపోయాడు "తిరిగివచ్చానా మృత్యుంజయుడినై నా అక్ష్యంలో నేను గెలిచినందుకు గర్వపడతాను. లేనినాడు ఆ

సమాధి అయిన మూడు శవాలతోపాటు నేనూ సమసిపోయానని సంతృప్తి పడతాను. వ్యవధిలేదు నిశాంతా. బై."

వెళుతున్న భాస్వంత్‌ను నీళ్లనిండిన కళ్ళతో అలాగే చూస్తూ వుండిపోయింది.

* * *

"మిష్టర్ ప్రభంజనరావ్"

ఫోన్ రిసీవర్‌ని బలంగా పట్టుకున్న ప్రభంజనరావు "నువ్వా భాస్వంత్ నీ కోసమే ఎదురు చూస్తున్నాను" అన్నాడు.

"అలాగా కాని నాకు బదులు నా ఫోన్‌కాలొచ్చింది కదూ."

"మంచి మూడ్‌లో వున్నట్టున్నావు."

"అవును.... మూడుయున్నవాడ్నిగా.... అది సరే బాబీ ఎక్కడ" మామూలుగా అడిగాడు భాస్వంత్.

"నా దగ్గరే భద్రంగా వున్నాడు....నువ్వు లొంగిన మరుక్షణం ప్రాణాలతో బయటపడతాడు."

"లేకపోతే అవకాశం లేదంటావ్."

"ఎంత అమాయకుడివి భాస్వంత్."

"నిజమే. ఒక్కసారి జాగ్రత్తగా యీ గొంతు వినండి" అనగానే ప్రభంజనరావు అర్థంకానట్టు చెవుల్ని రిక్కించాడు.

"డాడీ" అవతలినుంచి రాజా కంఠం వినిపించింది. "ఇతను నన్ను బట్టలువిప్పి సిగరెట్లతో కాల్చుతున్నాడు."

రాజా చెబుతుంటే క్షణం వణికిన ప్రభంజనరావు "ఒరే రాజా.... నువ్వెక్కడికెలా వెళ్ళావురా" ఆత్రంగా అడిగాడు.

"కాలేజినుంచి వస్తుంటే తన్ని మరీ తీసుకొచ్చాడు. ఇష్టం వచ్చినట్టు ఉతికేస్తూ టార్చర్ చేస్తున్నాడు."

"భాస్వంత్‌కి ఫోనివ్వు."

"నేనే మాటాడుతున్నాను" భాస్వంత్ కంఠం వినిపించింది. "చాలా సెంటిమెంటల్ సీను కదూ,"

"భాస్వంత్ ఇది దారుణం....ఒక పసివాడ్ని పట్టుకుని అలా రాక్షసంగా హింసించడం...."

"షటప్" భాస్వంత్ కసిగా వత్తిపలికాడు "ఆడపిల్లలను బాహాటంగా ముద్దుపెట్టగల సమర్థుడు గూండాలతో గదుల్లోకి ప్రవేశించి అబలలమానాల్ని దోచేయాలనుకునే లోఫర్ వీడు పసికందా...."

దభేలున శబ్దంతోపాటు "అమ్మా" అన్న మూలుగు ఫోన్‌లో వినిపించగానే "భాస్వంత్ వాడ్నేం చేయకు" అరిచాడు ప్రభంజనరావు.

"అలారా దార్లోకి. చెప్పు....బాబీ రాజా మార్పిడికి ఒప్పుకుంటావా."

ప్రభంజనరావు వెంటనే జవాబు చెప్పలేదు.

"వ్యవధిలేదు మిస్టర్ ప్రభంజనరావ్! ఈ మార్పిడికి నువ్వు అంగీకరించని మరుక్షణం నీ కొడుకు శవం తునకలై పార్శిల్‌గా నీకు పంపబడుతుంది."

"వద్దు....బాబీని నీకు అప్పచెబుతాను. ఇక్కడికి వస్తావా."

"తెలివిని ప్రదర్శించకు ప్రభంజనరావు....ఇచ్చి పుచ్చుకునే యీ బార్టర్ సిస్టమ్ జరగాల్సింది మీ ఇంటిలోనూ నీ పడగ్గదిలోనూ కాదు. కాచిగూడా పోలీస్‌స్టేషన్‌కి అభిముఖంగా సరిగ్గా మరో పదినిముషాలలో" చెప్పాడు భాస్వంత్ వివరంగా.

మరో ఎనిమిది నిముషాలలో బాబీతో సహా కారులో వచ్చిన రంగారావు పోలీస్‌స్టేషన్‌కు అభిముఖంగా నిలబడి వున్నాడు.

సరిగ్గా పది నిముషాల వ్యవధిలో భాస్వంత్ వచ్చాడు తన 'మారుతి'లో రాజాతోబాటు.

బాబీ 'అంకుల్' అంటూ పరుగున వచ్చి భాస్వంత్‌ను కావలించుకున్నాడు.

మార్పిడి జరిగింది.

రెండు నిముషాలపాటు బాబీని ముద్దుల్తో ముంచేసిన భాస్వంత్ ఒక వ్యక్తి తన కారును సమీపించిన విషయం గుర్తించలేకపోయాడు.

రాజాని ఎక్కించుకుని వెళ్ళిన కారు ఓ సందులోకి మలుపు తిరిగి ఆగింది.

రంగారావు కారు దిగి వెనక్కి నడుచుకువచ్చి రోడ్డుపై వెళ్తున్న భాస్వంత్ కారును పరిశీలనగా చూసి నవ్వుకున్నాడు. "మీరు అనుసరించండి" తమ ఆగిపోతున్న కారులోని మనుషులకి పని పురమాయించాడు రంగారావు.

"అంకుల్....మమ్మీ దగ్గరికి తీసుకెళ్ళు....బోలెడంత ఏడుస్తూంది." భాస్వంత్ పక్కన కూర్చున్న బాబీ హుషారుగా అంటున్నాడు చేతిపై బొబ్బల్ని చూసుకుంటూ.

ఆప్యాయంగా తలనిమురుతూ కారు వేగాన్ని పెంచిన భాస్వంత్‌కు తెలీదు—

కొన్ని నిముషాల క్రితమే పోలీస్‌స్టేషన్‌కు అభిముఖంగా ఆగివున్న అతని కారును సమీపించిన ఓ వ్యక్తి కారు వెనుకసీటు క్రింద ఓ బాంబ్‌ను వుంచాడని- అది మరో పదినిముషాలలో పేలటానికి టైం సెట్ చేయబడిందనీను....

* * * *

రశ్మి తన బాల్య స్నేహితురాలిగా తెలుసుకున్న నిశాంత ఎక్కువ సేపు ఇంటిదగ్గర వుండలేకపోయింది.

పైగా రశ్మికి ప్రభంజనరావు ఏదన్నా ఆపద తీసుకువస్తాడనీభయపడి కారులో బయలుదేరింది.

ఆమె వూహ తప్పుకాలేదు.

నిశాంత అక్కడకు చేరేసరికే ప్రభంజనరావు ముఠా అక్కడి వాతావరణాన్ని అస్తవ్యస్తంగా మార్చి రివాల్వర్లతో నిలబడివున్న గుంపును బెదిరించి మనసారా తండ్రి శవం ముందు కూర్చుని ఏడ్చే అవకాశం సైతం ఇవ్వకుండా రశ్మిని జీప్‌లో లాక్కుపోతున్నారు.

రశ్మి తల్లి గగ్గోలు పెడుతూంది.

నిశాంత చూస్తూంది అచేతనంగా.

ఆ ముఠాలో తన తమ్ముడు గిరి కూడా వున్నాడు.

నిశాంత కారులో అనుసరించింది.

26

బాంబ్ పేలటానికి మరో నాలుగు నిముషాల వ్యవధి మాత్రమే మిగిలినది.

"అంకుల్"

బాబీ హడావుడిగా పిలిచాడు.

సాలోచనగా చూసిన భాస్వంత్ బాబీ మాటలు వినడంలేదు....అప్పటికి సరిగ్గా వారం రోజుల తర్వాత ప్రారంభోత్సవం కావాల్సిన "గణిత విజ్ఞాన భారతి" గురించి ఆలోచిస్తున్నాడు.

నిన్ననే ఫోన్‌చేసి చెప్పాడు నాగరాజు....నిర్మాణం పూర్తయ్యిందని ప్రారంభోత్సవానికి తను అన్ని ఏర్పాట్లూ చేస్తున్నాడనీను.

కణతలు నొక్కుకున్నాడు డ్రైవ్ చేస్తూనే.

టెన్షన్....అంత టెన్షన్‌లోనూ చిత్రమైన ఆనందం....

తాను అనుకున్నది సాధించాడు.

అసంతృప్తుడిగా ప్రపంచాన్ని విడిచివెళ్ళిన తన తండ్రి చివరికోరిక తీర్చడంతోబాటు ఉక్రోషంతో దేవుడి ముందు తను చేసిన సవాల్‌ను గెలుపుగా మార్చుకోబోతున్నాడు.

ఎన్ని ఆటంకాలు....మరెన్ని నాటకీయమైన సన్నివేశాలు.

"ఆధ్యాత్మిక జీవన విధానంతోనే అనంతంలో విలీనమైన ఓ తండ్రీ! నువ్వు నాటిన యీ అంకురం ఇన్నాళ్ళకు నువ్వు కోరిన తరువుగా పెరిగెంది. నీ జ్ఞానాన్ని తన ధ్యేయంగా మార్చుకుని నీ అసంపూర్తి సమస్యకు అందమైన ఒక రూపకల్పన చేసి నన్ను గెలిపించింది. నువ్వొక విశ్వానివైతే నేను మానవక్రియా శక్తిగా రూపాంతరం చెందాను. కర్మజ్యాయోన్యా కర్మణః అని నువ్వు నేర్పిన ఉపదేశంతో కర్మయోగిగా మారి

బ్రతుకు బాటలో పయనించి నా ఉనికికి నీ ఆశీస్సులతోనే ఒక అర్థాన్ని కల్పించుకున్నాను."

"అంకుల్ వినమంటుంటే."

బాబీ మరోమాట రెట్టించాడు. అప్పటికి ఆలోచనల నుంచి తేరుకున్న భాస్వంత్ వింటున్నట్టుగా చూసేడు.

"చిటికినవేలు చూపిస్తున్నాను....కప్పించడం లేదా." అన్నాడు బాబీ నిక్కరుపై చేతినుంచి అదుముకుంటూ.

అర్థమైంది.

"మరో అయిదు నిముషాలలో ఇంటికెళ్ళిపోతాంగా" అన్నాడు.

"అబ్బా....జోరుగా వచ్చేస్తుందంటేనూ" మారాం చేసాడు.

"అదికాదమ్మా....మరేమో మీ మమ్మీ నీకోసం ఎదురుచూస్తూంటుందిగా."

కారునాపడం భాస్వంత్ కిష్టంలేదు.

"అంకుల్....ప్లీజ్ అంకుల్....నిన్న వాళ్ళు కొడుతుంటే భయంతో ఉచ్చపోసేసాను. పోసినందుకు కొట్టారు....ఆ తర్వాత భయ్యమేసి అలాగే అపుకున్నాను...." చాలా ఇబ్బందిగా తన నిస్సహాయ స్థితి గురించి ఏకరువు పెడుతుంటే నవ్వుకుంటూనే కారు ఆపేడు నిర్మానుష్యంగా వున్న ఓ ప్రాంతంలో....

బాబీ కారుదిగి వెళ్ళాడు రోడ్డు వారగా వున్న ఓ పొద దగ్గరికి.

మరో అరనిముషం గడిచింది.

కారులో కూర్చున్న భాస్వంత్ తలతిప్పి చూసేడు.

టైట్‌గా వున్న పేంటు బటన్స్ తీసుకోడానికి విశ్వప్రయత్నం చేస్తున్నాడు బాబీ....

ఇక తప్పని సరైనట్టు తనూ క్రిందికి వచ్చాడు భాస్వంత్.

అదే భాస్వంత్ విషయంలో బాబీ చేసిన గొప్ప సహాయం....భాస్వంత్ చెసుకున్న అదృష్టమూను....

అతడు బాబీ దగ్గరికి పూర్తిగా ఇంకా నడవనే లేదు....

హఠాత్తుగా ఒక విస్ఫోటకం చెవులు చిల్లులుపడేట్టు....

కారు తునకలయి ముక్కలు గాలిలోకి లేచాయి.

బాబీ భయంతో ముందుకు పరుగెత్తగా భాస్వంత్ విస్మయంతో పక్కకు తిరగబోయాడు.

కాని అప్పటికే అతడి తలమీద ఏదో బలంగా తాకింది.

రక్తం జివ్వుమంటూ తలలోనుంచి ధారగా కారుతుంటే నొప్పితో మెలితిరుగుతూ స్పృహ తప్పుతున్న భాస్వంత్‌కి కలగా కనిపించారు దృఢకాయులయిన నలుగురు వ్యక్తులు.

* * *

పట్టణానికి దూరం,గా ఉన్న ప్రభంజనరావు గెస్ట్‌హౌస్ అధి.

అతని సంఘవిద్రోహ కార్యకలాపాలకి రహస్యంగా జరగాల్సిన కొన్ని ప్రత్యేక కార్యక్రమాలకి ప్రత్యేకించబడిన ఆ గెస్ట్‌హౌస్‌లో రశ్మిని ఓ మూలకి నెట్టేసాడు గిరి.

"ఏంటే....నువ్వు భాస్వంత్‌కి మేనకోడలివి కదా....అలా అని మా వాళ్ళని తప్పుదోవ పట్టిస్తారా" అంటూ పైపైకి వెళుతున్నాడు.

అప్పటికే అక్కడికి చేరిన రంగారావు "ఇంకా మాటలతోనే సరిపెడుతున్నావా గిరీ....అసలు ఒప్పందమేంటో నీకు గుర్తుందిగా?" అన్నాడు వికృతంగా నవ్వుతూ.

ప్రభంజనరావు పథకం ప్రకారం రశ్మిని సామూహికంగా మానభంగం చేయాలి.

ఆ ప్రక్రియ వీడియో ఫిల్ములో బంధించాలి....

ఆ ప్రయత్నంలోనే రశ్మి ప్రాణాలు పోగొట్టుకోవాలి....

ఆ తర్వాత శవాన్ని గుర్తుపట్టి టేంకుబండ్‌లో విసిరేయాలి....

పోలీసులు శవాన్ని గుర్తుపట్టి ఒకవేళ ఇది ప్రభంజనరావు చేయించిన పనే అని అనుమానించినవారు గిరి తనే దోషిగా స్రెండర్ కావాలి.

దానికి అతడికి ముట్టచెప్పబోయే మొత్తం పాతికవేల రూపాయలు.

అప్పుడు రాజామీద కేసుఉండదు. నేరస్తుడిగా మరోవ్యక్తి పోలీసులకు లొంగి, అది తన వ్యక్తిగతమైన కక్షసాధింపు అనడంతో పోలీసులు ప్రభంజనరావుని అనుమానించక పోవడంతోబాటు ఇటు వీడియో ఫిల్మును విదేశాలకు అమ్మి, ఆ పాతికవేలునూ తను ఆ విధంగా క్యాష్ చేసుకోవడమూ జరుగుతుంది.

ఈ ఈప్రణాళికలో గిరినే ప్రత్యేకించి ఉపయోగించడానికి కారణం నిశాంత సెంటిమెంటల్‌గా తమ్ముడి విషయంలో సహకరిస్తుందన్న బలమైన నమ్మకం కూడా.

"వ్యవధిలేదు....తొందరగా కానివ్వండి" అరిచాడు రంగారావు.

రశ్మి భీతహరిణేక్షిణిలా దిక్కులు చూస్తూంది.

సుమారు రెండు దశాబ్దాలుగా బావ నిరీక్షణలో మనసుని, శరీరాన్ని పవిత్రంగా కాపాడుకున్న రశ్మి కళ్ళనుంచి నిస్సహాయంగా నీళ్ళు రాలుతున్నాయి.

బేబిలైట్స్ ఫోకస్ చేసారు....

వీడియో కెమెరా ఆన్‌చేయబడింది.

ముందుగా రశ్మిపై తన మగతనాన్ని ప్రకటించాలనుకున్న వాడు గిరి....

ఆనందంగా ఉంది గిరికి....

యవ్వనంలో అడుగుపెట్టాక డబ్బులిచ్చి అమ్మాయిల్ని అనుభవించడంలో ఉన్న థ్రిల్‌కన్నా ఇది మరీ చిత్రంగా అనిపిస్తూంది.

అందుకే ఒక్క ఉదుటున రశ్మిపైకి లంఘించాడు.

పులిపంజా తాకిడికి తప్పించుకున్న లేడిపిల్లలా రశ్మి పక్కకు దొర్లింది.

నేలపై బోర్లాపడిన గిరి మోకాటిచిప్ప పగలడంతో 'అమ్మా'అన్నాడు ఒక్కక్షణం పాటు.

ఉక్రోషం మరింత ఎక్కువయింది. వేగంగా రశ్మి భుజాలను పట్టుకున్నాడు చూపుల్ని రాక్షసంగా మార్చుకుంటూ.

వీడియో కెమెరా నిశ్శబ్దంగా పనిచేసుకుంటూ పోతుంది.

రంగారావుతోబాటు అక్కడున్న మరో ఇద్దరు గూండాలు చాలా ఉత్సుకతగా గమనిస్తున్నారు ఆ సన్నివేశాన్ని.

సరిగ్గా ఆ సమయంలో కెమేరా ఫ్రేంలోకి మరో ఆకారం రావడం గమనించిన కెమెరామెన్ ఉలికిపాటుగా తల పైకెత్తి చూసాడు.

అక్కడ ఎదురుగా నిలబడివుంది నిశాంత.

"రంగారావ్!" అరిచాడు కెమెరామెన్.

కాని అప్పటికే ఆలస్యమయింది.

* * * *

భారంగా కళ్ళుతెరిచాడు భాస్వంత్.

తలపై సమ్మెట్లతో బాదినట్టు భరింపశక్యంకాని నొప్పి....తలనుంచి ధారగా కారిన రక్తం మొహంపై అట్టలా గడ్డకట్టుకు పోయింది.

చేతుల్ని తాళ్ళతోకట్టి రెండు స్థంభాలమధ్య నిలబెట్టడంతో నీరసంగా ఉండిపోయాడు కదిలేశక్తి లేనట్టు.

ఆ గదిలో నేలంతా తడిగావుంది. అదోరకమైన దుర్గంధం....

"ఏంరా! చిట్టెలుకలా నా ఇంట్లో ప్రవేశించింది చాలక పొట్టేలుగా మారి మా కొండను ఢీకోవాలనుకున్నావా?" ప్రభంజనరావు పిడికిలి బలంగా భాస్వంత్ పొట్టలోకి దిగింది.

క్షణంపాటు నొప్పితో మెలిదిరిగిపోయాడు.

"మా ఇద్దరిమధ్య శతృత్వాన్ని ఆసరాగా తీసుకుని, డీలర్‌షిప్ అంటూ ప్రాసరీలతో లాభాలు సంపాదించచ్చుని నన్ను వెధవని చేస్తావా?" మరో బలమయిన ముష్టిఘాతం పొట్టలోని ప్రేవుల్ని తాకింది.... అప్పుడు చూసాడు విస్తారిణగానే....ఈసారి అలా గుద్దింది బంగార్రాజు.

అర్థమైంది భాస్వంత్‌కి ఆస్థితిలోకూడా. ఇద్దరు బలమైన ప్రత్యర్థులు తనను తుదముట్టించే ప్రయత్నంలో చేతులు కలిపారు.

భాస్వంత్ జవాబు చెప్పకపోవడంతో మరింత పెట్రేగిపోయిన ఇద్దరూ పిచ్చెక్కిన ఆబోతుల్లా ఆగకుండా అందినప్రతిచోటా బాదుతున్నారు.

భాస్వంత్‌కు తెలిసిపోయింది తన చివరిక్షణాలు ఆసన్నమైనట్టు.

ఈ వలయంలోనుంచి ఇక తప్పించుకోలేడు.

వారిని మాటలతో రెచ్చగొట్టి మరింత రాక్షసంగా హింసించడం కంటే మౌనంగా మరణాన్ని ఆహ్వానించడం నయం!

ఆ ఆలోచన రాగానే అంత నిస్సహాయ స్థితిలోనూ ఉలికిపడ్డాడు.

మరణమా....

ఏంటి తనిలా ఆలోచిస్తున్నాడు....

ఇలాంటి చేతకాని చావును కోరలేక కదూ తనీ సుదీర్ఘప్రయాణాన్ని మొదలుపెట్టింది....

ఇలాంటి ఆటుపోట్లకు వెరవనని కదూ తను దేవుడిముందు నిలబడి సవాల్ చేసింది.

ఎందుకు తన శక్తిలా హరించుకుపోతూంది.... దేహ పరిత్యాగానికైనా సిద్ధపడి ఒక ప్రేతాత్మగా మారయినా తన లక్ష్యాన్ని చేరాలనుకున్న నిబ్బరం ఏమైపోయింది? ఇప్పుడేం జరగబోతూంది?

"చూడరా భాస్వంత్! నువ్విప్పుడు నిలబడింది ఎక్కడో తెలుసా? నేనుతవుడునూనె తయారుచేసేఫ్యాక్టరీలోవాడతానే ఎగ్జిన్....పెట్రోలుకన్నా తొందరగా మండే ఎగ్జిన్ మధ్య...."

నేలపై ఉన్నది నీరుకాదు అన్నది పూర్తిగా బోధపడింది. అది పెట్రోలుకన్నా త్వరగా మండే పెట్రోలియం ప్రొడక్టు ఎగ్జిన్.

భావరహితంగా వింటున్నాడు.

"నువ్వు మాకుచేసిన ద్రోహానికి నా తవుడునూనెని కల్తీచేసి నాకు తెచ్చిపెట్టిన నష్టానికి నిన్ను ఎగ్జిన్‌లోనే కుక్కచావు చచ్చేట్టు ఏర్పాటు చేసాను. ఒక్కక్షణంలో నీ రూపం సరాసరి చితాభస్మంగా మారిపోతూంది"

అంటూ లైటర్ వెలిగించి, అంటించబోతుండగా "ఆగండి!"అన్నఓస్వరం వినిపించింది.

ఇప్పుడు వారికెదురుగా ఓ యువతి నిలబడి ఉంది.

ప్రభంజనరావుకి అర్ధంకాలేదు ఆమె ఎవరో.

"నేను ఎవర్నని ఆశ్చర్యపోకండి. మీలాగే ఇతని మూలంగా అన్యాయమైపోయిన ఒక ఆడదాన్ని.

భాస్వంత్ సయితం విభ్రమంగా చూస్తున్నాడు ఆమె ఎవరో గుర్తుకు రాకపోవడంతో.

ఆమె ఠీవీగా ముందుకు నడచివచ్చింది.

"ప్రభంజనరావుగారూ ఇలాంటి ఒక సామాన్యుడి విషయంలో మీరింత హైరానా పడటం, ఆ నేరం మీమీదే వేసుకోవడం నాకు నచ్చని విషయం" ఆగింది క్రూరంగా భాస్వంత్‌వేపు చూస్తూ.

"ఒక్క అవకాశం నాకివ్వండి. ఒకనాడు ప్రేమించానని చెప్పి, నన్ను తల్లినిచేసి యుక్తిగా నన్ను వదిలించుకుని, ఆ నిశాంత వెంటపడి తన కామజ్వాలకి నన్ను ఆహూతిచేసిన వీడ్ని నేను మంటల్లో మాడేట్టు చేస్తాను."

ఆమె కళ్ళనుంచి జలజలా నీళ్ళురాలేయి. "ప్రభంజనరావుగారూ.... ఆ తర్వాత నేనేమైనా ఫర్వాలేదు. వీడ్ని చంపే అదృష్టాన్ని నాకు కలిగించండి!"

ప్రభంజనరావుకి అవగతమైంది—తమలాగే భాస్వంత్ యుక్తిలో మోసపోయిన ఆడది ఆ యువతికూడా అని.

"సరే కానియ్" లైటర్ అందించాడు.

"భాస్వంత్" ఆవేశంగా ముందుకునడిచి ఆవేశంగా అతడి చెంపలు వాయగొట్టింది. ప్రకంపించిపోతూనే బోరున ఏడ్చింది—"మిష్టర్ భాస్వంత్" తేరుకున్నట్టుగా భావరహితంగా చూసింది. "నిన్ను యింత సునాయాసంగా చంపడం నా కిష్టంలేదు. నువ్వుపోయేముందు నిన్నింకా రాక్షసంగా హింసించాలనుంది."

ఆమె వేగంగా నడుచుకుంటూ ప్రభంజనరావును చేరుకొని....

"ఒక్క సహాయం చేయగలరా?" అంది.

అర్ధంకాలేదు ప్రభంజనరావుకి.

"ఒకనాడు నా అందాన్ని కవితాధోరణిలో వర్ణించిన ఈ భాస్వంత్‌ని మానసికంగా చిత్రవధ చేయాలనుంది" ఆగి, ప్రభంజనరావునే చూస్తూ— "నేను మీకు నచ్చినట్టయితే నా అందం అనుభవించదగ్గదే అయితే భాస్వంత్ కళ్ళెదుటే మీతో సంభోగానికి సిద్దపడాలనుంది" అంది స్థిరంగా.

ప్రభంజనరావుకి ఆడది కొత్తకాదు.

కాని యిలాంటి ఆడది కొత్త....ఇలా అడగడం కొత్త....పైగా భాస్వంత్ తనకు ప్రత్యర్థి. అతడ్ని అన్ని కోణాలలోనూ చిత్రవధచేయడం ఇష్టమైన విషయమే.

అంతకుమించి ఒక అందమయిన ఆడపిల్ల తన పొందుకోసం ఆహ్వానిస్తూంది.

"సరే!" అంటూ చుట్టూ చూసేడు.

బంగార్రాజుతో పాటు అతడి అనుచరులూ గది వదలి దూరంగా వెళ్ళిపోయారు.

ఆమె భాస్వంత్‌ను చూసి నవ్వుతూంది రాక్షసంగా.... నవ్వుతూనే తన శరీరంపై వున్న ఆచ్ఛరనా విప్పి నేలపైకి విసిరేస్తూంది.

ప్రభంజనరావు గుండె వేగంగా కొట్టుకుంటూంది.

అతనికిప్పుడు భాస్వంత్ గుర్తుకు రావడంలేదు....తన స్థితిగతులు సైతం మరిచిపోయాడు ఎదురుగా ఉన్న ఆమె నగ్నశరీరాన్ని చూడగానే....

భాస్వంత్ కళ్ళుమూసుకున్నాడు చూడలేనట్టు.

అక్కడ ప్రభంజనరావు ఆ యువతిని ఆక్రమించాలని తన శక్తినంతా కూడగట్టుకున్నాడు.

ఇప్పుడు నిశ్శబ్దంగా ఉన్న ఆ గదిలో....

ఆమె నిట్టూర్పులు వినిపిస్తున్నాయి. ప్రభంజనరావు మరింత రెచ్చిపోతుంటే ఆమె అతడ్ని నలిమేస్తూ మరింత కాంక్షగా మూలుగుతుంది.

* * *

రంగారావు ఒక్కఅంగలో నిశాంతను చేరుకున్నాడు.

మరుక్షణం 'అమ్మా' అన్న ఆర్తనాదం అతడి గొంతులో.

మీదికొచ్చిన రంగారావు అతనూహించని రీతిలో నిశాంత ఓ పదునైన కత్తిని అతడి పొట్టలో గుచ్చడంతో ఆమె కంఠాన్ని నొక్కబోయిన చేతులు ఆగిపోయాయి.

ఒక మొదలు నరికిన తరువులా నేలకూలాడు.

హఠాత్తుగా అక్కడి వాతావరణం మారిపోయింది.

అక్కడివాళ్ళు జరిగిందేమిటో తెలుసుకునేసరికి నిశాంత రశ్మిని చేరుకుంది....

మరుక్షణం గిరి వెన్నులో మరోపోటు బలంగా దిగింది.

"అ....క్కా...." నేలమీదకి పడిపోతూ చూసేడు బాధగా మెలితిరిగిపోతూనే....

ఇప్పుడామె ఓడిన ఒక ఆడదానిలా లేదు....ప్రపంచం మొత్తాన్ని భస్మీపటలం చేయగల ఆదిశక్తిలా వుంది.

అశ్రుశిక్త నయనాలతో నేలమీదపడి గిలగిలా కొట్టుకుంటున్న తమ్ముడ్ని చూసింది. "అక్కా అని కాదురా! నీలాంటి అర్భకుడికి జన్మనిచ్చిన తల్లిని గుర్తుచేసుకుంటూ 'అమ్మా' అని ఆక్రందన చెయ్యి.... అక్కకు జరిగిన అన్యాయం సయితం గుర్తులేకుండా మరో అక్కలాంటి ఆడదానిమీద అత్యాచారం చేయడానికి సిద్ధపడ్డ రాక్షసుడా....నీకు తోబుట్టువునైనందుకు ఈ క్షణాన కూడా నేను సిగ్గుపడుతున్నాను."

అడుగు ముందుకు వేయబోయిన దుండగులు ఆమె క్రోధరణ నేత్రాలను చూసి ఆగిపోయారు.

అక్కడ అనూహ్యంగా నేలజారిన అతి ముఖ్యులయిన ఇద్దరి

వ్యక్తుల్ని చూస్తూ కాళిలా కళ్ళనుంచి అరుణజ్వాలల్ని కురిపిస్తూ మీదికొస్తున్న ఆమెను చూసి వెనకడుగువేసి బయటకు పరుగెత్తారు.

హఠాత్తుగా ఆ గదిలో నిశ్శబ్దం చోటుచేసుకుంది.

"సుబ్బులా...."

నిశాంత గొంతులో ఆర్ద్రత వెల్లువై పొంగింది.

వెక్కిపడుతున్న రశ్మి అమాంతం నిశాంతను చుట్టేసి పసిపిల్లలా ఏడ్చేసింది....

"ఎందుకే పిచ్చిదానా! ఎందుకేడుస్తావ్! కలిసి బ్రతకాల్సిన మనల్ని విడదీసి వెర్రిగా ఆడుకున్న విధాత తనతప్పుకి విలపించాలి గాని మనంచేసిన నేరమేంటే.... తాళికట్టింది నీకైనా ఆ తాళిని దాచిన నన్ను తల్లిగా మార్చి దేవుడు నీకు అన్యాయం చేసాడని నేను ఏడవాలికాని నా చిన్నారిచెల్లి.... నా ముద్దుల సుబ్బులా.... నువ్వు చేసిన తప్పేముందే!"

ఎన్నిక్షణాలు దొర్లిపోయాయో, ఎన్ని నిముషాలు నిశ్శబ్దంలో ఇమిడిపోయాయో వారికి గుర్తులేదు.

తేరుకునేసరికి ఎదురుగా రెండు శవాలు కనిపించాయి.

వెనువెంటనే నిశాంతకు భాస్వంత్ గుర్తుకొచ్చాడు.

* * *

ప్రభంజనరావు అలసటగా లేచాడు ఆవేశం చల్లారడంతో.

అప్పటికే లైటరుతో ఆ యువతి భాస్వంత్‌ని చేరింది.

"మిస్టర్ భాస్వంత్....ఎలా ఉందిప్పుడు? నీ కళ్ళముందు జరిగిన సృష్టి కార్యానికి మనసు మండిపోయిందా లేక మరోక్షణంలో నిన్ను చుట్టుకునే మంటలకి భయంగా ఉందా?"

"ఛీ!" అసహ్యంగా మొహంమీద ఉమ్మేడు.

అంతే! అది సహించలేనట్టు ప్రభంజనరావు ఆవేశంగా భాస్వంత్‌ను చేరాడు ఒక్కవేటుతో అతడ్ని నేలకూల్చాలనే.

అదే భాస్వంత్‌కు అవకాశమైంది.

అమాంతం కాళ్ళను పైకిలేపి ఒక గొలుసులా ప్రభంజనరావు నడుం చుట్టూ వేసి గట్టిగా బిగించాడు....

ప్రభంజనరావు కేకతో ఆ గది ప్రతిధ్వనించగా అది విన్న అతని అనుచరులు ఆవేశంగా ముందుకు రాబోయారు....

"ఆగండక్కడే"

లైటరు వెలిగించిన యువతి గట్టిగా అరిచింది. వినకుండా ముందుకు రాబోయిన వార్ని చూస్తూ "చెప్పు ప్రభంజనరావ్! మీ వాళ్ళిక్కడ అడుగుపెట్టిన మరుక్షణం యీ లైటర్‌తో అంతా అంటించేస్తాను మాతోపాటు నీ ప్రాణాలూ గాలిలో కలిసిపోతాయి."

"రాకండి" అంటూ వారించాడు ప్రభంజనరావు గిలగిలా కొట్టుకుంటూనే. "నువ్వు...."

"నేనేరా....ఒకనాడు నీ ఆటవిక న్యాయానికి ఆహుతైన ఆడదాన్ని. నీ మూలంగా బ్రతుకునాశనమై ఎయిడ్స్‌లాంటి వ్యాధితో నాశనమౌతూ పోయేముందు ఆ జబ్బును నీకంటగట్టాలని వచ్చిన దాన్ని ఒరేయ్.... పాములతో చెరలాటలాడి ఆయువు ఆ పాముకాటుతోనే అంతమైపోతూంది. ఏం....నన్ను గుర్తుపట్టలేకపోతున్నావా నేనేరా....నాగరాజు భార్యని.... నిశాంతను రెడ్‌లైట్ ఏరియానుంచి తప్పించిన సరోజను."

అంతకు కొన్ని నిముషాల క్రితమే ఆమెతో శారీరక సంపర్కానికి సిద్ధపడిన ప్రభంజనరావు శరీరంలో ఎయిడ్స్ క్రిములు ప్రాకుతున్నట్టు వణికిపోతూ చూపేడు.

ఆమెచేతిలో లైటరు వెలుగుతూంది ఏ క్షణంలో అయినా మంటల్ని రేపేట్టు.

27

సరోజ లైటర్‌ని అలా వెలిగించి పట్టుకునే నెమ్మదిగా భాస్వంత్ చేతుల కట్లు విప్పింది.

అడుగు ముందుకేస్తే జరగబోయే ఉపద్రవాన్ని గుర్తించిన ప్రభంజనరావు అనుయాయులు నిశ్శబ్దంగా నిలబడిపోయారు ఉన్న చోటనే.

బంధవిముక్తుడైన భాస్వంత్‌ను చూస్తూనే కనుకొలకులనుంచి జారిన నీళ్ళను తుడుచుకుంది సరోజ.

"వెళ్ళిపోండి భాస్వంత్. ఈ ప్రభంజనరావునిలాగే అడ్డం పెట్టుకుని నిలబడతాను....త్వరగా వెళ్ళిపోండి" అర్థిస్తూందామె....

భాస్వంత్ కదలలేదు....దైవశక్తిమీద ఏనాడో నమ్మకాన్ని పోగొట్టుకున్న అతడు భక్తిపూర్వకంగా చూస్తున్నాడామెను....

"ప్లీజ్ త్వరగా వెళ్ళండి" రెట్టించిందామె.

"వెళ్తాను....కాని ఒంటరిగా కాదు....మిమ్మల్ని కూడా తీసుకుని మరీ వెళతాను."

నిర్లిప్తంగా నవ్వింది. "నేను బ్రతకకూడని ఆడదాన్ని.... బ్రతికి యీ గాలిని నేలను మైలపరచలేని వ్యాధిగ్రస్తురాలిని....నా గురించి ఆలోచించకండి. "ప్లీజ్" ఆమె తొందర చేసింది.

భాస్వంత్ అయిష్టంగానే కదిలాడు.... అతడలా ఆ గదినిదాటింది కేవలం తనను తాను రక్షించుకోవాలని కాదు....అడ్డంవచ్చిన వాళ్ళను నేల కరిపించిన మరుక్షణం ఆమెను కూడా అక్కడనుంచి తప్పించి తీసుకు వెళ్ళాలని....

అదే అతడి వ్యూహలో జరిగిన పొరపాటు.

అభిమంత్రితో ఆశీవిషమై శతృజనాసేధ వారధియై అపక్ర విక్రమ తేజో విరాజిత ఉపాసంగమ భాస్వంత్‌యై కఠోరకర్షణ సప్తాశ్వ కర్ణీరధ సారధ్య గర్వితుడై శతృ సందోహాన్ని ఛేదిస్తూ ఒక నిముషం ప్రళయ ప్రభంజనంలా మారిపోయాడు.

అప్పుడు వినిపించింది ఒక విధ్వంసపు గావుకేక....

ఆగిపోయాడు భవంతి మొత్తం కదిలినట్టు కుదిపేసిన ఆ శబ్దానికి.

మరుక్షణం కాలుతున్న ఒక ఆకారం ఆ గదిలోకి పరుగెత్తుకురాగా అర్థమైంది అది ప్రభంజనరావు కేక అని.

వెనువెంటనే ఇందాకటి సరోజ నిలబడిన గదిలోకి దూసుకుపోయాడు.

అప్పటికే కాలి వికృతంగామారిన సరోజ కొనవూపిరితో భాస్వంత్‌ను చూస్తుంటే ఆత్మీయతగా ఒడిలోకి తీసుకున్నాడు.

ఎందరో రాక్షసుల పదఘట్టనతో పంకిలమైన ఆమె శరీరపుపై పొర అట్టల్లా రాలిపోతూ స్వచ్ఛమైన ఆమె అసలు రూపం జుగుప్సగా దర్శనమిస్తుంటే చూడలేనట్టు కళ్ళు మూసుకున్నాడు.

సరోజ నిశ్చలంగానే వుంది ఆ క్షణంలో కూడా.

తన కళ్ళ వెనుక నీళ్ళు ఇంకా వున్నాయని ఆ క్షణం వరకూ తెలీని భాస్వంత్ నేత్రాలనుదాటి అశ్రువులు చెంపలపై నుంచి జారుతుంటే నీరసంగా చేతితో తుడిచింది.

"కోట్లాది ఉదయాస్తమయాల్ని నీలో జీర్ణించుకున్న ఓ సూర్యుడా! ఎప్పుడో అస్తమించీ చీకటి కోణాల మధ్య చిలికిన నాకోసం ఎందుకు యీ నీళ్ళను చిలికిస్తావు. నీ నూరేళ్ళ జీవితకాలంలో అసంకల్పితంగానైనా నీకు చేరువైన నీకేమీకాని ఒక అక్కనయ్యా నేను....నీ స్మృతిలో అందంగా ఇమిడిన ఒక చిన్న క్షణాన్ని నేను. కాలిపోయిన నేను కోరుతున్నది నీ అశ్రువులిలా వృధాగా నేలరాలకూడదని నాలాంటి నిర్భాగ్యులకు పెట్టుబడిగా వాటిని దాచుకొమ్మని....ముకుళిత హస్తాలతో చేతులు జోడించి నీ దగ్గర శలవు తీసుకుంటున్నాను."

సరోజ కట్టెలా బిగుసుకుపోయింది తన అంతిమ నివేదన తీరిపోయినట్టు....

తెలియకుండా వచ్చిన ఒక గాలి తెమ్మెర తృటిలో సేదదీర్చివెళ్ళిన కృతజ్ఞతగా భాస్వంత్ కళ్ళనుంచి టపటపా నీళ్ళు రాలేయి.

నిశ్చలంగా వుండిపోయాడలాగే.

అదే ప్రభంజనరావు అనుచరులు తీసుకున్న ఓ మంచి అవకాశం.

ఒక బలమైన ఇనుపచువ్వ భాస్వంత్ తలను తాకింది.

పగిలిన కపాలంలో నుంచి రక్తం జివ్వున పైకి ఎగజిమ్ముతుంటే చేతులడ్డం వుంచుకుని పక్కకు తిరగబోయాడు.

మరో అరక్షణం ఆలస్యమైతే భాస్వంత్ కథ ఇక్కడ ముగిసేదే—

ఒక రివాల్వర్ తూటా ఇనుపకడ్డీని పైకి లేపిన చేతినుంచి దూసుకుపోగా ఆ వ్యక్తి చువ్వను విడిచిపెట్టాడు.

పోలీసులు చుట్టుముట్టారు.

"అంకుల్" అంటూ బాబీ పరుగునవచ్చి భాస్వంత్‌ను కావలించుకున్నాడు నీళ్ళు నిండిన కళ్ళతో.

అప్పటికే స్పృహతప్పిన భాస్వంత్ చూడలేదు అక్కడ పొదల నుంచి పారిపోయి పోలీసుల్ని వెంటపెట్టుకొచ్చిన బాబీని.

* * *

"గాయం చాలా లోతుగా తగిలినట్టుంది." అపరేషన్ థియేటరులోని భాస్వంత్‌ని చేతిలోని ఎక్స్‌రేని చూస్తూ అన్నాడో సర్జను.

అప్పటికే కపాలానికి డ్రిల్‌చేసి లోపలి మెదడు భాగాన్ని పరికించిన డాక్టర్ మురళీధర్ "మైగాడ్" అన్నాడు అప్రతిభుడైనట్టు.... "ఇది ఎన్యూరిజం."

థియేటరులో వున్న సర్జన్లంతా ఆశ్చర్యంగా చూసేరు.

"యస్. తలకి బలంగా గాయమైన మాట నిజమే అయినా ఇప్పుడితను ప్రాణాపాయ స్థితిలో వున్నది గాయం మూలంగాకాదు.... ఇన్యూరిజంతో.

డాక్టర్ మురళీధర్ రాష్ట్రంలోని ప్రముఖ న్యూరోసర్జన్లలో మొదటివాడు. అపారమైన అనుభవంతో ఎందరో డాక్టర్లకు మార్గదర్శకుడిగా ప్రశస్తిని పొందిన వ్యక్తి.

మెదడులోని పరిమాణం పెద్దదిగావున్న ఓ రక్తనాళాన్ని చూస్తూ డాక్టర్ మురళీధర్ అన్నాడు. "నిజానికి ఈ బ్లడ్ వెస్సెల్‌నుంచి రక్తం చిమ్మటానికి కారణం ఇప్పుడైన గాయంకాదు....సుమారు అరునెలల క్రితం నుంచే రక్తం స్రవిస్తూనే వుండివుండాలి."

"వ్వాట్" ఓ సర్జను నిశ్చేష్టతగా అడిగాడు.

"యస్....మెదడులోని బ్లడ్ వెస్సెల్స్‌లోని ఒకనాళం మాత్రం ఒకచోట క్రమంగా రక్తం గడ్డకట్టినట్టు పరిమాణం పెరగడంతో సమీపంలోని రక్తనాళాలపై పీడనం ఎక్కువవుతుంది. అది పగిలిన మరుక్షణం రోగి ప్రాణాలు పోతాయి. ఈ ఎన్యూరిజం థియరీ మీకందరికీ తెలిసినదే అయినా మీరూహించలేనిది ఇది సుమారు ఆరునెలల క్రితమే పగిలి రక్తస్రావం మొదలై వుంటుందన్న ఒక సత్యం" డాక్టర్ మురళీధర్ సాలోచనగా అన్నాడు.

"కాని" విస్తుపోయిన ఓ జూనియర్ సర్జన్ అడిగాడు "ఇన్నాళ్ళు ఎలా బ్రతికివున్నాడంటారు?"

"విల్‌పవర్...." టక్కున జవాబిచ్చాడు డాక్టర్ మురళీధర్ "చాలా అరుదైన విషయము వైద్యశాస్త్రం అంగీకరించలేని వాస్తవమూ అయినా మృత్యువును తన సంకల్ప బలంతో ఆపగలిగే యీ శక్తి సామాన్యులకు సాధ్యం కానిది. కేవలం జీవితాన్ని ఒక లక్ష్యంగా భావించి, తపస్సులా అనుకున్నది సాధించే వరకూ బ్రతకాలని తపనగల కోటికొక్కరు మాత్రం సాధించగలిగేదీను."

శాస్త్రవిజ్ఞానం ఇంతగా పురోగమించాక ఇటువంటి ఒక థియరీ గురించి అతడు చెప్పటం అక్కడ మరే డాక్టరూ జీర్ణించుకోలేకపోతున్న సత్యమే అయినా అతడి అనుభవాన్ని విజ్ఞానాన్ని శంకించే స్థితిలో లేరు.

"నమ్మశక్యంగా లేదు" అన్నారు మరెవరో....

"నిజమే. అనుభవంతో కాని అర్థంకాని విషయం....ఒకనాడు గుండె ఆగితే మనిషి మరణించాడూ అన్నాం. ఇప్పుడు మెదడులోని క్రియ స్తంభిస్తేగాని చనిపోయాడూ అనలేకపోతున్నాం. చనిపోయాడూ అని డాక్టరు

తేల్చేక బ్రతికిన వ్యక్తుల్ని చూసాన్నేను....స్మశానం వరకూ తరలించేక ఇంటికి తిరిగివచ్చిన మనుషుల్ని చూసాను....మనం నమ్మినా నమ్మకపోయినా శాస్త్రవిజ్ఞానం అంగీకరించినా అంగీకరించకపోయినా కొన్ని వాస్తవాలను మనం ప్రాక్టికల్‌గా తెలుసుకున్నపుడు అబ్బురపోవడం మినహా ఏమీ చేయలేం."

అంతా చెప్పిన డాక్టర్ మురళీధర్ ఇక చేసేదేమీ లేదన్నట్టు గ్లోవ్స్ తీసి బయటకు నడుస్తూ "స్కత్ క్లోజ్ చేయండి" అన్నాడు.

"డాక్టర్" నిశాంత రశ్మితోబాటు అతడిముందు నిలబడి అడిగింది భాస్వంత్ గురించి.

క్లుప్తంగా అంతా వివరించిన డాక్టర్ మురళీధర్ "ఇన్నాళ్ళు ఎలా బ్రతికాడూ ఇప్పటికీ ఇంకా ప్రాణాలతో ఎలా వున్నాడూ అన్నది నాకు తోచని విషయమే అయినా రక్తస్రావం ఎక్కువగా వుంది కాబట్టి మహా అయితే అతడిక బ్రతికేది కొన్నిగంటలు మాత్రమే అని చెప్పగలను." అంటూ వెళ్ళిపోయాడు.

స్థాణువులై నిలబడిపోయారు నిశాంత రశ్మిలు....

భాస్వంత్‌ను ఓ బెడ్డుపైకి చేర్చారు మరో అరగంటకి.

తలకి బేండేజ్‌తో ఇంకా స్పృహలోకి రాని భాస్వంత్‌ను చూస్తూ నిశాంత స్వప్నంలోలా నడిచింది.

ఆ క్షణంలో సైతం భాస్వంత్ మొహంలో అజరామరమైన నిశ్చలత.

ఆమె గొంతు పెగలనని మొరాయిస్తుంటే నిస్సత్తువగా నేలపై చతికిలబడి తలను బెడ్‌కు ఆనించి నిశ్శబ్దంగా రోదిస్తూందామె.

"చీకటి కుహరంలో వేగుచుక్క కానరాక అపరాత్రిగానే ఆయువును చాలించాల్సిన ఆడదాన్నయిన నాకు ఎందుకు తారసపడ్డావు. నన్ను నీ స్పర్శతో వేకువగా ఎందుకు మార్చావు....నన్ను తల్లినిచేసి నా బ్రతుకులో తూరుపురేఖలు విచ్చుకునే అదృష్టాన్ని కలిగించి నీ భాగస్వామిని నీకు అందించాలని ఇటువస్తే మమ్మల్ని కాదని ఎందుకిలా అసురసంధ్యలో

ఆఖరి మజిలీకి ఆయత్తమవుతున్నావు. నీకేమీకాని నా గురించి కాదయ్యా నీ కోసమే యుగాల తపస్సుతో నిరీక్షించిన నీ రశ్మి గురించి ఆలోచిస్తున్నాను."

ఆమె విలపిస్తూంది నిశ్శబ్దంగానే.

ఎన్ని క్షణాలు అలా దొర్లాయో ఎవరికీ గుర్తులేదు.

కాని భాస్వంత్ కళ్ళు తెరిచేసరికి మసకగా రశ్మి కనిపించింది. నమ్మలేనట్టు కళ్ళు చిట్లించాడు.

అశ్రుశక్తి నయనాలతో నిలబడ్డ ఆమెను చూస్తూ "సుబ్బులా" గొణిగాడు బాధగానే.

తట్టుకోలేక పోయిందామె.

"బావా"

భాస్వంత్ పాదాలపై వాలిపోయింది.

అతడు రెప్ప వేయలేదు....నిర్వికల్ప సమాధిలోకి జారిన జ్ఞానిలా అలాగే వుండిపోయాడు కొన్ని క్షణాలపాటు.

"అలిసిపోయాను రశ్మి....పూర్తిగా అలిసిపోయాను....ఎందరున్నా ఒంటరివాడిగానే యాత్రను సాగించి" భాస్వంత్ గొంతు మూగపోతుండగా "నువ్వు ఒంటరివాడివి కాదు బావా...." రశ్మి పెనుగులాడుతూంది మనసులోని భావాలకు మాట కూర్చలేక. "నిశాంత....నాకు ప్రాణస్నేహితురాలు ఇన్నాళ్ళు మనకు అన్నీ అయిన నిశాంత నీ బిడ్డకు తల్లి కాబోతూంది."

భాస్వంత్ కళ్ళలోని స్తబ్దతను చెరుపుతూ ఒక సన్నని మెరుపు....

నిశాంత ఉలికిపాటుగా చూసింది రశ్మిని. ఆ వాస్తవం అతడికి తెలియపరచడం ఇష్టం లేనట్టు.

"ఎంత చిత్రంగా సాగిపోయాయి మన బ్రతుకులు.... జ్ఞానం తెలీని వయసులో నీకు తాళి కట్టాను....జ్ఞానం తెలిసాక నిశాంత మెడలో వున్నది నువ్వు ఆమెకిచ్చిన తాళి అని తెలీక భర్తగా నటించాను....ఆ తాళిని చూసి ఒక ఉన్మాదంలో నిశాంతను దగ్గరకు తీసుకుని ఇప్పుడు తల్లిని చేసాను.

గొణుగుతూనే నెమ్మదిగా తల తిప్పాడు. తలవంచుకుని వున్న నిశాంతను చూస్తూ—"థాంక్యూ నిశాంతా! నా తప్పుకు శిక్షవేస్తావనుకుంటే నా అసంతృప్తి గ్రంథాన్ని నువ్వు మోస్తున్న బిడ్డతో సశేషంగా మార్చావు" అన్నాడు ఆర్ద్రంగానే.

"లేదు!" నిశాంత రొప్పుతూ అతడి చేతినందుకుంది. "మీది అసంపూర్తి గ్రంథంకాదు. మీరు నూరేళ్ళు బ్రతుకుతారు. మీరు మృత్యుంజయుడిగా వెయ్యేళ్ళు బ్రతికి రశ్మికి అండకాగలుగుతారు.

వేదాంతిలా నవ్వేడు–"నాకుతెలుసు నిశాంతా! నాలో ఏం జరుగుతున్నదీ, మరికొన్నిగంటల్లో ఏం కాబోతున్నదీ నేనూహించగలను. అనుభవాల విక్షేపాలతో సుక్షత్రంగా మారలేక ఎండిన ఇసుకరేణువుల్ని మాత్రం జీవకణాలుగా పీల్చుకు బ్రతుకుతున్న ఈ ఎడారి బాటసారి చివరి మజిల్‌కి చేరువవుతున్నాడని నేను అర్ధంచేసుకుంటాను."

భోరున ఏడుస్తూ తలవంచుకుంది.

భాస్వంత్‌కు స్పృహతప్పుతున్నట్టుగా ఉంది....చాలా బలంగా ప్రయత్నిస్తున్నాడు.

రశ్మికోసం చూసింది నిశాంత....

ఆమె కనిపించలేదు.

కాని ఆమెకు బదులు ఆమె పంపిన ఓ ఉత్తరాన్ని నర్స్ తెచ్చి యిచ్చింది.

అక్కా!

> "వ్యక్తిగతంగా చెప్పే అవకాశంలేక, చెబితే నువ్వు అంగీకరించవని నిర్ణయించుకున్నాక నా అంతట నేనుగా వెళ్ళిపోతున్నాను. ఎక్కడికో కాదు....జైలు జీవితానికి సిద్ధపడి.
>
> అక్కా! ఉలికిపడకు.... మానసికంగా బావను నేనే కాదు నువ్వూ ఆరాధించావు....అంతకుమించి శారీరకంగా కూడా దగ్గరయ్యావు. చిన్నతనంలో మనం అన్నీ పంచుకునేవాళ్ళం! ఇప్పుడు తాళినీ పంచుకున్నాం....ఇది శాపంకాదు. దేవుడు మన పూర్వజన్మ సుకృతంగా అందించిన వరం!

> అవును....మనం ఇద్దరమూ బావకు భార్యలమే! బ్రతుకు విశేషంగా మారినవేళ ఆ గరళాన్ని కంఠంలో దిగమింగుకుని వేడి గల్లార్చుకోడానికి గంగకు తలపై స్థానాన్నిచ్చినా, పార్వతిని కాదన లేదు శివుడు. ఇద్దరికీ ఆరాధ్యుడే అయ్యాడు. మనలో ఎవరెక్కువ ఎవరు తక్కువ అన్నది సమస్య కాకూడదు.
>
> మన ఇద్దరితోనూ బ్రతుకు పంచుకున్న బావ బ్రతకడని మన ఇద్దరికీ తెలుసు. అందుకే నన్ను రక్షించే ప్రయత్నంలో నీ తోడబుట్టిన వాడ్ని సైతం సంహరించిన నీ ఆత్మీయతకు చేతులు జోడిస్తూ నీ కడుపులోని బావబిడ్డను రక్షించే ప్రయత్నంలో నేను జైలుకు వెళ్ళిపోతున్నాను. అవునక్కా! నీ బిడ్డ నా బిడ్డ.... వాడు సుఖంగా బ్రతకాలి. వాడీ జైలు గోడలమధ్య జన్మఎత్తే శ్రీకృష్ణుడు కాకూడదు కాని, మనం దేవకీ యశోదలమై వాడ్ని బ్రతికించుకోవాలి. అందుకే జరిగిన ఈ వాస్తవం నీ గుండెల్లోనే సమాధి చేసుకుని బావకు ఈ రహస్యం చెప్పకుండా బావ చివరి క్షణాల్లో నువ్వే అండగా ఉంటావని ఆశిస్తూ కోరుతూ ప్రాధేయపడుతూ.... వెళ్ళిపోతున్నాను. నీ ముద్దుల సుబ్బులు."

నిశాంత కళ్ళనుంచి ధారాపాతంగా నీళ్ళు కారుతున్నాయి.

"నిశాలతా!"

తృళ్ళిపడిన నిశాంత ఎదురుగా చూసింది....

అప్పటికే భాస్వంత్ నిలబడి ఉన్నాడు.

తూలి పడబోతున్న అతడికి ఆసరా యిచ్చింది గాబరా పడుతూనే.

"ఏంటది?"

"సమయంలేదు నిశాంతా! అర్జెంటుగా మనం బయలుదేరాలి" రొప్పుతున్నాడు.

"ఎక్కడికి?"

"మా వూరికి!"

"ఇది సమయంకాదు" ఆమె వారించబోయింది.

"కాదని నాకుతెలుసు నిశాంతా! అందుకే సమయం మించిపోకముందే మనం వెళ్ళాలంటున్నాను."

"నా మాట వినండి!" రక్తం అతడి చెంపలమీదనుంచి ధార కారుతుంటే నిశాంత వణికిపోతూంది

"నిశాంతా నీ మాట వినడంకాదు....నేనాడినమాట తప్పలేదని నిరూపించుకోవడం నాకు ముఖ్యం."

"ఏమండీ" దుఃఖంలో ఆమె గొంతు పూడుకుపోతూంది.

అతడు ఆవేశంగా బయటకు నడవబోతుండగా డాక్టర్లు వచ్చారు.

అతడ్ని ఆపాలని ప్రయత్నిస్తుంటే "గెటివ్ ప్రమ్మి" అరిచాడు. "ఇది నా జీవితం....నా ఇష్టం."

అప్పటికీ అందర్నీ తోసుకుని అతడు నిశాంత కారెక్కాడు.

దుఃఖాన్ని దిగమింగుకుంటూనే డ్రయివింగ్ సీట్లో కూర్చుంది నిశాంత.

కారులోవున్న బాబీకి ఇదేమీ అర్థం కావడంలేదు.

నిశాంత తటపటాయిస్తుంటే "ప్లీజ్ నిశాంతా! నేను....నేను గెలిచానో ఓడానో తేల్చుకోవాలని చేస్తున్న చివరి ప్రయాణమిది. ప్లీజ్.... సాధ్యమైనంత త్వరగా నన్ను గమ్యానికి చేర్చు" అర్థించాడు.

కారు రివ్వున దూసుకుపోతూంది.

నిశాంత కళ్ళనుంచి రాలుతున్న అశ్రువులతో బాట మసకగా కనిపిస్తూంది.

28

సుమారు పన్నెండుగంటల నిర్విరామ ప్రయాణం తర్వాత....

కారు గమ్యాన్ని చేరుకుంది.

బాబీ అప్పటికే ఆకలితో సొమ్మసిల్లి నిద్రపోయాడు వెనుకసీట్లో....

మీదపడుతున్న మృత్యువునుంచి తనను తాను కాపాడుకునే ప్రయత్నంలో ప్రతిక్షణమూ పెనుగులాడుతూనే వున్నాడు భాస్వంత్.

భాస్వంత్ తలనుంచి స్రవిస్తున్న రక్తం నిశాంత భుజాలపై పడి గడ్డకట్టుకు పోయింది.

భారంగా తలను నిశాంత భుజంమీద వాల్చిన భాస్వంత్ కారు ఆగడంతో నెమ్మదిగా కళ్ళు తెరిచాడు.

అంతా మసకగా ఉంది.

వాలిపోతున్న కనురెప్పల్ని తెరిచిచూసాడు బలవంతంగా.

ఇదే....

ఇక్కడే తనబాల్యం చాలా అపురూపంగా గడిచిపోయింది. ఇచ్చటనే అమ్మానాన్నల ఆప్యాయతలు గోరుముద్దలుగా గొంతులో నింపుకొని ఒక కమ్మనికలలా కాలాన్ని వెళ్ళబుచ్చింది.

ఈ నిలమీదే చిన్నారిచెల్లితో చిలిపితనంగా కేరింతల హోరుతో పరుగులు తీసింది.

ఈ నేలలోనే ఒకనాడు ముగ్గురి శవాలను భూస్థాపితం చేసింది.

కూలిన అలనాటి సామ్రాజ్య వైభవానికి కాలిపోయిన నిన్నటి చరిత్ర పుటలకి కాణాచి ఈ నేలే!

హృదయాంతరాళాల్లోంచి ఉబికి వస్తున్న స్మృతుల దొంతరలను బలంగా సమాధి చేసుకుంటూ నీరసంగా బయటికి దిగాడు.

కాళ్ళు తూలేయి పట్టు దప్పినట్టు.

నిశాంత ఒక్క ఉదుటున అతడ్ని పొదివిపట్టుకుని ముందుకు నడిపించింది.

దూరంగా....చాలా దూరంగా ఒక భవంతి కనిపించింది.

అదే....

భాస్వంత్ కలలుగన్న గణిత విజ్ఞానభారతి.

అసంతృప్తుడై వెళ్ళిపోయిన తండ్రి చివరికోరికది. తండ్రి ఆత్మఘోషను అర్థంచేసుకుని లౌక్యంతో ఈ ప్రపంచంమీద తను సాధించి, ప్రతిష్టించిన విజయ కేతనమదే....

భువనయిక మోహనంగా ఒక దివ్య హర్మ్యంలా కనిపిస్తుంటే భాస్వంత్ కళ్ళనుంచి బొటబొటా నీళ్ళురాలేయి.

"నిశాంతా...." ప్రకంపించిపోతూ ఒక పసికందులా ఆమెను చూసాడు. "నేను నేను గెలిచానుకదూ....నేను అనుకున్నది సాధించాను కాబట్టి అదే గెలుపేకదూ...." ఈ సత్యం తేల్చుకోటానికే వ్యవధి లేనట్టు ఆమెను హడావుడి చేస్తుంటే నిశ్శబ్దంగా వుండిపోయింది.

"ఈ ప్రశ్నకు జవాబు చెప్పాల్సింది నువ్వుకాదు నిశాంతా....వాడే!"

ఎవరో చెప్పలేదామెకు....కాని తూలుతునే వేగంగా నడవడం మొదలుపెట్టాడు అంత నిస్త్రాణువులోనూ.

ఆమె వారిస్తూంది—వినలేదతడు....జారిపోతున్న సత్తువని కూడగట్టుకుంటూ ఉన్మాదంగా నడుస్తున్నాడు.

భాస్వంత్‌కు తెలిసిపోతూంది తనకేదో జరుగుతున్నట్టు.

సాధ్యమైనంత త్వరగా వెళ్ళాలి.

అదే అతడ్నాక్షణాన ఉత్తేజితుడ్ని చేస్తున్నది.

మరో రెండునిమిషాలలో రామాలయాన్ని చేరుకున్న భాస్వంత్ "దేవు....డూ" ఒక పెనుకేకలా గర్భగుడి ప్రతిధ్వనించేట్టు అరిచాడు.

నిశ్శబ్దం అరక్షణం పాటు.

"రాముడూ" భాస్వంత్ గొంతునాళాలు తెగిపోయేట్టు పిలిచాడు మళ్ళీ.

రాముడు పలకలేదు....కాని భళ్లున రక్తాన్ని కక్కుతున్నాడు ఆ గొంతు తాకిడికి.

ఆసరా ఇవ్వబోయిన నిశాంతను సయితంనెట్టి నిస్సత్తువగానే నిలబడే ప్రయత్నంచేస్తూ గుడిగంటను చేత్తో అందుకున్నాడు.

మరుక్షణం రాముడి గుండెల్ని కదిలించే ఒక భేరీ నినాదంగా మ్రోగసాగింది. భాస్వంత్ వివసత్వానికి ప్రతీకగా.

"ఏష సర్వేశ్వర ఏష సర్వజ్ఞ ఏషాన్తర్యా
య్యేష యోనివి సర్వస్వ ప్రభవా స్వయాహిభూతానాం"

నువ్వే సర్వేశ్వరుడివి నువ్వే సర్వాంతర్యామివీ నీకుండే సమస్తమూ ఉద్భవిస్తుందని నిరూపించే ప్రయత్నంగా నామీద పరోక్షంగా మృత్యువును పోరాటానికి పంపావుకదూ...."

భాస్వంత్ క్రోధంగా గంటను ఊపగానే లోహపు లోలకం తాకిడికి అతడి వేళ్లచిట్లి రక్తం నేలమీదకి చిమ్ముతూంది.

"భోగార్థం సృష్టిరిత్యాకౄ క్రీడార్థమితి చాపరే
దేవస్త్యేష స్వభావోయమాప్త కామస్య కాస్పృహా"

నీవిలా వినోదంకోసం సృష్టించిన ఈ జగత్తులో నువ్వు రూపు దిద్దిన పాత్రమీద గెలుపు సాధించడాన్ని నువ్వు సహించలేక పోయావు కదూ....

నోటినుండి రక్తం చిమ్ముతున్నా బాధను పంటిబిగువున దిగమ్రింగుకుంటూ పిచ్చివాడిలా గంటను మోగిస్తూనే వున్నాడు

“నీ భవత్యామృతం మర్త్యం మర్త్య మమృతం తథా
ప్రకృత దవ్యథా భావోనకథం చిద్భవిష్యతి”

అమృతత్వానికి మార్త్యత్వం జీవనం సాధ్యంకాదన్న ఒకసూక్తితో మా విశ్వాశాన్ని మభ్యపెట్టాలనుకున్నావు....నీ మీదే నేను గెలుపు సాధిస్తే నీ ఉనికిక ఇక అర్ధం ఉండదని యుగాల నీ చరిత్ర సమసిపోయే తరుణం ఆసన్నమైందని నా కింత నికృష్టమయిన చావును కలిగించే పథకం వేసావు కదూ....

భాస్వంత్ కళ్ళనుంచి కూడా రక్తాశ్రువులు చిమ్ముతుంటే నిస్త్రాణగానే సీతమ్మ విగ్రహాన్ని చేరుకున్నాడు.

“అ....మ్మా” భాస్వంత్ గొంతు వణికింది. “నన్ను గెలిపించమని వేడుకున్నాను పితృవాక్య పరిపాలనలో నీ భర్తకు నేను తీసిపోనని నిరూపించుకునే నా ప్రయత్నంలో అమ్మగా నాకు సహకరించమని అర్థించాను. నిన్ను మధ్యవర్తిగా ఉంచితే నీ మాతృత్వపు మమకారంతోనయినా నన్ను కాపాడతావని భ్రమపడితే ఏమిటిది గెలిచానా....ఓడానా చెప్పమ్మా....”

భాస్వంత్ ఉన్మాదిగా మారిపోయాడు....కబళించబోతున్న మృత్యువు నుంచి తనను తాను కాపాడుకోవాలని విశ్వప్రయత్నం చేస్తున్నాడు.

ఇదే....ఈ నిస్సహాయతే ఈ క్షణాన భాస్వంత్‌ను అంతలా కదిలిస్తున్నది.

“అమ్మా....” భాస్వంత్ నోటినుంచి ధారగాకారిన రక్తం సీతమ్మ పాదాలమీద పడి అభిషేకిస్తుంటే ఏదో జ్ఞప్తికి వచ్చినట్టు ఆమె కొంగును అందుకుని ముడిని విప్పేడు....“ఇదిగోనమ్మా నాడు నేను నీ భర్తతో చేసుకున్న ఒప్పందం....నా గెలుపుకి సాక్ష్యంగా నిలిచిన నువ్వా.... ఇదిచూ....”

షాక్‌తిన్నట్టు ఆగిపోయాడు అర్ధోక్తిలోనే....

మృత్యువుకీ జీవితానికిమధ్య నిస్సబ్దంగా నిలబడిన ఆ సంధికాలంలో భాస్వంత్ అనూహ్యంగా కదిలిపోయాడు.

ఒకనాడు అతడు రక్తంతో రాసిన అక్షరాలను ప్రేతకళతో నిండిన అతడినేత్రాలు నెమ్మదిగా అనుసరిస్తుంటే మరోమారు చదివాడు విభ్రమంగా.

The moral aqreement exocutid this day betwaen.

Sri Rama S/o Dasaratha herein after Callad the assignor.

and

K. Bhaswanth Maharshi S/o Late K. Ramanujam here in, after Caihed the asrtgnce wite cooeth as follows.

నేను ఉపయోగించే శక్తి విలువ: X

నా లక్ష్యం: విద్యాలయ నిర్మాణం

పెట్టుబడి: స్వశక్తి—పక్కవాడి బలహీనత

మార్గం: లౌక్యం

కాలం: జీవితం

శేషం: విజయం

నా చివరి రూపం: ANT

ఇదే ఈ చివరి పదమే చిత్రంగా చెదలుపట్టింది.

ఒకనాడు భాస్వంత్‌ని నిజానికి ANT అన్నచోట తనో రాక్షసుడై తిరిగి వస్తానన్న ఆలోచనతో రాసింది GIANT ....

కాని ఈ స్వల్పకాలంలో GI అన్న రెండు ఇంగ్లీషు అక్షరాలు చెదలుపట్టి చెరిగి చివరికి భాస్వంత్‌ను నిస్సహాయుడిగా మార్చినట్టు ఒక పిపీలిక ప్రమాణానికి జార్చినట్టు ANT అన్న అక్షరాలు మిగిలాయి.

నిశ్శబ్దంగా చూసేడు ఆ పదంవేపే....

ఇప్పుడతడిలోని చైతన్యం పూర్తిగా చచ్చిపోయింది.

ఇక్కడే అతడు మృత్యు హస్తాలకు చిక్కి, బలహీనంగా మారి పోయాడు.

“రా....ము....డూ” నీరసంగా రాముడి పాదాలను చేరుకున్నాడు.... అతడి పెదవులు వణుకుతున్నాయి బేలగా. “రాక్షసుడిగా మరలి వస్తానని చెప్పినందుకు నా ఉనికిని నా శక్తిని ఒక చీమగా మార్చి నీ అస్తిత్వానికిలా అర్థం కల్పించుకున్నావా స్వామీ....ఇది కాకతాళీయమా లేక నువ్వు కావాలని చేయించిందా.... ఒకవేళ ఆనాడు నేను ఉపయోగించే శక్తివిలువ ‘X’ అనడానికి బదులు ‘గాడ్’ అని రాసివుంటే సంతృప్తి చెందే వాడివా....”

రక్తం ధారగా నోటినుంచి చిమ్ముతుంటే అతడి పాదాలపై వాలి పోయాడు నిస్సత్తువగా.

ఎవరివో చేతులు అతడ్ని స్పృశిస్తుంటే అనుభూతి చెందడంతో భారంగా కళ్ళు తెరిచాడు.

అశ్రుశిక్త నయనాలతో నిశాంత కనిపించింది.

ఓటమి ఎరుగని మనిషిగా బ్రతకాలనుకున్న భాస్వంత్ బ్రతికానని భ్రమపడిన భాస్వంత్ ఈ నిస్సహాయతని భరించలేకపోతున్నాడు.

“ని....శాం....తా” రొప్పుతూ ఏదో చెప్పాలని విశ్వప్రయత్నం చేస్తున్నాడు. “నేను....నేను గెలిచాను కదూ....చెప్పు నిశాంతా....భౌతికంగా నేను ఓడినా నాన్నకిచ్చిన మాట నిలబెట్టుకుని నేను గెలుపుని సాధించాను కదూ. చూపేవా యీ దేవుడెంత క్రూరుడో....నాన్న అంకెలగారడీని మనుషుల గారడీ బలి తీసుకుంటే నా శక్తిని దేవుడి గారడీ ఓడించింది.... కాదు....నేను....నేను ఓడితేగా గెలిచాను....కదూ....”

భాస్వంత్ కళ్లు అరమోడ్పులై పోతున్నాయి.

చెప్పాలనుకున్నది చెప్పే ప్రయత్నంగా చివరి శక్తిని కూడగట్టుకుంటున్నాడు. “ని....శాం....తా....నేను....నాకిది మరణం కాదు. నేను.... నేను మృత్యుంజయుడ్ని....నేను నేనుగా చావటంలేదు....గెలిచి ఓడిన నేను ప్రత్యక్ష్యంగా ఎదురయిన మృత్యువుతో ఎన్నోసార్లు పోరాడి ప్రాణాలను నిలబెట్టుకున్న నేను....ఇప్పుడు దేవుడి....గారడీకి మాత్రం బలై....పోతున్నాను.”

భాస్వంత్ చేతులు తమకంతో నిశాంత పొట్టను తడుముతున్నాయి. “వీడు నాకొడుకు నాచెరిగిపోతున్న చరిత్రకు నా కీర్తికి శేషం....కావాలి.... నేను ఓడానని కాదు....గెలిచా....”

అంతే....భాస్వంత్ కనురెప్పలు మూసుకుపోయాయి భారంగా.

అతడిగొంతు మూగబోయింది....కాని పెదవులు ఇంకా అస్పష్టంగా గొణుగుతూనే పున్నాయి.

ఒక నిశ్శబ్ద జీవిత నివేదన....

రాలిపడుతున్న ఒక ధృవతార రాపిడితో నింపుతున్న వెలుగురేఖల ఒరిపిడి....

శిశువు చిత్రనిద్రలో ప్రాచీన స్మృతులా వచ్చేప్పుడు.

చావుబ్రతుకుల సంధ్యాకాలంలో కన్నులు మూస్తున్న ఒక ఆర్తుని అర్ధ నిమీలిత నేత్రాల పాపలపల్లవి....

మోగని ఫిరంగిలో ధ్వనించే మరణ మృదంగ నాదం....

"నాగమనంలో సహ ప్రయాణికురాలివై ఇన్నాళ్ళూ నాతో కదిలిన నా నిశాంతా! నీ గుంభనమైన ప్రేమతో నన్ను అమరుడ్ని చేసావు. వై తరిణిలా సాగాల్సిన నీ బ్రతుకు రసాతలానికి జారినవేళ దప్పిగొన్నను నరనరాల వేదనని తరతరాల రోదనని చెప్పలేక నీ దరిచేరితే నీ ప్రేమామృతంతో దాహాన్ని తీర్చావు. ఎప్పుడోరాలిపోవాల్సిన ఈ రేణువు నీ హృదయాధరాల స్పర్శతో వేణువుకాగా చిరుదీక్ష తపస్సవీక్షణలో ఒక చిరుగీతంగా మారి అదృశ్యంగానే స్పందించాను.

మృతిచెందని ఒక స్మృతిని మోసుకుంటూ బ్రతుకుతున్న నేను నీ నిశ్శబ్ద నివేదిత మనో ప్రాంగణంలో బంధించబడిన ఒక ప్రబంధన్నయి పునీతున్నయ్యాను.

మెరుపు మెరిస్తే వానకురిస్తే ఆకాశంలో ఒక మేఘం కలం కదిలితే ఆనందంతో కేరింతలు కొడుతూ బ్రతికిన నేను పండు చేలమధ్య గరిక పచ్చ మైదానాల్లో నిలబడి రహస్యంగా హరివిల్లుకు తాళికట్టాను. మాయమైన ఇంద్రధనస్సు కోసం అంగలార్చుకుంటూ వెదికాను. ఎన్ని ఋతువులు గడిచాయో ఎన్ని వత్సరాలు వెచ్చని కన్నీళ్ళను నా గుండెలమీద ఒలికించి జారిపోయాయో గుర్తులేదుకాని మళ్ళీ దొరికిన మేఘ శకలాన్ని చేతులతో బంధించాలని ప్రయత్నించింది. నిన్ను వర్షఋతువుని చేసాను....అందరూ దక్కరు. కాని ఆలస్యమైపోయింది.

తెలిమబ్బుల సోనలో తేలిపోతూ ధర్మదేవత కరదీపికగా వెలిసే త్రాసులో మీ ఇరువురికీ స్థానాన్నిచ్చి నాకు తెలిసిన న్యాయంలో బ్రతుకు తెల్లార్చాలనుకున్నాను. మిగిలిపోయాం వేకువగా నువ్వురుగ్మతకని సూర్యుడిగా నేనూ....అదిగో.... అక్కడెవరో తల విరబోసుకుని నగ్నంగా

నర్తిస్తున్నారు....అదిగదిలో ఏబంధమో యమపాశమై నాకుత్తుకను క
నొక్కి నెత్తుటి ధారలమధ్య స్నానమాడుతూంది. ఇదిగో....ఇదిగిదిగో..
నా ఊపిరితిత్తుల్ని ఉక్కుపిడికిళ్ళతో పిసికినా చితిమంట జ్వలింపచేస్తున్నారు
పెదవుల కదలిక ఆగింది. భాస్వంత్ చరిత్ర ముగిసింది. ఆ గర్భగుడిలో

* * * *

"మమ్మీ!"

ఆ పిలుపుతో ద్రవించి ప్రవహించిన గతం హఠాత్తుగా గడ్డకట్టిపోగ
నిశాంత తేరుకుంది.

వెనక్కి మరలింది.

బాబీ నిలబడివున్నాడు రశ్మితో సహా....

"ఏంటి మమ్మీ.... ఆంటీ నేను నీ కోసం వెదుకుతుంటే గుడికి వస్తానని చెప్పి నానీని ఇక్కడకు తీసుకొచ్చావు."

అప్పటికే చీకటి అలుముకున్న మరుభూమి నిశ్శబ్దపవనాల రాపిడితో గుండెలార్చే సామగగనాన్ని వినిపిస్తూంది.

"రానాన్నా!" రశ్మి నానీని ఎత్తుకుంది.

బాబీని పొదివి పట్టుకున్న నిశాంత కారువేపు నడిచింది.

వారు కదిలారు....

ఇద్దరూ ఇద్దరిబిడ్డల తల్లులుగా కాలగర్భంలో కలిసిన భాస్వంత్ మిగుల్చుకున్న కీర్తికి ప్రతీకగా నిలిచిన గణితశాస్త్ర విజ్ఞానభారతి భారాన్ని మోసే బోయీలుగా.

—: సమాప్తం :—